శ్రీమదాంధ్ర మహాభారతము ధర్మరాజ పాత్ర

బ్రహ్మపుర విశ్వవిద్యాలయమునుండి డాక్టరేట్ పొందిన సిద్ధాంత వ్యాసం



డా. కొల్లూరు నారాయణ రావు

ISBN: 978-93-91196-41-7

SRIMADANDHRA MAHABHARATAMU - DHARMARAJA PATRA

Dr. Kolluru Narayana Rao

తల్లిదండ్రిమించి తలదన్ను దైవమ్ము
సృష్టియందెకాదు సురలలేరు
వారిసేవ జేయ వాసవ భోగమ్ము
కరతలామలకముకాదటయ్య.

జన్మనిచ్చి వేదవిద్యగరపి,
నా అభివృద్ధినహరహం కాంక్షించి,
తపమంత ధారవోసిన
తల్లిదండ్రుల పాదపంకేరుహములకు

DOB : 05-09-1999 DOD : 27-11-2020

మా గర్భవాసమున జన్మించి, కులమునంతకానందముగల్గించి,
రసార్ద్రీభూతచేతమ్ముతో మా జీవనమెల్ల సుధామయ
రసధారలనోలలాడించి, నిరంతర వాసనారాహిత్య
తప:స్సంలగ్న మానసుండై,
జన్మరాహిత్యమొనర్చుకొనిన ఆత్మయోగికి, నా ఆత్మకు

కాళ్లకడిగి, కన్యనిచ్చి, అల్లునిగా చేసుకొన్న
అపర రాఘవుడు, ఆదిత్య తేజో విరాజమాన మూర్తి,
కఠిన కర్కశ కరాళ కరోన కబళించిగ,
అనంతలోకాలకు తరలిపోయిన
మద్హృద్భేదన పవికి, రవికి

అంకితం

'శ్రీమదాంధ్ర మహాభారతము-ధర్మరాజ పాత్ర'

Srimadandhra Mahabharatamu - Dharmaraja Patra

Dr. Kolluru Narayana Rao

SRIMADANDHARA MAHABHARATAMU DHARMARAJA PATRA

BY

Dr. KOLLURU NARAYANA RAO

FIRST EDITION: AUGUST-2021
COPIES-300

@ Author

Address:
Vedasadan, Chinmay Nagar,
Housing Board, Neelakantha Nagar,
Po: BERHAMPUR-760002
Dist: Ganjam,Odisha
Mob: 9437076964, 7437076964
e-mail: drkn_rao@rediffmail.com
narayanarao.kolluru8@gmail.com

Book Price:

Cover Art:

DTP: Dr.Rao & Bangaru Raju
Type Setting & Printing:
DRP Printers(Berhampur)
Printed at:
DRP PRINTERS, R.K.Billo Street,
Berhampur. Ganjam, Odisha
Mob: 9437217307

ISBN: 978-93-91196-41-7

నా నుడి

అది1984. అప్పటికే తండ్రి గారి వద్ద వేదవిద్య, పెదనాయన సాహిత్య ప్రవీణ కే.శే. ఖల్లూరు ఖాశీపతి శాస్త్రి గారి వద్ద సంస్కృత ఖావ్య నాటకాలంకారములు పూర్తిచేసిన నా పదవతతరగతి సంవత్సరము. నా ఊహలలో చదువునకది ఆఖరిపెట్టు. అనంతరమున కులవృత్తి పౌరోహిత్యముతో బ్రతికేద్దామన్నధీమా. ఖాని భగవంతుని తలంపు మరియొకటి. ఎరుకపడవుగదా! దైవరహస్యాలు. మా రాయగడ కళాశాలలో అప్పటికే తెలుగుశాఖలో అధ్యాపకవృత్తిలో దశాబ్దకాలంగా ఖ్యానసాగుతున్న లంక గురు సోదరద్వయం, (Sri. L.S.Subrhamanyam, Reader in Telugu(Retd) & Sri. L.Satyanarayana Sharma, Reader in Telugu (Retd)Rayagada College, Rayagada) మా నాయనికి మిత్రులు, శిష్యులు అంతకు మించి ఆప్తులు. వారల సలహా, సంప్రదింపులతో, నా నిరాశా, నిరాదరణల మధ్య ముఖ్యముగ 'ఏ తరగతిన ఫెయిలైనచో అక్కడితో చదువుకు స్వస్తి పలికేదనన్న షరతుతో, నన్ను కళాశాలలో 2(Arts) కళా విభాగమున చేర్పించుట జరిగినది. అది మొదలు లంక సోదర గురుద్వయం నా జీవితమునకు ఆదర్శ మూర్తులుగా, ఆశాప్రేరకముగా, నా జీవన లక్ష్యమే వారలవలే ' తెలుగు అధ్యాపకునిగా ' భవిష్యమున నిలువవలెనని ప్రేరణనందిం, ప్రతిజ్ఞాబద్ధుడనైతిని.

అదెంత చిత్రమో! నాటి నుండి నేటిదనుక విద్యా విషయక వ్యాసంగమునందు ఎదురైన పరీక్షలన్నింటియందు విజయము తప్ప వేరొకటి లేదు. అది 1989. రాయగడ కళాశాలలో డిగ్రీ (Degree) పూర్తి చేసి, తెలుగులో ఎమ్.ఎ(M.A.Litt) చేయుటకు ఆంధ్రవిశ్వవిద్యాలయమున మధుమాసములో 1990న పదార్పణ గావించి, ఖొత్తగ్రహారం వేదపాఠశాలలో బస, మా పిన్ని చిన్నాయనలైన శ్రీమంథా సుబ్రహ్మణ్యం దంపతుల చేతిముద్దలు, మమతానురాగాల పర్యవేక్షణలో, భూదేవ్యాజసులు, సాహితీ సార్వభౌములు ఆస్మత్ ప్రియంభావుక గురుపాదులు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వరివస్యలో విశేష విజ్ఞాన సముపార్జనతో పాటు ఎమ్.ఎ(M.A,Litt) తెలుగు, సీనియర్ పోస్టుగ్రాడ్యుషన్ డిప్లామో ఇన్ సాంస్కృట్ (Senior Post Graduation Diploma.in.Sanskrit) పట్టాలతో 1992వ చైత్ర వైశాఖములకు సర్వం సంపూర్ణమైనది.

అది1993 వైశాఖం. మే-27వ తారీఖు. నా జీవనమునఖొకఖొత్తదిశ, దశ. అదియే నా వివాహం. ఆపై బ్రహ్మపురమునగల మద్గురు గురువర్యులైన డా.పండితారాధ్యుల వీరేశలింగముగారితో కలసి, చర్చించి వారి అనుజ్ఞతో 'శ్రీమదాంధ్ర మహాభారతము-ధర్మరాజ పాత్ర' అను విషయముపై పరిశోధన (పి.హెచ్.డి) చేయుటకు నిశ్చయించి, బ్రహ్మపుర విశ్వవిద్యాలయమునందు చేరితిని. అమ్మ పుట్టిల్లు బ్రహ్మపురం. నా జన్మస్థలం బ్రహ్మపురం. పెద్దక్కయ్య , బావగార్లైన శ్రీమతి పద్మావతి, కే. శే. బ్రహ్మశ్రీ సరిపల్లి ఖామేశ్వరరావు దంపతుల యింట, తల్లిదండ్రుల పరోక్షమును మరిపించగల జంట సమక్షమున ఆప్యాయతానురాగ పాలనలో నా వాసం. ఆ సమయముననే మార్గనిర్దేశకులైన దేశోత్తములకు

జయపురం విక్రమదేవ్ వర్మ కళాశాలకు బదలి అగుట, నాకు వరముగ పరిఢవిల్లి , నా యీ బృహత్తర కార్యనిర్వహణమును, అనూచానమగు గురుశిష్య సంబంధ పరంపరలో పరిచర్యలొనర్చి కృత కృత్యుడనైతిని. అది ఆషాఢ శుద్ధ దశమి శుక్రవారం (07-07-1995) సిద్ధాంతవ్యాసమును పరిసమాప్తి గావించి, మాతాపితృ గురు బుధ సుహృజ్జన ఆశీ:పూర్వక అభినందనలతో బ్రహ్మపుర విశ్వవిద్యాలమునకు గ్రంథసమర్పణ గావించితిని.

నా ఈ కృతికి రజతోత్సవ శరత్తిది. అది (1998 వ సంవత్సరము మొదటి నెల, ఆఖరి వారము. 29వ తారీఖు). బ్రహ్మపుర విశ్వవిద్యాలయ సమావేశ భవన మంటప సముదాయము. విశ్వ విద్యాలయాధికారులు నిర్ణయించిన పరీక్షకులుగా కాశీ విశ్వనాథుని రూపున శోభిల్లు (డాక్టరు) బెనారస్ హిందూవిశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు ప్రొ. జి. త్రివిక్రమయ్యగారు మరియు కలియుగ వైకుంఠమున ప్రతిష్ఠింపబడి, శ్రీ వేంకటేశ్వరుని కరుణా పరిపూతలబ్ధ జేగీయమాన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి తెలుగు శాఖాధ్యక్షులు, సాక్షాత్ శ్రీ నరసింహ స్వరూపమాన ప్రొ. పాపిరెడ్డి నరసింహారెడ్డిగారు వేంచేసి, మార్గనిర్దేశకత్వము వహించిన మద్గురు గురువర్యులైన డా.పండితారాధ్యుల వీరేశలింగముగారితో కలసి మౌఖిక పరీక్షకు రంగము సిద్ధమైనది. ఆ నాటి ఆ కవిత్రయ తత్త్వావధానమున, ఈ కవిత్రయ భారతి కృతికి, నా ఈ పరిశోధనకు ఫలితముగ, ఆ త్రిమూర్తుల అభ్యాజానురాగ ఆశీ:పరం పరులతో విద్యావారిధిప్రి.హెచ్.డి) పట్టమునందినది, జన్మ చరితార్థతనందినది.

ఆపైనదియె సంవత్సరమున ఒడిశా ప్రభుత్వ విద్యాశాఖ అధ్యాపక నియామక వ్రాత పరీక్ష తదనంతరం మౌఖిక పరీక్షలు జరిగి ఉత్తీర్ణత సాధించుటంతయు, మత్పురాకృత పుణ్యవిశేష రాశీభూత ఫలప్రదాత, మత్సుహృజ్జనభాంధవుడు, గురుస్థానీయుడు, సత్యప్రకటితుడు, నిగర్వి, శాంతమూర్తులైన శ్రీడా. తూలుగు ఢిల్లేశ్వరరావు గురుదేవులు, అభ్యాజకరుణా ప్రపూరిత, అపరభాషాయోష శ్రీమతి డా. తుర్లపాటి రాజేశ్వరమ్మ అశీశ్శులతో, గురుచరణులు శ్రీపండితారాధ్యులవారి విశ్రాంతమ్మున, (14-05-1999) శశిభూషణ రథ్ ప్రభుత్వ మహిళా కళాశాలనందు (బ్రహ్మపురం) అదే స్థానమున అధ్యాపకునిగా నియమింపబడుట బహుశ: కోటిమందిలో ఏ ఒక్కనికో లభించు సుకృతి. మా పితరుల తప:ఫలమో! కాక అస్మత్ గురుపరంపరా ఆశీర్వాద మహిమ్నమో! కాని ఏతద్క్షణ పర్యంతం సర్వం సమ్యక్‌దర్శనం.

ఇక చివరగ ఒక్కమాట. ఏ జన్మలో ఏమి చేసినొడనో ఎరుకలేదు గాని, ఈ జన్మ విశేషమేమో అందరి హృదయాలలో నిలచినొడనను తృప్తితో

మీ

నారాయణరావు

అభిజ్ఞల ఆశీరభినందనలు

ఆచార్య సార్వభౌమ
ప్రొఫెసర్ **వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి**
ఎం.ఏ., పి.హెచ్.డి.(తెలుగు), ఎం.ఏ., పి.హెచ్.డి. (సంస్కృతం)
విశ్రాంతాచార్యుడు, తెలుగు శాఖ, ఆంధ్రా యూనివర్సిటీ.

'శారదాపీఠం'
46-15-35, దొండపర్తి
విశాఖపట్నం530 016
ఫోన్ : 0891-2541003
సెల్ : 9490084217

పరితోషం

లోకస్థితికి మూలం ధర్మం. 'ధర్మో విశ్వస్య జగత: ప్రతిష్ఠా'అని శ్రుతి. సమస్త ధర్మాలకి మూలం వేదం. 'వేదోఖిలో ధర్మ మూలమ్' అని మనుస్మృతి. వేదోక్తమైన ధర్మబాహుళ్యాన్ని లోకానుగ్రహకాంక్షతో వ్యాసభగవానుడు మహాభారతరచనలో ఉపదేశించినాడు. కాబట్టి మహాభారతానికి పంచమ వేదత్వం ప్రశస్తి పొందింది. 'భారతం పంచమో వేద:' అని.

సంస్కృతభాషలో వ్యాసమహర్షి రచించిన మహాభారత పరమార్థాన్ని స్పష్టంగా తెలియజేయడంకోసం నన్నయ, తిక్కన, ఎఱ్ఱన అనే కవిత్రయం అంధ్రమహాభారతాన్ని తెనుగులో రచించారు. మహాభారతములోని ధర్మప్రాధమ్యాన్ని నన్నయ గుర్తించినాడు కాబట్టి భారతవైభవాన్ని నిరూపిస్తూ ' ధర్మతత్వజ్ఞులు ధర్మతత్వంబని 'అని పద్యరచన ప్రారంభించినాడు.

అలంకారికులు కావ్యాన్ని ఒక విలక్షణమైన సృష్టిగా పేర్కొన్నారు. కవిని సృష్టికర్తగా పరిగణించారు. 'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి: ' అని పేర్కొన్నారు. ఆ లక్షణం మహాభారతాన్ని పరిపూర్ణంగా వర్తిస్తుంది. వందల పాత్రలతో కథ నిర్వహింపబడినది. విభిన్న మనస్తత్వాలు దర్శనమిస్తాయి. ఆ పాత్రలన్నింటిలో ధర్మదేవతపుత్రుడైన ధర్మరాజు పాత్ర అత్యంత విశిష్టమైనది. ఆతని ధర్మనిష్ఠ అనుపమం. రాజనీతిశాస్త్రశతపరమ గంభీరం. కవిత్రయంవారు వ్యాసహృదయాన్ని చక్కగా అర్థంచేసుకొని తమ ఆంధ్రీకరణలో ఆ పాత్రని ఎంతో ప్రత్యేకతతో తీర్చిదిద్దారు. పరిశీలిస్తున్నకొలది ఎన్నెన్నో విశేషాలు ఆ పాత్రకు సంబంధించినవి ఆవిష్కరింబడుతూ ఉంటాయి.

చిరంజీవి డా. కొల్లూరు నారాయణరావు వేదశాస్త్రనిధులుగల ఉత్తమకుటుంబములో జన్మించాడు. బి.ఎ రాయగడలో చదవి, ఒడిశారాష్ట్రములో తెలుగులో ఎం.ఎ చదువుకొనే అవకాశం లేకపోవడంచేత ఆంధ్రవిశ్వ విద్యాలయములో అధ్యయనం చేసినాడు. ఆ విధంగా మాకు విద్యార్థి. ప్రథమశ్రేణిలో ఎం.ఎ పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. పుట్టిపెరిగింది ఒడిశారాష్ట్రమే అవడంచేత ఎం.ఎ పూర్తి కాగానే, దక్షిణ ఒడిశాలో పేరెన్నికగన్న బరంపురంలో ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉపన్యాసక పదవి లభించింది. అంతటితో తృప్తిపడకుండా అధ్యయనంపై ఆసక్తిగలవాడు కాబట్టి చి. నారాయణరావు తెలుగులో పరిశోధన చేయాలని సంకల్పించి, తమ రాష్ట్రములో పరిశోధనకి పర్యవేక్షకత్వం వహిస్తున్న డా. పండితారాధ్యుల వీరేశలింగంగారి దర్శకత్వంలో పరిశోధనకు ఉపక్రమించినాడు. 'శ్రీమదాంధ్ర మహాభారతము-ధర్మరాజు పాత్ర' అనే అంశాన్ని గ్రహించినాడు. సిద్ధాంత గ్రంధాన్ని రచించి 1998 లో బర్హంపూర్ యూనివర్సిటీనుండి తెలుగులో డాక్టరేట్ డిగ్రీ పుచ్చుకొన్నాడు. ఆ గ్రంథం ఇన్నాళ్ళకు ముద్రణ భాగ్యం పొందడం అస్మదాదులకు పరమ హర్షదాయకం.

ఆంధ్రమహాభారతానికి సంబంధించి ఏ అంశాన్ని గ్రహించి పరిశోధనకు పూనుకొన్నప్పటికీ సంస్కృతాంధ్రభారతాలు రెండూ సమగ్రంగా అధ్యయనం చేసినప్పుడే ఆవిషయానికి సార్థక్యం లభిస్తుంది. సంస్కృతభాషా పరిజ్ఞానం లేనివారికి అది అసాధ్యమవుతుంది. పితృపైతామహంగా సంక్రమించిన సంస్కృతభాషా వైదుష్యంవల్ల చి: నారాయణరావు పరిశోధనలో కృతకృత్యుడైనాడు.

సత్యనిరూపణ ప్రధానమైన పరిశోధన ఉత్తమమైనదిగా పరిగణింపబడుతుంది. పక్షపాతరాహిత్యం ఉత్తమ పరిశోధకుని ముఖ్యలక్షణం. చి.నారాయణరావు సంస్కృతాంధ్రభారతాలు రెండింటినీ సమగ్ర అధ్యయనంచేసి ప్రతిసన్నివేశములోను ధర్మరాజు పాత్ర విషయములో తన తీర్పును చక్కగా వెల్లడించినాడు. కొన్నిచోట్ల యథా మూలముగానున్నదని చెప్పినాడు. కొన్ని సందర్భాలలో వ్యాసుని ఆశయం ఇట్లున్నది, తిక్కన కొంచెం మార్చినాడు, దీనికి ఇది ప్రయోజనం అని నిరూపించినాడు.

డా. కొల్లూరు నారాయణరావు పద్ధెన్మిది పర్వాల మహాభారతంలో ప్రతిపర్వం తీసుకొని ధర్మరాజు ప్రస్తుక్తిగల సన్నివేశాలని అన్నింటినీ నిశితంగా పరిశీలించి మార్పులు, కూర్పులు, చేర్పులు చక్కగా నిరూపించి పరిశోధనలో కృతకృత్యుడైనాడు.

మహాభారతములోని ప్రముఖులు అందరిలో ధర్మరాజుయొక్క స్వభావాన్ని సరిగ్గా అర్థంచేసుకొన్న వ్యక్తి సంజయుడు అని నా అభిప్రాయం. ధృతరాష్ట్రుని ఆదేశం పురస్కరించుకొని సంధిగావించడానికి పాండవులయొద్దకు వెళ్ళి పనిపూర్తిచేసుకొని ధృతరాష్ట్రుని కలిసినప్పుడు ధర్మరాజునుద్దేశించి 'వశీకృతచిత్తుడు ధర్మసూతి మెత్తని పులి' అని పేర్కొంటాడు.ధర్మరాజుకి సంబంధించిన కథాసర్వస్వసారంగా ఈ అభిప్రాయం పరిగణింపదగ్గది.

1. సంజయుని సంధి సన్నివేశాన్ని నిశితంగా పరిశీలించి డా. నారాయణరావు వెల్లడించిన అభిప్రాయాలు: ' స్థూలదృష్టికి పరస్పర భిన్నములుగాతోచు శాంతి, యుద్ధము అను రెండును సుక్షత్రియుని చేతిలో పడుగు, పేకలవలే కలసి మెలసి యుండునన్న సత్యమును దర్మజపాత్ర నిరూపించును. దయాగుణమునుపేర ధర్మనాశకుని రక్షింపబూనుట క్షత్రియుని దృష్టిలో శాంతిస్థాపనకాజాలదు. శిష్టులను, దుష్టులనుకూడ ఒకేవిధముగా చూడగలిగెడి సత్వగుణము బ్రాహ్మణునికే చెల్లునుగాని సర్వప్రజా రక్షణభారమునువహించిన క్షత్రియునకు చెల్లదు. కనుకనే ధర్మజుని పాత్రయందు స్థూలదృష్టికి అసాధారణ వైవిధ్యము కాన్పించును. అటులనే రాజనీతియందును, లౌక్యమునందుకూడ సమర్థుడైన పాత్రగా చిత్రింపబడిన ధర్మజుని స్వభావమిట్టిదని గ్రహించుట కష్టము.' ఈ వాక్యలు పరిశోధనలో పరిశోధకుని వ్యక్తిత్వాన్నిచక్కగా నిరూపిస్తిన్నాయి.

2. సైంధవ వధ అయిన తర్వాత కృష్ణార్జునులు ధర్మరాజుని కలసిన సందర్భంలో అతడు వారితో పల్కిన 'చేనెత్తురుగాకుండంగా.....' అని తిక్కన రచించిన పద్యం అమూలకం అని ఈ పరిశోధకుడు పేర్కొని ధర్మరాజు 'శ్రీకృష్ణునితో నీవుండుట వలననే మాకీ కార్యములు సాధ్యమగుచున్నవనియు, మరియు పరోక్షముగ శ్రీకృష్ణుడే వాటన్నింటికి కారణమని వాచ్యముగ చేనెత్తురు గాకుండగ అను విశేషణము పల్కినాడు. తనపై యెట్టినిందలు పడకుండగ, వాటిని శ్రీకృష్ణుని పరోక్షమునకంటగట్టుటయె ధర్మజ లౌక్యము.' అని ధర్మరాజు స్వభావాన్నితేటతెల్లము చేసినాడు. ధర్మరాజు తత్వాన్ని చక్కగా గ్రహించి నిరూపించినాడు.

3. ఆశ్రమ వాస పర్వంలో నూరుగురు పుత్రులను కోల్పోయి అసహాయస్థితిలోనున్న గాంధారీ ధృతరాష్ట్రులను తాను సేవిస్తూ తమ్ములను, అమాత్యులనుకూడా సేవింపుడని ధర్మరాజు ఆదేశించిన పద్యాలను పేర్కొని డా. నారాయణరావు ధర్మరాజుయొక్క గంభీరమైన హృదయాన్ని అర్థంచేసుకొని ' ఒకవేళ ధర్మజుని ప్రర్తనమున వారియెడల శ్రద్ధతగ్గినను, వారికి ఉచిత వర్తనము జరుగకున్నను ధర్మజునికి ఐశ్వర్యము కలిగి రాజ్యాభిషిక్తుడగుటచే పూర్వము కలిగిన ఆదరము, పెద్దలయెడ వినయ విధెయతలు లోపించినవని ధృతరాష్ట్రుడు తదితరులు గ్రహించ

వచ్చును. కావున ధర్మజుడు మెలకువగ అట్టి మాటలకవకాశమీయక ముందుగ తానాచరించుచు, ఇతరులకు ఆచరణీయములని హెచ్చరించునటుల ధ్వనించుచున్నది.' అని ధర్మజుని ప్రత్యేకతను వెల్లడించి డా. నారాయణరావు తన పరిశోధనపాటవాన్ని ప్రదర్శించినాడు.

4. కథాంతమున మహాప్రస్థానిక పర్వంలో ఇంద్రుడు రథంతెచ్చి అధిరోహింపుమని కోరగా ధర్మరాజు సోదరులనుద్దేశించి 'మీతోరాను వారెల్ల నాతోడంగూడగవచ్చునట్లుగ గృపాధుర్యాత్మ కావింపవే ' అని ప్రార్థించుట 'ఆతని సోదరప్రేమకు సోదాహరణము ' అని పరిశోధకుడు పేర్కొనినాడు.

అట్లే మహాప్రస్థాన సందర్భంలో తమతో వెంటవచ్చిన శునకముగూడ తానతో రాదగినదని విపులముగ ధర్మసూక్ష్మాలను ఇంద్రునకు ధర్మరాజు విన్నవిస్తాడని ఆపద్యాలను ఉదాహరించి డా. నారాయణరావు ' ఇట ధర్మజుడు భీష్మునివద్ద విన్న శరణాగతరక్షణ విధిని ఆచరణలో పెట్టినాడు. ఇట మూలభావమును పెంచి తిక్కన రచించినాడు. చివరగ తన మనమునందలి ధృడ నిశ్చయమును ఇంద్రునియెదుట సూటిగ వెలిబుచ్చినాడు.' అని తన పరిశోధన తత్పరతను ప్రస్ఫుటమొనరించినాడు. విషయాన్ని నిశితంగా అధ్యయనంచేసి తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా ఆవిష్కరించినప్పుడే పరిశోధన సార్థకం అవుతుంది.

సంస్కృతాంధ్ర భారతాలు రెండింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి ధర్మరాజు పాత్ర ప్రాభవాన్ని పరిశోధన గ్రంథంలో నిరూపించిన చిరంజీవి డా. కొల్లూరు నారాయణరావుని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను. ఇతోధికంగా వాగ్దేవతా వరివశ్య గావిస్తూ ఇంకా ఉత్తమ పరిశోధన గ్రంథాలు రచించాలని ఆశీర్వదిస్తున్నాను.

శుభం భూయాత్

విద్వజ్జన విధేయుడు

వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి

========

శ్రీమత్వరదేవతాయై నమః

"సాహిత్య విద్యాప్రవీణ', రాష్ట్రభాషాప్రవీణ, సంస్కృతభాషా కోవిద'

'విద్యావారిధి- (వ్యాకరణ శిక్షా శాస్త్రములు)

'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ, 'కాశీవాసి'

ఎమ్.ఏ.(సం)., ఎమ్.ఏ.(తె)., పిహెచ్.డి., (అలంకార శాస్త్రం)., బి.యస్.సి., బి.ఇడి., ఆంధ్రవిశ్వవిద్యాలయ స్వర్ణపతకద్వయగ్రహీత,

శ్రీపీఠపురస్కారసమ్మానితుడు, శ్రీ కల్యాణానందభారతీ పురస్కారసమ్మానితుడు, విశ్రాంత సంస్కృతాచార్యుడు.,

హృల్లేఖ

భృత్యకల్పుడు నారాయణరావు **'శ్రీమదాంధ్రమహాభారతము- ధర్మరాజపాత్ర'** అనే తన సిద్ధాంత గ్రంథమునకు అభిప్రాయమును వ్రాయమని కోరుతూ దాని సాఫ్ట్‌కాపీ (పి డి ఎఫ్)ను ఈమైల్ ద్వారా పంపినాడు. యత్కించిదనారోగ్యమున్నను కాదనలేకపోయాను.వ్యాసభారతము సపాదలక్ష గ్రంథము. ఆంధ్రమహాభారతము కవిత్రయప్రణీతము. వ్యాసరచనకో, లేక ప్రవచనమునకో ఆ గ్రంథములలోని వలసిన భాగములనటనట పరామర్శించుటతప్ప సంస్కృతాంధ్రభారతములను నేనామూలచూడముగా నెన్నడును చదివియుండలేదు. కాలున ప్రస్తుతానుశీలనగ్రంథమును విశ్లేషించునర్హత నాకు లేదని సంభావించి, రచయిత కోరిక మేరకు **అభిప్రాయమును మాత్రమే** యథామతి అభివ్యక్తీకరించుటకుద్యుక్తిస్తాను.

మహాభారతమొక **ఉపాఖ్యానసాగరము**. పంచమవేదముగా ప్రసిద్ధిగాంచిన **జ్ఞానవిజ్ఞానసర్వస్వము.** పరిశ్రుతపాత్ర బాహుళ్యముతో, బహూపాఖ్యానములతో, లౌకిక పారమార్థిక విషయవిస్తృతికలిగి పరిఢవిల్లుచున్న మేటిమహాభారతమునకదే సాటి. రచయిత ప్రారంభములో (మొదటి పేరాలోనే) 'శ్రీకృష్ణుని తరువాత మహాభారత కథానాయకుడు ధర్మరాజని చెప్పబడినట్లు పేర్కొనారు.**చరమఫలభోక్తృత్వ** ' లక్షణము ప్రకారముగ ధర్మజుడే కథానాయకుడనియు, నిర్వేదస్థాయికమగు **శాంతమే అంగిరసమనియు** లాక్షణికుల అభిప్రాయము.

మహాభారతకథానాయకుడైన ధర్మరాజు పాత్రను విశ్లేషించి, రచనాశిల్పమునకనుగుణముగా తన్మాహాత్మ్యమును సంపూర్ణముగా సోపపత్తికముగా నిరూపించుట కత్తిపైసాముచేయుట వంటిదని నాయభిప్రాయము. ధర్మజుని ద్యూతాభినివేశము, ద్రౌపదీపరిప్రశ్నమున నాతని మౌనము, ద్రోణవధఘట్టములో అనిష్టముగానైనను అశ్వత్థామహతుడైనట్లు ప్రకటించుట మొదలగు తావులలో ధర్మసూక్ష్మములను కృతకముగా సమర్థించుటకంటె, వెనినెతని మానసికదౌర్బల్యములని రచయిత తనదైన యభిప్రాయమును నిష్పాక్షికముగ ప్రకటించిన సందర్భములుకూడ లేకపోలేదు. ఈ విషయమున రచయిత కృషి అభినందనీయము.

మహాభారతములో వరుసగా 18 పర్వములలో సుమారు రెండువందలకు పైగా ధర్మజునిప్రసక్తిగల ఘట్టములను ప్రస్తావించి, ఆయా సందర్భములలో ధర్మజుని నడువడి, సౌశీల్యము,ధైర్యము,మున్నగు ఉదాత్తగుణములను సోపపత్తికముగా విశ్లేషించిన వైనము రచయితయొక్క సమగ్రమైన అనుశీలనాపటిమకద్దము పట్టును.

డో.నెం. 3-3-108/64, న్యూఫ్రెండ్స్ కాలనీ - 2, నియర్ ప్లీసెంట్ పార్క్, అత్తాపుర్ - హైదర్‌గూడ,

హైదరాబాద్ - 500048. సెల్ : 8318807932, 9440493951

E-mail-kaasivaasi@gmail.com

ప్రధానముగా నాయకగుణములైన- క్షాత్రము, ధీరత, ఉదాత్తత, రాజనీతిజ్ఞత, సాభ్రాత్రము,ప్రజానురక్తి, సమవర్తిత్వము, వాఙ్నైపుణ్యము, గురుభక్తి, దైవభక్తి, ఆత్మపరీక్షణము, మొదలగు గుణములు ఆయా సందర్భములకనుగుణముగా ప్రదర్శితములై వివేచింపబడినవి.

భారతకథాసంవిధానములో శ్రీకృష్ణయక్షయమధర్మరాజ, ఇంద్రాది దిక్పాలు,వ్యాస నారద ధౌమ్యాది మహర్షులు, భీష్మ విదురాది నీతిజ్ఞులు, ఆత్మీయులైన ద్రౌపదీభీమార్జునులు, ధర్మజుని ముక్తకంఠముగా ప్రశంసించిన ఘట్టములాతని చారిత్రికౌన్నత్యమును చాటునట్టివి. వీరిలో ఇంద్ర,కృష్ణ,కృష్ణద్వైపాయన,యక్షయమ నారదాది దిక్పాలెవ్వరును ముఖస్తుతికై ప్రశంసించువారు కారు. కొండొకచో ఆత్మీయులైన ద్రౌపదీభీమార్జునులు, పతివ్రతయైన గాంధారి మొదలగువారు వ్యధాపరితప్త హృదయములతో నాయా ప్రసంగములలో ధర్మజుని విమర్శించి నిందించినారు.

అవసరమైనచోట్ల (దత్తావతారసంగాది ప్రకరణములలో) వ్యాసాదుల మూలగ్రంథములలోని ప్రామాణికవచనములనుట్టంకిస్తూ, నిష్పక్షికముగా ధర్మజుని బలహీనతలను ప్రకటించుటకు కూడ రచయిత వెనుకాడలేదు.

రాయబారఘట్టములను ప్రస్తావించునెడ ధర్మజుని **ధర్మవృక్షముగను**, రారాజును **రోషమయతరువు**గను ప్రదర్శించి, అతనిని- **మెత్తని పులి, వశీకృతాత్ముడు, ప్రకటీకృతసత్త్వుడు, శాంతమూర్తి, సద్వినయవివేక విశ్రుతునిగా** వేర్వేరాన తిక్కయజ్ఞ భావములను యథాయథముగా వివరించినారు. రాయబారఘట్టములలోనే ధర్మజుని **తలనెరసిన లౌకికవేత్తగా** నిరూపించిన తీరు, భీష్మపర్వములో భీష్ముని ధర్మనిరతి, ధర్మజుని క్షాత్రనిర్వాహము చక్కగా వివేచింపబడినవి. అభిమన్యువధ కంటెను, ఉపపాండవులవధ విషయమున, అంతకుమించి కర్ణవధ ఘట్టములో ధర్మరాజు హృదయవేదనను రచయిత మిన్నగానెన్నిన తీరు చక్కగానున్నది.

నన్నయగారు మహాభారతమును **ధర్మశాస్త్రముగా, వేదాంతముగా, నీతిశాస్త్రముగా, మహాకావ్యముగా, సర్వలక్ష్య సంగ్రహముగా, ఇతిహాసముగా, పురాణసముచ్చయముగా** కానియాడబడుచున్నట్లు తెలుపగా, గ్రంథకర్త తన ప్రధానప్రతిపాద్యమైన ధర్మరాజని **ధర్మమూర్తిగా, నిశ్చలవేదాన్తతత్త్వవిదునిగా, నీతిజ్ఞవిదునిగా, చరమఫలభోక్తయగు ఉదాత్తకథానాయకునిగా, సర్వలక్షణలక్షితునిగా, ఆదర్శమూర్తిగా పురాణపురుషునిగా** తన సిద్ధాంతగ్రంథములో సోపపత్తికముగా నిరూపించి కృతకృత్యుడైనాడు.

స్వార్థవైదికసంప్రదాయచణుడైన నారాయణరావుగారు కూడ తిక్కనగారివలె **'ఇదం భూత్వా మిదం క్షాత్ర'** మనునట్లు సాహితీరంగమునకూడ కృతపరిశ్రముడై తనానాటనుత్తమశ్లోకుడుగా ప్రసిద్ధినందినాడు. పరదేవతానుగ్రహమును బడసి ఇతడితోధిక శుభములనందుచు, ఉన్నతశిఖరములనధిరోహించాలని ఆశీర్వదిస్తూ ఇతని కృషినభినందిస్తున్నాను.

శుభం భూయాత్

క్యాంప్: హైదరాబాద్,
ప్లవ, జ్యేష్ఠ శుద్ధ చతుర్థీ సోమవారం.

'శ్రీపాదు'

శ్రీమాత్రేనమ:

డా. పండితారాధ్యుల వీరేశలింగం, M.A, PhD
Reader.in.Telugu(Retd)S.B.R.Govt.Women's College,
BERHAMPUR, ODISHA.

Flat No-401, Sri Venkateswara Nilayam,
Road No-4, Sri Ramakrishna Puram,
KOTHAPET, HYDERABAD-500035

శివం

శ్రీ వేంకటాద్రి అవధాని గారు ప్రసిద్ధులైన వేదపండితులు. వారిని తిరుపతి దేవస్థానం వారు శాశ్వత వేద పండిత భృతినొసంగి సత్కరించిరి. చి.నారాయణరావు శ్రీఅవధానిగారి పుత్రుడగుట వాని పూర్వజన్మ సుకృతము. ఈతడు తండ్రిగారివద్దనే వైదిక సంస్కారములకైన సర్వమంత్రసమూహమును స్వరయుక్తముగా గ్రహించి కంఠస్థ మొనర్చినాడు. పిదప నా సహాధ్యాయుడైన ఆచార్య వేదుల సుబ్రమణ్యశాస్త్రి ప్రోత్సాహముతో ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి ఎమ్.ఏ (M.A,)పట్టాను స్వీకరించినాడు. అనంతరము నా దర్శకత్వమున బ్రహ్మపుర విశ్వవిద్యాలయమునుండి పి.హెచ్.డి (PhD)పట్టాను పొందినాడు.

ఇక ప్రకృత గ్రంధ విషయమును చూతము. ధర్మమను మాటకు నిర్దిష్టమైన నిర్వచనమిచ్చుట కష్టము. అనేక నిర్వచనములలో ప్రసిద్ధమైన దానిని గ్రహింతము. "జీవుడు ఉపాధిలో ఉన్నంతకాలము తానొనరించు ప్రతి పనియు, పలికెడి ప్రతిమాటయు వాని ఆత్మోన్నత్యమునకు కాని, ప్రక్కవాని జీవిత సౌఖ్యమునకు కాని భంగము కలిగింపరాదు" దీనినే ఆధునిక విమర్శకులు ధర్మమనుచున్నారు.

అష్టదిక్పాలురలో ఒకడైన యమధర్మరాజు సంయమనముతో ధర్మమును పాటించి, తనపేరునకు సార్థకత చేకూర్చినాడు. వాని అంశమున జన్మించినవాడే భారత ధర్మరాజు. అందుచేతనే ధర్మరాజు పాత్ర ప్రతిపనిలోను, మాటలోను ధర్మ నిర్వచనము సార్థకమగుచున్నదా లేదాయని చూడవలయును. మహాభారతము పదునెనిమిది పర్వములలోను ధర్మజుడు కాన్పించును. అందుచే వానిని నిశితముగ పరిశీలించినచో ఆ గ్రంధము మరియొక మహాభారతమగును. కనుక ఆయువుపట్లనదగు ప్రధాన సందర్భములను మాత్రము చూడగలము. అంతియేకాదు, అరువదినాలుగు కళలు, సర్వవేదములు (జ్యోతిషము- ఇత్యాదులు) వ్యాసునకు కరతలామలకములు. అందుచే మహాభారతమున సర్వవిద్యలును కాన్పించును. ధర్మజుని విషయముననొక జ్యోతిష శిల్ప సౌందర్యమును చూడుడు.

ధర్మజుని జాతకమున రెండు ప్రధాన విషయములు చెప్పబడినవి. వాని లగ్నము వృశ్చికము, వాని జన్మ నక్షత్రము జ్యేష్ఠ. వాని రవి తులారాశియందున్నాడు. ఇందు వ్యాసుడు ధ్వనిగా నాలుగు ప్రధాన విషయములను చెప్పియున్నాడు. అందు మొదటిది, వృశ్చికరాశి కాలపురుషుని అష్టమరాశి. ఆయుస్థానము. వాని అధిపతి యమధర్మరాజు. వాని తనయుడే మన ధర్మరాజు. ఇక రెండవ విషయము, వృశ్చిక లగ్నమున చంద్రుడున్నాడు. అట్టివారు దత్తతకు వెళ్ళవచ్చును. లేదా అసలు తండ్రికి దూరముగా నుండవచ్చును. ధర్మరాజు చిన్ననాడే తండ్రియైన పాండురాజును కోల్పోయి శాశ్వతముగ దూరమైనాడు. ఇక మూడవది వాని జన్మనక్షత్రము జ్యేష్ఠయనుట. ఈ నక్షత్రమునకు అధిదేవత దేవేంద్రుడు. చక్రవర్తిత్వకారకుడు. చివరిదశలోనైనను ధర్మజునకది యోగించినది. ఇక నాలుగవ విషయము అత్యంత ప్రధానమైనది. ఒకని జాతకమున రవి, చంద్రులిరువురును నీచయందున్నచో వాని జాతకమున ఎన్ని రాజయోగములున్నను, ఆ జాతకుడు అత్యంత కష్టములను అనుభవించుననియు, అవమానములను పొందుననియు జ్యోతిష్కులు చెప్పుదురు. ఇవి అన్నియును ధర్మజునకు అనుభూతములైనవి. ఇటుల జ్యోతిషము వలన ధ్వనిగా ధర్మజుని భవితవ్యమును తెల్పుటయొక శిల్ప సౌందర్యము. ఇట్టి జ్యోతిష విషయములు ధర్మజుని కథలో పదేపదే కాన్పించును. కాని ఇట్టివానిని సూక్ష్మముగ వివరించుట గ్రంధవిస్తరమొనర్చుటయగును.

రాజసూయ సందర్భమున శ్రీకృష్ణునకు అగ్రతాంబూలమీయబడినది. దానిని శిశుపాలుడు అధిక్షేపించినాడు. ఈ సందర్భమున మూలమున భీష్ముడు శ్రీకృష్ణ దివ్యత్వమును తెల్పుటకై భగవద్గీతయందలి 'విభూతియోగమును' 'విశ్వరూపదర్శన యోగమును' సంక్షిప్తముగా వివరించినను అది సుదీర్ఘమేయైనది. దీనిని అనువాదమున ధర్మరాజు ...ఆదిజుడైన బ్రహ్మ ఉదయంబునకాస్పదమైనవాడు' అని శ్రీకృష్ణుని నారాయణత్వమును సంక్షిప్తముగ వివరించినాడు. ఇట్టి సందర్భములను వివరించుట ఆధ్యాత్మిక వ్యాఖ్యానములగును. అందుకే ధర్మజుడు "పరమార్ధ ప్రతిభ" చేతనే విష్ణుడు శ్రీకృష్ణుని గ్రహింపగలడనినారు. భారతీయ ఆధ్యాత్మిక తత్వవిజ్ఞానము, దానిపై ఆధారపడిన సంస్కృతి, విశ్వాసములు పునాదిగా భారతకథ నడచినది. ఇందలి ప్రతిపాత్ర చిత్రణమునను ఈవేద పరిజ్ఞానమును విడిచిపెట్టుట తగదు. కాని, దీనినెల్ల పాత్రలకన్వయించి వివరించుటవలన సిద్ధాంతన్యాసము భాష్యగ్రంధమగును.

డా.నారాయణరావు ఆదిపర్వమాదిగా స్వర్గారోహణపర్వ పర్యంతము ధర్మరాజు ప్రధాన ప్రవేశములున్న భాగములనన్నింటిని స్పృశించినాడు. ఈ సందర్భమున ధర్మరాజపాత్ర వ్యాఖ్యాతలకు మార్గదర్శకముకాగల కొన్ని చక్కని వ్యాఖ్యాన విధానములు ఈ గ్రంధమున కాన్పించుచున్నది. అట్టి వానిలో కొన్నింటిని క్రింద వివరింతును.

1. ప్రతిపర్వమునందలి ధర్మజపాత్రను వివరించుటకు ముందు ఆ పర్వమునందు ధర్మజుడు ప్రదర్శించిన లౌకికాలౌకిక సందేశములను ఉపోద్ఘాతముగా వివరించుట సత్సంప్రదాయము కాగలదు.

2. లోకమున ఒక సాధారణ సంప్రదాయమున్నది. ఒక పాత్ర యొక్క నడవడిక సమాజ కల్యాణ కారకము కావలెనని ఎల్లరును భావింతురు. పెద్దలనడవడికను సామాన్యులు అనుసరింతురు. అట్టితరి పదుగురనుసరించుటయే ఉచితము కాని ప్రవర్తనమును ఎట్టివాడు ప్రదర్శించినను వానిని లోకముమెచ్చజాలదు. సభాపర్వమునందలి ఉపోద్ఘాతమున రచయిత ధర్మజుని లోపములను నిర్మొగమాటముగా ఎత్తిచూపినాడు.

3. ఒక వ్యక్తి ప్రవర్తన వెనుక అనేక లక్ష్యములుండును. ఆ లక్ష్యమును చూడకుండ సామాన్యుని ప్రవర్తనవలె చక్రవర్తి ప్రవర్తనమున్నదనరాదు. అటుల భావించినంత మాత్రమున అది ప్రజాస్వామ్య లక్షణమనిపించుకొనదు. భూభారమడంచుటకు శ్రీకృష్ణుడు సంకల్పించినాడని భారతకథకదియే ప్రధాన లక్ష్యమని భారతారంభమున చెప్పబడినది. అందుచే రచయిత ధర్మజుని లోపముగా కాన్పించు ప్రవర్తనమును చూపించుచునే, ఆయాపర్వములలో ఆయా ప్రవర్తనల వెనుకగల లక్ష్యములను కూడ వివరించుట గమనార్హము. ఉద్యోగ పర్వమునందలి ధర్మజపాత్రను వివరించుచు **81**వ. సంఖ్యగల పద్య వ్యాఖ్యానముగ **(పుట79)** వివరించుచు రచయిత చెప్పిన క్రింది వాక్యములు సువర్ణాక్షరములతో లిఖింపదగినవి. " ..... భూభార మడంచుటకు అవతరించిన అవతార పురుషుడు శ్రీకృష్ణుడు. దుష్ట శిక్షణము వాని లక్ష్యము. " వాని లక్ష్యసిద్ధికై యముని అంశతో నేలకు దిగినవాడు ధర్మజుడు. .... ఒక్కమాటలో చెప్పవలెనన్న కృష్ణునకు ధర్మజుడొక సాధనము. వాని స్వభావముపై తన లక్ష్యమును ముద్రగా వేయదలచినాడు. తన యభిప్రాయములను వాని శీలముగా మలచదలచినాడన్నమాట. కనుకనే శ్రీకృష్ణుడు చెప్పినటుల నడచెదనని మున్నుగా ధర్మజునిచే పలికింపజేసినాడు వ్యాసుడు.

మహాభారతమును సూక్ష్మముగా పఠించిన వానికిట్టి అభిప్రాయములు తప్పక స్ఫురపడును. ఏపాత్ర కాపాత్రనే తప్పక వివరింతుము. కాని మొత్తము కథకైన లక్ష్యములో ప్రతిపాత్రయు ఒక అంశము మాత్రమేయను సత్యము మరువనంతకాలము అపాత్ర చిత్రణ తప్పుదారి పట్టదు. రచయిత ఇట్టి సూక్ష్మపరిశీలనమును ప్రదర్శించినాడు. ఇవి మచ్చునకై చూపిన చక్కని వ్యాఖ్యాన విధానములు. ఒక మహాపర్వతమును అద్దములో చూపిన బృహత్ప్రయత్న మీ సిద్ధాంత గ్రంధము. భావి పరిశోధకులకు ఉపయుక్తముకాగల చక్కని గ్రంధము. డా.నారాయణరావు భవిష్యమున ఇట్టి గ్రంధములననేకము వ్రాయవలెనని ఆశీర్వదించుచు, వానికి ఆయురారోగ్యములనొసంగుమని పరమేశ్వరుని ప్రార్థించుచున్నాను.

-----శివ-----

ప్లవ, జ్యేష్ఠ-పౌర్ణమి. పండితారాధ్యుల వీరేశలింగం.

శుభమస్తు

శ్రీ.లంక సూర్య సుబహ్మణ్యం, M.A.(Litt)
Reader.in.Telugu(Retd), Rayagada College,
RAYAGADA, ODISHA

KAMANDORAVALSA
Po:NIDAGALLU , Vai:SITANAGARAM
VIZAYANAGARM(Dist)

స్వాంత ప్రమోదం

'ధర్మే సర్వం ప్రతిష్ఠితం తస్మాద్ధర్మం పరమంవదన్తి' అని శ్రుతి. సృష్టికి మూలము, పరమమును ధర్మమేనని, ధర్మమునందే అన్నియు సుప్రతిష్ఠితమైనవని వేదవచనము. ఆ వేదములయొక్క సారము సర్వమానవాళికి శుభంభావుకమై, సర్వజనానందకందాయమగుటకు మరియు సులభగ్రాహ్యమగుటకు వేదార్థసారమే శ్రీమన్మహాభారతమను పేర ప్రతిపాదించబడినదని 'భారతవ్యపదేశేన హ్యామ్నాయార్థ: ప్రదర్శిత: అని చెప్పబడినది. శ్రీమన్నారాయణ స్వరూపుడైన వ్యాసభగవానుని నోట పలికిన పుణ్యకథాశ్లోక సముచ్ఛయము, తెనుగున అమృతాంశుకుల పయ:పారావారరాకాసుధాకరుడగు రాజరాజనరేంద్రుని ఆకాంక్షానురూపమై, ఆంధ్రజాతి ప్రాక్తన జన్మఫలముగ, వేదత్రయమూర్తులగు కవిత్రయ ఋషికల్పనలో 'తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలి' అన్న ఆంధ్ర జాతీయోక్తికి అన్వర్థమై ఇల వెలసిన విశ్వవిజ్ఞాన నిష్యంధము శ్రీమన్మహాభారతము.

చిరంజీవి డా. కొల్లూరు నారాయణరావు, అస్మద్గురువర్యులైన వేదవిద్వాలంకార బ్రహ్మశ్రీ కొల్లూరు వేంకటాద్రి అవధాన్లుగారి గారాబు పట్టి. అది1973 వ శరత్తు. నేను, మా సోదరులు సత్యనారాయణ శర్మ ఉభయులం రాయగడ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగ జీవిత ప్రస్థానాన్ని ఆరంభించిన రోజులవి. 'కావ్యశాస్త్రవినోదేన కాలోగచ్ఛతి ధీమతాం'అని కదా!ఆర్యోక్తి. కావున ప్రాత:సాయంసంధ్యలలో గురువుగారి వద్ద మా సోదరద్వయం, మా మిత్రులు బులుసు కృష్ణమూర్తి మరియు మల్లాది రమణరావు అంతేవాస్యులమై, సంస్కృత కావ్యాలైన రఘువంశము, కుమారసంభవము, మేఘసందేశముతో పాటు తైత్తరీయ ఆరణ్యకోపనిషత్తులైన అరుణం, నారాయణం, యాజుష స్మార్తం మొదలగునవి నేర్చుకొను సమయమున, పసివాడైన నారాయణరావు తండ్రిఒడిలోనే కూర్చునుండుట, అచటనే ఆటపాటలవలన పై చెప్పిన విషయములన్నియు అలవోకగ అప్పజెప్పెడివాడు. బహుశ: 'శ్రుతి' అను పేరు వేదమునకు కలిగియుండుట అపుడే ప్రత్యక్షముగ కనుగొంటిమి. చిన్ననాటనుండి నారాయణరావు ఏకసంథాగ్రాహిగ నెన్నబడుచు తండ్రిగారివద్దనే వేదవిద్య , అమరంతో పాటుగ కావ్యాదులవరకు నియమిత శిక్షితుడై, పండ్రెండవ ఏటనే భాగ్యనగరమున శ్రీమాన్ ప్రా. దివాకర్ల వెంకటావధానిగారు మొదలైన పండిత పరిషన్మధ్యమున కృష్ణయజుర్వేదీయ స్మార్తపద్ధతిన ఉపనయన, వివాహాదులను జరిపించి, ఘనత నొందిన వైదికాచార పరాయణుడు. కాని బాల్యచాపల్యముచేత ఆంగ్ల, విజ్ఞాన,గణితమాదిగాగల లౌకిక విద్యనుపేక్ష చేయుచు, పాఠశాలకు వెళ్లక, ఈ విషయమున తండ్రిగారి మాటనుకూడ అనాదరించుచు తిరుగాడుచుండెడివాడు. శ్రీఅవధానిగారు విద్యావిషయక వృత్తులలో ఛాందసులైనను, లౌకిక జీవన విధానమెరిగిన లోకజ్ఞులు. కావున కాలానుగుణ్యముగ పదవ తరగతైన పాసయ్యి, ఆపై కులవృత్తిన కొనసాగుట గురువుగారి అభిమతం. అది1984 వ సంవత్సరం. పదవతరగతి బోర్డు పరీక్షలు. గురువు గారి తప:ఫలమో ! లేక దైవచిద్విలాసమో ! నారాయణరావు నలభైఒక్కమందిగల తెలుగు తరగతి శ్రేణిలో ఆ ఏడు ఒక్కడంటే ఒక్కడు ఉత్తీర్ణుడైనాడు. అది అందరికి ఆశ్చర్యానందములు కలిగించగ, చదువంటే ఇష్టములేని నారాయణరావు మాత్రంఎరుగని దైవసంకల్పానికి, ఏమైనదో తెలియని ఆందోళనలో మునిగిపోయినాడు.

వేదార్థగ్రహణపాలీణులు, జ్యోతిష చంద్రిక కర్తలగు గురువర్యులు దైవానుశాసనమును పోల్చుకొని, కొమరుని భవిష్యోత్తర విద్యావ్యాసంగమునందు పారంగతుని జేయుటకు నిశ్చయించి, కళాశాలలో చేర్పించుటకుద్యమించి మా సోదరద్వయమున కొప్పగించిరి. నాటికి నారాయణరావునకు కూడ శైశవమతిక్రమించుటచే, బాల్య చాపల్యమును విడనాడి, తల్లిదండ్రులయెడ గౌరవము, విద్యయందు శ్రద్ధాసక్తులు, గురుజనములందు ముఖ్యముగ మా సోదరద్వయముపై భక్తి విశ్వాసములు కలిగి, మా శిక్షణాభ్యాసమున గురికుదిరి, మమ్ములనే ఆదర్శముగా గ్రహించి, తన భావిజీవన విధానమునకు లక్ష్యమూర్తులుగ*(Role Models)*నిర్దేశించుకొని భవిష్యమున తానును, మావలెనే తెనుగు భాషోపన్యాసకునిగా ఉద్యోగింతునని జీవిత లక్ష్యము నేర్పరచుకొని, రాయగడ కళాశాలలో డిగ్రీ పరీక్షలలోనుత్తీర్ణత నొంది, స్నాతకోత్తర పట్టభద్రతకై ఆంధ్రవిశ్వవిద్యాలయమున నడుగిడి తెనుగున ఎమ్.ఎ *(M.A,Litt)*తో పాటు, సంస్కృతమున సీనియర్ పోస్టుగాడ్యుషన్ డిప్లామో ఇన్ సాంస్కిట్ *(Senior Post Graduation Diploma.in.Sanskrit)*జోడుపట్టాలతో తిరిగివచ్చి , అలుపెరుగని సాహితీ సాగర సాంయాత్రికునిగా 'శ్రీమదాంధ్ర మహాభారతము-ధర్మరాజపాత్ర' అను పేర తెలుగులో పి.హెచ్.డి*(PhD)*పట్టము కొరకై సంస్కృతాంధ్ర మహాభారతముల రెంటిని సమగ్ర అధ్యయన,పరిశోధన గావించి, డా. పండితారాధ్యుల వీరేశలింగంగారి మార్గనిర్దేశికత్వమున బ్రహ్మపుర విశ్వవిద్యాలయమునుండి విద్యావారిధి*(PhD)*పట్టము నంది కృతకృత్యుడైనాడు. ఇటు తండ్రిగారికి, అటు రాయగడ ప్రజానీకానికి ముఖ్యముగ అస్మదాదులగు అవధానిగారి శిష్యప్రశిష్యులకు, సుహృజ్జనబృందమునకు మహానందడోలికలలోనోలలాడించిన మహోదయమది. అనంతరమున ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ నియామక సంస్థచే నిర్వహింబడిన పరీక్షలందు ఉత్తీర్ణుడై, 'మనంమనం బరంపురం'అని గత శతాబ్దపు తెలుగు కవుల మన్ననలందిన, ఉమ్మడి మదరాసు రాష్ట్రపాలిమేరగ చరిత్రమున ప్రసిద్ధివడసిన దక్షిణఒడిశా నడిబొడ్డునగల కళ్ళికోట కనిష్ఠ మహావిద్యాలయమున, ప్రస్తుత ఒడిశా రాష్ట్ర ఏకైక ప్రభుత్వ ఆంధ్రోపన్యాసకునిగా వర్ధిల్లుచు, మా మూడుపదుల అధ్యయన, అధ్యాపకత్వములకు కీర్తిపతాకగ వెలుగొందుచుండుట అనుపమానం. అస్తు .

ప్రకృతము శ్రీ మన్మహాభారతంలో ధర్మరాజు పాత్రపై పరిశోధనా వ్యాసంగములో వ్యాసమహర్షి మూల భారత భావజాలమును, కవిత్రయము వారి ఆంధ్రానువాద శ్రీమదాంధ్రమహాభారతములలోని పాత్ర పోషణములను క్రోడీకరించి. వ్యాస భారత విశేషములలో ధర్మరాజ పాత్రమున సనాతన ధర్మ సూక్ష్మములు, పురాణేతిహాసపద్ధతిలోను, కవిత్రయ భారతములో లౌకిక, కాల్పనిక, చారిత్రిక నేపథ్యముల లోగల ధర్మజపాత్ర వైవిధ్యమును పరిశీలించి ఉద్గ్రంధమైన మహాభారత భారతికి ప్రతిబింబమైనటుల ధర్మరాజు పాత్ర విశేషములను సాహితీ పాఠక లోకమునకు, భావి పరిశోధకులకు అందించి తనదైన ముద్రతో ధర్మరాజును సుప్రతిష్ఠితుని జేసినాడు.

'పేరు ధర్మరాజు పెను వేపవిత్తు' అని కించదంతి. ఇదియే మరొకవిధముగ తెనుగు జాతీయమున చెప్పినచో 'వేస్తె వేపకొమ్మ-తియ్యబోతే అసిరమ్మ'. అనగ సామాన్యమున వేపచెట్టు గాలి, నీడ, గింజలు ఆర్యోగ్యమునకు మేలుచేకూర్చునని, సర్వరోగ నివారిణిగ వైద్యశాస్త్రము ధృవీకరించినది. అటులనే దేవతాంశగా అమ్మవారి రూపున పూజించుట పరిపాటి. ధర్మరాజునిట వేపవిత్తుతో పోల్చుట జరిగినది. ధర్మజుని ఆలోచనలో మొలకెత్తిన విత్తు రాజసూయము. సర్వరాజలోకమును ఆ చెట్టు ఛాయలోనిలచి గాలి పీల్చుకొని ఆయువును, ఆరోగ్యమును పొందినది. కాని శిశుపాల, దుర్యోధనాది దుష్టశక్తులుకొన్ని పెకలించుటకు, ఆ విత్తును నాశనమొనర్చుటకు, మ్రింగివైచుటకు యత్నించినవి. కాని వేపవిత్తు విషముతో

సమానము. అది కుక్షిన పేరుకుపోయిన నులిపురుగులు, వ్యర్థపదార్థములను నాశనమొనర్చి, జీవవాహికను శుభ్రపరచి ఒకపరి ఆయువునిచ్చును. లేదా లోన విషమధికమున్నచో, మ్రింగిన విషముతో కలసి ఆయువు తీయవచ్చును. ఇదియే(అంత:)శత్రు నాశనము చేసినది. ధర్మజుని ఆలోచనలు చేదు. కాని ఆచరణము తీపి. ఇది భారతమున యెల్లఎడల స్పష్టము, ముఖ్యముగ రాబారఘట్టములందు సుస్పష్టము. బహుశ: ఇదియే తిక్కనగారి కావ్యపరిభాషలో **'వశీకృతచిత్తుఁడుధర్మసూతిమెత్తనిపులి యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకున్వినడును'-ఉద్యోగ-ద్వితీయ-14 'మెత్తని పులి తత్వం'**

డా. నారాయణరావు విశ్లేషణములలో ధర్మరాజు రాజనీతిజ్ఞత, కార్యదక్షత, సత్యనిష్ఠ, శ్రీకృష్ణునిపై అచంచలమైన దృఢభక్తి, విశ్వాసములు, సాక్షాత్తు భగవత్ స్వరూపుడైన వ్యాసదేవునిపై భక్తి శ్రద్ధలు, పెద్దతండ్రి ధృతరాష్ట్రునియెడ పితృభక్తి, అసమాన ఆప్యాయత, భీష్మ,ద్రోణ,కృప, విదురాదులయెడ గౌరవ, భక్తిభావ ప్రపత్తులు, తల్లి, పెదతల్లి మరియు స్త్రీ లోకమునెడ మాతృప్రేమ, అవ్యాజానురూప వాత్సల్యము, సంజయ, స్వపక్షపరివారమునెడ సుహృద్ బాంధవాభిమానం కనబరచుటతోపాటు ముఖ్యముగ అన్నదమ్ముల అనుబంధమునకు, అభిమానమునకు స్వ,పర బేధములేక, పరపక్షీయులైన దుర్యోధనా దులను, చివరకు కర్ణునిపై (కర్ణుని మరణానంతరము అగ్రజుడని తెలిసిన పిదప విలపించుట)కూడ సాటిలేనిదిగా నిలచి, ధర్మరాజులో అడుగడుగున ప్రతిబింబించును. చి. నారాయణరావు మాటలలో

'185.అంత ధర్మజుడు అన్నదమ్ములెవ్విధముగ తమలోతాము మెలగ వలయునని భీష్ముని అడుగగ, అతడు అన్నదమ్ములందరు ఐకమత్యముతో మెలగవలెనని, అగ్రజుని ఆజ్ఞను పాటించుచుండవలెనని తెలిపి,

చం.జనవరయన్నదమ్ములు ప్రసన్నమతింగలకల్మిపంచి కు,

ద్ధినవినుతించులోకమునుశ్రీయుఁ బొరింబొరిఁబెంపునొందు లో.....అను.చతుర్థ.134,

ఈ విషయమునకు మొత్తము భారతకథయే ఉదాహరణమగును. ధృతరాష్ట్రుడు సోదర మరణానంతరము, స్వార్థమును పెంచుకొని సోదరపుత్రులనుపేక్షించుటే కదా! భారతకథనము. సోదరుల ఐకమత్యమునకు శ్రీరామాదుల తరువాత పాండవులే ప్రధాన సోదరులు.'

డా. నారాయణరావుగారి పరిశోధనా వ్యాసములలో కవిత్రయ భారతాంధ్రీకరణ భారతి, వ్యాస భారతమునకు యథాతథము కాదు కనుక వ్యాస, కవిత్రయ పాత్రచిత్రణలోని వైవిధ్యము కొన్ని తావులలో పాఠకలోకమునకు అందించిరి. వ్యాస భారతమునకు కవిత్రయ భారతము యథాతథము కాకపోవుటచే మూల భారతములోని వ్యాసహృదయము పాత్రల చిత్రీకరణలో రెండవకోణము నాడు చూడబడలేదేమో! అన్న ప్రశ్నార్థకం కాన్వించుచున్నది. కాలగతిలో ఏదియును అసంభవముకాదని, కవికుల గురుపరంపరలో భావి భారతములో యథాతథ వ్యాస భారతాంధ్రీకరణమొచ్చి డా. నారాయణరావుగారిలాంటి వారి కోరిక తీరగలదని ఆశిస్తు , ఆ భగవంతుని కృపాకటాక్ష వీక్షణాలెల్లప్పడు కలగాలని ఆశీర్వదిస్తూ

ఇతి శం

శ్రీశ్రీశ్రీ

ప్లవ, ఆషాఢ శుద్ధ విదియ

కామందొరవలస

లంక సూర్యసుబ్రహ్మణ్యం

శ్రీ. లంక సత్యనారాయణ శర్మ , M.A,(Litt)
Reader.in.Telugu(Retd) Mahmayee Mahila Maha Vidyalaya ,
BERHAMPUR, ODISHA

Legend Chimes, Villa No.210
Near Rockwell School, Kokapet
HYDERABAD-500075 Telengana

ఓం

తొలి ప్రశస్తి

ఓం: నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీంసరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్

శ్రీమన్నారాయణ స్వరూపుడైన వేదవ్యాసుడు, సాక్షాన్నారాయణుని అవతార విశేషగాథైన 'జయ' నామ కావ్యాన్ని రచించెను. శిష్య ప్రచారముతో అన్ని లోకములలో వ్యాప్తి చెందినదై, భూలోకమున మహాభారత ఇతిహాసంగా ప్రామాణికతను సంతరించుకొన్నది. తరతరాల హైందవజాతి చారిత్రక నేపథ్యములో, ముఖ్యముగ తెనుగు జాతి ఉనికికి, అస్తిత్వమునకు సంస్కృతీ, సారస్వతములకు వేదమూర్తులైన కవిఋషిత్రయ సంకల్పములో దైవికంగా సిద్ధించిన తెనుగు విశ్వవిజ్ఞాన శిఖరం మహాభారతం.

అట్టి మహాభారతాంతర్గత ప్రధాన పాత్రలలో ద్వితీయ స్థానీయమగు ధర్మరాజు పాత్రను పరిశోధనాంశముగా స్వీకరించి, చి.డా.నారాయణరావు అత్యంత ఆత్మవిశ్వాసముతో కత్తిమీద సాముకు సన్నద్ధుడైనాడు. విద్య, వినయముతో పాటు లౌకిక జ్ఞానము, బహు గ్రంధ పఠనము అనువంశికముగ అలవడిన వైదిక సంస్కారము, సంస్కృత భాషా పాండిత్యము నారాయణరావును, ధర్మ, వేదాంత న్యాయ, మీమాంశ, ఛందో వ్యాకరణాలంకార, నీతిశాస్త్ర గర్భితమై శ్రుతి, స్మృతి, పురాణములకు ఆలవాలమగు మహాభారతమునందలి ధర్మమర్మజ్ఞుడైన ధర్మరాజు పాత్రపై సాధికార పరిశోధనకు అర్హులలోనర్హునిగా చేసినదనుట కేవల స్వభావోక్తి.

చి.నారాయణరావు గారి పితృపాదులు కీ.శే. వేదవిద్యాలంకార బ్రహ్మశ్రీ కొల్లూరు వేంకటాద్రి అవధానులవారు మాకు ఆధ్యాత్మిక గురువులు. నేను, మా అన్నగారు పూర్వాశ్రమమున సంస్కృత, కావ్య, వైదిక, ఔపనిషద్భాష్యాదులను వారి వద్ద కొంతవరకు అభ్యస్తము చేసితిమి. చి. నారాయణరావు కళాశాలలో మాకు విద్యార్థి. సతీర్థుడు. తదుపరి మా లంక కులమునకు క్షేమంకరుడు, ఆత్మీయతా బంధువు. కర్మక్షేత్రమున సహోద్యోగి. కళాశాలలు వేరైనను చేయువృత్తి, పనిచేసిన పట్టణము బ్రహ్మపురమే. అంతియే కాదు. మరియొక్క ఆత్మాంతర్గత విషయము సవినయముగా చెప్పుచుంటిని. చి. డా.నారాయణరావు మా కులగురువులు కూడ. గత ముప్పదేడుల మా గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణమున శుభ పరంపర ఆతని చేతుల మీదను కొనసాగి పౌత్రాభి వృద్ధి దిశగా సాగుచున్నది. మరియు స్మార్త సంబంధమైన అనేక విషయములలో నాతో పాటు మా పుత్రులు, మేనల్లుళ్ళు కూడ వారి అంతేవాస్యులే. అందులకే మా కుటుంబములలో అతనిని గూర్చి మాటలాడునపుడు నేటికిని 'గురూజీ' అనియే సంబోధనాదులు.

ప్రకృతము ఆంధ్ర వాఙ్మయమున ఆవిర్భవించిన ఆదిమగ్రంథమైన మహాభారతము, భారతీయ జన జీవన స్రవంతిలో భాగమై, మన జీవన గమనంలో, ధర్మాధర్మ, కర్తవ్యాకర్తవ్య విచికిత్స కలిగినపుడనుసరించవలసిన మార్గమును చూపుటకు కరదీపికగా, ఆర్ష వాఙ్మయ ప్రమాణములతో దిక్సూచిగా, మానవ జీవన ప్రవృత్తికి ప్రాణాధారమై భారతీయ

సనాతన ధర్మ రక్షణకు, జాతి మనుగడకు ఆలంబనగా శాశ్వత స్థానమును పొందినది. భారత కథలలోని పాత్రలు వారి ప్రవృత్తులు, బలములు, బలహీనతలు సామాన్యులచే ఉదహరింపబడుచు అత్యంత ప్రాచుర్యము పొందినవి. అందలి ప్రతి పాత్రపైన కొన్ని అభిప్రాయములు, ప్రతి వ్యక్తి తన వైయ్యక్తిక సంస్కారముతో తాను ఏర్పరుచుకొనిన జీవితపు విలువలతో బేరీజు వేసి పాత్రలకు ఒక స్థాయి, స్థానము కల్పించుకొనెను. వైవిధ్యభరితములైన ఈ అభిప్రాయములు కోకొల్లలు.

మహాభారత పాత్రలను సూక్ష్మముగ జూచిన పాండవులు ధార్మిక, సాత్విక, దైవీశక్తులు. కౌరవులు అధార్మిక, రాజస, తామసిక, అసురశక్తులు. ఆ రెంటి మధ్యగల యుగ యుగముల సంతత ఘర్షణ, ద్వాపరాంతము, కలి యుగారంభముల సంధిలో సంఘర్షణగ, క్రమ పరిణామ వికాశమునుబొంది కురుక్షేత్రముగ రూపాంతరము చెందినది. ఇది ఒక్క కురుపాండవ సంగ్రామము మాత్రమేకాదు. యావత్ మానవ జీవన పరిణామ క్రమవికాశమునకిది దర్పణ సదృశము. చతుర్విధ పురషార్థములను సాధించు సాధనాసంగ్రామమున ధృతరాష్ట్రులు(ధృత-ధరించిన, రాష్ట్రం-శరీరము-శరీరములు గలిగి,అజ్ఞానమను అంధత్వముతో)దుర్యోధనులమైన(దుర్-దుష్టమైన, యోధ-వీరుడు లేదా శక్తిమంతుడు అనగ బహిరింద్రయములపై పోరాడువాడు. కాని అంతరింద్రియ జయము పొందువాడు గదా! నిజమైన యోధుడు)మనందరి జీవన వికాశపథ సంజీవని మహాభారతం. ధర్మజుడు-మానవాళి ప్రతినిధి. భగవద్గీత-అత్మ. శ్రీకృష్ణుని పర్యవేక్షణే ఫలితము. ఈ మహాభారత రహస్య విషయ వివరణము యీ సిద్ధాంత వ్యాసమునందు ఎల్లయెడల అంతర్లీనముగా ప్రవహింపజేసి, చి.డా.నారాయణరావు పరిశోధకునిగా అత్యంత ఓర్పు, నేర్పులతో పరిశోధనా వీరమును ప్రదర్శించి, కర్మఠుడై ప్రాక్పశ్చిమ విపశ్చిన్మణుల ప్రశంశలనందుకొనినాడు.

జీవితములో పిన్న వయసులోనెదుర్కొన్న కష్టసుఖములు కర్మఫలమని, దైవసంకల్పమను ప్రస్థానత్రయ సందేశమును సంపూర్ణముగ విశ్వసించి, అర్ధిక భారము ఎక్కువైనను ఈ గ్రంధ ముద్రణకు సంకల్పించినాడు. అస్తిత్వమునకే ప్రమాదము కల్గించు దుష్టశక్తులతో తన యేబదియారు అక్షరములను అక్షయ తూణీరముతో పోరాడుచున్న ఆంధ్రభాషామతల్లికి అంగరక్షకులుగా నిలిచి సాయపడుచున్న చి.డా. నారాయణరావులాంటి భాషాభిమానులకు మనబోంట్లు యథోచితముగా సాహాయ్యము చేయుచు విజయ పథమున నడిపింపజేయుదురని ఆకాంక్ష...

అథ సాధయ సాధయేప్సితం

ప్లవ, ఆషాఢ శుక్ల సప్తమి
హైదరాబాద్.

లంక సత్యనారాయణ శర్మ

Divine Life Society,
Po:Jayanagar
Jeypore,Koraput(Dist.),
Odisha-764005

A PROLEGOMENA

'Man', wrote Pope years ago, " is placed on the isthmus of a middle state and goes on to warn us unprepared fun-loving folk. (No matter if intellectual fun) not to drink of the waters of the Pierian spring. When nobody can, or does, quarrel with human desiderata as such, it is over "Adhikara" (Eligibility, right, fitness, even duty) to follow the path prescribed - in the instant case, the time-honored Vedic one- that acts as the stumbling block insuperable. So we are told by our own logical, if a trifle cold inexorable, impulses. So, no let up whatsoever from Hegelian "hard thinking " being carried to its absolute metaphysical conclusions.

Now, to speak the least, Indian culture has always done it successfully down the ages. Somehow or the other, it throws up some idealists of all descriptions as even a Nirad Choudhury would admit in his "Continent of Circe" that would rise to the occasion whenever Satya Sanatana Dharma is “at stake” for such is the very soil of this hoary, ancient land.

It is our "divine resources" aplenty that would do up the trick, if a trick it be, and not an unknown cosmic law. (Ritam) at work. It is very unfortunate that these precious resources are these degenerate days dubbed, somewhat anthropomorphically, " human resources" which on close examination will turn out to be " mortal resources ". What else can be expected from people who are utterly innocent of the great Human- Divine divide that everyone has to negotiate one day or the other? Not for the nothing does the Lord admonish us to " देवान् भावयत" etc.

The Divine resources referred to above draw largely upon the ever - inexhaustible stock of sanity and wisdom obtaining aplenty in the epics, Puranas, Itihasas, Upavedas, Vedangas - the list is literally endless, Not to speak of the all- knowing Vedas and Upanishads themselves.

And however incredible it may sound to be to "enlightened " ears perched atop " sophisticated" shoulders, truth need not always be stranger than friction at least not necessarily. The secret of it all is that children, in this part of the world, are "caught young" to uphold these mighty, mind-blowing cultures. Didn't a Raja Rao learn the Upanishads at four? Even so, the present writer, Dr. Kolluru Narayana Rao Avadhani, to boot, began lisping Vedic Mantras at two! And that in the most

orthodoxical fashion conceivable. No wonder, this his seminal exegesis of the famed " Mahabharata" exudes at every step, in every nook and corner of the work, the ethos peculiar to Vedic cultural traditions. But alas!, we are brain-washed into taking a linear view of history that stubbornly refuses to view past accomplishments, be they ever so high, for what they are objectively worth. So, no " thing-in-itself" for us.

The author of this learned treatise, whom I know personally only too well, has, as is only to be expected, brought to bear upon the making of his thesis, an intimate knowledge of all that could possibly go into its own antithesis, and from on a higher platform, blended them integrally into that, "Universality" that alone ensures the reconciliation of opposites.

As a renunciate practicing detachment for quite some years now, such as perhaps would have pleased a Haldane of hallowed memory, I would suggest in all humility to mere lab confined अ–कार worshippers to at least desist from mocking at the fabulosity of it all, lest they should circumstantially be obliged to " stay and pray" at the end of the day! After all, there are " more things on earth and in heaven " than " are dreamt of in our philosophies" and while on the subject, which single text on earth, pray tell me- can help us access straight into the core of them " more things" than does the Mahabharata?

Kudos galore to the learned author for enriching the existing world of scholarship by yet another unique addition. Knowing the literature of the Andhra's as little as did Adam, I yet unhesitatingly congrat the writer for the significant insights he has into the cosmic invisible forces at work.

My blessings to Dr. Rao, in so far as they have any worth, that he move on with his life, with all its vicissitudes, and its umpteen uncertainties, its ruthless blows and kindly favors, taking them all In his savant- like strides to reach the grand Stasis-finale. That is the very consummation of all Vedic endeavors, call it "Santi" or what you will.

Om Tat Sat

Jeypore,(Odisha)
25th June 2021

Swamy ParamaPriyananda Sarasvati

Shivaya Gurave Namah Sri Matre Namah Sri Vishnurupaya Namassivaya

RUSHIPEETHAM CHARITABLE TRUST.(REGD)

Sri Lalita Dhamam,Plot No299/300, Phase-1 Saket Colony ECIL Post
SECBAD-500062. Email:samavedamshanmukhasharma@gmail.com
Ph:040-27132550. www.samavedam.org

SAMAVEDAM SHANMUKHA SARMA
Managing Trustee

అభినన్దనం

పంచమ వేదమైన 'మహాభారతం' శ్రీకృష్ణ ప్రధానమైన గ్రంధమే. ఆయన పరమాత్మ ధర్మస్య ప్రభురచ్యుత:. ఆప్రభుని ప్రేమపాత్రుడు ధర్మజుడు. ఆ పాత్ర యదార్ధ స్వరూపం వ్యాసభారతం స్పష్టంగా చూపిస్తోంది. మహానుభావులైన నన్నయ,తిక్కన,ఎఱ్ఱనలు తెలుగు భారతంలో ఎన్నో ఔచిత్యాలు చూపించారు. కాని సత్య స్వరూప ధర్మనైనికి మూల భారతమే ప్రమాణం.

ఈ గ్రంధకర్త శ్రీయుతులు కొల్లూరు నారాయణరావుగారు మంచి విషయాన్ని పరిశోధనాంశంగా ఎంచుకున్నారు. గ్రంధ పరిశీలనలేని వారు ధర్మజుని 'వృధనపరుని' గా భావించుకున్నారు. ఈ అవగాహనా రాహిత్యం, క్షుణ్ణంగా గ్రంధపరిశీలన చేస్తే తొలగుతుంది. మూల భారతం ప్రకారం 'ద్యూతంలో ధర్మజుడు ధనం ఒడ్డలేదు.' అన్నీ శకుని మాటనే పలుకబడ్డాయి. ద్రౌణి వధ విషయంలో కూడా అసత్యదోషంలేదు. కృష్ణాదేశం ఉన్నా, శంకభావంతో అన్న 'కుంజర:' ఆన్న మాట 'వంచన' దోషమయింది. ఆ ఒక్క చిన్న దోషం రధాన్ని నేలకి తొక్కించింది. ఈ ధర్మసూక్ష్మనగాహనకు కేవలాంధ్రభారత పరిశీలన సరిపోదు.

అందుకే శ్రీ నారాయణగారు ఎడనెడా మూలగ్రంధప్రస్తావన కూడా చేస్తూ 'శ్రీమదాంధ్ర మహాభారతము-ధర్మరాజ ప్రాతను' పరిశోధనా గ్రంధంగా వెలువరించారు. మూర్తీభవించిన ధర్మమే తానైన యుధిష్ఠిరుడు అధ్యయనం చేయవలసిన ప్రధాన పాత్ర. ఆపాత్ర చిత్రణను చూపించే ఈ గ్రంధం మొత్తం భారతాన్ని కూడా పరామర్శించే విధంగా ఉంది. రచయిత కృషి అభినన్దనీయం.

శ్రీకృష్ణ:శరణం మమ.

ప్లవ, ఆషాఢ బహుళ ద్వాదశి
హైదరాబాద్.

బుధజన విధేయుడు
సామవేదం షణ్ముఖ శర్మ

శ్రీయైనమ:

డా. తూలుగు ఢిల్లేశ్వరరావు, M.A, PhD
Reader.in.Telugu(Retd)Khallikote University,
BERHAMPUR, ODISHA

ధనుపురం,
Po,KORASAVADA Vai:PATAPTNAM
SRIKAKULAM(Dist)-AP

అభినందనం

'ధర్మమూలం జగత్సర్వం, ధర్మశ్చ శ్రుతిమూలక:
భారతం పంచమోవేద: శ్రుతిస్సర్వస్వ విస్తర:

'సమస్త లోకాలకుమూలమైన ధర్మానికి మూలం శ్రుతి. ఆ వేద సర్వస్వాన్ని వివరించి చెప్పుటచేత భారతమునకు పంచమవేదమని' ప్రశస్తి పొందినది. మహాభారతమొక విశ్వవిజ్ఞానకోశం. ' శ్రీమహాభారత సంహితయందులేనిది మరొకచోనెందును లేదనియు, లోకములోనున్నదంతయు శ్రీమహాభారత సంహితయందలిదే' అని శ్రీవేద వ్యాసుని ప్రతిజ్ఞ. సర్వాగమామ్నాయ సారభూతమగు శ్రీమహాభారత సంహితయందు సాక్షాన్నారాయణ స్వరూపుడైన వ్యాసమహర్షి ఒక్కొక్క విషయమును ఒక్కొక్క మంత్ర రూపమున ప్రకాశింపజేసి, అఖండ సచ్చిదానంద అద్వైత పరబ్రహ్మతత్వమును లెస్సగ ప్రతిపాదించుటచేత వేదత్వమన్వర్థకమై, లౌకికమున పంచమవేదముగా పసిద్ధిచెందినది. అందుచే మహర్షికల్పులగు కవిత్రయముచే తెనుగునకనువదింపబడిన మహాభారత విషయములన్నియు సార్వజనీనములు, సార్వత్రికములు మరియు సార్వకాలికములైయొప్పుచున్నవి.

శ్రీమన్మహాభారతమున కొన్నివందల పాత్రలప్రమేయముతో కథ నడుచినది.అందు పురుష పాత్రలలో ప్రధానముగ గుర్తించదగ్గట్టివి మూడు. మొదటిది శంతనుని పాత్ర. స్వచ్ఛంద మరణమును కామరునికి వరముగా నొసగినట్టి పాత్ర. రెండవది భీష్ముని పాత్ర. ఆజన్మ బ్రహ్మచర్యముతో వంశ శ్రేయమునకై, ధర్మరక్షణకై ఆత్మార్పణ గావించుకొనిన అనుపమాన చరితునిది. ఇక మూడవది ధర్మజపాత్ర. యదార్థ మానవ జీవితానికి వ్యదార్థ జీవన చిత్రముగా మలచబడి, అటు పురాణ పాత్రలలో యిటు మానవలోక చిత్రిత పాత్రలో నైన్యతోదర్శనమై, సశరీర స్వర్గ ప్రవేశమొనర్పబడిన మహోన్నతపాత్ర. శ్రీవేదవ్యాసుడు ఒకవిధముగ మహాభారత గాథలను మానవ జీవితములను లౌకిక భాగములనుండి మరల్చి జీవాత్మ పరమాత్మ తత్వవివరణ గావించి, ఆధ్యాత్మిక రహస్యములను స్పష్టపరచి బ్రహ్మానందమందుటకుపకరించు సాధనములుగ వర్ణించెను. మరొకవిధముగ భారతమంతయు మానవ జీవితమునే చిత్రించి చూపినదనవచ్చును.

అట్టి మహోదాత్తమైన ధర్మజపాత్రపై సిద్ధాంత వ్యాసమును పెలయించి, విద్యావారిధి(PhD)ని పొందిన, ఈ నాటికి పాతికేళ్ళ కావస్తున్న తరుణములో, దొనిని ముద్రించి ఆత్మీయ పాఠక లోకమునకు అందించ తలబెట్టిన చి: నారాయణరావు నాకత్యంత ఆప్తుడు, ఇష్టుడు, సఖుడు, గురుడు, బంధుడు మరియు శిష్యుడు. వేద కులమున బుట్టి, వేదశాస్త్రములనభ్యసించి, వైదిక ధర్మానుష్ఠానపరాయణుడై, లౌకిక విద్యా వ్యవహారములందు అభ్యస్త శిక్షితుడై, మాతాపితృ సంసేవనభాగ్యశాలిగా, సుహృద్గురు బంధుజన విధేయునిగ లబ్ధప్రతిష్టుడు.

చి: నారాయణరావు తన సిద్ధాంత వ్యాసం ధర్మజ పాత్ర చిత్రణలో అన్నదమ్ముల అసూయలు, బావమరుదుల బ్రుదుకు కోరుటలు, ఈర్ష్యపరుల దుశ్చేష్టలు, దొయాదుల కుట్రలు, వ్యసనపు మత్తులు, రాజకీయపు టెత్తులు, అధర్మ ప్రాబల్యము చివరగ ధర్మవిజయము యిత్యాదులెన్నో ఈ మహాగ్రంథములో 'వ్యక్తి' గతములై అభివ్యక్తమగుచున్నవి.

ఈ ధర్మజపాత్ర చిత్రణము మానవుని సర్వతోముఖ జీవిత చరిత్రమునకొక మహావ్యాఖ్యగా నిలచినదని చెప్పవచ్చును. ముఖ్యముగ ఈ వ్యాసమందలి శాంత్యనుశాసనిక పర్వములందలి భీష్ముని ధర్మోపదేశములు, ధర్మజుని ధర్మనిష్ఠ వన్నెచెక్కినవి. ఇందలి సన్నివేశములు, సాధారణ మానవ ధర్మములన్నియు ఒక్క ధర్మజునిదే కాక, మన జీవిత గాధలతో పెనవైచుకొని, కానరాని విచిత్రమైన ఒక 'ఆత్మీయత' మనలనందరిని కవిపోయుట మనందరకు అనుభవైకయోగ్యమగును.ఈ రచయిత చేతిలో ధర్మజుని పాత్ర చిత్రణము, ప్రవర్తనా సరళి, మన సామాన్య మానవ జీవన విధాన సరణిగా అందుబాటులోకి, అవగాహనకు వచ్చినదనుటలో యెట్టి అతిశయోక్తిగానము.

సంస్కృతాంధ్ర మహాభారతాలను రెంటిని సమూలముగా పరిశీలించి, పరిశోధించి ధర్మజపాత్ర ప్రాభవాన్ని, ఔన్నత్యాన్ని, ప్రత్యేక గుణగణాదులను సోపపత్తికముగా నిరూపించుటలో చి: నారాయణరావు కృతకృత్యుడైనాడనుటలోయెట్టి సందియమునులేదు. ఆ భాషాయోషా సాహచర్యములో సాహితీ సుమాలనెన్నింటినో పెలయిస్తు, పెలుగులు విరజిమ్ముతు పేయేళ్ళు వర్ధిల్లాలని చి: నారాయణరావును మన:స్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను.

ఇతిశం,

మంగళాని భవన్తు

క్యాంప్: హైదరాబాద్ మీ

ప్లవ, జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి ధీల్లేశ్వర రావు

Dr. Turlapati Rajeswari
M.A.Ph.D., OES (I)
Reader in Telugu (Retd.)
Writer & Translator

Flat No. 405, 3rd Floor, Rajarani Sarovor Apts.
Opp. Sastri Nagar, 3rd lane
Berhampur-760002, Dist. Ganjam, Odisha
Mob. : 8093520819, 9078743851

ధర్మరాజుకొక కప్పురప్పు విడెము

మహాభారతమందలి ధర్మజ పాత్ర చిత్రణము అనే ఈ సిద్ధాంత వ్యాస గ్రంధం శ్రీ కొల్లూరు నారాయణరావ్ప బ్రహ్మప్పరం విశ్వవిద్యాలయానికి పి.హెచ్.డి. పట్టాకు సమర్పించిన సిద్ధాంత వ్యాసం. వారు ఈ పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు.

సంస్కృతంలో వేదవ్యాసుడు రచించిన మహాభారతం ఒక కాలానికి, ఒక ప్రదేశానికి పరిమితం కాకుండా సర్వకాలాల్లో, సర్వ దేశాలలో నివసించే మానవ్పల హ్పదయోద్వేగాలను అక్షర రూపంగా వ్పక్తీకరించింది. ఈ విశ్వజనీనత లక్షణం వల్లనే వివిధ భారతీయ భాషల్లోకి అనూదితమై స్వతంత్ర కావ్పంలాగా ఆయా భాషా శిల్పుల హస్తాలలో రూప్ప దిద్దుకుని భారతీయాత్మని సంవేదనా భరితమొనర్చింది. మొదట్లో 'జయ' గా పిలువబడి, తరువాత 'శత సహస్రి సంహిత' గా ప్రసిద్ధమైన ఈ గ్రంధం పలుదేశాలకి వ్యాప్తి చెందింది. అటువంటి ఈ గ్రంధం శ్రీ కొల్లూరు నారాయణరావ్పని ఆకర్షించడంలో విశేషమేమీ లేదు. ఆయన పండితుడు. నిత్య అధ్యయన శీలి.

సిద్ధాంత వ్యాసంలో పలుచోట్ల నాటి సమాజం గురించి కొల్లూరు నారాయణరావ్ప వ్యాఖ్యానించటం గమనార్హం. ద్రౌపదీ వివాహ సందర్భంలో కొల్లూరు నారాయణరావ్ప చేసిన వ్యాఖ్యకు నేను చిన్న వివరణ పొందు పరుస్తున్నాను.

"ద్రౌపది అర్జునునితో పాటు మిగిలిన నలుగురిని వివాహమాడుటకు సిద్ధపడుట నేటికిని సమాధానము దొరకని ప్రశ్న"

మహాభారత కధాకాలం వైదిక సంస్కృతి చివరిదశ. డా. శ్రీమతి ఇరావతీ కార్వే భారతీయ కుటుంబ వ్పవస్థ పరిణామం అనే వ్యాసంలో, నాడు హిమాలయ పర్వత ప్రాంతం జొన్సా, బేవార్‌కి మధ్య ప్రాంతంలో ఉన్న ఉమ్మడి పితృస్వామ్య కుటుంబ వ్పవస్థ గురించి వివరించారు. కుటుంబంలో పెద్దన్న కుటుంబంలో పెద్దగా వ్పవహరించబడతాడు. పెద్దన్న భార్య తక్కిన సోదరులకూ భార్య అవ్పతుంది. భూమి అందరిదీ. పంపకాలు జరగవ్ప. వీరు క్షత్రియులమని చెప్పుకుంటారు. ఈ వ్యాసం "The cultural heritage of India, Vol-II, page-536" (The Indian Social Organization- An Anthropological Survey) లో చూడవచ్చు. అంటే బహుపతీ పద్ధతి నాడు హిమాలయ పర్వతాల దిగువ ప్రాంతాలలో ఉన్నదని డా. ఇరావతీ కార్వే తన పరిశోధనలో వెల్లడించారు. బహుపతీ పద్ధతి హిమాలయాలలోని గడివాల్ భాగంలో 20వ శతాబ్ధిలో కూడా కొనసాగుతూ వస్తోందని మహాభారతాన్ని కన్నడ భాషలో "పర్వ" గా నవలా రూపంలో వెలువరించిన రచయిత ఎస్.ఎల్. భైరప్ప తెలిపారు. కుటుంబంలో అందరూ కలిసికట్టుగా ఉండాలనే రాజకుటుంబాలలో లేని ఈ బహుపతీ పద్ధతిని కుంతి తన కుటుంబంలో ప్రవేశపెట్టిందని మహాభారతాన్ని చారిత్రక గాధగా చూస్తున్న మనకు అర్ధమౌతుంది.

వేదవ్యాసుడు రచించిన సంస్కృత మహాభారతాన్ని, కవిత్రయము వారు రచించిన తెలుగు భారతాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేసి ధర్మరాజు పాత్రను శ్రీకొల్లూరు నారాయణరావ్ప విశ్లేషించారు. సిద్ధాంత వ్యాసంలో అడుగడుగునా శ్రీకొల్లూరు నారాయణరావ్ప అధ్యయనం, విశ్లేషణాశక్తి ప్రస్ఫుటమౌతున్నది. ఈ సిద్ధాంత వ్యాసం గ్రంధ రూపంలో వెలువడుతున్నందుకు సంతోషం. చి.డా. నారాయణరావ్పగారికి శుభాశీస్సులు.

ప్లవ, శ్రావణ ప్రతిపది

తుర్లపాటి రాజేశ్వరి

ఆత్మీయ నమస్సుమనస్సులు

ఈ కృతి ముద్రణకు పారిదికముగా, ఆర్థికముగా సహాయ సహకారములందించిన మా ఆబాల్య మిత్రులు, సహాధ్యాయులైన మా మేనకోడలు శ్రీమతి&శ్రీ దూర్వాసుల శేషులత, సంపత్ శ్రీనివాసు (USA) దంపతులకు, శ్రీమతి&శ్రీ శాంతి జ్యోతి, కామేశ్వరరావ్ప దంపతులకు, మా గురుప్పత్రుడు, బాల్యమిత్రుడు విశేషించి మా ప్రియశిష్యుడైన శ్రీమతి&శ్రీ రమా శ్రీకాంత్ దంపతులకు స్నేహార్ధపూర్వక అభినందన పురస్సర ఆశీఃపరంపరలు.

అంతముకాదు బంధం, అనంతమైన బాధలోకూడ మనమిరువ్పరమొకటేనని, నిరూపించుచు తన వదాన్యతను చాటిన మహౌదాత్తమానసులు మా వియ్యంకులు శ్రీమతి&శ్రీ పప్పు సూర్య గాయత్రి, రామ సుబ్రహ్మణ్యం దంపతులకు ఆత్మీయ నమస్సుమనస్సులు.

విషయానుక్రమణిక

క్రమసంఖ్య	విషయము	పుటలు	గుణ విశేష సాంకేతిక క్రమసంఖ్యలు
1.	తొలిపలుకు	1-4	-
2.	మహాభారత విశేషములు - వ్యాసభగవానుని లక్ష్యం	5-6	-
3.	మహాభారత పాత్రలు- ప్రత్యేకత	7-9	-
4.	(ఆది పంచకము) ఆదిపర్వము - ధర్మజపాత్ర	10-2	31-25
5 .	సభాపర్వము - ధర్మజపాత్ర	24-41	26-41
6.	అరణ్యపర్వము - ధర్మజపాత్ర	42-52	42-54
7.	విరాటపర్వము - ధర్మజపాత్ర	53-61	55-64
8.	ఉద్యోగపర్వము - ధర్మజపాత్ర	62-94	65-100
9.	(యుద్ధ షట్కము) భీష్మపర్వము - ధర్మజపాత్ర	95-103	101-113
10.	ద్రోణపర్వము - ధర్మజపాత్ర	104-115	114-123
11.	కర్ణపర్వము - ధర్మజపాత్ర	116-123	124-134
12.	శల్యపర్వము - ధర్మజపాత్ర	124-131	135-142
13.	సౌప్తికపర్వము - ధర్మజపాత్ర	132-135	143-146
14.	స్త్రీపర్వము - ధర్మజపాత్ర	136-139	147-151
15.	(శాంతి సప్తకము)శాంతిపర్వము - ధర్మజపాత్ర	140-158	152-172
16.	అనుశాసనికపర్వము - ధర్మజపాత్ర	159-178	173-189
17.	అశ్వమేధపర్వము - ధర్మజపాత్ర	179-184	190-195
18.	ఆశ్రమవాసపర్వము - ధర్మజపాత్ర	185-193	196-204
19.	మౌసలపర్వము - ధర్మజపాత్ర	194-196	--- ---
20.	మహాప్రస్థానికపర్వము - ధర్మజపాత్ర	197-201	205-209
21.	స్వర్గారోహణపర్వము - ధర్మజపాత్ర	202-204	210-213
22.	మలిపలుకు	205	
23.	గంథసూచిక(ఉపయుక్తగ్రంథములు)	206	

తొలిపలుకు

మహాభారతమున పెద్దకథ యున్నది. ధర్మశాస్త్రమున్నది. సమాజమున్నది. మానవ బలహీనతలు, మనోవిశ్లేషణము గలదు. సంప్రదాయములును, సంస్కారములును గలవు. చివరగ సమస్తబోధల గమ్యమైన సత్యదర్శన వివరణమున్నది. భారత పాత్రలను పరిశీలింపవలసిన విధానమునుగూర్చి స్థలాంతరమున వివరించి యుంటిని. ఇచట ప్రకృతమునకు పరిమితముగ తెలుపుదును. మహాభారతమున ఏ పాత్రను గ్రహించినను పైనపేర్కొనిన ఆరుగుణములను సమన్వయించుకొనుమ. తన నడవడిక రూపమున సమాజమునకొక సందేశమిచ్చును. ఇక ధర్మజపాత్రము, శ్రీకృష్ణుని తరువాత ధర్మరాజు మహాభారత కథానాయకుడుగ చెప్పబడుచున్నాడు. తెలుగువారిలో భారతకథ తెలియనివారు, ముఖ్యముగ సాహిత్య విద్యార్థులలో ధర్మజుని పాత్రనుగూర్చి ఏవియోకొన్ని ఊహలను ఏర్పరచుకొని ఉండనివాడు లేడని చెప్ప వచ్చును. కాని ఇందే ఒక్కనిని నిండుగ తప్పనికాని లేక ఒప్పనిగాని నిర్ధారించి చెప్పజాలము. ధర్మజపాత్ర విశేషమట్టిది. తెలుగుదేశమున ఆంధ్రమహాభారతముపై చిన్నచిన్న వ్యాసములు, గ్రంథములు రూపమునగూడ వ్యాఖ్యాన ప్రాయములైన రచనములు వెలువడినవి. కాని ఒక్కొక్క పాత్రనే గ్రహించి పదునెనిమిది పర్వముల ఆద్యంతము ఆ పాత్రను నిశితముగ పరిశీలించి వ్రాసిన గ్రంథములు లేవనుట సాహసము కాదు.

డా. జయంతి వెంకట సూర్యనారాయణగారు ఆచార్య లకంసాని చక్రధర రావుగారి పర్యవేక్షణములో ధర్మజపాత్రచిత్రణముపై ఆంధ్రవిశ్వవిద్యాలయమున పరిశోధన గావించి పి.హెచ్.డి.(PhD) పట్టమునందిరి. ఆ గ్రంథమును నేను చూచితిని. ఇందు ధర్మజుని కొన్ని ప్రధాన గుణ విశేషములను గ్రహించి సోదాహరణముగ నిరూపించుట జరిగినది. బహుశః ధర్మజపాత్రపై ఇది తొలిసిద్ధాంత వ్యాసమని నేను భావింతును. (ఇతరములు ఏమైననున్నచో నాదృష్టికి రాలేదు)

కథ వివరించుట లక్ష్యము కాకపోయినను ధర్మజ ప్రసక్తముగల సందర్భములన్నింటిని ప్రదర్శించిననే కాని ఊచముట్టుగ ఆ పాత్ర హృదయమును వివరించుట వీలుపడదని ధర్మజగుణ వివరణమునకవకాశమిచ్చు కథా భాగమునెల్ల ఒకచో క్రోడీకరించితిని. ఆయాఘట్టములనుబట్టి ధర్మసూక్ష్మ కారణముగ, సంప్రదాయములు, సంస్కారములు కారణముగ, మానవ మనోబలహీనతలకారణముగ, ఆయా కథాభాగములకు (ఆయాసందర్భములకు) క్రమసంఖ్యలను లెక్కించుచు వచ్చితిని. పదునెనిమిది పర్వములు కథాభాగము దరిదాపు రెండువందల (200) పైన గుణవిశేష సందర్భములుగ వివరించితిని.

ఆయా సందర్భములనుబట్టి ధర్మజునియందు స్థూలముగ క్రింది గుణ విశేషములను చూడగలము. వైరాగ్యము, మోక్షదృష్టి, ధర్మము, సత్యము, కురుకులవిభుత్వము, ప్రజారంజకత్వము, చారచక్షుస్త్వము, ఆశ్రిత పక్షపాతము, భ్రాతృవాత్సల్యము, లౌక్యము, గురుభక్తి, కృష్ణభక్తి, వాఙ్నైపుణ్యము, వివేకము, దూరదృష్టి, క్షాత్రము, ఓర్పు, వంశగౌరవమునకై ప్రాకులాడుట, సోదరులపట్ల సమతాదృష్టి, రాజనీతిజ్ఞత, పరేంగితావగాహనత్వము, ఇత్యాది గుణవిశేషములు కాన్పించును. నిజమునకు ఇందనేక గుణములు పలువురు పురాణ పురుషములలో కాన్పించును. కాని ఆయాగుణముల విశేషములు, సందర్భమునుబట్టి పాత్రను, ఇతర పాత్రలయెదుట ఉన్నతునిగ భాసింపజేయును. కనుకనే క్రమపద్ధతిలో కథావివరణము అవసరమైనది. అటులనే సందర్భములతోపాటు, వ్యక్తులనుబట్టియు, అవసరములనుబట్టియు, స్థానమును బట్టియు, ధర్మజునుద్దేశించి

చెప్పబడిన మాటలలోని ఔన్నత్యమును పరిశీలింపవలసియున్నది. కథయందు సందర్భోచితముగ ఆయా పాత్రలు ధర్మజునిపట్లవాడిన ఒండు, రెండు ప్రశంసావిశేషములటులుండగ కొన్ని తావులను ప్రధానపాత్రలు ధర్మజుని సుదీర్ఘముగ ప్రశంసించుట గలదు. ఇట్టి వానిలో కొన్ని క్రింద పేర్కొనెదను.

1. వ్యాసకృత ధర్మజప్రశంస, **2.** యక్షుని ప్రశంస, **3.** ధౌమ్యకృత ప్రశంస, **4.** అర్జునకృత ప్రశంస, **5.** ద్రౌపది ప్రశంస, **6.** భీష్మకృత ప్రశంస, **7.** పలుసందర్భముల శ్రీకృష్ణ ప్రశంస, **8.** ధృతరాష్ట్రకృత ప్రశంస, **9.** యమధర్మరాజకృత ప్రశంస, **10.** నారదకృత ప్రశంస, **11.**ఇంద్రకృత ప్రశంస. ఇట్టి ప్రశంసలలో దివ్యులు, నారదాది మహర్షులు, శ్రీకృష్ణుడు అవసరమును బట్టిగాని, ముఖస్తుతికైగాని ప్రశంసించునట్టివారు కాదు. ఇట్టి వానిని గ్రహింపవలసి యున్నది.

ఇంతవరకు ధర్మజ గుణములు గ్రహించుట కొంత సులభము. కాని వ్యాసభగవానుడు సూక్ష్మముగ పరిశీలించినది, మానవ జీవితమును, వాని బలహీనతలను. సందేశమీయదలచినదికూడ సామాన్య మానవకోటి నుద్దేశించి మాత్రమే. అట్టి బలహీనతలు అల్పునిలో ప్రదర్శించినచో, అవి పాఠకుని దృష్టిలో నిలబడవు. పాఠక సంస్కారమునకు పెద్దగ ఉపయుక్తములు కాజాలవు. కాని మహోన్నత సంస్కారునిగ, ధర్మజ్ఞునిగ, వివేకిగ, లోకజ్ఞునిగ, మనమెప్పు పొందజాలినవానిలో ఒకబలహీనత చూచినప్పుడు 'కాలోఽపి దురతి క్రమః' అనియో మనోబలహీనతా ప్రభావతీవ్రత యిట్టిదనియో ఎంతవానికైనను అధఃపాతాళమున కీడ్చుటకు ఒక్కొక్క బలహీనత యెంతగా ప్రభావము చూపునోకదాయనియో మనచే భావింపజేయును. ఇట్టి బలహీనతలు ధర్మజునియందుకూడ ప్రదర్శింపబడినవి. అట్లని ఆ బలహీనతలవలన ధర్మజుని ఔన్నత్యము మాసిపోదు. మానవుని, మానవునిగ చిత్రించుటయందలి సహజత్వమును రెండింటినికూడ సమాంతరముగ పరిశీలించి, ఆపాత్రను మనము ప్రశంసించు దుమేకాని తూలనాడము. ఈ దృష్టితోడనే ధర్మజపాత్రను పరిశీలించితిని. ఒక ఉన్నత పాత్రలో ఒకపెద్ద బలహీనతను వివరించవలసివచ్చునెడ భావస్పష్టతకై మోమోటములేకుండ ఆ లోపమును వివరించితిని. అటుల వివరించుట అన్యతః ఆపాత్రపొందిన ఔన్నత్యములను కాదనుటమాత్రము కాదు.ఇచటనింకొక విషయముకూడ వివరింపవలసి యున్నది.

శ్రీరాముని పేరు వినినంతనే అసంకల్పితముగనే చేతులు జోడింతుము. కారణము అతడు సాక్షాత్తు నారాయణుడని బాలకాండమున వాల్మీకి చెప్పిన మాటలు భారతీయుల హృదయమున నిలిచిపోయినవి. అంతియేకాదు మన దృష్టిలో పరమేశ్వరుడైనవాడు కావించిన ప్రతిచేష్టయు, ధర్మబద్ధమో లేక లీలయో అనిపించును. కాని మానవప్రవర్తనమునుమాత్రము మానవ వివేకముచేతనే గుర్తింతుము. ధర్మశాస్త్రములను నేలవిడిచి సాముగా అన్వయింపజాలము. ధర్మ నిర్వచనము కష్టసాధ్యమేయైనను సమాజకళ్యాణకారకరమైన సంస్కారముగ మాత్రము భావింతుము. ఎందైనను విరుద్ధ ప్రవర్తనము సమాజ శ్రేయమును సాధించినచో అచట ఆ ప్రవర్తనమునకు ప్రత్యేక గుర్తింపునిత్తుము. "వారిజార్థులందు వైవాహికములందు..." వంటి పద్యములు మనకు పరిచితములే. అచటనైనను ఆపద తొలగద్రోయువరకేగాని, యాపై లాభార్జనకు ధర్మశాస్త్రమంగీకరింపదు. కనుక మానవుడైన ధర్మజుని ప్రవర్తనమునుకూడా ఈ దృష్టితోనే విమర్శకులు చూచుట సహజము. అట్టితరి అనూచానముగ ధర్మజునిగూర్చి వినుచున్న ప్రశంసలకు భంగము వాటిల్లునేమోయని క్రుంగిపోవు విమర్శక వర్గము లేకపోలేదు.

ఎటులైనను మోకాలికి బట్టతలకు ముడివేయవలెనని వారు ప్రయత్నింతురు. అట్టితరి విమర్శ విమర్శగకాక భక్తివిశ్వాస ప్రకటనముగ మారును. కొన్నిచోటుల మనకు సమాధానము దొరకక పోవచ్చును. భవిష్యమున మరింత లోతుగ వ్యాసహృదయమునుగ్రహించిన విమర్శకులు సత్యమును వెలికితెత్తురుగాక!. కాని, ప్రకృతమున మాత్రము విమర్శ సతార్కికముగమాత్రమే నడుపవలయును. ఇట్టి సందర్భములపట్ల ధర్మజపాత్ర విషయమై నా యూహలను స్పష్టముగ తెలుపుటకే ప్రయత్నించితిని కాని, వ్యాప్తినందిన సాధారణాభిప్రాయసమర్థమునకై ప్రాకులాడలేదు. ముఖ్యముగ ధర్మజుని ద్యూతవ్యవసనము, వాని ఔన్నత్యము ప్రక్కన, సదాదర్శనమిచ్చు మచ్చగనే కాన్పించును. తండ్రిమాటకాదనలేక జూదమునకు సిద్ధపడినను, ఒడ్డెడి పణముల విషయమై పితృ శాసనము లేదుకదా! అటులనే ద్రోణవధకై ధర్మజుడు పల్కిన అసత్యము కూడ విమర్శనీయముగ తోచినను సమస్తపాండవ సైన్యమునాశమై, దుర్యోధన విజయావకాశమై, ఫలితముగ ధర్మనాశము సంభవింపనున్న తరుణమున ధర్మజుని అనృతము, ధర్మకల్యాణ కారణమని సమర్థించుటకైన అవకాశము కాన్పించుచున్నది. కాని అంతవరకు భూమికి నాలుగు అంగుళములు పైననిలిచిన ధర్మజునిరథము నేలకుతాకినదని చెప్పుచు వ్యాసభగవానుడే అసత్యదోషఫలితమును వివరించుట గమనార్హము. సారాంశమేమన ధర్మజుని నడవడికయందలి ప్రత్యంశమునుగ్రహించి లౌకికదృష్టితోడనే విమర్శింప ప్రయత్నించితిని. విధిచోదితముగ మూలకారుడు చెప్పినచోటుల ఆవిషయమునుకూడ వివరించితిని. శాంతి, అనుశాసనిక పర్వముల విషయమై ఒకమాట చెప్పవలసి యున్నది. ఈ పర్వములు సుదీర్ఘముగనే నడచినను యిందు మహాభారత కథావిషయము నామమాత్రము. ధర్మజుని శ్రోతగ నిడుకొని ప్రధానముగ భీష్ముడు ధర్మోపదేశములు కావించుటే యిందలి ప్రధాన విషయము. ధర్మసూక్ష్మ వివరణముకైన కథలనేకములు నడచినను, అవి చదువువేళ ఏపురాణమో చదువుచున్నటులనిపించునేకాని భారతకథా భాగమని అనిపింపదు. అయినను భారతమున వస్తైక్యముకలదని శాంతిపంచకములేనిది మహాభారతము పరిపూర్ణము కాజాలదనియు విమర్శకులు ఏనాడో తీర్మానించి యున్నారు.

సార్వకాలిక మానవ సమాజమునుద్దేశించి భీష్ముఖమున వ్యాసుడు తెల్పిన నీతికథలవలే శాంతి, అనుశాసనికములు స్థూలదృష్టికి గోచరించినను, అందు ధర్మజుని ఏలుబడికాలమున, ధర్మరాజు నడుపవలసిన పాలనావిధానమిటులుండవలెనని ధ్వనిగా భీష్మునిచే భావింపబడినటుల మనము భావింపవలయును. అందుచే పై రెండు పర్వములందలి నీతిబోధలైన కథలను, దర్మశాస్త్ర విషయములను సంక్షిప్తముగ క్రోడీకరించి, అప్పటికి గతించిన భారతకథయందు, ఏ అవసరము భీష్మునిచే ఈ కథను చెప్పించినదో యూహించి వివరించుటకు ప్రయత్నించితిని. ఇందు వలన భీష్మోక్తమైన ధర్మశాస్త్ర విషయములెల్ల దృష్టినిడుకొని ధర్మజుడు రాజ్యపాలన కావించెనను విషయము స్థిరపడుటయు, ఫలితముగ ఆ నైతికసంస్కారముకూడ ధర్మజుని శీలమేయని గ్రహించినటులగును.

సంస్కృతమున భారతముపై నీలకంఠీయమే ప్రసిద్ధ వ్యాఖ్యానము. తెనుగున లఘువిమర్శలే తప్ప మహాభారతమున ప్రత్యంశమును వ్యాఖ్యానించిన బృహద్గ్రంథములు నా దృష్టికి రాలేదు. అయినను ముదిగొండ్ల నరసింహావధానిగారు రచించిన మహాభారత సారోద్ధారము పలువురు విమర్శకులమెప్పునందినట్టిది. ఆ గ్రంథమును కూడ పరిశీలించితిని. వ్యాస వాక్యములేకాక అన్యగ్రంథములందలి భారతకథను వివరించుట అవధానిగారికి పరిపాటి. అయినను ప్రామాణిక వాజ్యములనుమాత్రమే గ్రహించువారగుటచే అవసరమగుచోటుల భారతసారోద్ధార వాక్యములను గూడ ఉద్ధరించి చూపితిని.

ఇక చివరిగ ఒకమాటచెప్పుట బాధ్యతనుండి తప్పించుకొనుటకు మాత్రము కాదని గమనింప ప్రార్థన. నేనున్నది ఉత్కళ రాష్ట్రము. ఇచట ప్రసిద్ధమైన గ్రంథాలయములందు వలసిన తెలుగు గ్రంథములు లభింపవు. అసలు గ్రంథములే లభింపనప్పుడు, వానిపై వెలువడిన విమర్శనా గ్రంథములుండవని వేరే చెప్పబనిలేదు.

మహాభారతముపై ఏమి చెప్పదలచినను మూలమును పరికించిన తరువాతనే చెప్పుట న్యాయము. అనేక భాషలలో మూలమున ప్రతి శ్లోకమునకు ప్రాంతీయ భాషాతాత్పర్యముతో గ్రంథములు వెలువడినవి. కాని తెనుగున అట్టిగ్రంథములు వచ్చిన జాడలేదు. పండితులకు మూలగ్రంథపఠనము పూర్ణ ప్రయోజనమును కలిగించునేమోకాని నాబోటి విద్యార్థికి ప్రతిపద వ్యాఖ్యానములేనిచో వ్యాసహృదయము నిండుగా హృదయమున కందినదని చెప్పజాలను. పంచమవేదమై అల్పాక్షరముల అనల్పార్థరచనముగ వెలువడిన వ్యాసభారతమునందలి శబ్దప్రయోగములు కేవలతాత్పర్యరూపమున గ్రహింపజాలము. అయినను అవకాశమున్నంతమేర మూల భావమును గ్రహించుటకు ప్రయత్నించి తులనాత్మకముగ తెనుగు ధర్మరాజును గ్రహించుటకు ప్రయత్నించితిని.

ఒక్క విషయము పండితులకే చిక్కనట్టిది. మూడువేల సంవత్సరములనాటి చరిత్ర నేడు మనకు లభింపదు. అప్పటి ధర్మశాస్త్రములలోనెన్ని కాలగర్భమున కలసిపోయినవో తెలియదు. వేదతుల్యమైన మహాభారతము సమకాలీన ప్రామాణిక ధర్మశాస్త్రములను దృష్టినిడుకొనికూడ పాత్రచిత్రణ మొనర్చియుండును.

ఆ శాస్త్రములు లభింపనప్పుడు, ఆ పాత్రలలో నేడు వెలితి కనిపించుట సహజము. భర్త అనుమతిచే (తప్పనిసరి పరిస్థితి)వంశరక్షణమునకై స్త్రీ నియోగపద్ధతిలో సంతానమునందుట ఒకనాటి ధార్మిక విషయముగనె పూర్వ గ్రంథములందు కన్పట్టుచున్నది.

ఇక సాధారణ విషయములుకూడ అనేకములిట్టివిగలవు. మానవ సమాజరక్షణకు, వారు విశ్వసించిన పునర్జన్మరాహిత్యాది ప్రయోజనసాధకమైన సంస్కృతీపరిరక్షణకు అవసరము, అనుగుణమునైన ధర్మశాస్త్రములు అనాడు కొన్ని యుండియుండును. కనుకనే ఆధునిక దృష్టికి విరుద్ధముగ కాన్పించు సంఘటనలపట్ల ధర్మమూర్తులుగ చెప్పబడిన భీష్మాదులు మౌనము రూపమున అంగీకారము తెలిపినటుల కాన్పించును. సారాంశమేమన ఏ గ్రంథమైనను కొంతవరకైన ఆనాటి చారిత్రక ప్రభావము పొంది యుండకతప్పదు. అనంతరకాలమున అట్టి కథాభాగములపై విమర్శకులు ఎవరికి తోచిన ఊహలు వారొసంగుటేతప్ప ఇదియవాస్తవమని చెప్పగలుగుట సాహసమగును. ఇట్టి పరిమితులకులోనై కవిత్రయ భారతము అవసరమగుచోట వివరించుటకు ప్రయత్నించితిని.

==========

మహాభారత విశేషములు – వ్యాసభగవానుని లక్ష్యము

శ్రీమన్నారాయణ సంకల్పితమైన ఈ సృష్టిలో ఎప్పటినుండి మానవజాతి యున్నదనునది సమాధానము లేని ప్రశ్న. అటులనే గుంపులు, గుంపులుగ తిరుగుచు ఆత్మరక్షణముతో జాతి ఉనికిని నిలుపుకొను స్థితినుండి మానవ సమూహము, ఎప్పటినుండి సమాజస్థితికి ఎదిగినదోకూడ ఇదమిత్థముగ చెప్పజాలము. చరిత్రకందని కాలమునాడే భారతదేశమున ధర్మసూక్ష్మత ఇత్యాదులను విపులీకరించవలసిన బాధ్యత భారతము గ్రహించినది. వేదవిభాగమొనర్చి, అష్టాదశ పురాణములనురచించి తత్వమును, ధర్మమును అంతదనుక క్రమపద్ధతిలో బోధించిన మనిషియె మహాభారత రచనమునుకూడ చేపట్టుటచే పైవివరింపబడిన లక్ష్యసాధనము మహాభారతమునకు నల్లేరుపై బండియైనది. వ్యాసుడు వైదిక సాహిత్యమును ఆపోశనపట్టిన వాడగుటచే వానికి భారతరచనము తేలికయేయైనను కాలక్రమమున సామాన్యులకు, పురాణరూపమైన భారతముకూడ అవగాహనకందనట్టిదియె అయినది. ఫలితముగ "కృష్ణ ద్వైపాయనమని వ్యషభాభిహిత మహాభారత బద్ధ నిరూఢితార్థ మేర్పడుటకై" మహాభారతము తెనుగున కనువదింపబడినది. అదృష్టవశమున అనువాదకులుకూడ వ్యాస సదృశులుగ చెప్ప దగుదురో? లేదో? కాని వారినికి మహర్షులనుటకెట్టి యభ్యంతరమునుండబోదని భావింతును. అందు నన్నయ నిత్యసత్యవచనుడు, మత్యమరాధిపాచార్యుడు, సుజనుడు, బ్రహ్మండాది నానా పురాణవేత్త, లోకజ్ఞుడు, ఉభయ భాషాకోవిదుడును. తిక్కయజ్వయనువాఁ డొక్కఁడియె తిక్కన విశేషమును చాటిచెప్పుచున్నది. శిల్పపారగత్వమును చెప్పుకొని, అహంకరించెడి స్థితినుండి, హరిహరాద్వైతస్థితికి ఎదిగిన పిదప తిక్కన మహాభారతమును చేపట్టినాడు. ఎఱ్ఱన శంభుదాసుడై పై కవిద్వయము వారి అడుగుజాడలలో నడచి నట్టినాడు. **నన్నయ్య భారతమునుగూర్చి యిటుల చెప్పికొనినాడు**

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులువేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులుమహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని, యైతిహసికులితిహాసమనియు
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ, యంబని మహిగొనయాడుచుండ

ఆ. వివిధవేదతత్వవేది వేదవ్యాసు, డాదిమునిపరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై, పరగుచుండజేసెభారతంబు –ఆది ప్రథమ–31

పైన చెప్పిన నన్నయ మాటలలో అతిశయోక్తి లేకపోవుటయేకాక, నన్నయ మిక్కిలి సంక్షిప్తముగ చెప్పినాడనవచ్చును. భగవద్గీతను నిక్షిప్తపరచుకొన్న మహాభారతము వేదాంత గ్రంథమని చెప్పుట సామాన్యమే! శాంతిపంచకమును ధర్మశాస్త్రమని, నీతిశాస్త్రమని చెప్పుటతిశయోక్తి కాజాలదు. నానారసాభ్యుదయో ల్లసిగ తిక్కనచే శ్లాఘింపబడిన మహాభారతము మహాకావ్యమని సాధారణ విమర్శకులు చెప్పబనిలేదు. ఏనాడు సత్యవచనుడైన నన్నయనోటినుండి లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమన్నమాట వెలువడినదోకాని, నేటిదనుక లాక్షణికులకు మహాభారతమే తొలి ప్రమాణ గ్రంథముగ భాసిల్లుచున్నది. ఇక ఇందలి విశిష్ట విశేషములను ఒండు రెండు పేర్కొందును.

మహాభారతమునందలి కథారంభము చిత్రమైనట్టిది. భూభారమును హరించుటకై శ్రీహరి మహాభారత కథా సృష్టికర్తయైనాడు. కొందరు దేవతలు, కొందరు రాక్షసులు తమతమ అంశములతో నేలకుదిగి యుద్ధమును కల్పించుకొని, తన్మిషతో భూమిపై దుష్టనాశనమొనర్చినట్టివారైరి. అనగా మహాభారతమున ఏ పాత్ర యెటుల ప్రవర్తించినను, తత్సర్వమును నారాయణ సంకల్పముగనె భావింపవలసియున్నది. అట్లగుచో గురజాడవారు "కన్యాశుల్కము"న చెప్పినటుల పురుషకారమునకెట్టి ప్రయోజనము లేదనగలమా! అట్టియూహను ఏ వైదిక

గ్రంథమును అంగీకరింపదు. పూర్వజన్మకృత కర్మల కారణముగ ఏర్పడిన వాసనల ఫలితముగ, తరువాతి జన్మమునెత్తవలసియున్నదనియు, అచటగూడ వాని కర్మములు, గతవాసనలను తొలగించుకొనక, మరికొన్ని చేర్చుకొనిననచో "పునరపిజననం పునరపిమరణమ్" అను భజగోవిందసూక్తి వర్తిల్లును. సారాంశమేమన వివేకమొసంగబడిన మానవుడు తన ప్రవర్తనమునకు బాధ్యతవహింపక తప్పదు. భారతమునకూడ శిశుపాలాదుల జన్మములట్టివియే కదా! నాళాయనిర్మైన ద్రౌపది జన్మముగూడ అట్టిదియె. ఇంకను పలుపాత్రములు తమ వాసనలు కారణముగ జన్మములెత్తినటుల భారతము చెప్పుచున్నది.

దైవయత్నము, పురుషకారమను విషయములు పైన వివరింతము. అట్లని కేవల తత్వబోధనము భారత లక్ష్యముకాదు. మానవుడు శతసంవత్సరములు జీవించి, సర్వభోగములననుభవింప వలయుననియే మహర్షుల ఆకాంక్ష. అటుల సుఖముగ బ్రతుక దలచినప్పుడు సామాజిక సుఖజీవన భంగకరములైన కొన్ని మానవ బలహీనతలను విడువవలసియున్నది. విడుచుట సులభము కాదు. కాని విడువనినాడు సంభవించు పరిణామములు దూరదృష్టిలేనివారికి గోచరింపక పోవచ్చును. కాని అనంతరకాలమున అఖండ సమాజము గురికావలసివచ్చు సంక్షోభము అసాధారణమైనట్టిది. ఈ విషయమున ప్రత్యేకముగ హెచ్చరించుటకై వ్యాసుడు విశిష్టమైన శ్రద్ధను ప్రదర్శించియున్నాడు. ఏడెనిమిది వందల పాత్రములుగల మహాభారతకావ్యమున, ఏ రెండు పాత్రలును ఒకే పోలికవి కాకుండట గమనార్హము. పరిపూర్ణుడైన శ్రీకృష్ణుని విడిచినచో మిగిలిన ప్రతిపాత్రయందును ఏదియో ఒక బలహీనత ప్రదర్శింపబడినది. ఈ రూపమున మానవ బలహీనతలనన్నింటిని పాత్రలుగ మలిచి, అయా బలహీనతల కారణముగ సమాజముపొందిన సంక్షోభమును మనకనులయెదుట నిలుపుట, వ్యాసుని మహాలక్ష్యములలోనొకటిగా గుర్తింపవలసి యున్నది. ఇకనొక్క ప్రధాన విషయమును వివరింప వలసియున్నది. తాత్విక చింతనమున, కర్మకాండలయందు బయలుదేరిన విభేధములను పూర్వపుటలలో స్పృశించియుంటిని. వాటిని తొలగించి జాతీయసమైక్యమును సాధించుట వ్యాసలక్ష్యములలో ప్రధానముగ కాన్పించును. అందుకు భగవద్గీతయే ప్రథమ ప్రబలోదాహరణము, భక్తి, కర్మ, జ్ఞాన యోగములను వివరించుపట్ల భగవద్గీతచూపిన ఔదార్యము, తత్పూర్వ శాస్త్రములు భరించలేనట్టిదియనినను అతిశయోక్తికాబోదు. ఆస్తిక్యముతో ఏ రూపమును, ఏవిధముగ అర్చించినను ప్రయోజనము సిద్ధింపగలదన్న గీతాసందేశము నేటికిని జాతీయసమైక్యమును నిల్పుటలో చేయూత నిచ్చుచున్నది.

ఇచటనొక్క విషయమునుటంకించుట అస్థానపతము కాదని భావింతును. వాల్మీకి రామాయణమున కొన్నివందలచోటుల శివప్రసక్తి వచ్చినది. రంగనాథరామాయణమునినిట్టి సందర్భములందలి శివప్రసక్తి పలుతావులు విడువబడినది. ఇది నాటి కాలప్రభావము గావచ్చును. జాతీయ సమైక్యసాధనములో వ్యాసునిపేరు చెప్పినప్పుడు, సాధారణకవులను పేర్కొనుటకూడ సమంజసము కాదేమో! ఈ మాటలైన ఊటంకించుటలోని లక్ష్యము వ్యాసుని జాతీయ భావమును మరియొకసారి ప్రశంసించుటకు మాత్రమే. ఈ విధముగ వివరించుకొనుచు పోయినచో అదియొక ఉద్గ్రంధమగును. వ్యాసలక్ష్యములు స్థూలముగ తెలిసినకాని భారతకథా విమర్శనము సరియైన మార్గములో నడువదని సూచించుటకు మాత్రమే, రేఖామాత్రముగ మహాభారత విశేషములను ఒండు రెండు చూపియుంటిని.

==========

మహాభారత పాత్రలు – ప్రత్యేకత

వేదోపనిషత్ సారము మానవకోటికందించుటయే పూర్వ మహాకవుల లక్ష్యము. వేదవివరణమునకై ఏ ఇతివృత్తమును గ్రహించినను, అందేయే పాత్రములను ప్రవేశపెట్టినను, చివరకు లక్ష్యమొక్కటియే. నిన్న మొన్నటి ప్రబంధ యుగమునకూడ కృష్ణరాయల దృష్టికాని, పెద్దనామాత్యుని దృష్టికాని ధర్మము మీదనేయను మాటకు అభిప్రాయ భేదముండదని భావింతును. బహుశ ఈ దృష్టితోడనే కాబోలును పూర్వ వ్యాఖ్యాతలు కావ్యములను వ్యాఖ్యానించునప్పుడు ధర్మవివరణము, రసపోషణాదికములను చూచిరిగాని పాత్రచిత్రణ వివరణమునుగూర్చి ప్రత్యేకశ్రద్ధ వహించిన వారుకాదు. అట్లని పాత్రచిత్రణమున మహాకవులు శ్రద్ధ చూపకపోలేదు. చెప్పదలచుకొన్ని ధర్మమునకు ప్రతీకగ ఆయాపాత్రలను ఆయా కవులు మలచుట జరిగినది. రచయిత దృష్టి, విమర్శకుని దృష్టికూడ ధర్మము మీదనే యని చెప్పుటకై పైవివరణము.

ఆధునిక కావ్యములందు లౌకిక పాత్ర వృత్తములు గ్రహించుటచే పాత్ర నింకొక కోణమునుండి పరిశీలింప వలసియున్నది. శాశ్వత ధర్మమెద్దియైనను, తాత్కాలిక వాస్తవపరిస్థితులు నేటి రచయితలకు ప్రధానములు. అందుచే ఆయా తాత్కాలిక వాస్తవ పరిస్థితులలో సామాజికుడు పొందు క్షోభమో, సుఖమో, హృదయమునకు హత్తునటుల చెప్పుటకై ఆధునికుడు ప్రయత్నించును. అదే ఇతివృత్తము అనంతర కాలమున వస్తువుగ గ్రహించినచో అందలి పాత్రము తత్పూర్వ రచనమునందలి పాత్రమువలె సమానానుభూతినందదు. విధవా వివాహము కాని, వర్ణాంతర వివాహము కాని నేడు వస్తువుగ గ్రహించి రచనము చేసినచో అందలి పాత్రములు సమాజమున క్షోభముత్పతిల్లినటుల నిరూపింపజాలవు. సారాంశమేమన పౌరాణిక పాత్రలు ధర్మమను సూత్రధారుని చేతిలో కీలుబొమ్మలవంటివికాగా, ఆధునిక పాత్రలు సాధకునిలో కవి ఆశయ సంబంధమైన పరివర్తనము తెచ్చుటకు సహకరించనట్టివి. సూక్ష్మముగ జూచినచో పూర్వ కావ్యములందు వేద, ధర్మ సంబంధమైన ప్రభావము పాత్రలపైనున్నది. అధునికమున పాత్రలు వ్యవస్థలో నడుచుచున్న ధర్మముపై తమ ప్రభావమును జూపును. పూర్వాదికములను తులనాత్మకముగ జూచినప్పుడు పాత్ర నిర్మాణమున ఇట్టి భేదములనేకములు కాన్పించును. ఇందెవరి విధానము సరియైనదనునది ప్రశ్నముకాదు. పౌరాణిక గ్రంథములందలి పాత్రములను పరామర్శించునప్పుడు జ్ఞప్తియందుంచు కొనవలసిన విషయములను సూచించుటే యిచట లక్ష్యము. ఈ దృష్టితో భారతపాత్రల స్వభావమును రేఖామాత్రముగ వివరింతును.

శ్రీకృష్ణ పాత్రను గ్రహింపుడు. శ్రీకృష్ణుడు అవతార పురుషుడు. అందున పూర్ణావతారము. త్రికాలవేత్త, విశ్వరూపమును ప్రదర్శించి తాను నారాయణుడేయన్న వాస్తవమును స్థిరీకరించినట్టివాడు. అందుచే నిట్టివాని నడవడిక పరబ్రహ్మ నడవడికగ భావింపవలయును. నరచర్మావృతధారియగుటచే వానినడవడిక మన స్థూల దృష్టికందకపోయినను, వైదికవాఙ్మయ సంస్కారముచే మన అవగాహనమునే పెంచుకొనవలసి యున్నది.

దుర్యోధనునివంటి పాత్రలను చూడుడు. దుర్యోధనుడు కలియంశమున జన్మించినట్టివాడు. ఆత్మతత్వము నెరింగి, వైదికధర్మ ప్రచారకుడైనచో రాక్షసులు శాకాహారులై, ఉపవాసదీక్షలను పాటించినట్లగును. కారణము ధృతరాష్ట్ర పుత్రునిగకాని, నాటి సామాజిక పరిస్థితులకాని, వానిపై చూపు ప్రభావముకన్న వానిపై కలిప్రభావమే అధికముగ నుండవలయును.

ఇక మరికొన్ని పాత్రలు ఏ శాపకారణముననో నేలకు దిగినట్టివి. పరిస్థితులెటులున్నను వారి నడవడికలో, శాపప్రదాత నిర్దేశించిన స్వభావమే ఆ పాత్రలందు ద్యోతకమగును. శిశుపాలాదులట్టివారు. ఇటుల భారతపాత్రలన్నింటిని గుంపులుగ వర్గీకరించి చూచినచో ఆ పాత్రలందు క్రింది విశేషములు కాన్పించును. **1.**నిర్దిష్ట లక్ష్యముతోవారు నేలకు పంపబడినట్టివారు, **2.** భవిష్యమున వారొక నిర్దిష్ట లక్ష్యమును సాధింప దలచినవారు, **3.**వాస్తవ పరిస్థితులకనుగుణముగ ప్రవర్తిల్లువారు. అధిక సంఖ్యాకములైన పాత్రలందు పై చెప్పిన మూడు స్థితుల ప్రభావము పనిచేసినపుడు, ఆ పాత్రలను లౌకిక దృష్టితో వివరించుట కత్తిమీద సాముపంటిది. అటులనే లౌకిక కథా ప్రవర్తితములైన ఆ పాత్రలను పూర్తిగ అలౌకిక దృష్టితో చూడజాలము. పై వాక్యములు పరస్పర విరుద్ధములుగ భాసింపవచ్చును. కాని అవి విరుద్ధ వాక్యములుగావు. ఈనాడు కూడ ప్రతిగృహస్తుపై సంస్కృతీ సంప్రదాయముల ప్రభావమున్నది. వ్యక్తినిష్ఠమైన వివేక ప్రభావమున్నది. సాన్నిహిత్య సంబంధమైన ఆర్ద్రతా ప్రభావమున్నది. మానవత్వపు విలువల ప్రభావమును గలదు. కనుకనే ఒకే ధర్మమునకు చెందిన ఏ ఇరువురి ప్రవర్తనమును ఒక్క విధముగనుండదు గదా! అయినను ధర్మమునకు, ఆర్ద్రతకు మధ్య ఘర్షణ పొడసూపినప్పుడు వివేకముగ్రహించు నిర్ణయమునుబట్టి ఆ పాత్ర ఔన్నత్యము నిర్ణయింపబడుచున్నది. ఈ దృష్టితోడనే భారత పాత్రలనుకూడ చూడవలయును. స్థూలముగ ధర్మజుని పాత్రను చూచినచో క్రింది ఘట్టములు ప్రధానముగకాన్పించును. **1.** యమధర్మజాంశతో పుట్టుక, **2.** స్వయంవరమున అర్జునునిచే జేపట్టబడిన ద్రౌపదిని మాతృవాక్యమునకు కట్టుబడి తానును చేపట్టుట, దానిని విధి నిర్ణయముగ వ్యాసుడు సమర్థించుట **3.** యమాంశయందు పుట్టి సంయమమునకు, ధర్మమునకు ప్రసిద్ధుడైన ధర్మజుడు ద్యూతమాడి లోకాతీతమైన పద్ధతిలో భార్యను పణముగ పెట్టుట, **4.** అరణ్య వాసమున సమస్త మహర్షుల ఉపదేశములనందుట, రాబోవు యుద్ధమునూహించి అర్జునునిచే పాశుపతాస్త్రమును సంపాదింపజేయుట, **5.** రాయబారములంపుటలో క్షత్రియోచితమైన విజ్ఞతను ప్రదర్శించుట, **6.** యుద్ధమున భీష్మ ద్రోణులను వధించుట కష్టమగుటచే, వారి వధోపాయములను తెలుసుకొని శిఖండి కారణముగ ఒకరిని, అసత్య వచనముచే ఇంకొకరిని వధించుట, **7.** యుద్ధానంతరము బంధుకోటికై అనూహ్యము, అనిదంపూర్వమయినట్టి నిర్వేదమును పొందుట, **8.** చివరిగ సశరీర స్వర్గప్రవేశము నందుట. ఈ పై చెప్పిన ఎనిమిది ఘట్టములను పరిశీలించునప్పుడు లౌకికపాత్ర చిత్రణమునకైన ఏ ఒక కొలబద్దయైనను సరిపడదు.

యమధర్మరాజాంశమను మాట అద్యంతమును గుర్తుంచుకొనినచో, ధర్మజుని సంయమమును, బంధుప్రీతిని వివరించుట కష్టము. సాధారణ మానవునిలో అట్టి సంయమనముండుట వేరు. కాని యమాంశ సంభవునిలో అది సాధారణ లక్షణము. అంతియె కాదు. ధర్మజుడు కొంచెము రాజ్యకాంక్షను ప్రదర్శించెనేమో! యనిపించును.

ఇక రెండవఘట్టమున నాలాయినికథ చెప్పబడనిచో ద్రౌపదితోడి వివాహమునకైన ధర్మజుని సుముఖతను ధర్మ బద్ధముగ నిర్ణయించుట కష్టమగును. మూడవ ఘట్టమును ఉత్తమచర్యగ సమర్థించుటకు విధి కృతమనుటకన్న మరియొకటి లేదు. నాల్గవ ఘట్టము ఒకప్రక్క ధర్మజునిలోని రజోగుణమును సూచించును. వేరొక ప్రక్క

పరమేశ్వరుని ప్రత్యక్షమొనర్చుకొనగల సాధనసంపత్తి వరప్రసాదులగుటచే పాండవులకు సమకూరినదని చెప్పవలసి వచ్చును. అయిదవ ఘట్టమున ధర్మజుని లోకజ్ఞతతోపాటు, భూభారహరణమునకై వచ్చిన యమాంశసంభవునిగ కూడ గుర్తించుకొనవలసియున్నది. ఆరవ ఘట్టమున ధర్మజుని చర్యలలో కొంత మాలిన్యముకూడ లేదని చెప్ప జాలము. అట్టిచో మరల భూభారహరణమనెడి నారాయణ సంకల్పమె వానిచే అటుల చేయించినదని కొంతవరకు సరిపెట్టుకొనవలసి యున్నది. యోగి వర్తనము స్థూలదృష్టికి విరుద్ధముగ తోచినను, సూక్ష్మమున వాడు లౌకికాతీతుడనెడి సత్యము వాని ఔన్నత్యమును కాపాడును. అటులనె దుష్ట శిక్షణమునకైన విరుద్ధకార్యముకూడా భగవత్సంకల్పముగనిట చెప్పుకొన వలసియున్నది. ఏడవ ఘట్టమున ధర్మజుని నిర్వేదము సాధారణ మానవునిగ ఆర్ద్ర హృదయమును సూచించినను, కారణ జన్మునిగ ఆశ్చర్యమునే కల్గించును. చివరి ఘట్టమున ధర్మజునిలోని దైవాంశయే కాన్పించును.

పై సుదీర్ఘ వివరణమున ఒక విశేషము గమనార్హము. ధర్మజుని పాత్రము కేవల లౌకికదృష్టితో చూడజాలమనునది స్పష్టమగుచున్నది. కేవల లౌకికదృష్టితో జూచినచో వానిపుట్టుకయే ప్రశ్నార్థకమగును. వాని ద్యూతవ్యసనము భ్రష్టత్వమే యగును. అతడు ద్రౌపదిని చేపట్టుట లోకవిరుద్ధమే కాదు, ధర్మవిరుద్ధముగూడ యగును. లౌకికదృష్టితో జూచిన ధర్మజునిపాత్ర అతిసామాన్య స్థాయికి దిగుననుటకు పై వివరణము చాలును.

కాని యింతదనుక విమర్శకులు, వ్యాఖ్యాతలు ధర్మజుని మహోన్నతునిగ చిత్రించుటలో అతడు కారణ జన్ముడనుమాట మరువరానట్టిది. సారాంశమేమన మహాభారతమునందలి పాత్రలను విమర్శించునప్పుడు కారణ జన్మత్వము, దైవ సంకల్పము అను విషయములు ప్రధానముగ చేసుకొనియె వ్యాసుడా పాత్రలను సృజించినాడన్న విషయము మరువరాదనుటయె. ఈ దృష్టితోడనే ఈ సిద్ధాంత వ్యాసమున ధర్మజపాత్ర చిత్రణము వివరింపబడును.

==========

ఆది పంచకము – ధర్మజపాత్ర

ఆది పర్వము – ధర్మజపాత్ర

శ్రీమన్మహాభారత కావ్య నిర్మాణమున వ్యాసభగవానునకు ఒక్క లక్ష్యమున్నది. కేవలము చారిత్రకమైన చరిత్రను చెప్పుటగాని, లేక జనపథముల వినబడుచున్న పుక్కిటికథలను గుదిగుచ్చి తీరిక వేళల కథలుగా చెప్పుకొనుటకైగాని వ్రాసియుండలేదని చెప్పుటకు పెద్ద ప్రయత్నమవసరములేదు. తరముల తరబడి భారతీయులు తమ జీవనవిధానమును సరిదిద్దుకొనుటకై, కావలసిన ఉపదేశములనందించుటకు మహాభారతము రచింపబడినది. కేవల సత్యములను తెలుపుటకు ఉపనిషత్తులున్నవి. కథల రూపములో సామాన్యులకు తెలుపుటకు పురాణము లున్నవి. ఇక సర్వోపనిషత్ సారమును, పురాణ హితములను జీవనసమరమున అవగాహనతో వాడుకొనుటకై, తగినరీతిని ఉపదేశములను ఒక బృహత్కథతో పెనవైచి అందించుటకైన మహాప్రయత్నమే మహాభారత రచనము.

సారాంశమేమన సూక్ష్మముగచూచిన మహాభారతకథకన్న మహాభారతమొసంగు ఉపదేశములే ముఖ్యము. అయినను సామాన్యులకు కథలే జ్ఞప్తి యందుండును. శ్రీరాముని తలచుకొని కాని, వానినడవడికను తద్వార వాల్మీకి చెప్పదలచిన సందేశమును జ్ఞప్తికి తెచ్చుకొన జాలము. కనుక రామాయణోపదేశముకన్న, శ్రీరామపాత్రను పరిశీలించుటయే మనస్వభావముగా గుర్తింపగలము. ఈ దృష్టితోడనే భారత పాత్రలను కూడా మనము చూడగలమని, వ్యాసమహర్షికి తెలియనట్టిదికాదు. కనుకనె తన ఉపదేశ విశేషములకు తగినట్టుగ తాను గ్రహించిన కురుపాండవ కథలోని పాత్రలనుకూడ మలచుకొని పోయినాడు. అందుచే ప్రధానమైన ధర్మజ పాత్రను పరిశీలించునపుడు, ధర్మజపాత్ర ముఖమున వ్యాసడందీయదలచిన సందేశమునుకూడ దృష్టినిడుకొనవలసియున్నది. లోకమున ధర్మము పెరిగినది. ఫలితముగ అకాలమరణములు లేకపోయినవి. సర్వులును దీర్ఘాయుష్మంతులగుటచే జనసంఖ్యకూడ హెచ్చుపెరిగినది. భూభారమధికమైనది. ఇట్టి భారమును తగ్గింపుమని భూదేవి బ్రహ్మను ప్రార్థించినది. పిదప వారు విష్ణువు నాశ్రయించిరి. భూభారహరణార్థమై లోకమున యుద్ధములుకల్పించి జనసంహరణ మొనర్చుటకు నారాయణుడూహించినాడు. ఎల్లరును ధర్మమూర్తులైనచో యుద్ధసంభవమసంభవము కాకతప్పదు. అందుచే దైవాంశముల కొందరను, దానవాంశముల కొందరిని భూమిపై జన్మింపజేసినాడు. ఇది మహాభారత కథారంభమున వ్యాసుడిచ్చిన ఉపోద్ఘాతము (ఆదిపర్వము–తృతీయాశ్వాసము).

ఇచట ఒక విషయము స్పష్టము. భూమిపై జన్మించిన మానవులు దైవాంశలో రాక్షసాంశలో మనకు తెలియదు. కాని రజోగుణ ప్రేరణచే బలిసి అపమార్గములు సల్పినవారు కొందరుండుటచే ధార్మికముగ, న్యాయము తప్పని భోగములనుభవించుచు, లోకకళ్యాణమును కాంక్షించువారు మరికొందరుండుట మనము గమనించుచున్నాము. భూత, వర్తమాన, భవిష్యములైన మూడు కాలములందును యిట్టి మానవ సమూహము లుండుట సహజమనియె మనము భావింతుము. అయినను పైన పేర్కొనిన రెండు వర్గములలో కూడియున్న సమాజమున, సహజీవనమును, శాంతిని సాధించుటకై ప్రయత్నించుట తప్పదు కదా! అట్టి సాధనయె వేదకాలమునుండి నేటివరకు వెలువడిన సమస్త గ్రంథముల లక్ష్యమైయున్నది.

ఈ లక్ష్యమునకే మహాభారతము కూడ బద్ధమైయున్నది. చరిత్రయందు ధర్మరాజనువాడు ఏమయ్యెననునది సంక్షిప్తముగ తెలుపుట వ్యాసునంతటి మేధావికి తెలియక పదునెనిమిది పర్వములను రచించెనని భావింపరాదు. ఆ పాత్రము నామమాత్రము. నేడు సమాజ శ్రేయస్సును కాంక్షించెడి సర్వులలో ఆపాత్రమున్నది. కనుకనే జీవితమునన్నెన్ని ఎగుడుదిగుడులను చూడవీలున్నదో అన్నింటిని ధర్మజ పాత్రమునకంటగట్టి, అట్టి సందర్భముల ఉత్తముడెటుల ప్రవర్తింపవలెనో నిర్దేశించుటకు వ్యాసుడు ప్రయత్నించునటుల భావింపవలయును. భగవంతునకు, ఉత్తమమానవునకు కొంత భేదమున్నది. ఎంత సాధించినను సామాన్యునకు మనోవిజయము సిద్ధించునట్టిది కాదు. అట్లని ఒక తప్పుచేసిన మాత్రమున వాడు సర్వవిధముల పతనమయినటులను కాదు. కాని ఒక్కొక్కప్పుడు ఒక్క బలహీనతయే ఎన్ని అగచాట్లనైనను కొనితెచ్చుటకు సమర్థము కాగలదు. ఇట్టి మానవ సహజత్వమును ధర్మజపాత్ర ముఖమున ప్రదర్శించి, సుదీర్ఘమైన కథనల్లి సమస్తలోకుల మనస్తత్వములను మనకనుల ఎదుట నిలుపుటకు వ్యాసుడు ప్రయత్నించినాడు. పై వివరించిన విషయములన్నింటిని దృష్టినిడుకొని ధర్మజ జననఘట్టమును పరిశీలింప వలసియున్నది. *(పంచమాశ్వాసము)*.

1. ధృతరాష్ట్ర పాండురాజులు సోదరులు. ఇందు గంధర్వాంశమున జన్మించినవాడు ధృతరాష్ట్రుడు. మరుద్గణాంశమున జన్మించినవాడు పాండురాజు. దేవలోకవాసుల వర్ణనమున గంధర్వులకన్న మరుద్గణములను మిన్నగ పురాణములు వర్ణించుట చూడగలము. భోగలంపటత్వము, మానవ సహజమైన విశేష స్వార్థము గంధర్వులలో అధికమన్నటుల పలుపురాణ కథలు వివరించుచున్నవి. మరుద్గణములను అంతకన్న పైమెట్టు వారిగ పురాణములు తెల్పుచున్నవి. ఇక పుత్రులకు జన్మనిచ్చుటకు మున్ను గాంధారి ధృతరాష్ట్రులయొక్క, కుంతీ, పాండురాజులయొక్క ప్రవర్తనములు కూడా వ్యాసలక్ష్యమును సాధించుట కనుగుణముగానున్నవి. పుత్రులను పొందవలెనన్న ఊహానందుటకు పూర్వమే పాండురాజు కిందముడను ముని శాపకారణముగా సర్వసంగపరిత్యాగియై, సమస్త సంపదలను యోగ్యులకు దానమొనర్చి తపమున కేగినాడు. జితేంద్రియుడైనాడు. సమస్త మహర్షి లోకముచే ప్రశంసలనందినాడు. కేవలము పిత్రృణము తీర్చుటకై సంతతినందకాంక్షించినాడు. అర్జున జననమునకు మున్ను దేవేంద్రునిగూర్చి తపమొనర్చి వాని ప్రత్యక్షమందినాడు. సాధారణ జనవిషయముననే సంభోగకాల మనోభావములు సంతానముపై ప్రభావము చూపునని పూర్వుల విశ్వాసము. ధృతరాష్ట్రుని అంధత్వము, పాండురాజునకైన పాండుత్వము వారి మాతృ దోషములుగ భారతమే వర్ణించుచున్నది. అనగ సంతాన ప్రాప్తికి ముందుగ తల్లిదండ్రులు సంపాదించిన మనోనైర్మల్యము ఉత్తమ పుత్రప్రాప్తికి సోపానమని పూర్వులు విశ్వసించినటుల తెలియుచున్నది. ఏ పరిస్థితులు ప్రభావముచేనైనను పాండవుల జననములకు మున్నుగ కుంతీ, మాద్రిసమేతుడైన పాండురాజు సంస్కారముచే మహర్షుల సరసన జేరినాడు. ఇట్లు వర్ణించుటలో వ్యాసలక్ష్యమవగతమగుచున్నది. అట్టి ఉత్తమ స్థితినందిన పాండు మహారాజునకు జన్మించిన పాండవులు గొప్ప వారలగుటకు గల కారణములు మనము గ్రహింపవలెననియె వ్యాసుని భావము. ఇది ధర్మజుని పుట్టువునకు పూర్వరంగము.

2. ఇంత మాత్రమేకాదు. మరియొక వివేషముకూడ గలదు. కలివంటి దుష్టశక్తులు సన్మార్గులయందును, ధార్మిక ప్రదేశములందును ప్రవేశింపజాలవు. నలమహారాజు పాదశుద్ధి కావింప కుండుటకారణముగ వానిని కలిపురుషుడు పట్టుకొనజాలినాడని పురాణకథనము. నారాయణ సంకల్పముచే కలి దుర్యోధన రూపమున

జన్మించనున్నాడు. అందుకనుగుణముగనె ధర్మజ జననవార్త విని ఈర్ష్యాళువై గాంధారి గర్భతాడన మొనర్చు కొనినదట. అపుడు జన్మించిన దుర్యోధనాదులు కలిప్రవేశమునకు అవకాశ మిచ్చునట్టి వారగుదురు కదా!

1) ఈ సందర్భమున గాంధారిని గూర్చిన వ్యాసుని మాటలు చూడదగును.

ప్రహ్లాదశిష్యోనగ్నచిత్సుబలశ్చా భవత్తతః తస్యప్రజాధర్మహంత్రీ జజ్ఞెదేవప్రకోపనాత్

(ప్రహ్లాదుని శిష్యుడగు నగ్నచిత్తియనువాడు సౌబలుడను రాజుగా పుట్టెను. అతనియొక్క ప్రజలు దేవశాపము వలన ధర్మమును పాడుచేయు వారుగా అయిరి.

గాంధార రాజ పుత్రో భూచ్ఛకునిః సౌబలస్తదా, (2)దుర్యోధనస్య జననీ జజ్ఞాతేర్థ విశారదా

పై శ్లోకములను బట్టి ఒక విషయము తెలియును. గాంధారి పతివ్రతయేయైననూ దేవశాపమున ధర్మద్రోహి కావలయును. ఆ కార్యమును పుత్రరూపమున తీర్చినదని నీలకంఠీయాభిప్రాయము. పాండవ, కౌరవ జననవేళ వ్యాసభగవానుడు వర్ణించిన రెండు వాతావరణములను సూక్ష్మముగ పరిశీలించినచో వంశకరుడు, ఉత్తముడు, పితృదేవతలను తరింపజేయగలవాడు అగు సుపుత్రప్రాప్తికి కావలసిన సంస్కృతీ వాతావరణ మెట్టిదియో పాఠకులు గ్రహింపగలరు. అదియే వ్యాసలక్షణము. ఇచట సుపుత్రుడే దర్మరాజు.

1). శ్రీమహాభారత సారోద్ధారమున ములుకుట్ల నరసింహావధానిగారిచ్చిన శ్లోకమును, తాత్పర్యములను

2). నీలకంఠీయవ్యాఖ్యా (గాంధార్వాదర్మహంతృత్వంపుత్రద్వారైనైన) ఆది-67-అ. (గాంధారరాజు పుత్రుడగు శకునియు (సౌబలుడు) దుర్యోధనుని తల్లియగు గాంధారియు వీరందరును ధర్మ ద్రోహులయిరి)

పాండురాజు యమధర్మరాజు ప్రసాదమున పుత్రుని పొందుటకు కుంతిని నియోగించుటకు మున్ను చెప్పిన మాటలు గమనార్హము.

ఉ. దానములందపంబుల సదక్షిణ యజ్ఞములన్ విహీనసం
తానుల కూర్ధ్వలోకసుపథంబులవశ్యముగావు లబ్ధసం
తానుల యెందుఁబూజ్యులిది తథ్యముగావున నొండుదక్కిసం
తానము నాకునయ్యెడు విధంబొనరింపుము ధర్మసంస్థితిన్ -ఆది-పంచమ-73

కం. అనపత్యుడనై జీవిం, చినమృతిఁబొందినను నిర్వశేషంబ యిహం
బునుబరమునుసఫలతగా, పునసంతతివడయు ధర్మువున ధర్మసతీ -ఆది-పంచమ-74

కుంతికూడ పుత్రేచ్ఛతోనున్నట్టిది కాదు. పాండురాజును తప్ప అన్యపురుషుని, దైవమునైనను తలంచుట కిష్టపడనట్టిది. కనకనే పాండురాజు నియోగధర్మమునుగూర్చి అనేక దృష్టాంతములను చెప్పవలసి వచ్చినది. అప్పటికినికూడ కుంతి సమాధాన పడలేదు. అట్టితరి పుణ్యలోకనాశభయహేతువుచే పాండురాజు కుంతికి చేతులెత్తి నమస్కరించుటకు సిద్ధపడినాడు.

చం. అలయకధర్మశాస్త్రములయందుఁబురాణములందుఁ జెప్పను
త్పలదళనేత్ర విందుమ యపత్యముమేలని కావునన్ యశో
నిలయులఁబత్రులంబడయ నీకొనరించెదసంగతాంగుళీ
దళవిలసన్మదీయకరతామరసద్వయయోజితాంజలిన్-ఆది-పంచమ-90

ఇటుల పాండురాజు ప్రార్థించినపిదప కుంతి పతివ్రతయగుటచే, మున్నుతాను దుర్వాస మహర్షిచే పొందిన మంత్రముచే పాండురాజుకోరిన దైవమును ప్రార్థించుటకిష్టపడినది. ఇదియథామూలం.

యమధర్మరాజును కోరుమని కుంతిని నియోగించుటకు మున్ను పాండురాజు వ్యక్తపరచిన పుత్ర గుణములు కూడా గమనార్హము.

3. కం. లలితాంగియెల్లలోకం, బులుధర్మువునందనిలిచెఁ బొలుపుగ ధర్మం

దలపుమురియాతడె వే, ల్పులలోపలఁబెద్దధర్మువున సత్యమునన్- ఆది-పంచమ-**92**

ధర్మము, సత్యములను పాటింపగల సుపుత్రునిపొందుట పాండురాజు ఆకాంక్ష. అట్టి కోరికను కోరుటకు తగిన సంస్కారమును పాండురాజు అలవర్చుకొనినాడు. కనుకనె వాని సంస్కారమునకు తగిన పుత్రసంతతి లభించినటుల భావింప వలసియున్నది.

1. ఇట మూలమున ధర్మమును గూర్చి ప్రశంస కలదు గాని సత్యమును నన్నయ కల్పించినాడు.

ధర్మమావాహయశుభే సహిలోకేషుపుణ్యభాక్-(**1.** వ్యాసభారతము)

4. ధర్మజ జననవేళపొడసూపిన ప్రకృతి విశేషములు దుర్యోధన జననవేళ సంభవించిన ప్రకృతి వైపరీత్యములు రెండింటినీ సమాంతరముగ వ్యాసుడు ప్రదర్శించియున్నాడు. ఇది కూడా తగిన సంస్కారము పూర్వరంగమును లేనిచో సంతతికి వాటిల్లగల ముప్పును సూచించుటకై వ్యాసుడీ వర్ణనములు ఒనర్చినటుల భావింపవలసియున్నది.

ధర్మజ జననవేళ కాన్పించిన ప్రకృతి

ఉ. శాత్రవ జైత్రతేజమున సర్వదిశల్ వెలుగంగ నైంద్రన

క్షత్రయుతుండుగా శశిప్రకాశ జయోన్నతమైన యష్టమిన్

మిత్రముఖగ్రహప్రతతి మేలుగ నాభిజితోగయంబునం

బుత్రుడు ధర్మునంశమునఁబుట్టెనతిస్థిరధర్మ మూర్తియై - ఆది-పంచమ-**94**

కం. ధరణీ సురులాదిగ ను, ర్వరలోగల సర్వభూతవర్గంబెల్లం

బరమోత్సవమొందను గుణ, శరణుండగు ధర్మజన్మ జన్మదినమునన్ -ఆది-పంచమ-**95**

రవ్యాది నవగ్రహములు ఉత్తమ స్థానములనుండగ, అభిజిల్లగ్నమున ధర్మజుడు జన్మించినాడు. ఉత్తమ గుణములకాశ్రయమిచ్చు వాడగుటచే ధర్మజ జన్మవేళ దేవతలు, బ్రాహ్మణులు సమస్త భూతకోటి ఆనందమును ప్రకటించినదట. సూక్ష్మముగ చూచిన పై గ్రహస్థితి వర్గమునందొక విశేషమున్నది.

లగ్నము అభిజిత్ అనగ సమయము మిట్టమధ్యాహ్నకాలమని గ్రహింపవచ్చును. రాజకార్యములకై పోవు వారికి అభిజిల్లగ్నమును శ్రేష్ఠముగ భావింతురు. జన్మకాలమే అభిజిల్లగ్నమగుచో జాతకుడు రాజాభిమానమునకు నోచుకొనును. జాతకుడు క్షత్రియుడగుచో రాజగునని చెప్పవలయును. అనగ ధర్మజుని జన్మసమయ వర్ణనముననె కురువంశపాలకుడు. కురువంశోద్ధారకుడును కూడ ధర్మజుడే యగునని వ్యంగ్యముగ వ్యాసుడు సూచించినట్లయినది. ఇచట మరియొక విషయముకూడా గమనార్హము. అభిజల్లగ్నము ప్రధానముగ రవి సంబంధమైన యోగమును సూచించును. ధర్మరాజు సూర్యునకు మనుమడే కదా! కనుకనె వానిలగ్నము అభిజిల్లగ్నమగుట సత్యమును, సహజమును అగుచున్నది. కనుకనే ధర్మజునకు పేరిడు సమయమున ఆకాశవాణి ఇటుల పలికినదట.

5.కం. కురుకులవిభుడగు ధర్మ, స్థిరమతియగు నీతడనుచు ధృతిఁజేసి యుధి

ష్ఠిరుడును నామము దాను, చ్చరించె నాకాశవాణి జనవినుతముగాన్ -ఆది-పంచమ-**97**

పై పద్యమున కురుకుల విభుడగునను మాట అభిజిల్లగ్న ప్రయోజనమును వివరించుచున్నది. **(1).**ఇట మూలమున ధర్మజునిజననవేళ విశేషములు అనువాదమున యథాతథముగనున్నను కొన్ని మార్పులు గలవి.

అవి రవి తులారాశియందుండుట, మరియు శుక్లపక్షమున పూర్ణి అను పేరుగల పంచమిన జన్మించెనని గలదు.

ఐంద్రేచంద్ర సమాయుక్తే మహుర్తేభిజితేష్టమే, దివామధ్యగతే సూర్యే తిథౌపూర్ణేతి పూజితే
సమృద్ధయశసం కుంతీసుషావ ప్రవరంసుతం,
జాతమాత్రే సుతేతస్మిన్ వాగువాచాశరీరిణీ-122-అధ్యా-6,7.శ్లో.

(2). (ఇంద్రుడు చంద్రునితో గూడికొనియున్న అభిజిన్ముహుమూర్తమున పగటియందు సూర్యుడు మధ్యగతుడైయుండగా మిక్కిలి పవిత్రమైన సంపూర్ణతిథియందు గొప్పయశ:శాలియు శ్రేష్ఠుడునగు కుమారుని కుంతి కనెను.) (1. వ్యాసభారతము, 2. మహాభారత సారోద్ధారము)

ఇక దుర్యోధన జనన వేళా విశేషము గమనార్హము. గాంధారి గర్భతాడనాది పూర్వరంగముపై పుటలలో వివరింపబడినది. జననవేళ సంభవించిన అశుభసూచనమిట్లున్నది.

శా. ఆదుర్యోధనుడుద్భవిల్లుడును గ్రవ్యాదారవంబున్ శివా
నాదంబున్ మదఘూకఘూంకృతియునానారాసబధ్వానమున్
భూదిక్కంపముగాఁజెలంగె విగతాంభోభృన్నభో వీధియం
దాదిత్యద్యుతి మాయగాఁగురిసెనుగ్రాసృజ్మహావర్షముల్ -ఆది-పంచమ-106

క్రూరమృగములు,నక్కలు,గాడిదలు, గుడ్లగూబలరచినటుల, రక్తవర్షము సంభవించినటుల కావింప బడిన వర్ణనము, వాని మాతాపితృ కృతపాపము, కలియంశలను సూచించుచున్నది. ఇది యధామూలము.

పై తులనాత్మక పరిశీలనమున ధర్మజుని మహర్షి తుల్యునిగా చెప్పినటుల భావింపరాదు. ఆకాశవాణి చెప్పిన మాటలలో ఆతడు స్థిరముగ ధర్మమును పాటించు కురుకుల విభుడని మాత్రమే తెలియగలదు.
అనగ ఉత్తమ క్షాత్ర వంశమునందలి సుక్షత్రియ లక్ష్మణములతో ధర్మజుడు వెలుగొందునని గ్రహింపవలసియున్నది.

6. ధర్మజుని బాల్యము : ధర్మజాదుల జననానంతరము సంసారమునుండి విరక్తినందిన పాండురాజు చిరకాలము శతశృంగ ప్రాంతములందే తపమొనర్చు కొనినటుల తెలియుచున్నది. అట్టితరి శ్రీకృష్ణుడు తన పురోహితుడైన కశ్యపుని పాండురాజువద్దకు పంపియున్నాడు. కశ్యపుడు పాండు కుమారులకు క్రమంబున చౌలపయనములొనరించి, వేదాధ్యయనంబు చేయించినటుల చెప్పబడియున్నది. పిదప పాండురాజు మరణము వివరింపబడినది. ఇది యథా మూలము.

అనంతరము శతశృంగప్రాంత మహర్షులు కుంతీ సమేతులైన పాండుపుత్రులను వెంటనిడుకొని హస్తినాపురమునకేగుదెంచిరి. పిదప తమవద్దకు వచ్చిన భీష్మాది కురువృద్ధులకు పాండుపుత్రులనప్పగించి, మహర్షులు పాండవులను శతధా ప్రశంసించి, సిద్ధచారణగణంబులతో అంతర్ధానులైరి. ఈ విధముగా పాండవులను దేవగణములు, ఋషిగణములు మెచ్చి భీష్మాదులకప్పగించుటయందె పాండవుల విశిష్టత గోచరించుచున్నది. ఇది యధా మూలము.

7. విలువిద్యాభ్యాసమున ధర్మజుడు, దుర్యోధనాదులవంటి వాడేకాని అర్జునునితో సాటిరాని వానిగ తెలియును. ఒకపరి ఆచార్యుడైన ద్రోణుడు రాజపుత్రుల ధనుర్విద్యా కౌశలము పరీక్షించదలచినాడు. అందుకై వృక్షాగ్రమున ఒక కృత్రిమ శకుంతమును రచించి, ధర్మజుని జూచి ఇట్లనినాడు.

తే. వృక్షశాఖాగ్రమునననున్నపక్షి శిరము,దెల్లముగ జూచితే మహీవల్లభుండ
యనిననిమ్ముగజూచితిననినవెండి, యునుగురుడు ధర్మజునకిట్టులనియెఁబ్రీతి-ఆది-పంచ-249

కం. జననుతయామ్రానినిన, న్ననుమరినీ భ్రాతృవరులనుం జూచితె నీ
వనవుడుఁ జూచితిన్నిటి, ననఘా వృక్షమున నున్నయవ్విహగముతోన్-ఆది-పంచమ-250

వ. అనినవిని ద్రోణుండు దర్మజుంబదరి నీదృష్టిచెదిరె నీవుదీనినేయనోపవుపాయుమని యివ్విధంబున దుర్యోధనాదులైన ధార్తరాష్ట్రులను, భీమసేన, నకులసహదేవులను నానాదేశాగతులైన రాజపుత్రులను గ్రమంబుననడిగిన వారలు ధర్మనందను చెప్పినట్ల చెప్పిన నందరనిందించి పురందరనందనుం బిలిచి వారి నడిగినయట్ల యడిగిన నాచార్యునకు నర్జునిండిట్లనియె" -ఆది-పంచ-251

8. ఇటులనె మరియొక సందర్భమున జలక్రీడా సమయమున ద్రోణుని తొడను ఒక మొసలి పట్టుకొనుట సంభవించినది. విడిపించుకొనగల శక్తి తనకున్నను, తమతమ ధనుర్విద్యా కౌశలమును చూపి మొసలిని విడిపింపుడని ద్రోణుడు శిష్యులనాదేశించినాడు. ధర్మజునితో సహా ఎల్లరును చేష్టలుడిగి యుండగ, అర్జునుడొక్కడె పూనుకొని ద్రోణుని ఆపదనుండి రక్షింపగలిగినాడు. ద్రుపదుని బంధించి తెచ్చుటకై తొలుత ధార్తరాష్ట్రులు మాత్రమేగిరి. ద్రుపదుని పరాక్రమమునకెదురు నిలువజాలక వారు వెనుదిరిగిరి. అనంతరము భీమార్జునులు బయలుదేరిరి. ఈ సందర్భమున దర్మజుడు పాల్గొనకుండుట గమనార్హము. అర్జుననిమీది విశ్వాసముచే ధర్మజుడు బయలుదేరలేదని భావింపవలసియున్నది. ఇదియధా మూలము.

9. ధర్మజుడెప్పుడు యౌవరాజ్య పట్టాభిషిక్తుడయ్యెనొ తెలియదు. కాని ధృతరాష్ట్రునితోడ దుర్యోధనుని మాటలలో ధర్మరాజు యువరాజుగ అభిషిక్తుడయినటుల తెలియచున్నది. ఇట ధర్మజుని యౌవరాజ్య పట్టాభిషేకమునుగూర్చి మూలమున రెండు శ్లోకములతో చెప్పబడినది.

తతః సంవత్సరస్యాంతే యౌవరాజ్యాయపార్థివ, స్థాపితోధృతరాష్ట్రేణపాండుపుత్రోయుధిష్ఠిరః
ధృతి స్థైర్యసహిష్ణుత్వాదానృశంస్యాత్ తధార్జవాత్, భృత్యునామానుకమ్పార్థమ్ తథైవస్థిరసౌహృదాత్
(తదనంతరము ఒక సంవత్సరము పోయినపిదప ధృతరాష్ట్రుడు పాండుపుత్రుడగు యుధిష్ఠిరునితో ధృతి, స్థిరత, సహిష్ణుత, సరళత, దయాళుత మరియు సౌహార్దమాదిగాగల సద్గుణముల కారణముగ ప్రజలను పాలించుటకై యువరాజ్య పదవిలో అభిషిక్తునిచేసెను)

ధర్మజుని యువరాజుగనొనర్చుట దుర్యోధనునకు ప్రబల దు:ఖ కారణమైనది. అక్షణమునుండియె పాండవులను మట్టుబెట్టుటకు ధృతరాష్ట్రునితో మంతనములారంభించినాడు. ధర్మజుని వారణావతమునకంపుటలో దుర్యోధనుడే ప్రధానభూమిక వహించినాడు. రాజ్య విస్తరణమంతయు పాండురాజునివలననె జరిగినదనియు, వానికన్న ధర్మజుడు మిన్నగా భక్తిసేయుచున్నాడనియు ధృతరాష్ట్రుడు పలికెను.

ధర్మనిత్యస్సదాపాండుస్తథా ధర్మపరాయణ: తస్యపుత్రో యధాపాండుస్తథాధర్మపరాయణ:
(పాండురాజు ఎట్లు ధర్మ పరాయణుడో అతని పుత్రుడగు ధర్మరాజును, అట్లే ధర్మపరాయణుడు)

పితృవైతామహాద్రాజ్యాత్సతతం యోవిశేషతఃసకథంశక్యతేస్మాభిరపాకర్తుంబలాదితః(విశేషించి నాసహాయుడైన ధర్మరాజు పరంపరాగతమైన రాజ్యమునుండి బలాత్కారముగా త్రోసి వేయ బడుటకు మనచే ఎట్లు సాధ్యమగును)

అంత దుర్యోధనుడు తండ్రితో పల్కిన క్రింది పల్కులు గమనార్హము.

సీ. పైతృకంబగులక్ష్మి పాండుభూపతి మున్ను, తాల్చుటజేసి తత్తనయుడైన
ధర్మజుడిప్పుడు దాల్చిననాతని, తనయుండు మరిదానిదాల్చు మీద
నిప్పాటఁబాండువంశేశుల వసుమతీ, రాజ్యార్హులగుదురు రాజ్యమునకు
ఒరువడిమేమింత బాసిన మాపుత్ర, పౌత్ర వర్గంబును బాయు నింక
ఆ. నొరులగొలిచి కుడువనోపమేమట్లుగా, కుండ మమ్ముఁజేయనోపుదేనిఁ
బాండురాజుతొంటి భక్తియునప్పాండు,తనయులందు దయయుఁదలపకుండు - ఆది-షష్ట-127

ఇట మూలమున దుర్యోధనుడు తండ్రితో పలికిన సంభాషణ 12 శ్లోకములలో గలదు. నన్నయ ఒక సీసపద్యమున సారమంతయు కుదించినాడు.

10. ఇట్లు చెప్పి అనంతరము వారణావతమునకు పంపించుట మంచిదని సూచించినాడు. ఈ సందర్భమున ధృతరాష్ట్రుడుకూడ పాండవులపట్ల వైరభావమునె వహించినటుల తెలియుచున్నది.

తరు. ఏ నెల్ల ప్రొద్దునాయెడలోనదలతు నీయభిప్రాయంబయిది దారుణంబు
గానవాకునకుజుల్కన తేరనోపగడగి పాండవులనేకత మెట్టులనుప
గానగుమరిదీని గాంగేయవిదుర కలశజాశ్వత్థామగౌతముల్ బుద్ధి
గానొడంబడుదురెకాదయ్య యనినఁ గౌరవజ్యేష్ఠుండుఘనుడిట్టులనియె. -ఆది-షస్టా-129

ఇట మూలమున నాలుగు శ్లోకములున్నవి. నన్నయ యధామూలకమును గ్రహించుచు ఒక్క పద్యముననే వెలయించినాడు. అనంతరము ధృతరాష్ట్రుడు పాండవులనుపిలిచి వారలను వారణావతమునకు పొమ్మనుట, కుంతీసమేతులై పాండవులు బయలుదేరుట జరిగినది. ఆ సమయమున పాండవుల వయస్సులను నన్నయ ఇటుల పేర్కొనినాడు.

వ. దొల్లి షోడశ, పంచదశ, చతుర్దశ, త్రయోదశవర్ష జాతులయి శతశృంగంబుననుండి హస్తి పురంబునకు వచ్చియందు గౌరవులంగలసి యస్త్రవిద్యలంగరచుచుం బదమూడేండ్లుండియపుడు ధృతరాష్ట్ర నియోగంబున వారణావతంబునకు జననీ సహితంబుగా బోవసమకట్టి -ఆది-షస్టా-141

అనగా వారణావతమునకేగునాటికి ధర్మజుడు ఇరువదితొమ్మిది సంవత్సరములవానిగా తెలియు చున్నాడు. ఈ ప్రసక్తి మూలమున లేనట్టిది. నన్నయ కల్పితము. ధర్మరాజు సత్ప్రవర్తనముచేత, వినయ, విధేయతలచేత, వాఙ్మాధుర్యముచేత, దానధర్మాధిక్యములచేత, ప్రజాహృదయములను చూరగొనుచున్నాడనియు, అచిరకాలమున తన యునికిని గుర్తింపరనియు,దుర్యోధనుడు ధృతరాష్ట్రునివద్దవాపోయి, ఫలితముగ పాండవులను వారణావతమున కంపించుటలో విజయుడు కాగలిగినాడు. చిన్ననాటినుండియు భవిష్యత్ రాజ్యార్హత నిలుపుకొనుటకై ధర్మజుడు ప్రదర్శించిన నేర్పు, అతడు వారణావతమునకేగు సందర్భమున పురజనులు తమలో తాము అనుకొనిన క్రింది మాటలనుబట్టి విదితము కాగలదు.

సీ. ఇప్పాండుపుత్రుల నేలకో ధృతరాష్ట్రు, డేకతమనుపంగనిచ్చగించే
నిదియధర్మంబనియెరిగి గాంగేయాడు, లేలవారింపరో యెరుగరొక్కొ

పితృపితామహులచే భృతపూర్వమై క్రమా,గతమైనరాజ్యంబు గరము నెమ్మిఁ
బాండుసుతజ్యేష్ఠ భరతకులశ్రేష్ఠ, ధర్మజుఁబూన్పక ధర్మవుడిపి
ఆ. యేలవృద్ధ రాజులెడసేసిరో పార్థ, నరిగి నెడకమనము నరిగియతని
యున్నచోన ప్రీతినుండుద మిందుండ, నేలయనుచుఁ బౌరులెల్లఁ దెరలి. - ఆది-షష్ఠా-142

11. పై పద్యమునందలి విషయము మూలమున ఎనిమిది శ్లోకములలో చర్చితము. పై మాటలలో ఒక విషయము స్పష్టము. మరికొలది కాలము పాండవులు హస్తినాపురమునన్నచో ధర్మరాజు పట్టాభిషేక విషయమై ప్రజలుకూడా శ్రద్ధవహించెడి అవకాశమాసన్నమగుచున్నదని తెలియగలదు. ఇది ఒక విధముగ ధర్మజుని మంచినడవడికకు గీటురాయి. అటులనె ఏకారణముచేనైనను చక్రవర్తిత్వమునందిన ధృతరాష్ట్రుని పుత్రునిగ దుర్యోధనుడు రాజ్యార్హతను కోల్పోవుటకు మార్గమును అగుచున్నది. వారసత్వ హక్కుగల దుర్యోధనుడు పరాక్రమముచేగాని, లేక మంచితనముచేగాని తన హక్కునుండి తన్ను తొలగింప కారకులగు పాండవులపై విరోధముపూనుట అసూయాకారణమనుట కన్న క్షాత్రధర్మమని అనకూడదా! అనిపించును.

12. ధర్మరాజు హస్తినాపురమును విడిచినను ఉత్తమ క్షత్రియునిగ చారచక్షువుగనే నిలచినాడు. వారణావతమునకేగిన వెంటనే గృహము లాక్షాగృహమని గ్రహించినాడు. విదురుని పనుపున, నతని సహాయమున బిలమార్గమును నిర్మింపజేసికొనినాడు. ఆరుమాసములపిదపనొక కృష్ణచతుర్దశినాడు దుర్యోధనానుమతితో లాక్షాగృహమునకు నిప్పుపెట్టెదరనిగ్రహించి, యానాటి యర్ధరాత్రముదాటిన పిదప భీముడే దానినంటించి తల్లితోడను, సోదరులతోడను బిలమార్గమున సురక్షిత ప్రాంతమునకు చేరినాడు. దైవవశమున నేవురుపుత్రులతో నొకనిషాది యా లక్కయింట మరణించుట జరిగినది.

13. నన్నయ లాక్షాగృహ దహనమును వర్ణించుచు పాండవులు ధర్మనిష్ఠులని రమణీయముగ దెల్పినాడు.

చం. అనుపమ నిత్యసత్యరతులై వినయాన్వితులైన పాండునం
దనులకు ధర్మమూర్తులకు ధర్మువెఱుంగక యిట్టులెగ్గు సే
సినధృతరాష్ట్రజాధమునశేష సుహృత్సుత బంధుదాహసూ
చనమయి లక్కయిల్లతి కృశానుశిఖాహతిఁగ్రాగె గ్రక్కునన్ -ఆది-షష్ఠ-162

ఇట మూలమున పౌరులు ఆవేదన వ్యక్తము చేయుచు, దుర్యోధన, ధృతరాష్ట్ర పురోచనులను నిష్ఠురోక్తులాడినట్లుగలదు. కాని అనువాదమున నన్నయ కల్పితమైన పద్యమున పాండవప్రశంస హృద్యముగ నున్నది. వ్యంగ్యముగ భవిష్యమునందలి కౌరవనాశము సూచింపబడినది. ఇట్టి వర్ణనములు కథాగతములని చెప్పబడును. ధృతరాష్ట్రునకు ప్రేమకలదో లేదో చెప్పజాలము. కాని స్వార్థమువెనుక ఆర్ద్రతకూడ దాగి యున్నటులున్నది. ధర్మజాదుల మరణవార్త విని దుఃఖితుడై 'ధృతరాష్ట్రుడా వఱచినట్లఱచెన్ వివిధప్రలాపుడై' యని చెప్పబడినది.

14. పిదప ధర్మరాజాదులు గంగానదినిదాటి దక్షిణాభిముఖులై హిడింబుని నివాస ప్రాంతముల సమీపమునకు చేరిరి. అనంతరము హిడింబాసుర వధ జరిగినది. పిదప భీముడు హిడింబిని రాక్షసియను కారణమున తిరస్కరింపగ ధర్మజుడిట్లనినాడు.

తే.గీ. వధకునర్హుడై వచ్చినవానిఁజంపి, తదియుధర్మువయిది చాలనబల దీని
కలుగజనదాత్మ రక్షకునగ్గలంబు, ధర్మరక్షయయుత్తమధార్మికులకు-ఆది-షష్ఠ-217

కం. ఆపదయయినను ధర్మువ, ప్రాపుగ రక్షింపవలయుఁబరమార్థము ధ
ర్మాపాయమధార్మికులకు, నాపదజన్మాంతరమున ననుగతమగుటన్ -ఆది-షష్ఠ-218

ఇట నన్నయ పేర్కొనిన రెండుపద్యములలో మొదటిది యధామూలము. రెండవ పద్యము కల్పనము. ఈవిధమున ధర్మజుడు హిడింబా, భీమసేనుల వివాహమునకుకారకుడై ఆశ్రయరక్షణ, ధర్మరక్షణములను రాక్షసులపట్లకూడ ప్రదర్శించినాడు. పాండవులనేకచక్రపురంబునకు పంపుటకు మున్నుగ వారినోదార్చుచు వ్యాసుడు ధర్మజుని భవిష్యమును వివరించినాడు.

వ. నీకొడుకు ధర్మనిత్యుండీ యుధిష్ఠిరుండు నారాయణ భుజంబులంబోని తన నలువుర దమ్ముల బలంబున సర్వపార్థివులశాసించి సార్వభౌముండై రాజసూయాశ్వమేధాది క్రతువులుసేసి పితృపైతామహంబైన రాజ్యలక్ష్మి ననుభవించుచుం గురుకులంబునెల్ల బవిత్రంబుసేయు' ఇదియధామూలము.

15. ఏకచక్ర పురంబునకేగుటకుమున్న ధర్మజాదులు శాలిహోత్రునివద్ద ధర్మశాస్త్ర, నీతిశాస్త్రంబుల నభ్యసించిరి. వ్యాసునానతిని పాండవులు ఏకచక్రపురమున భిక్షాటనమున బ్రతికిరి.

కం. లలితజటాజిన కుశవ, ల్కలధరులై వేదమొప్పగాఁ జదువుచు ని
మ్ముల బ్రహ్మచారివృత్తిని, వెలయగనందుండిరొక్క విప్రగృహమునన్ -ఆది-షష్ఠ-234

కం. ధృతిఁజదువుచు భిక్షార్థము, ప్రతిగృహమున కరుగుచున్న భవ్యుల మౌన
వ్రతులంబ్రీతుల జేసిరి, సతతమునందుల గృహస్థసద్ద్విజులు దయన్. -ఆది-షష్ఠ-235

ఇట మూలమున బ్రాహ్మణ వేషమున మౌనవ్రతులై చరించిరని మాత్రమే కలదు. కాని నన్నయ ఏకచక్రపుర ప్రవేశమునకు ముందుగనె ధర్మశాస్త్ర, నీతిశాస్త్రములనభ్యసించినటుల తెలిపి, వారు ఏకచక్ర పురమున కేగుసందర్భమున వేషధారణ, ఆచార వ్యవహారనిష్ఠలను కల్పితముగ వర్ణించినాడు.

16. కుంతి భీముని బకాసురునివద్దకు పంపుచున్న సందర్భమునెరిగి ధర్మజుడు పలికిన క్రిందిమాటలలో ధర్మజుని భ్రాతృవాత్సల్యము, మాతృవాత్సల్యమును మించినదనిపించును.

వ. ధర్మజుండు దుఃఖించి యిదియేమిసాహసంబుసేసితి రొడ్లకొడుకులకుంగాదమ కొడుకుల విడుచు దుర్బుద్ధులనుంగలరె యిదిలోకాచారవిరుద్ధంబు మరి భీమసేనుడు మీకువిడువందగియెడి కొడుకే-277

సీ. ఇతని విక్రమమాశ్రయించియ కాదెయ, య్యెడలక్కయిల్లువెల్వడగ గంటి
మడవిలొ నిద్రవశాత్ములమై యున్న, మననిద్ర జెరపగాదని హిడింబు
నెడగల్ల గొనిపోయి యెక్కటి సంపిన, దండితశత్రుడీతండ కాడె
యితని బల్మినకాదె యెంతయు భీతులై, ధృతరాష్ట్ర నందనుల్ ధృతిదలంకి

ఆ. నిద్రలేక తమకునిలుచు నుపాయంబు, లొండుదక్కి వెదకుచున్నవారు
బలియునిట్టి భీము బ్రాహ్మణార్థమ్ముగా, నసురవాత ద్రోతురవ్వయిట్లు-ఆది-షష్ట-278

(1)ఇట మూలమున పై పద్యమునందలి పలుకులన్నియు ఏడుశ్లోకములందువివరితము. కాని మూలమున
యస్యవీర్యంసమాశ్రిత్య వసుపూర్ణాంవసుంధరాం, ఇమాంమన్యామహేప్రాప్తింనిహత్యధృతరాష్ట్రజాన్-శ్లో

(ఎవని బలపరాక్రమాదులను ఆసరాగ తీసుకొని మేము ధృతరాష్ట్ర పుత్రులను చంపి వసుపూర్ణమైన వసుంధరను మా అధికారమునకు తెచ్చుకొనుటకు ప్రయత్నించుచున్నామో) (1. వ్యాస భారతము) అని వర్ణితమైన దానిని నన్నయ విడిచి పుచ్చినాడు.

సప్తమాశ్వాసము :

ఆది పర్వము సప్తమాశ్వాసము కేవలము ద్రౌపదీ స్వయంవరకథనమునకు పరిమితమైనది. మత్స్యయంత్రమును కొట్టినవాడు అర్జునుడే అయినను, దీనిని పాండవులేవురి కల్యాణముగ భావింపవలసి యున్నది. అందుచే ఇది ధర్మజ వివాహముకూడ. అప్పటికి ధర్మజునకు నలుబది ఒక్క సంవత్సరములు వయస్సు (2) పౌషమాసంబున శుక్లపక్షమున అష్టమి రోజొకినాడు స్వయంవరము ఘోషింపబడినది. ఆరోజుననే మాతృ వాక్ఖలితముగ ధర్మజుడుకూడ ద్రౌపదిని చేపట్టినట్లయినది.

ఈ సందర్భమున ఒక విషయమును వివరించుట అస్థానపతము కాదని భావింతును. ధర్మజుని జన్మనక్షత్రము జ్యేష్ఠగ చెప్పబడినది. వివాహ నక్షత్రము రోజొకి. ఇది ధర్మజునకు ప్రత్యక్ తార. బహుశః దానివలననె అన్ని ఇక్కట్టులును కలిగినటుల ద్రౌపది భావించుటకును, ద్రౌపది కారణముగ (జూదమును పణముగానొడ్డుట తన తప్పు అయినను) పదుగురుచేతను నిందింపబడుటకును సూచనగ ధర్మజునకు ప్రత్యక్‌తార ముహూర్తము తటస్థించినటుల భావింపవలయునేమో.(2).41 సం.4 నె. 18-రోజులు, మహాభారత సారోద్ధారము)

17. పాంచాల పురమునకేగుచున్న పాండవులకు మార్గమధ్యమున వ్యాసుడు ప్రత్యక్షమయ్యెను. వ్యాసుడు ధర్మజుని ఔన్నత్యమును ప్రశంసించి, ద్రౌపదిని పాండవులేవురును చేపట్టుదురని వివరించినటుల కలదు.

కం. ధర్మసుతుడున్న చోటను, ధర్మువునకు హానిగలదె ధారుణినైనన్
ధర్మువ తాత్పర్యముగా, నిర్మలమతినెగడునదివినీతాత్ములరై -ఆది-సప్తమ-34

సీ. తానొక్క మునికన్య దనకర్మవశమునఁ, బతిఁబడయంగ నోపకయుపేత
దౌర్భాగ్య యై ఘోరతపమొనరించిన, దానికిశివుడు ప్రత్యక్షమయ్యు
వేడుము వరమన్నవేడ్కతోఁబతిదాన, మనియేనుమారులయ్యబల వేడె
నట్లేని నీకు దేహాంతరంబునఁబతు, లగుదురేవురు పరమార్థమనియు

తే.గీ. హరుడుకరుణ నిచ్చెనది యిప్డు పాంచాల, పతికిఁగృష్ణయనగఁ బంకజాక్షి
యుద్భవిల్లి పెరుగుచున్నది తత్ప్రయం, వరము సేయుచున్నవాఁడు వాఁడు. ఆది-సప్తమ-35

ఇచట వ్యంగ్యముగ ద్రౌపదిని పాండవులేవురును చేపట్టుదురని వ్యాసుడు చెప్పినటులైనది. ఇటమూలమున వ్యాసుడు మార్గమధ్యమున ప్రత్యక్షమై ధర్మజాదులతో మాట్లాడినట్లుగలదు. గాని వివరణ మేమియు లేదు. కాని ఈ సందర్భమునకు పూర్వము వ్యాసుడు పాండవులకు చెప్పిన ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతమును నన్నయ సంక్షిప్తీకరించి ఒక్క సీసపద్యములో రచించినాడు.

18. అంగారపర్ణుని రక్షించుటయందు ధర్మజుని ధర్మదృష్టి, ఆర్ద్ర హృదయములు కారణములైనవి.

కం. అని యరచుచున్న దానికి, ననఘుఁడు గరుణించి పాండవాగ్రజుఁడయ్య
ర్జును జూచి వీనివిడువుమ, యని నోడినవాని హీనునయశోవీర్యున్ -ఆది-సప్తమ-46

ఆ. అనిన నరుడు వల్లెయని వానికనియెగం, ధర్వ నిన్ను గరుణ ధర్మరాజు
గురుకులేశ్వరుండ శరణుశరణ్యుండు,విడువబనిచెనింకవెరవకుండు -47-ఇది యథామూలము.

19. భిక్షయను భావమున ఏవురును సమముగ అనుభవింపుడనిపల్కి, తెచ్చిన భిక్ష ద్రౌపదియని గ్రహించిన పిదప కుంతి ధర్మజుల మాటలు కొంతవింతగా తోచును.

సీ. ఈ తన్విదోడ్కొని నీతమ్ములిరువురు, ప్రీతినేతెంచి యాభిక్షయొప్పు
గొనుమని నాకుఁజెప్పినను నేవురునుప, యోగింపుడంటి నాయుక్తిఁదొల్లి
యనృతమెన్నండుగాదనఘు మీరెప్పుడు, మద్వచనాతి క్రమంబుసేయ
రిదిలోకమున లేనియదియేమి సేయంగ, నగునని చింతాకులాత్మయైనఁ

తే.గీ. దల్లినూరార్చి వాసవతనయఁజూచి, పార్థనీచేతఁబడయంగఁబడినదీని
నగ్నిసన్నిధిఁబాణిగ్రహంబునీవ,చేయుమనుధర్మజునకునుజిష్ణుడనియె-ఆ-సప్త-209

ఇది యథామూలము. పైన పద్యమున ఓరెప్పుడు మద్వచనాతిక్రమంబు సేయరు అనెడి కుంతి మాటలు గమనార్హము. అనగ ఓరేవురును ద్రౌపదిని చేపట్టుడని కుంతి వాచ్యముగ కోరినట్లే అయినది. కాని ధర్మజుడు మాత్రము తల్లినోదార్చి ద్రౌపదిని అగ్నిసాక్షిగ వివాహమాడుమని అర్జునుని ఆదేశించినటుల చెప్పబడినది. నిజమునకీ సందర్భమున ధర్మజుడు మాతృ వాక్యోల్లంఘనచేసినాడో లేదో తెలుపుట దుష్కరమైనట్టిది. ఇతఃపూర్వమే వ్యాసవచనముననిట్టి మాటను ధర్మజుడు వినియున్నాడు. అనంతరము మాతృవాక్యమున ధ్వనించినది. అయినను మత్స్యయంత్రభేది అర్జునుడగుటచే స్వయంవర న్యాయమున అర్జునుడే గ్రహింపనర్హుడని ధర్మజుడు భావించి యిటులపలికినటుల భావింపవలసియున్నది.

20. తరువాతిసందర్భము దైవికమైన చిత్రపరిణామముగా వ్యాసుడేపేర్కొనినాడు. ఇది యథామూలము.

ఉ. అలలితాంగియందు హృదయంబులు దృష్టులు నిల్పిపాండు భూ
పాల తనూజపంచకము పంచశరాహతి బొందెనొక్కతన్
బాలికదొల్లి యేవురకు భామినిగాసృజయించి యున్నయ
య్యాలరి బ్రహ్మచెయ్ది పరమార్థముగాకది యేలయొండగున్ -ఆది-సప్తమ-211

వ. ఇట్లు పాంచాలియందు బద్దానురాగులయియున్న తమయేవురయభిప్రాయంబెరింగి వేదవ్యాస వచనం బులుం దలంచి - 212

కం. గురువచనస్థితి మనకే, గురకును నిదిపత్నగాఁదగుం గావున ని
త్తరుణిని బరిగ్రహింతము, తిరముగ గురువచనమొండు దెరగేలయగున్ - 213

ద్రౌపదిని పట్టమహిషిగ చేపట్టుమని అర్జునుడు ధర్మజుని ప్రార్థించుచు మిగిలిన సోదరులుకూడ (భీమ, నకుల, సహదేవులు) భావించుచున్నటుల తెల్పియున్నాడు. ఇది వాస్తవమగుచో నీచేత బడయంగ బడినది, కనుక నీవు వివాహమాడవలెనని ధర్మజుడు అర్జునునకు కావించిన సూచనను భీమాదులు భావింపలేదాయనిపించును. అటులనె ఈ సందర్భమున అర్జునుని మాటలుకూడ కొంతవింతగ తోచును.

వ. పెద్దవాడుండ గొండుకవాడు వివాహంబగుట ధర్మవిరుద్ధంబు గావున దీని నీవగ్రమహిషిగా బరిగ్రహింపుము. ఆది-సప్త-210, ఈ మాటలు భీముడు పొడింబను వివాహమాడువేళ పాండవులేలభావింప లేదనికూడయన్పించును.

ఇకపైనుటంకించిన పద్యముల విషయము చూతము. విధివశమున పాండవులేవురి చూడ్కులును ద్రౌపదిపై నిలిచినవట. ఆమెనేవురును మోహదృష్టిచే చూచిరట, అప్పుడు వ్యాస వచనమును దలంచి "గురువచనస్థితిన్ మనకేవురభర్తను నిదిపత్నకాదగు"నని ధర్మజుడు తన నిర్ణయమును తెల్పినాడట. సంప్రదాయ విరుద్ధము, ధర్మవిరుద్ధము, శాస్త్రవిరుద్ధమని ఒకవిషయమును మనము భావించినచో దానిని అనుసరించిన వానిని దోషిగా భావించుట సహజము. కాని ఇచట ద్రౌపది విషయమును విధి చోదితముగ భావించి అర్జునునితోపాటు మిగిలిన నలువురును వివాహమాడుటకు సిద్ధపడుట నేటికిని సమాధానము దొరకని ప్రశ్నగనే భాసించును. ప్రాచీన సర్వపౌరాణిక నాయకులలో ఇట్టి విధిచోదితులైన సుప్రసిద్ధులు ఉన్నటుల కాన్పింపదు. బహుశః నాటి హస్తినాపురవాసులకు తత్సమీపదేశ వాసులకునుకూడ ఇది విద్దూరముగ కాన్పించియుండును. కనుకనె దుర్యోధనాదులు ముఖ్యముగ కర్ణుడు ఈ విషయమున ద్రౌపదిని, పాండవులను హేళన చేసినటుల కాన్పించుచున్నది. ఇతర కురువృద్ధులుకూడ కర్ణునికాదని ద్రౌపది ఏవురను చేపట్టుట సమర్థించినటుల కాన్పింపదు.

21. ద్రౌపది వివాహానంతరము బలరామకృష్ణులు ధర్మజునిచూడ వచ్చినప్పుడు వ్యాసుడు కావించిన వర్ణనము ధర్మజునౌన్నత్యమును, రూపసంపదను వెలార్చుచున్నది.

శా. రాజత్కీర్తులు వచ్చికాంచిరనఘుల్ రాముండుగృష్ణుండున
యాజామీధు నజాతశత్రునృపలోకారాధ్యునుద్యద్గుణ
భ్రాజిష్ణుం దమమేనయత్త కొడుకున్ బాలార్కతుల్యోజ్జ్వల
త్తేజున్ భ్రాతృచతుష్క మధ్యగతుఁ గౌంతేయాగ్రజున్ ధర్మజున్ **-ఆది-సప్తమ-215**

ఇతఃపూర్వము పలుసందర్భములలో ధర్మజుని గుణౌన్నత్యము ప్రశంసింపబడియున్నది. కాని ధర్మజరూప సౌందర్యమును ఎక్కువగ వర్ణించినటుల కాన్పింపదు.ఇచట "బాలార్కతుల్యోజ్జ్వలత్తేజున్" అను వర్ణన గమనార్హము. ధర్మజుడు అర్కప్రత్రాంశయే కదా! ఇదియమూలకము.

<u>అష్టమాశ్వాసము :</u>

ద్రుపదపురమున పాండవులు సంవత్సర కాలముండిరి. అప్పటికి ధర్మజుడు నలుబది ఎనిమిది సంవత్సరములవాడు. అట్టితరి కౌరవులు పాండవ, పాంచాలబలముల సన్నిహితత్వమునకు అసూయచెంది పాండవులను హస్తినాపురమునకు రప్పించుటకు ప్రయత్నమొనర్చిరి. ఆ సందర్భమున ధృతరాష్ట్రుడుకూడా తన్ను పాండవ ద్వేషిగనె దుర్యోధనునకెరుక పరచుకొనుట గమనార్హము.

సీ. పలుకులఁ జెయ్యురఁబాండవులకుఁబ్రీతి, గలయట్ల యుండుదుకానినాదు
హృదయంబు విదురునకెన్నండునెరిగింప, నేనుమీతలచిన యివ్విధంబ
తలచుచునుండుదు దైవసంపదగల, వారలఁబాండవ వరులనేమి
సేయంగనగునెర్రిసెప్పుడిష్టంబింక, ననిన విచిత్రవీర్యాత్మజునకు
ఆ. దుష్టచేష్టితుండుదుర్యోధనుండిట్టు, లనియెఁజిత్తగింపుమవనినాథ
పాండురాజుసుతులఁ బాంచాలపతియొద్ద, నుండకుండజేయుటుచితమిపుడు **-ఆది-అష్టమ-21**

ఇట మూలమును కొంత సంగ్రహించుట జరిగినది. ఇచట చిత్రమేమన తమ దుష్టపుటూహలను ధృతరాష్ట్ర దుర్యోధనుల భీష్మ, ద్రోణుల కెరిగించిరట. ద్రుపదునిపై యుద్ధమున కేగుటకు భీష్ముని హృదయమును తెలియగోరిరి. అప్పుడు భీష్మ ద్రోణులు ధృతరాష్ట్రుని వారించి పాండవులను హస్తిపురికి తెచ్చి వారికి రాజ్య భాగమిమ్మని సూచించిరి. తొలుత కర్ణాదులు కురువృద్ధులనెల్లరను ఈసడించినను చివరకు ధర్మజుని సగౌరవముగ హస్తినాపురమునకు తోడ్కొని వచ్చుటకంగీకరించిరి.

22. అనంతరము విదురుడు ద్రుపదునిసభకేగి ధృతరాష్ట్రాదుల పనుపున ధర్మజాదులను హస్తినాపురికి గొంపోవు టకు ద్రుపదుని అనుమతిని కోరినాడు. ఆ సమయమున ద్రుపద శ్రీకృష్ణాదులు ధర్మజుని క్షేమమునకు ఎప్పుడును కొదువరాదని పలుకగ, ధర్మజుడు పల్కిన పల్కులు ఆతని లౌక్యమునకు, గురుభక్తికి నిదర్శనముగ నున్నది.

కం. కురుముఖ్యులు ధృతరాష్ట్రువి, దురభీష్ములు గురులుమాకు ద్రుపదప్రభుడున్
గురుడుమురాంతకుడుజగ, ద్గురుడిందర మతముననునగున్ శుభయుక్తుల్-**61** ఇది యమూలము.

ఇచట నన్నయకూడ మాటలు త్రుంచివాడినటుల కాన్పించును. భీష్మాదులు తనకు గురువులట. విదురుడుకూడ గురువట. ఇచట ద్రుపదప్రభుడున్ అందలి చివరి న కారము క్రూడ అనుభావము నిచ్చుచున్నది. ఒకప్పుడు ధృతరాష్ట్రాదులు లక్కయింటబెట్టి కాల్పదలచినారు. నేడు ద్రుపదుడాశ్రయమిచ్చినాడు. అంతమాత్రమున పితృ, పితామహులకన్న ద్రుపదుని మిన్నగా చెప్పు తాత్కాలిక భోగాభిలాషిగ ధర్మజుని నన్నయ ప్రదర్శింపలేదు. ద్రుపదుడుకూడ గురువే అనుటలో ధృతరాష్ట్రాదులనే ఉన్నతముననుంచినాడు. ఇటుల మాటలాడుట భవిష్యమున ధర్మజునకు మంచిది. అటులని ధృతరాష్ట్ర ద్రుపదుల సరసన శ్రీకృష్ణుడు నిలువజాలడు. మురాంతకుడు జగద్గురుడు అని శ్రీకృష్ణుడు తనకు ఒక్కనికి మాత్రమే గురువు కాదనియు లోకులెల్లరకు గురువేననియు చెప్పి క్రమముగ ధృతరాష్ట్ర, ద్రుపద, శ్రీకృష్ణుల మధ్యగల వ్యత్యాసమునుగూడ వివరించినట్టి వాడయినాడు. ధర్మజుడు హస్తినాపురమునకు వచ్చిన పిమ్మట అయిదు సంవత్సరముల కాలము కౌరవులతోకలసి ధృతరాష్ట్ర సన్నిధినే గడిపినాడు. అప్పటికి వానివయసు యాభది మూడు సంవత్సరములు. అట్టితరి ధర్మరాజునకర్ధరాజ్యమిచ్చినటుల ప్రకటించినాడు.

ఆ. సర్వలోకకర్మసాక్షి యీకృష్ణుండు, సాక్షిగాగ మీకుసకల వృద్ధ
రాజులొద్దనర్ధరాజ్య మిచ్చితిఁ బాండు, రాజవిభవమెల్ల రమణగొనుడు - ఆది-అష్టమ-**66**

23. ధర్మజుడు ఇంద్రప్రస్థమును పాలించుచున్న సమయమున వాని పాలనా విశేషములను నన్నయయే మహోన్నతముగ ప్రశంసించియున్నాడు.(మూలమున వ్యాసుడుకూడ యిట్టి ప్రశంస చేసియున్నాడు) రాజ్యపాలనా కాలమున కావింపబడిన ధర్మజ వర్ణనము ధర్మజుని సర్వోన్నత గుణాధిక్యునిగ వివరించుచున్నది.

చం. అనుజులునల్వురుందనకు నత్యనురాగమునన్ విధేయులై
తనరుచునుండ వేదవిహితంబగు యజ్ఞమపోలె సర్వపా
వన శుభమూర్తియై భువనవంద్యుడు ధర్మపరుండు ధర్మనం
దనుడు ధరాధిరాజ్యము ముదంబున జేయుచునుండె బేర్మితోన్ -ఆది-అష్టమ-**81**

సీ. అనఘు వేదధ్యయనాసక్తు నారభ్య, మాణమహోధ్వరుమనుచరిత్రు
సర్వవర్ణాశ్రమ సంరక్షణక్షము, సత్యసంధానునజాతశత్రు
భరతవంశోత్తముఁబ్రభు ధర్మనందను, రాజుగాఁబడసి సురాజ్ఞియయ్యె
వసుధ యధిష్ఠానవతియయ్యె మరిలక్ష్మి, బంధురంబయ్యెను బరమధర్మ

ఆ. మన్నరేంద్రునందు నాపూర్ణతరశర, ద్వైందవాతపంబునందుఁ బ్రీతి
సమమకాసమస్తజనులచిత్తంబు లా, నందరసభరంబునొందదాల్చె - ఆది-అష్టమ-**82**

ఇటుల పదునెనిమిది పర్వముల మహాభారతమున వివిధ సందర్భములకాన్పించు ధర్మజుని మేల్మి గుణములన్నియును నొక్కచో గుదిగ్రుచ్చబడినవి.

ధర్మజుడు పాపరహితుడు, వేదాధ్యయనాసక్తి కలవాడు, మహాయజ్ఞములనొనర్చినట్టివాడు, వర్ణాశ్రమధర్మమును సంరక్షించినట్టివాడు. సత్యమును పలుకువాడు, అజాతశత్రువు, భరత వంశోత్తముడు. **అట్టి వానిని రాజుగ బడసి ధరిత్రి ధన్యయైనది.**

24. ధర్మజ పాలనలో ప్రజలనుభవించిన సౌభాగ్యము క్రింది పద్యములలో వివరింపబడినది.

కం. ధరణిప్రజధర్మసుతు సు, స్థిరనిర్మల ధర్మచరితఁజేసిరుజా త
స్కరపరరాష్ట్ర విబాధల, బొరయ సంతతసమృద్ధిఁ బొందెవిభూతిన్ – ఆది–అష్టమ–**83**

కం. తనరితద్దేశంబున, నవవరతము యజనయాజనాధ్యయనాధ్యా
పనదానములుఁ బ్రతిగ్రహ, మునుననుషట్కర్మములను భూసురవంశ్యుల్ – **84**

కం. పంబియజనాధ్యమున దా, నంబులవర్తిల్లె బ్రాహ్మణప్రియమయి ధ
ర్మంబయి క్షత్రియవైశ్యకు, లంబవిరతపుణ్యకర్మలాలసమగుచున్ – **85**

కం. పరమద్విజ శుశ్రూషా, పరులయిశూద్రాదులవనిఁ బరగిరిధర్మ
స్థిరమతులయి ధర్మజుధ, ర్మరాజ్యమభివృద్ధిఁ బొందెమహిమాస్పదమై–**86**

అనంతరము నారుదుడు ద్రౌపదితో పాండవులేవురును ఏకకాలముననుండవలదని శాసించినాడు.

ఈ సందర్భముగ–ఏవురకిపుడు ద్రుపదసుత యొక్కతియ ధర్మమతి ధర్మపత్నియైనది, యీక్రమంబు లోకాగమంబులందు విరుద్ధము అనుట గమనార్హము వ.–**93**

ఇటమూలమున ఒక్కశ్లోకములో నారదుడు వినిపించిన ధర్మములు నన్నయ సీసపద్యములో వివరించెను.

25. పిదప అర్జున తీర్థయాత్ర సంభవించినది. ఈ సందర్భమున ధర్మజార్జునుల సంభాషణము ధర్మసూక్ష్మ వివరణ పూర్వకమైయున్నది.

ఆ. క్రూరకర్ములయ్యు గోబ్రాహ్మణులకగు, బాధలుడుచు జనులఁబాపచయము
లెట్టియెడలఁబొందవింద్రనందన నీకు, సమయ భంగభీతిఁజనగనేల – ఆది–అష్టమ–**121**

ఇందులకు అర్జునుడిచ్చిన సమాధానము సీతాపరిత్యాగ సందర్భమున శ్రీరాముని మాటలను బోలియున్నది.

కం. భూజన పరివాదంబ, వ్యాజంబున బరిహరింప వలయునుమనకున్
వ్యాజమునధర్మలోపం, బాజిజయా పరిహరింతురయ్య మహాత్ములే. –ఆది–అష్టమ–**123**

ఆర్తత్రాణులైన బ్రాహ్మణరక్షణము, తస్కరశిక్షణము ధర్మమయమైనను సామాన్యుల దృష్టికి నియమోల్లంఘనగా కాన్పించును. అట్టి జనాపవాదము తొలగించుకొనవలెనన్నది యర్జునుని వాదము. ఈ భావము మూలమునగలదు. ధర్మజుడు భ్రాతృవాత్సల్యముతో, పుత్రవాత్సల్యముతో అభిమన్యుని జన్మోత్సవమును నిర్వహించుటలో ఆదిపర్వమున అష్టమాశ్వాసమున ధర్మజునిపాత్ర పరిమితమైనది. ఇచ్చట ధర్మజునకు విప్రులపట్లగల గౌరవాదరములు మాత్రమే ప్రకటితమైనది.

చం. సుతజననోత్సవంబున విశుద్ధయశుండుయుదిష్ఠిరుండుసం
భృత హృదయప్రమోదుఁడయి పెంపుననిచ్చెసువర్ణభూషణ
ప్రతతుల గోధనాయుతము బ్రాహ్మణముఖ్యులకున్ నిరంతర
వ్రతులకువేదవేదులకు వారిజసంభవునట్టివారికిన్. ఆది–అష్టమ–**225**

==========

కురు, పాండవవిరోధము ఒక్కనాట బయలుదేరినది కాదు. ఆ బాల్యము నివురుగప్పిన నిప్పువలెలోలోన మండుచునేయున్నది. అట్టి అగ్నిప్రజ్వరిల్లుటకు కావలసిన ప్రధాన ప్రోత్సాహకములు సభాపర్వమున చోటుచేసి కొనుట, ఈ సందర్భమునందలి విశేషము.

పాండురాజు కోరికగ, నారదుని సూచనగ, శ్రీకృష్ణనకామోదయోగ్యముగ, భావిభారత సంగ్రామమునకు నాందిగ రాజసూయము చోటుచేసికొనినది. శిశుపాల, జరాసంధాదులవధతో ఒకప్రక్క పాండవ పరాక్రమము వేరొకప్రక్క పాండవులకైన శ్రీకృష్ణుని వాత్సల్యము లోకవిదితమైనది. హస్తినాపురి నుండి భయముచే ఇంద్రప్రస్థమునకు పంపివేయబడిన పాండవులు, హస్తినాపురాధీశునికన్న మిన్నయన్న భావన రాజలోకమునకు కలుగ జేయబడినది.

మహాసాధ్విగా మన్నింపబడిన ద్రౌపది, మయసభా విశేషమెరుంగక అజ్ఞానమున నేలబడిన దుర్యోధనునిజూచి పరిహాసముగనవ్వుట, క్షత్రియకాంతోచితముగ కనబడకపోవుటయెకాక, హస్తినాపురాధీశులపై ఈసువహించి ఎటులైనను యుద్ధముకల్పించి, హస్తిననాక్రమించుటకు పునాది వేసినట్టిదియా! అనిపించును.

కాకున్నచో ద్రౌపదిశీలమే దెబ్బతినును. ఇట్లనుటకన్న పైయూహయే సమంజసమనిపించును. అసలు జూదము, పణములు, ద్రౌపదికైన అవమానము అరణ్యావాసము ఇత్యాదులకు కారణభూతులైన వారిలో ధర్మజుడధిక బాధ్యత వహింపవలయునా లేక ద్రౌపదియే కొరవితో తలగోకుకొనినటుల, దుర్యోధనునితో ప్రత్యక్ష విరోధమునకు సిద్ధపడినదా! యనిపించును. అయినను ఇంటిపెద్దగ, బాధ్యత కలవారిగ ప్రవర్తింపవలసిన అవసరము ధర్మజునిదగుటచే లోకము వానిని దూషించుచున్నది.

తరువాత ప్రధానఘట్టము ధర్మజుడు జూదమునకేగుట, సమస్త రాజ్యమును పణముగ పెట్టుట, చివరకు సోదరులను పణముగనొడ్డుట, అంతటితో ఆగక, ఉత్తమ ఇల్లాలు, పతివ్రతయగు ద్రౌపదిని పణముగనిల్పుట యనునని మహాభారతమున తర్కమునకందని చేష్టలు. ఇవి దైవికములనినచో భారతమున ఏ పాత్రకును వ్యక్తిత్వము లేదనవలెను. సర్వమును దైవాధీనములేకదా! అటులగాక పురుషకారమును ప్రసక్తింపవలసివచ్చునెడ ధర్మజుని చేష్టితము మితిమీరిన క్షుద్రవ్యసనముగనే గోచరించును. కనుకనే మహోన్నతునిగ భారత ప్రధాన పాత్రలెల్లరిచే నుతింపబడిన ధర్మజునిలో మచ్చలేదని అంగీకరించుట లౌకిక తార్కికులకు మ్రింగుడుపడని విషయముగ పరిణమించినది.

లోపమెవ్వరిదని చెప్పినను లోకధర్మమునకు విరుద్ధముగ, భారతీయ సంస్కృతికి విరుద్ధముగా ఒక కులస్త్రీకి కూడని పరాభవము చేయబడినది. ఇతరులీ విషయములనెటుల గ్రహించిననూ, పాండవులు మాత్రము ఏనాటికి కోలుకొనలేని పరాభవమునందిరనుట వాస్తవము. అట్టితరి ధర్మశాస్త్రముల మాట ఎటులున్నను, పౌరుషవంతులైన మానవులుగ పాండవులు, కౌరవులతో యుద్ధమునకు సిద్ధము కావచ్చును. శత్రునాశమొనర్చి సంతోషింపవచ్చును. ఇది భారత వీరలోక సహజము. కాని దుర్యోధనుడు ధర్మజుని జూదమున కాహ్వానించినాడు. అట్టితరి ఆత్మహత్యనొనర్చు కొనుటకుకూడ అర్హతను కోల్పోయిన ధర్మరాజు రాజధర్మముపేర మరల జూదమునకు సిద్ధపడినాడు. ఈ చర్యతో ధర్మజుడేరకమైన ధర్మమును లోకమునకు వినిపింపదలచినాడో నేటి తార్కికులు తలలు బ్రద్దలుకొట్టుకొనిననూ గ్రహింపలేకున్నారు.

ఈవిధముగ ధర్మజపాత్రము మహోన్నతమనువారికిని, కాదనువారికిని మధ్య వేలాదిమైళ్లదూరమును కల్పించిన సన్నివేశములకాకరమగుటచే ధర్మజపాత్ర చిత్రణమున సభాపర్వము కీలకమైన పర్వముగ భాసించుచున్నది.

<u>ప్రథమాశ్వాసము :</u>

అర్జునుడు ఖాండవ దహనవేళ మయుని రక్షించియున్నాడు. అందుకు ప్రత్యుపకారముగ మయుడు అతిలోకరమణీయము, భూలోకదుర్లభము అయిన మయసభను నిర్మించి ధర్మజునకు ప్రీతిగావించినాడు.

(1). మయసభ నిర్మాణానంతరము అందుండి సర్వభోగములను అనుభవించుచు ధర్మజుడు **16** సంవత్సరములు ఇంద్ర ప్రస్థమును పాలించెను.

సభాయాంషోడశాబ్దంతు ఇంద్రప్రస్థేతుధర్మజః, భ్రాతృభిస్సహపుత్రైశ్చ స్వర్గతుల్యమపాలయత్.

(ఆ సభాయందుండి ఇంద్రప్రస్థమును సోదరులతోను, పుత్రలతోకూడి స్వర్గతుల్యముగ **16** సంవత్సరములు ధర్మరాజు రాజ్యమును పరిపాలించెను) **(1.** మహాభారత సారోద్ధారము**)**

రాజసూయయాగమారంభించునప్పటికి ధర్మజుని వయస్సు 77 సంవత్సరములు. అనంతరము సర్వలోక సంచారియైన నారదుడు ధర్మజునివద్దకు వచ్చి పాండురాజుదైన కోరికను వివరించినాడు.

కం. జనపతులురాజసూయం, బొనరించిన వారుశక్రునొద్దను సురపూ
జనలొందుచుండుదురు కో. రినకోర్కులువడయుచును హరిశ్చంద్రుక్రియన్-సభా-ప్రథమ-**87**

చం. కొనకొని మర్త్యలోకమునకుంజని సన్మునినాథ యిందు నా
యునికియు రాజసూయమఖమున్నతి జేసినధన్యులింద్రునం
దునికియునాతనూజునక నూనయశోనిధియైనధర్మనం
దనునకుఁజెప్పివాని నుచితస్థితిఁబన్పుడుదానిఁజేయగన్ **-88**

చం. అనుపమశక్తిమంతులు మదాత్మజులేవరుదేవతావరం
బుననుదయించియున్న కృతపుణ్యులు వారలలోన నగ్రజుం
డనఘుడు రాజసూయము మహామతిఁజేయగనోపు శత్రుసూ
దనుడయి సార్వభౌముఁడయి తమ్ములబాహుబలంబు పెంపునన్ **-89**

వ. అట్లేని నాకునస్మత్పితృపితామహనివహంబుతోడనాకాధిపలోకసుఖావాప్తి యగుననిన నప్పాండురాజు వచనంబులు నీకెరింగించు వేడుకనిటువచ్చితి **-90**

కం. న్యాయమునఁ రాజసూయము, సేయుము నీపితృగణంబుఁ జెచ్చెరనధిక
శ్రీయుతసురగణపూజ్యులఁ, జేయుము శక్రుసభనుండఁ జేయుమువారిన్. - సభా-ప్రథమ-**91**

వ. దిగ్విజయోపార్జితంబులయిన ధనంబుల బ్రాహ్మణసంతర్పణంబును ధర్మమార్గంబునం జాతుర్వర్ణ్య రక్షణంబునుంజేసి సామ్రాజ్యంబు బ్రకాశింపుము మరి రాజసూయంబు బహువిఘ్నంబు బ్రహ్మరాక్షసులు దానిరంద్రంబరోయుచుండుదురదియును నిర్విఘ్నంబునసమాప్తంబయ్యెనేని నిఖిల ప్రజాప్రళయ కారణంబైన రణంబగునని చెప్పి నారదుండరిగిన **-92,** ఇది యథామూలము.

పై వాక్యములను సుదీర్ఘముగ వివరించుటలో ఒక విశేషమున్నది. ఇది మహాభారత ప్రధానకథకు మూలస్తంభము. ఈ యాగమునకువచ్చిన దుర్యోధనుడు మయసభా విశేషపరిజ్ఞాన లేమిచే అభాసుపాలయి, ద్రౌపది పరిహాసమునకులోనయి, ఫలితముగ ఈర్ష్యా, ద్వేషములనుపెంచుకొని చివరకు జూదము నేర్పాటు గావించి ద్రౌపదిని పరాభవించి, కురువంశ నాశమునకు కారణమైనాడు.

కనుకనే రాజసూయమొనర్చిన పితృదేవతలు స్వర్గప్రవేశమునందుట, ప్రళయసదృశ యుద్ధము సంభవించుట జరుగునని నారదాదుల ముఖమున ఇంద్రసభాస్థితుడైన పాండురాజు వార్తనంపినాడు. ఇచట రెండు ముఖ్యవిషయములున్నవి. అందొకటి పాండురాజాదులు స్వర్గమును ప్రవేశించుట, రెండవది సర్వక్షేరవనాశము. ఈ రెండింటిని సాధించుటకైన సూచనమును పితృదేవతలు సూచించుట. ఆవార్తను త్రికాల వేత్త సర్వజన కల్యాణకాంక్షియైన నారదుడు ధర్మజునకు నివేదించుటయనునది ముఖ్యము. తన తండ్రియగు పాండురాజు స్వర్గస్థితినందుటకై, సర్వకురువంశనాశనమునకు ధర్మజుడు సిద్ధపడుట న్యాయసమ్మతమా! అనికూడ యనిపించవచ్చును. సూక్ష్మముగ జూచినచో ఒక ధర్మసూక్ష్మమిట తెలియగలదు.

26. భూభారమడంచుటకై నారాయణునిచే వేయబడిన పథకమే పాండవ కౌరవ విరోధమన్న విషయము భారతారంభముననే చెప్పబడినది. అందుకుసహకరించు దేవకూటమిలో మృత్యుపాశమునుచేత ధరించిన యముడు ప్రథమగణ్యుడుగదా! కనుకనే వాని సభనుండి పాండురాజు వార్తనంపినాడు. దానిని భూమిపై ప్రవర్తింపజేయువాడు యమాంశ సంజాతుడైన ధర్మరాజు. ఇటుల చూచినచో మయసభా నిర్మాణము, రాజసూయ యజ్ఞసంకల్పముల వెనుకగల దైవబోధన రహస్యము గ్రాహ్యము కాగలదు.

27. ఈ సందర్భమున ధర్మజుని వాజ్ఞైపుణ్యమును, వివేకమును, దూరదృష్టిని తెల్పునట్టి క్రిందిమాటలు గమనార్హము.

సీ. పాండుమహీపతి పనిజేసి నారద, మునివచ్చి వీరెల్లవినుచునుండ
రాజసూయంబు తిరంబుగా జేసినీ, పితృపితామహులకుహితముసేయు
మని పంచెనన్ను నెయ్యముననో నాకట్టి, బలముసామర్థ్యంబుగలుగుటెరిగి
పంచెనో తత్క్రతుప్రారంభున కొడం, బడితివీరిందరు గడగిదీని

ఆ. నిత్యసత్యవచననిపుణ నిర్మలబుద్ధి, నిర్ణయించిపనుప నీనియోగ
కాంక్షనున్నవాడఁ గమలాక్షయనిన ధ, ర్మాత్మజునకునిట్టులనియెఁజక్రి-సభా-ప్రథమ-107

మూలమునగల ఆరుశ్లోకముల భావము యథాతథముగ గ్రహింపబడినది. పై మాటలలో "నెయ్యమున్నో నాకట్టి బలము సామర్థ్యంబుగలుగుటెరిగి పంచెనో" అను మాటలు గమనార్హము. ఆప్యాయముచేతనొ లేక తానట్టి పనిని దిగ్విజయముగ సాధింపగలనను నమ్మికవారికిగలదొయను భావము. కాని ఇచట సారాంశము తనకట్టి సామర్థ్యము కలదా! యని ఆత్మపరిశీలన చేసుకొనుచున్నటుల శ్రోత భావింపవలెనని ధర్మజుని భావనగ ధ్వని. కాని నిజమునకు ధర్మజుడట్టి డోలాయమానస్థితిలోనున్నచో ఆత్మ విశ్వాసము కలిగిన పిదపనె రాజసూయ యాగ ప్రయత్నమునకు పూనుకొనుటగాని, చేయుదునని మాటయిచ్చుటగాని జరుపవలయును. కాని 'తత్క్రతు ప్రారంభమునకొడంబడితి' అని పనికి పూనుకొన్నటుల నారదముఖమున పాండురాజునకు మాటయిచ్చినటులుగ

ధర్మజుడు చెప్పుచున్నాడు. అట్టితరి "నిర్ణయించిపనుప నీనియోగకాంక్షనున్నవాడ"నను మాటలసందర్భములగును. కాని ధర్మజుడట్టి అసందర్భములు పలుకడు. పాండుమహీపతి పనుపున నారదుడు నియమించుటచే పితృవాక్యమును కాదనలేక అంగీకరించితిననుధ్వనిని పూర్వవాక్యములలో వెలిబుచ్చినాడు. ఈచిత్ర సంభాషణమున క్రింది విషయములు స్పష్టము. ధర్మరాజునకు రాజసూయము చేయవలెననియున్నది. శ్రీకృష్ణ సహాయములేనిచో అతడాపనిని నిర్విఘ్నముగ నిర్వర్తింపలేడని తెలియును. సర్వజన క్షయకారకము, ప్రకృతమున సర్వరాజలోక విరోధమును యిమిడియున్న ఈ కార్యమునకు శ్రీకృష్ణాభిప్రాయమెటులుండునోయన్న భయమునూ లేకపోలేదు. అందుచే తన అభిరుచిని స్వనిర్ణయముగ కాన్పింపకుండ, నిర్బంధముగ శ్రీకృష్ణ సహాయము లభించునటుల వలసినంత లౌక్యమున ధర్మజుడు మాటాడిన ఛాయలు ప్రకృతపద్యములో కాన్పించును. ధర్మజ వాఙ్నైపుణ్యమునకు మచ్చుతునక అనగల సందర్భములలోనొకటిగ దీనిని గ్రహింపవచ్చును.

28. జరాసంధుని చంప భీమార్జున, కృష్ణులను బంపునపుడు ధర్మజుడు భావించిన భావనలోనొకటి రెండు విశేషములున్నవి.

కం. నయనములునాకుఁ బవనత, నయవిజయులు మనము కమలనాభుడు వీరిం
బ్రియహితులఁబాసినిమిషం, బయిననునెట్లుండ నేర్తునవిచేష్టఁడనై – సభా–ప్రథమ–168

పై సందర్భమున తననల్వురు సోదరులలో భీమార్జునులే యటనున్నవారలగుటచే వారిరువురిని మాత్రమే నయనములతో పోల్చుట జరిగినది. ఇది యథామూలము.

"శ్రీకృష్ణార్జునులందలంచినవారికి శ్రీవిజయంబులగుననిన నమ్మహాత్ములదనకు సహాయులుగా బడసిన భీమసేనునకు శ్రీవిజయంబులగుటయేమిసందేహంబనినిశ్చయించి" – 169–ఇది యథామూలము.

ఇచట ధర్మజుడు అర్జున, శ్రీకృష్ణులను నరనారాయణులుగ భావించినటుల స్పష్టము చేయబడినది. భీమార్జున, నకుల, సహదేవులు సర్వరాజలోకమును జయించి ధనరాశులను తెచ్చి ధర్మజునకొసంగిన పిదప, తొల్లి శ్రీకృష్ణునకు రాజసూయ యాగారంభవాంఛను తెల్పియున్నవాడైనను, ధర్మజుడు పునఃశ్రీకృష్ణానుమతినంది, తన సంస్కార బలములో, శ్రీకృష్ణాశీర్వచనమును పొందినవాడైనాడు.

"నీకిష్టంబయిన యజ్ఞంబుచేయించి నాకును లోకంబులకుంబ్రియంబు సేయమొండె". –సభా–ప్ర–277

ధర్మజునిపై మాటలకు శ్రీకృష్ణుడిట్లుపల్కినాడు.

ఉ. పూజ్యుడవెల్లవంశముల భూపతులందున ధర్మనిర్మల
ప్రాజ్యవిభూతినద్దివిజపాలకునట్టిఁడ నీక యొప్పె సా
మ్రాజ్యము దైవసంపదయు మానుషసంపదపేర్మి కావునన్
యూజ్యుడవిప్డునీవ భరతాన్వయభూషణ ధర్మనందనా – సభా–ప్రథమ–278

ధర్మజుడు ప్రత్యేకముగా శ్రీకృష్ణాశీస్సులు వాంఛించినందుకుగాను, నీకయొప్పె దైవ సంపదయు.. అని దైవబలము నీపట్లనుండునని తన ఆశీస్సులనందించినాడు.

(1). ఇట మూలమున ధర్మజుడు దిగ్విజయ యాత్రానంతరము ప్రజలను పాలించినటుల, విపులముగ వర్ణించి, మరియు శ్రీకృష్ణుని యజ్ఞమునకు అనుజ్ఞయిమ్మని అడుగు సందర్భమున శ్రీకృష్ణునే యజ్ఞదీక్ష

వహింపుమని, తద్ద్వారా తాను, అనుజులుకూడ పాపరహితులగుదురని, అట్లుకానియెడల తనకు అనుజ్ఞ నిమ్మని ధర్మరాజు కోరినట్లుగలదు. అటులనే శ్రీకృష్ణుడు ధర్మజుని గుణప్రశంస చేసినటుల కాన్పింపదు. అనువాదమున నన్నయ కల్పించినాడు (1. వ్యాస భారతము)

రాజసూయనిర్వహణమునకు మున్నుగ సల్పిన జైత్రయాత్రయందు ధర్మజు పనుపున ధర్మజ సోదరులు సాధించిన విజయములలో ఒకటి,రెండు చూడదగట్టివి. సమస్తభూమండలమును జయించినటుల స్థూలవర్ణనమున్నను విశేషములుగ మనకు తోచునట్టివి ఒండు రెండు క్రింద పేర్కొనెదను. నకులుడు శ్రీకృష్ణుని జయించినాడు.

(2). తత్రస్థః ప్రేషయామాస వాసుదేవాయ కింకరం, సచాస్యయాదవైస్సార్ధం ప్రతినిగ్రాహ శాసనం.
(అచటినుండియె శ్రీకృష్ణునివద్దకు సేవకునితో కబురంపెను. ఆ శ్రీకృష్ణుడు యాదవులతోగూడి నకులుని ఆజ్ఞను శిరసావహించెను)

శ్రీకృష్ణానుమతితోడనే ధర్మజుడు రాజసూయమునకు పూనుకొనినాడు. కనుక రాజసూయమునకు పూర్వరంగమైన జైత్రయాత్ర సంప్రదాయమును వాత్సల్యముతో శ్రీకృష్ణుడు మన్నించినాడని గ్రహింప వలయును. హనుమంతునికూడ జయించినటుల మహాభారత సారోద్ధారము వివరించుచున్నది. దీని కాధారము వారెచటనుండి గ్రహించినారో తెలియదు.

కృష్ణార్జునౌగతౌచాబ్ధిం యజ్ఞాయధనసాధనే, బద్ధస్సేతుస్తదా తాభ్యాం హనుమాన్నిర్జితస్తదా!
(శ్రీకృష్ణార్జునులిరువురు యాగసంబంధమగు ద్రవ్యములను సంపాదించటకు సముద్రమునుగూర్చి వెళ్లిరి. అచట బాణములచే సేతువు నిర్మింపబడుటయు, హనుమంతుడు జయింపబడుటయు సంభవించినది. (2. మహాభారత సారోద్ధారము)

(3). అనాటికి విభీషణుడే లంకను పాలించుచున్నాడుట. సహదేవుడు ఘటోత్కచునిపంపి కప్పములు తెప్పించినాడని దాక్షిణాత్యకోశములందుగలదని, ప్రక్షిప్తమనిగలదు (3. ఆంధ్రమహాభారతము, పేజి-272, సభా-ప్రథమ-పద్యం-262)

29. యజ్ఞశాలయందు ధర్మజుడు వివిధ వ్యక్తులను వివిధములైన పనులయందు నియోగించుటలో వివేకమును, దూరదృష్టిని, లోకజ్ఞతను ప్రదర్శించియున్నాడు. సహదేవుడు ధౌమ్యోపదిష్టంబులైన యజ్ఞోపకరణములు తేర నియోగించెను. సహదేవుడు అధ్యాత్మిక విదుడనియు, దూరదృష్టి గలవాడనియు భారతవిమర్శకులలో పలువురి అభిప్రాయము. ఇంతియెకాక వానికి భవిష్యము తెలుసునని కొన్ని గ్రంథములందున్నటుల కొందరు విమర్శకులు తెల్పియున్నారు. మొత్తముపై వివేకి, ఆధ్యాత్మికవేత్తయగు సహదేవుని యజ్ఞద్రవ్యములు తెచ్చుటకు నియోగించుట సమంజసము. బంధువులను ఆహ్వానించుట, ఆదరించుటలు కూడ దూరదృష్టిగల సహదేవునకప్పగించుట వివేకవంతమైనచర్య. దక్షిణలు,దానమొసంగుచోట కృపాచార్యుని నియమించుట జరిగినది. పూజ్య, పూజావ్యతిక్రమంబు జరుగకుండనుండవలెనన్న నెదుటవాని యోగ్యతను గ్రహింపగల కృపాచార్యుడుండుట సమంజసము. కృతాకృతపరిజ్ఞానమున వంశగౌరవము తెలిసినవారు, నిలుపవలసిన బాధ్యతగలవారునగు భీష్మద్రోణులు నియుక్తులైరి. అసూయాపరుడైన దుర్యోధనుని ఉపాయనంబులుగైకొను నుద్యోగంబుననియమించుట ఆత్మగౌరవము, పౌరుషముగల ధర్మజుని క్షాత్రలక్షణమును సూచించుచున్నది. భవిష్యమునరానున్న, రావలసిన

యుద్ధమునకు దుర్యోధనుడు మూలస్తంభము. వానిలో అసూయజ్వాలలు రేకెత్తినగాని దైవనిర్ణయము ప్రవర్తితము కాజాలదు. అందుకు తగిన పదవి వానికీయబడినది. ఇది యధామూలము.

<u>ద్వితీయాశ్వాసము :</u>

30. రాజసూయము మహాభారత యుద్ధమునకు కారణభూతమగునని తొలుత నారదుడు చెప్పియే యున్నాడు. అందుకు ప్రారంభఘట్టము శిశుపాలవధ యగుచున్నది. రాజసూయ ప్రారంభమున యజ్ఞ వాటికనున్న శ్రేష్ఠులలో అగ్రగణ్యునొకని పూజించుట శాస్త్రవిధానముగ తెలియుచున్నది. అందుకు వలసిన గుణగణములను పేర్కొనుచు భీష్ముడిటుల చెప్పినాడు.

మత్త. స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుడున్
భూతలేశుడు సంయుజుండును బూజనీయులు వీరిలోఁ
బ్రీతినెవ్వడు సద్గుణంబులఁబెద్ద యట్టిమహాత్ము వి
ఖ్యాతుఁబూజితుఁజేయుమొక్కనిఁగౌరవాన్వయవర్ధనా –సభా–ద్వితీయ–4

భీష్ముని మాటలలో అగ్రతాంబూలగ్రహీతకు ఆరుగుణములు వివరింపబడినవి. ఇట మూలమున భీష్ముడు అగ్రపూజ్యుని గుణములను వివరింపలేదు. శ్రీకృష్ణుడే అగ్రపూజ్యునిగ తెలుపుచు అతని గుణవిశేషాదులనే వర్ణించినాడు. ఈ గుణప్రసక్తి నన్నయ కల్పించినట్టిది. అందు ఇష్టుడున్ అనుమాట ముఖ్యము. ధర్మజుని ఆలోచనములో ఈ గుణము శ్రీకృష్ణునికొక్కనికే నిండుగ వర్తించునన్న విషయము భీష్మునకుతెలియును.అటులనే సద్గురుడన్న విశేషణముకూడ శ్రీకృష్ణునకేవర్తించును. అయినను దూరదృష్టిగల ధర్మజుడు బాధ్యతను తనపై నిడుకొనక భీష్ముని సూచింపగోరినాడు.

అందుకు భీష్ముడు"లోకపూజ్యునచ్యుతు పూజింపుమధిప అదియెచూవె యజ్ఞఫలము" అని శ్రీకృష్ణుని సూచించినాడు. ఇచట యజ్ఞఫలమన్న మాటలోనెంతయో ధ్వని కలదు. ఇచటి యజ్ఞఫలము రెండు విధములు. ధర్మరాజు కురుసమ్రాట్టగుట సాధారణ లౌకికప్రయోజనము, మహారణవేర్పడి భూభార మడంగుట దేవతా ప్రయోజనము, రెండు ప్రయోజనములను సాధించుటకు శ్రీకృష్ణపూజ దోహదకారి కానున్నది. యజ్ఞారంభముననే శిశుపాలుడు వధింపబడి విరోధిమూకలెల్లరూ భవిష్యద్రణ రంగమునకు సంసిద్ధులు కావలెనన్న, పాండవపక్షపాతి, శిశుపాల జరాసంధాదుల విరోధియగు శ్రీకృష్ణుని పూజింపవలసియున్నది. అన్నిటికన్న మిన్నగా శ్రీకృష్ణుడు, శ్రీమన్నారాయణుడన్న సత్యము భీష్మునకు తెలియును. ఇన్ని ప్రయోజనములను సిద్ధింప జేసికొనుటలో ధర్మజుడు వివేకవంతముగా ప్రవర్తించినాడని చెప్పకతప్పదు. ఇక ఇచట మూలమున దశావతారవర్ణన ఘట్టమున్నది. నన్నయ తెనుగున సంక్షిప్తీకరించినాడు.

31. అనంతరము ప్రధానమైన ఘట్టము శిశుపాలవధ. ఈ సందర్భమున శిశుపాలుడు శ్రీకృష్ణుని గ్రహింపలేక పోయినాడన్నది సారాంశము. ఈ పట్టున వ్యాసభగవానుడు శ్రీకృష్ణుని పరబ్రహ్మగ వర్ణించుట గమనార్హము. అటుల శ్రీకృష్ణుని దర్శింపగలవారు మహాభారతమునఎందరుగలరన్న ప్రశ్నకు సమాధానము చెప్పుట కష్టము. కేవలము భీష్మ, ధర్మజులే శ్రీకృష్ణుని సాక్షాత్తు నారాయణునిగ నిండుగ తెలియగలరని చెప్పవచ్చునేమో!

భీష్ముడు శిశుపాలునితో, శ్రీకృష్ణునిగూర్చి వర్ణించిన తీరు యిటులున్నది.

సీ. బుద్ధియుమనమును బురుషుండునవ్యక్త, మగుచున్న ప్రకృతియునంబరంబు
ధరణియుదరణియుఁదహనుండు జంద్రుండు, గాడ్పును దిక్కులుగాలములును
దానయై జంగమస్థావరాత్మకమైన, సకలభూతప్రపంచంబు నెల్ల
దన దివ్యశక్తియైఁ దాల్చినసర్వాత్ము, సర్వభూతేశ్వరు సర్వవంద్యు.

తే.గీ. నధికయోగనిష్ఠితాత్ములగు మహా, యోగివరులుఁ తత్వయుక్తిఁజేసి
యెఱిగినట్టు నీకునెఱుగంగబోలునే, యనుచు భీష్ముడన్నయవసరమున -సభా-ద్వితీ-29

మానవ రూపములోనున్న అవతారపురుషుని పై విధముగ దర్శింపగలుగుట నాడు శిశుపాలునికే కాదు, నేడు కోటికొక్కడైననటుల గ్రహింపగలడా! యనునది యనుమానమే. అయినను కథాకాలము ద్వాపరయుగాంతము. నాటికింకను మానవులలో పలువురు స్వర్గమర్త్యములమధ్య రాకపోకలు సాగించు చున్న కాలము. భారత పాత్రలు పలువురు దివ్యాంశ సంభూతులనికదా! మనవిశ్వాసము.

32. ఇక ప్రకృతము ధర్మజకృతమైన శ్రీకృష్ణ వర్ణనముకూడ ధర్మజుని, భీష్మునివంటి వానిగ తెల్పుచున్నది.

ఉ. ఆదిజుడైన బ్రహ్మయుదయంబున కాస్పదమైనవాఁడు వే
దాది సమస్తవాఙ్మయములందుఁ బ్రశంసితుఁడైనవాఁడులో
కాది త్రిలోకపూజ్యుఁడని యాత్మనెరింగిపితామహుండు దా
మోదరుఁ జెప్పెఁబూజ్యుఁడని యుక్తమ కాకిదియేమిదోసమే -సభా-ద్వితీ-18

కం. పరమార్ధ ప్రతిభఁదమో, హరునచ్యుతు భీష్ముడెరిగి నట్లెరుగగ నీ
కరిది శిశుపాల!పెద్దల, చరితంబల్పులకు నెరుగశక్యమెయెందున్ - సభా-ద్వితీ-19

కం. గురుడని సమస్తలోకో, త్తరుడనినీకంటె వృద్ధతములైన నరే
శ్వరులచ్యుతునర్చననెడఁ, గరమభినందింప నీకుఁగాదనదగునే-సభా-ద్వితీ-20

ఇట మూలమునగల విపులవర్ణనమును సంక్షిప్తీకరించి పైపద్యమును నన్నయ కల్పించినాడు

33. ఇంతవరకు నడచిన వర్ణనము తాత్త్విక విశ్వాససంబంధము. అనంతరము అంతుబట్టని లౌకికవిషయమొకటున్నది. భీష్ముడు శిశుపాలుని కృష్ణతత్వము తెలిసి కొనుటకయోగ్యుడని చెప్పుచుండగా సహదేవుడు ఇట్లనినాడు.

చం. ఎడపకయర్ఘ్యమచ్యుతునకిచ్చితమిచ్చిన దీనికిందొడం
బడమని దుర్జనత్వమునఁబల్కెడు వీరులమస్తకంబుపై
నిడియెదనంచుఁదాఁజరణమెత్తె సభన్ సహదేవుఁడట్టిచో
నుడిగిసభాసదుల్పలుకకుండిరి తద్దయుభీతచిత్తులై-30

ఇచట సహదేవుని ప్రవర్తనమును గ్రహించుట క్లిష్టతరముగనున్నది. రాజసూయమునొనర్చువారు వారికి నచ్చినవారిని తొలుత పూజించుట సంప్రదాయమగుచో శిశుపాలుడు ప్రశ్నించియే యుండరాదు. సభాసదులెల్లరు అంగీకరించినవాడే తొలుత పూజింపబడవలెననియున్నచో, ఎవడు ఒడంబడక పోయినను వాని మస్తకమున

పాదమునుంతుననుట ఉచితముగ కాన్పింపదు. దుర్జనత్వమునఁబల్కెడు అనుటచే శిశుపాలునివలె కృష్ణాధిక్యము తెలిసియు పూర్వవైరమున వితండవాడమునకుదిగిన వారిని సహదేవుడు ధిక్కరించెనని భావింపవలసియున్నది. ధర్మజుడు సహదేవుని కాదనుకుండుటచే నాతనియూహయు నిట్టిదియే యని తలపవచ్చును. ఈ సందర్భమున పాండవులదైన యీ యూహకు దేవతలానందించిరని ప్రత్యేకముగ చెప్పబడుట గమనార్హము.

చం. చెలువుగఁబుష్పవృష్టి గురిసెన్ సహదేవుపయిన్ దివంబునన్
వెలయగసాధువాదములు వించెసభాసదులెల్ల విస్మయా
కులితమనస్కులైరి తనకుంచెయుఁ గృష్ణమృగాజినంబునుం
బలుమరువీచుచుంగలహబంధుఁడు నారదుఁడాడె వేడుకన్ -31 ఇదియథామూలము.

అనంతరము శిశుపాలాభిమానులైన రాజులెల్లరు ఒకపక్షముగజేరి యుద్ధసన్నద్ధులైరి. పర్యవసానమున మఖవాటికయందే మహాయుద్ధము సంభవించనున్న సూచనలు కాన్పించినవి. అందుచే ధర్మజుడు భీష్మునిట్లు ప్రార్థించినాడు.

తర. ధరణిలోగల రాజులెల్లరుదారుణక్షయకాల సా
గరములట్లు గలంగిరిప్ప మఖప్రయోగము విఘ్నముం
బొరయకుండఁబ్రజాపకారముపుట్టకుండగ నీవుఁచె
చ్చెరఁబితామహ వీరికిచ్చటఁజిత్తశాంతి యొనర్పవే. సభా-ద్వితీయ-35

అంతట భీష్ముడు విరోధిరాజలోకమును కుశ్మలతోను, శ్రీకృష్ణుని సింహాముతోడనుపోల్చి ధర్మజునకభయ మొసగినాడు. చివరకు శిశుపాలుడు శ్రీకృష్ణుని సుదర్శన చక్రధారచే హతుడైనాడు. ఇది యథా మూలము.

ధర్మరాజు సంకల్పిత రాజసూయ యాగారంభము సర్వరాజలోకమును రెండు పక్షములుగ ఛేదించినది. జరాసంధ, శిశుపాలురనుచంపి శ్రీకృష్ణుడు తనకుగల అడ్డంకిని తొలగించుకొనినాడు. పాండవ, యాదవవంశములు రెండును మరింత సన్నిహితమైనవి. దుర్యోధనుని మిత్రమండలి చావుదెబ్బ తినినట్లైనది. ఈభావన క్రిందిపద్యమున స్పష్టము చేయుబడినది. ఇట మూలమున విపులముగ యజ్ఞ క్రియాకలాపములు, దాన విశేషములు దేవగణ ప్రశంస గలదు. నన్నయ భావమును గ్రహించినాడు.

ఉ. దేవగురుద్విజప్రకరతృప్తికరున్వరరాజసూయయ
జ్ఞావభృధాభిషేకవిమలాంగువిశుద్ధయశోనిధిన్ జగ
త్పావనుధర్మనందనుసభాస్థితుజూచిముదంబుసెందిరిం
ద్రావరజాదిమిత్రలసహత్వముఁబొందిరిధార్తరాష్ట్రులున్ సభా-ద్వితీయ-73

రాజసూయ పరిణామములు ధార్తరాష్ట్రులలోనసహనత్వమును రేకెత్తించినది. దుర్యోధనుడు మయసభా నిర్మాణ వైచిత్రినెరుంగమి పాంచాలీసహిత పాండవులయెదుట నవ్వులపాలగుట, సాధారణమైనను ధర్మజుని సంపదలు, సర్వరాజలోకము వానియెదుట మోకరిల్లుట యసాధారణమైన అసూయను కలిగించి ఫలితముగ పాండవనాశమునకైన మార్గములకై యన్వేషించునటుల గావించినది.

34. ఇచ్చట ఒక విషయము గమనార్హము. ధర్మజుడు యమసభనున్న పాండురాజు ఇంద్రసభకేగుట లక్ష్యముగ రాజసూయమొనర్చినాడు. కాని రాజసూయానంతరము శ్రీకృష్ణుని సాగనంపుచు ధర్మజుడు పల్కిన పల్కులు స్వభావసిద్ధముగ లేనట్లనిపించును.

ఉ. నీకరుణంగరంబురమణీయతరంబయిసర్వవిఘ్నదూ
రీకృతమైసమాప్తినొనరెన్ధరణీధరయిమ్మఖంబుభూ
లోకములోననేనునృపలోకనమస్కృతిఁ గీర్తిఁబర్వితిన్
నాకులమున్‌వెలింగె సుగుణంబులకాస్పదమై పవిత్రమై. సభా-ద్వితీయ-81

ఇట మూలమున ధర్మజుడు శ్రీకృష్ణునితో నీదయవలన యజ్ఞము పూర్తిగావించితిని తద్వార సమస్త రాజలోకనసమస్కృతిని, రత్నరాసులను పొందితిని అని మాత్రమే నుడివినాడు. "నాకులమున్ వెలింగె సుగుణంబుల కాస్పదమైపవిత్రమై" అను కులప్రసక్తి కన్పట్టదు. తెనుగున నన్నయకల్పించి ధర్మజుని పాత్రకు మెరుగుపెట్టినాడు.

పై వాక్యములలో తొలుత సర్వరాజలోకనమస్కృతమై తనకీర్తి వెలింగినందుకు ధర్మజుడు మిక్కిలి సంతసించినట్లున్నది. పిదప తనకులము పవిత్రమైనందులకు సంతసించినాడు. కాని సాధారణ దృష్టితో చూచినచో పాఠకునకు మరియొక భావము కలుగక తప్పదు. సర్వ రాజలోకముతోను అకారణ, అకాల విరోధమును తెచ్చిపెట్టిన ఈ మఖారంభమునకు ప్రధాన కారణము పాండురాజుదైన ఇంద్రసభా ప్రవేశ వాంఛ. అట్టితరి మఖము సుఖాంతమైన వెంటనే యజ్ఞకర్తయగు ధర్మజుడు ఔత్యాభము తీర్చుకొన గలిగితినని సంతసించినటులుండుట స్వభావసిద్ధమగును.కాని ఇచట ధర్మజుడు తనకు కీర్తిలభించినందులకు తొలుత సంతసించినటుల వర్ణింపబడినది. అయినను కులము పవిత్రమైనదను మాటలో తనవంశీయులైన పూర్వులెల్లరు ఉన్నతినంద గలిగిరను భావము ధ్వనితమగుచున్నదని భావించుటకుకూడనవకాశము గలదు. రాజసూయము పరిసమాప్తినందిన తరువాత దుర్యోధనుడు మయసభ విశేషములను చూచుటకేగి అందు ద్రౌపదీ, పాండవేయులచే అవమానింపబడి హస్తిపురికి మరలివచ్చి శకునియెదుట తనభంగపాటుకు వగచుచు పాండవుల వైభవమునెట్టైనను హరించవలెనను తనమనోగత దురాలోచనమునిట్లు వెలిబుచ్చెను.

చం. అతులపరాక్రమార్జితములైన ధనంబులపేర్మిఁజేసియు
న్నతమగుచున్న పాండునరనాథతనూజులలక్ష్మి నాకస
మ్మతమయి సూవెలింగె విను మాతుల మానధనాఢ్యుడైనభూ
పతి సహియింపనోపునె సపత్నులవృద్ధియునాత్మహానియున్-సభా ద్వితీయ **98**

ఇట మూలభావమును గ్రహించి నన్నయ కల్పించినాడు. మూలమున "మానధనాఢ్యుడైన భూపతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్" అనునది కన్పట్టదు. లోకమున మానధనుడైనరాజు ఇతరరాజన్యుల వృద్ధిని, సంపదనుచూచి సహింపజాలడనునది సహజము. కావున దుర్యోధనునికిగల అసూయ సుక్షత్రియులైన వారికి సహజమే కదా! ఇదియె ద్యూతఘట్టమునకు అంకురార్పణ గావించినది.

అనంతరము శకుని ధర్మజుడు ద్యూతప్రియుడుగావున వారిసంపదను మాయాద్యూతమున గెలిచి నీకు ప్రియంబొనరించెదనని దుర్యోధనుని సమాధానపర్చినాడు. ఇందులకు దుర్యోధనుడు సమ్మతించుటకు కారణము పాండవులను సమరమందు గెలువజాలడను విషయము తనకు తెలిసి యుండుటయె. బలవంతుడైన శత్రువును బలము చాలనివాడు సామ, దాన, బేధ, దండోపాయములను నాలుగింటియందు ఏదో ఒక దానిచే వశమొనర్చు కొనుట లోకమున గలట్టిది. అందులకె దుర్యోధనుడు మాయాద్యూత కైతవమునకు సిద్ధపడినాడని భావించవచ్చును. అనంతరము ధృతరాష్ట్రానుమతమును అర్థించెను. అందులకాతడొడంబడక విదురునితో మంతనములు చేసెదననిన దుర్యోధనుడు తన మనోనిశ్చయమును ధృతరాష్ట్రునకిట్లు ఎరుకపర్చినాడు.

తే. దీని కొడబడుమొడబడ వేనినేడ, యీక్షణమ సర్వభక్షుచే భక్షితుండ
నగుదుఁదెల్లమేనట్లైన వగపుదక్కి, విదురుడునునీవునుండుఁడు ముదముతోడ–సభా–ద్వి–127

ఇట మూలమున దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో ప్రాణత్యాగమొనరించెదనని మాత్రమే పలికెను. అనువాదమున నన్నయ ఈక్షణమసర్వభక్షుచే బక్షితుండనగుదు అను మాటలు కల్పించినాడు. తనయుని చావుకు వెరచి ధృతరాష్ట్రుడు అధర్మమని తలపుమాని ఒడంబడినాడు. వెంటనే ధృతరాష్ట్రుడు విదురునకు విన్నవించి ధర్మరాజునితోడ్కొని రమ్మని నియోగించెను. అంత విదురుడు, కలి ద్వాపర సమీపంబగుటయు జూదంబఖిల ప్రజాక్షయకరంబగుటయు–129 తలపోసి ధృతరాష్ట్రుని ఆ అకృత్యమునుండి విరమింప ప్రయత్నించెను. తదుపరి ధృతరాష్ట్రుడు దుర్యోధనునకు జూదంబువలదని పరార్ధపరిగ్రహబుద్ధిజెసి పాపమ్ముగునని పలువిధములు బోధచేసి నీకు వలయునంత అర్థము గలదు. కావున నీవును యజ్ఞము ఏదైనను చేయుమనిచెప్పిన అతనికి దుర్యోధనుడిట్టులనియె.

కం. ఇమ్ములధర్మజుతో జూ, దమ్మాడగగాన్ప నాకుధరణీశ్వర య
జ్ఞమ్ముదియసమస్తైశ్వ, ర్యమ్ములువడయగనుపాయమభిమత బుద్ధిన్. –సభా–ద్వి–138

పై పద్యము మూలమునలేనట్టిది. నన్నయ కల్పితము. భావము మాత్రము గలదు. చివరగ దుర్యోధనుడు పురాణ ధర్మములను ధృతరాష్ట్రునియెదుట వల్లెవేసినాడు.

వ. జూదంబన్నది పురాణములయందును వినంబడు దీనదోషంబులేదు సుహృద్ఘాతంబున దేవతలు దేవ సాయుజ్యంబు వడయుదురు. ఈ భావము యధామూలము –సభా–ద్వితీయ–151

35. తదనంతరము విదురుడు ధర్మజునికడకేగి విషయమంతయు ఎరుక పరిచి, అతనిని తోడ్కొని పోదలంచెను. అది విని ధర్మజుడిట్లనియె.

సీ. పుత్రవత్సలుఁడువిచిత్రవీర్యాత్మజుం, డార్యుండుధృతరాష్ట్రుఁడాదరించి
నిన్ననియోగించె నన్నుఁదోడ్కొని తేర, నీవునువచ్చితి నెమ్మితోడ
లాలితా పూర్వసభాలోకనంబున, యందుజూదంబు కార్యంబె చెపుమ
జూదంబుకతమున భేదంబు గాకుండ, నేరదు మాలోన నీనియోగ

ఆ. మనఘుమాకలంఘ్యమయినట్లు ధృతరాష్ట్ర, పనుపుసేయ నీకుఁబాడియదియు
యనుచు విధినియుక్తుడయియప్పవిదురుతో, నేగనిశ్చయించె నిందుకులుఁడు – సభా–ద్వి–157

పై పద్యమునందలి భావము యధామూలమైనను, ధర్మజుడు విదురుని జూదమాడువారు ఎవరని ప్రశ్నించుట, అందులకు విదురుని సమాధానముగ శకుని అని తెలియచెప్పుచు, అతని మాయాద్యూత ప్రశంసచేయుట, నన్నయ విడిచిపుచ్చినాడు. పైమాటలలో ధర్మజుడు మానవతీత ధర్మపరునిగ గోచరించును. ధర్మజుడు యమాంశసంభూతుడను విషయము మనమిచట మరువరాదు. కనుకనె విధినియుక్తుడను అని వాచ్యముగ నిటచెప్పుట జరిగినది. జూదముఖమున భేదము గలుగునని తెలిసియు ధర్మజుడు వెడలునటుల కలదు. సృష్టి ధర్మవిరుద్ధముగాదని, ధర్మసూక్షమములు తెలపుచున్నవి. ప్రపంచమున శాశ్వతధర్మ పరిరక్షణకై క్షణికములైన విషయములననుష్ఠించుట ధర్మహాని కానేరదు.

భూభారమండంచుటకై, భూమి నవతరించిన నరనారాయణులు, కురుపాండవులందరి లక్ష్యము ఒక్కటె. కావున సమష్టి కృషివలననే అదిసాధ్యమను విషయము విదితమె. ద్వాపరాంతమై కలి ప్రవేశము జరిగినది. దుర్యోధనుడు కలిఅంశచే జన్మించినవాడు. కావున తదనుగుణమైన కార్యమును నిర్వర్తింప వలెను. అందులకై ఒక కారణము లభించవలెను. ఆ కారణమె జూదము. ధర్మజుడు జూదమున కొడంబడనిచో ద్యూతము నెరవేరదు. తద్ద్వార యుద్ధప్రసక్తి జనించదు. అటుల జరిగినచో జననష్టము సంభవింపదు. వీటన్నింటివలన వారి అవతారలక్ష్యము నెరవేరదు. కావున జూదపుమిషచే కార్యమునకు నాంది పలికిరి. అందులకై ధర్మజుడది అధర్మ ద్యూతమని తెలిసినను పాపహేతువు, వ్యసనపరత్వమని లోకులు నిందించినను వెడలుటకు సిద్ధపడినాడని పురాణతత్త్వజ్ఞుల భావన. ధర్మజుడు హస్తినాపురమునకు పోవుసందర్భము మూలమున విపులముగ వర్ణితము. మరియు మార్గమధ్యమున హస్తిపురమునకు చేరువలో ధర్మజుడు సమస్త పరివారముతో విడిదిచేసినట్లు గలదు. అంత విదురుడు ధర్మజునితో దుర్యోధనుని దురాలోచనము, ధృతరాష్ట్రుని అనుమతి, జరుగబోవు పరిణామములు చెప్పినట్లు గలదు. నన్నయ విడిచి పుచ్చినాడు.

36. అట్లు వెడలిన ధర్మజునకు సభామంటపముచూపించు నెపమున గొంపోయి, అందు సుహృద్ద్యూత మాడుదుమని పల్కిన శకుని మాటలకు ధర్మజుడిట్లనియె.

తే. క్షత్రనీతి క్రమంబులు గావుసూవె, నికృతియును జూదమును ధర్మనిత్యులైన
వారికీ రెండువర్జింపవలయు నెందుఁ, బాపవృత్తంబు జూదంబు పార్థివులకు -సభా-ద్వి-**166**

ఆ. కుటిలమార్గులయిన కుత్సితకితవుల, తోడగడగి జూదమాడఁజనదు
దానఁ జేసియర్ధ ధర్మ వివర్జితు, లగుదురెట్టివారు జగములోన-సభా-ద్వితీయ-**167**

వ. మరియు మాయాద్యూతంబునజయించుట మహాపాతకంబనియును, ధర్మద్యూతంబున జయించుట ధర్మయుద్ధంబున జయించునంతియ పుణ్యంబనియును నసితుండయిన దేవలుండుసెప్పె-**168**

అని యుధిష్ఠిరుడు లోకమునగల నీతులు తనకు తెలిసినవి వచించి, ద్యూతమునుండి తొలుగుటకు ప్రయత్నించిన తరుణమున శకుని ధర్మజుని నిర్భంధించుచు, లోకధర్మమును త్రోసిరాజను క్షాత్ర ధర్మము నివ్విధముగ పలికెను.

కం. ద్యూతకలాకుశలుండగు, నాతఁడులోకజ్ఞుఁడునుమహామతియునువి
ఖ్యాతుఁడునగుసక్షత్రియ, నీతివిదుడు దగునె దానినిందింపగన్-**169**

కం. బలహీనులయిన వారలు, బలవంతులనొడుచునపుడు బహుమాయలన
చ్చలమునఁజేయుటయెందును, గలయదియ జయంబకాదె కర్తవ్యమిలన్-**170**

సుక్షత్రియుడైనవాడు ద్యూతమునకు తిరస్కరింపరాదని, మరియు బలహీనులు, బలవంతులైన వారిని ఏ యుపాయముచేతనైన జయించుట ధరణిలో కర్తవ్యమని తన మాయాద్యూతమును సమర్థించుకొనుట గమనార్హము. ఇది యథామూలము.

అంతట ధర్మజుడిట్లు జూదంబుననయ్యెడు దోసంబెరింగియు దైవానుశాసనంబున దానిశభముఖుండై జూదమాడుటకు సుముఖుడైనాడు. జూదముచూచుటకు వచ్చినవారిలో భీష్మ, ధ్రుతరాష్ట్ర, విదుర, కృప, ద్రోణాశ్వత్థామలు ఉండిరి. మనకిట ఒక సందేహము కలుగవచ్చును. ధర్మమూర్తులయిన పెద్దలందరు జూదమును చూచియు వారించినటుల కాన్పించక పోవుటకు కారణము వారుదానిని సుహృద్ ద్యూతమని భావించిరి. అదియునుగాక ధృతరాష్ట్రుడు విదురునితో చర్చించినాడేకాని కురుకుల పితామహుడు,ధర్మవిదుడు, రాజ్యసంరక్షకుడు వంశపెద్దయయిన భీష్మునితో సంప్రదించినటుల కాన్పించదు. కనుక వారది మాయాద్యూతమనియే భావించిరను కొందుము. అటులైన వారును దైవాంశలతో భూమికి వచ్చినవారే కదా! ఈ జూదముకూడ ధర్మజుడన్నటుల దైవానుశాసనంబుననే జరుగుచున్నదిగదా! కనుక వారటుల ప్రవర్తించినారని భావింపవచ్చును. సర్వజన క్షయమునకు జూదమనివార్యము అనునది ఎల్లరకును విదితము. అదియె సర్వుల ఆకాంక్ష అనునది వాచ్యముగ తెలియుచున్నది. భవిష్యమునరానున్న యుద్ధమునకు భేదకారణము కావలయును. అందులకు ఒకేఒక మార్గము మాయాద్యూతము. కావుననే ధర్మమూర్తులైన భీష్మ, ద్రోణాదులెల్లరును నిమిత్తమాత్రులై తమకు పట్టనట్లూరకుండిరి. ఇచటనింకొక విషయము గమనార్హము. రామాయణ మహాభారతములు నిర్దిష్టమైన ప్రత్యేకతను సంతరించు కొన్నట్టివి. రామాయణ, మహాభారత పాత్రలు దైవాంశసంభూతములనియు, అందు ప్రవర్తితమైన కథావిధానము దైవచోదితమనియు,ఆ యా మహాకవులు తమ కావ్యారంభముననే చెప్పుకొనియున్నారు.

రామాయణ మూలకథా కారణమెద్దియైనను, శ్రీరామ ప్రవర్తనమున వాల్మీకి భారతీయులకొక ఆదర్శమును సూచింపదలచినాడు. అనగ లౌకిక ప్రవర్తనవేళ శ్రీరాముడు మానవమాత్రుడై, ఉత్తమ పుత్రినిగ, ఉత్తమ సోదరునిగ, ఉత్తమ రాజుగ, ఆదర్శప్రాయుడైన భర్తగా మాత్రమే భాసించును. కనుకనే వాని ప్రవర్తనము మానవాళికాదర్శమైనది. అటులనే భూభారమడంచుటకై కురుపాండవేయులు దైవాంశ సంభూతులుగ ఉద్భవించినను, వారి ప్రవర్తనము మాత్రము సామాన్యాదర్శ మానవులకవసరమైన శాస్త్రబద్ధము కావలయును. భారత పాత్రలనుకూడా ఈ దృష్టితోడనే మంచివిగ, చెడ్డవిగ చెప్పుచున్నాము. ఈ దృష్టితో ప్రకృతఘట్టమున ధర్మజుని ద్యూతారంభ నిర్ణయము పరిశీలించుటకూడ సమంజసము.

37. లౌకికదృష్టితోనిచట నాకుతోచిన యూహలను పేర్కొనుచున్నాను. పాత్రలనన్నింటిని పరిపూర్ణములుగ చిత్రించుట వ్యాసలక్ష్యము కాదు. విమర్శకుల దృష్టిలోకూడ శ్రీకృష్ణుడొక్కడే పరిపూర్ణుడు. ఇతరపాత్రలన్నియు మానవసహజనమైన ఏదియొనొక బలహీనతకులోనయినవారే. మానవ బలహీనతలు, మానవసమాజ సంక్షోభముపై వాటి ప్రభావములను వివరించి, మానవజాతిని ధర్మప్రవర్తనముపైపు మళ్ళించుటే వ్యాసలక్ష్యముగ భావించుట సమంజసము. అందుకు ధర్మజుడ కూడ అతీతుడు కాజాలడు. ధర్మజునిలో మేల్మిగుణముల నేకములున్నమాట నిజము, పండ్రెండు సంవత్సరముల వయస్సున తండ్రిని పోగొట్టుకొని, యేనాడును చూడని బంధువులవద్దకు తపోధనుల సహాయమున చేర్పబడినాడు. హస్తిపురము ప్రవేశించిన నాటినుండి ఏదోరూపమున

దుర్యోధనాదులదౌష్ట్యమునకు లోనయినాడు. అయినను భీష్మాదుల కారణముగ యువరాజుపట్టమునందినాడు. కాని అంతలోనే వారణావతప్రవేశము, లాక్షాగృహదహనము, ఏకచక్రపుర భిక్షాటనములు, సంభవించి ద్రౌపది స్వయంవరముతో పునఃహస్తిపురప్రవేశము జరిగినది. నాటికేబదిమూడు సంవత్సరములవాడు. అంతవరకు ధర్మజుడు ప్రజ్వలించిన కౌరవాగ్నిలో గాఢతప్త హృదయుడైనాడు. కనులయెదుటనున్న రాజ్యము తనతండ్రి భుజబలమున సంపాదించినట్టిది. కాని పాలించుచున్నవాడు పెదతండ్రి. వానికొడుకు తండ్రియనంతరము రాజనదలచుట లోకులకు విరుద్ధముగ కాన్పింపదు. మధ్య మధ్య పెదతండ్రి తనకొకింత రాజ్యభాగమునిచ్చి పాలించుకొమ్మనుట కంటితుడుపుచర్య వంటిది. అయినను ధృతరాష్ట్రుడొసంగిన ఇంద్రప్రస్థ రాజ్యభాగము నాధారము చేసుకొని ప్రకాశింప దలచినాడు. తనకు, కృష్ణునకు విరోధులై, కౌరవులకు మిత్రులైన జరాసంధ, శిశపాలురను వదిలించుకొనగలిగినాడు.

ఇట్టిస్థితిలో ధర్మరాజు జూదమునకాహ్వానింపబడినాడు. తండ్రియాజ్ఞగా భావించి హస్తిపురమున కేగినాడు. అచటి సంభాషణమున ప్రధానవిషయములు గమనార్హములు. దుర్యోధనుడు దీనిని సుహృద్ద్యూతమని చెప్పగ ధర్మజుడు పాపవృత్తంబు జూదంబు పార్థివులకు అను సమాధానమిచ్చినాడు. ఇటుల చెప్పుచునే ధర్మద్యూతంబున జయించుట ధర్మయుద్ధంబున జయించినంతియప్రభ్యంబు అనిచెప్పుటలో ధర్మజుడు కించిత్తు ద్యూత క్రీడాభిలాషను వ్యక్తపరచినవాడైనాడు. అంత ధర్మజునితో స్పష్టముగ మాయోపాయముచేతనైనను, జయించుటయే ముఖ్యమని శకుని తమహృదయమును స్పష్టపరచినాడు.

కం. బలహీనులైనవారలు, బలవంతులనొడుచునపుడు బహుమాయలన
చ్చలమునజేయుట యెందును, గలయదియ జయంబకాదె కర్తవ్యమిలన్-సభా-ద్వి-170

అని లోకమునగల జూదగాండ్ర స్వభావమును వివరించనాడు. అంతధర్మజుడు బెలువంబడి మగుడనగునే అని జూదమునకు సిద్ధమైనాడు.

పై సందర్భముచూడగ ద్యూతముపట్లనయిష్టమును కాని, దానినాపుటకైన ప్రయత్నమును గాని ధర్మజు డొనరించిన జూడలులేవు. అబాల్య విరోధులైన కౌరవులు శకుని ముఖమున మాయోపాయమునైన విజయము ప్రధానమని చెప్పించిన కౌరవులు, తన్ను మోసగింపరని ధర్మజుడు భావించినటుల చెప్పుట సమంజసముకాదు. ఇచట ఒక్కటియేచెప్పవలయును. ధర్మజునిలో ద్యూతవ్యసనమున్నది. ఎంతటి ప్రజ్ఞా శాలిని, ధార్మికునినైనను వ్యసనము పతనమునకు లాగచూచును. కాని వ్యసనపరులది గమనింపజాలరు. సప్తవ్యసనములలో ద్వితీయ స్థానమాక్రమించిన ద్యూతస్వభావము ధర్మజుడెరుంగ లేనిదిగాదు. సమస్త రాజ్యమును పోగొట్టుకొని, ధర్మపత్ని నవమానము పాలొనర్చుకొని, అరణ్యవాస, అజ్ఞాతవాసములకులోనయి సర్వజనక్షయమునకు కారణమైన ఒక్క ద్యూతవ్యసనము ధర్మజునెంతగ నాశనమొనర్చినదియో వివరించి, జనములను వ్యసనములనుండి విముఖుల నొనర్చుటే వ్యాసలక్ష్యముగ గ్రహించుట సమంజసమనిపించును.

38. తదనంతరము దుర్యోధనునిపక్షమున శకుని ధర్మజునితో జూదమాడుటకు సిద్ధపడినాడు. ద్యూతమా రంభమైనది. ధర్మజుడు తనకు రాజసూయమున లభించినట్టి ఉపాయన, వస్తు, వాహన సంపత్తినంతటిని ఒడ్డి ఓడినాడు. అదిచూచిన విదురుడు ధృతరాష్ట్రునకు జూదమును వారింపుమని అందులకప్రసరమగుచో నీతిబాహ్యుడైన కుమారుని దండించినను ధర్మహాని గలుగనేరదని వచించెను. కాని మానవ సహజమైన దౌర్బల్యమునకు, పుత్రప్రేమకులోబడి విని, విననట్లూరకుండెను. అంతట విదురుడు దుర్యోధనునకుకూడ నీతివచనములుచెప్పి

వారించుటకు ప్రయత్నించెను. అంత దుర్యోధనుడు "ఈనీతి బోధలు మాకేలచెప్పుదువు, పాండవేయులకేలపలుకవు అని మరియు నీహృద్దులలో నీవుండుము, బుద్ధులు మాకు చెప్పకు" అని నిష్కర్షగ చెప్పినాడు. పిమ్మట ధర్మరాజు ధారుణీతలంబంతయు ఒడ్డి యోడినాడు. బలవదప్యసనాభిభూతుడై. అనంతరము తమ్ములను సహదేవ, నకుల, అర్జున, భీమసేనులను, క్రమముగనొడ్డి తన్నును చివరకు ఒడ్డి ఓడిపోయినాడు. అయ్యవసరమంబున శకుని ద్రౌపదికూడ నీకు ధనమే, ఆమెనుకూడ పణముగనొడ్డుమనెను. అందులకు ధర్మజుడు వెరవక అట్లుచేసి ఓడినాడు.

ఈ సందర్భము మరియే ఇతర చరిత్రలందుగాని, ఐతిహ్యములందుగాని పూర్వమునందు జరిగిన సందర్భములలో "నభూతో నభవిష్యతి"యై పాఠకుల మనములలో ధర్మజుడేలవ్విధముగ ప్రవర్తించినాడని ప్రశ్నము తలెత్తుచున్నది. దానికి నాకు తోచిన యూహలు ప్రకృతము వివరించుచుంటిని. లోకమున సాధారణముగా మానవుడు ఏవ్యసన పరత్వమున్నను అందు పరిపూర్ణముగ తలమున్కలవుట సహజము. సమస్త వ్యసనములను అట్టివియే. అందునా జూదము మహాభయంకరమైనదని కీంవదంతి. ఇట్లు జూదమున పతనమైనవారు మనకు కొన్ని పురణాములలోను, ఐతిహ్యములందును కనవచ్చుచున్నారు. మున్ను నలచక్రవర్తి పుష్కరునితో జూదమాడి రాజ్యసర్వస్వమును ఓడి, కానలకేగినట్లు గలదు. కాని తుచ్ఛమైన, అతిహేయమైన, క్షణిక వ్యసనమునకు బానిసగామారి సోదరులను, తన్ను, చివరకు భార్యనుకూడ జూదమున పణముగ నొడ్డుట మానవ చరిత్రలందెరుగని అపూర్వము. మానవమాత్రుడెవ్వడు చేయకూడని సాహసము. ధర్మజునివంటి వాడు మాయాద్యూతమని ఎరిగి సిద్ధపడుట అధర్మవర్తనము. అందునా ధర్మపత్నినియొడ్డుట వివేక రహితమైనది. వ్యసనమునందు తలమున్కలైనవాడు తన్నుతామరిచి, ఏ అకృత్యమున్నైన వెనుదీయడన్నది లోకవిదితము. ధర్మజ పక్షముననిదియె జరిగినది. వస్తు, వాహనములు పోయినవి. వాడ్కై సర్వరాజ్యమును పణముగ పెట్టినాడు. ఆ రెండ్కై తమ్ములను, తనను ఒడ్డినాడు. మొత్తము ఓడిన వాడినన్నిండినిపాందుటకై తనవద్ద మిగిలిన పాంచాలినొడ్డినాడు. ఆమెనుకూడ ఓడినాడు. ఇట ధర్మజుని ప్రవర్తనము మనకు వింతగ గోచరించినను, సామాన్యమైన జూదరులవలె వ్యసనపరత్వముచే పోయినవాడిని పాందవలెనన్న ఆకాంక్షచే మనోన్మత్తుడై, బలవదప్యసనాభిభూతుడై, అధర్మపరత్వమునకు ప్రత్యక్షముగనెపాల్పడి భవిష్య ప్రజలకు దృష్టాంతముగ చరిత్రమున ప్రసిద్ధికెక్కినాడనుటలోనెట్టి సందేహమును లేదు.

39. అనంతరము దుర్యోధనుడు ద్రౌపదిని నిందుసభలో అవమానించి, తనకు మయసభలో జరిగిన భంగపాటుకు ప్రతీకారమొనర్చదలచి, భృత్యుని నియోగించి ద్రౌపదిని రాబనిచెను. అంత ద్రౌపది ఆ ప్రాతికామితో ఆమెకు గల్గిన ధర్మసందియమునిట్లు పలికినది.

తే. మున్నుదన్నోటువడి మఱినన్ననోటు, వడియెనో నన్నుమున్నోటువడి విభుండు
గ్రన్న దన్నోటువడియెనో యన్ననాకు, నెఱుగజెప్పుము దీనినీవెఱుగుదేని–సభా–ద్వి–209

వ. ఎఱుంగవేనక్కితవునడిగివచ్చి మఱినన్నుం దోడ్కొనిపోవనగునేని దోడ్కొని పొమ్మనినం భ్రాతికామి క్రమ్మఱి వచ్చి పాంచాలి పలుకులు ధర్మరాజునకుం జెప్పిన దురోదరపరాజయ దుఃఖిత చేతస్కుంగుటంచేసి యతడు వానికి నదత్త ప్రతివచనుండైన – 210 .. ఇది యధామూలము.

పాంచాలిపలికిన పలుకులకు ధర్మజుడు ప్రత్యుత్తర మీయకుండుట గమనార్హము. అంత మాత్రమున ధర్మజునకు ధర్మసూక్ష్ములు తెలియవని భావముకాదు. కాని వ్యసనపరత్వముచే యుక్తాయుక్త విచక్షణను విస్మరించి ధర్మపత్నినొడ్డుట అధర్మమేగావున మిన్నకుండెనని భావింపవచ్చును.

అంత దుర్యోదనుడు ప్రాతికామితో పాంచాలికుదయించిన సందేహములు సభాసదులు తీర్చెదరని ఆమెను సభకు తీసుకొని రావలసినదిగా పంపెను. అంత పాంచాలి దుర్యోధను దుశ్చేష్టితంబునకు ధర్మరాజు సమ్మతంబునకు వెఱచి ప్రాతికామి వెనుక "ఏకవస్త్రయు, నధోనీవియు, నవిరళగళిత నయనోదకబిందుసందోహ పరిపీడ్యమాన పీనస్తనపరిధానాంతరయునగుచు" సభకుం జనుదెంచెను. అంతదుర్యోధనుడు దుశ్శాసనుని పిలిచి ప్రాతికామి భీమునకు వెరుచును. కావున నీవుపోయి ద్రౌపదిని దోడ్కొనిరమ్మని పంపించెను. ద్రౌపది అదియెరిగి భయమంది గాంధారివద్దకు జనియెను. ఆమెవెనుక దుశ్శాసనుడు వెడలి జరిగిన ఉదంతమునుచెప్పిన ద్రౌపది ఇట్లనియె.

వ. నేను రజస్వలను ముట్టకుండుమేకవస్త్రనయియున్నదాన మరి గురు బంధుజనాధిష్ఠితంబైన సభకునెట్లు రానేర్తుననిన-215. దుశ్శాసనుడు బలాత్కారముగా శిరోజములపట్టి ఈడ్చి తెచ్చెను. అట్లు తేబడిన ద్రౌపది కోప, లజ్జా పరవశమయి సభాసదులకిట్టులనియె.

చం. అనుపమదైవయోగహతుఁడయ్యునవశ్యముధర్మసంపదం
దనరునకాని ధర్మజుఁడుఁధన్యుడుధర్మపథంబుతప్పడ్రొ
క్కునె కురువృద్ధులార భృశకోపనుడీతడుఁనన్ననేల దు
ర్జనుడిటయీడ్చితెచ్చెనవిచారపరుండయి దుర్మదంబునన్-సభా-ద్వితీయ-218

చం. ఇదియుచితంబుగాదనక యిక్కురుముఖ్యులుసూచుచుండ దు
ర్మదుఁడయివీఁడుఁనన్ను నవమానితఁజేసెడి సర్వధర్మసం
విదులననున్న యీభరతవీరులవంశమునేడధర్మసం
పదనతినింద్యమయ్యెనని భామిని గృష్ణుఁదలంచె భీతయై-219 -ఇది యధామూలము.

ధర్మజునిచే ఓడబడిన, అతని నిందింపక అనుపమ దైవయోగహతుడయ్యునవశ్యము ధర్మసంపదం దనరునకాని ధర్మజుడు ధన్యుడు అనుట ద్రౌపది పాతివ్రత్యమునకు మచ్చుతునక. భారతీయ సంస్కృతికి అలవాలమైన భారత స్త్రీ ఎవరైనను భర్త ఎంతటి అవమానమునొనర్చినను సహించియుండునని ద్రౌపది ప్రవర్తనద్వారా వ్యాసుడు అభివర్ణించుటలో ఔచిత్యము గాన్పించును. కాని ధర్మపథంబు తప్పడ్రొక్కునె కురువృద్ధులార అని సభవారలను ప్రశ్నించుట గమనార్హము, కారణము ఎట్టఎదుట అన్యాయము జరుగుచుండినను పట్టనటుల కూర్చొనుట అధర్మమునకు ఆసరా నిచ్చుటయె. తప్పు చేయుట లోకసహజము కాని అది తప్పని తెలిసియు సరిదిద్దుటో, చేయకుండ నిరోధించుటయో విజ్ఞులు చేయకపోవుట పెద్దతప్పు. అందులకే ద్రౌపది పెద్దలందరిని ప్రశ్నించినది. అదిచూసిన భీమసేనుడు పరాభవితుడై ధర్మరాజునకిట్లనియె.

40.కం.ధనకనకరత్నవరవా, హన ధరణీరాజ్యములను నాయుధములు మ
మమ్మునునోటువడుటయుచితమ, యినసన్నిభ వీనికెల్లనీశుడవగుటన్ -సభా-ద్వితీయ-221

కం. ద్రుపదతనూజం బణముగ, గపటద్యూతమునఁజేయగాఁదగునె జనా
ధిప యిదిదుష్టద్యూతము, నెపమునఁబరిభూతయయ్యె నిష్కరుణులచేన్ - 222

వ. శకుని కైతవంబెరింగియు బాపద్యూతంబునఁబ్రవర్తించి యధర్మప్రవృత్తుండవయితి కావున భవద్బాహు దాహంబుసేయవలయు .. 223. ఇది యధామూలము

ధర్మజుడు జూదమాడువేళ భీమసేనాదులు ప్రక్కనేయుండిరి. ఆతడొడ్డినవన్నియుచూచి ఊరకుండిరి. కనీసము ద్రౌపదిని పణముగా పెట్టునప్పుడైనను పలుకకఊరకుండిరి. కానిద్రౌపదిని ఈడ్చితెచ్చుటచూచిన భీముడు, ధర్మజుని పైవిధముగా పలుకుట శోచనీయము. భీముని మాటలకు అర్జునుడు ధర్మజుని ప్రవర్తననుగూర్చిట్లనియె.

సీ. ధర్మతనూజుండు ధర్మువుదప్పిన, ధరణీతలంబెల్లఁదల్లడిల్లు
దగిలి సుహృద్ధ్యూతధర్మయుద్ధములకుఁ, బరులచే బిలువంగబడివిభుండు
గడగక విముఖుండుగాఁజనదని శుభ, క్షాత్రధర్మంబు లోకంబులందు
నిలిపెఁదానిదిపతి నేరమియే దైవ, వైపరీతంబైనవనరఁదగునె

ఆ. గురుల ధర్మపరులఁగోపించి ధీరుల, తిక్రమింతురే తదీయనిత్య
ధర్మగౌరవంబధార్మికులగుచున్న, పరులచేతఁజెరుపబడియెనిట్లు.. ..సభా-ద్వితీయ-224

ఇట మూలమున అర్జునుడు ధర్మజుడు క్షత్రియ ధర్మవ్రతనిష్ఠాపరాయణుడై ప్రవర్తించెనని ఒక్కమాటతో సరిపెట్టినాడు. కాని అనువాదమున నన్నయ ధర్మజుని ధర్మశీలతను సీసపద్యము కావించినాడు. ఇట ధర్మరాజు ధర్మము తప్పకనే ప్రవర్తించెనని, అతనే ధర్మువు దప్పిన ధారుణీయంత తల్లడిల్లునని అర్జునుడు పలుకుట గమనార్హము. ఇట ధర్మజుని ధర్మప్రవర్తనమనగ క్షాత్రధర్మమునుమాత్రమే దృష్టినిడుకొనిప్రవర్తించి నాడని తెలియగలదు. దైవ వైపరీత్యమువలన అట్లు జరిగినదని అర్జునుడుకూడ ధ్రువపరుచుట భీముని శాంతింపజేయుటకాడిన మాటలుగ కాన్పించును. ఇట్లు పాండవేయులు తమలోతాము చర్చించుకొనుచుండగ సభాసదులెల్లరును ద్రౌపది ప్రశ్నమునకు సమాధానమొసంగని కారణమున వికర్ణుడు ధర్మసూక్ష్మమునిట్లు పలికెను.

వ... జూదంబును వేటయు బానంబును బహుభక్షణాశక్తియునను నాలుగు దుర్వ్యసనంబులం దగిలిన పురుషుండు ధర్మువుందప్పివర్తిల్లు నట్టివాని కృత్యంబులు సేకొనందగవు. కితవాహూతుండై వ్యసనవర్తియై పరాజితుండయిన పాండవాగ్రజుండు పాండవులకందరకు సాధారణ ధనంబయిన పాంచాలిఁబణంబు జేసెంగావున ద్రౌపదియధర్మవిజిత యక్కోమలి యేకవస్త్రనిటదోడ్కొనితెచ్చుటయన్యాయంబనిన. స-ద్వి-227

కర్ణుడు వికర్ణునకు ప్రతిగా నిట్లుపల్కెను.

వ... నీవు ద్రౌపదినధర్మవిజితయని పలికితి సభాసదులెల్లనెఱుంగ ధర్మజుండు దనసర్వస్వంబునొడ్డి యోటు వడినప్పుడిది వానికి వెలిగాదుగావున ధర్మవిజితయ యిట్లుగానినాడు పాండవులిందరును దీని విజితగా నేలయెడంబడుదురు. మరి యేకవస్త్రయైయున్నదీని సభకుందోడ్కొని వచ్చుట ధర్మువుగాదంటి భార్యకు దైవవిహితుండైన భర్తయొక్కరుండ యిదియనేక భర్తృకగావున బంధకియనంబడునిట్టిదాని విగతవస్త్రంజేసి తెచ్చినను ధర్మవిరోధంబు లేదని - 229

ఇట్టి కర్ణుని ప్రత్యుత్తరమువిని దుర్యోధనుడు సంతుష్టుడై దుశ్శాసనుని పిలిచి ద్రౌపది వస్త్రాపహరణ చేయుమని ఆదేశించెను. అంతద్రౌపది శ్రీకృష్ణప్రభావముచే అక్షయవస్త్రములు బడసి మానరక్షణ గావించుకొనినది. అంత ద్రౌపది తన పలుకులకేవ్వరు ప్రతివచనంబీయరని నేను దాసినే అనిపలుకగ భీష్ముడిట్లనియె.

వ- అవ్వా నీప్రశ్నంబునకు నుత్తరంబయ్యుధిష్ఠిరుండుసెప్పవలయు గానినాడు ధర్మసూక్ష్మత యెవ్వరికిని నెరుంగ గహనంబు -245. ఇది యధామూలము.

తదనంతరము విదురుడు సభలోజరిగిన విశేషాదులుననన్నింటిని ధృతరాష్ట్రునకెరింగించినంత,ధృత రాష్ట్రుండు దుర్యోధనునిరావించి, విచారించి ద్రౌపదినిపిలిచి శాంతవచనములతో ఊరటకలిగించినిట్లనియె.

కం. సుందరి నాకోడంద్రుర, యందభ్యర్చితవునీవ యతిముదంబున నీ
కొందగఁబ్రియంబుసేసెద, నిందుముఖీ వేడుమెద్దియిష్టము నీకున్-సభా-ద్వితీయ-257

అంతనాతనికి ద్రౌపది ఇట్లనియె.

ఆ. కరుణతోడ నాకు వరము ప్రసాదింప, బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు, వలనఁబాయవలయు వసుమతీశ - 259

అని ముందుగా ధర్మజుని దాస్యవిముక్తుని చేసినది. అందులకు కారణము ప్రతివింధ్యాదులు దాసపుత్రులు గాకుండ నుండవలయునని ద్రౌపది స్పష్టపరచినది. ధృతరాష్ట్రుడందులకంగీకరించి, మరియేదైనను కోరు కొమ్మనెను. అంత ద్రౌపది పాండవులనందరిని వారి వారి వస్త్రాభరణములు, ఆయుధములతోడ విముక్తులను గావింపుమని ప్రార్ధించెను. అందులకును ధృతరాష్ట్రుడు సమ్మతించి మరియేదైనను వరము కోరుకొమ్మనెను. అంత ద్రౌపది ధర్మసూక్ష్ముము తెలిసినదగుటచే ధృతరాష్ట్రునితోనిట్లనియె.

ఆ.వె. వైశ్యసతికి నొక్కవరము సత్క్షత్రియ, సతికి రెండుశూద్రసతికి మూడు
విప్రసతికినూరువేడజన్వరములు, గానయింకవేడగాదునాకు -263. ఇది యధామూలము.

41. తదనంతరము ధృతరాష్ట్రుడు ధర్మజుని రావించి నీవు సర్వసంపదలు, స్వరాజ్యంబును నొప్పుకొని యెప్పటియట్ల యింద్రప్రస్థపురంబునకరిగి సుఖంబుండుమని పలికి వీడ్కొల్పెను. అంత దుర్యోధనుడు తండ్రి వైనమునెరిగి చింతాతప్తహృదయుండై, ధృతరాష్ట్రునివద్దకు వచ్చి వీరాధివీరులైన పాండవులకు జూదంబున గెలిచిన రాజ్యమును తిరిగియిచ్చి శత్రుసహాయకునిగ నిల్చితివి. వారిని బలపరాక్రమములతో జయించలేకనే యిట్టి ఉపాయముననన్వేషించితిమి. వారలనెట్టైనను రాజ్యభ్రష్టులను చేయవలయును. కావున అనుద్యూతమునకు ధర్మజుని పిలువమని కోరెను. అందులకు ధృతరాష్ట్రుడొడంబడి ప్రాతికామినిబిల్చి ధర్మజుని రాబనిచెను. ధర్మజుడును పితృ నియోగమున మరల జూదమునకు సిద్ధపడెను. అంత శకుని ధర్మజున కిట్లనియె.

కం. ధనసంపదరాజ్యంబున, దినకరతేజుండు మిమ్ముధృతరాష్ట్రుడు పెం
పున బూజించెంగావున, జనదింకను వానినొడ్డిసరిఁగ్రీడింపన్-సభా-ద్వితీయ-277

వ. ఇదియపూర్వంబైన పణంబు దీనినొడ్డియోటుపడిన వారలజినవల్కనంబులగట్టి వన్యమూలఫలాశనులై బ్రహ్మచర్యంబునం బండ్రెండేళ్లు వనవాసంబునేసి పదమూడగునేడు జనపదంబున నజ్ఞాత వాసంబుసేసి యందెం రుంగంబడిరేని వెండియుం బండ్రెండేండ్లు వనవాసంబు నొక్కయేడజ్ఞాతవాసంబు చేయుచుండు వారిట్లోపుదేని జూదంబాడుదమనిననుద్యూతార్థంబాహూతుండనైమగుడనగునేయని-278-ఇదియధామూలము.

జూదమాడి ఓడిపోయి అరణ్యవాసమునకు పెద్దల అనుమతిగైకొని ధౌమ్యసమేతులైజనిరి.

పై జూదఘట్టమును విమర్శించుట సామాన్యులకలవికానట్టిది. ఇదియొక విచిత్రమైన సంస్కృతికి దోహదకారిగా కాన్పించును.పండితులెల్లరు శాస్త్రము, ధర్మము అనుమాటలను వాడుటయె! భారతమున వ్యాసుని మొదలు సాధారణ పాత్రవరకు పలువురు పలుఘట్టములందు ధర్మజుని ఉత్తమునిగి ప్రదర్శించి యుండుటచే, ఈఘట్టమున ధర్మజుని ప్రవర్తనముకూడ ధార్మికమైనట్టిదిగనే యుండునని పండితులు భావించుట సామాన్యముగ కాన్పించుచున్నది. అటులకాక భారతమునొక కావ్యముగ గ్రహించి, అందలి సాంస్కృతిక విశేషములతోపాటు,

చారిత్రక విశేషములను, ప్రాంతీయ ధర్మములను తెలుసుకొనవలెనన్న కోరికతోను, మనకు తెలియని శాస్త్రగ్రంథము లేవైన కాలగర్భమున కలిసిపోయినవా! అన్న దృష్టితో కూడ యిట్టి కావ్యఘట్టములను పరిశీలించుట ఉచితముగా భావి పరిశోధకులకుపయోగకరములని అనిపించును. ఈ దృష్టితోడనె ఒండు రెండూహలను ఇచట వెలువరించుట సమంజసమని భావింతును.

బలహీనులైనవారలు, బలవంతులైనవారిని మాయోపాయముననే జయించుట సర్వద్యూత శాలలందును కాన్పించుచున్నదనియు, తనకు జయమే ప్రధానమనియు, ద్యూతారంభమున శకుని ద్యూతస్వభావమును స్పష్టపరచినాడు. అనగా తావాడబోవ్చున్నది అధర్మ ద్యూతమేగాని, ధర్మద్యూతము గాదని శకుని ఘంటాపథముగ నిండుసభలో స్పష్టపరచినాడు. అట్టితరి కౌరవులు తమ్ము మాయాద్యూతమున ఓడించిరని పలికెడి హక్కు ధర్మజునికేకోశమునందునులేదు. ఒకవేళ మాయాద్యూతము గర్హింపదగునట్టిదే అయినచో ధర్మజుడు జూదమునకు సంసిద్ధుడైన క్షణముననే వాని ధార్మికత్వము నశించినదని చెప్పక తప్పదు. జూదమునకు పిలిచినప్పుడు వెడలకుండుట క్షాత్రధర్మముకాదనిమాత్రము పాండవుల ముఖస్థముగ భారతమున చెప్పబడినదే కాని పిలువబడినచో అది అధర్మ ద్యూతమని తెలిసిన పిదపకూడ ఆడకతప్పదని భారతమున చెప్పబడలేదు. ఒకపరి ద్యూతమున సర్వసంపదలు ఓడిపోయి, లోకమున ఏ స్త్రీకిని సంభవింపని అటవికమైన అవమానమును ద్రౌపదికి కలిగింపజేసియు, చివరకు ధృతరాష్ట్రుని దయవలన విముక్తిపొందిన పిదప పునరాహ్వానమునందుకొంటినన్న మిషతో సమస్త సభాసదులచే మాయ జూదరులుగా పేర్కొనబడిన శకుని, దుర్యోధనులతోడనే అనుద్యూతమునకు సంసిద్ధుడగుట ధర్మజునిపట్ల ధార్మిక ప్రవర్తనమేనా! యని అనిపించుట సహజము. ఇట్టి విచిత్ర సంస్కృతికి ధర్ముద్ర వేయుట కష్టము. ఇందుకు శాస్త్రప్రమాణమును లేదు. అన్యాయముగ ఓడితిమని గోలచేసి తిరిగి ఆటకు కూర్చొనుటలో లోకానుభవమునుకూడ గుర్తించునటుల కాన్పింపదు. ఈ ప్రవర్తనములన్నింటికి సతార్కికము శాస్త్రబద్ధమునగు సమాధానములు లభించువరకు(జూదమాడి భార్యను పణముగపెట్టుట శాస్త్రబద్ధమగునో) ఈ సందర్భమునందలి ధర్మజుని ప్రవర్తనము, వాని వ్యసన పరత్వమునుమాత్రమే సూచించును. తప్ప తదితరమును కాదని అనిపించును.

==========

ఆదికావ్యములైన రామాయణ, మహాభారతములు రెండింటియందును అరణ్యవాసములున్నవి. (అరణ్యకాండ, అరణ్యపర్వము) కథా గమనములలో మార్పులున్ననూ, అరణ్యవాసమిచ్చిన సంస్కారమున, రెండు గ్రంథములందును కొంత సామ్యమున్నది. నాడు అరణ్యములు మహర్షులకు నివాస స్థానములు. అనేకానేక మునివాటికలు అందుండెడివి. అందుచే అడుగడుగున అధ్యాత్మిక చింతనకు, సంస్కృతీ శిక్షణకు, రాజనీతి బోధనకు నాటి మున్యాశ్రమములు విశ్వవిద్యాలయ తుల్యములు. అటు శ్రీరాముడు, ఇటు దర్మజుడునుకూడ పట్టాభిషేకములకు పూర్వమే అరణ్యక శిక్షణమునందిరి. ప్రకృత కథలో ధర్మజుడుకూడ అట్టి శిక్షణమునందుటకవకాశము గల్గించిన పర్వమిది.

హస్తినయందుకాని, ఇంద్రప్రస్థమునకాని మహర్షులెవ్వరు విశేషముగా ధర్మజుని పరీక్షించిన జాడలు కాన్పింపవు. కాని అరణ్యమున మనస్థైర్యమును, నిలకడగల అసాధారణ పరాక్రమము ధర్మజుడు సంపాదించుకొనుటకై దేవతలును, ఋషులునుకూడా ధర్మజునకు సహకరించిరి. యక్ష ప్రశ్నములందలి సారమెటులున్నను, ధర్మముపట్ల ధర్మజుని దృఢత్వము చెదరకుండుటకది దోహదకారి. అటులనే అర్జున పరాక్రమ విషయమై, కర్ణ సంబంధమైన భయమును ధర్మజునిలో తొలగించుటకు స్వయముగా దేవేంద్రుడే మహర్షిచే కబురంపుట గమనార్హము. అటులనే అజగరవృత్తాంతముకూడ పాండవులలోని ధర్మపటుత్వమునకు, సంస్కృతీ పటుత్వమునకు మరికొంత బలము చేకూర్చినది. ఇంతదూరము చెప్పుటేలన, విశ్వామిత్రుని వెనుక శ్రీరాముడడవికేగి సర్వాస్త్ర సంపదను సేకరించికొనినటుల, పాండవులడవికి వెళ్లి పాశుపతాస్త్రాది అస్త్రములను, ఋషుల బోధలవలన మనస్థైర్యమును సంపాదించుకొనిరి.

ఈ పర్వమున దుర్యోధనుని ఘోషయాత్ర "కాగల కార్యము గంధర్వులే తీర్చి" రను లోకోక్తికి కారకమైనది. నిజమునకు కావలసిన పనిని గంధర్వులు తీర్చుట ధర్మజునకభిమతము కాదు. కనుకనే అరణ్యవాసులైయుండికూడ, అర్జునుడొక్కడే కర్ణాదులనోడించిన గంధర్వునినెదుర్కొనినటుల లోకమున వెల్లడియగుటకు ధర్మజుడుతగిన ప్రయత్నమొనర్చి, భావిసమ్రాట్టుకు కావలసిన రాజనీతిని ప్రదర్శించినాడు. ఈపై చెప్పిన విశేషములన్ని దృష్టినిడుకొని ఈ పర్వమునందలి ధర్మజపాత్రను పరిశీలింతును.

42. ధర్మరాజు జూదమున ఓడిపోయి ఒడంబడికననుసరించి, భార్యానుజులతోడ అరణ్యవాసమున కేగు సమయమున పౌరులెల్లరు పరిపరి విధముల కౌరవులను నిందించుచు, పాండవులతోపాటు అరణ్యమునకేగుటకు సంసిద్ధులై ధర్మజునికెరిగించు సందర్భమున

ఆ. వీరులారమమ్మువిడచి మీకరుగంగ, జనునేమాకునొండుశరణ మెద్ది
సాధులకునసాధుసహవాసమునఁబాప, సంప్రయోగమగుట సందియంబె–అరణ్య–ప్రథమ–**5**

అనుట ధర్మజపక్షమున పరికింపవలసి యున్నది. మమ్ముఁవిడిచి మీరు అరణ్యమునకు చనుట తగునే? అని ధర్మజుని ప్రశ్నించిరి. మాకిక శరణమెవరు? అనుటలో ధర్మజుడు ఇదివరలో వారికి శరణమొసగెడివాడని మరియు వారు సాధువులుగాన వారి సావాసము యోగ్యముగాన చేసితిమని, ఇకపై అసాధుల సంప్రయోగము పాపము కల్గించునని,అనగా కౌరవులు అసాధువులు, పాపులు, మీరు పుణ్యాత్ములు కావున మీతోడనే మేమును వచ్చెదమనరి.

పైవాక్యములు ధర్మజుని రాజరికపుభవితకు పునాదులు అని చెప్పవచ్చును. ఏ రాజైన పదికాలములపాటు రాజ్యమును సురక్షితముగా పాలింపవలెనన్న, ప్రజాభిప్రాయము రాజునకు రక్షణకవచమనక తప్పదు. అటువంటి ప్రజలసానుభూతి సంపాదించినచో రాజ్యముచేజిక్కించుకొనుట సులభసాధ్యము. కనుకనే వారిని ముందుగా మంచిచేసుకొని, వారినోటనే కౌరవులను దుర్మార్గులుగను పలికించినటుల చేయుటయే ధర్మజరాజనీతి. పౌరుల పల్కులు విని ధర్మరాజు

కం. మాయందులేని గుణములు, మీయనురాగమున జేసిమిగిలి వెలింగెన్

మీయనుమతిమాకునభి,ప్రాయమునవనవాసదుఃఖభరమోపుదురే-అర-ప్రథ-8-ఇదియథామూలము.

తన్నుతాను పొగడుకొనుట గొప్పకాదు. గావున వినయముతో మీరు మాయందుగల అనురాగముతో మేము సన్మార్గులమని, యేవియో లేని గుణములనుకూడా అభినుతించిరి. మీరాశ మాకుకూడ ఆనందదాయకమే గాని, వనవాసమునందలి కష్టములకు మిమ్ములను గురిచేయగలమా!అని ప్రజలనోదార్చుట ప్రజాక్షేమంకరుడని ప్రజలలో తనకుముద్ర బలపడవలెనన్న కౌతూహలమును తెల్పును. ఈ విధముగా వారలను పంపివైచి అరణ్యప్రవేశము గావించెను. అయినను ఒండు, రెండు రోజుల పిదప వారిని విడువలేని విప్రులు, శిష్యులతోగూడ సహవనవాసము గావించుటకు పాండవులకడ కేగుతెంచిరి. వారలను చూచి ధర్మరాజు తనమనస్సునగల మాటలను ఏకరువు పెట్టేను.

కం. అపహృతసర్వస్వులమై, సనత్నులనికారమునఁబ్రచండాటవిలో

విపులఫలశాకమూలము, లుపయోగించుచును నిష్ననుండెడుమాతోన్-అరణ్య-ప్రథమ-13

సర్వముపోయి పరివారముతో ఈ ఘోరాటవిలో ఏవో ఫలమూలములను తినుచు బ్రతకవలసిన మాతో మీరుండుటకు రానేలనని ప్రశ్నించెను. మరియు వారు ప్రస్తుతము అరణ్య, అజ్ఞాతవాసములకని బయల్దేరినటువంటివారు,వారుగుట్టుగా కాలము గడుపవలెనుగాని మంది, మార్బలముతోనుండుట వారికి కూడనిపని. తదుపరి వారు రాజ్యమును మరల పొందుటకు గావలసిన ప్రయత్నములు, తపస్సు మొదలగునవి చేయవలసియున్నది. కావునవారందరిని వారించెను. మరియు గతమున తను వైభవోపతమైన జీవితమున లెక్కలేనంత దానములర్థలకొసంగినట్టివాడు. నేడట్టి వైభవము వీడుటచే వారందరికీ తగురీతిన సత్కారములు చేయలేకపోవుటకు వగచెను. అట్టితరి శానకుండేతెంచి అర్థమునకై ఏలవగచెదవు, పరమార్థమునకు మాత్రమే బుద్ధిమంతుడు ఆలోచింపవలెనని నుడువగ ధర్మజుండు శౌనకునితో ఈ అర్ధపరమైన ఆలోచనలు స్వార్థమునకు కాదు. గృహస్థధర్మమున సర్వంబు ఆలోచింపదగినట్టి అతిథిపూజ,అభ్యాగత వర్తనము, సాధురక్షణము, సంతర్పణల కొరకు అర్థమును సంగ్రహించుట అనర్థము కాదు. కావున మున్నొనరించిన కార్యములు విడిచిపుచ్చుట ఎట్టి వానికిని తగనిపనియని విచారించెను.

ధర్మజుడీవిధమున విచారము వెలిబుచ్చుట విప్రులనడుమ అతనికిగల ఔన్నత్యము చెప్పకనేచెప్పు చున్నది. ఈ విధముననాలోచించు సమయమున ధౌమ్యుడేతెంచెను. అతనికి నమస్కరించి ధర్మరాజు తన మనసునగల విచారమునిటుల వివరించినాడు. ఆర్యా! ఈ విప్రవర్యులకు భోజన సదుపాయమేగతి నిర్వర్తించెదనని పలుకగా

ధౌమ్యుడు సూర్యునారాధించి అక్షయపాత్రను పొందుమని ఉపదేశించెను. ధౌమ్యదేశానుసారము భాగీరథీజలముల కృతస్నాతుండై, పుష్పోపచర్యల సూర్యునారాధించి అతనికై తపముచేయు తరుణమున భానుండు ప్రత్యక్షమై,అతని ఈప్సితమెరింగి, ద్రౌపదిచేతివంట అక్షయంబగునని వరంబిచ్చి అంతర్హితుడయ్యెను.

ఇటమూలమున ధౌమ్యుడు ధర్మజునకు సూర్యాష్టోత్తర నామములనుదెల్పి పూజయొనర్చుమనుట, సూర్యుడు ధర్మజునకు అక్షయపాత్రనిచ్చినటుల గలదు. కాని అనువాదమున నన్నయ సంక్షిప్తీకరించినాడు. మరియు సూర్యునిచే వరమును పొందినటులగలదు. ధర్మరాజు అదిమొదలు బ్రాహ్మణ సమారాధనము నిరాటంకముగ సల్పుచు, కొలది దినముల తరువాత కామ్యకవనమునకు పయనమయ్యెను. అంతట ఒక అర్ధరాత్రి కిమ్మీరుడను నిశాచరుడు వారికెదుటపడి యిట మీరేల సంచరించుచున్నారని ధర్మజుని ప్రశ్నించెను. అతడు తన వనవాసవిషయము, భార్యనుజుల పరిచయము గావించెను. కిమ్మీరుడు భీమునిపేరు వినినంతనే తనసోదరుడగు బకాసురుని మరణమునకు వగచి, ప్రతీకారేచ్ఛతో భీమునితో తలపడి మృత్యువుని పొందెను. అంతట పాండవులు శాంతచిత్తులైయుండ, యాదవులు శ్రీకృష్ణునితో కలసి పాండవులను పరామర్శించుటకు వచ్చిరి. శ్రీకృష్ణుడంతయు విని అవినీతిమంతులగు కౌరవులను చంపి, ధర్మజునికి యౌవరాజ్యాభిషేకము గావింతునని, యుగాంతమున సంచరించెడి కాలునివలె హుంకరించు సమయమున, ధర్మజాదులు శాంతింపుమని శ్రీకృష్ణుని ప్రార్ధించిరి. దుర్వ్యసనమునకు లోనై పాండవులీవిధమున రాజ్యభ్రష్టులగుట విని శ్రీకృష్ణుడు నిజపురమునుండి కామ్యకవనమునకు రావలసివచ్చినదనిచెప్పి మరియు నేను మీసమీపమున లేకపోవుటవలననిట్టి అనర్ధము సంభవించినదని నుడువగ, తత్కారణమేమి యని ధర్మజుడడుగగ శ్రీకృష్ణుడు సౌంభకోపాఖ్యానంబు వినిపించెను. ఇది యథామూలము.

అరణ్యపర్వ ప్రథమాశ్వాసమున (208)వ పద్యమునుండి(287)వ పద్యమువరకు నడచిన (80) పద్యముల కథాభాగములో నాల్గు ప్రధానసంఘటనలున్నవి.అవి 1) ద్రౌపదీ ధర్మజసంవాదము, 2) భీమ ధర్మజుల సంవాదము, 3) వ్యాసోపదేశము, 4) అర్జునుడు పరమేశ్వరుని మెప్పించుటకై తపమునకేగుట. ఈ నాలుగు సందర్భములును లోకమునకు ఉపదేశాత్మకములగుచు, వ్యంగ్యముగ వీనికి కేంద్రబిందువైన ధర్మజుని మనస్తత్వమును వివరించు చున్నది. ఇచట ధర్మజస్వరూపమును స్థూలముగ చూతము.

43. ద్రౌపది కౌరవుల మూలమున పొందిన కష్టములను, నష్టములను వివరించి అట్టివారిపట్ల ధర్మజుడు క్షమాగుణమును వహించుట కూడదని సోదాహరణముగ నిర్ధారించినది. అప్పుడు ధర్మజుడు క్షమాగుణ విశేషమును తెల్పుచు నిట్లనినాడు.

సీ. క్రోధంబుపాపంబు గ్రోధంబుననచేసి, యగుఁజువ్వెధర్మకామార్థహాని
గడుగ్రోధి గర్జంబుగానండు క్రుద్ధుండు, గురునైననిందించుఁ గ్రుద్ధుడైన
వాడవధ్యులనైన వధియించు మరియాత్మ, ఘాతంబు సేయంగగడుగు గ్రుద్ధు
డశ్యాదృశులకు ధర్మానుబంధుల కిట్టి, క్రోధంబుదాల్చుట గుణమెచెపుమ

ఆ. యెరుకగల మహాత్ముడెరుకయన్నలముల, నార్చుఁ గ్రోధమనుమహానలంబుఁ
గ్రోధవర్జితుండు గురుకొని తేజంబు, దాల్చు దేశకాలతత్వమెరిగి-అరణ్య-ప్రథమ-222

ఈ సందర్భమున మూలమునగల ధర్మజ దీర్ఘోపన్యాసమును కొంత క్రోడీకరించి నన్నయ అనువదించి నాడు. పై పద్యమున క్రోధము ధర్మకామార్థ హానిని గావించును. గురునింద సేయించును, అవధ్యులను వధింప జేయును. ఆత్మఘాతమునకుకూడా పాల్పడును. కనుక క్రోధము విడువవలెనని చెప్పుచు చివరిగా క్రోధవర్జితుండుగురుకొని తేజంబుదాల్చ దేశకాల తత్వమెరిగి అని అనినాడు. ఈమాటలు సూక్ష్మముగ చూచిన ఒక విషయము స్పష్టమగును. ధర్మజుడు శత్రుజయమునకై తగిన సమయమునకై నిరీక్షించుచున్నాడు. ఈలోపల తొందరపడినచో తనరాజ్యము తనకుకాకుండ పోవచ్చును. అది అర్థకామహాని, తొందరపడి యుద్ధమునకు హర్షింపని భీష్మ, ద్రోణాది గురుపాదులను నిందిపవలసి వచ్చును. వధింపతగని పూజ్యులను, గురువులను, సోదర వర్గమును వధించినాడన్న దుష్కీర్తి వచ్చును. తగిన బలమును సంతరించుకొనకుండ యుద్ధమునకు సిద్ధపడినచో అపజయముకాని, ఆత్మఘాతముకాని ఏర్పడవచ్చును. అందుకై అనుక్షణము బలమును పెంచు కొనుచు, సాత్వికముగ లోకము వారల మెప్పుపొందుచు తగినసమయమున పెద్దల అనుమతితోడనే యుద్ధమునకు దిగి తనరాజ్యమును పొందవలెనన్నది ధర్మజుని ఆక్షాంక్ష. ఈ విషయమును భీమునితోడి సంభాషణమున ధర్మజుడు స్పష్టపరిచినాడు.

44. సీ. శూరులుధృతరాష్ట్రసుతులు దుర్యోధనా, దులు దురాధర్షులందొరును మనకు
నాతతాయులు మరి యంగభూవిభుడును, భూరిశ్రవుడు మద్రభూమిపతియు
నాదిగాగల వీరుల విజేయవిక్రము, లొలసి తత్సుహృదలైయున్నవారు
మనచేత జితులైన మనుజేశులెల్లను, జని సుయోధనుచేత సత్కరింప
ఆ. బడి కడంగి వానిప్రస్తవంబున నాజి, వేచి ప్రాణములను విడువనున్న
వారు వారలెల్ల వసుధఁబ్రసిద్ధులు, వినగ నస్త్రశస్త్రవిద్యలందు-అరణ్య-ప్రథమ-**269**
కం. వినవయ్య కర్ణగర్వం, బని నాతడభేద్య కవచుడగుటయు విలునే
ర్పును నతనిబాహువిక్రమ, మును దలచిననాడు గన్నుమూయదు నాకున్-అరణ్య-ప్ర-**270**

వ. మరియు భీష్మ, ద్రోణ, కృపాచార్యులు సములయ్యును వారియొద్దన యున్నవారు వారలపార దివ్యాస్త్ర విశారదులు వారలనోర్చికాని దుర్యోధను నిర్జింపంబోలదని విచారించు సమయమున-**271**. ఇది యధామూలము.

45. అనేక సందర్భములలో భీమార్జునుల పరాక్రమము తలంచుకొన్నప్పుడు, తనకు నిద్రపట్టదని ధృతరాష్ట్రుడు విదురాదులతో చెప్పుకొనునటుల కాన్పించును. ఈ విషయమున ధృతరాష్ట్రుడు కొంత బేలయనియే చెప్పవచ్చును. కాని ధర్మజునిలో గుంభనత్వమొక్కువ. అట్టి ధర్మజుడు కౌరవాదుల బలపరాక్రమములు వర్ణించుచు, కర్ణుని పరాక్రమము తలంచినప్పుడెల్ల తనకు కన్నుమూయదు అని చెప్పుట గమనార్హము. అఖండచిత్తశాంతిననుభవించు యోగివర్యుల మాటలిటులుండవు. అవమాన భారముతోను, ప్రతీకారవాంఛతోను, ఆపద సంభుడిల్లుననను భయముతోను ఉన్నవానికి మాత్రమే స్వాభావికమైన విశ్లేషణమును ధర్మజుడు వెలిబుచ్చినాడు. ఇది ధర్మజునికి సహజము. అతడు సుక్షత్రియుడు. లోకమున ముఖ్యముగ ఆదినుండి తనవరకు చంద్రవంశమున ఏ రాచస్త్రీకిని సంభవింపని అవమానము తనపట్టమహిషికి సంభవించినది. అందుకుతోడు తన వ్యసనపరత్వమే కారణమని

కావలసిన వారలెల్లరచేతను నిందింపబడుచున్నాడు. ఇందుకుతోడు సూక్ష్మముగ ఆలోచించినచో, ధర్మజునిలో లోక కల్యాణ కారకమైన ధర్మవిచికిత్సకు ఈ సందర్భమున ప్రమేయమేలేదు. ద్రౌపది పరాభవమెంతటి వింతయో, భార్యను పణముగ పెట్టుటయు అంతవింతయే! అందులకాతడు చూపవలసిన ధర్మశాస్త్రమెద్దియునులేదు. ఆ విషయమును సభలో ద్రౌపదియే ప్రశ్నించి నిరుత్తరయైనది. అట్టివిషమపరిస్థితిలో చిక్కుకొనిన ధర్మజునిలో, ఒకనాటి ద్యూతోత్సాహమువలెనే, నేడు శత్రు విజయోత్సాహమునకే ఆస్కారమున్నది. సారాంశమేమన అనునిత్యమును ధర్మజుడు తన బలమును, ఎదుటిబలమును తులనాత్మకముగ పరిశీలించుచున్నాడు. ఎదుటి బలమునుచూచి భయపడుచున్నాడు. వారికన్న మిన్నయగు బలసేకరణమునకై మార్గమునన్వేషించుచున్నాడు.

46. అట్టి సమయమున అచటకు వ్యాసభగవానుడు వచ్చుట జరిగెను. ధర్మజుని హృదయమును స్పష్టముగ గుర్తించినట్టి వ్యక్తిగ వ్యాసుని పేర్కొనవచ్చును. వ్యాసుడిట్లనినాడు.

కం. వీరులగు భీష్మకుంభజ, శారద్వతకర్ణులమితసత్త్వులు వారిం
బోర వధియించుటెంతయు, భారంబనియున్ననీదు భరమెరిగిమదిన్-అరణ్య-ప్రథమ-274

ధర్మజుని హృదయములో భీష్మద్రోణాదులనుకూడ వధియింపవలెనన్న భావమున్నదన్న విషయమును స్వయముగ వ్యాసభగవానుని నోటినుండి వెలువడుట గమనార్హము. అటుల జరుగనన్న విషయము వ్యాసునకు తెలియును. నారాయణాంశజునిగా భావింపబడుచున్న వ్యాసభగవానుడు త్రికాలవేత్తగదా! అదియే శ్రీకృష్ణుని లక్ష్యమనికూడ అతనికి తెలియును. కనుకనే ధర్మజునకు ప్రతిస్మృతి యనువిద్యను ఉపదేశించి, దానినర్జునునకిచ్చి పరమేశ్వరుని మెప్పించి, సర్వశత్రు విజయమును సాధింపగల శస్త్రాస్త్రములను సంపాదింపజేయుమని సూచించినాడు. ఇది యధామూలము.

చివరిగ ధర్మజుడు వ్యాసోపదేశమును పాటించి అర్జునుని తపోభూములకంపినాడు. మొత్తముపై ఈఘట్టము ధర్మజునిలోని క్షాత్రహృదయము,శత్రుభీతి,శత్రువిజయమునకైన తపనలకు అద్దముపట్టుచున్నది.

47. అరణ్యపర్వ ద్వితీయాశ్వాసమున నారదకృత తీర్థయాత్రవర్ణన పిదప స్వర్గమున దేవేంద్రుని సన్నిధినుండి రోమశుడనుమహర్షి ధర్మజునివద్దకు వచ్చుటజరిగినది. అర్జునునియోగక్షేమమును ధర్మజునకెరిగింపుమని రోమశనకు చెప్పిపంపునపుడు దేవేంద్రుడు ధర్మజునకుచెప్పిన సందేశరూపక అభయమిట్లున్నది.

కం. బలవంతులైన భీష్మా, దులనర్జునుడోర్చునూర్జితుండై మరి పో
రులఁ గర్ణుండుపదారవ, కళకుసమానుండుగాఁడు గవ్వడితోడన్ -అరణ్య-ద్వితీయ-296

ఈ పై పద్యము అమూలకము. ఈ సందర్భమున ఇంద్రుడు కర్ణుని బలపరాక్రమాదులను పొగడి వానిని ఎదుర్కొనదగు శక్తి అర్జునుడు సంపాదించెనని రోమశునిద్వారా ధర్మజునకు సందేశమంపినట్లు మూలమునగలదు. భావమును గ్రహించి విశేషాదులతో నన్నయ కల్పించినాడు. ఇతఃపూర్వపు కథాభాగమున ధర్మజుడు కర్ణుని పరాక్రమము జ్ఞప్తికి వచ్చునపుడు తనకంటికి కునుకురాదని భీమునితో చెప్పుకొనియున్నాడు. ధర్మజ హృదయము దేవేంద్రునకు తెలియును. అందులకే వానికి కావలసిన విధముగ వర్తమానమంపినాడు. కానిచో భీష్మద్రోణులను నిర్జింపగల అర్జునుడు కర్ణుని ఎదుర్కొనగలడని చెప్పపనిలేదు.

అనంతరమున అజగరోపాఖ్యానము గలదు. ఈ అజగరోపాఖ్యానంబున భీముడు పాముచేమ్రింగబడి కదలలేని స్థితిలోనుండగ ధర్మజుడచటకేతెంచి, భుజంగముతో అమిషార్థివై పట్టితేని నీకు బుభుక్షానివృత్తియగునట్లుగ జాలినంతగ మృగమాంసంబుబెట్టెద విడిపిడుపుమనెను. ఇదియథామూలము. ఈ సందర్భము మహాభారతరచన ప్రారంభమునకు ఎంతయో కాలము తరువాత, ఎవని చేతనో ప్రవేశపెట్టబడిన ప్రక్షిప్తముగ కాన్పించును. అందలి వాస్తవమును పరిశోధకులు మాత్రమె చూడవలసియున్నది. బ్రాహ్మణాధిక్య నిరూపణమె తప్ప ధర్మజుని ఔన్నత్యమిందు విశేషముగ కాన్పింపదు. అంతియెకాదు కించిత్ ధర్మజుని క్రిందకు లాగినదన్నను లోపము కాన్పింపదు. దిలీపుడు నందినీ ధేనువును విడచిపుచ్చి తన్ను ఆహారముగా గైకొనమని మాయా సింహమును ప్రార్థించినాడు ఇటులనే శిబిచక్రవర్తి వంటి వారికథలు నిస్వార్థతకు ప్రబల నిదర్శనములయియున్నవి. కాని ఇచట ధర్మజుడు తనతమ్ముని విడచిపుచ్చినచో వన్యమృగములను వేటాడి ఆ మాంసమును తెచ్చిపెట్టెదననుట త్యాగలక్ష్మణమునుగాని, మరి ఏ విశేషలక్షణమును గాని ప్రదర్శింపజాలనట్టిది.

48. దుర్యోధన ఘోషయాత్ర సందర్భమున ధర్మజుడు చూపించిన ఆదర్శము విశేషమైనట్టిదియు, దూరదృష్టితో కూడినట్టిదియు, సాధారణదృష్టికి ధర్మజుని సోదరవాత్సల్యము మాత్రమె గోచరించును. అట్టి దృష్టిగలవారికి ప్రతినిధిగ భీమునినిల్పి సోదరుడైనను, శత్రువైనప్పుడు ఎవరిచేతనో పరాభవింప బడుచున్నప్పుడు మన బాధ్యత తీరునటుల భావింపవలెనని భీముముఖమున వ్యాసుడు పలికింపజేసినాడు. కారణము లోకమున అట్టి సాధారణ మనస్తత్వము గలవారు అధిక సంఖ్యాకులగుటయే.

కాని ధర్మజుని స్థాయివేరు. అతడు భవిష్యత్ చక్రవర్తి. సోదరుల మధ్య ఎన్ని పొరపొచ్చములున్నను తన సోదరుడొక సామాన్యునిచే పరాభవింపబడినాడని లోకమున చెప్పబడుచుండుట భవిష్యమున అతని కీర్తికి భంగకరము. భవిష్యత్తున సోదరులుకాని, సోదర పుత్రులుగాని, పౌత్రులుగాని తన్నాశ్రయింప వచ్చును. తనకు లోబడి భూభాగముల నేలవచ్చును. ఎవరెచ్చటనున్నను అదియెల్ల కురువంశమే. తాత్కాలికమైనతగవులు చరిత్రమున కాన్పడక పోవచ్చును. కాని కురువంశమునకు మచ్చ ఏర్పడినచో(అన్యునిచేత కురువంశీయుడు పరాభవింపబడినచో) అదిమాత్రము సార్వకాలికమై చరిత్రమున నిలిచిపోవును. ఇదియె ధర్మజుడు పల్కిన క్రిందిమాటల సారాంశము.

వ. ఏకాన్వయజాతులైన వారికి నర్థనిమిత్తంబయిన భేదంబొక్కొక్కమాటు వర్తిల్లునంతనచేసి సహజ స్నేహంబు దప్పనేరదు జ్ఞాతి జనంబులుదమలో నెట్టివారయిన నొప్పుంగాని యన్యులవలనం బరిభవంబు దొడరినప్పుడు దారొందురులఁజేకొనకునికి లోకనింద్యంబు-అరణ్య-పంచమ-**409**. ఇది యథామూలము.

ఇంతియె కాదు. సూక్ష్మముగ పరిశీలించినచో ధర్మజుని గుండెలోతును మరియొక విధముగ కూడా భావింపవచ్చును. దుర్యోధనుని రక్షించుటకు భీమార్జునులు పూనుకొననిచో అనంతర పరిణామము లెట్లుండును. దుర్యోధనుడు బంధీయయినచో, ఆవార్త అనతి కాలములోనే భీష్మ, ద్రోణాదులకు చేర కుండునా? అపుడువారు మిన్నకుందురా? తప్పక వారు దుర్యోధనుని విడిపింపగలరు. అట్టితరి యక్ష, గంధర్వాది దేవకోటిని జయించిన వీరవర్గముగ కౌరవకోటి వాసికెక్కగలదు. అంతకన్న సోదరప్రేమయను కారణమున, పాండవులచే దుర్యోధనుడు ఆపదగట్టెక్కినాడని లోకముభావించుట ధర్మజునకు కీర్తికారకమే గాక శ్రేయోదాయకముకూడ.

49. అనంతరము బద్ధుడైన దుర్యోధనుని తోడ్కొని చిత్రసేనుడు ధర్మజుని సముఖమునకువచ్చి అభివందన మొనర్చినాడు. అంతటధర్మరాజు స్నేహంబుతో సపర్యలొనరించి చిత్రసేనునకువీడ్కొలిపి,దుర్యోధనునితోనిట్లనినాడు.

ఉ. ఎన్నడునిట్టిసాహసములింకనొనర్పకుమయ్య దుర్జనుం
దన్నున సాహసక్రియలయందుగడంగినశించు గావునం
గ్రన్నన తమ్ములన్‌దొరలగైకొనియిమ్ములబొమ్ము వీటికిన్
సన్నుతదీనికొండొకవిషాదముబొందకుమీమనంబునన్ -అ-పం-434-ఇదియధామూలము

పై పద్యమును నాలుగు మాటలున్నవి. 1) ఇకపై ఎప్పుడు ఇట్టి సాహసము చేయకుము. 2) దుర్జనుడు తొందరపాటు సాహసముతో నశించును. 3) సోదరులను, దొరలను వెంటనిడుకొని యిండికిబొమ్ము, 4) కీర్తిమంతుడా! జరిగినదానికి మనమున బాధపడకుము. **పై నాలుగు మాటలను సహజముగ అగ్రజుడైన ఇంటిపెద్దగ చెప్పుటకు తనకు అర్హత యుండుటచే, ఆ మాటలలో ఆప్యాయము ధ్వనించును.**

కాని ఆ మాటలవెనక గాఢమైన ఎత్తిపొడుపు ఉన్నది. నీవు విహారమునకు వచ్చుట సహజముగ వచ్చుటవలెలేదు. ఇదియొక సాహసమని మాకు తెలియును. అని మొదటిభావము. నీవంటి దుర్జనుడు భవిష్యమున మాపై ఇట్టి సాహసమునకు కడంగినచో నశించుట తథ్యమని వాచ్యముగనే చెప్పినాడు. నీ సోదరులు చేతకానివారు, వారిని జాగ్రత్తగా ఇంటికి తీసుకొనిపొమ్మని చెప్పుచు, నీవు దొరలుగా భావించిన కర్ణాదులు నీకు పనికిరాకపోయిరి సుమా! **అని హెచ్చరించినాడు. చివరిమాట విశేషమైనట్టిది,** మనసున బాధపడకనుట సామాన్యము. కీర్తిగలవాడా! ఈ అవమానము మర్చి పొమ్మనుట, వ్యంగ్యముగ నీకీర్తి నేలకలసినదని చెప్పక చెప్పుటయేయగును. లేక నిన్ను బలశాలిగ లోకము కీర్తించుచున్నదని భావించుకొనుచున్నావు. అదియెల్ల మిథ్యసుమా! **యని, యిన్ని వ్యంగ్యభావములతోకూడిన ఈ పద్యము ధర్మజుని గంభీర మనస్తత్వమునకు ప్రతీకగనున్నది. అనంతరమున జరిగిన సైంధవ దుశ్చేష్టితమునకు వగచి**

50.తే. అనిన ధర్మజుడిట్లనునద్దురాత్ము, బోలియజేయుటదగదు దుస్సలదలంచి
వాని నొకతప్పునకుసైపవలదె యాంబి, కేయమహిషికిఖేదంబుసేయజనునె-ఆ-షష్ఠ-242

ఇట మూలమున ధర్మజుడు జయద్రధుని విడిచి పుచ్చుమని మాత్రమే భీమునితో పలికినటుల గలదు. కాని అనువాదమున ఎఱ్ఱాప్రగడ కల్పితమైన పద్యము హృద్యముగ, లోకవిదితమైనదిగ కన్పించును. జయద్రధునిపట్టి భీముడు చంప సిద్ధపడినప్పుడు ధర్మజుని మాటలు వివేకవంతములైనవి. ధర్మజునకు లోకుల మనస్తత్వము బాగుగ తెలియును. సుభద్ర తన చెల్లెలగుటచేతనే కృష్ణుడంతటివాడు అనుక్షణము తమనాదుకొనుచున్నాడు. సోదరుడగుటచేతనే శ్రీకృష్ణ సహాయముతో ద్రౌపది తన్ను రక్షించుకొనగలిగినది. ఈ విధముగ బంధువులెల్లరును ఆడపడుచుపట్ల మక్కువ చూపుట సహజము. ఆదరింపక పోయినను, అపకారమొనర్చుటను లోకమున ఏ కుటుంబసభ్యులును హర్షింపనట్టిది. దుస్సల తనకు సహోదరి. గాంధారికి ఏకైక కుమార్తె. కనుక మూర్ఖుడైన సైంధవుడు ఎట్టి అపచారమొనర్చుటకు సాహసించినను ఏ విధముగనైన బుద్ధి చెప్పవచ్చును. కాని సోదరి పసుపు, కుంకుమలకు మాత్రము లోటురానీయరాదు. ఇది భారతీయ సంస్కృతిలో ఒక భాగమేకాక, కురురాజాంతఃపురమునుండి ధర్మజునిపై ఎనలేని గారవము కల్గుటకు సాధకమగుచున్నది. ఇదియెల్ల దూరదృష్టితో ఆలోచించి జయద్రధుని చంపుటకు సాహసించిన భీమాదులనడ్డుకొనుటలో ధర్మజుని లౌక్యము స్పష్టమగుచున్నది.

51. యక్షప్రశ్నల కథాభాగము అరణ్యపర్వ సప్తమాశ్వాసమున ప్రసిద్ధిగాంచిన ఘట్టము. ఈ ఘట్టమున ధర్మజునకు కౌరవులపైగల ద్వేషమును, సోదరులపట్ల అభిమానము, పక్షపాతరహితమైన సోదరప్రేమ, ధార్మిక సంబంధమైన విజ్ఞానము ప్రస్ఫుటములు కావింపబడినవి. సరోవరతీరమున పడియున్న నలువురు సోదరులను జూచి ధర్మజుడిటుల భావించినాడు.

ఉ. క్రూరుడుధార్తరాష్ట్రుడతికుత్సితుడెంతయుఁబాపబుద్ధిగాం
ధారుడుపె క్కుమాయలకు దావలమక్కట యద్దురాత్మకుల్
వారక యెద్దియేనియొక వంచనమైనిటుసేసిరొక్కొయె
వ్వారలు నాత్మనమ్ముదురె వక్రవిచారులఁబాపకారులన్-అరణ్య-సప్త-**409**

పాలు, నీరువలె కౌరవులతో కలసి యుండవలెనని, అందందు ప్రముఖులయెదుట ధర్మజుడు పల్కు మాటలలోని లౌక్యమును వివరించుటకిట్టి పద్యము ఉదాహరణయోగ్యము.

52.చం.పుడమియుఅర్థసంపదయుఁ బొల్పరవైరులపాలుసేసి యీ
యడవికివచ్చి భీకరమృగావలి పొత్తుననున్న వీరివె
న్నడికొని యిట్లుసేసెనె యనాథులబోలె విధాతృఁడింకనె
క్కడఁజనువాడనేదికడగాఁ దరియింతు దురంతదు:ఖముల్-అరణ్య-సప్త-**411**

ఇట మూలమున ధర్మజుడు భీమాదులు విగతజీవులై పడియుండుటచూచి, భీమార్జునాది సోదరుల ఒక్కొక్కరి గుణగణాదుల ప్రశంసచేయుట వేరువేరుగా కన్పట్టును. అనువాదమున భావము గ్రహించినటుల తెలియుచున్నది. ఇచ్చట ధర్మజుని హృదయమును గ్రహించుట బహుకష్టము. భూమిని కోల్పోయినపిదప కౌరవులు ధర్మజునకు వైరులైనారా? లేక వైరులకే భూమిని కోల్పయినాడా? అనునదికూడ తేల్చిచెప్పుట కష్టము. కాని జూదమునకు పూర్వమే కౌరవులపట్ల ధర్మజునకు విరోధభావమున్నటుల ఊహించుటకే యిచట అవకాశమెక్కుడుగ కాన్పించు చున్నది. ఇక మహాభారతమాద్యంతము ఒక చిత్రమైన మాటకాన్పించును.

అది "మాయజూదము" అనుమాట, నిజమునకిచట మూడు విషయములు ప్రధానములు. అందు ప్రథమము జూదమునకు పిలువబడినచో రాజులు తిరస్కరింపరాదన్న విషయము శాస్త్రబద్ధమా! అనునట్టిది. దీనిని భారత విమర్శకులు అంతగ పట్టించుకొన్నటుల కాన్పింపదు. ఇక రెండవ విషయమింత కన్నను ప్రధానమైనట్టిది. జూదమున భార్యను పణముగా పెట్టినవారు సర్వభారతీయ సాంస్కృతిక చరిత్రములో ఎచ్చటనైనా కలరా! ఇది కూడ ధర్మబద్ధమేనా! కానినాడు భారతకథలో ధర్మజునికన్న నికృష్టమైన పాత్ర మరియొకటి కాన్పింపదు. సత్యవాక్యపాలనాది సమస్త సద్గుణ సంపత్తి ఎంతగొప్పదియైనను, అగ్నిసాక్షిగ వివాహమాడిన భార్యను ఒక సుక్షత్రియుడు, ఒక ధర్మమూర్తిగ ప్రసిద్ధిచెందినవాడు భార్యను పణముగా పెట్టి, ఆమెను నిండుసభలోకీడ్పించుటకు కారణమగుట మహాభారతములోని నికృష్టపాత్రములన్నిటికన్న నికృష్టునిగ వానిని ప్రదర్శించును. ఇందుకు ధర్మశాస్త్రము వానికి అధికారమిచ్చినదా! లేదా! అను విషయమై ధర్మజగుణ విశ్లేషణమాధారపడి యుండును. కాని వివాహానంతరము భార్య తనవద్దీ లోనున్న వస్తుసామగ్రిలో ఒకటిగ భావింపవచ్చుననున్నమాటలు ద్యూత సమయమున మహాభారతమున వినిపించినను, వైదికశాస్త్రములలో కాని, సంప్రదాయములలో కాని యిట్టి చర్యను ఆమోదించు ప్రమాణ

వాక్యములున్నవా! అను విషయమును ఇంతవరకు భారతపరిశోధకులు ఎవ్వరూ చూచినటుల కాన్పింపదు. ఇక మూడవ విషయము. ధర్మజుడడవికేగుటకు సమ్మతించియే జూదమునకు ముందు అరణ్య, అజ్ఞాతవాస నియమముల కిష్టపడి జూదము ప్రారంభించినాడు. నిజమునకు ఆ సందర్భమున ధర్మజుడే నెగ్గినచో కౌరవులను అరణ్యమునకు పంపవచ్చునని ధర్మజుడాశించెనో! లేదో? మనకు తెలియదు. బహుశః అపుడు ధర్మజుడు శ్రీకృష్ణుని ఉపదేశము కోరియుండును. అతడైనను కౌరవులను విడిచిపెట్టడనియే అనిపించును.

ఏమైననేమి? క్షాత్రసంబంధమైన రజోగుణసంబంధమైన పొరపొంచెము ఆశలేనిదే, ధర్మజుడా జూదమునకిట్టి నియమములంగీకరింపడు గదా! పిలిచినచో జూదమాడక తప్పదన్నది నియమమే కావచ్చును. గాని పణములనుకూడ కౌరవులు పేర్కొన్న వాటిని అంగీకరించి తీరవలెనన్నదికూడ నియమమై యుండదు గదా!

ఇచ్చట ఒక్కటియె సమాధానము కాన్పించును. పూర్వజన్మ దుష్కృతముచేకాని, మరియే కారణముచేగాని ఒక్కొక్క అభాగ్యుడు ఒక్కొక్క తప్పటడుగువేయును. చిన్నతప్పునకు పెద్దశిక్షపడినదే! యని మనము ధర్మజుని చూచి జాలిపడవలయునేతప్ప, ధర్మజుని దోషములేదని చెప్పుటకు సుదూర కారణములను వెదికి కొనవలసివచ్చును. అందున బాల్యాది నడచుచున్న సోదరవర్గముమధ్య చిన్నతప్పయినను, అది గడ్డిమేటుపై వేసిన అగ్నికణము కాకతప్పదని వివేకులు గ్రహింపగలరు. అయినను ధర్మజుడిచట కౌరవులను నిందించుటలో క్షాత్రసహజమైన వైరగుణమే భాసించుచున్నది.

53. యక్షరూపధారియైన ధర్మదేవత ధర్మజుని ప్రశ్నించిన ప్రశ్నలు, దానికి ధర్మజుడిచ్చిన సమాధానములు కూడ పరిశీలనార్హములు, సంఖ్యాక్రమములో వివరింతును. ఇది యధామూలము.

1.వ ప్రశ్న – సూర్యుని ఏది నడుపుచున్నది? – (జ) – బ్రహ్మము నడుపుచున్నది.

2.వ ప్రశ్న – సూర్యుని ఎవరు కొలిచితిరుగుదురు? – (జ) – సురకోటి కొలిచితిరుగును.

3.వ ప్ర– సూర్యుని అస్తమనమేమిటి? – (జ) – ధర్మముచేత అస్తమించును.

4.వ ప్ర– సూర్యునకు ఆధారభూతమేది? – (జ) – సత్యము ఆదారమని పండితులు చెప్పుదురు.

5.వ ప్ర– జనుడు దేనిచే శ్రోత్రియుడు అనిపించుకొనును? – (జ)–వేదపఠనముచే శ్రోత్రియుడగును

6.వ ప్ర– దేనిచే కడుమహిమలు పొందుదురు? – (జ) – గొప్ప తపఃశక్తిచే మహిమలు పొందుదురు

7.వ ప్ర– పురుషుడు దేనిచే సహాయయుతుడగుచున్నాడు?(జ)–ధైర్యముచే సహాయయుతుడగుచున్నాడు.

8.వ ప్ర – బుద్ధిమంతుడేవిధముగ అగును? – (జ) – బుధసేవచె బుద్ధిమంతుడగును.

9.వ ప్ర– దేనికారణముగ ద్విజుడు ప్రకాశించును?–(జ) – వేదాధ్యయనమువలన ద్విజుడు ప్రకాశించును.

10.వ ప్ర– సాధుభావమెట్లు అతనికి వచ్చును? – (జ) – వ్రతశీలత వలన వచ్చును.

11.వ ప్ర– అసాధుత్వము దేనివలన ఏర్పడును?–(జ)–స్వధర్మమును (విశిష్టవృత్తి) విడుచుటచే ఏర్పడును.

12.వప్ర– ఏ కారణముచేత ఒకడు సామాన్యమానవుడు?(జ)–శౌచనియమము లేక మృత్యు భయము పొందుటచే సాధారణ మానవుడు అగుచున్నాడు.

13.వ ప్ర–జీవన్మృతుడెట్టివాడు? – (జ) – దేవ, అతిథి, పితృ, భృత్యులకు పెట్టక తినువాడు.

14.వ ప్ర–భూమికన్న బరువైనదేది?(జ)–తల్లి బరువైనది(ఇచట బరువనగ ఓర్పు, పూజ్యతని గ్రహింపవలెను)

15.వప్ర– ఆకాశముకంటె పొడవైనదేది?(జ)తండ్రి.(ఇచట పొడవనగ ఔన్నత్యము అనిగ్రహింపవలెను)

16.వ ప్ర- గాలికన్న వేగవంతమైనదేది - (జ) - మనసు

17.వ ప్ర- గడ్డిపోచకన్న తేలికైనదేది? - (జ) - (చింత) తరచు చింతన చేయుట

18.వ ప్ర- నింద్రించి యున్ననూ కన్నుమూయనిదేమి? - (జ) - చేప

19.వ ప్ర- పుట్టియును చేతనత్వము లేనిదేది? - (జ) - గ్రుడ్డు

20.వ ప్ర- రూపముండియు హృదయములేనిదేది? (జ)-హృదయరహితంబు రారూపు(రాతి ప్రతిమ)

21.వ ప్ర- ఏది వేగముచే ముందుకుపోవును? - (జ) - ఏరువేగముగ ముందునకు ప్రవహించును.

22.వ ప్ర- దారి నేగువానికి చుట్టమెవడు? - (జ) - బాటసారి.

23.వ ప్ర- గృహస్థునకు చుట్టమెవరు? - (జ) - మంచిభార్య.

24.వ ప్ర- రోగార్తునకు చుట్టమెవడు? - (జ) - వైద్యుడు

25.వ ప్ర- మృతపొందిన వానికి చుట్టమేది - (జ) - చేసిన ధర్మము

26.వ ప్రశ్న - ఏది ధర్మమునకు ఆధారము? - (జ) - దాక్షిణ్యము ధర్మమునకు ఆధారము.

27.వ ప్రశ్న - కీర్తికి ఆశ్రయమేది? - (జ) - దానమే కీర్తికి నెలవు.

28.వ ప్ర- సురలోకమునకు మార్గమేది? - (జ) - సత్యము

29.వ ప్ర- సుఖమునకు నెలవేది? - (జ) - శీలము

30.వ ప్ర- నరునకు ఆత్మ ఎవరు? - (జ) - కొడుకు

31.వ ప్ర- దైవికమైన చుట్టమెవరు? - (జ) - భార్య

32.వ ప్ర- నరునకు బ్రతుకుతెరువేది? - (జ) - అతనికి జీవిక పర్జన్యుడు

33.వ ప్ర- దేనివలన నరుడు మెప్పుపొందును? - (జ) - దానమువలన పొగడబడును.

34.వ ప్ర- మేటి ధర్మమగు నట్టిదివేది? - (జ) - అహింస

35.వ ప్ర- ఏది ఎప్పుడూ పండి యుండును? - (జ) - యాగకర్మము

36.వ ప్ర- ఏది నిగ్రహించిన ప్రమోద సిద్ధిని పొందును? - (జ) - అహంభావము

37.వ ప్ర- ఎవరితో సంధి ఎప్పుడును చెడదు? - (జ) - సుజనుల స్నేహము

38.వ ప్ర- లోకమునకెయ్యది దిక్కు? - (జ) - సజ్జనులు

39.వ ప్ర- జలములు, అన్నమును దేనినుండి సంభవించును? - (జ) - ఆకాశము, భూమి

40.వ ప్ర- విషమనంగ నేది? - (జ) - విప్రధనము

41.వ ప్ర- శ్రాద్ధవిధికి సమయమెట్టిది? - (జ) - బ్రాహ్మణాగమనము

42.వ ప్ర- సర్వజన ప్రియుడు ఎవడు? - (జ) - గర్వము విడిచినవాడు

43.వ ప్ర- శోకము లేనివాడెవడు? - (జ) - క్రోధము చంపుకొన్నవాడు

44.వ ప్ర- అర్థవంతుడెవ్వడు? - (జ) - లోభమును విడిచినవాడు

45.వ ప్ర- సుఖమును పొందువాడెవడు? - (జ) - ఆశ విడిచినవాడు

46.వ ప్ర- పురుష శబ్దమున కర్హుడెవడు? - (జ) - విశ్వవ్యాపకమైన కీర్తికలవాడు

47.వ ప్ర- సర్వధని అగువాడెవడు? - (జ) - ద్వంద్వాతీతుడైనవాడు

ఇందు (47) ప్రశ్నములున్నవి. వానికి సమాధానములున్నవి. మొదటి నాలుగు ప్రశ్నములును సూర్యుని, సూర్యచారమును వివరించునట్టివి. వేదములందు సూర్యప్రశంస విశేషముగనున్నది. శ్రీమద్రామాయణమున ఆదిత్య హృదయము సూర్యమహిమనుగ్గడించునట్టిది. సూర్యుని పరబ్రహ్మముగ పై సందర్భములు వర్ణించుచుండగ, ఇచట సూర్యుని బ్రహ్మమునడుపుచున్న దనుటచే ధర్మజుని దృష్టిలో సూర్యుడు నవగ్రహములలోనొక గ్రహ మాత్రడైనాడు. 5, 6, 9, 10, 11 ప్రశ్నములు కేవలము ద్విజ సంబంధములు. మహాభారతమున పలుతావుల సుదీర్ఘముగ చర్చింపబడినట్టివి. (39)వ ప్రశ్నమున జలము, అన్నము దేనినుండి సంభవించుననగ ఆకాశము, భూమియని సమాధానము. భారతమందే భగవద్గీతలో "యజ్ఞాత్ భవతి పర్జన్యః పర్జన్యాదన్నసంభవః" అని యున్నది. శ్రీకృష్ణ వచనమే ప్రమాణము కదా! మిగిలిన వానిలోననేక ప్రశ్నములు సమాధానములు విశేషముగ స్థూల దృష్టికి కాన్పింపక పోయినను, ఇవి తాత్విక సంబంధమగు ప్రశ్నలని నీలకంఠులు తమ భారతభావదీపికలో వివరించియున్నారు.

54. అంతనా యక్షుడు ధర్మజునితో నీసమాధానములు నాకు తృప్తినొనరించినవి. కావున నీ తమ్ములం దొకరిని జీవితునిగ జేసెదను. ఎవరిని చేయమందువని అడుగగ ధర్మజుడు.

సీ. శ్యామాంగు నారక్తజలరుహనేత్రుసా, ల ప్రాంశునున్నతదీప్తబాహు
నకులుని బ్రదికింపు నావుడుయక్షుండు, భీమఫల్గునులతి భీమబలులు
ప్రియులు నీకెంతయుఁబృథివీశ వీరిలో, నొకని గోరకయిట్లు నకులుగోరి
తనుడు ధర్మాత్మజుడనియెను మాతండ్రి, యగుపాండువిభునకు మగువలిరువు

ఆ. లరయగొంతికొడుకులైనమువ్వురిలోన, నేనుబ్రతికినాడ నింకమాద్రి
తనయులిరువురందుదగనిప్పుడొక్కడు, బ్రతుకవలదె చెవుమపాడితెరగు-ఆర-సప్తమ-456

ఆ. ధర్మనందనుండు ధర్మాత్ముడనియెప్ప, దగిలి జగమునన్ను బొగడుచుండు
నట్టియేనుధర్మహానికినోర్వజు, మ్మెంతవచ్చెసేనియింతనిజము-457, ఇది యథామూలము

ఇచట ధర్మజుని ధర్మదృష్టితోపాటు సోదరులపట్లగల సమభావమును వ్యక్తమగుచున్నది. అయిననిట ఒకవిశేషము గమనార్హము. భాష హృదయమును వివరింపగలదేకాని భాషయే హృదయముకాజాలదుగదా! భాషాశక్తి విశేషమైనట్టిది. సందర్భమునుబట్టి భావమును గ్రహింపవలయును. 'ధర్మనందనుండు ధర్మాత్ముడని యెప్పుడగిలి జగమునన్ను బొగుడుచుండు. అట్టినేను ధర్మహానికి ఓర్వజుమ్ము"అనుట చాలును. లోకులు ఇచ్చిన గుర్తింపు పోగొట్టుకొనుట కిష్టపడడు, అను భావమును స్ఫురింపజేయుట స్థూలదృష్టికి పేలవముగ దోచును. ప్రజలకు తెలియని విషయమైనను, ధర్మజుడు ధర్మవిరుద్ధముగా నడువడని పాఠకులు సహజముగ భావింతురు. అయినను యిచట విపరీతార్థమునకవకాశమీయక "నాధర్మనిరతి లోకమునకు తెలిసినట్టిదియే. నేడు మాత్రము భీమార్జునులపై గల ప్రేమచే విరుద్ధముగ నడుతునా" అను భావమున ధర్మజుడు పల్కినటుల గ్రహింపవలయును.

==========

మహాభారతమున ప్రతిపర్వమును విశిష్టమే. అందు విరాటము తిక్కనచే వ్రాయబడిన తొలిపర్వము. ఈ ఘట్టము కథకైన పట్టుచేత, తాను రచింపదలచిన విధానముచేతకూడ విశిష్టమైనట్టిదని ధ్వనిగ చెప్పదలచికాబోలు ఊర్జిత కథోపేతంబు నానారసాభ్యుదయోల్లసి అని స్వయముగ తిక్కన చెప్పుకొనినాడు. ఈ రసాభ్యుదయములో పాత్రచిత్రణముకూడ గతార్థమగును. వత్సరముపాటు అజ్ఞాతవాసదీక్ష ప్రపంచచరిత్రముననే విశేషమైన పందెముగ కాన్పించును. పణము లొడ్డునపుడు ఎదుటి పక్షమువారు కోరినటుల అంగీకరింపకుండుట నాటి రాజధర్మమున అధర్మమగునేమో తెలియదు. ఇప్పాటెందుగలదే అని ధర్మజుడు పలికినటుల తిక్కన కల్పించినాడు. కాని ఈపాటు ధర్మజుడే కొనితెచ్చుకొనినటుల కాన్పించును. ఇచట ఒకవిశేషము పాఠకుల మనస్సునతోచుట అసహజము కాదు. ఇంద్రప్రస్థమున ధర్మజునకు సమస్త సంపదలును కలవు. రాజసూయమున సమస్త రాజలోకము తనకు వినతి యొనర్చినది.

అట్టి ధర్మజునకు సామంత రాజ్యతుల్యమైన ఇంద్రప్రస్థ భోగములు పెద్దగ మనసునకెక్కియుండవు. ఎప్పుడైనను హస్తిననువశమొనర్చుకొని మహాభారతచక్రవర్తిగ చరిత్రమున నిలువవలెనన్న ఆకాంక్ష లోలోన ఉన్నదేమో తెలియదు, ఊహించుటకు మాత్రమవకాశమున్నది. కనుకనే సమస్తసంపదలు పణముగానొడ్డి అరణ్య వాసమునుచేబట్టి, సోదరులకు అష్టకష్టములుకల్పించి, వారిలో కౌరవనాశన కాంక్షనురేకెత్తించి, చివరకు యుద్ధవిజేతయై, భారతచక్రవర్తియై తన వాంఛితమును నెరవేర్చుకొనినాడనిపించును.

అజ్ఞాతవాసమున ధర్మజప్రవర్తనములోని లౌక్యము చాల ఉన్నతముగ నడచినట్టిది. యతియైయుండి జూదమాడుటయే ఒకవిశేషము. కీచకునిచే భంగపడిన ద్రౌపదితో విరాటసభయందు ధర్మజుడుపల్కిన పలుకులుకూడ మిక్కిలి లౌక్య సంపన్నములు. అదనుచూసి గంధర్వులు శత్రువులను మట్టుబెట్టుదురని పల్కుటయందే వర్తమానముతోపాటు, భవిష్యపథకముకూడ కాన్పించును. దుర్యోధనుని గోగ్రహణ సంరంభమున కోరకయే కల్పించుకొని, సమస్త కౌరవులను అర్జునుడొక్కడే ఓడింపగల సమర్థుడని లోకమునకు చాటినట్టివాడైనాడు. అంతకు మున్నుగనె ఉపకీచక సహితముగ కీచకుని మట్టుబెట్టిన భీముని బాహుబలము లోకవిదితమగుటకు సిద్ధమైనది. విరటునితోడి సంభాషణము, సభలో ద్రౌపదితోడి సంభాషణము, అక్షఘాతమున నుదుటనుండి రక్తము స్రవించినను ఓర్చుకొనుట, ఆయా సందర్భములందు భీమార్జునులతోడి వ్యంగ్యసంభాషణము ధర్మజుని అనేక మేల్మిగుణములకు నిదర్శనములుగ నిల్చును. చివరకు ఉత్తరాభిమన్యుల వివాహము జరిపించి విరటుని, వానిబంధువులైన రాజులెల్లరనుకూడగట్టుకొని భవిష్య సంగ్రామమునకైన జాగరూకతనెల్ల వహించుటలో ధర్మజుడసాధారణుడని తెలియగలదు. ఇట్టి విశేషములనెల్ల దృష్టినిడుకొని ఈ పర్వమునందలి ధర్మజపాత్రను పరిశీలించితిని.

ప్రథమాశ్వాసము :

55. విరాటపర్వ ప్రథమాశ్వాసమున తమ పన్నెండుసంవత్సరముల అరణ్యవాసమును సముచితముగ పరిపూర్తి గావించుకొని, ధర్మదేవతా సమాగమముచే అజ్ఞాతవాసవత్సరము భంగముకాకుండగ వరముబడసి, అంతకుమున్ను

తమతోపాటు అరణ్యవాసముచేసిన విప్రోత్తములతో ధర్మనందనుడిట్లనియె. మీకందరకు దుర్యోధన చేష్టితములు విదితములు. కావున మాతోపాటుగ అరణ్యవాసము మీరును చేసినారు. కాని ఈ పదమూడవ ఏటి అజ్ఞాతవాసమున మేము జాగరూకులమై వ్యవహరింపవలెను. చిన్న పొరపాటుజరిగిన దుర్యోధన,కర్ణ,శకునులు కాచుకొనియుందురు. కావున మీరందరు మమ్ము వీడినచో రహస్యముగ చరించెదము, అని మరియు విషణ్ణహృదయుడై, ధర్మజుడు

కం. ఒకనాడేమును నాపద, లకువిడుమరగాంచి విప్రులంజుట్టలఁ బె
ట్టుకొని సుఖముండబడయుదు, మొకొయిప్పాటెందుగలదె యొరులెవ్వరికిన్.-విరాట-ప్రథ-48

ఎవరైనను యిట్టి కష్టమును పొందినారా ! ఏదో ఒకనాడు మేమును ఆపదలు తుదిముట్ట విప్రులతోను, బంధువులతోను సుఖముగనుందుమను ఆశాభావముతోకూడిన తమ పరిస్థితిని వివరించినాడు. పై విషయము మూలమున లేనట్టిది. తిక్కన ఈ సందర్భమును కల్పించినాడు. మూలమున జనమేజయుడు అడిగిన ప్రశ్నలకు సమాధానముగ వైశమ్పాయనుడు మీముత్తాతల అజ్ఞాతవాసము విరాటనగరమున ఎట్లు కొనసాగినదో చెప్పెదను వినుమని ధర్మజుడు తనతమ్ములతో జరిపిన మంత్రాలోచనముతో ప్రారంభమైనది. ఇట మూలమున ధర్మజాదులతో అరణ్యవాసముచేసిన విప్రులవిషయము ప్రస్తావింపబడలేదు. కాని తిక్కన ప్రస్తావించుటలో ఔచిత్యము కాన్పించు చున్నది. పాండవులు అజ్ఞాతవాసుమనకేగుతరి వారిననుసరించివచ్చిన విప్ర్రులైమానారో? అనుప్రశ్న ఉదయింప వచ్చును. పాండవులు రహస్య వర్తనమునకేగుతరి విప్రులు వారివారి త్రోవలపట్టిపోయిరా! అనుసందేహమిచట కలుగవచ్చును. కాని విప్రభక్తిపరాయణుడు, సుక్షత్రియుడు భావిచక్రవర్తియగు ధర్మజుడెట్లు ప్రవర్తించినాడను విషయము ఎరుగవలసియే యున్నది. అందువలన తిక్కనగారు ధర్మజుని ప్రవర్తనలో అస్పష్టముగనున్న విషయమును, సుస్పష్టపరచుటకై తద్వారా, సహజబ్రాహ్మణభక్తి, ఉచితప్రవర్తనాసరళి మేళవించి తెనుగు ధర్మరాజునకు కించిత్తు మెరుగుపెట్టినాడు. ధర్మజుడు బ్రాహ్మణులను గౌరవింపకయే విడుచుననుకొన్నచో, తన భవిష్యపాలనకు మచ్చతెచ్చికొనునట్లగును. కారణము బ్రాహ్మణులు అరణ్యమునుండి మరలవచ్చి, ధర్మజప్రవర్తనమును ప్రజలకు తెలిపినచో అసంతృప్తి అంకురించును. మరియొక సంవత్సరానంతరము రాజ్యమునకు తిరిగివచ్చి పాలించు ప్రభువు ప్రజలలో ఒక వర్గమువారు ముఖ్యులగు మేధావివర్గము వారిపట్ల నిరసనభావము వ్యక్తముచేసిన ప్రభువునకది క్షేమముకాదు. పై పరిస్థితులన్నింటిని లౌక్యముతో పరిశీలించి వారియెడల తనసహజ ఉదారతను ధర్మజుడు ప్రకటించెను.

56.విప్రులనందరిని యథోచితముగసంభావించి, సంభాషించునెడ ద్రుపదపురోహితుడగు ధౌమ్యుడు పాండవుల నోదార్చుచు

ఉ. ధర్మనిరూపకత్వమున ధైర్యమునన్మహనీయవృత్తి స
త్కర్మవిధిజ్ఞతంజతురతా మహిమన్ ధృధబుద్ధినెవ్వరున్
ధర్మరాజుపాటిగారనగ ధాత్రిఁ బ్రసిద్ధుడవైనయట్టినీ
పేర్మికి నీడెదుర్ధశలపెల్లునకున్ దురపిల్లుటారయన్ - విరాట - ప్రథమ - 51
ధర్మజగుణములను పొగెడెను. ఇది మూలమునలేనట్టిది.

ఇవ్విధమైన విశేషణ ప్రయోగములచే ధర్మజుని ధర్మపరాయణత్వమును, ధైర్యమును, సత్కార్మానురక్తియు, నిశ్చలబుద్ధి, నిర్మలకీర్తి అను గుణములనుకలిపి ధర్మజచిత్రము కనులెదుట నిలిపినాడు తిక్కన, మరియు ధౌమ్యునిచే లోకమున ఉత్తములు, మరియు దైవమునకైనను ఆపదలు తప్పవని, వాటిననుభవించుటయేకర్తవ్యమని లోకనీతిని ఉపదేశింపజేసినాడు. తదనంతరము విప్రులాశీర్వాదములు గైకొని వారల నిజస్థానములకంపి, భార్యానుజులతోడ కర్తవ్యమునిశ్చయించుటకై ఉద్యక్తుడైనాడు. ఏదేశముననుండినచో తమరహస్య భేదనముగాదో తెలుపుమని అర్జునుని అడిగినాడు. అతడు సుభిక్షములైన దేశములను ఎరిగించినతరి, ధర్మజుడు మత్స్యదేశముననుండుటయే మేలనితెలిపి, ఎవరెవరు ఏ విధమున విరటుకొలువు చేరుదురనిన, అర్జునుడు ముందుగ ధర్మజహృదయమును తెలుసుకొనగోరువాడై అతనిని అడుగు సందర్భమున మూలమును విపులీకరించినాడు తిక్కన.

57. ఇట మూలమున అర్జునుడు పలికిన ధర్మజగుణములు నాలుగింటిని మాత్రమే పేర్కొనెను.

1) శ్లో. మృదుర్వదాన్యోహ్రీమాంశ్చ ధార్మికః సత్యవిక్రమః

రాజంస్త్వమాపదాకృష్టః కింకరిష్యసి పాణ్డవ.-విరాట-ప్రథమ-(20) శ్లో.

(ఓ మహారాజా! నీవుమెత్తనివాడవు. ఒకరికింత ఇచ్చువాడవు. లజ్జావంతుడవు. ధర్మమును పాటించువాడవు. సత్యపరాక్రమము కలవాడు. నీవు ఇపుడు ఈ ఆపదకులోనై ఏసేవ చేయుదువు) ఇట అనువాదమున తిక్కనగారు ధర్మజ గుణములను అధికముగ పేర్కొనుట కన్పించును. (1. విరాటపర్వము ప్రథమ (20) శ్లో. మూలము

సీ. మహనీయమూర్తియు మానవైభమును, సౌకుమార్యంబునుసరళతయును
మార్దవంబు ప్రభుత్వ మహిమయు నపగత, కల్మషత్వంబునుగౌరవంబు
శాంతియు దాంతియుఁజాగంబుభోగంబు, గారుణ్యమునుసత్యసారతయును
ధర్మమయ క్రియాతత్పరత్వంబును, గీర్తిదనార్జనక్రీడనంబు

ఆ. గలిగి జనులనేలగానియెన్నండును, నొరులగొల్పి తిరుగవెరవులేని
యట్టినీవు విరటునెట్టి చందంబున, ననుచరించువాడవధిప చెపుమ-విరాట ప్రథమ-67

ఇటతిక్కనగారి విశేషణములలో కీర్తి ధనార్జనక్రీడనంబు అనునది పరికింపవలసినది. ఇవి అమూలకములు. ధర్మజునకు కీర్తిప్రధానము. అనగా లోకమెల్ల తనప్రవర్తనను మెచ్చవలెను. సజ్జనులందరిలో గణనీయుడై యుండ వలెనను తాపత్రయము ధర్మజునియందధికముగ గోచరించును. అట్లే ధనార్జనక్రీడనంబనునది ధర్మజునికితగు గుణముగ భాసించుచున్నది. ధనమందలి ఆసక్తిలేదనుచు, కన్పించుధర్మజుడు, ధర్మపరమగు అర్థమునుమాత్రమే కాంక్షించును. అనగా అర్థాసక్తిపూర్తిగలేని విరాగియని చెప్పజాలము. అది ధర్మపరమైనదని లోకులు విశ్వసింప వలెననునది ధర్మజుని భావనగ కాన్పించును.

58. అర్జునుడు అడిగినదానికి ధర్మజుడు తనుప్రవర్తించు తీరును తెలియపరుచు సందర్భమున మూలమున

1) శ్లో. సభాస్తారోభవిష్యామి తస్యరాజ్ఞామహాత్మనః, కంకోనామద్విజోభూత్వామతాక్షః ప్రియదేవనః-విరా-ప్ర-(23) (మహాత్ముడగు అరాజునొద్ద నేను సభికుడనగుదును. కంకుడనుపేరుతో బ్రాహ్మణుడనై పాచికలనుపట్టి క్రీడాశక్తి కలవాడనై యుందును) ((1) విరాటపర్వము-మూలము)ఇట బ్రాహ్మణుడనై యుందును, అనియుండగ తిక్కన అనువాదములో సన్యాసినై యుందుననుట గమనార్హము. అనువాదములో

కం. సన్యాసివేషమున రా, జన్యుని గనియెపుడుగొలిచి సభ్యత్వమునన్

మాన్యుడనై పుణ్యకథా, విన్యాసమొనర్తు నతని వేడుకకుఁదగన్.-విరాట-ప్రథమ-69 అనిగలదు.

ఇచ్చట తిక్కనగారు సన్న్యాసిశబ్దము ప్రయోగించుటవలన ధర్మజుని అంతరంగమునగల స్వభావ. స్వరూపమును విశదమొనర్చినాడు. ఇచట సన్న్యాసమనగ జితేంద్రియుడై తపమొనర్చుకొనునట్టిదికాదు. ఇది క్షాత్రసన్యాసము. అనగా క్షత్రియుపరమైన పనులన్నిండిని తాత్కాలికముగా విడిచిపెట్టియుండుట అను అర్థముగోచరించును. సుక్షత్రియుడగువాడు ఒకరాజును ఆశ్రయించి సభికునిగ, పుణ్యకథావిన్యాసకునిగనుండుట అనగ తమదైన ధర్మమును విడిచిపుచ్చుటయె. ఇటువంటి లౌక్యపు సన్యాసమె దర్మజప్రవర్తనాపరముగ తిక్కన వివరించినట్టిది. కావున బ్రూహ్మణ అనుశబ్దమునకంటె సన్న్యాసశబ్ద ప్రయోగమునందే ధర్మజపాత్ర కనుగుణమైన రూపు శోభిల్లుచున్నది.

తదనంతరము ధర్మజుడు మిగిలినవారి వేష, విశేషాదులను తెలుసుకొనగోరి భీముని రూప,గుణ విశేషాదులను కీర్తించుచు ప్రశ్నించెను. అతడు వలలుడనుపేరున వంటవాడై విరటుకొలువు చేరెదననెను. అనంతరము అర్జునునికూడ అదేతీరుగ ప్రశ్నించిన, అతడు ఊర్వశిశాపానువర్తినై బృహన్నలనామముతో నపుంషక రూపధారుడనై నాట్యాచార్యునిగ విరటుకొల్వును చేరుదననెను. అంతనకులుని ప్రశ్నించిన అతడు దామగ్రంధిపేరున అశ్వరక్షకుడనై చరించెదననెను. సహదేవుడు తంత్రీపాలుడనుపేరుతో గోరక్షకునిగనుండెదననెను. అంత ద్రౌపదిని ఏ విధముగ అజ్ఞాతవాసము చేయనెంచెదవని ధర్మజుడడుగగ, ఆమెకూడ విరట "రాజ్ఞియైన సుదేష్ణాదేవి" అంతఃపురమున సైరంధ్రినై చరించెదనని పలుకగ, ధర్మరాజు అందరి అభిమతములనుమెచ్చుచు ధౌమ్యుని వైపుజూచి, బ్రాహ్మణులను, అగ్నిహోత్రములను తీసుకొని విశ్రాంతి తీసుకొనుడనెను. ఆ సమయమును ధౌమ్యుడు వారికి రాజులవద్ద మెలగవలసిన తీరునుపన్యసించెను. సేవాధర్మములువిని, వారివద్ద అనుమతి తీసికొని, భార్యానుజులతోడ విరాట దేశాభిముఖముగ ధర్మజుడు పయనమయ్యెను, విరటుపురమున ప్రవేశించు తరుణమున ధర్మరాజు తమ్ములతో ఆయుధములన్నింటిని భద్రపరచవలెనని, లేనియెడల అవివారి ఉనికిని శత్రువులకుపట్టియిచ్చు నని హెచ్చరించెగ, అందుకనువైన ప్రదేశమును పరికించి, రుద్రభూమికి సమీపమునగల జమ్మిచెట్టుపైనుంచి, ఆ ఆయుధముల అధిదేవతలను ప్రార్థించి,అవి వారికి తప్ప ఇతరులకు భయంకరమైన విషసర్పములటుల కన్పించ వలెనని ప్రార్ధించి, విరటుపురమున ప్రవేశించుటకుద్యుక్తులైరి. ఇటమూలమున ధర్మజుడు దుర్గాదేవిని స్తుతించినట్లు గలదు. కాని అనువాదమున తిక్కనగారు విడిచిపుచ్చిరి.

59. అంత ధర్మజుడు సన్యాసివేషమున విరటుకొలువున ప్రవేశించెను. విరటుడు ఆ సన్యాసి రూపలావణ్యములకు అచ్చెరువందుచు, మనసున పరిపరివిధములుగ అతనినూహించుకొనుచు, లేచి, ఎదురేగి సాదరముగ స్వాగత మొసంగి, అతని వివరములు అడిగెను. అంత ధర్మజుడు.

కం. ద్విజుడఁగురువిషయజాతుఁడ, సుజనప్రియుఁడైనధర్మసుతుసఖుఁడఁబరి

వ్రజనాశ్రమకలితుండ మ, నుజవల్లభయోగ్యబహువినోదకరుండన్-విరాట-ప్రథమ-195

నేను ధర్మరాజునకు ప్రియసఖుడనై యుండెడివాడను. ద్విజుడను ప్రస్తుతము పరివ్రాజాశ్రమమున నున్నవాడను, బహువినోదములైనవాటిని మీకు కల్గింతును. కపటజూదముచే శత్రువులు నాసంపదను హరించినట్టి

వారు. అందుచే విరక్తుడనైయిట్లు చరించుచున్నానని సమాధానమొసగి మరియు క్షాత్రవిద్యలందు ప్రవేశముగలదు. దర్మపరులవలన కొంత ధర్మము అలవడినది, పేరు కంకుభట్టనెదరు. భూమిపతులలో సాధుజన మిత్రుడవనితెలిసి నిన్నుగొల్చుటకు వచ్చితినని పలికెను. ఇచట తిక్కనగారు మూలమునగల భావమును తీసుకొని ఒకటి. రెండు మాటలలో కొంచెం అధికరచన గావించినాడు. మూలమునలేని ప్రసక్తినికూడ చేసినాడు. ఈ క్రింది పద్యము మూలమునలేనట్టిది. తిక్కనగారి కల్పితము.

తే. వత్సరంబున గడచనువ్రతమునాకు, దాని నీపాలఁజల్పియుత్సాహవృత్తి
మెరయనాకుఁ గృతఘ్నతనెరపి తొల్లి, యెగ్గు చేసిన వారి జయింపబోదు-విరాట-ప్రథమ-198

మూలమున ధర్మజుడు గోత్రనామములుతెల్పి, జూదమాడి వినోదము చేయుదునని చెప్పినటుల కలదు. కాని తన వ్రతనియమానుపాలనగూర్చి గాని, లేదా తన భవిష్యత్ కథనముగాని ఎరుకపరచలేదు. కాని తిక్కనగారు వాటిని ఎరుకపరచుటలో ఔచిత్యవంతముగనున్నటుల కాన్పించును. ఇట తానుండుకాలమును, భవిష్యత్ కార్యవిచారణయు గన్పట్టుచున్నది. ఇచట తొల్లియెగ్గుచేసినవారి జయింపబోదునని ధర్మజునోటివెంట పలికించినాడు తిక్కన. అనగా తన్ను జూదమునఓడించి, ఈ కష్టములన్నింటికీ కారణమైనవారిని జయించుటకు ఉత్సాహవృత్తి పోవుదుననుటలో ధర్మజునిలోగల క్షాత్రధర్మమును మనకు విశదమొనర్చినాడు. సుక్షత్రియుడగు వానికిట్టి ధర్మము సామాన్యమే. ధర్మజుడిపుడు సన్యాసవేషముననున్నవాడు గాని, నిజముగ సన్యాసికాడు గద! అందువలన తనకైన సహజ గుణములతో భాసిల్లు ధర్మజుడు అసత్యవర్తనముపొందక, సత్యపాలనానిరతునిగ చిత్రించుటకు తిక్కనగారు పొదిగి. ధర్మజపాత్రకు విశిష్టతనాపాదించినారు.

60. తదనంతరము ధర్మజుని వాక్చాతుర్యము విరటుడు మెచ్చుకొనుచు, మీకుచితమగురీతి ప్రవర్తింపుడని పలికిన విని ధర్మజుడు

కం. ఏను హవిష్యమకుడుతును, భూనాయక నాకుశయ్య భూమియ యిమ్మో
బూని వ్రతంబులు చలిపెడు, వానికి నిన్నియుననునిట్లు వలయునెచెపుమా-విరాట-ప్ర-205

అని పలికెను. ఇది మూలమున లేనట్టిది. ధర్మజుని జితేంద్రియత్వమును దృఢపరచుటకు తిక్కనగారు పెట్టిన మెరుగుగ కాన్పించును. ధర్మజుడు తొలుత భోగములననుభవించినవాడే కాని నేడు వాటికి వెలియైనున్నవాడు. ఇవి పరభోగములు. కావున వానికై ఆశించుట ధర్మజునివంటి సత్పురుషునకు తగదు. భోగలాలసత విషయ వాంఛలకు దారితీయును. తాను పరివ్రాజాశ్రమముననున్నవాడై అట్టివాటికై అర్రులుచాచుట తనయునికికే ముప్పు తెచ్చును. కావున ధర్మజుడు స్వయంపాకమును, అధఃశయ్యను అనుభవించుటయె కర్తవ్యము. అది ధర్మజుని కార్యదీక్షాతత్పరతను చాటుచున్నది (హవిష్యము : అనగా వైశ్వదేవాది హోమములుచేసి, మిగిలిన అన్నమును అతిథి, అభ్యాగతులతోకూడి భుజించుట)

<u>ద్వితీయాశ్వాసము :</u>

61. ద్వితీయాశ్వాసమున కీచకునిచే అవమానింపబడినదై, కీచకుడు వెంటతరుమగ, విరటుకొల్వున ప్రవేశించిన ద్రౌపది సభాసదులందరిని కలియజూచుచు, విరటునికి తనస్థితిని వివరించుచు రక్షింపుమని ప్రార్థించెను. అంత ధర్మజుని హృదయము కలతచెందగ, నుదుటగప్పిన చెమటబిందువులతో, రోషముగప్పగ తన్నుతాను నిగ్రహించుకొని, ధైర్యము తెచ్చుకొని, నిర్వకారుడై ఎప్పటివలెనె ద్రౌపదితోనిట్లు పలికెను.

సీ. జననాయకుండు నీసభవారునీదగు, తెరగెల్లనెరిగిరి తెరవయింక
మానక ఈపలుమాటలాడగనేల, చనుము నీవుసుదేష్ణసదనమునకు
నీపరాభవమునఁ గోపింపనేరరే, గంధర్వులకుఁదఱికాదుగాక
సమయమెయ్యది యేనిదమకును నీకుఁగ, ల్గిన యట్టులైననుగినియరిచటఁ

తే. గాననాథుల దూరంగగాదువినుము, సతికిదానెంత వడియునుసభలలోన
దడవుగానిల్చి యిట్టులుదగ్గవృత్తి, శంకచెడి ధిక్కరింపగఁ జనునెచెపుమ-విరాట-ద్వితీ-148

"సభలో నిలచి యిట్టులు మాటలాడుట తగదు. నీవు తక్షణము సుదేష్ణ మందిరమున కేగుము. నీపతులు గంధర్వులు. సమయముకాదు గావున మిన్నకుండిరి, కావున వారిని నిందింపకుము" అని పలుకుట ద్రౌపదిని వాచ్యముగ హెచ్చరించుటయె. జరిగినది చూచియు ధర్మజుడిట్లు పలుకుట తమఉనికికి ముప్పువాటిల్లునను శంకచేమాత్రమే. ఇట మూలమున ధర్మజుడు ద్రౌపదికి, స్త్రీకితగు గుణములనుగూర్చియు, ఓర్పునకు మించినదిలేదనియు,ఉపన్యసించినాడు. తిక్కనగారు వానిని పరిహరించెను. మూల భావమునుగైకొని తిక్కనగారు తనదైన శైలిలో రచించినారు. ధర్మజునిచే పైమాటలు చెప్పబడినవైనను, ద్రౌపది అటనుండి కదలక నిలుచుట జూచి మరల ధర్మజుడు.

కం. పలుపోకలబోవుచు వి, చ్చలవిడి నాట్యంబుచూపుచాడ్పున నిచటం
గులసతుల గరువచందము, తొలగగనిట్లునికితగునె తోయజవదనా-విరాట-ద్వితీయ-150

ఇటగల వాక్యములు మూలమునలేకున్నను భావము మాత్రము కన్పించును. కాని "ఇచటం గులస్తుల గరువచందము తొలగగ" అని ధర్మజుచే నొక్కిపలికించినాడు తిక్కన. అట్లు పలుకుటలో కులస్తివైన నీవు ఇట్లు ప్రవర్తించుట తగునా!"అనుప్రశ్నతోపాటు కులస్తుల మర్యాదను చిన్నబుచ్చుచున్నావనుహెచ్చరికకూడ ధ్వనించుచున్నది.

అంత ద్రౌపది ధర్మజునకు సాభిప్రాయముగ సమాధానమొసగినది. అది మూలముననిట్లున్నది.

1) శ్లో. అతీవ తేషాంఘృణినాం మర్థేహధర్మచారిణీ, తస్యతస్యైవతేవధ్యాయేషాం జ్యేష్ఠో క్షదేవితా-కీచక-16-45
(నేను మిక్కిలి దయగలవారి ధర్మచారిణిని, వారిలో పెద్దవాడు ఎప్పుడు జూదమాడుచుండును. కావున ఎల్లవారును వారిని హింసించువారె)కానిఅనువాదమున తిక్కన ద్రౌపదిచే వ్యంగ్యముగ ధర్మజ నిందాప్రసక్తికములను వినిపింప జేసినాడు.

ఆ. నాదు వల్లభుండునటుడింతనిక్కంబు, పెద్దవారియట్ల పిన్నవారు
గానఁబతులవిధమకాక యేశైలూషి, గాననంగరాదు కంకభట్ట-విరాట-ద్వితీయ-152

వ. అట్లగుటంజేసి నాకునాట్యంబునుబరిచితంబ మత్పతి శైలూషుండకాడు కితవుండునుం గావున జూదరి యాలికి గరువతనంబెక్కడి (య)ది ... 153

ఇట మూలమున "పెద్దవాడు ఎల్లప్పుడూ జూదమాడుచుండును" అనిగలదు. కాని తిక్కన దానిని జూదరియాలి అని మార్చినాడు. అట్లుచేయుటలో భావరమణీయతను సంతరింపజేసినాడు. మరియు నాట్యప్రసక్తివచ్చినది గావున, అది నాకు సుపరిచితమె. నా మగడు గణికుడని సమాధానమొసగుచు, అటువంటి వారికి పత్నియైన నాకు గౌరవము ఎటనుండి లభించును అని ధర్మజుని ప్రశ్నలకు తగు సమాధానములిచ్చుచు మరల ప్రశ్నగ ధర్మజుని ముందునిలిచినది (1. విరాట-కీచక వధపర్వము)

తదనంతరము ద్రౌపది భీమునితోకలసి తను పడినపాట్లకు వగచుచు నుడివి, ధర్మజుడింతయుచూచి తనను నిందాప్రసక్తికముగ మాటలాడుటచే యెంతయో కలతపడితినని మరియు భీమునితో ధర్మజుని దయనీయ స్థితిని, అతని గుణవిశేషాదులను చెప్పెను.

కం. ధర్మ తనూభవుసంతత, ధర్మనిరతి మనము బ్రదుకదలచుట యరుదే
నిర్మలుడగునాతనిస, త్కర్మంబునగాదె బ్రదుకుధాత్రికినెల్లన్-విరాట-ద్వితీయ-188

సీ. చనునె వేరొకనికజాతశత్రుండను, పేర దిగ్విజయంబు పెంపుతాల్ప
రాజసూయ మహాధ్వరముగోరిచేయంగ, దీరునెపెరధరిత్రీపతులకు
ధర్మైకనిరతుడాతండొక్కరుడ చూవె, యనజననొరులకు నలవియగునె
నిత్యవ్రతంబుగా సత్యంబుపాటింప, వచ్చునె యొరులకెవ్వరికినైన

తే. నయ్యుధిష్ఠిరు గాంభీర్యమతని ధైర్య, మరయనొండెడగలుగునె యతడుకీర్తి
ధరుడు కరుణోత్తరుడు మహీసురసమృద్ధి, కరుడు నిజవంశకరుడుపకారపరుడు-189

కం. కలిమికినొప్పగు నీగియు, బలిమికిదొడవైన యట్టిబలగమునైలో
కుల చిత్తములకు వ్రేగగు, కొలదిమనన్ గొంతి పెద్దకొడుకునకమరున్-190

సీ. ఎవ్వనివాకిట నిభమదపంకంబు, రాజభూషణరజోరాజినడగు
నెవ్వని చారిత్రమెల్లలోకములకు, నొజ్జయైవినయంబు నొరపుగరపు
నెవ్వని కడకంటనివ్వటిల్లెడుచూడ్కి, మానితసంపదలీనుచుండు
నెవ్వని గుణలతలేడువారాసుల, కడపటికొండపై గలయబ్రాకు

తే. నతడు భూరిప్రతాప మహాప్రదీప, దూరవిఘటిత గర్వాంధకార వైరి
వీరకోటీరమణిఘృణివేష్టితాంఘ్రి, తలుడు కేవలమర్త్యుడె ధర్మసుతుడు-విరాట-ద్వి-191, ఇందుప్రసక్తమైన అజాతశత్రుత్వము,ధర్మనిరతి,నిత్యసత్యవ్రతము,మహీసురసమృద్ధికరత్వము,ఈగి(దానపరాయణత)యిత్యాది దర్మజగుణవిశేషములు గమనార్హము. ఆకీర్తి అప్పటికే ఏడువారాసుల కడపటి కొండకెగ బ్రాకినదట!

<u>తృతీయాశ్వాసము :</u>

62. తృతీయాశ్వాసమున చారులవలన పాండవులజాడ తెలియరాక దుర్యోధనుడు, కర్ణ, ద్రోణ, భీష్మ, కృపాచార్యులతో సమాలోచనగావించు సందర్భమున భీష్ముడు ధర్మజుని గుణములను విశ్లేషించు సందర్భము మూలమున(33)శ్లోకములలో కలదు. కాని అనువాదమున తిక్కన వాటన్నింటిని సంక్షిప్తీకరించి, ఒక్క సీసపద్యములో వర్ణించుట భావలోపము కాన్పింపక, ఔచిత్యముగ ప్రకాశించుచున్నది.

సీ. బ్రాహ్మణభక్తియుఁ బరహితశక్తియు, నిర్మలమతియును నీతిరతియు
సత్యభాషణమును సాధుపోషణమును, జీరవితరణమునుసేవ్యగుణము
సన్మార్గరక్షయుమున్మత్తశిక్షయు, నంచితోదయముఁ గృపాతిశయము
బంధుసంప్రీతియు భవ్యవిభూతియు, శాస్త్రోపగమమునష్ఠలిత దమము

తే. సజ్జనస్తవనీయ సౌజన్యములును, ధర్మసంచిత బహుధనధాన్యములను
గలుగునక్షీణపుణ్యదోహలుడు ధర్మసూనుడున్నదేశంబున మానవులకు.-విరా-తృ-103

కావుననిప్పుడట్టి దేశమేదికలదో,అందు పాండవులుండెదరని భీష్ముడు తన మనోభావములను

దుర్యోధనాదులకుతెల్పెను. వెంటనే దుర్యోధనుడు అట్టిదేశము మత్స్యదేశముగానెరిగి గోగ్రహణనెపమున పాండవుల అజ్ఞాతవాసభంగము కావింపనెంచి, త్రిగర్తులతోకలసి సుశర్మ దక్షిణగోగ్రహణమునకు, కర్ణునితోకలసి సుయోధనుడు ఉత్తరగోగ్రహణమునకు సమాయత్తమైరి.

63. దక్షిణ గోగ్రహణఘట్టమును తిక్కనగారు యథామూలముగ అనువదించినారు. గోవులను తరలించుకొని పోవుచున్న సుశర్మాదుల విషయమును విరటునకు చారులుతెల్పగ, అతని తమ్ములగు శతానీకుడు, మదిరాక్షుడు, సూర్యదత్తునితోకలసి ససైన్యముగ యుద్ధమునకు సన్నద్ధులైరి. అట్టియెడ ధర్మజుడు విరటునితో నాకు ఋషిదత్తమైన నాలుగు శక్తిమంతమైన అస్త్రములు గలవని, తన యుద్ధోత్సకతను తెలియపరచినాడు. వెనువెంటనె వలలుడు, తంత్రిపాలుడు, ధామగ్రంధులకు రథములు సిద్ధముచేసిరి. మూలముననిట ధర్మజుడు విరటుని ఆజ్ఞతో శ్యేన వ్యూహమునమర్చి, అందు తను ముక్కుగా, భీముడు తోకగనుండి, వేయిమంది త్రిగర్తసైన్యమును చంపెనని కలదు. కాని అనువాదమున తిక్కనగారు వ్యూహవిషయమును ప్రస్తావించకపోవుట గమనార్హము. యుద్ధమున సుశర్మ విరటుని బంధించి తనరథముపై తీసుకొని పోవుచుండగ, ధర్మజుడు భీముని పురికొల్పెను. అంతనాతడు వృక్షముతో యుద్ధముచేయ నిశ్చయించునెడ ధర్మజుడు తమఉనికికి హాని ఏర్పడునని హెచ్చరించెను. ధర్మజుడు సుశర్మను నిలువరించి యుద్ధమునకు తలపడెను. అంత సుశర్మ, ధర్మజుని నిశితబాణములనొప్పించుచు, అశ్వములనుకూల్చెను. అంత ధర్మజుడుగ్రుడై సారధితోపాటుగ అశ్వములను కూల్చెను. అంత భీముడు సుశర్మను విరథుని గావించి, బంధించి ధర్మజునివద్దకు తోడ్కొనిరాగ విరటునితో చెప్పి సుశర్మను విడిచిపుచ్చెను.

ఈ సందర్భమున ధర్మజునివైన సహజ క్షత్రియోచితగుణములు భాసిల్లుట కన్పించును. లోకజ్ఞతతో ధర్మజుడు విరటునకు సహాయమొనర్చుట క్షత్రియుడగు తనకర్తవ్యముగభావించి, విరటుడు తనను కోరకమునుపె, తనకు తానుగ వ్యక్తపరచుట కన్పించును. తద్వారా తనకు ఆశ్రయమిచ్చినవానికి కృతజ్ఞతను వ్యక్తపర్చుటయెకాక భవిష్యమున వారిసహాయముకూడ పొందవచ్చునను ఆలోచనాపరుడు ధర్మజుడు. యుద్ధమున పరాజితుడైన శత్రువును క్షమాపూర్వకముగ విడిచిపుచ్చుట ఉత్తమక్షాత్రధర్మము. కనుకనే దర్మజుడు సుశర్మను విడిచిపుచ్చుమని విరటుని కోరుట, అతని అజాతశత్రుత్వమును నిరూపించుచున్నది.

పంచమాశ్వాసము :

64. పంచమాశ్వాసమున ఉత్తరగోగ్రహణమునకు ఉత్తరుడు వెడలుటగని, విరటుడు వ్యాకులచిత్తుడైయున్న తరుణమున ధర్మజుడు విరటుని ఊరడించుచు, బృహన్నలను పొగుడుచున్న సందర్భమున విరటునికి కోపము పెల్లుబికెను, అంత వార్తాహరులవలన ఉత్తరుని విజయమును విని ఆనందముపొంది, ద్యూతమునకు కంకభట్టును పిలువగ, అతడు జూదమువలన కలిగిన అరిష్టములను నర్మగర్భితముగ పలికెను. ఈసందర్భము మూలమున **5,6** శ్లోకములలో వివరింపబడినది. కాని అనువాదమున ధర్మరాజు తననేపరోక్షముగ ఉదాహరించినట్లుగలదు.

ద్యూతమాడు సందర్భమున ఉత్తరుని ధైర్యసాహసములను విరటుడు కొనియాడుచుండగ, కంకభట్టు బృహన్నలవలెనె విజయము లభించినదని పలుకుటచే రోషావేశమనస్కుడై విరటుడు చేతనున్న పాచిక కంకభట్టు నుదుటిపై విసిరెను. ఇట మూలమున ముక్కునై విసిరినట్టు, ముక్కునుండి రక్తముకారినట్లు గలదు. కాని అనువాదమున పాలురేఖనన్నయు ననిగలదు. వెంటనే దాపునగల సైరంధ్రివైపుజూచి ధర్మజుడూరకుండెను. అంత ద్రౌపది ఆతృతతో తన ఉత్తరీయముతో మెత్తగనదిమిపట్టి కనక జలపాత్రతో కడిగి ఉపచరించెను.

అంత విరటుడు నైరంధ్రిని అట్లు రక్తమును చీరచెంగుతో తుడుచుటకు కారణమేమి? యని అడుగగ, ఆమె అతనితో "ఈ మహాపురుషుని రక్తపుబిందువులు భూమిపై ఎన్నిపడునో అన్నిసంవత్సరములు అనావృష్టితో దేశము నశించు"నని పల్కెను.

ఇట మూలమున ధర్మజుడే స్వయముగ పల్కినటుల గలదు. కాని అనువాదమున తిక్కన ద్రౌపదిచే పలికించి ధర్మజపాత్రకు విశిష్టతనాపాదించినాడు. ధర్మజుడు తనే స్వయముగ చెప్పుకొనుట అహంభావిగా కాన్పించు చున్నది. కాని ధర్మరాజువంటి నిగర్వి, నిరాడంబరుడు అట్లుపల్కుట ఆ పాత్రయెడల కొంచెము అనాగరికత్వము జోడించుటయే యగును. అందుచే తిక్కన ద్రౌపదిచే పల్కించి, ధర్మజపాత్రను ఔచిత్యభంగము కలుగకుండ చేసినాడనక తప్పదు. అనంతరమున విరటునకు ఉత్తరుడు యుద్ధవిశేషములను తెలిపెను. అంత అర్జునుడు ధర్మజాదులను కీర్తించుచు, పాండవులందరిని విరటునకు ఎరింగించెను. అంత అజ్ఞాతవాసము పూర్తయిన వారందిరిని చూచుటకు బలదేవాదులతో కూడిన శ్రీకృష్ణుడు పాండవులకడకేతెంచెను. తదుపరి ఉత్తరాభిమన్యుల వివాహముతో విరటునితో వియ్యమునుపొంది ఆనందముగచనిరి.

==========

ఉద్యోగపర్వ ప్రథమాశ్వాసమున ఉపప్లావ్యమునకు తమ్ముచూడవచ్చిన శల్యునితో ధర్మజుడు సంభాషించిన తీరు, కోరినవరము, యిచ్చిన ప్రార్థనాపూర్వక ఉపదేశము సాధారణపాఠకునకు ఆశ్చర్యము కల్గించును. లోతుగా పరిశీలించినగాని బ్రాహ్మణధర్మమునకు, క్షాత్రధర్మమునకుగల భేదము బోధపడదు. తత్వజ్ఞతకు, రాజనీతిజ్ఞతకు మధ్యగల సీమారేఖను గుర్తించుట సామాన్యునకు సులభసాధ్యమైన విషయముగాదు.

65. ధర్మజుని అభిమానించుటకై వచ్చుచున్న శల్యునకు మధ్యేమార్గముననే కల్లుపోయించి, పారవశ్యముననున్న సమయమున అతడు తమపక్షమున చేరుటకు మాటగైకొనిన దుర్యోధనుని విధానమునకుతగిన ప్రతిక్రియ చేయ దలచినాడు ధర్మరాజు. కుశ్మకాటుకు చెప్పుదెబ్బ వంటి పద్ధతులు ధార్మికరంగమున సరియయినవి కాకపోయినను, దేశరక్షణకై, ధర్మరక్షణకై, దుష్టులను నిర్జించునప్పుడు వర్తింపజేయుట రాజనీతిజ్ఞతయె అగును. ఇట్టివి ప్రపంచ చరిత్రలందెల్లెడల మనము చూడగలము. కనుకనే శల్యుడు తాను దుర్యోధనుపక్షమున చేరవలసివచ్చు విధానమును వివరించునప్పుడు

తే. మేలుచేసితి రొక్కరిమెచ్చివారి, కోర్కితీర్చుట పెద్దల గుణమకాదె
యదిమదీయ చిత్తమునకు హర్షకరమ, తివిరియొక్కటవేడెద నవధరింపు–ఉ–ప్ర–**109**

అని ధర్మజుడు పల్కినాడు. ఈ మాటలలో వాని పరిపక్వతనందిన రాజనీతిజ్ఞత ప్రస్ఫుటమగుచున్నది.

ఒక్కరిమెచ్చి వారికోర్కితీర్చుట పెద్దలగుణముకాదెఅనుమాట ధ్వనియున్నది. నిజమునకు శల్యుడు దుర్యోధనుని మెచ్చలేదు, కాని మేలుచేసితిరి అనునది మాత్రము నిజము. శల్యుడు వారికి ఎనలేని మేలుచేసినాడు. ఒక ప్రక్క తన మేనల్లుండ్రు రాజ్యమును కోల్పోయి యుద్ధమునకు సిద్ధపడుచుండగ, వారికి తాను మేనమామైయుండియు, శత్రుపక్షములో చేరినప్పుడు మేలుచేసితిరని అనుభవజ్ఞుడైన మేనల్లుడు పలుకుటలోని వ్యంగ్యమును సాధారణ పాఠకులే గ్రహింపగలరు. అట్టితరి శల్యుడు గ్రహింపగలిగెనని వేరుగ చెప్పపనిలేదు. ఇటుల ముద్దుగ, మృదువుగ చీవాట్లుపెట్టి మేనమామ అయినందుకుతివిరియొక్కటి వేడెద నవధరింపుమని తనకోర్కెగ దుర్యోధనుని విధానమునకు సరియయిన విధానమును సూచించినాడు. కౌరవపక్షమున కర్ణుడొక్కడే అర్జునునకు ప్రతిద్వంద్వి, భీష్మ, ద్రోణులు యెదిరిపక్షముననున్నను, వారు అర్జునుని పుత్రవాత్సల్యమునజూతురు. ఇక మిగిలిన ధనుర్ధారులెవ్వరును అర్జునునకు సాటికారు. అందుచే కర్ణార్జునుల యుద్ధవేళ కర్ణుని గురితప్పుటకు వలసినంతగ వానికి మనఃక్షోభమునుగల్పింగల సంభాషణమును గావింపవలయునని ప్రార్థించినాడు. ఇచటతెలిసియో, తెలియకనో శల్యుడొక తప్పునొనరించుట ధర్మజునకు వరముగ పరిణమించినది. తన తప్పునకిది ప్రాయశ్చిత్తముగ శల్యుడిద్దానినంగీకరించినాడు. కారణములు శల్యుడే వివరించినాడు. అతనికెల్ల విధముల పాండవులపట్లనే అభిమానమున్నదని చెప్పపనిలేదు. ముఖ్యముగ తనకు కర్ణునిపై కోపమున్నటులకూడ చెప్పుకొనినాడు. అగునిది పోలును నాశుందగవట్టిద అనుమాటలే పైవ్యాఖ్యానమునందలి వాస్తవమును నిరూపించుచున్నది. నీవుచెప్పిన విధానమే సరియయినది, అటులచేయుటయే నా విషయమున ధర్మమగును అని పై మాటలభావము. తన్ను మోసగించిన దుర్యోధనునకు, మోసముచేతనే బుద్ధిచెప్పుట రాజనీతని పైమాటలలో శల్యుడు వివరించినట్లయినది. మొత్తముపై రాజనీతిజ్ఞుడైన ధర్మజుడు తగిన అవకాశములను సమర్థముగ వినియోగించుకొనగలడని చెప్పుటకు ఈ ఘట్టము చాలియున్నది.

ఉద్యోగపర్వ ప్రథమాశ్వాసమున 272 వ పద్యమునుండి 380 పద్యము వరకుగల (109) పద్యములలో సంజయుడుపప్లవ్యమునన్నున్న పాండవుల కడకువచ్చుట అను ఉపశీర్షిక క్రింద సంజయ, ధర్మజుల సంభాషణా భాగమున్నది. మధ్యలో శ్రీకృష్ణపాత్రకూడయున్నను, ధర్మజుని మాటలతో ఎక్కువ కథాభాగము నడచినది. ఈ భాగమును క్రింది విధముగా విభజింపవచ్చును.

1) కౌరవ పక్షమునందలి పెద్దలయొక్క పిన్నలయొక్క యోగక్షేమములనడుగుట. (6) పద్యములు

2) సంజయుడు ఇరుపక్షముల బలాబలములుచెప్పి జననాశమునకొడిగట్టుట ధర్మజునివంటి సత్పురుషునకుతగదని చెప్పినప్పుడు ధర్మజుడిచ్చిన సమాధానము (32) పద్యములు

3)శ్రీకృష్ణ సమాధానమువిన్న పిదప సంజయుడు పోయివచ్చెదననగ ధర్మజుడు పల్కినపలుకులు. (16) పద్యములు.

పైన పేర్కొనిన ఏబదినాలుగు పద్యములలో ధర్మజుడు పెద్దలపట్ల భక్తి, గౌరవములను ప్రదర్శించినాడు. కౌరవులు తమకుచేసిన దోషములను పౌరుషముగల క్షత్రియునిగ వివరించినాడు. తనను శాంతుడవుకమ్మని సంజయుడు ప్రబోధించినపుడు సుక్షత్రియుడు శాంతిస్థాపనమును ఎటులగ్రహించునో అటులనే సమాధానమిచ్చినాడు ధర్మజుడు. స్థూలదృష్టికి పరస్పర భిన్నములుగాతోచు శాంతి, యుద్ధము అను రెండును సుక్షత్రియుని చేతిలో పడుగు, పేకలవలే కలసి మెలసి యుండునన్న సత్యమును దర్మజపాత్ర నిరూపించును. దయాగుణమనుపేర ధర్మనాశకుని రక్షింపబూనుట క్షత్రియుని దృష్టిలో శాంతిస్థాపన కాజాలదు. శిష్టులను, దుష్టులనుకూడ ఒకేవిధముగా చూడగలిగెడి సత్వగుణము బ్రాహ్మణునికే చెల్లునుగాని సర్వప్రజా రక్షణభారమునువహించిన క్షత్రియునకు చెల్లదు. కనుకనే ధర్మజుని పాత్రయందు స్థూలదృష్టికి అసాధారణ వైవిధ్యము కాన్పించును. అటులనే రాజనీతియందును, లౌక్యమునందుకూడ సమర్థుడైన పాత్రగా చిత్రింపబడిన ధర్మజుని స్వభావమిట్టిదని గ్రహించుట కష్టము. ముఖ్యముగా నిట్టి వైవిధ్యమునకు విశేషప్రాముఖ్యమున్నట్టిది ప్రకృత సందర్భము.ఈ ఘట్టమునందలి ధర్మజపాత్రను మూలముతో పోల్చి తిక్కయజ్వ ప్రదర్శించిన ధర్మజపాత్రమునందలి ప్రత్యేకతలను సూక్షముగ పరిశీలించుటే ప్రకృతలక్ష్యము.

66. ఈ ఘట్టము ప్రారంభమున సంజయుడు అసాధారణ లౌక్యమును ప్రదర్శించుచు మాట్లాడినాడు.

తే. భాగ్యమున నిన్నుగనుగొనబడసి నాదు, చూడ్కిచరితార్థమయ్యె నస్తోకపుణ్య
ధనుడు మీతండ్రిధృతరాష్ట్ర ధరణినాథు, డిందుమీయున్కివిని ప్రియమెసకమెసగ-ఉద్యోగ-ప్రథ-273

ధృతరాష్ట్రుడు ధర్మజునికి సందేశమంపినాడు. అందుకుధర్మరాజు సమాధానమియ్యవలసియున్నది. ప్రశ్నము నందలి విశేషములనుబట్టి సమాధాన స్వరూపముండుట సహజము. అందుచే దర్మజుడెవనికి సమాధానమియ్య వలెనో సంజయుడు సూచించినాడు. ధృతరాష్ట్రుడు ధర్మజునికి తండ్రి. ఇతర విషయములన్నియు యెట్టి తీవ్రస్థితి నందినను ధృతరాష్ట్రుడు పితృస్థానీయుడు కాకపోడు. ఇది ధర్మజుడు గుర్తింపవలసిన మొదటి విషయము. ఇక రెండవది ధృతరాష్ట్ర ధరణినాథుండను నట్టిది. ధృతరాష్ట్రుని సందేశము పిత్రాజ్ఞయెకాదు, రాజాజ్ఞయును. పితాజ్ఞయే యైనను, రాజాజ్ఞయేయైనను, తండ్రి లేక రాజు దుష్టుడైనప్పుడు వారి మాటలకెట్టుల విలువనిత్తునని అనవచ్చును. సంజయుడట్టి అవకాశమును ధర్మజునికియ్యలేదు. ధృతరాష్ట్రుడు అస్తోక పుణ్యధనుడని మొదటనే సంజయుడు చెప్పియున్నాడు. ఇట్టి లౌక్యముతోడి చట్రమును ఛేదించుకొని బయటపడుట సామాన్యునకు సమకూరునట్టిదికాదు. కాని లౌక్యమున సంజయునికన్న రెండాకులెక్కువ చదివినట్టివాడు ధర్మజుడు. కనుకనే వాని సమాధానమిటుల నడచినది.

కం. ఆరాజు మాదెసంగల, కారుణ్యముకతముననసుఖంబుననిట్లు

న్నారము నినుఁబుత్తెంచిన, గారవమున నాదుమది వికాసము బొందెన్-ఉద్యోగ-ప్రథమ-276

సంజయుడు ధృతరాష్ట్రునకువాడిన విశేషములలో రాజు అనుమాటనుమాత్రమే ధర్మజుడు గమనించుట గమనార్హము, రాజ్యపాలనమున అస్తోకపుణ్యత్వము గుప్తదనమువంటిది కాజాలదు. అనుక్షణము బహిర్గతముకాక తప్పనిరంగము రాజకీయరంగము. కనుకనే ఆ విషయమును ధర్మజుడు విడిచిపుచ్చినాడు. తమపట్లను, దుర్యోధనాదులపట్లను తుల్యభావనను ప్రకటింపనివాడగుటచే తండ్రి యనుమాటనుగూడ అద్యముగ ప్రసక్తింపలేదు. ఇక తప్పని సరియైనట్టిది అధికారసూచికమైనది రాజుశబ్దము. తాము ధృతరాష్ట్రునిగూర్చియెటుల భావించినను అతని చక్రవర్తిత్వమెవ్వరును కాదనలేనట్టిది. తమరాజ్యభాగము తమకు లభించునంతదనుక వారు ధృతరాష్ట్రుని పాలనలో నున్న పౌరులుకాకతప్పదు. అందుకని ఆ రాజు అనిప్రారంభించినాడు. ఇచట ఆ అను సర్వనామముతోడి ఎత్తుగడలో అవహేళనమున్నది. నీవు పైనవివరించిన సుగుణసంపత్తి, బాంధవ్యము, బంధుప్రీతిగలవాడని యిచట ఆ అనుమాటకు అర్థము. అనగా పైచెప్పిన లక్షణములేవియూలేవని వ్యంగ్యము. ప్రస్తుతము రాజుతోడనే దౌత్యము నిర్వర్తింపవలసియున్నది. మాదెసంగల కారుణ్యము కతమునను సుఖముగనిట్లున్నారము అనుమాటలు పరిశీలింప దగినట్టివి. నిజమునకు పాండవులు సుఖమునలేరు. సుఖమనగ ఆక్షణమునకు సంబంధించినట్టిదిగాదు. కొంచెమైనను గతమునకూడ సుఖమునంది యుండవలసియున్నది. కాని అజ్ఞాతవాసవత్సరమున పాండవులుపొందిన కష్టపరంపర సామాన్యమైనట్టిదిగాదు. అందుచే నిట్లు సుఖమున్నారమను మాటలో, ఇట్టి కష్టములలోనున్నారను భావము ధ్వనిగానున్నది. ఇందుకు కారణము ఆ రాజు మాదెసంగల కారుణ్యము కతమున అనుననది సమాధానము. అనగా ధృతరాష్ట్రుని కరుణ యిన్నిబాధలను తెచ్చిపెట్టినదని ధర్మజుడు వ్యంగ్యముగ చెప్పినాడు. ధృతరాష్ట్రుని కారుణ్యమనగ ధృతరాష్ట్రుని దుర్మార్గమని ఎత్తిపొడుపుగ చెప్పుట, సంజయుడుచెప్పిన అస్తోక భుజ్ఞధనుడు నీతండ్రి యను మాటలకు పై దర్మజుని మాటలు పదునైన సమాధాన ప్రాయములైయున్నవి. సంజయుని లౌక్యమునుమించిన లౌక్యముతో ధర్మజుడు తన ప్రసంగమునారంభించినాడు.

పై సంజయ, ధర్మజ ప్రకటిత భావపరంపర సూచనగ మూలమున లేకపోలేదు. కాని దానికి జీవమునుపోసి మనయెదుట ఇరువురు లౌక్యులను ప్రదర్శించినాడు తిక్కన.

67. సీ. ద్రోణుండుగృపుడును ద్రోణసుతుండును, సుఖమున్నవారెసుశ్లోకుడైన

భీష్ముండుకుశలియే పెద్దతనంబిచ్చి, యాతనిఁ గౌరవులనుసరించి

మెలగుదురే బ్రాహ్మణులకుమన్ననగల్గి, యుండునే యేమర్థినొసగునట్టి

వృత్తులుచెల్లునెయొత్తొరువొండుల వలనఁబుట్టదుగదా కలకులందుఁ

తే.గీ. బుట్టినప్పుడు గాండీవిభుజబలంబు, తలతురే భీమసేనుగదావిహార

ముగ్గడింతురె కవలుమహోగ్రరిపుల, భూములంతంతకొత్తుట పొగడబడునె-ఉ-ప్ర-278

పైన పేర్కొనిన సీసపద్యమున తిక్కన మూలకుంచనమునకు నిదర్శనము. ఈ ఘట్టమున వ్యాసుని మూలమున 5వ శ్లోకమునుండి 25వ శ్లోకము వరకు పేరుపేరున ధర్మజుడు క్షేమంబడిగినట్లు విపులముగ వర్ణించబడినది.

కాని తిక్కన రచనలోనిదియెల్ల సంక్తీప్తీకరించబడి, ధర్మజ మితభాషత్వమును, అపారలౌక్యమును, అసాధారణ చతురత్వమును బయల్పరుపుచున్నది. ధర్మజుడు సంజయునకు పెద్దలయెడ తనకుగల భక్తిపరంపరను తెల్పుటతోపాటు దుర్యోధనాదుల కుటిలత్వమును, తన సోదరుల బలపరాక్రమాదులను వ్యంగ్యముగ వ్యక్త పరచినాడు. ఇందు మొదట ద్రోణుడు, కృపుడు మొదలగువారితో ప్రారంభించి, సుశ్లోకుడైన భీష్ముడు కుశలమా! అనిఅడుగుచు పెద్దతనంబిచ్చి అతనిని కైరవ్యులనుసరించి మెలగుదురే అనిఅనుటలో ధర్మజుని ఔచిత్యము యిసుమంత బయల్పడక తప్పదు. అనగా మేమెల్లవేళలా పితామహుని గౌరవించి, అతనియెడల వినయ, వివేకములతో వర్తించుదుము. కాని కౌరవులట్లుగాదు. సుయోధనుడు స్వబుద్ధితో నడచువాడు. పితృవాక్యతృణీకృత మానప్రవర్తి, తండ్రికేలేని గౌరవమును తాతకెట్లాపాదించగలడు. కావున గౌరవించడను భావము వ్యంగ్యముగ సంజయునికి హెచ్చరించినాడు. బ్రూహ్మణులకు మన్ననగల్గియుండునే, యేమర్థినొసంగినట్టి వృత్తులునెల్లనేఅని అడుగుటలో తనదైన ధర్మపరాయణత్వమును చాటుకొనుటగాక కౌరవుల అన్యాయాక్రమాలను విశదీకరించుటయే లక్ష్యముగా నుడివినాడు. తానొసంగిన మాన్యములు బ్రాహ్మణులే అనుభవించుచున్నారా?లేదా? అను శంకను వెలిబుచ్చినాడు. అనగా ఒకవేళ కౌరవులు వారికిచ్చినవి ఊడగొట్టి అన్యాయము చేయుటతగదు. కారణము బ్రహ్మవేత్తలకొసంగినది ఇహలోకమున కీర్తితోపాటు, పారలౌకికమునకు కరదీపికవంటిది. కావున ఆ బుద్ధిహీనులు బ్రాహ్మణవృత్తులయందలి లోభము అదుపులో పెట్టలేకున్నచో కౌరవులకు సంపూర్ణ వినాశముతప్పదని నర్మగర్భితముగ హెచ్చరించుటలో అంతర్వాణిగ ఆత్మస్తుతి, పరనింద మనకుగన్పట్టుచున్నది. మరియు కౌరవులకు ఇతరులతో సంబంధ బాంధవ్యములు, స్నేహవృత్తులుయెట్లు కొనసాగుచున్నవని అడుగుటలో ధర్మజుని రాజనీతిజ్ఞత తొణికిసలాడుచున్నది. అనగ వారివారి ప్రవర్తనలను తెలుసుకొని భేదాభిప్రాయములను సృష్టించుటకు అవకాశము కొరకై వెదుకులాడుట స్పష్టముగ గోచరించును. పనిలోపనిగ మరలనొకమారు తనతమ్ముల ప్రతాప చరిత్రను తిరుగదోడుట కౌరవులజ్ఞప్తినిడుకొనినారా? లేదా? అని అడుగుటలో ధర్మజుని అంతరార్థము తేటతెల్లమగుచున్నది. సంధికి ఒప్పుకొనిన శ్రేయోదాయకము. లేనియెడల సమరమునకు సాగుటకు తమ తమ్ములుకూడ వెనుదీయరు. కారణము పాండవులదివరకే కౌరవవీరులందరితో యుద్ధములాచరించి వారిలోటుపాట్లను తెలుసుకొనినవారు, కావున వీరాధివీరులైన పాండవులకు విజయము సునాయాసముగవచ్చును. ఈ భావములన్నియు సంజయునికి వినిపించుటలో ధర్మజుని వాఙ్నైపుణ్యము, కౌరవులపైగల ఏహ్యభావము, పెద్దలపై తనకుగల పూజ్యభావము, ప్రజలపై ఆప్యాయానురాగపరంపర స్పష్టముగ గోచరించు చున్నది.

పై వివరణముతోపాటు యింకొండు విషయమూహించుటకవకాశమున్నది. ధర్మజుని భాషణమున భీష్ముడు, బ్రాహ్మణులు, సోదరులు ప్రసక్తింపబడుట గమనార్హము. ఈ మువ్వురి ప్రసక్తికినిచట ప్రత్యేక ప్రయోజనమున్నది. రాజ్యము భీష్మునిది. ఆధిపత్యము విడిచినను, రాజ్య రక్షణాభారము స్వీకరింతునని తండ్రికి మాటయిచ్చినట్టివాడు. నిజమునకు చిరకాలము రక్షణము, విస్తరణము అనెడి రెండు బాధ్యతలను పాండురాజు వహించిన విషయము భీష్ముని హృదయమునుండి చెరిగిపోవదనెడి నమ్మకము ధర్మజునికికలదు. రాజ్యార్హత ప్రసక్తివచ్చినప్పునడెల్ల రాజ్యమును, సంపాదించిపెట్టిన వానిపుత్రులను భీష్ముడు మరువడు. కనుకనే వాని పెద్దతనమును దుర్యోధనాదులు పాటింపరు.

ఇక భీష్ముని తరువాత ఎన్నదగినవారు ద్రోణ, కృపాదులు, వీరిరువురి సహాయములేనిచో దుర్యోధనుని దురాశకు ఆధారమే యుండదు.శిష్యవాత్సల్యముచేతను రాజ్యపరిరక్షణా సంకల్పముచేతను ద్రోణాదులు, ధృతరాష్ట్రుని మన్నించుచున్నను, వారికి పాండవులపట్ల మమకారమేకాని న్యూనతాభావములేదు. మీదుమిక్కిలి భీష్ముని కాలమునుండి రాజ్యపరిస్థితులను చూచుచున్నట్టివారు. కాని ధర్మమునకు, బ్రాహ్మణ్యమునకు వ్యతిరేకముగజరిగినచో ఎట్టివానినికూడ లెక్కింపరు. రాజభక్తియున్నను సంపూర్ణస్వేచ్ఛగలవారు. అట్టి బ్రాహ్మణ్యమును తనపట్ల త్రిప్పు కొనుటలోని ధర్మజప్రయత్నము దేవ, బ్రాహ్మణమాన్య ప్రస్తకమున ఊహింపగలము. యుద్ధమే అనివార్యమైనప్పుడు భీష్మ, ద్రోణాదులకు వారివారి పరిమితులడ్డము రావచ్చును. అధర్మమును ఖండింపగలరేకాని రాజధిక్కారమునొనర్పజాలరు. అట్టితరి కౌరవులను బయపెట్టగలిగినది భీమార్జునుల పరాక్రమముమాత్రమే. గంధర్వులచేతిలో దుర్యోధనుడు అవమానపడినపుడు అర్జునుడొక్కడే వానిని విడిపింపగలిగినాడన్న విషయము దుర్యోధనుడెన్నడును మరువలేనట్టిది. వానిని ఆత్మహత్యాయత్నమునకు పురికొల్పినట్టిది. రాయబార ఘట్టమునకు కించిత్తు పూర్వమే కీచకవధను వినినట్టివాడు. ఉత్తరగోగ్రహణమున ఒక్క అర్జునునిచేతిలో తన సర్వసైన్యము పరాజితమైన విషయమును మరువనట్టివాడు. సోదరప్రసక్తితో ధర్మజుడు పై విషయములనెల్ల దుర్యోధనుని జ్ఞప్తికి దెచ్చినవాడయినాడు.

ఇదియెల్ల వినిన సంజయుడు ధర్మరాజునకు తన రాజుపంపున విచ్చేసిన విషయమును తెలియపరచుచు, తన మాటకారితనమును చొప్పించుచు ధృతరాష్ట్రుని సందేశమును వినిపించినాడు. ఇదియెల్ల మూలమునగలట్టిది. కాని తిక్కన తనదైన బాణీలో అక్కడక్కడ పదములను నిశితముగపరిశీలించి నిర్ద్వంద్వముగా ప్రయోగించినాడు. కురురాజువద్ద నీతిమంతులతోపాటు, అవినీతివంతులుగలరు. సత్వసంపన్నులు, దురహంకారులు మరియు అనేక విధములైన వారుందురు. వారొకరిమాట వేరొకరు గ్రహింపక వర్తింపుచుందురు. కావున వారందరినీ గ్రహింపపనిలేదని సంజయుడు పల్కుచు ముమ్ముందుగ ధర్మజుని పొగడ్తలతో తన సందేశమారంభించినాడు. నీవంటి విమలహృదయునితో పొందుగోరి వచ్చితిని, అందువలన నిదివరకు వారందరు క్షేమముగా లేకున్నను ఇకపై నుండగలరను ఆశాభావమును వ్యక్తీకరించెను. ఆ కౌరవులకు మీరెట్టియపకారమును చేయలేదు. కాని చేసినట్లువారు మీయందు క్రూరముగా వర్తించుచున్నారు. అట్లుచేసిన కొడుకులతోకలసి ఆ ధృతరాష్ట్రుడు మిత్ర ద్రోహియై తానేచెడును. ఈ విషయములన్ని నీకు తెలియును. కాని నీవు అజాతశత్రుండవను విషయము నిఖిలలోకవిదితమని పలికి, ధర్మప్రబీభత్సహృదయ అని ధర్మజుని సంబోధించెను. మరియు పగవారికైనను దాన మొసంగెడి గుణముకల దుర్యోధనుడు ఆ బ్రాహ్మణుల మాన్యములనేల అపహరించును. వారికి పేరు, ప్రతిష్ఠ లందాసక్తిమెండుగదా! అని పల్కుచు ప్రతియోధులను ఎదుర్కొనవలెనన్న భీమార్జున, నకుల, సహదేవులలో ఏ ఒక్కరికైనను నీవ్రేలిచిటికెచాలును. కాని అగ్రహవృత్తికిపోయి, అధర్మమాచరించుట దుర్వారబలులైన పాండవులకు తెలియని శాంతచిత్తులని ప్రసిద్ధి. కావున మీ నలుగురు తమ్ములు ఆప్తుడైన కృష్ణుడు, విరాటుడు, సాత్యకి, ద్రుపదుడు మొదలైన వారందరు వినుచుండగ ధృతరాష్ట్రుని సందేశమప్పగించుచున్నాను. అవధరింపుడని సంజయుడు న్యాయాన్యాయములను, ధర్మాధర్మములను, రాజనీతిజ్ఞతతోకూడిన హితమును యుధిష్ఠిరునికి వినిపించెను.

ధృతరాష్ట్రుడు శాంతినభిలషించుచు తమ సముఖమునకు నన్ను పంపినాడు. అందులకై మనము సమయా సమయము లెరిగి ప్రవర్తించుట ఉచితము. హింసాపాత్రమైన కార్యములు మీవంటి సర్వధర్మజ్ఞులు. శాంతులని ప్రసిద్ధివడసిన పెద్దలకు ఎవ్విధముగానైన తగునా! అని ప్రశ్నించెను. మడుగు జీరయందు మనిదాకినట్లు మీ సత్కులమునకు పాపపంకిలమంటగట్టుట కార్యనిపుణ హృదయుడవైన నీకు తగదు. అఖిల జనక్షయంబు, చివరకు జయాపజయంబులు రెండును సుఖములేనివైన పనికి ఉత్తములెట్లంగీకరింతురు. మీరే కౌరవులను ప్రేరేపించి, యుద్ధమున పగవారినెల్లరను సంహరించితిరేని, మీభ్రతుకులుగూడ చావుతో సమానమే! బంధువులనుచంపి, జీవించుట మేలుకాదుగదా! దయాసముద్రుడవైన నీకు తగదని పల్కెను. ఆ పై బలాబలములను వీక్షించిన ఇరుపక్షముల ఒకరికొకరు తీసిపోని విధముగనే యున్నది. మీకు పెట్టని కోటలా హరి, భీమార్జునులు, సాత్యకి, విరటుడు, ద్రుపదుడు మొదలగువారందరునుండిన దేవతలకు సైతము కన్నెత్తిచూచుటకాస్కారములేదు. మరి వారికి ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణ, శల్యులు సుయోధనునికి ప్రాణములైనిల్చిన ఈశ్వరునికైన జయింపగవశమే? కావున నిటువంటి మీ ఇరుపక్షములకు అన్యోన్యకలహము మేలుకాదు. కావున యిరువురి ప్రియమును, హితమును కాంక్షించువారిని సంప్రదించుమని సంజయుడు సభాముఖముగ, ధర్మజునికి రాజసందేశమును వినిపించెను.

ఈ పట్టున సంజయుని పలుకులలో ఎన్నో ధోరణులు కన్పట్టుచున్నవి. జయముకూడ పరాజయమే అనుటలో దీనముగా ప్రార్థించుట, కౌరవులనెవ్వడు గెలుచుననుటలో బెదిరించుట, స్వస్తి ఎట్లగుననుటలో ఇరుపక్షములు నశించునని సూచించుట, చివరలో కార్యసాధనకై పలుకుచున్నాననుటలో సంధిప్రయత్నమే కాని సమరయత్నము కాదనుట వ్యక్తములగుచున్నవి.

68. పైన వివరించిన సంజయుని ప్రసంగమునందలి రాజనీతిని, లౌక్యమును, అధిగమించుచు ధర్మరాజుగావించిన ప్రసంగము యథామూలము. అయినను మాటాడినతీరు లౌకికుడు సాధించెడి ప్రయోజనములన్నింటిని ధర్మజునిచే సాధింపజేసినాడు తిక్కన. ఈ సందర్భమున వ్యాసునిమాటలు పౌరాణికునివిగను, తిక్కనమాటలు రాజకీయవేత్తవిగను భాసించునవనుట అతిశయోక్తికానేరదు. ధర్మజుని మాటతీరును క్రమశఃవివరింతును.

ఉ. నెయ్యముతప్ప నొండొకటినీచెవిసోకెనె నాదుపల్కులం
దియ్యెడ సంజయాయనికినిమ్మొయినల్కెదునీవుమాకుదా
గయ్యము తక్కిమన్నితగుకార్యము కాదొకొపోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధివెడగైనను నొల్లకయొండుచేయునే - ఉద్యోగ-ప్రథమ.304

పై పద్యమున నాలుగు వాక్యములున్నవి. ప్రతివాక్యమునందును అమూలకమైన ఒకలౌక్యము చేర్చబడినది. మొదటి వాక్యమునందలి నెయ్యముతప్పనొండొకటినీచెవిసోకెనే నాదుపల్కులందియ్యెడ అనుచోట "నెయ్యముతప్ప" అనుమాట మూలమునందులేదు. నీచెవిసోకునే అనుమాట తెనుగు వ్యవహారమున చాల పదునైనమాట, నీవేలశ్లించి అబద్ధములాడుచున్నావు అనునంతటి నిశితభావమామాటలోనున్నది. పొరపాటునకూడ నేనటులనలేదనుమా అనెడి ఆత్మరక్షణపూర్వక వాదనమున్నది. ఇది తెనుగు నుడికారము.

రెండవవాక్యము సంజయా యనికినిమ్మొయినల్కెదు నీవు యనునట్టిది. ఇచట ఉల్కెదు అనునది పాఠాంతరముగ నియ్యబడినది. ఉలికిపడుట అనునది తెనుగు నుడికారము. లేని విషయమును ఊహించుకొని భయపడుటను ఉలికిపడుట యందుము. ఈ భావము మూలమునలేదు. భిభేషి అనునది మూలము. ఏల భయపడెదవు అనుమాటలో

తన మాటలయందు భయకారణమున్నదా అని ధర్మజుడు ప్రశ్నించినటులున్నది. కాని అనువాదమున ఊహించుకొని భయపడుచున్నావనుటలో తప్పుచేసిన వానిస్వభావము నీలో కన్పించుచున్నదనెడి ధ్వని కలదు. ఇది ధర్మజునిలోని లౌక్యమును మెరుగుపెట్టుచున్నది.

మూడవవాక్యము మాకుదా గయ్యముతక్కి మన్నితగుకార్యముగాదొక్కో ఈ వాక్యమును మూలమునుండి ఊహింపవచ్చునుగాని యథాతథముగా లేదు. యుద్ధములేకుండగ మేమిరువురము కలసియుండుట మంచిదియేగదా! అని వాక్యభావము. కాని మాటాడిన తీరుచూచినచో కాకువునకవకాశమున్నది. తగుకార్యము గాదొక్కో అనుటలో అట్టివారితో కూడియుండుట మంచిది కాదేమోనని అనుమానించెడి వాని హృదయముకూడ స్ఫురించును. ఈభావము మూలమునలేదు.

నాలుగవవాక్యము పోరితంబు లేకయ్యెడు నర్థసిద్ధి వెడగైనను నొల్లక యొండుచేయునే ఈ వాక్యమునకైన మూలము మూడు శ్లోకములలోనున్నది. అటుల వ్యాసీకరింపబడుటచే మూలమునందలి ధర్మజుని మాటలు ఉపదేశాత్మకములుగ పురాణ ధోరణిలో కాన్పించును. కాని తెలుగు ధర్మరాజుమాత్రము ఉపదేశములుగకాక సూటిగ తనవిషయమై చెప్పుచున్నటుల కాన్పించును. పోరితములేక లభించునర్థసిద్ధిని అమాయకుడుకూడా విడిచిపెట్టడని చెప్పుటలో లోకపుతీరుతోపాటు తనహృదయమునుగూడ ధర్మజుడు స్పష్టము చేసినట్లయినది. ధర్మజునికి కావలిసినది అర్థసిద్ధి. అది విడిచిపెట్టి అయినను శాంతిని పునరుద్ధరింపుమన్నది సంజయుని ఉపదేశము. ఇచట అది స్పష్టముగ తృణీకరింపబడినది.

69. ఈ సందర్భమున మూలమున కొంచెము అధికముగ వర్ణించెను. కాని తిక్కన భావమునుమాత్రమె గ్రహించి మూలకుంచనము గావించెను.

కం. జనులకునెల్లను బథ్యము, లనగా ధర్మానుగతములగుననబొగడం
జనుపనులుచేయు భీమా,ర్జునులే దుష్కర్మమునకు రోయనివారల్-ఉద్యోగ-ప్ర-305

జనులందరికి హితమై ధర్మానుగతములై జనులపొగడ్తలను బడసిన పనులే భీమార్జునులు చేయుదురు. దుష్కర్మములకు వారు రోయరు. మరియు తెలియని తృష్ణతో నేర్పులేనట్టి జనులు ఆతురతో మదిసుఖముగోరి దుఃఖము కలిగించెడి పనులకు ఉత్సాహము చూపుదురు. అదిగాక ,

వ. భోగంబులు వలదాయని తలంతు మేని -308

తే.గీ. వస్త్రమాల్యాను లేపనావసరములను, జతురతూర్యత్రయంబుల సమయములును
నేము వెలిగాగమాతండ్రికించునెట్లు, పుత్రులనపట్టి మమ్మేల పోవద్రోచు-ఉద్యోగ-ప్ర-309

1) ఇటమూలమున : సంపశ్యేమంభోగచయం మహన్తం, సహాస్మాభిర్ధృతరాష్ట్రస్య రాజ్ఞః-26-అధ్యా-6
(మాతోకూడిన ధృతరాష్ట్రమహారాజుయొక్క భోగముల సముదాయమెంతగొప్పదో పరికించిచూడుము)
నాశ్రేయానీశ్వరో నిగ్రహాణాం నాశ్రేయాన్వైగీత శబ్దంశృణోతి
నాశ్రేయాన్వైసేవతే మాల్యగన్ధాన్నచాప్య శ్రేయాననులేపనాని-26-అద్యాయం-7
(ఎంతో పుణ్యము చేసుకొన్నవాడే విరోధులపై ప్రభువు కాగలడు. అట్టివానికి గీతశబ్దములు, మాల్యగంధములు, మైపూతలు లభించును) ((1) ఉద్యోగ పర్వము-ప్రథమభాగము-మూలము)

ధృతరాష్ట్రుడు తన కొడుకులు నూరుగురితోపాటు మా అయిదుగురిని కలుపుకొన్నను తరుగునదేమియు లేదు. కాని అతడంతయు తనకే కావలెనన్న దురాశతో మమ్ము దూరముగ తరిమెను. అయినను తృప్తినొందలేదుగదా! మరియు మహాభోగమువలనే విరోధము పెట్టుకొని శత్రువును సాధింపగలుగుట, గీతాదులువినుట, మొదలగు మహాభోగములనుభవించుట జరుగును. కావున మాకు తగినంత భుజ్యములేదు. గనుకనే భోగములకు దూరమైతిమి. ధృతరాష్ట్రుడు మమ్మును దూరము చేయుటగూడ మాభాగ్యహీనత వలననే. రాజ్యవాంఛ తెలివి తక్కువవాడగు దుర్యోధునినివంటివానికె ఉచితము. నావంటి వానికది పనికిరాదని ధర్మజుడు పల్కుటలో ధృతరాష్ట్రుని, దుర్యోధనాదులను కోపముతోకూడిన అధిక్షేపవచనములతో సంజయునికి ప్రత్యుత్తరమిచ్చెను.

పై వివరణము మూలమున దృష్టినిడుకొనినట్టిది. కాని తిక్కన పద్యమున గడుసుదనమున్నది. లౌక్యమున్నది. ఒకడు ఒకనిని పెండ్లికి పిలువడు. ఇవతలివాడు తన్ను పిలవడని చెప్పడు. లౌక్యముగా మేములేనిదే పెండ్లియగునా! అనును. అందు వెటకారమున్నది. తమ్ము పిలువవలసిన అవసరము ఎదుట వానికిలేదన్న ధ్వనియున్నది. ఇచటను అట్టి నుడికారమే ప్రదర్శింపబడినది. తమతోకూడి భోగములనుభవించు ధృతరాష్ట్రుని యున్నతి ఎంతభాగుండునని మూలముననుండగ, తాము వెలియైనచో ధృతరాష్ట్రునికి భోగములు ఇచ్చగించునాయని అనువాదమున గలదు. ఇచ్చగింపవని సమాధానము వచ్చినచో ధృతరాష్ట్రుడు గొప్పవాడే యగును. కాని దాని సమాధానము సంజయునికి తెలియును. ధృతరాష్ట్రుడు స్వార్థపరుడు, తమ్మునివలన బాగుపడి వాని పిల్లలను గెంటివైచి భోగించుటయందే అధిక సుఖానుభూతికలవాడను అర్థము. తెనుగుధర్మజుని మాటలలో ధ్వనించుచున్నది. ఇది మూలసంభాషణమున లేని లౌక్యవిశేషము.

మూలమున పుణ్యాత్ములకే రాజభోగములు లభించునని యున్నది. అనువాదమున ధర్మజుడు ఆ ప్రసక్తిని తీసుకొని రాలేదు. మూలమునందలి ఈ ప్రసక్తి ఒక విధముగా బోగలాలసత్వమును సూచించును. ధర్మజుడు భోగాసక్తినిగూర్చి యిచట ప్రసంగించుటలేదు. తండ్రి తరువాత తండ్రియనదగు ధృతరాష్ట్రుని కుత్సితమునుగూర్చి మాత్రమే ప్రసంగించుచున్నాడు. ఇట ధర్మజుడు తన అదృష్టమునుగూర్చి వివరించుటలేదు. తన తండ్రి సంపాదించినట్టియు, ఒకప్పుడు పెదతండ్రిచే తమకీయబడినట్టియు, నేడు న్యాయముగా తమకు చెందవలసినట్టియు, రాజ్యభాగమునుగూర్చి మాత్రమే మాట్లాడుచున్నాడు. ఈ విధముగ అనువాదపు ధర్మజునిలో వర్తమానమునకు కావలసిన లౌక్యపు ధోరణి అధికముగా కన్పట్టును.

70. వ. అయినను ఒకమాట చెప్పెద సమచిత్తుడవై వినుమని యిట్లనియె.

కం. తానైననపుడువక్రుం, డై నీతిపథంబువిడిచెనక్కటపతి మ

మ్మైనను జక్కని తెరువున, బూనినడపుడనుచు నిపుడుబుద్దులుచెప్పెన్-ఉద్యోగ-ప్ర-311

తనకు తానుగ అప్పుడు కుటిలుడై నీతిమార్గమును విడిచిపెట్టినాడు భూపతి. మమ్ములనిపుడు ధర్మమార్గములో నడువుడని బుద్ధులు చెప్పుచున్నాడను ధర్మజుని పలుకులలో అపహాస్యము స్పష్టముగ కన్పించుచున్నది. ఈ క్రింది పద్యము అమూలకము. ఇట తిక్కనగారు తనదైన శైలిలో తెనుగు లోకమునగల లౌక్యుల మాటలను ధర్మరాజు నోటివెంట పలికించి కృతకృత్యుడైనాడు.

71.ఉ. సంపదతక్కియుండగ నశక్తులనంజనుమమ్ముఁబిల్చిపూ

జింపగనంతబేలెపతి చెప్పెడువారలబుద్ధినాడమ

న్నింపడయింక నేలయగునీవడియాసలవచ్చి రిత్త కా

రింపక మానుమాతనిచరిత్రము నీకుసుమాకువింతయే-ఉద్యోగ-ప్రథమ-314

ఈ పద్యమున మొదటివాక్యమున సంపద తక్కియుండగ అనుమాట ధర్మజుడు పూర్వపుస్థితిని తల్చుకొని సంజయునికి చెప్పినటువంటిది. అనగ పూర్వము తన తండ్రియైన పాండుభూపతిచే సంపద కూడబెట్టబడినదియై, పెదతండ్రికి సంక్రమించినటువంటిది. అనాడే పాండవులు సంపదకోల్పోయినట్టివారు. అయినను పెదతండ్రి లోకాపవాదమునకు వెరసి, పాండవులకూడ తమతో సమాన సంపత్తి నొసగినాడు. కాని దురదృష్టముచే వ్యసనమునకు లోబరచి తిరిగి వారిచే గైకొనబడినది. ప్రపంచమున సంపద లేనివారిని ఎవ్వరును ఆదరింపరు. కడకు భార్యలకుకూడ లోకువేయనునది జగమెరిగిన సత్యము. కావున పరమ లౌకికుడైన ధర్మజునికీవిషయము తెలియనిది కాదు. అందులకే అశక్తులనంజను అనుమాటతో కలిసి, సంపదకోల్పోయి అశక్తులమైయున్న మమ్ము పిలిచి పూజించేటంతటి వెర్రివాడాపతి? అని సంజయుని ప్రశ్నించుటలో ధర్మజుని ఔచిత్యము, ధృతరాష్ట్రుడు అనౌచిత్యము ఎరుకపడగలదు. ఇక రెండవవాక్యములో చెప్పెడువారలబుద్ధి నాడమన్నింపడ నుటలో ధృతరాష్ట్రునివద్ద నీతిమంతులకు కొరతలేదు. విదురుడు, భీష్ముడు, ద్రోణుడు మొదలగు వారందరు కురువంశ క్షేమాభిలాషులే. కాని జనుషాన్ధుడైన ధృతరాష్ట్రుడు, మదాన్ధుడైన దుర్యోధనుని పక్షమువహించి, వారెవ్వరి మాటలను చెవిపెట్టకయున్నాడనుటలో పెద్దలమాట వినినవాడు సర్వనాశనమగునని సంజయునికి వాచ్యముగ హెచ్చరించుచున్నాడు. మూడవవాక్యములో రిత్తవడియాసల వచ్చి రిత్తగారింపకమానుమని సంజయునుద్దేశించి పల్కెను. అనగా నీ ఈ సంధిప్రయత్నము అంతావ్యర్థము. వట్టి అడియాసలకుపోయి ఇరువురికలయిక జరగదా? అని ఆశించుచున్నావు. అది అసంభవము. కావున ఈ ప్రయత్నము మానుమని సంజయునికి హితవుచెప్పెను. నాలుగవవాక్యమున అతని చరిత్రము నీకునువలాకు వింతయే అనుటలో ధర్మజుముఖమున విసుగు ధ్వనించుచున్నది. అతనికొరకై వేయిమాటలేల? బాల్యమునుండి ఇరువురము చూచుచున్నవారమే గదా! అతనిలో ఏమైనను మార్పు, వింత కన్పించుచున్నదా! అనుటలో ధృతరాష్ట్రుడు చరిత్ర ఏపాటిదో ఒక్కమాటలో అంచనావేసిన పరేంగితావగాహిగ ధర్మజుడిట కాన్పించును.

పై నాలుగు వాక్యములలో ప్రతివాక్యముపట్లను మరియొక విషయముగూడ తిక్కన ధ్వనింప జేసినాడనిపించును. మొదటివాక్యమున అశక్తులమైన మమ్మేల పిలుచునననుటలో ఒక ధ్వని యున్నది. తమను శక్తిహీనులుగ ధృతరాష్ట్రుడు భావించుచున్నాడనియు, ధృతరాష్ట్రుడు శక్తిమంతులను చూచినచో భయపడుననియు, వాని ఆప్యాయతను పొందుటకు లేదా వారినుండి రాజ్యమును పొందుటకు యుద్ధమనివార్యమనియు ధర్మజుడు ధ్వనింపజేసినాడని చెప్పవచ్చును.

రెండవవాక్యమున నేడు నీఒక్కడవే నాకు నీతులు చెప్పుటకు వచ్చితివి. వినకుండుటచే కౌరవుల బలపరాక్రమములను గూడ వర్ణించినావు. కాని మన ఇరువురకును పూజ్యులైన భీష్మ, ద్రోణాది మహామహులెందరో యిట్టి నీతివాక్యములను ధృతరాష్ట్రునకు చెప్పినను దురాశతో అతడు వారెవ్వరి మాటలను ఆలకింపలేదు. కేవలము అట్టివాని క్షేమమునకై రాజ్యమువిడిచి అడవుల పట్టిపొమ్మని మాకుపదేశించుచున్నావా! యనెడి ఎత్తుపొడుపు లేక వెటకారము ధర్మజుని మాటలలో స్ఫురింపుచున్నది.

మూడవ వాక్యములో అడియాస రిక్తకారింపక అనుమాటలు అర్థవంతములు. ఆశ ప్రతివానికిని సహజము. అది క్షత్రియునకు మంచి లక్షణముకూడ. కాని ఒకని ఆస్తి దోచుకొనుటకై పోవుటను అడియాసయని అందురు. ఇట్టిది ఉత్తమ లక్షణము కానేరదు. కౌరవచక్రవర్తినుండి వచ్చిన రాయబారి ఔద్ధత్యమునకు తగినట్టిదిగాదు. ప్రాణహానికోర్వవచ్చును గాని ఇది మానహానికి సంబంధించిన దేబిరింపువంటిది. క్షత్రియులు యుద్ధమునకు ఓర్వగలరు. కాని మరికొంతకాలము బ్రతుకుటకై ధృతరాష్ట్రునకు రాజ్యము విడువమని యాచనకుపోయి ఆ యాచనకు నీతుల రంగుపూయుట కూడదని హెచ్చరించినట్లయినది. మంచి విషయమై ఎంతసేపు చెప్పినను వినటయందు ఓపికగలవాడు ధర్మజుడు. కాని పితాపుత్ర సంబందమునకు, క్షాత్రనీతికి, ధర్మమునకు విరుద్ధమైన ఉపదేశము అనవసరముగ బాధించుటయే యగును. ఈ మాటలలో లౌక్యముకన్న లోతైన వివేకముగూడ స్ఫురించును.

చివరి వాక్యములో ఎన్నియో గూఢార్థములున్నవి. వచ్చిన సంజయుడు విదురునివలె వివేకవంతుడైనట్టివాడు. నారదాది మహర్షుల మూలమున పాండవ, కౌరవ అవతార విశేషములను సంజయుడుకూడ వినియుండునన్న నమ్మకము ధర్మజునికుండి ఉండవచ్చును. ఉత్తరగోగ్రహణ సంబంధమున దుర్యోధనుడు కలిపురుషుని అవతారమన్నసత్యము కొందరికైన తెలిసినది. వ్యాసాది మహర్షులకు వారియందు భక్తిప్రపత్తులుకల భీష్మాది పూజ్యులకు ధృతరాష్ట్రాదుల జన్మరహస్యం తెలిసియుండును. ధర్మనాశన ప్రయత్నమునకు తత్ఫలితముగ యుద్ధావిర్భావమునకు పర్యవసానముగ భూభారమును తొలగించుటకు జన్మించినవారిని పొగుడుట, తమ్ము వారితో మైత్రికి ఎట్టి త్యాగమైన చేయుమని ఉద్బోధించుట ఎందులకని ప్రశ్నించినాడు ధర్మజుడు. ఈ చరిత్రలు పుట్టినదిమొదలు నెరిపినజీవితము ఒక చరిత్రకాగ, పుట్టుకలోనున్న రహస్యము మరియొక చరిత్ర. అది కవి తిక్కనకు తెలియును.ఆదిపర్వము తృతీయాశ్వాస పఠనవేళల పాఠకునికి తెలియును కనుకనే ఆ భావమునుగూడ స్ఫురింపచేయుటలో ఒక అందమున్నది.

72. ఈ క్రింది పద్యములు తిక్కన స్వకపోల కల్పితములు. ఇట మూలమున వ్యాసుడు పౌరాణికధోరణిలో, పాప, పుణ్య విచారముతోను, కౌరవనిందయందు శ్లోకములను రచించెను. కాని రాజనీతిదురంధరుడైన తిక్కన చమత్కార విశ్లేషణ ధర్మజుని పలుకులతో సంజయునికి విన్పించినాడు.

కం. తగుమాటలాంబికేయుం. డగుననికైకొనునె యెన్నడైనను గొడుకున్
మగటిమి కలడనియెడున, మ్మిగఁజూచుచునుండి విషముమ్రింగినయేనిన్-ఉద్యోగ-ప్ర-315

ధృతరాష్ట్రుడు ఎన్నడైనను కొడుకైన దుర్యోధనునికి తగుమాటలుచెప్పి సరైన నడవడిలో ఉంచుటకు ప్రయత్నించక, పౌరుషము కలవాడు, మానధనుడయిన కొడుకు ఏ విధముగ ప్రవర్తించుచున్నను ఉపేక్షించును, అనుటలో కొడుకును చెప్పుచేతలలో ఉంచుకొనలేని అసమర్థునిగా పెదతండ్రిని సంజయుని యెదుట చిత్రించెను.

పై పద్యమమూలకము. అట్టితరి కల్పనము చేయవలసిన అవసరము గుర్తింపవలసియున్నది. పంచమవేదమైన మహాభారతమువలన లోకమునకు హితము గరపుటకాని, సంధర్భోచిత లౌక్యప్రదర్శనముచే రసపోషణముగాని కొత్తగ కల్పనము చేయవచ్చును. ఇట పైచెప్పిన రెండు ప్రయోజనములను తిక్కన సాధించినాడు. లోకమున ధర్మము, నీతి, క్రమశిక్షణము, చట్టము లేక నాడు గ్రహించిన స్మృతి ఒకప్రక్కననున్నవి. మరియొక ప్రక్క అంగబలము, అర్థబలము, అధికారములున్నవి. ఇందు రెండవ వర్గము మొదటి వర్గమును తృణీకరించుట భారతకాలమునుండి తిక్కన కాలము వరకునున్నట్టివియె. కాని ధర్మరహితమైన పాశవికశక్తిపట్ల ఏదియొ ఒకనాడు అధర్మమె విషముగ

పరిణమింపక తప్పదు. క్షత్రియుడు చక్రవర్తియైన దుర్యోధనిలో మగటిమియుండుట గొప్పదియే. కాని ఏనుగైనను విషముమ్రింగిన చావకతప్పదు. విషతుల్యమైన అధర్మ ప్రవర్తనము దుర్యోధనుని చంపకవిడువదు. అనుభవజ్ఞుడైన తిక్కన తమ సమకాలమువారినికూడ తనరచనలో హెచ్చరించి కవితాప్రయోజనము సాధించినాడనిగూడ యూహింప వచ్చును. ఈ లొక్యమునెల్ల ధర్మజముఖమున చెప్పించినాడు. ఇచట ధర్మజుడునిండుగ ధృతరాష్ట్రహృదయమును గ్రహించినవాడుగ చిత్రింపబడినాడు.

73.కం. జూదపుసిరియాసపడం, గాదనివిదురుండుచెప్పగానప్పుడు క

ర్ణాదులపలుకులు వినిపతి, యాదరణముచేయకున్ననంతన తీరున్-ఉద్యోగ-ప్రథమ-316

జూదపుసంపదకు ఆశపడరాదన్న విదురుని మాటలకు తలయొగ్గక, కర్ణాదుల పలుక్కులువిన్న పతి మమ్మాదరింపక యున్నతీరు మాకు విశదమే అనుటలో అనాడే దుష్టప్రవర్తన కలిగిన కౌరవులతోడి సంధిపొసగదని ఎరుకపడెనని ధర్మజుడు

కం. ధృతరాష్ట్రుండిటమీదను,సుతులునుశకునియునుసూతసుతుడునుదనునే

గతి నడిపించిరివారల, మతమయనుష్ఠించుగాకమరలంబడునే - ఉద్యోగ-ప్రథమ-317

ధృతరాష్ట్రుడు మొదటినుండి కొడుకు, శకుని, కర్ణాదుల మాటలుతప్ప పెద్దలైన భీష్మాదుల మాటలు ఆచరింపలేదు. వారు ఏవిధముగా నడిపించిన ఆ పద్ధతిలోనే పోవువాడు. కావున నేడతడు నీతిమార్గమునకు త్రిప్పబడడనుటలో దుష్టులతో సాహచర్యము వినాశనమునకే దారితీయునని నొక్కిచెప్పెను.

కం. కార్యముతెరగిట్టిది నీ, వార్యచరితమునకుఁ జొచ్చియాడెదునీ కా

దుర్యోధనునవినయమని, వార్యంబనియెరుగరామివలనో వెడగో-ఉద్యోగ-ప్రథమ-318

సంజయా! నీవు ఆర్యచరితము తెలుసుకొని కార్యము సిద్ధింపజేయుటకు వచ్చితివి. కాని ఆ దుర్యోధనుడు వెర్రివాడా! అతని అవినయముతో చెప్పినవి, అనివార్యమని ఎరుగక పంపినాడనుటలో దుర్యోధనునికి ఈ సంధిపొసగదని, యుద్ధమనివార్యమనితెలిసి నిన్ను పంపుటలోగల ఔచిత్యమేమియని ధర్మజుడు ప్రశ్నించెను.

74.కం. చక్రధరులెక్కగొనడుప, రాక్రమనిధియర్జునునకు రాధేయభుజా

విక్రమమెదురుగగొని ని, ర్వక్రము జేసికొనువాడు రాజ్యంబెల్లన్-ఉద్యోగ-ప్రథమ-319

మరియు చక్రధరుడైన శ్రీకృష్ణుని లెక్కింపడు. పరాక్రమమునకు నిధివంటివాడైన అర్జునునికి కర్ణుని భుజబలమడ్డుపడవైచి శత్రువులు లేనిదిగ రాజ్యమునెల్ల పాలించు ఆలోచనతోనున్నవాడు దుర్యోధనుడు. అనగా నిటువంటి దురుద్దేశముతోనున్నవాడు, పెద్దలపోరు భరింపలేక సంజయుని రాయబారనెపమునంపినాడు. కాని సమస్యను సామరస్యముగ పరిష్కరించుట ఎంతమాత్రము దుర్యోధనున కిష్టములేని పనియని ధర్మజుడు, సుయోధనుని హృదయము చదివిన వానివలె సంజయునికి ఒప్పచెప్పెను. లోకమున దుష్టరాజులును గలరు. తిరుగుబాటు ప్రజలును గలరు. ఇరువురిలోనను ఒక అవివేకము గాన్పించును. దానిని తిక్కన యిట వివరించినాడు. మానవుడు ధర్మమునకైనను వెరువవలెను. ధర్మము తనపట్ల ఉన్నవాడుకూడ ఎదుటివాని బలమును జూచి ముందడుగువేయుట నీతి. అట్టితరి ధర్మమును, శత్రుబలమునుకూడ లెక్కింపక ముందడుగు వేయువాడు నాశముచెందకతప్పదు. ఇచట శ్రీకృష్ణుని చక్రధరుడనుటలో ధర్మమునకు ప్రతీకగ నిల్పినటులైనది. రాబోవు కృష్ణరాయబారమున వానిమాట లెక్కింపడన్న

ధ్వనిగూడ యున్నదేమొ. దురాశా పరత్వముచే ధర్మమును లెక్కింపక పోయినను, ప్రాణరక్షణ కొరకైనను ఎదుటివాని బలమును గమనింపవలసియున్నది. ఇటనది అర్జున సంబంధమైనట్టిది. అద్దానిని దుర్యోధనుడు ఘోషయాత్ర సందర్భమున అనుభవపూర్వకముగ గుర్తించియు, నాడే కర్ణుడు తన్ను రక్షింపకపోయినాడే మరల వానిపైననే ఆధారపడుచున్నాడు. ఇది వాని దుష్టత్వమునకు, మూర్ఖత్వమునకుకూడ నిదర్శనమైన విషయము. ఇటుల తిక్కన కథాపరముగ ధర్మము, ఘోషయాత్రలను స్ఫురింపజేయుచు సాధారణ వ్యక్తులనుకూడ హెచ్చరించుచున్నటులైనది. ఈ క్రింది పద్యము మూలమునగలట్టిది.

శా. చాపాచార్యుడు భీష్ముండుంగృపుడు నశ్వత్థామయుంగర్ణుడున్
భూపశ్రేష్ముడుదారుమున్నెఱుగరేపోరెట్లు గయ్యంబులా
శాపాశంబులు చుట్టలా వెఱిగియుంజావేడి మార్కొందురిం
తేపోతమ్ముంగపిధ్వజప్రభలయంధీభూతులం జేయవే - ఉద్యోగ ప్రథమ - 321

ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, అశ్వత్థాము, కర్ణుడు, ధృతరాష్ట్రుడు వారందరు ముందు అర్జునుని బలపరాక్రమాదులు చూచినట్టి వారే. అయినను ఆశాపాశబద్ధులై చచ్చుటకు సన్నద్ధులగుట అవివేకమనిపించుచున్నది. పోరునకు సిద్ధపడిన అర్జునుని కపిధ్వజకాంతులతో వారందరు మాడి, మసియైపోవుదురని ధర్మజుడనుటలోనింతకు ముందు జరిగిన యుద్ధములలో వీరెవ్వరు అర్జునుని జయింపలేక పోయిరి. అటువంటిది నేడు యుద్ధమే అనివార్యమైనచో మునుపులేని శక్తితోనెట్లు జయింపగలరని యోచించుచున్నారని సంజయుని ప్రశ్నించెను.

75. ఈ క్రింది పద్యము మూలమునలేనట్టిది. తిక్కన కల్పితము. సామాన్య జనులకుదయించునట్టి సందేహముతో కూడిన మందలింపు మనకు కన్పించుచున్నది.

కం. మును మమ్ముంబొగడిపదపడి, యనివారలగెలువనరిదియని పొత్తుగఁ జె
ప్పిన మాటకునేనొడబడ, వినుసంజయ పక్షపాతవృత్తి విడువుమీ-ఉద్యోగ-ప్రథమ-322

ముందు రాగానే మమ్ములను పొగిడితివి. తరువాత కౌరవుల ప్రతాప చరిత్ర వినిపించి వారలను గెలుచుట మీకసాధ్యమంటివి. అనగ సంజయుడు కౌరవుల పక్షమున వచ్చినవాడు గావున, దూతకృత్యమునందారితేరినవాడు గావున, సందేశము విన్పించుటకువచ్చి ముందుగ పాండవుల యోగ క్షేమములడిగి, తదుపరి వారి ప్రతాప పరాక్రమాదులను పొగిడి, అదేనోటితో పరపక్షమువారిని బొగుడుట వీరులైనవారికి అవమానము చేసినయట్లు. లోకమున సామాన్యమున ఎదుటివాడిని పొగుడుట సామాన్యులు సహితము సహింపలేనట్టి విషయము. అటువంటిది క్షత్రియుడు పరాక్రమోపేతుడు అయిన ధర్మరాజు ఎట్లు సహింపగలడు. కావున నీవట్లు చెప్పుట నేనెంత మాత్రము సహించను. మరియు ఒప్పుకొనను. అందులకై ముమ్ముందుగ పక్షపాత వైఖరిని విడిచిపెట్టి సత్యముగ మాటలాడుమని ధర్మజుడు సంజయుని మందలించెను. ఇది మూలమున గలట్టిది.

స్రగ్ధర. గాండీవజ్యారవంబుత్కటమయిపెలుచంగ్రమ్మినన్ భీముబాహో,
దండబేపారిశుంభద్గదజడియుచురౌద్రంబుగాదోచినన్ వే
దండ ద్వంద్వంబుమాడ్కిందఱిమికవలుమాద్యద్గతిందాఁకినం జా
కుండంబోకుండఁగౌరవ్యులకువశమెబిట్టుల్కిమూర్ఛిల్లకుండన్-ఉద్యోగ ప్రథమ 323

అర్జునుని గాండీవి త్రాటి శబ్ధము మ్రోగినచో, భీముని బాహువులయందలి గద విలయతాండవం చేసినను. రెండు ఏనుగులు కలసి కట్టుగా నొక్కసారి వచ్చినట్లు కవలలు విజృంభించినచో కౌరవులకు రెండేమార్గములు. ఒకటి పారిపోవలయును లేదా చావవలయును. వేరుమార్గము లేదు, అని వక్కాణించుటలో కౌరవుల బలపరాక్రమాదులను నిరసించినట్లయ్యెను. సంజయుడు పొగిడిన తెరవుకిది సరియైన సమాధానము.

76. (ఆమూలకము) చం.రణములవారలన్‌గెలువరాదనుపల్కులటుండనిమ్ముస
ద్గుణుడవునీవువచ్చిప్రకోపశమంబుగఁబల్కితింకసై
రణదగజేయువారముపరాభవమొందియుమున్నువారిదు
ర్గుణములు సైచుటీవునొకకొంతయెఱుంగుదు వింతయేటికిన్ – ఉద్యోగ – ప్రథమ – **325**

పై పద్యమున ధర్మజుడు ప్రధాన విషయమును అయిదు భాగములుగచేసి ఔచిత్యమునకు తగినటుల మాట్లాడినాడు. అందు మొదటి విషయము. యుద్ధమున కౌరవులను గెల్చుట కష్టమను ప్రస్తక్తిని విడువమనినాడు. సూక్ష్మముగ జూచిన ఈ మాటలో ఒక విశేషమున్నది. రణమున యుద్ధానుభవము సంజయునికి తక్కువ. సూతునిగ యుద్ధమున రథమును తోలినాడేమో గాని, అంతమాత్రమున రథికైన అనుభవము సూతునికి రాజాలదు. కనుకనే ఈ విషయమున నీవు అనర్హుడవనక అది అటుండనిమ్మనినాడు. కౌరవుల సంగతి నీకన్న మాకేయెక్కువ తెలియును సుమా! అనుధ్వని అందున్నది. ఇట్టి పెద్దరికముతోనే సంజయుడు చిన్నబుచ్చుకొనకుండుటకై నీవ్వు సద్గుణుడవ్వు అని ప్రశంసించినాడు. నిజమునకిచట సంజయుని సద్గుణ ప్రసక్తి చెప్పుకోదగిన అవకాశము లేదు. నీవు ఉత్తముడవగుటచే కౌరవులనుకూడ ఉత్తములుగ భావించుచున్నావనియు, పోషించుచుండుటచే సూతధర్మముగ కౌరవులను ప్రశంసించుచున్నావనియు వ్యంగ్యముగ చెప్పినట్లుకూడ అయినది. మంచితనము కారణముగ అసమర్ధులను పొగిడినను ఇంతవరకు వింటిమన్న ధ్వనికూడ కలదు. ఇక మూడవ విషయముగ మంచివాడవగుటచే నీమాటలు వలన వారిపై కోపము తగ్గినదని పల్కుటలో లౌక్యమున్నది. సంజయుని ప్రశంసించుటయు యున్నది. తరువాతి మాటలో సైరణ చేయుగలవారమనినాడు. నిజమునకు సంజయ రాయబార కారణముననే శ్రీకృష్ణ రాయబారము సంభవమైనది. ఒకవిధముగ సంధికిపోవుట కౌరవులను సైరణ చేయుగటనే భావింపవచ్చును. అయిదవమాటగ చెప్పిన చివరిమాట విశిష్టమైనది. కౌరవులపట్ల దోషమున్నను బాంధవ్యముచేతను, కురువంశ ప్రతిష్ఠ కోసమును కౌరవుల దుర్నయములను తలంపవలదని సంజయుడు సుదీర్ఘముగ వివరించినాడు. అంతయువిన్న ధర్మరాజు ఇప్పటి కౌరవుల తప్పులు క్రొత్తవన్నటుల యింత దూరము చెప్పుటేల. ఇతఃపూర్వము వారి దుర్నయములను ఎన్నింటిని భరించినవారముగాదు, అని భీమునకు విషాన్నముపెట్టుట మొదలు ఘోషయాత్ర పర్యంతము కౌరవులు కావించిన దుష్కార్యములనెల్ల ధ్వనింపజేసినట్టి వాడైనాడు.

77.ఉ. ఇంకనునట్లకాదలపుమేమొకకీడునకుందొడంగమా
శంకలుతక్కుమయ్యకువిచారముకల్గినయేనిబాంధవం
బంకురమొత్తమావలననక్కటికంబొలయంగ మమ్మునే
వంకకు బోవనీక గరువంబు జగంబుప్రశంస చేయగన్–ఉద్యోగ ప్రథమ – **326**

కం. రండని పిలువబనిచిపా, లిండని కొడుకులకుఁజెప్పియింద్రప్రస్థం
బొండెనువేఱొకపట్టణ, మొండెనుమాకిచ్చియచనుటుచితమ కాదే-ఉద్యోగ-ప్రథమ-327

ఈ సందర్భమున దుర్యోధనుడే మతిమంతుడై తనకు ఇంద్రప్రస్థమిచ్చిన బాగుండునని ధర్మజుడు పల్కినటుల మూలమున గలదు. అనువాదమున ధర్మజుని ఉద్ధతికి తగినటుల ఔచిత్యహితముగను, ఆప్యాయభరితముగను చెప్పబడినది. అందుకుతోడు లౌక్యముకూడ జతచేయబడెను. తమ వలన కీడురాదని అభయమిచ్చినాడు. తరువాత అయ్యకు విచారము కల్గెనేని అని ప్రారంభించినాడు. తెనుగు నుడికారమున నిచట రెండర్థములను చెప్పవచ్చును. అసలు తమనుగూర్చిన ఆలోచన పెదతండ్రిగ ధృతరాష్ట్రునికున్నచో అని ఒక అర్థము, తమనుగూర్చి ఏ మాత్రమైన జాలికలిగినచో అను మరియొక అర్థము. ఈ రెండునుకాక రాజుగా బాధ్యత యున్నచో అని గ్రహింపవచ్చును. విచారమనగ అర్థవంతముగ ఆలోచించుటయనియు, దుఃఖించుటయనియుకూడ అర్థమును చెప్పవచ్చును. అట్టితరి తమపట్ల కటికపుతనము విడిచి అక్కడికంబాలయంగ ప్రవర్తింపవలె ననినాడు. ఏ శబ్దమునందైనను భావమును వెలిబుచ్చవచ్చును. కాని సందర్భమునుబట్టి ఆ ప్రత్యేక శబ్ద ప్రయోగము మరింత ఔచిత్యమును సంతరించుకొన్నది. అంతవరకు ధృతరాష్ట్రుని అవినీతినిగూర్చియే విచారించుచున్నారు. పుత్రతుల్యులైన తమనువిడిచి ధృతరాష్ట్రుడు రాజ్యభోగములను భవించటయేకాక, కుటుంబ శ్రేయమునకై తమరాజ్య భాగమునడుగక, ముష్టికి పోవుట ఉచితమని సంజయునిద్వారా సందేశమంపినాడు. ఇంతకన్నమించిన దుర్మార్గమేమున్నది. అయ్య అనెడి ఆప్యాయకర శబ్దముచేత ఈ దుర్మార్గమునింకను అధికముగా సూచించినట్లయినది. కనుకనే అక్కడికంబాలయంగ అనుమాటలో మోసభరితమైన దుర్మార్గమును విడిచిపెట్టి అనుహెచ్చరికతో పైభావమంతయు స్ఫురింపచేయబడినది. తాము అపకారము చేయమనుమాటలలో ధీరోదాత్తత అయ్యదలతాల్చి అనుమాటలో ఆప్యాయత ప్రదర్శించి యిప్పుడు లౌక్యమును జతచేయుచున్నాడు. ఒకప్పుడు ధృతరాష్ట్రుడు తమ్ము వారణావతమున నిల్పినాడు. ఆ పై రాజసూయమున తామే అనేక ప్రాంతములను జయించినారు, విధివక్రించి స్వార్జితమును, పునఃపూర్వ స్థితిని పొందవలనన్నచో అనువైన స్థలములను రాజధానిగ చేసుకొనవలసియున్నది. అందుకు తగిన ప్రాంతము వింధ్య, హిమాలయములకు, గంగా, సింధులకు మధ్యనున్న ఇంద్రప్రస్థము తగియున్నది. దానిని తమకిప్పింపుమని అయ్యవిచారము కల్గినచో ఈ పని చేయగలడని సంజయునికి సూచించినాడు. ధర్మజుని లౌక్యమెల్లనిచటనే కన్పించును.

పై చెప్పిన ధర్మజుని పల్కులు సంజయుడాశాంతముగ విని లోకమునగల సూక్తుల సారభూతమైన హితముతో క్రింది విధముగా ధర్మజునియెదుట ఉపన్యసించెను. నీ కళంకములేని జీవితమున మచ్చను కోరితెచ్చుకొనకు. నీవంటి అజాత శత్రువునకు, అహింసా పరాయణత్వమూర్తికి శాంతిపథములో నడచుట ఉచితము. కాని అనిత్యమగు జీవితముకొరకై కౌరవులనందరిని చంపి వచ్చు రక్తాన్నము అనుభవించుట ఉచితముగాదు. రాజసూయమహాధ్వరము నిర్వర్తించి భూసురులకు అక్షయముగ దానములొసంగి, అడవులకేగివచ్చిన మీవంటి సత్పురుషులు, మోహభూయిష్ఠులైన కౌరవులువంటివారితో పగతీర్చు కొనుట లోకము సహించదు. కావున ఈ దుర్నయము మానుము. వారిపైగల క్రోధమునుమ్రింగి శాంతివహింపుము.

ఈ సందర్భమున ధర్మజుని మాటలు యథామూలములు. అయినను సంజయ రాయబారఘట్టమునందలి పరాకాష్ట ప్రాయములైన యిచట సంజయుని మాటలకు, ధర్మజుడిచ్చిన సమాధానము వాని పాత్రను అవగాహనమొనర్చుకొనుటకు అతిప్రధానములైనవిగా కాన్పట్టును. లోకమున ధర్మజుని మంచితనము అప్పుడప్పుడు అమాయకత్వముగ భాసించును. అది ధర్మజుని నడతలోని లౌక్యమో, లేక మంచితనమునెప్పుడు, లోకము

అటులనెఱావించునో చెప్పజాలము. కాని ఇది లోకమున మాత్రము అనుభవైకవేద్యమని చెప్పవచ్చును. అటులనే సంజయుడుకూడ మహాపరాక్రమ శాలియు, క్షత్రియుడు, అనేక రాజులను జయించి రాజసూయమొనర్చినట్టివాడు. అరిలోక భయంకరులగు సోదరులు గలట్టివాడును అగు ధర్మజుని జూచి అయిదు ప్రధాన సందేశములు విన్పించినాడు.

ధర్మజుడు అహింసను మెచ్చుకొనుటజూచి, కౌరవులను చంపుటకన్న భిక్షమెత్తుకొని బ్రతుకుట అహింసావాదికి మంచదనినాడు. రాజసూయమొనర్చి బ్రాహ్మణులను, దేవతలను తృప్తిపరచిన నీకు హింసాకళంకము రాకూడదనినాడు. శాంతముగ నీవు అడవులకు పోవుటచే, కౌరవులు లోకముచే దుర్మార్గులుగ భావింపబడి దూషింపబడిరి. నేడు వారిని చంపినచో అదేతిట్లు నీకు వచ్చుననినాడు. శివుడు విషము మ్రింగినటుల నీవు కోపమును మ్రింగగలవనినాడు. సారాంశముగ ఎవరిని చంపుటయు పాపహేతువని తెలియజేసినాడు. నిజమునకు కౌరవులను చంపకుండా అడవికి పోవుటయందు అహింసలేదు. కేవలము హింసాపూరితమైన క్షాత్ర వినోదసంబంధమైన జూదమున సమస్త రాజ్యమును ఓడిపోయిన ధర్మజుడు, నికృష్టమైన అవమానములను పొందియు చివరకు ధృతరాష్ట్రుని దయాదాక్షిణ్యములచే స్వేచ్ఛనుపొందినవాడై తానంగీకరించిన పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసమును, ఒక సంవత్సరము అజ్ఞాతవాసమును నిర్వర్తించుటకై వనములకేగినాడు. ఇచట హింసాహింసలప్రమేయములేదు. అటులనే రాజసూయమున బ్రాహ్మణులకు దానములిచ్చుటను, దేవతలను తృప్తిపరచుటను సంజయుడు గుర్తించెనేకాని జరాసంధాది మహావీరులతోడిపోరును, అయా యుద్ధములందలి జననాశమును సంజయుడుటంకింప లేదు. ఇందు తెలిసియు, తెలియనట్టు నటనమున్నది. ఈ నటనము దూతకు అవసరము. అవసరమగువేళ ధర్మజుడు యుద్ధమునకే సిద్ధపడునన్న విషయము తెలిసినను, వానిని అహింసావాదిగా పేర్కొనుట ముఖస్తుతి మాత్రమే. ఈ విషయము సంజయునికి తెలియును, ధర్మజునకును తెలియును. ధర్మజుడు సంజయునిమించిన లౌక్యుడు. పైపెచ్చు నిర్భయుడు. కనుకనే ఒక్కొక్కప్పుడు క్షాత్రధర్మము బ్రాహ్మ్యమువలెను, బ్రాహ్మ్యము క్షాత్రమువలెను కాన్పించవచ్చును. కాని అంతమాత్రముచే క్షత్రియుడు క్షాత్రధర్మమును విడిచిపెట్టుట ధర్మబద్ధముగాదని వ్యంగ్యముగ తన హృదయమును సూచించినాడు. అనగ యుద్ధమునకు సిద్ధపడుటయే తనకు సమ్మతమని వివరించినట్లైనది. ఇద్దరును లౌక్యులగుటచే సంభాషణము తాత్విక విచారణాగోష్ఠివలే భాసించును. పర్యవసానముమాత్రము ధర్మజుని రాజ్యకాంక్షను, క్షత్రియగుణమును మాత్రమే వివరించును.

78. ఈ సందర్భమున క్రిందిమాటలు ధర్మజుని హృదయమునకు దర్పణప్రాయములు.

వ. అహింసయ ఉత్తమధర్మంబగు అట్లైనను వంశదూషకులును, లోకకంటకులును అగు పాపాత్ముల నిర్మూలంబుగా చెరచుట ధర్మంబని పెద్దలచేత విందుము" – 335

అంతియెకాక రాజులకు యుద్ధము ధర్మంబుగాదని నీవు మాత్రము చెప్పగలవా? అని ప్రశ్నించుటలో ఔచిత్యమున్నది. హింసకావలెనని నేను కోరుటయెకాదు. వలసినచోట హింసకు నీవును ప్రేరేపింతువనియే ధర్మజునిభావన. సంజయుడు ధర్మజునకు చిరపరిచితుడు. అప్పటికి సంజయ, ధర్మజులిరువును వృద్ధులగుచున్నారు. రాయబార ధర్మముచే అహింసను బోధించుటకు ప్రయత్నించినను దుష్టశిక్షణమునకు సంజయుడు వ్యతిరేకికాడన్నది వారిగత చరిత్రముగనిట ధ్వనింప జేయబడినది.

ఈ సందర్భమునగల వచనమున ధర్మజుని మాటలలో ఎన్నియొ విశేషములున్నవి. లౌక్యమున్నది. క్షాత్రధర్మమున కుచితమైన విశేషమును శ్రీ కృష్ణ పరముగ స్ఫురించుటలో ధర్మజుడుచూపిన మెలుకువకూడ వాని రాజనీతిజ్ఞతకు నిదర్శనము. ధర్మాధర్మవిదులకు గురుండు క్రార్యాక్రార్యా నిరూపకులకు శిక్షకుండు ఉచితానుచితులకు

ప్రదర్శకుండు అను విశేషములలో ఒక విషయము స్పష్టమగుచున్నది. అహింస, ఓర్పు అను పొగడ్తలకులోనయి ఉచితమును, అనుచితమును, కార్యమును, అకార్యమును, ధర్మమును, అధర్మమును ఒకే విధముగ చూడరాదని ధర్మజుడు సంజయుని హెచ్చరించినాడు. యధు, భోజ, అంధక, వృష్ణి, సంజయ, కేకయమున్నగు రాజులు ఉత్తమమార్గమున నడచుచున్నారని ధర్మజుని భావన. పై రాజవర్గము అనేక యుద్ధములొనర్చి నట్టివారు. జరాసంధ, శిశుపాలాదులతో పలు యుద్ధములొనర్చి శత్రుకోటిని హతమార్చినట్టివారు. ఆ పనులన్నియు ఉచితములని ధర్మజుడు సమర్థించుటలోని భావము, అదేవిధముగ కౌరవశిక్షణము కావింపవలెనన్న సూచన యిచ్చట మెలగుచున్నది, సమస్త పురుషార్థములకు శ్రీకృష్ణ ఉపదేశము మూలమనుటగూడ గమనార్హము. పురుషార్థములలో ధర్మము శ్రేష్టమైనను సమస్త అనువిశేషణముచే అర్థముకూడ విడువరానిదన్న భావన స్పష్టపరుపబడినది.

సారాంశముగ తన రాజ్యభాగము తాను పొందుటనే శ్రీకృష్ణ ఉపదేశ లక్ష్యముకూడ యగునని, కృష్ణుడు చెప్పవలసిన మాటలకు సూచననిచ్చుటయె అగుచున్నది. ఇట కృష్ణుడు సంజయునితో పల్కిన కొన్నింటిని మూలమునుండి తిక్కన యధాతథముగ తీసుకొన్నను, శ్రీకృష్ణుడుపన్యసించిన కర్మ సిద్ధాంతానురూపములైన వచనములను పరిత్యజించినాడు. సమగ్రసారభూతములైన పల్కులనుమాత్రమే ఉల్లేఖించినాడు.

79. మొదటిగ పాండుతనూజకోటికి శుభంబనిపలికి తదుపరి అంబికేయుల క్షేమము నాకాంక్షిచుచున్నా ననుటలో కృష్ణుని పాండవపక్షపాతము ద్యోతకమగుచున్నది. వీరిని తీర్చిదిద్దుటకు నిన్ను నిండుమనంబుతో బనిచెనెనుటలో వారికి చెప్పలేనటువంటి, లేనటువంటి శాంతిని స్థాపించుటకు నీవు వచ్చుటతో ప్రీతినొందితి ననుటలో ఎత్తిపొడుపు గన్పించుచున్నది. మరియు నీ పల్కులన్నియు సమ్మతముగనే గోచరించినవి. కాని

80.ఆ. అనఘయిట్టులంతయును దలపంగడు, నెనసినట్టులుండెసేని వింటె

పాండవాగ్రజన్మ పలుకులచందంబు, చూడ సంధిలేనిచొప్పుతోచె-ఉద్యోగ-ప్రథమ-**338**

మీ ఇరువురి సంభాషణ కలిపి వినిన తరువాత, దర్మజుని మాటల సారాంశమున సంధిపొసగక, యుద్ధమనివార్యమని నాకు తోచుచున్నది, అను పల్కులలో పరోక్షముగ కృష్ణుడుకూడా ధర్మజుని యుద్ధకాంక్షకు చేయూతనిచ్చినట్టైయినది. అనగ శ్రీకృష్ణుడు కూడా యుద్ధమునకే ప్రాధాన్యమునిచ్చుచున్నట్లైనది. మరియు ఏవిధముగ చూచినను, దుర్యోధనుడు ఉన్మత్తుడు, ధృతరాష్ట్రుని హృదయము యిదివరకే స్పష్టము. మరి సంధియెట్లు పొసగునని సంజయుని ఎదురు ప్రశ్నించెను. ఆ రాజు స్నేహము, గౌరవము నీవు కడుపార చెప్పితివి. వీరు తమ వంతు తీసుకొనక యెట్లు వట్టిమాటలతో ఓర్మి వహించెదరు, అనుటలో కుత్సితులైన కౌరవులవద్దగల తమ భాగమును పొందుటకు వారు ఎవ్విధమునకైనను వెనుదీయరను భావము స్పష్టపరచుచున్నాడు. అనగా ఎవరైనను తమకు రావలసినది వదిలివైచి శాంతచిత్తులై, శుష్కవచనములకు తలయొగ్గుదురా? అని ప్రశ్నించెను. వీరలు పెద్దదిక్కనియెంచి మాటకుకట్టుబడి శాంతచిత్తులై, ఓర్మివహించి కారుణికత్వము ప్రదర్శించుచు కౌరవుల పెంపును కోరుచున్నవారై తమవంతు తమకిమ్మనుట ద్రోహముగ తలపబడుట ఉచితముగాదని పల్కెను.

మరియు ధర్మజుని అభిప్రాయములతోపాటు తనదైన అభిప్రాయమునుగూడ నిష్కర్షగనుడివినాడు.

కం. వినుమవమానము పడియి, ట్లునికిబడము తొగడుకంటెనుజ్జ్వలులై మా

ర్కొనిన నదిలెస్సయెట్లయి, నను వీరికి బోటుమేలు నాకుంజూడన్-ఉద్యోగ-ప్రథమ-**342**

అవమానములుపడి యిట్లు ఉనికిని కోల్పోవుటకంటే, కాంతిమంతులై కౌరవులను ఎదుర్కొనుటే మంచిది. ఏమైనను వీరికి అన్నివిధముల శ్రేష్ఠమైనది యుద్ధమేయని నాకును అన్పించుచున్నదని తన మనోభావమును సంజయునికి సాభిప్రాయముగ వెల్లడించినాడు శ్రీకృష్ణుడు. మరియు యుద్ధము రాజులకు ధర్మముగాదని నిన్ను చెప్పమని ధర్మజుడగినాడు గదా! ద్విజన్ములకు ధర్మశాస్త్రాచార్యులు విధించిన ధర్మములలో రాజులెల్లప్పుడునిచ్చువారే గాని, వేడుకొనువారు, గ్రహీతలుగారు. సర్వ వర్ణాశ్రమ ధర్మపరిరక్షకులగు రాజులు నిజ క్షాత్రధర్మమును విచిపెట్టెదరా!అని ప్రశ్నించెను. అదియునుగాక ధర్మపరమైన ఆర్జనను సత్పథంబున నడచుచు, అనుభవించు చున్నవారికి ఒరులొనరించు అన్యాయములను అరికట్టుకొనుటకెకదా! ఈ శస్త్రాస్త్ర ధర్మంబులన్నియు ఇంద్రాదులైన పెద్దలు చెప్పినారని ధర్మ పన్నములను సంజయునియెదుట వల్లెవేసినాడు. అదిగాక నీవు పైచెప్పిన దర్మసూక్ష్మములు, సూత్రములు అన్నియును అందరికి ఆచరింపవలసినట్టివి.అట్టియెడ కౌరవాదులకేల బోధచేయరాదు. వారుగదా ప్రకృతముగ చెడుప్రవర్తన కలిగియున్నవారు. వారిని గదా! బాగుచేయవలసిన సమయమని సంజయుని ప్రశ్నించుంటలో నీ నీతులతో నాకేమి పనిలేదు. మేము ఆచరింపదగినవికూడ కాదు. ‘‘ఇంటిని బాగుచేయజాలక బయిటపడ్డ వానివరసన కద్దించుచున్నది, నీ ఈ రాక వాక’’ని ధ్వనింపజేసినాడు. శాంతివచనములు పల్కిన సంజయునికి మున్ను పాండవులకు, కౌరవులు ఒనరించిన అవమానములును, అన్యాయములను జ్ఞప్తికితెచ్చుటకై యిట్లునుడివినాడు. మున్ను కౌరవసభలో సభాసదులెల్ల చూచుచుండగ ఏకవస్త్రవరీధానయైయున్న ద్రౌపదిని ఆ దుశ్శాసనుడు అవమానించి, పాండవులను పరిహసించినాడు. ఆటకల్గిన మీరందరు నీతులేలవచింపలేదు. వారికి ధర్మబుద్ధిసేల ఉపదేశించ లేదని వ్యంగ్యముగ పల్కినాడు. పాండవులు ధర్మమునకై వెరసి అన్నింటిని సహించిరని, కాని ఆ ఒర్పును నేడలుసుగ తీసుకొని వారి రాజ్యముపాలు వారికివ్వక, వారికి సంధి ప్రబోధము గావించుట ఎంతయేని హాస్యాస్పదముగ గన్పించుచున్నదనెను. సంధియైనను, సమరమైనను ఇరుపక్షములు వారికి సంబంధించినది. ఇందు ఒకరికి లాభము, మరియొకరికి నష్టముగల్గుట విచారనీయము. కావున వారుచేసిన ఘనకార్యములనన్నింటిని బేరీజువేసినచో ఈ సంధికార్యము అత్యంత దుర్ఘటంబు, పొసగుట అశక్యమని నేను తలంచుచున్నాననెను. అయినను సేనచటకేతించి ప్రయత్నించెదను. నా మాటలువిని సంధి పొసగినచో ఇరుపక్షములవారికి క్షేమదాయకమగును. లేనియెడల వారి కర్మమును వారనుభవింతురుగాక మరియు

ఆ.వె. రోషమయ మహాతరుపుసుయోధనుడురు, స్కంధమందులోనఁ గర్ణుఁడలరు

గొమ్మ సౌబలుండు కుసుమఫలములు దుశ్శాసనుండు మూలశక్తితండ్రి – ఉద్యోగ-ప్రథమ-355

దుర్యోధనుడు కోపముఱూపెత్తిన చెట్టు, దానికి బోదె కర్ణుడు, కొమ్మశకుని, చక్కగా పూచిన, కాచిన ఫలపుష్పములు దుశ్శాసనుడు, వ్రేళ్లు బుద్ధిహీనుడగు ధృతరాష్ట్రుడని శ్రీకృష్ణుడు పలుకుటలో ఔచిత్యమున్నది. ఇన్ని దుర్గుణములుగల కౌరవ వృక్షము నాశనముపొందుట తథ్యమని వ్యంగ్యముగ ధ్వనింపజేసినాడు.

81.ఆ. ధర్మజుండు ధర్మతరువర్జునుడు ఘన, స్కంధమనిలసుతుడు శాఖకవలు

పుష్పఫలములేను భూసురులును వేద,ములుదదీయమైన మూలచయము-ఉద్యోగ-ప్ర-356

ధర్మరాజు ధర్మము రూపొందిన పెద్దచెట్టు. దానికి బోదె అర్జునుడు. కొమ్మ భీమసేనుడు. విరియగాచిన

పూలు, ఫలములు నకుల, సహదేవులు. వ్రేళ్ళ నేను, వేదములు బ్రహ్మణోత్తములు, అనుటలో కౌరవ, పాండవుల మధ్యగల భేదమును విశదీకరించుచున్నాడు. ధర్మము శాశ్వతము. అధర్మము అనిత్యము. ఇది ఎల్లరూ ఎరిగిన విషయమే. కావున ధర్మసంబందీకులు, ప్రవర్తకులగు పాండవులు చిరంజీవులు. అధర్మ వర్తనమునకు ఆలవాలమైన కౌరవులు క్షణికములైన భోగములను ఆశించి అన్యాయార్జితములకు తలవొగ్గుటచేత నశించిపోవుదురనుటలోనెట్టి సందేహములేదని పరోక్షముగ భవితనుసూచించి నొక్కివక్కాణించెను. మరియు ధృతరాష్ట్రుడును, పుత్రులును వనము. కుంతీనందనులు సింహములు. సింహములేని వనమును నరికి వేయుదురు. వనములోని సింహములుండుటయే క్షేమకరము. కావున వీరిరువును కలసి యుండుట క్షేమదాయకము. అందులకై నేను కురుసభకేతించి సంధికి ప్రయత్నముగావింతునని సంజయునితో కృష్ణుడు పల్కెను. పై పుటలో శ్రీకృష్ణుడు గావించిన దీర్ఘోపన్యాసము వివరింపబడినది. మన ప్రకృత విషయము ధర్మజపాత్ర చిత్రణము. ఇందుకు శ్రీకృష్ణుడు మాటలన్నియు యథాతథముగ కృష్ణాభిప్రాయములను తెల్పునుగాని ధర్మజ శీలమును తెల్పునా! యని అనిపింపవచ్చును. గాని యిచట ఒకవిషయము ప్రధానముగ జ్ఞప్తియందుంచుకొనవలసియున్నది. భూభారమడంచుటకు అవతరించిన అవతార పురుషుడు శ్రీకృష్ణుడు. దుష్టశిక్షణము వాని లక్ష్యము.

వాని లక్ష్యసిద్ధికై యముని అంశతో నేలకు దిగినాడు ధర్మజుడు. మానవుల తప్పు, ఒప్పుల పట్టికను తయారుచేయుటయే యముని స్వభావము. వాని అంశయైన ధర్మజుడు ధర్మక్షతినంగీకరింపడని చెప్పబనిలేదు. వానిని సాధనముగ చేసుకొని నారాయణావతారుడైన శ్రీకృష్ణుడు భూభారహరణోద్యమమునకు ఉద్యుక్తుడు కానున్నాడు. ఒక్కమాటలో చెప్పవలెనన్న కృష్ణునకు ధర్మజుడొక సాధనము. వాని స్వభావముపై తన లక్ష్యమును ముద్రగా వేయదలచినాడు. తనయభిప్రాయములను వాని శీలముగా మలచదలచినాడన్నమాట. కనుకనే శ్రీకృష్ణుడు చెప్పినటుల నడచెదనని, మున్నుగా ధర్మజునిచే పలికింపజేసినాడు వ్యాసుడు.

82. వెనువెంటనే సంజయుడు దేవా! నేవచ్చిన కార్యము సఫలంబయ్యెనని పల్కి ధర్మజాదులయెడ సెలవుగైకొను తరుణమున, ధర్మరాజు సంజయునికి కౌరవపురమున గలవారికి విన్నవించమని పల్కిన పలుకులలో వినయముతోగూడిన లౌక్యమును ప్రదర్శించినాడు. రాయబారితో ఎదుటి పక్షమువారి తప్పులను చెప్పకతప్పదు. అంతమాత్రమున పితృధర్మము, గురుధర్మము, బాంధవ్యములను మరచిన కుసంస్కారిగ దర్మజుని లెక్కింపరాదు. అంతియెకాదు రాయబార సందర్భమునందిది ముఖ్యమైన లౌక్యముగకూడ చెల్లును. అందున రాజునకు అన్ని వర్గముల సంబంధీకులును కావలసినవారె యగుచున్నారు. ఏ వర్గము చేతను తిట్టుపడకుండుట అతనిలక్ష్యము. కనుకనే భీష్మద్రోణాదులతో ప్రారంభించి కురువర్గ సంబంధీకులనెల్లరను పేరుపేరున అడుగుటలో ధర్మజుని సంస్కారము, లౌక్యము రెండును ద్యోతమానములగుచున్నవి. అటులనే యిచట ఆయా వ్యక్తులకు ఆడిన విశేషణములు కూడా దర్మజుని దూరదృష్టిని తెల్పుచున్నవి. అశ్వత్థామ రుద్రాంశ సంభూతుడు. తాను ద్రోణునకు పుత్రుడు. కృపునకు మేనల్లుడును. అట్టివాడు శాంతింపనిచో భవిష్యమున తమకు ద్రోణసహాయము కొరవడవచ్చును. కనుకనే అశ్వత్థామను అక్కునజేర్చుకొనినటుల చెప్పమనినాడు ధర్మజుడు. ఈ విధముగ పరిశీలించినచో ధర్మజసందేశమున ప్రతిమాటయందును లౌక్యము తొణికిసలాడుచున్నదని చెప్పుటయే సారాంశము.

83. పెద్దలకు ప్రణామములు, పిన్నలకు వాత్సల్యమును ప్రకటించి తన భాగమును తనకిమ్మని తనమాటగా దుర్యోధనునికి చెప్పుమనినాడు. అటుల దుర్యోధనుడంగీకరింపనిచో చివరకు కుశస్థలము, వృకస్థలము, వాసంతి, వారణావతము, మరియేదేని యింకొక స్థలమును కలిపి తమ యేవురకును యేనూళ్ళిమ్మనినాడు. ఈ కోరికను దుర్యోధనుడు మన్నింపడని ధర్మరాజునకు తెలియును. ఇతఃపూర్వము ఒక స్థలమున నిలిచియే అన్యసహాయమపేక్షింపక సోదరులవలన సర్వరాజలోక విజయమును సాధించి రాజసూయమునొనర్చినాడు. నేడు ఐదుస్థలములను కోరుచున్నాడనగ, తేలికగ చక్రవర్తిత్వమును పడయగలవాడని దుర్యోధనుడూహింపగలడని ధర్మజునకు తెలియును. ఇట్టిదియే ధర్మజుని లౌక్యము.

84. సంజయుడు ధర్మజుని విడచి హస్తినాపురికి వచ్చి అరాత్రియే ధృతరాష్ట్రునికలసి మరుచటి దినము సభలో రాయబార విశేషములను వెల్లడింతుననినాడు, కాని ఆ క్షణకాలపు మాటలలోనే సంజయుడు ధృతరాష్ట్రుని లోపములను తెగడి ధర్మజ మేల్మిగుణములను ప్రశంసించుట జరిగినది. అందు విశేషప్రచారము నందిన క్రింది పద్యము ధర్మజుని మానసిక రూపురేఖలను పట్టిచుచున్నది.

చం. ఆనయముపుట్టె జూదమున యప్పుడయెంతయుఁజిచ్చుపెట్టి కా
ల్చినయదినీయుపేక్షయ వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తనిపులి యెల్లవారలు నధర్మమునీపయిఁబెట్టునంతకు
న్వినడును గానడుంబిదప నీకునునాకుమరల్పవచ్చునే - ఉద్యోగ - ద్వితీయ - 14

ఇచట వశీకృతచిత్తుడు ధర్మసూతి మెత్తనిపులి అనుమాటలు లోతుగ పరిశీలింపవలసినట్టివి.

ఇట వశీకృతచిత్తము యోగులకు సంబంధించినట్టిదిగాదు. పరిణితినందిన లౌక్యుని చిత్తమని గ్రహింప వలయును. కార్యశూరుడు తొందరపడి మాటలాడడు. సమయమునకై వేచియుండును. భీష్మ, ద్రోణాది కురువీరులెల్లరును కౌరవ, పాండవులకిరువురకును సమానులు, ప్రకృతము పాండురాజ గతించుటచే పుత్రుడైన ధృతరాష్ట్రునిపట్లనే భీష్మునకు కించిత్ ప్రేమాధిక్యముండవచ్చును. పుత్రుల తరువాతనేగదా వారి సంతానమునుగూర్చి ఆలోచనలు. అట్టితరి భీష్మాదుల హృదయమును తనపట్ల త్రిప్పుకొనుట ధర్మజునకంత తేలికకాదు. లోకమెల్లరును ధృతరాష్ట్రుడు సోదర సంతానమును హింసించుచున్నాడని గుర్తింపవలెను, నిందింపవలెను. ఆ మాటలు భీష్మాదుల చెవికి సోకవలసి యున్నది. ఈ మధ్యకాలమున పాండవులుత్తములని లోకులు గుర్తించునటుల తాము ప్రవర్తింపవలసి యున్నది. అంతవరకు అన్యాయముల నోర్చుకొనుచు తొందరపడకుండుటయే వశీకృతచిత్తతయగును. ఇట్టి చిత్తవశీకరణము మానవులలో సర్వసామాన్యముగాదు. వేటాడుటన్నై మాటువేసిన పెద్దపులిలో ఈ రక్షమైన సమయ నిరీక్షణశక్తిని ప్రకృతి సహజముగ మనము గుర్తింపగలము. సామాన్యులకిది తెచ్చిపెట్టుకొన్నట్టిది. లౌక్యుడైన ధర్మజునకది సహజమైనట్టిది. కనుకనే సంజయముఖమున తిక్కన ధర్మజుని మెత్తని పులిగ వర్ణించినాడు.

85. ఇక విదురుని వచనములో ధర్మజుని గుణాదుల ప్రసక్తి చూచెదము

చం. ఆనపుడునిట్లనున్ విదురుఁడక్కటధర్మసుతుండు భాంధవుం
డును జెలికాడునుందగుభటుండును బ్రెగ్గడయున్‌గురుండుగా
డె నృపవరేణ్యనీకుఁబ్రకటీకృతసత్యుడుశాంతమూర్తి స
ద్వినయ వివేకశీలముల విశ్రుతుఁడాతఁడుకీడుపల్కునే -ఉద్యోగ-ద్వితీయ-24

ధర్మరాజు నీకు బంధువు, చెలికాడు, తగిన భటుడు, గురుస్థానీయుడు, ఎల్లప్పుడు సత్యప్రకటితుడు, శాంతమూర్తి, వినయ వివేకాది శీలములకాటపట్టయినటువంటివాడు, కీడెట్లు తలపగలడని ధృతరాష్ట్రునితో పలికెను. ఇట విదురుని మాటలు ధర్మజుని పాత్రకు పెట్టని సొమ్ములు. ధర్మజుడేమి పల్కెనో తెలుసుకొన ఆతురతతోనున్న ధృతరాష్ట్రునకు విదురుడిట్టి గుణాదులతో కలసిన రూపమును సాక్షాత్కరింపజేసెను. మరియు ఆ ధర్మజుడు నీవే తండ్రివని తలంచి, 'మీరొనరించిన పాపశ్శమ్యములన్నిండిని సైరించి యున్నవాడు' అనుటలో వారి ధర్మతత్పరత ముందు మీ పాప సంచయమంతయు నివురుగప్పిన నిప్పువలెనున్నదని, అది ఎన్నటికైనను జ్వలించకమానదని ధృతరాష్ట్రుని మనస్సును మరింత వ్యాకుల పరచినాడు. ఇప్పటికైనను బుద్ధియెరిగి ప్రవర్తించుమని హెచ్చరికను ధ్వనింపజేసినాడు.

శ్రీకృష్ణ రాయబారము - ధర్మరాజు

సహజముగా మహాకవులచే నిర్ణయింపబడిన నిర్దిష్ట లక్ష్య ప్రతీకయైనపాత్ర కావ్యమున సర్వ ఘట్టములందును వస్తుతః ఒకే ప్రవర్తనమును ప్రదర్శించును. అయినను అల్పప్రవేశమున్న సందర్భములలో సన్నివేశాదుల కారణముగా ఆ పాత్ర అంతగా భాసింపకపోవచ్చును. హృదయమునువిప్పి చెప్పుటకవకాశమున్న సందర్భమున ఆ పాత్రను నిండుగా దర్శింపగలము. శ్రీ కృష్ణ రాయబార ఘట్టమున ధర్మరాజు తన హృదయమును విప్పి చెప్పవలసిన అవసరము వచ్చినది. అందుచే ఈ ఘట్టము ధర్మరాజు హృదయము పట్టియిచ్చు సందర్భముగా చెప్పవచ్చును. ధర్మరాజునకు రాజ్యకాంక్ష గలదా? లేదా? అనునది ఒక ప్రశ్న. నిజమైన భాతృప్రేమతో సమస్త రాజ్యమును ఆనందముగా దుర్యోధనాదులకు ధారాదత్తముచేసి ధర్మరాజు ప్రశాంత చిత్తతతో నుండగలదా? గ్రాసవాసోదైన్యము రాకుండగ ఐదూళ్లనిచ్చినచో సంపూర్ణ తృప్తితో జీవింపగలదా? కౌరవులు అర్ధరాజ్యమియ్యనిచో యుద్ధ సన్నద్ధుడగునా?కాడా? ఇట్టి ప్రశ్న పరంపర ధర్మజునిపట్ల పలువురి హృదయములనుద్భవించును. వీటికి సరియైన సమాధానములు ప్రకృతప్రకరణము వివరింప సమర్థమైయున్నది.

86. సంజయ రాయబారమైనది. వెనువెంటనే ధర్మజుడు శ్రీ కృష్ణునితోనిటుల పలికినాడని చెప్పుచు, శ్రీ కృష్ణునితో ధర్మజుడు పలికన మాటలలో మూలమున **72**వ అధ్యాయముతో ప్రారంభమైనది. అనువాదమున శ్రీకృష్ణుని రాయబారిగా పంపుటకై ధర్మజుడు తన వారందరితో సంప్రదించినట్లుగలదు.

తే. గీ. సంజయుడుదన్ను వీడ్కొనిచనిన ధర్మ, సుతుఁడుమఱునాడుదమ్ములసుతుల నిష్ట
భృత్యపరులను దొరలనుబిలువబనిచి, యెల్లవారును వినుచుండనిట్టులనియె -ఉద్యోగ-తృతీయ-3

కం. మనము జనార్థనుపాలికిఁ, జని కౌరవసభకునతనిఁజనుమని ప్రార్థిం
చినమేలు బంధుహితగురు, జనములతో రణముకాక సంప్రీతియగున్- ఉద్యోగ-తృతీయ-4

పై పద్యములో ఒక విశేషమున్నది. భీమార్జున, సకులసహదేవుల వారికైన ఊహలు ఎట్టివైనను ధర్మజునిమాటకు కట్టుబడి యుండుట వ్రతముగ గలట్టివారు. ఇది వారనేక సందర్భముల వాచ్యముగ చెప్పుకొనుట జరిగినది. అయినను నల్గురితో సంప్రదించినటుల భాసించి, వారందరిమాటగా తాను చెప్పుచున్నటుల చెప్పుట రాజకీయవేత్త లక్షణము. తన వారందరిని శ్రీకృష్ణుని మందిరమునకు గొంపోయి, ఎల్లరను సంప్రదించినటుల మాటలాడుటలో ధర్మజునినేర్పు మరింతగా భాసించుచున్నది. నిజమునకు ధర్మజుడుచెప్పిన మాటలు ధర్మజునివే. మిగిలిన బాహ్యాడంబరమంతయు రాజకీయానుభవమును చాటునట్టిది మాత్రమే. ఇది అనువాదమున తిక్కనగారు ధర్మజునికి పెట్టిన మెరుగు.

ఇక ధర్మజుని మాటలు మూలముకన్న అనువాదమున కొంత భిన్నముగ కాన్పించును. ఈ సందర్భమున మూలమున

1.శ్లో. ఆయంసకాల : సంప్రాప్తో మిత్రాణాం మిత్రవత్సల, నచత్వదన్యంపశ్యామి యోన ఆపత్సుతారయేత్.

(కృష్ణా, మిత్రులకుతోడ్పడవలసిన కాలమువచ్చినది. మిత్రలయందు వత్సలతగల మహానుభావా! మమ్ములను ఆపదలు గట్టెక్కించువాడవు నీవుకాక మరియెవడు లేడు.)(1) ఉద్యో-ద్వి-మూలం-72-అధ్యాయ)

2. శ్లో. త్వాంహిమాధవమాశ్రిత్య నిర్భయోమోఘుదర్పితమ్, ధార్తరాష్ట్రంసహామాత్యం స్వయంసమనుయాజ్ఞహే.

(మాధవుడగు నిన్ను శరణుపొంది భయములేనివారమై పలికిమాలిన గర్వముగల ఆ దుర్యోధనుని వాని మంత్రలతోపాటు స్వయముగ ప్రార్ధింతుము)

శ్లో. యధాహిసర్వాస్వాపత్సుపాసివృష్ణినరిందమ, తధాతేపాండవారక్ష్యా: పాహ్యస్మాన్మహతోభయాత్-72-ఆ-4

(శత్రుసంహారకా! నీవు వృష్ణివంశమువారిని ఆపదలన్నింటినుండి కాపాడునట్లు ఈ పాండవులనుకూడా నీవు కాపాడవలయును. మమ్ము ఈ పెనుభయమునుండి రక్షింపుము). ఈ సందర్భమున అనువాదమిట్లున్నది.

కం. ఆపదగడవం బెట్టగ, నోపిశుభంబైనదాని నొడగూర్పను మా
కీపుట్టువునకుఁ బాండు, క్ష్మాపాలుడు నిన్నుఁజూపిచనియె మహాత్మా. -ఉద్యోగ - తృతీయ - 6

గీ. సమయమిది మిత్రకార్యంబుచక్కజేయ, నీకతంబుననేమవినీతుఁడైన
యాసుయోధనుతోడి పోరాటదక్కి, యనుభవింతుము మాయంశమగుధరిత్రి-ఉద్యోగ-తృ-7

వ. నీకు మేము ప్రద్యమ్నాదికుమారులతోడివారము, మమ్ముదురితంబులు వొరయకుండ నరసిరక్షింపు-8

పై అనువాదములో ధర్మరాజు హృదయమును తిక్కన అక్షిగోచరము గావించెను. మూలమున కృష్ణునితో మిత్రునివలె స్నేహభావముతో ధర్మరాజు మాట్లాడుచు మిత్రులైన మమ్ము స్నేహధర్మము నీయందున్నది గాన మా అందరి కోరికపై సంధిగావించి కార్యము జరుపవలెనని గలదు. కాని తిక్కన రచనలో ధర్మజుని లౌక్యము మనకు సుస్పష్టముగా గోచరించుచున్నది. ధర్మజుడు శ్రీకృష్ణుని చూచుట తోడనే "మాతండ్రియగు పాండు భూపాలుడు నిన్ను మాకు చూపిచనియె" ననుటలో ధర్మజునికి కృష్ణునిపై మిత్రభావము కాన్పింపక తత్స్థానమున పితృభావము యాయబడినట్లు స్పష్టము. అటులనే ఆపదగడపంబెట్టగ అనుచోట ధర్మరాజునకు వచ్చిన ఆపద సామాన్యమా! కాదు. కారణము అతను రాజసూయయాగము పరిసమాప్తి గావించిన మహారాజు. అతనికివచ్చినఆపద, అది అసామాన్యమని తేటతెల్లమగుచున్నది. కావున తనకు ప్రక్కలో బల్లెమువలెనున్న కౌరవులను అంతమొందించినగాని వానిఆపద గట్టెక్కదు. దానికి మిత్రవాత్సల్యము కన్నా పితృవాత్సల్యమె మెండు. దీనికి చక్కని ఉదాహరణము ధృతరాష్ట్రుడే. మరియు ఈ భావమునంతను "ఓపి" యను ఒక్కమాటలో తిక్కనవివరింపగలిగినాడు. పాండవులకు రాజ్యలాభమును చేకూర్చుటయంత తేలిక పనికాదు. ఆ విషయము ధర్మజునికి తెలియును. కనుకనే ఓపి లోకభ్రానుకొని యని ప్రత్యేకముగా వివరించినాడు. "శుభంబైనదాని" అనుటలో చక్రవర్తికి శుభమేదియగును? సర్వంసహా వసుధను ఏకచత్రాధిపత్యముగా ఏలినప్పుడె శుభము. ఆ కార్యము నిరాటంకముగా కావించి తన రాజకీయరంగమును నిత్యనూతనముగ భాసింప జేయుమనుటలో అతని రాజకీయ చతురత మనకు తెలియుచున్నది. అందులకై ఎటువంటి పరిణామము లేర్పడిననూ, చివరకు దుర్యోధనాదులతో పోరాడియైనను కార్యము సాధింపవలెనను కృతనిశ్చయుడుగా కన్పించును. ఈ దృష్టితోనే తమకు ప్రద్యుమ్నాదుల ఉపమానముతో మేము అటువంటి వారమే అని శ్రీకృష్ణునితో నర్మగర్భితముగా తన యూహ తెలియపరిచెను. పైన తిక్కన గావించిన మెరుగులు యథాతథముగా మూలమున లేకున్నను సూచన మాత్రము లేకపోలేదు.

1. శ్లో. త్వాంహిమాధవమాశ్రిత్య నిర్భయోమోఘు దర్పితమ్, ధార్తరాష్ట్రం సహామాత్యం స్వయంసమనుయాజ్ఞ్యహే.
((1).ఉద్యోగ-ద్వితీయ-మూలం-72, అధ్యాయ)

అనువాదమున తిక్కన పాండుక్ష్మాపాలుడు నిన్ను చూచి చనియెమహాత్మా మాటలకు మూలమందలి 'మాధవమాశ్రిత్య' అను మాటలు ఆధార ప్రాయములు. తండ్రి కన్నా భగవంతుడు అధికుడు. ధర్మరక్షణాభారము భగవంతునిపై కదా నిలచియున్నది. అంతియేకాదు. ఇచ్చట ఒక విశేషముకూడ కలదు. శ్రీకృష్ణుడు మాధవుడు. అనగా లక్ష్మీనాథుడు. ఆ లక్ష్మి ధనలక్ష్మియు, రాజ్యలక్ష్మియును కూడా. కనుక రాజపుత్రులకైన ధనలోప దుఃఖము, రాజ్యనష్ట దుఃఖమును మాధవుడు నిండుగా గ్రహింపగలడు. ఈ భావరామణీయకమును అనువాదమున ప్రదర్శించుటకే తిక్కన పాండుక్ష్మాపాలుశబ్దమును ప్రయోగించినాడు. అనంతరము ధర్మజునివైన కొన్ని మాటలు మూలమున నిట్లున్నవి.

శ్లో. తన్మతంధృతరాష్ట్రస్యసోస్యాత్మావివృతాంతర: యథోక్తందూతఆచష్టేవధ్య: స్యాధన్యధాబ్రువన్,..
(అది ధృతరాష్ట్రుని అభిప్రాయము. ఆ సంజయుడు అతని ఆత్మ. అతని హృదయము తెలిసినవాడు. దూత రాజు చెప్పినది చెప్పును. వేరు విధముగా చెప్పినచో చంపదగినవాడగును)

శ్లో. ఆప్రదానేన రాజ్యస్యశాన్తిమస్మాసుమార్గతి లుబ్ధ : పాపేన మనసాచరన్నసమమాత్మన; -72-అధ్యా-8శ్లో
(ఆ పిసినిగొట్టు పాపబుద్ధితో, సమముగా ప్రవర్తింపక, రాజ్యమీయకయే మనయందు శాంతిని ఆపేక్షించుచున్నాడు)

శ్లో. యత్త ద్వాదశవర్షాణి వసేషుహ్యుషితావయమ్, ఛద్మనాశరదంచైకాం ధృతరాష్ట్రస్యశాసనాత్. 72-9శ్లో
(ధృతరాష్ట్రుని ఆజ్ఞమేరకు పండ్రెండేళ్లు అడవులలో నివసించితిమి. ఒక ఏడు అజ్ఞాతముగ నుంటిమి)

శ్లో. స్థాతాన: సమయేతస్మిన్ ధృతరాష్ట్ర ఇతిప్రభో, నాహస్మసమయంకృష్ణ తద్ధినోబ్రాహ్మణావిదు: -10శ్లో.
(పదునాల్గవయేట మాటకు కట్టుబడి చెప్పినమాట ప్రకారము మాకు రాజ్యమొసగలేదు. అది బ్రాహ్మణులెరుగుదురు)

శ్లో. గృద్ధ్రోరాజా ధృతరాష్ట్ర : స్వధర్మంనానుపశ్యతి, వశ్యత్వాత్ పుత్రగృద్ధిత్వాన్నదస్యాస్వేతి శాసనమ్ -11శ్లో
(లోభియగు ధృతరాష్ట్రుడు తనధర్మమును పరికించుటలేదు. కొడుకు చెప్పుచేతలలో చిక్కి వాని మాట వెంటబడి పోవుచున్నాడు)

శ్లో: సుయోధనమతేతిష్ఠన్ రాజాస్మాసుజనార్దన, మిథ్యాచరతి లుబ్ధ:సన్‌చరన్‌హిప్రియామాత్మన: 72-12శ్లో
(జనార్ధనా! ఆ రాజు సుయోధనుని ఇష్టము మేరకు లోభియై తనకు ప్రియము చేసికొనుచు కపటముగ ప్రవర్తించుచున్నాడు)

శ్లో: ఇతోదుఃఖతరంనుయదహం మాతరంతతః సంవిధాతుంనశక్నోమి మిత్రాణాంవాజనార్దన -13శ్లో
(జనార్దనా! ఇంతకంటే పెద్ద దుఃఖమేముండును? నేను తల్లిని, మిత్రులను చక్కగ పోషించుకొనలేకున్నాను)

శ్లో: కాశిభిశ్చేదిపాఞ్చాలైర్మాత్స్యైశ్చ మధుసూదన, భవతాచైవనాథేన పఞ్చగ్రామావృతామయా-72-14శ్లో
(కాశి, చేది, పాంచాల, మత్స్యరాజులు మధుసూదన! నీవును దిక్కుగానున్న నేను చివరకు అయిదూళ్ళిమ్మంటిని)

శ్లో. అవిస్థలంవృకస్థలంమాకన్దీవారణావతమ్, అవసానంచగోవింద కఞ్చదేవాత్రపఞ్చమమ్-15శ్లో
(అవిస్థలము, వృకస్థలము, మాకందీ, వారణావతము ఏదో ఒకటి అయిదవదియు, గోవిందా! బ్రతుకు తుదిదాక యిమ్మని నేనడిగితిని)

శ్లో: పఞ్చనస్తాతదీయన్తాం గ్రామావానగరాణివా, వసేమసహితాయేషు మాచనోభవతానశన్-72-16 శ్లో
(మేము నివసించుటకు అయిదూళ్ళో నగరములో ఇచ్చినచాలును. మావలన భరతవంశమువారు నశింపకుందురు గాక!)

శ్లో. నచతానపిదుష్టాత్మా ధార్తరాష్ట్రానుమన్యతే, స్వామ్యమత్వాసావతో దుఃఖతరంనుకిమ్ - 72-17 శ్లో
(ఆ దుష్టబుద్ధి వారినికూడా మన్నింపుడు. వాడు తనయందు ప్రభుత్వమును తలపోయుచున్నాడు. ఇంతకంటె మిక్కిలి కష్టమే ముందును?) (ఉద్యోగ-ద్వితీయ-మూలం-72-అధ్యాయం)

88. ఈ సందర్భమున తెలుగు ధర్మజుని మాటలతీరు ఒక్కొక్కపద్యమునే పేర్కొని వివరింతును.

సీ. మాతండ్రితలపును నాతనినందను, చందంబునిన్నయాసంజయుండు
పలికిన పలుకులఁదెలిసెగదానీకు, వారిచిత్తముభంగివాఁడెరుంగుఁ
బాలు పంపనియాక యేలిమాటలనమ, మ్ములుకదీర్చెదరు తారధికదుష్క
రంబైన యాసమయంబేముపదమూడు, వత్సరంబులు సల్పివచ్చియుండఁ

ఆ. గులముపాడి నడపదలపడపతిచెడ, దలఁచెనేని కొడుకువలచినట్టి
వాఁడుకన యతనివక్రతమాన్పలే, డింతకంటె గలదెయెడరుమాకు - ఉద్యోగ-తృతీయ-9

మూలమునందలి లుబ్ధ: అనుమాట అనువాదమున చేరకపోయినను "పాలుపంపనియాక యేలి మాటలన మమ్ములుదీర్చెదరు" అను మాటలలో ధర్మజుడు సంజయుని పల్కులందలి పేలవత్వమును వివరించునట్లయినది. లోభత్వము రాజులలో పులువురకు సహజము. కాని ఇతరునికి చెందవలసిన ధనమును వానికీయక హితబోధపేరున సారరహితమైన మాటలు మాటలాడుటలో లుబ్ధత్వమే గాక పేలవత్వముకూడా భాసించును. యేలి మాటలనగా వేలవమైన, నిస్సారమైన మాటలని అర్థము. "కులముపాడినడపదలపడడు" అను మాటలు ధర్మజుని హృదయమును స్పష్టపరచునట్టివి. క్షత్రియకుల మర్యాదచే ధర్మజునకు రాజ్యార్హతగలదు. అందునచట అర్హతలతో పనిలేదు. ఇత:పూర్వమే దయతలచియొ లేక ధర్మజునికిగల హక్కుతలచియొ, ధృతరాష్ట్రుడు ధర్మజునకు కొంత రాజ్యమిచ్చుట జరిగినది. జూద నియమముచే పదమూడేండ్లు మాత్రమే ఆ రాజ్యభాగము ధృతరాష్ట్రుని పాలనలో నుండగలదు. అనంతరమది ధర్మజునికి చెందవలయును. ఇది క్షాత్రకుల మర్యాద. దానిని ధృతరాష్ట్రుడు త్రోసిపుచ్చినాడు. మెరమెచ్చులకై సంజయముఖమున ఉపదేశములను విన్పించేసినాడు. అంత మాత్రమున క్షత్రియుడు శత్రుదోషములను మన్నింపజాలడు. ఈ దృష్టితోడనే ద్రౌపది 'శంకింపబట్టో వారు బ్రాహ్మణులెయే కీడైనసైరింపగన్' అని ధర్మజుని భావమును మరికొంత వివరించినది. 'అతని వక్రత మాన్పలేడింతకంటె గలదె యెడరుమాకు' ధృతరాష్ట్రుడు కొడుకు వక్రబుద్ధిని పోగొట్టజాలడు. అది తమకు మిక్కిలి దుఃఖకారణమైనదని ధర్మజుని భావన, దుర్యోధనుని వక్రత అనగ పాండవులకు రాజ్యభాగమీయకుండుటయె. అది తనకుమిక్కిలి దుఃఖకారణమైనదని ధర్మజుడు వాచ్యముగ వివరించినాడు.

89. ఇంకను క్రింది పద్యమున ధర్మజుడు తనభావమును స్పష్టపరచినాడు.

కం. జననియు సమస్తబాంధవ, జనములుఁబ్రియమంద వారిశాంతులగాఁజే
యను నెమ్మిగనొక్కటియై, మననుండెఱగేదియునికిమాపౌరుషమే. ఉద్యోగ-తృ-10

జననియు సమస్త బాంధవజనములను ప్రియమంది శాంతముగ బ్రతికెడి మార్గము లేకుండ చేసుకొనుట పౌరుషవంతమైన బ్రతుకుకాదని, తిక్కన ధర్మరాజు స్పష్టముగ వివరించినాడు. నిజమునకు బాంధవ వర్గమంతా ఒకెత్తు, జనని ఒక్కతెయు ఒకయెత్తు, రాయబారానంతరము, కుంతి శ్రీకృష్ణముఖమున పాండవులకిచ్చిన సందేశము, ఈ సందర్భమున చూడదగినట్టిది. కుంతి శ్రీకృష్ణునితో యిట్లు పలికినది.

కం. వేడికొని కృపణులైకను, పోడిమియదియేల రాజపుత్రులుతమమై
వాడిమి తప్పిననిప్పులు, వేడిమిచెడినట్లు జనులువిని యులుకుదురే-ఉద్యోగ-తృతీయ-197

వ. భీమార్జునులకిట్లని చెప్పుము - 198

ఆ. కొడుకుగాంచు రాచకూతురెద్దానికి, నట్టిపనికిసుచితమైన సమయ
మొదవెఁదడయుటింకనొప్పదు జనములు, నట్లుకాని పురుషులనరుమిమ్ము - 199

కం. భుజబలమున జీవించుట, నిజధర్మముమెత్తబడుటనింద్యము మాద్రీ
ప్రజలకుఁజెప్పుము ద్రుపదా, త్మజఁగార్యంబడుగుమనుము తగనందరతోన్ - 200

యుద్ధమే శరణ్యమన్న భావన కుంతి మాటలలో స్పష్టపరచబడెను. జననిని తృప్తి పరుపవలెనన్న ధర్మజుని మాటలలో పై కుంతిభావమును తిక్కన ధ్వనింపచేసినాడని భావించుట సమంజసముగ తోచును.

90. అటుపై ధర్మజుని క్రింది మాటలు వాని హృదయమును మరింత స్పష్టపరుచుచున్నవి.

కం. ఇచ్చటి బంధులునీవును, నచ్చెరువడి వినుచునుండ నయిదూళులు మా
కిచ్చినను జాలునంటిని, బొచ్చెముగాదింతపట్టు పూర్ణముసుమ్మీ.. ఉద్యోగ-తృతీయ-11

శాం. ఆ దుర్యోధనుడంతమాత్రమును జేయంజాలడోకాని పెం
వేదం గ్రూరతకోర్వరాదు సిరినాకేలందునే గ్రానవా
సోదైన్యంబులు వచ్చునాయరయు నీచుట్టాలకుంగావునన్
మోదంబొందుటగల్గు గౌరవులునేముంబొంది శ్రీనొందినన్... 12

ఉ. అక్కటలాతులైనఁబగతైనను జంపనగోరనేల యిం
దొక్కతెఱంగులేదె యదియెప్పదె బంధుసుహృజ్జనంబులా
దిక్కుననున్నవారు గణుతింపక సంపదకైవధించి దూ
తెక్కుట దోషమందుటను నీ నీదురవస్థల కోర్వవచ్చునే.. 13

ఈ సందర్భమున మూలమున ధర్మరాజడిగిన అయిదూళ్ల పేళ్లీయడినవి. అవి కురు సామ్రాజ్యానికి రక్షణ కేంద్రములుగా, సంపత్ ప్రదాతలుగ పరిశోధకులు భావించుచున్నారు. క్షుద్ర ప్రాంతములను కోరినటుల, ఆ పాటియును దుర్యోధనుడీయజాలక పోయినటుల ధర్మజుడిచటచెప్పుట వాని లౌక్యమును తెలుపునని కొందరి భావన. ఈ సందర్భమున మూలముకూడందుకు కొంత దోహదము చేయుచున్నది. కాశి, చేది, పాంచాల, మత్స్యరాజులను, శ్రీ కృష్ణుడును దిక్కుగానున్న అయిదూళ్ళిమ్మంటినని తన ఉదారతను ప్రదర్శించుకొనునటుల ధర్మజుని మాటలు కాన్పించును. కాని ఆ మాటలలో ఒక ధ్వని కలదు. అవసరమైనచో తన రాజ్యభాగమును వశపరచుకొనుటకు తగిన అంగబలము తనకు కలదన్న ఆత్మస్థైర్యమును ధర్మజుడు వ్యక్తపరచినాడు. ఒక ప్రక్క యుద్ధసన్నాహ భావన హృదయమునన్నను, లోకాపవాదనివారణార్థమై సంధి ప్రయత్నము గావించువాని మనస్తత్వ మిచట ప్రదర్శితమైనది. పైనుదాహరించిన తిక్కన పద్యములలో చివరి రెండునూ ఈ భావమునకే కొంత దీప్తిని కల్గించినవి.

"పెంవేదం గ్రూరత కోర్వరాదట" అనగా దారిద్ర్యపు తీవ్రతను భరించుట కష్టమని భావన. కనుక తనకు సిరిని సంపాదించుటకై సహాయపడుటలో శ్రీ కృష్ణునికే ప్రయోజనమున్నది. అది యెట్టిదనగ ధర్మజునిచే చూడబడుచున్న శ్రీ కృష్ణుని చుట్టాలకు గ్రాసవాసోదైన్యస్థితి రాకుండుట జరుగును. ఆమూలకమైన ఈ మాటలలో తిక్కన ధర్మజునిచే లౌక్యమును ప్రదర్శింజేసినాడు. సుభద్ర శ్రీకృష్ణుని స్వంత చెల్లెలు. నీవు సుభద్రకంటే 'శడు నెయ్యముగారవమున్ దలిర్వ చూచుచుందు' వని ద్రౌపదిచే ప్రశంసింపబడినట్టివాడు శ్రీ కృష్ణుడు. శ్రీ కృష్ణునకు కారణజన్మయైన సహోదరి ద్రౌపది. అట్టి నీ చెల్లెండ్రిరువురి కొరకై నీవు పాటుపడుమనెడి భావమును వెలిబుచ్చినాడు ధర్మజుడు. కుంతికూడా శ్రీకృష్ణుని మేనత్తయె. సారాంశమేమన కౌరవులకన్నా బాంధవ్యముచే మేము సన్నిహితులమనెడి విషయమును లౌక్యముగమలచి చెప్పి, కృష్ణ సహాయమ పేక్షించినట్టివాడు ధర్మజుడు. ఇక మూడవ పద్యములో అవసరమగునో కౌరవులను చంపక తప్పదన్న భావమును వాచ్యముగనె ధర్మజుడు వివరించినాడు. 'అర్మటులాతులైన బగరైనను జంపన గోరనేల' అని తన భావము స్పష్టపరచినాడు. అంతియే కాదు. తనపక్షమున చేరనున్న రాజకోటి సహాయముచే కౌరవులను వధించి, తాను విజయము పొందగలనన్న విశ్వాసముగూడ ధర్మజునికున్నది. కేవలమాతని వెనుదీయుటకుగల కారణము 'సంపదకై వధించి దూరెక్కుట దోషమందుట' అను దురవస్థను పొందవలసి వచ్చుననియె.

91. ఇక క్రింది పద్యములో లౌకికస్థాయిమించి ఒక విధమైన యుద్ధావేశపుచాయలు ధర్మజుని మాటలలో ద్యోతకములు.

ఆ. క్షత్ర ధర్మమింత కష్టమగునె వెర, ధర్మమాచరింపదగదటండ్రు
కాన శస్త్రజీవికయతగియున్నది, యైనవంశనాశమనభిమతము. -ఉద్యోగ - తృతీయ-15

పరధర్మమాచరింప రానిదనియు, క్షత్రియుడైన తనకు శస్త్రజీవికయ తగియున్నదనియు నిర్ధారించినాడు. అయినను వంశనాశనము మాత్రము తనయభిమతముగాదట. కౌరవులను చంపినందులకు లోకులు నిందింతురే మోయని భయపడినటుల పై పద్యమున సూచించి, తానుకూడ బంధునాశనమును కోరటలేదని అయినను క్షత్రియునకు యుద్ధము తప్పదని చెప్పుటలో, ధర్మజుని చిత్తప్రవృత్తిని క్రింది విధముగానూహించుట సమంజస మనిపించును. ధర్మజుడు రాజ్యభాగమును విడువడు. అందుకు కౌరవులంగీకరింపరు. అందుచే యుద్ధము తప్పదు. అయినను అదియే సరియైనమార్గము. కాని యుద్ధమున దుర్యోధనాదులతోపాటు తనకిష్టమైనవారు కూడ మరణింపవచ్చును. ఇది ధర్మజుని హృదయమున కల్గిన కల్లోలము. సోదర క్షేమమునకై రాజ్యమును విడిచిపుచ్చునంతటి ప్రేమకాని, బేలతనముకాని ధర్మజుని హృదయమున ఏమాత్రము కాన్పింపవు. బలవంతులైన సోదరులను వెంటనిడుకొని దుర్యోధనునిపైనను వారి పక్షీయులైన భీష్మద్రోణాదులపైనను శక్తి దూసినచో, లోకము తన్నేమనునో అను భయము మాత్రము కలదు. నాటి రాజలోకమున శ్రీకృష్ణునికున్నత స్థానము గలదు. అట్టి శ్రీకృష్ణుని ఆశీస్సులతో తన లక్ష్యమును సాధించుకొనుటకైన లౌక్యమే ఈ మాటలలో స్పష్టమగుచున్నది.

92. మూలమున ధనమునొక్క విలువను ధర్మజుని ముఖముగా వివరించుట జరిగినది. ధర్మార్థకామ మోక్షములలో ధర్మజుడు అర్థమునకే అధిక ప్రాధాన్యమిచ్చుచున్నాడనిపించునంతగా ఆ శ్లోక భావమును భాసించును. మచ్చునకొకటి రెండు చూడదగును.

1) శ్లో. ఏతచ్ఛమరణంతాత యన్మత్త : పతితాదివ, జ్ఞాతయోవినివర్తన్తే ప్రేతసత్వా దివాసవ: **72-21** శ్లో
(చుట్టములు మరణించిన దేహమునుండి ప్రాణములు పోయినట్లు నేనేదో బ్రష్టుడనన్నట్లు నన్నువదిలి పోవుచున్నారు. ఇది నాకు చచ్చిన చావుగానున్నది)

2)శ్లో. నాత:పాపీయసీం కాఞ్చిదవస్థాంశమ్బరోబ్రవీత్, యత్రనైవాద్యనప్రాతర్భోజనంప్రత్రిదృశ్యతే – 72–22 శ్లో.
(ఇంతకంటే పరమనికృష్టమైన అవస్థనుదేనిని శంబరుడు చెప్పలేదు. నేటికనియేకాదు,ఈపూటకు కానవచ్చుట లేదు)
శ్లో. ధనమాహు:పరంధర్మం ధనేసర్వంప్రతిష్ఠితమ్, జీవన్తిధనినోలోకే మృతాయేత్వధనానరా: – 72–23 శ్లో.
(ధనమునే పరమ ధర్మముగ వక్కాణింతురు, ధనమునందే అంతయు నెలకొనియుండును. లోకమున ధనవంతులే బ్రతుకుదురు. ధనములేని నరులు చచ్చినవారే)
శ్లో. ఏతామవస్థాం ప్రాప్యైకేమరణంవప్రిరేజనా: గ్రామాయైకేవనాయైకే నాశాయైకేప్రవవ్రజు: –26శ్లో(ఇట్టిపేదరికపు అవస్థనుపొందిన కొందరుపిచ్చివారగుదురు. కొందరు పగవారిపాలగుదురు. కొందరుఇతరులకు దాసులగుదురు)
శ్లో. అపదేవాస్యమరణాత్ పురుషస్యగరీయసీ, దియోవినాశస్తద్ధ్యస్య నిమిత్తంధర్మకామయో : 72–27 శ్లో.
(ధనముపోవుట అను నీయాపద చావుకంటె ఘోరమైనది. ఏలయన ధనమేకదా. ధర్మ కామములకు హేతువు)
శ్లో. యదస్యధర్మంమరణం శాశ్వతంలోకవర్త్మతత్, సమంతాత్ సర్వభూతానాం సతదత్యేతికశ్చన –28 శ్లో.
(చావనునది యున్నదే. అది తప్పనిదగు లోకవర్తనము. ధర్మబద్ధమైనదియే. కనుక ప్రాణులకది పోద్రోవరానిది. దానినెవ్వడు మీరజాలడు)
శ్లో. నతథాబాధ్యతేకృష్ణ ప్రకృత్యానిర్ధనోజన : యదాభద్రాం శ్రియంప్రాప్యతయాహీన:సుఖైరిత: – 72–29 శ్లో.
(కృష్ణా! చక్కని సంపదనొంది సుఖములతో వృద్ధిపొందినవాడు పిమ్మట ధనముకోల్పోయి పడు అవస్థ పుట్టుపేద అవస్థకంటె మించినది) (ఉద్యోగ–ద్వితీయ–మూలం)

మూలమునందలి పై శ్లోకములలో ధర్మజుడు ధనమునకిచ్చిన విలువ ఎట్టిదో తెలియగలదు. ధనాభావము చావుతో సమమనినాడు. అంతియే కాదు. ధనము లేకున్నచో పిచ్చి యెత్తుననినాడు. వేయేల! చావు ఎప్పటికైన రాకతప్పదు. కనుక శత్రువులను చంపియైనను, చావునకు స్థిపడియైనను ధనసేకరణమే మేలిమి అనినాడు. ధర్మజముఖమున వ్యాసుడు, ధన ప్రాముఖ్యమునిటుల వివరించెనని సరిపెట్టు కొనినను క్షత్రియుడును, రాజ భోగములను భవించినవాడునగు ధర్మజుడు కౌరవ సంహారమొనర్చి తన రాజ్యభాగమును రాబట్టుకొనుటకై కృతనిశ్చయుడైనాడని చెప్పకతప్పదు. ఆఖరిగ తన నిర్ణయమును ఘంటాపథముగానిట్లు వివరించినాడు.
శ్లో. తేవయంనశ్రియంహాతు మలంన్యాయేనకేనచిత్, అత్రనోయతమానానాంపదశ్చేదపిసాధుతత్–72–41శ్లో.
(అట్టి మేము ఏ న్యాయముచేతను సంపదలు వదులుకొనరాదు. ఇందుప్రయత్నించు మాక చావువచ్చినను మేలే)

మూలమునందలి పై ధర్మజుని ధనసంబంధ శ్లోకములు జూచినచో ధర్మజుడు చాలా వరకు డబ్బుకక్కూరితి వ్యక్తిగా కాన్పించును. కాని ఈ సందర్భమున తిక్కన పై మూల శ్లోకములన్నింటినీ విడచిపుచ్చి కేవలము సిరితేనిచో నా యరయు నీ చుట్టాలకు గ్రాసవాసోధైన్యమువచ్చును' అని లౌక్యముగా చెప్పుట మూలముతో పోల్చినపుడు బాగున్నదని చెప్పక తప్పదు. వస్తుత: మాత్రము మూలానువాదముల రెండింటను ధర్మజుడు ధనదృష్టి లేనివాడు మాత్రము కాడని తేలును.

93. జయము తనకే వచ్చునన్న నమ్మకము ధర్మజునిలో నిండుగా లేదు. అందులకే అవశ్యం మహాదాశ్రయం అను నీతినవలంబించినాడు. కాని లౌక్యుడైన తిక్కన ధర్మజుని యిట్టి భావములను కొంత వ్యంగ్యముగ ప్రదర్శించును. క్రింది మాటలు చూడదగినట్టివి.

అ. కలహమగుట లక్ష్మిగాలించుఁబ్రాణహా, నియును జేయునింతనిక్కువంబు
పలువురొకనికోడిపారుట బల్లిదు, లనదచేతఁజెడుటయును ఘటించు. ఉద్యోగ-తృతీయ-17

కం. జయమగు నోడుదుమను ని, శ్చయమొక్కడులేదు వినుసమరమున బరా
జయము మరణంబుకంటె హృ, దయపుటభేదనముచేయుఁదథ్యంబనఘా-ఉద్యోగ-తృతీయ-18

కం. కాన నవశ్యముబెనకువ, కాని యుపాయమునబగర గడతేర్చుధృతిం
బూని నడచునెవ్వడుదెం, దానంజెయిపెట్టికొని యతడునిద్రించున్. ఉద్యోగ -తృతీయ-19

ఇచట లౌక్యము వెనుకగల ధర్మజుని భావసంఘర్షణము సుస్పష్టము.

రాజ్యమునకై యుద్ధముచేసినచో ప్రాణహానికి అవకాశమున్నది. అట్లని బలవంతులుగ ప్రసిద్ధిగాంచిన తాము ఒక అనఘుని చూచి పారిపోవుట సిగ్గుచేటు. జయాపజయములు దైవాధీనములు. అపజయము మరణముకన్న బాధాకరము. అందుచే తమకు అపాయములేని మార్గములో శత్రువును వధింపగలవాడు, గుండెపై చేయినిడుకొని నిద్రింపగలడని లోకసత్యములను తెలుపుచున్నతీరున ధర్మజుడు తన మనోవైక్లబ్యమును శ్రీకృష్ణుని యెదుట విశద మొనర్చినాడు. పై భావమంతయు మూలమునకలదు. అది వాచ్యమై సుధీర్ఘముగ నున్నది. ఇచ్చట తిక్కన సంక్షిప్తీ కరణము మనోజ్ఞమై ధర్మజుని మూలమందలి బేలతనమును కొంత కప్పినది.

94. బంధువులను చంపలేదు. శత్రువుల ఉనికిని భరింపలేదు. ఇచట బంధువులే శత్రువులైరి. అట్టివేళ కలిగెడి హృదయ క్షోభము అనూహ్యమైనట్టిది. రాజులు కాకపోయినను, సామాన్య గృహస్థులుకూడ యిట్టి అనుభవమును ఊహింపగలరు. అట్టితరి చక్రవర్తి కావలసినవాని క్షోభమును వర్ణించుటకు సుదీర్ఘ వర్ణనముగావించుటకావశ్యకము గావచ్చును. అందున వ్యాసునిది పౌరాణిక ధోరణి.

సందర్భము లోకులెల్లరు నిండుగ గ్రహింపవలసినట్టిది. కనుకనే ఈ సందర్భము మూలమున అనేక శ్లోకములలో నడచినది. అందు క్రింది శ్లోకములు చూడదగినట్టివి.

శ్లో. అనివృత్తేనమనసా ససర్పఇవవేశ్మని, ఉత్సాదయతి య:సర్వం యశసాసవిముచ్యతే. **72-అధ్యా-61-శ్లో**

(సుఖములేని మనసుగల జనుడు పామున్న ఇంటిలో నున్నవానివలె సర్వమును పాడుచేసికొనును. వానికి మునుపున్న కీర్తియును జారిపోవును)

శ్లో. అకీర్తింసర్వభూతేషు శాశ్వతీంసోధిగచ్ఛతి, నహివైరాణి శామ్యన్తి దీర్ఘకాలధృతాన్యపి - **62-శ్లో**

(అట్టివాడు ఎన్నడుచెడని అపకీర్తిని సర్వభూతములనుండియు పొందును. ఎంతకాలము పట్టి వ్రేలినను పగలు అణగవుగదా!)

శ్లో. నచాపివైరంవైరేణ కేశవవ్యుపశామ్యతి, హవిషాగ్నిర్యధా కృష్ణ భూయఏవాభివర్ధతే.**-63-శ్లో**

(కేశవా! పగతో పగ యణగదు. హోమపదార్థముతో అగ్ని ప్రజ్వరిల్లినట్లు మరల మరల వృద్ధి పొందుచునే యుండును)

శ్లో. అతోన్యథానాస్తి శాన్తిర్నిత్యమన్తరమన్తత: ..... **64-** శ్లో(ఇట్లు దోషము తప్పదు. ఎవరికో చావుమూడక శాంతి కలుగదు) **((1) ఉద్యోగ-ద్వితీయ-మూలం)**

ఇంకనునిట్టి శ్లోకములు మూలమున అనేకములు గలవు. ఈ భావమునంతను అల్పాక్షరముల అనల్పార్థ రచనముగ తిక్కన రెండు పద్యములలో వివరించినాడు.

ఆ. పగయకలిగెనేనిబామున్న ఇంటిలో, నున్నయట్లకాకయూరడిల్లి
యుండునెట్లు చిత్తమొకమాటు కావున, వలవదధికదీర్ఘవైరవృత్తి - ఉద్యోగ-తృతీయ-20

చం. పగయడగించుటెంతయు శుభంబదిలెస్సయడంగునే పగం
బగవగగొన్న మార్కొనకపల్కకయుండగవచ్చునే కడుం
దెగమొదలెత్తిపోవఁబగతీర్పగ వచ్చినఁగ్రౌర్యమొందు నే
మిగతిఁదలంచినంబగకు మేలిమిలేమిధ్రువంబు కేశవా. -21

పై రెండు పద్యములందలి భావము యధా మూలము. అయినను మనస్సు నందు ఒక భావమునుండి లోకభయముచే తద్భిన్నముగా వ్యక్తీకరించుటకై లౌక్యమాశ్రయించు వాని లౌక్యములోని పట్టు పేలవము కాకతప్పదు. అట్టి ధర్మజుని భావసంఘర్షణమునుపట్టి యిచ్చుటలో పై పద్యములందు తిక్కన కృతకృత్యుడు కాగలిగినాడు. పై రెండు పద్యములలో తొలిపద్యమును చూడుము. పగ పాముపండ్రది. ఇండియందు పాముండగ ఒక్కక్షణమైనను చిత్తము ప్రశాంతత నొందజాలదు. అనగ ఇంటియందు సర్పమునుండ నీయరాదు. ఇచ్చట సర్పము వైరము. దీర్ఘకాలము వైరము కూడదని ధర్మజుడు తనభావమును వెల్లడించినాడు. ఇచ్చట వైరము తొలగు మార్గమునెట్టిది. దుర్యోధనుడు రాజ్యమునీయడు. ధర్మజుడు రాజ్యమును విడువడు. అది క్షాత్ర ధర్మము కాదని ముందే చెప్పియున్నాడు. అనగ పామును చంపునటుల దుర్యోధనాదులను చంపవలెనని భావము. పూర్వ ఘట్టములలో కూడా కౌరవులను సర్పములతో పోల్చుట వ్యాసభారతమున తరచుచూడగలము.

ఇక రెండవ పద్యమున పగను తొలగింపవలెను. పగగొన్న వారిని ఎదిరింపక తప్పదు. ఉపేక్షించినచో అది మరింత క్రౌర్యమును వహించును. ఇచట మూడు స్థాయిలలో ధర్మజ భావము వివరింపబడినది. కృష్ణ సామర్థ్యముచే తన రాజ్యభాగము తనకు సిద్ధించుట పగ యుడుంగుట యగును. కాని నాడు తమపై పగగొన్న కౌరవులను ఎదుర్కొనగ తప్పదు. సోదరప్రేమచే నేడు వారిని ఉపేక్షించినచో వారిలోని క్రౌర్యమధికమై తామున్నస్థితి పామున్న ఇంటి వాసమగును. పై రెండు పద్యములలో సారాంశముగ ధర్మజుడు యుద్ధాభిలాషనే వ్యక్తపరచినాడు. నల్వురయెదుట శ్రీకృష్ణుని రాయబారిగనంపుటయు, కౌరవులపట్ల సోదరప్రేమను ప్రదర్శించుటయు అనునవి లోకమర్యాదను పాటించుటకు మాత్రమేనని స్పష్టమగుచున్నది.

95. తరువాతి నాలుగు పద్యములు ధర్మజుని హృదయమునకు దర్పణప్రాయములు.

ఉ. కావున శాంతిఁబొందుటయకర్జముదానదియట్టలుండె శ్రీ
గావలెనంచుఁబోరితముకామియుఁగోరెదమెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయముపుట్టుటయున్వెలిగాగనొందుమై
నేవిధినైనఁజక్కబడుటెంతయు నొప్పుఁజుమి జనార్దనా ఉద్యోగ-తృతీయ-22

చం. మనమునఁబక్షపాతగతిమాదెసమానుము ధర్మనీతివ
ర్తనముల రెండుదిక్కుల హితంబునుబెంపునుగల్గునట్టిచొ
ప్పున విదురాదిసజ్జనులబుద్ధికిరానుచితంబుతోడిమె
ల్పున బరుసందనంబుననుభూపతులెల్లనెరుంగనాడుమీ - 23

చం. తగవునఁబోక రాజుబెడిదంబులుపల్కినయేని సైచియొ
ప్పుగనిలుమీగురుత్వముఁబ్రభుత్వమునుంగల పెద్దవారి మా
టగొనుమి యాసుయోధనుకడన్‌నిలువన్ మనమెల్లగారవం
బుగ గురువృద్ధపల్కుఁదలపుంజననిచ్చిన మెచ్చరేజనుల్ –ఉద్యోగ–తృతీయ– 24

మ. సుతువాడై వినయంబుచేకొనక యేచొప్పుందగంజెప్ప కా
ధృతరాష్ట్రుండవినీతిజేసినను సంధింపంగరాదంచువే
గతెగంబారకు తెంపుసేయునెడ లోకంబెల్లమెచ్చం బ్రకా
శిత ధర్మస్థితినొంది మామనమునిశ్చింతంబుగాఁజేయుమీ –ఉద్యోగ–తృతీయ–25

ఇందు మొదటి పద్యమున సంధి అసంభావ్యమను మాటను ఎంత రమణీయముగ చెప్పబడినదో గమనింపగలము. శాంతిపొందుటకర్జము. అది అటులుండనిమ్మనినాడు. ధనమునకై యుద్ధము సేయుట, లేకుండుటను కోరనట. అనగ శాంతి కాపలయును. అట్లని శాంతి ధననష్టమును తెచ్చునట్టిది కారాదని ధర్మజుని భావన. సొమ్ములుపోకుండగ, జనము చావకుండగ చక్కబడు మార్గమున్నచో దానిని కృష్ణుడు సాధింపవలెను. ఈ సందర్భమున పూర్వపద్యములను మరువరాదు. అందు చెప్పబడినటుల దుర్యోధనాదులతో పాండవులపట్ల పగ మిగులరాదు. ఇన్ని చక్కబడిన పిదప వచ్చు శాంతి కావలయును. తరువాతి పద్యమును చూతము. ఇందు మనమున బక్షపాతగతిమాదెసమానుము, ధర్మనీతివర్తనముల రెండుదిక్కుల అనునవి గమనింపదగ్గ మాటలు. ధర్మజుడు శ్రీకృష్ణునితోడ సంభాషణ ప్రారంభముననే నీవు మాకు మిత్రుడవు, పాండుక్షాపాలుడు నిన్నుచూపెచనియె మహాత్మా అని కృష్ణుని తన పక్షములొ చేర్చుకొనినాడు. తనకు శుభమును చేకూర్చుటలో, రాజ్యమును సంపాదించిపెట్టుటలో తండ్రి తరువాత తండ్రివంటి వానిగ భావించుచున్న శ్రీకృష్ణుని మధ్యలో 'పక్షపాతగతి మాదెస మానుము' అనుటలోని రామణీయకము లౌక్య సంబంధమైనట్టిదిగ గుర్తింపగలము. అటులనే ధర్మనీతి చూడమనినాడు. ధృతరాష్ట్రుడు కులము పాడి నడుపడనియు, కొడుకు వక్రత మాన్పడనియు ఇత:పూర్వమె వివరించినాడు. రాబోవు పద్యములలో కౌరవులు కుటిలమతులు, అవినీతులు, క్రూరకర్ములు, నీచులు అని చెప్పును. అట్టితరి ధర్మవర్తనము చూచి సంధికూర్చుమనుటలో భావమేమి? సారాంశమిట్లు భావింపవచ్చును. తాము ధర్మాత్ములు, కౌరవులు దుష్టులు. గనుక వారు చంపబడెడి మార్గము, తమకు రాజ్యము స్వాధీనమగు మార్గము చూపుమని ధర్మజుడు కోరినటుల భావింవచ్చును. ఇక రాయబార ప్రయోజనమేమిటన విదురాది సజ్జనులు తమను మంచిగ భావింపవలెననుటయే. చివరి పాదమునందలి 'పరుసదనంబునన్ భూపతులెల్ల వినంగనాడుమీ' అను మాటలు గమనార్హము. తన మాటలతో శ్రీకృష్ణుడు కౌరవ పక్షమును వహించుటకు సిద్ధపడుచున్న రాజలోకమును భయపెట్టవలెను. అదియె యిచ్చటి పరుసదనము.

మూడవ పద్యమున శ్రీకృష్ణునిగూడ రాజకీయ లౌక్యమును ప్రదర్శింపుమని ధర్మజుడు కోరిన ఛాయలు కాన్పించును. ధృతరాష్ట్రుడు న్యాయము విడచి కటువుగ లేక అన్యాయముగా మాటలాడినచో ఓర్పును విడువక, పెద్దలైన భీష్మ ద్రోణాదులకు మనపై గారవము హెచ్చునటుల నిలచి మాటలాడుమని ధర్మజుడు శ్రీకృష్ణుని ప్రార్ధించినాడు. సంధికి ధృతరాష్ట్రుడంగీకరింపడని, దుర్యోధనాధులసలే ఒప్పుకొనరని ధర్మజునకు తెలియును. అంతియేకాదు శ్రీకృష్ణ సమేతముగ పాండవులును నిందింప వచ్చునుకూడ. అయినను కృష్ణుడు సంధికైన బోధగావించినచో కార్యము చక్కబడదు. కాని దాని ప్రభావముచే లోకుల హృదయములందు పాండవులకు ఉన్నత స్థానమేర్పడును. ఇది ధర్మజుడు

కాక్షించిన ప్రయోజనము. సంధి కుదరదని తెలిసినను, లోకమున తమకు మంచిపేరు తెచ్చుటకు ధర్మజుడు శ్రీకృష్ణుని ఉపయోగించుకొనిన విధానమిది.

చివరి పద్యమున ధర్మజుని లౌక్యము పరాకాష్ఠనందినది. ధృతరాష్ట్రుడు దుర్యోధనునిమీద ప్రేమచే కృష్ణునికే సమాధానము చెప్ప లేకపోవచ్చును. అట్టితరి ఈ సంధి కుదరదని చెప్పి వెంటనె వెనుదిరిగిపోవలదని ధర్మజుని సూచన. తెంపుసేయునెడ అనగ సాహసనిర్ణయము గైకొనవలసి వచ్చునపుడు లేదా యుద్ధము ప్రకటింపవలసి వచ్చునపుడు, లోకులెల్లరును ధర్మము పాండవుల పక్షముననేయున్నదని భావింపగల వాతావరణమును కల్పించి రమ్మని ధర్మరాజు శ్రీకృష్ణుని కోరినాడు. ఇటుల ధర్మరాజు శ్రీకృష్ణునితో పలికిన ప్రతి మాటయందు యుద్ధము తప్పరాదనియు, తప్పమాత్రము కౌరవులదిగ లోకము భావింపవలెననియు, తగిన ఓర్పుతో పనిని సాధింపవలయుననెడి సందేశమిచ్చుట కాన్పించును. నిజమునకు రాయబార ఘట్టమున ధర్మజ, శ్రీకృష్ణులిరువురి ప్రవర్తనములో ధర్మజుని యందే లౌక్యము భాసించును.

96. ఈ విధముగ ధర్మజుడు తాను చెప్పింపదలచుకొన్న విషయములన్ని చెప్పి, చివరిగ నీవే దిక్కు, నీకు తోచినటుల చేయుమనుటకూడ లౌక్యములో భాగముగనె కాన్పించును. అంతియెకాదు కౌరవులు శ్రీకృష్ణునికపకారముకూడ తలపెట్టగలరని ముందుగనె ధర్మజుడు ఊహింపగలిగినాడు.

తే.గీ. కుటిలమతులవినీతులు క్రూరకర్ము, లట్టి నీచులకడకునిన్ననుపజాల
నీవుసంకటపడియెదు దేవపదవి, యైననే నొల్లనొంటియందరుగుటుడుగు -ఉద్యోగ-తృ-29

మూలమునగూడ ఈ భావము సూచింపబడినది. కౌరవుల మనస్థత్వమును చూచి, తూచి జరుగనున్న సంఘటనలను ముందుగనె ఊహింపగలుగుటలో ధర్మరాజుదైన రాజకీయానుభవమును ఈ సందర్భము వివరించు నట్టిది. ధర్మజుని మాటలకు శ్రీకృష్ణుడిచ్చిన సమాధానము ధర్మజ హృదయమునకు దర్పణసదృశము.

కం. పనుపుము కౌరవసభకే, జనుటెట్లునుమేలయర్థసంసిద్ధియగున్
మనకొకటంబాపము రా, కునికికిగతమైన పలుకులొండెనుగలుగున్ -ఉద్యోగ-తృ-3

ఈ సందర్భమున మూల వాక్యములిటులున్నవి.

శ్లో. శమంతత్రలభేయంచే ద్యుష్మదర్థమహోపయన్, పుణ్యంమే సుమహద్రాజంశ్చరితం స్యాన్మహోఫలమ్ .

(మీ పని చెడకుండ నేనందు శాంతిని సాధింపగులుగుదునేని రాజా! నా పుణ్యము పండినట్లు గొప్ప ప్రయోజనము సిద్ధించినట్లు)

అనువాదమున మూల భావమునందలి వ్యాస హృదయమును కొంత విపులీకరించినట్లైనది. మూలమందు అర్ధమున కొంత అస్పష్టత యున్నది. శ్రీకృష్ణుడు ధర్మజుని కోర్కె తీర్పగోరుట సమంజసమె. కాని భూభారమడంచుటకై వచ్చిన శ్రీకృష్ణుడు సంధి పొసగజేయుట తన అభిమతమేనను భావమునేల ధ్వనింపజేయును. నిజముగ సంధిపొసగుట తన అదృష్టముగ భావించినాడా? లేదనునది సమాధానము. లోకుల దృష్టిలో ధర్మజుడు సక్రమముగ సంధి ప్రయత్నము గావించినటుల కాన్పింపవలెనన్నది మాత్రమే సంధి ప్రయత్న ప్రయోజనము. అది అనువాదమున స్పష్టపరుపబడినది. ధర్మజునకు అర్ధసిద్ధి ఏర్పడుననియు తమ దోషములేనటుల ప్రజలు భావింపగల్గుటకు తగిన సంభాషణమొనర్చెద ననియు శ్రీకృష్ణుడు వాచ్యముగ అనువాదమున తెల్పియున్నాడు. ఇది వ్యాస హృదయమునకు వ్యాఖ్యానప్రాయమైన అనువాదమై, ధర్మజుని హృదయమును పట్టియిచ్చుచున్నది.

97. ఈ సందర్భమున చిట్టచివరగ శ్రీకృష్ణునితో ధర్మజుడాడిన క్రింది మాటలు, కృష్ణ, ధర్మజుల రాజనీతికి, శ్రీకృష్ణునిదైన ధర్మజ పక్షపాతమునకు మచ్చుతునక.

కం. మమ్మెరుగుదెదిరినెరుగుదు, నెమ్మియెరుగుదర్థసిద్ధినెరియెరుగుదు వా
క్కమ్ముల పద్ధతినెరుగుదు, పొమ్మెవ్వడ నేనునీకు బుద్ధులుచెప్పన్ -ఉద్యోగ-తృతీయ-34

పై ధర్మజుని మాటలలో మూడు విషయములు స్పష్టపరుపబడినవి. స్నేహ బాంధవ్యాదుల తపనలో సంపద త్యాగము కూడదు. అది ధర్మజుని తపన. అందులకే అర్థసిద్ధినెరి యెరుగుదు ననినాడు. అంతవరకు కృష్ణుడు యెన్ని మాటలైనను చెప్పవచ్చును. ఏ మాట వెనుకను అర్థత్యాగము ధ్వనింపరాదు. అదియే దౌత్యమునందలి నేర్పు. కనుకనె వాక్కమ్ముల పద్ధతి నెరుగుదు వనినాడు. అసలేనాడో ధర్మజుని కురుసింహాసనముపై అధిష్ఠింపజేయవలెనని శ్రీకృష్ణుడు భావించినటుల ధర్మజుడు గ్రహించినాడు. కనుకనే పొమ్మెవ్వడ నేనునీకు బుద్ధులుచెప్పన్ అనినాడు. ఈ మాటలలో నీకు చెప్పదగునంతటి వాడనుగానను వినయమున్నది. అటులనే నీవేమి మాటలాడినను నా ప్రయోజనమునే లక్ష్యముగనుంచుకొందువనెడి ధైర్యమును యున్నది. అందు మొదటి అర్థము వ్యంగ్యార్థముకాగ, రెండవ అర్థము జాతీయతను సంతరించుకొన్నది. మొత్తముపై ఈ రాయబార ఘట్టమున ధర్మజుడు తలనెరిసిన లౌకికవేత్తగ దర్శనమిచ్చినాడు. క్షాత్రసంబంధమైన రాజ్యకాంక్షకేగాని త్యాగమునకేమాత్రమును ఈ ఘట్టమవకాశమీయదు.

ఉద్యోగపర్వ చతుర్థాశ్వాసమున శ్రీకృష్ణ రాయబారమైన పిదప శ్రీకృష్ణ సందేశమును విని, ధర్మజుడు యుద్ధమును చేయుటకు నిర్ణయించినాడు. ఈ సందర్భమున పున: బంధువులను చంపెడియూహ కల్గించెడి మనస్థాపమునుకూడ వెల్లడించెను. ఈ ఘట్టము ధర్మజుని మనస్థత్వమును పట్టియిచ్చు ప్రధాన సందర్భములలో మొదటిది. ఈ సందర్భమును స్థూలముగ వివరింతును. పాండవుల పుట్టుకకు పూర్వమే కురుపాండవ యుద్ధము జరుగునని నారదాది మాహర్షులకు తెలియును. అట్టి లక్ష్యముతోడనే శ్రీకృష్ణుడవతరించినాడు. రాయబారమేగుటకు మున్నుగనె పాండవులను యుద్ధమునకు ప్రోత్సహించినట్టివాడు. కురువీరుల మరణానంతరము వారి కాంతలేడ్చు చుండగ, అదిచూచి కలకలనవ్వెడు కాలము వచ్చునని ద్రౌపదినోదార్చినట్టివాడు. భీమార్జున, నకుల సహాదేవులు అదినుండియు యుద్ధము తప్పదని భావించి నట్టివారు. లోకులచే ధృతరాష్ట్రుడు తిట్లుపడువరకే ధర్మజుడు నిరీక్షించును. పిదప యుద్ధమునకు వచ్చునని సంజయ, విదురులెప్పుడో వ్యక్తపరచిరి. అర్జునుని పాశుపతాస్త్ర సంపాదనకు పంపుటలో ధర్మజుడుకూడ యుద్ధమునాశించు చున్నాడని మనమూహించుట కష్టముకాదు. అయినను తనకుతానుగ తన సామర్థ్యముపైనాదారపడి, తన పగతీర్చు కొనుటకై యుద్ధమునకు బయలుదేరుచున్నానని వాచ్యముగ చెప్పకుండుటయే ధర్మజునిలోగల సంయమనముతో గూడిన లౌక్యము. బహుశ: ఈ లక్షణములే తిక్కన దృష్టిలో మెత్తనిపులి లక్షణములు. ఇక ప్రకృతము కురుసభనుండి తిరిగివచ్చిన శ్రీకృష్ణ సందేశమునందలి చివరి పలుకులిట్లున్నవి.

98.వ. కయ్యంబువొడచుంగానియవశ్యంబునురాజ్యంబుపాలిచ్చువాడుకాడుకౌరవులయెడదండంబుదక్కనొండు పాయంబు లేదు మీకుంబోలినతరంగుచేయుండు. -83, అంత సోదరులతో ధర్మజుడిట్లు పల్కినాడు.

కం. కురుసభఁబుట్టినచందము, హరియంతయుఁజెప్పనింకననుమానములే
దరిమర్దనమునకయ్యెడు, వెరవుంజేవయును మెరయవెడలుడుకడకన్ -ఉద్యోగ-చతుర్థ-84

ఇత: పూర్వమే ధృతరాష్ట్ర, దుర్యోధనులు ధర్మజునకు క్రొత్తవారుకారు. అయినను వాచ్యముగనెన్నడును అనుమతినీయలేదు. అట్లనియిపుడు క్రొత్తగ కౌరవుల మనస్థత్వమును తెలుసుకొన్నదియులేదు. అయినను శ్రీకృష్ణనినోట యుద్ధమునకు బయలుదేరుడని యనిపించుకొని, అప్పుడు పసిపిల్లలతో మాటలాడెడు చందమున, సోదరులను యుద్ధమునకు లెమ్మనినాడు. ఇత:పూర్వమే అనేక సందర్భములలో భీమార్జునులు తమ పరాక్రమమును పొగడుకొనుచు ఏ విధముగ కురువీరులను నిర్జింపగలరొ వర్ణించుకొనియున్నారు. ఆ వీరాలాపములన్నింటిని జ్ఞప్తికి దెచ్చుచు వెరవ్రుంజోవయును మెరయవెడలుడుశ్రడశ్రన్ అనినాడు ధర్మజుడు. ఇందు ప్రతిమాటయు జాగ్రత్తగ పరిశీలింప వలసినట్టిదియే.

భీష్మ, ద్రోణాదులన్నచో ధర్మజునికి సింహస్వప్నము. కర్ణుని పేరు చెప్పినచో నిద్రపట్టదని ఒకప్పుడు భీమునికి వాచ్యముగనె చెప్పి యున్నట్టివాడు. సుప్రసిద్ధులైన కౌరవవీరులను పడగొట్టుట తమ శక్తికిమించినదన్న భయము ధర్మజుని సదా వెంటాడుచున్నట్టిది. ఈ సన్నివేశము నాటికిని ఆ భయము పోలేదు. కనుకనె వెరవ్రుతొ యుద్ధమునశ్రు బయలుదేరమనినాడు. అనగ విజయమునకు తోడ్పడగల ఉపాయముల ముందుచూపులతో నడువ వలసినదనినాడు. ఆ మాటలలో భీష్మ, ద్రోణాదుల మరణ రహస్యములు తెలిసినగాని, అస్త్రబలముతో జయింపలేముసుమా!అను ధ్వని యున్నది. భీష్మునితోడి యుద్ధమున భయంకర సందర్భములేర్పడినప్పుడు, ద్రోణుడు తీవ్రముగ విజృంభించినప్పుడు, కర్ణునితోడి యుద్ధ సందర్భమున, చివరకు చివరినాటి యుద్ధవీరుడైన దుర్యోధనుని ఊరుభంగ సందర్భముతోసహా ప్రసిద్ధ వీరులందరి మరణములకు సహకరించుటకు శ్రీకృష్ణుడంగీకరించిననే, యుద్ధమునకు బయలుదేరవలెనన్న సూచనమిందుగలదు. ధర్మసూక్ష్మ విశ్లేషణా పాండిత్యముచే పాండవ యుద్ధధర్మమును పండితులెంతమెచ్చినను, ప్రతి కౌరవ వీరుని జయించు సందర్భమునను పాండవులేదియోనొక అపమార్గమును త్రొక్కినటులె కాన్పించును. బుట్టబొమ్మవలె ఒకనపుంసకుని యెదుటనిడుకొని ఇంద్రుని అర్ధాసనగారవమందిన వీరుడు అర్జునుడు, ప్రాణత్యాగమొనర్చిన భీష్మునితో యుద్ధమొనర్చినాడు. ప్రాణములు విడుచుట వాని ప్రారబ్ధము, పాండవులేమి సేయగలరని పండితులు వ్యాఖ్యానింతురు.

ఇక ద్రోణవధకు ధర్మజుడు పచ్చిబొంకు బొంకినాడన్న విషయమును మాత్రము ధార్మికమేనని విమర్శకులు చెప్పలేక పోవుచున్నారు. ఇక కర్ణుని ప్రక్క శల్యునుంచిన తీరులో ధర్మజ పాత్ర విమర్శకులకు తెలియనదికాదు. ఈ వివరణమునెల్లనిచ్చుట ధర్మజుడు దుష్టుడని చెప్పుటకాదు. ఇచట దుష్టత్వమునకు ప్రసక్తిలేదు. ధర్మజుడు బలహీనుడు, కురువీరుల పరాక్రమమును చూచి సంచరించినట్టివాడు. కాని తన రాజ్యభాగమును వదులుకొను విరాగియును కాదు. ఇక మిగిలిన మార్గము కౌరవులను ఉపాయముచేతనే జయింపవలెననుట. దానినే అవలంబించినాడు ధర్మజుడు. ఆ విషయమునే యిచట వెరవ్రున అను మాటలో సోదరులకు తన హృదయమును వివరించినాడు. ఇంతదనుక అవకాశము వచ్చునపుడెల్ల శత్రువులను నిర్జింపగల శక్తి తమవద్దగలదని భీమార్జునులు ధర్మజునికి చెప్పుచుండుట పరిపాటి. కాని వారి శక్తిపై కూడ, కురువీరుల శక్తితో పోల్చినపుడు ధర్మజునికేమూలనో సందేహము లేకపోలేదు.

శ్రీకృష్ణ సహాయము లేనిచో కేవలము అర్జునుని పరాక్రమముతో పాండవులు విజయమును సాధింపజాలరన్న విషయము లోకవిదితము. ధర్మజుడేకాదు, మహాభారతకథలో ప్రసక్తింపబడిన లోకజ్ఞులనేకులు ఈ భావమును వెలిబుచ్చుట భారతమున మనము చూడగలము.

భీష్మాది కురువృద్ధులుకూడ పాండవుల పరాక్రమమునకంటే, వారికి లభించిన శ్రీకృష్ణ సహాయమునే అధికముగ ప్రసంగించుట జరిగినది. ఇట్టి భావము దృష్టినిడుకొనియె, ఈ సందర్భమున ధర్మజుడు, భీమార్జునులను జూచి 'మీ చేవ ఎంత పాటిదియో' ప్రదర్శింపుడనినాడు. వెరవు లేనినాడు, వారి పరాక్రమము చాలదన్న ధ్వని ఈ 'చేవ' యన్న మాటలో గర్భితము.

99. ఇంతవరకు శ్రీకృష్ణుడు నూటికినూరుపాళ్ళు బాధ్యత వహింపలేదు. దుర్యోధనుడు మీకు రాజ్యమీయడు అని మాత్రము స్పష్టపరచినాడు. మీకు తోచినది చేయుడనినాడు. అందు మీరు యుద్ధమునకు బయలుదేరుడను భావము వాచ్యము కాలేదు. అందువలన మీకుపాలైన తెరంగు చేయుడనినాడేగాని, మీరిటుల చేయుడని మార్గము సూచింపలేదు. అందుచే భవిష్యమున తానెన్నుకొన్న మార్గమునకు తానే బాధ్యత వహింపవలసి యుండును. అందుచే లౌక్యుడైన ధర్మజుడు సోదరులను యుద్ధమునకు సిద్ధముకమ్మని చెప్పుచు, కురువంశీయులను చంపుటకు తన మనసు ఒప్పుకొనదని, శ్రీకృష్ణునితో దీనముగ పల్కినాడు. కృష్ణునినుండి రాగల సమాధానము ధర్మజునికి తెలియును. అయినను శ్రీకృష్ణునిచేనిటుల చేయుమని అనిపించుకొనవలయును. అప్పుడే యుద్ధబాధ్యతను శ్రీకృష్ణ భుజస్కంధములపైనుంచగలడు.

100. ఈ సందర్భమున శ్రీకృష్ణుడుకూడ అంత తేలికగ పట్టుబడడు. ధర్మజుని హృదయములో భయము వాచ్యముగ బయల్పడిన గాని తానభయమిచ్చుటకు సన్నద్ధముగ లేడు. అందుచే పూర్వము చెప్పినటులనే, దుర్యోధనుడు యుద్ధమునకు తప్ప యితరములకు లొంగడని, సంధి మాత్రము పొసగదని చెప్పునేకాని అభయపూర్వకమైన యుద్ధోత్సాహమును కల్పింపలేదు. అంత ధర్మజుడు సోదరుల అభిప్రాయములనడిగినాడు. వారు పూర్వమువలెనె యుద్ధమునకు ప్రోత్సహించిరి. అపుడు ధర్మజుడిటుల పలికినాడు.

ఆ.వె. అనిననట్లకాక యఖిలధర్మజ్ఞాన, ఘనుడు మనకు నేడుగడయుదాన
శౌరినిశ్చయింప సంశయంబేటికి, సంఘటింపుడుగ్ర సమరవిధము -ఉద్యోగ-చతుర్థ-93

పై మాటలు స్పష్టము. తనకు శ్రీకృష్ణుడే దిక్కనియు, అతడు చెప్పుటచేతనే యుద్ధమునకు సిద్ధపడుచున్నా ననియు స్పష్టపరచినాడు. ఈ మాటలు వినిన కృష్ణుడు కాదనక మిన్నకుండినచో, తన బాధ్యతనాతడు స్వీకరించినట్లే యగును. నిజమునకట్లు వాచ్యముగ కోరినచో శ్రీకృష్ణుడంగీకరించునన్న విషయముకూడ మనకు తెలియును. ఇటుల యుద్ధారంభవేళ లౌక్యముతో తనబలహీనతను కప్పుకొనుచు, చివరకు కురువీరులను చంపు బాధ్యతను, శ్రీకృష్ణునిచే అంగీకరింపజేసి, ధర్మజుడు యుద్ధమునకు సిద్ధపడెను.

==========

యుద్ధ పంచకము – ధర్మజపాత్ర

భీష్మపర్వము – ధర్మజపాత్ర

మహాభారతమున ఏ పర్వమును గ్రహించినను అందలి వివిధ రంగములకు సంబంధించిన సూక్ష్మ విషయములు సంప్రదాయజ్ఞులకే తప్ప సామాన్యులకవగాహనకందునట్టివికావని పూర్వ పుటలలో చెప్పియుంటిని. అటులనే యుద్ధ పర్వములను చదువునపుడు ఆధునిక చలన చిత్రములందు దొమ్మి యుద్ధములను చూచి బాలురు పొందెడి అనుభూతి వంటి దానిని భారత పాఠకులుకూడ పొందెదరు. ఇట్టి అనుభూతి పొందువారి శాతమే అధికము. అంతియె తప్ప పదునెనిమిది దినముల మహాసంగ్రామములో ప్రదర్శితమైన యుద్ధశాస్త్ర సంబంధిత విషయములను గూర్చి పరిశీలించువారి సంఖ్య అల్పము. పరిశీలించిన వారిలో ఎందరు అనాటి యుద్ధసంబంధిత విషయములు గ్రహింపగలరో చెప్పుట కష్టము. ప్రకృతమైన భారతకథ నేటికి సుమారు ఐదువేల సంవత్సరములకు పూర్వము జరిగినిట్టిదిగ భావింపబడుచున్నది. అప్పటి యుద్ధముల తీరెట్టిదియొ విరించెడి శాస్త్రమొద్దియొ లభించినటుల నేను వినియుండలేదు. ఆ శాస్త్రములను చూచువరకు, భారత యుద్ధమును ప్రశంసించుట, కవిత్రయమువారి వీరరసోచిత వర్ణనానైపుణ్యము కారణముచేతనేనని చెప్పవలసియున్నది.

యుద్ధ సంబంధమైన విధానములు, ధర్మసూక్ష్ములు తెలియకపోయినను, వర్ణితమైన కథాభాగమునుబట్టి కొందరు పరాక్రమశాలురుగ, కొందరు సామాన్యులుగ కాన్పింతురు. అట్లని సైన్యాధిపతులు, చక్రవర్తి తదితర మహారథులు ఎవరెవరు యెటులెటుల ప్రవర్తించిరో చెప్పగలమే కాని అటులప్రవర్తించుటయే యుద్ధశాస్త్ర ధర్మమని చెప్పజాలము.

పై వివరణ సారాంశము ప్రకృతమునకు వలసినంత వరకు వివరింతును. పాండవ సైన్యమునకు ధర్మజుడు ప్రభువు. ధృష్టద్యుమ్నుడు సైన్యాధిపతి. అర్జునాదులు మహారథులు, మిగిలిన వారు విభిన్న తెగలకు చెందినట్టివారు. అవగాహనకై భీష్మునితోడి పదిదినములు యుద్ధము ఒకభాగముగ, ద్రోణునితోడ ఐదుదినముల యుద్ధము ఒకభాగముగ, మిగిలిన యుద్ధభాగమును ఒక భాగముగచేసి చూచుట సమంజసము. భీష్మునితోడి పదిదినముల యుద్ధములో మన ప్రకృత నాయకుడైన ధర్మజుని యుద్ధ పరాక్రమము గమనించుటకు ప్రయత్నించినచో సరియగు సమాధానము దొరుకుట కష్టము. ఈ పదిదినములలో ధర్మజుడు భీష్మునితోడను, శల్యునితోడను కావించిన సమరము మాత్రమే ప్రత్యేకముగ వర్ణింపబడినది. స్థూలదృష్టికి అర్జునుని తోడనేకాదు, భీమునితోకూడ ధర్మజుడు సాటిరాడని యనిపించును.

కాని మరియొక విషయము గమనింపవలసి యున్నది. పదిదినముల యుద్ధములందున కొన్నివ్యూహములను అర్జునుడు సూచింపగ, కొన్నిటిని స్వయముగ ధర్మజుడే సూచించినటుల కలదు. రెండవనాటి యుద్ధమున క్రౌంచనామక వ్యూహము తగునని ధర్మజుడు ధృష్టద్యుమ్ననకు సూచించినాడు. సైన్యమధ్యమున ధర్మతనయుండు ధృష్టద్యుమ్నుం గలిబిగొని వెన్నుదన్ని నిల్చె అని చెప్పబడినది. మూడవరోజు యుద్ధమున అర్ధేందువ్యూహము అర్జునునిచే సూచింపబడినది. యుధిష్ఠిరుండు శుండాల మాలికాభిలంబుగ మధ్యప్రదేశంబలంకరించె అని చెప్పబడినది. పంచమదివస యుద్ధమున పాండవులు శ్యేన వ్యూహముగ మోహరించిరనియు, అందు పుచ్ఛంబున నకులసహదేవ సహితుండయి యుధిష్ఠిరుండు నిలచినటుల చెప్పబడినది. ఆరవరోజు యుద్ధమున మకర వ్యూహము అర్జునునిచే సూచింపబడినది. అందు సాత్యకి

సహితుండుయి యుధిష్ఠిరుండు కంఠ ప్రదేశమున నిలిచినటుల చెప్పబడినది. సప్తమదివస యుద్ధమున వజ్రవ్యూహమును కల్పింపమని ధర్మజుడే సూచించినటుల గలదు. ఎనిమిదవనాటి యుద్ధమున శృంగాటక వ్యూహంబును ధర్మజుడే సూచించినాడు. నవమ దివసమున దళాకారముగ మోహరింపుమని అర్జునుడు సూచించుటగలదు. నకుల సహదేవ ద్రౌపదేయ పురస్సరుండైన యుధిష్ఠిరుండు నడుమ ప్రదేశమున ఆ వ్యూహమున నిలిచినటుల గలదు. దశమ దివస వ్యూహమున నడుమనో కొంచెము వెనుకగనో నిలిచినటుల తెలియుచున్నది.

మొత్తముపై పై వివరణము చూచినపుడు ఒక విషయము స్పష్టమగును. నాడు యుద్ధవిద్యలు ప్రచారమున నుండెడివి. అందుకు సంబంధించిన శాస్త్రములు ఉండియుండును. ఆ వ్యూహ రచనములందు ధర్మజుడు సమర్థుడుగా కాన్పించుచున్నాడు. పూర్వవాక్యములలో చెప్పినటుల రాజు, సైన్యాధిపతి, ఇతర రధికులు యుద్ధమున నిలిచినప్పుడుఏ ఏ వ్యూహములందు, సమస్త యుద్ధ ప్రయోజనమును పొందవలసిన రాజు, ఎచట నిలువవలయునో అది నాటియుద్ధ సంప్రదాయము తెలిసినగాని చెప్పజాలము. వ్యూహ నిర్మాణ చతురుడైన యుధిష్ఠిరుండు ప్రభువు నిలిచియుండవలసిన స్థానముననే నిలిచియుండును. ఎవరెందరితో యుద్ధము చేసిరనునది సామాన్యుని లెక్కకాగా మొత్తము వ్యూహము నడిపించుట ప్రభువు లక్ష్యముకదా! కనుకనే భీష్మపర్వమున ఎందరి వీరులతో ధర్మజుడు తలపడెననుటకన్న ఆ యుద్ధ వ్యూహములను నడిపించుటలో ఎంతపాటి మెలుకువను చూపగలిగినాడనునదే ప్రధానము. కాని ఈ ప్రశ్నను సమాధానించుటకు కావలసిన శాస్త్రాధారములు నేడలభ్యము, అందుచే అవకాశమున్నంతలో ధర్మజ పరాక్రమము, గుణసంపత్తిని విశదపర్చు సందర్భములను మాత్రమే భీష్మపర్వమున స్పృశింతును.

101. భీష్మపర్వ ప్రారంభమున ధర్మజప్రవేశము యుద్ధమునకు తరలివెళ్లుచు కాన్పించును. పాండవవీరులు వారివారి ఆయుధములతో అలంకృతులై యుద్ధభూమియగు కురుక్షేత్రమున అడుగిడిన సమయమున తమ వీరులందరిని కనుకొని ధర్మజుండు 'మనమీ రణంబునందు ధరణీరాజ్యంబు వడసెదమొండెఁ బూజ్యంబగు నాకలోక నివాసంబు గనియెదమొండెనని' నిశ్చయమును తెలిపెను. – భీష్మ – ప్రథమ – **122**

పై విధముగ పల్కుటలో ధర్మజుని క్షాత్రము బయల్పడుచున్నది. రాజు యుద్ధభూమిలో అడుగిడిన తదుపరి తీసుకొను ప్రప్రథమ నిర్ణయమిదియే. కారణము జయాపజయములు దైవాధీనములు కావున గెలిచినచో ధరణీ రాజ్యమును పొందెదము, లేనిచో నాకరాజ్యమును పొందెదమనుట సామాన్యుల విషయము. కాని ధర్మజుని పక్షమున ఇది కించిత్తు విశేషముగనుండును. యుద్ధమున తమకు జయము తప్పక కల్గునను నమ్మకము ధర్మజుని హృదయమందు కలదు. దైవదత్తమైన శస్త్రాస్త్రములను సంపాదించి, కౌరవసేనంతటను అహర్నిశలు ఔపోసనపట్టిన ధర్మజుడు కృత నిశ్చయుడై కదనరంగమున కాలిడినాడు, కాని కౌరవసైన్యంబునకు పెద్దదిక్కు, సేనా నాయకత్వము నిర్వహించుచున్న భీష్మునికనుగొని ఆలోచనామగ్నుడైన ధర్మజునకు, అర్జునుడు సమరోత్సాహుని జేయుటకుద్యమించి యిట్లుపల్కెను.

చం. మునివరుఁడైననారదుఁడు మున్నొకయప్పుడుసెప్పె ధర్మనా
శనులగువారలంబ్రబలసైన్యము గల్గెనయేనిఁగొంచమై
ననురిపుసేనగెల్చుననినాకు గురుండునుదేవతానదీ
తనయుఁడునేర్పడన్వినఁగఁగాను బరాశరసూనుఁడుంగృపన్–భీష్మ– ప్రథమ – **127**

నారదుడు, భీష్ముడు, వ్యాసుడు మొదలగువారు చెప్పిన ప్రకారము ధర్మనాశకులకు ఎంత బలమున్నను, ధర్మరక్షకులల్పసంఖ్యాకులైనను, ధర్మమునకే జయము నిశ్చయమనిరి. కావున కదనమునకుద్యోగింపుమనెను.అంతటితో ధర్మరాజు తన ఆలోచనలకు స్వస్తిచెప్పి కార్యాచరణమునకు పూనుకొని కౌరవ వ్యూహమునకు ధీటుగ ఒక వ్యూహము పన్నుమని ఆనతిచ్చెను. పై చెప్పిన నీతులు ధర్మజునకు తెలియకకాదు. కాని తనతో వచ్చిన అనుజుల, ఆత్మబంధువుల మానసములను తెలిసినకొనుటకట్లు ప్రవర్తించినాడని భావింపవలయును. యుద్ధారంభమునకు సూచనగ కృష్ణార్జునులు పాంచజన్య, దేవదత్తములను పూరించిరి.

102. అంత ధర్మజుడు తన ఆయుధములన్నింటిని రథమునందే దిగవిడచి పాదచారుడై భీష్ముని సన్నిధికింజని అతనికి ప్రణమిల్లి అతనితోనిట్లనియె.

ఆ. అనఘునీకెదిర్చి యనిసేయువాఁడనై, మున్ననుజ్ఞగొనఁగనిన్నుఁగాన

నెమ్మివచ్చినాఁడ నీచేతదీవన, వడసిచనిన నేనుబగఱగెలుతు-భీష్మ-ప్రథమ-**156.** ఇది యథామూలము

మహాత్ములైన మిమ్మెదిర్చి యుద్ధము చేయువారలము. గావున ముందుగ మీయనుజ్ఞ వడయుటకై **యిట్లు వచ్చితిని.** మీ దీవెన వడసినచో గెలుపునిశ్చయమని పలుకుటలో ధర్మరాజు లౌక్యమునకు, గురుభక్తి, పితామహభక్తిని **జోడించినాడు. అట్లు చేయుటవలన ధర్మజునకుగల్గు లాభములనేకములు. ప్రకృతముగ భీష్ముడు కౌరవుల పక్షమున యుద్ధమునకు నాయకత్వము వహించుచున్నప్పటికి, పాండవేయులపై తనకుగల అభిమానము చెక్కుచెదరనిది. అది ధర్మజునకు తెలియును. అతనియెడల తమభక్తి భావములు చూపించి, అతనిని లోబరచుకొనినచో యుద్ధమున గెలుపుతథ్యము. భీష్ముడు కదనరంగమున నిల్చియున్నంతవరకు అతనిని గెల్చుట శంకరునికైన శంకయే. కావున అట్టి పితామహుని వశపర్చుకొనవలెనన్న భక్తి, వినయము అను రెండస్త్రములను సంధింపవలెను. తమకు, కౌరవుల సరిహద్దుకు మధ్యగలవారధి భీష్ముడు. ఆ వారధిని తమవైన గుణములతో జయించినచో హద్దులుకలిపి వేసుకొనవచ్చును. గావున ధర్మజుడు మున్ముందుగ వినయాస్త్రము సంధించుచు, దీవెనయిమ్మని అడుగుచు,** ఆ దీవెన ప్రయోజనమును కూడ తానే చెప్పుట రాజనీతికి దర్పణము.

రాజ్యమును రక్షింతునని భీష్ముడు తండ్రియైన శంతనునకు మాటనిచ్చియున్నాడు. అనంతరము సోదర ద్వయము మరణించినది. పిదప పాండురాజు కురురాజ్యమును విశాలమొనర్చినాడు. అట్టితరి అగ్రజుడనెడి కారణము ధృతరాష్ట్రుని సింహాసనముపై కూర్చుండబెట్టుట జరిగినది. నిజము చెప్పవలెనన్న ధృతరాష్ట్ర పట్టాభిషేకము నాటినుండి యుద్ధము నాటివరకు కురురాజ్యమునకు సమర్థుడైన రాజులేని పరిస్థితి సంభవించినది. ఇంతవరకును వృద్ధుడైన భీష్ముడే రాజ్యావసరములను చూచుచున్నాడు. ఇంతవరకు దేశభక్తి, బంధుప్రీతి కారణముగ రాజ్యవ్యవహారములను భీష్ముడు చక్కబెట్టగలిగినాడు. ఇంతలో దేశభక్తి, వంశరక్షణమను రెండింటిస్థానమున రాజ్యాంగపు హక్కులు, దురాశ అనునవి చోటుచేసుకొన్నవి. ధృతరాష్ట్రుడు రాజైన కారణముగ రాజ్యము తనకు చెందవలెనని దుర్యోధనుని భావన. బంధువులైనను, లోకమున తనకీర్తిని తగ్గించువారగుటచే పాండవులను నాశన మొనర్చవలెనన్నది వాని ఆశయము. ఈరకముగ కురురాజ్య, కురువంశ రక్షణములనెడి భీష్ముని లక్ష్యము దెబ్బతినినది.

ఇందుకు తోడు మరికొన్ని ప్రధాన విషయములు తలయెత్తినవి. ద్యూతసంరంభమునకు ఆరంభ కారణములు యెట్టివైనను అంత్యమున దుర్యోధనుడు నీతిబాహ్యుడుగ దేశఖ్యాతినందినాడు. అంతియేకాదు. అచిరకాలములో కలిప్రవేశము కానున్నదన్న సత్యమును త్రికాలవేత్తలైన నారదాదులవలన భీష్ముడు గ్రహించుయున్నాడు.

ఈ పరిస్థితులలో తానేమి చేయగలడు? అనునది వాని యెదుటనున్న ప్రశ్నము. క్షాత్రవంశ సంజాతుడైన భీష్ముడు రాజశాసనములను, సంప్రదాయములను ధిక్కరింపజాలడు, అట్లని సర్వరాజలోక సమక్షమున తన్ను, ద్రోణాది ఆచార్యులను, విదురాది నీతిపరులను, నారదాది మహర్షులను యెవ్వరిని కూడ లెక్కింపని దుర్యోధనుని హస్తమున కురువంశశ్రేయము నిడజాలడు. ఇంతలో దుర్యోధనునిలోని కల్యంశ కారణమున యుద్ధమాసన్నమైనది. ఇందు తన మేధాసంపన్నత వృద్ధతరమువారి పరాక్రమము, ధర్మక్షతి వాడబడనిచో ఈ విశాల భారతమున కురువంశ చరిత్ర ముగుసినట్లుగా భావింపకతప్పదు. దీనిని రక్షింపవలెనన్నచో ఒక్కటియె మార్గము. దుష్టశిక్షణమును కొంతమేర కావించినను, ధర్మరక్షణమునకై వృద్ధతరము ఆత్మాహుతి కావించుకొనకతప్పదు. ఈ ఆత్మాహుతి క్షత్రియోచితము, ధర్మబద్ధముగ జరుగవలసియున్నది. అందుకు భీష్ముడు సమయమునకై నిరీక్షించుచున్నాడు. ఇదియెల్ల మేధాసంపన్నుడైన ధర్మజుడు పరిశీలించు చున్నాడు. త్రికాలవేత్తలైన శ్రీకృష్ణాదుల ఉపదేశములనుకూడ ధర్మజునకి వాస్తవము అవగత మగుటకు తోడ్పడి యుండును. దాని ప్రభావమే యుద్ధారంభమున ధర్మజుడు భీష్ముని సమీపించుట. ఇచట మరికొన్ని ప్రధాన విషయములు చూచినగాని ఈ సందర్భమునందలి ధర్మజ హృదయమును గ్రహింపజాలము. కౌరవసైన్యమందలి ప్రధానులెల్లరును ధర్మజునికి సుపరిచితులు. అందు అనుభవజ్ఞుడైన భీష్మునిచే అతిరథ, మహారథులుగ లెక్కింపబడెడివారే ఆ సైన్యమునకు ఆయువు పట్టులని ధర్మజునకు కూడ తెలియును. భీష్ముడు, ద్రోణుడు, శల్యుడు, దుర్యోధనుడు, అశ్వాత్థామ, కృపాచార్యుడు మాత్రమే కురువంశ సన్నిహితులలో సమర్థులుగ గణింపబడినట్టివారు. కృపాశ్వత్థామలు ద్రోణుని అభిప్రాయమును వ్యతిరేకింపరని వేరుగ చెప్పబనిలేదు. అందుచే భీష్మ,ద్రోణ, శల్యులను ప్రీతులను గావించినచో సహజముగ ధర్మపక్షపాతులు, దుర్యోధనుని మెచ్చనివారును అగుటచే దూరదృష్టితో తనకు సహకరింతురన్న నమ్మకము ధర్మజునకు కలదు. అందుచే ఉభయసైన్యములు యుద్ధ సన్నద్ధముగనుండగా, సర్వరాజలోకముయెదుట పాదచారియై, ముకులితహస్తుడై, భక్తి వినయములతో ధర్మజుడు భీష్మ, ద్రోణ, శల్యులను సమీపించి భక్తిపూర్వక ప్రణామములాచరించి యుద్ధమునకు అనుమతిని గ్రహించినాడు.

103. భీష్ముడు పితామహుడు. గురు, కృపులు పితృతుల్యులు, గురుపుత్రుడుకూడ పూజనీయుడే. తాత్కాలికము, రాజ్యాంగపరమునైన హక్కులను పురస్కరించుకొని తండ్రిని వధించుటకు సిద్ధపడుట యెట్టిదియో, భీష్మ, ద్రోణ, కృపాదులపై అస్త్రప్రయోగమొనర్చుటకు సిద్ధపడుటయునట్టిదియే. తండ్రి యుద్ధమునకు రాకూడదు. వచ్చెనా! తన్ను చంపుమని పుత్రునాదేశింపవలెను. కాని నాడు తండ్రిపై ఆయుధమును ప్రయోగించుట పాపహేతువని వేదవేత్తలు భావింతురు. కనుకనే భీష్మ ద్రోణాదులు ధర్మరక్షణకై ఆత్మార్పణములొనర్చుకొనుటకు యిచ్ఛాపూర్వకముగా సిద్ధపడిననే కాని వారిపై యుద్ధమునకు ధర్మజుడు ముందంజ వేయరాదు. కనుకనే తన్ను సమీపించి యుద్ధానుమతిని కోరిన ధర్మజునితో భీష్ముడిటుల పలికినాడు.

సీ. అనవిని గాంగేయుడక్కట నీవిట్లు, సనుదేకతక్కినశాపమిత్తు
వచ్చితి మేలయ్యెవైరులనిర్జంపు, మిదిగాకయును వరమెద్దియైన
నడుగుము నీకుఁగానని సేయుటొక్కటి, దక్కంగనావుడుధర్మసుతుఁడు
రారాజుపక్షమైరణముసేయుమునాకు, హితమగుకార్యంబుమతిఁదలంపు

ఆ. మనుడునట్లకాక యటనీతలంపేమి, యనినభీష్ముతోడనతఁడునిన్నుఁ
బోరగెలుచువిధము బోధింపుమనుటయు, సస్మితాస్యుఁడగుచు శాంతనపుఁడు-భీష్మ-ప్ర-157,
ఇది యథామూలము.

ఇందు భీష్ముడు ధర్మజుడు తనవద్దకు రాక యుద్ధమారంభించినచో శపించియుండెడి వాడనని పల్కుట గమనార్హము. యుద్ధమున ఇరుపక్షములవారును పరస్పరము శతృపక్షములుగ భావింపబడునుగదా! అట్టితరిధర్మజుని శపింప అవసరమేమి వచ్చినది? అదియె ఇచటి ధర్మసూక్ష్మము. ధర్మజునకు భీష్ముడు పితామహుడు. ద్రోణుడు పితృతుల్యుడు. అనుభవశాలియైన ధర్మజుడు ఆ సత్యమును గ్రహించియె భీష్మ, ద్రోణాదుల అనుమతి గ్రహింప వచ్చెనని పూర్వపుటలలో వివరించియుంటిని. ఇది ధర్మజుని లోకజ్ఞతకు నిదర్శనము. ధర్మమును, సంస్కృతీ సంప్రదాయ మునుకూడ పాటింపు వారలగుటచేతనే భవిష్యమున కురురాజ్యమును ధర్మజ భుజస్కంధములపై నిలుపుట శ్రేయమని భీష్మాదులుభావించిరి. కనుకనే వారి మృత్యురహస్యములను తగినవేళ ధర్మజునకుతెల్పుట జరిగినది.

104. ప్రథమదివస యుద్ధారంభమున భీష్ముని శంఖనాదముతో సైన్యము ముందుకురికినది. అట్టి సమయమున దుర్యోధనుడున్మాదియై పాండవ సైన్యములను తరుమనారంభించెను. ధర్మజుడకూడ వెనుకకు జంకుచున్న తమ సైన్యమునకు ఉత్సాహపూరితమైన జయాస్పదమగు వచనములతో వారిని పురికొల్పుచు ముందుకుదూకెను. ఈ విధముగ కురువీరులలో ముఖ్యులు, పాండవానుజులను ఎదుర్కొనదొడగిరి. అట్టితరి ధర్మజుడు శల్యునకెదురునిల్చెను. అంత శల్యుడు ధర్మజుని చాపమును తృంచెను. వెనువెంటనే ధర్మజుడు మరియొక చాపమును గైకొని శతాస్త్రములు శల్యునిపై గుప్పించెను. తదుపరి మధ్యాహ్నంబున భీష్ముడు మార్తాండునివలె పాండవ సైన్యముపై తీవ్రశరవర్షమును గుప్పించెను. ఈ విధముగ ప్రథమ దివసమునసేసిన యుద్ధమునకు ధర్మరాజు, అనుజులు, పాండవ పక్షమువారును హడలిపోయిరి. వెనువెంటనే ధర్మజుడు దీర్ఘాలోచనాపరుడై అనుజులతోగలసి కృష్ణుని పాలికింపోయి అతనిని వ్యంగ్యముగ ఎత్తిపొడుచుచు ధర్మజుడిట్లనియె. ఎరుగని కార్చిచ్చు అడవినంతటిని దహించు విధముగ భీష్ముడు పాండవ సమూహములను కాల్చుచుండెను. అట్టితరి "నీలమేఘమును బిరుదు నీకేల" అని పల్కుట గమనింపవలసి యున్నది. నీలమేఘుడగు శ్రీకృష్ణుడు తమను యెల్లవేళల రక్షించెదనని అభయమిచ్చిన తరువాతనె ధర్మజుడు యుద్ధమునకు పూనుకొనినాడు. కాని నేటిస్థితిలో అతడాదుకొనక పోవుట గమనార్హము. అందువలనే లోకములో అందరి విధముగనే మహాత్ముడైన భీష్ముని విషయమై దిగులు చెందలేదు. కాని నేడిట్టి యుద్ధముచూసి బేలనైనాను. నిన్ను నమ్ముకొనిన నీ మరుదలందరిన్ని ఏ విధముగా శరతాన పీడితులం జేసినాడో చూడుము, మరియు అర్జునుడు కూడ ఉపేక్షించుచుయుండెను. భీముడు మాత్రము ధైర్యముచేసినను, నిలువజాలకపోయెను. గావున "రథముక్కంటి గయ్యపుజోలిమానెదన్"అనుటలో ధర్మజుని ఆవేదన వ్యక్తమగుచున్నది. నువ్వు రథముపైనుండగనే అర్జునుడు భీష్ముని ఎదిరించలేకపోయెను గదా! ఇకపై అతనితోనెట్లుపోరెదము. శ్రీకృష్ణుని సహాయ, సహకారములుండుననే ధర్మజుడిట్టి సాహస కార్యమునకు పూని, మహారధులైన భీష్మాదుల నెదుర్కొనుటకు సిద్ధమయ్యెను. కాని నేడు కృష్ణుడుపేక్షించుటవలన తనకెందుకీ వృధాప్రయాస. కావున కయ్యపుజోలికి మరివెళ్లనను నిశ్చయమునకు వచ్చుట, శ్రీకృష్ణునకు తన మనోవేదన తెలియజేయుటకుమాత్రమే ధర్మజుడు పల్కినట్టిది. మరియు నరపతులందరిని భీష్మునికి ఎరగా పెట్టుటకంటె 'నేను అడవులకు తిరిగిపోయి ఏవియో ఆకులు, అలములు తినుచు తిరిగెదనని' శ్రీకృష్ణునకు తన అసహాయస్థితిని తెల్పుట, అతని కరుణకు పాత్రమగుటకు నుడివిన లౌక్యపు మాటలు. మరియు శ్రీకృష్ణునితోనిట్లు పల్కెను. ఇది యథామూలము.

కం. నీమాటమెయిన చేయుదు, మేమెయ్యదియైననెందునెప్పుడుమాకున్
దామోదర! యశుభస్థితి, లేమిశుభముకలిమి నీదులీలయ కాదే!-భీష్మ-ద్వితీయ-9

మేము యేమిచేసినప్పటికిని నీ మాటతోనే చేయుదుము. యశుభస్థితి, లేమిశుభముకలిమి నీదులీలయకాదే! అని ధర్మజుడనుటలో చతురత కన్పించుచున్నది. అనగా సంధికోరి వెళ్లునప్పుడు నీ యిష్ట ప్రకారమే గావించుమని ధర్మరాజు కృష్ణునిపైనే భారముంచి తాను నిమిత్తమాత్రుడను భావన కల్గించినాడు.

శ్రీకృష్ణుని నమ్ముకొనే యుద్ధమునకు సన్నద్ధుడైనాడు. ఎట్టి పరిస్థితులలోను శ్రీకృష్ణుడు తమను విడచిపుచ్చుడని మరియు తమ మధ్యగల బాంధవ్యమును ఏమరక తమకు శుభము కల్గించుటకు ప్రయత్నించెదడని, తమరాజ్యమును తమకిప్పింపగల సామర్థ్యము అతనికి మాత్రమే గలదని ధర్మజునకు తెలియును. కావుననే యిదియంతయు నీలీలాదే అని ఎదురు ప్రశ్నించుచు తమకు శుభము చేకూర్చుమని ధర్మజుని అభ్యర్థనగ కన్పించుచున్నది. వెంటనే శ్రీకృష్ణుడు ధర్మజునితో మదిలో చింతవమ్మాను నేను, శిఖండి భీష్మునెదిర్చి, కౌరవ ముఖ్యులను సంహారమొనరింతుము. మరియు సాత్యకి, ద్రుపద, మత్స్యరాజాధిపతులు నీకు సంపదకట్టబెట్టవలెనని ప్రాణములనుసైతము పణముగ పెట్టిరి. కావున వేయేల! నీవు నిశ్చలముగనుండుమని ధైర్యవచనములు పల్కినాడు. నిజమునకిదియే శ్రీకృష్ణునినుండి ధర్మజుడా శించుచున్నది. వెంటనే ధృష్టద్యుమ్నుని క్రౌంచవ్యూహము పన్నమని చెప్పెను. ఆ వ్యూహమునకు ధర్మజుడే వెన్నెముకగ నిలిచి ద్వితీయదివస యుద్ధమునకు సిద్ధమయ్యెను.

ధర్మరాజు ద్వితీయదివస యుద్ధమున భీష్మునితో తలపడిన అనుజులను, సైన్యమును ఉత్సాహపరచుచు యుద్ధపర్యవేక్షణ గావించి, సాయంసమయమగుటచే సేనలనువారించి నిజస్థలములకేగ నియోగించెను. తృతీయ దివస యుద్ధమునకు భీష్ముడు గరుడవ్యూహమును పన్నుటచూచి, తమసేనాపతియైన ధృష్టద్యుమ్నుని అర్జునుడు అర్ధచంద్రాకారముగ కురుసైన్యమును కప్పవలెనని పలికిన, దానికి ధర్మరాజు ధృష్టద్యుమ్నుని ముందునిడుకొని గొలుసుకట్టవలెనుండి ఇరుసైన్యముల పోరునకు సిద్ధమయ్యెను. నాల్గవదివస యుద్ధమున ఘటోత్కచుడు మాయాబల మునుపయోగించుచు భీష్మానువర్తులైన కురుసైన్యమును చెల్లాచెదురు చేయుటచే, భీష్ముడుగ్రుండై విజృంభించిన, ఘటోత్కచునకండగ ధర్మజాది పాండవ ప్రముఖులు నిలబడిరి. భీష్ముని పంచమదివస సంగ్రామమున కౌరవులను మకరవ్యూహముగనమర్చుట గనుకొని, పాండవులు శ్యేనవ్యూహమునమర్చుకొని, అందు పుచ్ఛమున నకుల సహదేవ సహితుండై యుధిష్ఠిరుండు నిలచి ఇరుపక్షముల వారును కలసిపోరిరి. ఇట్టి యుద్ధమున ధర్మరాజు మద్రాధిపతియైన శల్యునితో పోరెను. ఆరవదివస యుద్ధమున పాండువులు మకరవ్యూహమును పన్నిరి. అందు సాత్యకీ సహితుడై ధర్మజుడు కంఠమున నిలిచి కురుసేనలతో కలియబడెను.

105. భీష్ముడు సప్తమదివస రణమున కౌరవసేనను మండలవ్యూహముగనమర్చెను. అదిగని ధర్మజుడు వజ్ర వ్యూహంబుపన్నుమని సేనాపతియగు ధృష్టద్యుమ్ననికి నివేదించెను. యుద్ధమున ధర్మజుడు శ్రుతాయువుతో తలపడెను. అతనిపై తొమ్మిది శరములు గుప్పించెను. వాటిని తప్పించుకొని శ్రుతాయువు శరసప్తకము ధర్మజునిపై ప్రయోగించగ, అవి శరీరమున గ్రుచ్చుటచే కోపించి, ధర్మజుడు వరాహకర్ణమార్గమున వాని వక్షస్థలమున అమ్ములునాటెను.

ఉ. వెండియునేడు బాణములువేతొడి ధర్మజునొవ్వనేయనా
తండుమహోగ్రకోపమునఁదత్తురగంబులఁజంపితద్ధను
ర్దండముఁద్రుంచి తత్తనువురక్తమయంబుగఁజేయవాఁడుభీ
తుండయిపాఱెనీబలముదూలఁగనబ్బలముబ్బిక్రాలఁగన్-భీష్మ-తృ-40 - ఇది యథామూలము.

అంతనాతడు మరల శరసప్తకము ధర్మజునిపైవేసెను. అంత ధర్మజుడునొచ్చి మహోగ్రమైన కోపముతో అతని రథాశ్వములను జంపి, విల్లునుత్రుంచి, శరీరమంతయు రక్తసిక్తముగావించిన, అతడు భయముతో పారిపోయెను.

106. తదుపరి ధర్మజుడు తన్ను సమీపించ వచ్చుచున్న శల్యునాదరింపక భీమ,నకుల సహితుండైయున్న అర్జునునికి బాసటగనిల్చి భీష్మునితో యుద్ధమునకుదిగెను. భీష్ముడు ధర్మజుని విల్లును త్రుంచివైచెను. మరియు

శా. గంగాపుత్రుఁడు పాండవాగ్రజునియుగ్యంబుల్ మహింగూల్చి స
ర్వాంగంబుల్ వెసనొంపనాతఁడు సముద్యత్క్రోధుఁడై శక్తివై
చెంగంపింపకత్రుంచెఁదాతవిభుఁడున్ శీఘ్రంబమాద్రీసుతో
త్తుంగ స్యందనమెక్కనొంచెనుసరిత్సూనుండు మాద్రేయులన్-భీష్మ-తృతీయ-61

భీష్ముడు ధర్మజుని నేలకూల్చి శరీరమంతటిని బాధింపగ, ధర్మజుడు క్రోధావేశుడై శక్త్యస్త్రమును ప్రయోగించెను. దానిని సహింపక భీష్ముడు త్రుంచివేచెను. వెనువెంటనే ధర్మజుడు నకుల,సహదేవుల రధమెక్కెను. అప్పుడు భీష్ముడు మాద్రేయులనెదుర్కొనెను. అంతట తమ్ములతోకలసిన ఉత్సాహముతో మరల అండగనిల్చిన నృపులతోకలసి భీష్ముని ఎదర్కొనెను. ఇది యథామూలము. భీష్ముడు అష్టమదివస యుద్ధమున కూర్మవ్యూహము పన్నెనని తెలుసుకొని దాని ప్రతివ్యూహంబు కల్పింపమని ధర్మజుడు ధృష్టద్యుమ్ననకు తెలుపగ అతడు శృంగాటకవ్యూహమును గూర్చెను.

107. భీష్ముడు నవమదివసమున సర్వతోభద్రవ్యూహముగ యోధులను నడిపించగ, పాండవులు గుంపుగ నలువైపుల నుండి క్రమ్ముటకై ఆలోచించి నకుల, సహదేవ, ధృష్టద్యుమ్నాదులు పురస్సరులుగ, ధర్మజుడు మధ్యనయుండి తల పడెను. అర్జునుడు ద్రోణాచార్యునితో యుద్ధముచేయుచుండగ, భీష్ముడు ధర్మరాజున్న వైపునకుతిరిగి సేననుచెండాడెను. అంతట దుర్యోధనుడు శకుని,దుశ్శాసనులను భీష్మునికి అండగ నిలువుమని పనిచెను. అదిచూచి ధర్మజుడు కవలు సహితుడై వివిధ అస్త్రములను ప్రయోగించెను. భీష్ముడు ధర్మజ, కవలులపైన తన అస్త్రములు సంధించెను. అంత అర్జున, భీములు అగ్రజునకు తోడైరి. వెంటనే భీష్ముడు ధర్మజుని పన్నెండు బాణములతోను, భీముని పండ్రెంటితోను, చెరి మూడు బాణములతో సాత్యకి, ధృష్టద్యుమ్నుని నొప్పించెను. ఇది యథామూలము.

108. అంత సంధ్యా సమయానంతరమున ధర్మజుడు బురదలో కూరుకుపోయిన గోవువలెనున్న తమ సేనలనుచూచి వారందరినీ వీడ్కోల్పి, తను తమ్ములతోకలసి శ్రీకృష్ణమందిరమునకేగెను. అచ్చట మనమునగల విషాదమును దిగ మ్రింగుకొని శ్రీకృష్ణుని ఆత్మీయతాకార్యదశ తెలిసికొనుటకిట్లు పల్కెను. ధార్చిచ్చు ధమ్మి మృగసంతతిని దహించురీతిగ భీష్ముడు మన సేనలను శరములతో క్రమ్ముట కనులారచూచిన మనవారెవ్వరును అతనిని ఎదిరించి నిలువలేరు. మనోవ్యాకులతతో నాకును కార్యస్థితి తోచుటలేదు. కావున పోరున చచ్చిన సామ్రాజ్యము లభించు నట్లగునా! అని శ్రీకృష్ణుని ప్రశ్నించినాడు. మరియు నిశ్చంతగా తమ్ములతోగూడి అరణ్యమునకుపోయి, తపమొనరించు కొందును. అదియుకాక నావలన యింతకుముందు నా తమ్ములు కోరి కష్టములనోర్చుకొనిరి. కావున వారందరిని కనులముందునిల్పి చూచుకొందునుగాని భీష్మునికి యుద్ధమున ఎరగా పెట్టలేను. కావున నీకు మాయందు అనుగ్రహము కలదేని యుద్ధము తప్పి, ధర్మవిరుద్ధముగానట్టి కార్యమును సెలవిమ్మని శ్రీకృష్ణునితో ధర్మజుడు పల్కెను. నిజమునకు పై చెప్పినట్లుగ ధర్మజుడు అడవులకు పోవుటకు గాని, యుద్ధము మానుటకుగాని సమ్మతుడుకాదు. శ్రీ కృష్ణునితో అట్లు పల్కుటకు కారణము యేన్ని ఆటంకములెదురు పడినను. దర్మజుని కురు సామ్రాజ్యధినేతను చేయుదునని పలుసందర్భములలో శ్రీకృష్ణుడు పాండవేయులకు మాటయిచ్చుటయే. గావున అది మరల మరల జ్ఞప్తికి తెచ్చుటకు ధర్మజుని ప్రయత్నము మాత్రమే ఇది. ఇట మూలమునగల భావమును గ్రహించినాడు. అంత ధర్మజుడు.

కం. కయ్యముసేయక తగునా, హయ్యముసేయఁగలవాఁడనని పలికితిని
న్నియ్యెడనేఁబొంకింతునె? దయ్యము నాకేలయిట్టి దైన్యముదెచ్చెన్?-భీష్మ-తృతీయ-286

'కయ్యము చేయనని, తగుసహాయము మాత్రమొనరించెదనని పల్కిన నీచే బొంకించుట తగదు' అనుటలో చేయవలసిన సహాయముచేయక ఉపేక్షించుచున్నావని ధ్వని వ్యంగ్యముగ వినబడుచున్నది.

109. మరియు కృష్ణునితో ఇట్లనెను.

వ. నాకు దేవవ్రతునకునొక్కసమయంబుగలదమ్మహాత్ముండు గౌరవులకునయి కయ్యంబు సేయుటకును, నాకు హితంబగు కార్యంబు బుద్ధిందలకొనుటకుంబూనినవాఁడతండు రాజ్యంబొసంగు - **287**-ఇది యథామూలము. కావున భీష్ముడిచ్చిన మాటప్రకారము మనకు మేలగునట్టి కార్యమునుగూర్చి తెలుసుకొనెదమని ధర్మజుడు పల్కెను.

ఆ. ఆకట తండ్రిసచ్చినంతనుండియు మము, నరసిప్రోచినట్టియనుఁగుఁదాతఁ
జంపమదిఁదలంచు తెంపుసూచితె?రాజ, ధర్మమింత క్రూరకర్మమగునె?-భీష్మ-తృతీయ-**288**

అని చింతించుట శోచనీయము. ఇది అమూలకము. మూలభావమునుగ్రహించి తిక్కన కల్పించినాడు. యుద్ధమునకు ముందే వీరందరినీ చంపినగాని తనకు రాజ్యమురాదను విషయము ధర్మజునకు తెలియనిదికాదు, మరియు యుద్ధరంగమున బంధుత్వమునకేమాత్రము ప్రాధాన్యత లేదు. అధర్మపరుల పక్షీయులైనవారిని చంపక విడుచుట నిజ క్షాత్రధర్మమునకే తలవంపు, ధర్మజుడు సుక్షత్రియుడు, కనుక క్షాత్ర ధర్మమెట్టిదో అతనికి వేర చెప్ప బనిలేదు. అట్టి ధర్మజుడు రాజధర్మమెంత క్రూరమైనదో అనుకొనుటలో తన్ను తాను విమర్శించుకొనుటయే.

110. వెంటనే ధర్మజాదులు శ్రీకృష్ణునితో కలసి భీష్మమందిరమునకేగి ప్రణామములు చేసిన, ఆతండును వారలందరిని పేరు పేరున క్షేమమడిగినంత ధర్మజుండు భీష్మునితోనిట్లనియె.

కం. మాకెమ్మయి సామ్రాజ్యము,సేకుఱునెబ్బంగిబహుళసేనోత్సాద
వ్యాకులత రాకతక్కుం, జేకొనియత్తెఱఁగు కరుణఁజెప్పఁగవలయున్-భీష్మ-తృతీయ -**297**

మాకేవిధమున సామ్రాజ్యము సంప్రాప్తించు? ఏ రీతిగ సైన్యమునశ్రు కలిగిన వ్యాకులత దీరు? అని ప్రశ్నించుటలో మీరు ముందిచ్చినమాట ప్రకారము మాకు రాజ్యము కట్టబెట్టవలెను. మరియు సేనను నిర్జించకుండ, భీతి మాన్పవలెను. అనగ యుద్ధరంగమున భీష్ముడున్నంతవరకు పాండవులకు, సేనకు వ్యాకులత మానదు. కావున భీష్మ నిష్క్రమణమునుగూర్చి ధర్మజుడు వాచ్యముగనే ప్రశ్నించినాడు. అంతట భీష్ముడును ధర్మజుని అభిప్రాయమును గ్రహించినవాడై వీటన్నింటికి సమాధానముగ ననునిర్జింపగ శోభనములెల్లనగున్ అని నుడివినాడు. అంత ధర్మజుండు నిన్నేవిధమున గెలువగలమని ప్రశ్నించగ, భీష్ముడు తన నిజవధోపాయమునెరింగించెను. ఇది యథామూలము.

111. భీష్ముని దశమదివస యుద్ధమున ముందున శిఖండితో భీమార్జునులను, కవలును, యిరుప్రక్కలనిడుకొని ధర్మజుడు సేనాసమేతుడైయుండెను. కౌరవులను భీష్ముండు అగ్రభాగమున ద్రోణాశ్వత్థామలు యిరుప్రక్కల నిలబడి యుండి యుద్ధారంభమయ్యెను. యుద్ధమున ద్రోణాచార్యునితో ధర్మజుడు తలపడెను. భీష్ముడు ముందుగల సేననంతటను అర్జునుడు చంపుటచూచి, ద్రోణాచార్యుడు అటుపోవుటకు యిచ్చగించుచుండగ, అతనిని కదలనీయక ధర్మజుడు సేనాసమేతుడై అడ్డునిలిచెను. అంతట అశ్వత్థామను భీష్మునకు సహాయముగ పొమ్మని ద్రోణుడు ఆదేశించెను. తదనంతరము భీష్ముడు ధర్మజునితోనిట్లనియె.

కం. జనియించినంతనుండియు, జనపతులంగ్రూరవృత్తిఁ జంపుచునుండం
జనియెంగాలమువిసివితి, ననఘా!యేనింకఁజాలనాసురవిధికిన్-భీష్మ-తృతీయ-**366**

ఆ. మీరునాహితంబుఁ గోరుదురేని శి, ఖండిమున్నుగాఁగఁగడఁగి యంత
వట్టు వారునొక్కపెట్టకాఁబైఁబడి, యేయుఁడింకఁ దడవుసేయవలదు-భీష్మ-తృతీయ-**367**

జన్మించినదాదిగ చేయుచున్న ఈ అసురవృత్తి యింక చేయజాలను. కావున నాహితముకోరి శిఖండినిముందు నిలుపుకొని, ఒక్కుమ్మడిగా పైబడమని మరల తన మరణ విశేషమును చెప్పెను. ఇట నాహితముగోరి అనుటలో బీక్ష్ణ కూడ హితము అని ధ్వనింపజేసినాడు.

112. అనుటయే తడవు ధర్మజుడు కనబర్చిన విధమిట్లున్నది. ధృష్టద్యుమ్నునితోనిట్లు పలికెను.

కం. దేవవ్రతుపలుకులు విం, టే?వేగమపనుపు మొక్కటిగఁదఱుమఁగ యో
ధావళినెల్లను భీముఁడు, నీవును నరుతోడఁగూడి నిగుడుఁడుపెలుచన్-భీష్మ-తృతీయ-369

సంతోషమంతరంగమున నావేశించుచుండ నిజసైన్యమును, అనుజులను ఒక్కుమ్మడిగ భీష్మునిపైకి రమ్మనమని సందేశమంపినాడు. తాతను చంపుట తనకిష్టములేదని నుడివిన ధర్మజుడిట్టి ఆనందమును ప్రదర్శించుట గమనార్హము. కారణము భీష్ముడే తనకు తానుగ చనిపోవుటకు నిశ్చయించుకొని ధర్మజుని కోరుటయే. అది భీష్ముని ధర్మనిరతికి తార్కాణము. స్వజనులను సంహరించుట యిష్టములేని ధర్మజుని క్షాత్రధర్మనిర్వహణకు మచ్చుతునక. యథా మూలము.

113. భీష్మవచన ప్రకారంబుగ శిఖండిని ముందిడుకొని, అర్జునుడు బాణములను సంధించి భీష్ముని పడవైచెను. తదుపరి భీష్ముడు శరతల్పగతుడైన పిదప శ్రీకృష్ణుడు ధర్మజునిచూచి యిట్లని ప్రశంసించెను.

కం. సురులకునజయ్యుఁడగు నీ, సురసరిదాత్మజుని గెలువఁజొప్పడునే? యె
వ్వరికైన నద్భుతావహ, పరికరులగు మీకుఁదక్కఁ బౌరవముఖ్యా !- భీష్మ-తృతీయ-438

ఇచట మూలమును యథాతథముగ గ్రహించినను అద్భుతావహ పరికరులగు అనుమాట తిక్కనచే కల్పింపబడి అనువాదమునకు శోభనాపాదించినది. సురులకు సైతము గెలువ జాలని భీష్ముని గెల్చుట 'అద్భుతావహమైన పరికరాస్త్రములు గలవు బీక్ష్ణుగాన' అనుటలో అద్భుతమైన పరికరములు అనుమాట పరిశీలింపవలసి యున్నది. 'అద్భుత శస్త్రాస్త్రములతో' అనవచ్చును గదా! కాని శస్త్రాస్త్రములతో నిర్జింపలేదని విషయము విదితము. కావున పరికరములనుటచే అద్భుతమైన ఆలోచన, వరము, శిఖండి, అస్త్రములను పరికరములచే గెలిచిరనుట చెప్పకనే చెప్పుచున్నాడు, అనవిని ధర్మజుడిట్లు పల్కెను.

కం. అనుటయునతఁడిట్లనునే, నుమనఁగానొక మానిసులమెయప్రతిహత వీ
రునినిన్నుఁబడసి యింతటి, పనులకుఁజాలితిమిగాక భక్తాధీనా-భీష్మ-తృతీయ-439

ఇట మూలమున ధర్మజుడు నాలుగు శ్లోకములలో శ్రీకృష్ణుని దయ, భక్తిపరాయణత్వపాలనముగూర్చి ప్రశంసించి నటులగలదు. అనువాదమున తిక్కన భావమునంతటిని ఒక్క కందములోనిమడ్చినాడు, ఇది శ్రీకృష్ణుడనిన మాటలకు ప్రత్యుత్తరము. ఇట ఆప్రతిహతవీరుని నిన్నుబడసి అనుట పరిశీలింపవలసి యున్నది. అనగ ధర్మజుడు తనపైబడిన భీష్మ మరణాపవాదును పరోక్షముగ శ్రీకృష్ణునికంటగట్టుటకు చేసిన ప్రయోగముగ తోచును. నీవు మాకు అండగ ఉండుటచే యిట్టి అసాధ్యమైన పనిని సునాధ్యమొనరించితిమి అనుటలో కర్తవు నీవు, కారకులము మేము అను ధ్వని గోచరించుచున్నది. ఈ విధముగ ధర్మజుని లౌక్యము, శ్రీకృష్ణుని లౌక్యముతో సరితూగుచున్నది.

ద్రోణపర్వము – ధర్మజపాత్ర

మహాభారత యుద్ధము పదెనెనిమిది దినములు జరిగినను నిజమునకు భీష్మ, ద్రోణ, కర్ణుల సారధ్యములు మాత్రమే చెప్పదగినట్టివి. చివరిదినము శల్య, దుర్యోధనుల సారధ్యములు నామమాత్రములు. కర్ణుడుకూడ పరాక్రమ శాలియేయైనను, శాపగ్రస్తుడగుటచే వానిని గూర్చిన భయము, భీష్మ ద్రోణులతో పోల్చదగినట్టిది కాదు. ఒక విధముగ చెప్పవలెనన్న భీష్మ, ద్రోణులు సమానులన్నది వాస్తవమైనను, భీష్మ నిష్క్రమణముతోడనే పాండవుల పక్షమున విజయ సూచనలు కనబడినవనవచ్చును. అట్లని ద్రోణుని అయిదు దినముల యుద్ధము సామాన్యమైనదని మాత్రము చెప్పరాదు.

ద్రోణపర్వమున ఒక విశేషము గోచరించును. పాండవులను జయించుట కష్టమనెడి భావము దుర్యోధనునిలో రూఢముగ పాతుకొనినది. అందుచే యుద్ధమున ధర్మజుని చంపుటకన్న, వానిని బంధించి తనకు ఒప్పచెప్పినచో బాగుండునని యుద్ధారంభమునుండి (ద్రోణాధిపత్యము ప్రారంభమునుండి) ద్రోణుని కోరుట చూడగలము. ధర్మజుని పున: ద్యూతమునకొప్పించి మరల వారిని అరణ్యములకంపుటయే తేలికగా దుర్యోధనుడు భావించినాడు. అందుకు తగినటుల ద్రోణుడుకూడ ప్రథమ, ద్వితీయ దివసములందు తన దృష్టిని అర్జునునిపైకన్న ధర్మజునిపైననే మిక్కిలిగ నిలిపినటుల కాన్పించును. ఇక మూడవనాటి యుద్ధమునకూడ ద్రోణునంతటివాని ఆధిపత్యములో పద్మవ్యూహమున పదిగురు కలసి రథహీనుడనికాని, నిరాయుధుడనికాని భావింపక అభిమన్యుని చంపుట జరిగినది. ఇదికూడ ధర్మ యుద్ధమున పాండవులను జయింపగలమన్న ధైర్యము ద్రోణాచార్యునంతటి వానిలోనే సన్నగిల్లినదా! అనిపించును. నాల్గవనాటి యుద్ధమునకూడ ద్రోణుడు తనయుద్ధమునకు ధర్మజునే గురిచేయుట గమనార్హము. సైంధవవధ విశేషముగ కాన్పించినను వానిని సంహరింపనిచో అర్జునుడు మరణించునేమో! యని పాఠకులలో కలుగు ఉత్సుకతయే అందులకు కారణమని గమనింపగలము. నిజమునకు అర్జునునియెదుట సైంధవుడొకలెక్కకాదు. ఆనాటి యుద్ధముకూడ ద్రోణ, ధర్మజులకే పరిమితమైనది. ఇరువురును పరస్పరముగ బ్రహ్మాస్త్రములను సంధించుకొనుట గమనార్హము. ఆ యుద్ధమున ధర్మజుని చేతిలో ద్రోణాచార్యుడు మూర్ఛిల్లుట విశేషముగ చెప్పదగినట్టిది.

పంచమ దివసమందలి యుద్ధమున ధర్మజశీలమునకు సంబంధించిన తర్కవితర్కములకాధారమైన ఘట్టములు చోటుచేసుకొన్నవి. ఘటోత్కచ మరణసందర్భమున వ్యాసుడు ప్రత్యక్షమై *మీకు జయము లభించును, రాజ్యశ్రీ లభించునని* స్పష్టముగ ధర్మజాదులకెరింగించినాడు. అయినను ధర్మజుని హృదయమున మాత్రము ద్రోణుని విషయమై భయముపోలేదు, అట్టితరి శ్రీకృష్ణుడిచ్చిన ఆపద్ధర్మోపదేశముగ్రహించి అశ్వత్థామ మరణించినటుల అసత్యమునుపలికి ద్రోణుని అస్త్రసన్యాసమునకు కారణమైనాడు. తొలుత భీమునివలననే అశ్వత్థామ మరణవార్త వినియున్నను, దానిని విశ్వసింపక, సత్యవాక్పాలకుడైన ధర్మజముఖమున వినినచో విశ్వసింతునని ద్రోణుడు భావించి ధర్మజుని వాస్తవము నడుగగ, ధర్మజుడు నిజసైన్యరక్షణార్థము అశ్వత్థామ హతుడైనటులగనే పలుకుట సంభవించినది. ఇట ధర్మజుడాపదలో నుండుట వాస్తవము. అయినను హరిశ్చంద్రాదుల సరసన ధర్మజుని నిలుపుటకు సంసిద్ధలగుచున్న భారతీయుల యుహలను తలక్రిందులు చేసినట్టి ఘట్టమై, ఇది ధర్మజుని ఉత్తమ లౌకికునిగ మాత్రమే చివరకు నిలుపగలిగినది. కనుకనే ధర్మజపాత్ర పరిశీలన విషయమున ద్రోణపర్వమునకు విశిష్టస్థానమున్నది. ఈ దృష్టితో ఈ పర్వమును పరిశీలింతును. ద్రోణపర్వ ప్రథమాశ్వాసమున భీష్మ మరణానంతరము ద్రోణునకు సర్వసేనాధిపత్యము కట్టబెట్టి దుర్యోధనుడు ద్రోణునితో ధర్మరాజును బంధించి తెమ్మని చెప్పగ ద్రోణుడట్లేయని మాటనిచ్చినాడు.

114. అప్పుడు దుర్యోధనుడు ధర్మరాజును బంధించలేక పోయినచో మరియొక మార్గము కలదని ద్రోణునకు తన మనసులోగల మాటలనిట్లు చెప్పెను. ధర్మరాజుని చంపినచో అర్జునుడు మన కౌరవసేననంతటిని చంపును. లేదా ఒకవేళ పాండవులనందరిని చంపినచో, శ్రీకృష్ణుడు కౌరవుల తలలేరి మేదినినంతటిని కుంతికిచ్చును. కాన యుధిష్ఠిరుని గాయములొనరింపక పట్టితెచ్చి మరల ద్యూతమునకు ప్రోత్సహించినచో మరల అరణ్యవాసమునకు పోవును. తను తమ్ములతో కలసి ఈ సర్వంసహకు చక్రవర్తినై పెద్దకాలమేలేదనని చెప్పెను. అది విని గురుడు కుటిలమగు అతని అభిప్రాయమునకు మనమునందు రోసి, నరనాథునితోనిట్లనిపలికెను. అర్జునుడు లేకున్నచో, ధర్మరాజును ద్రుపదాదులు రక్షించుచున్నప్పటికి పట్టితెచ్చెదననెను. ఈ విషయమంతటిని చారులవలన విని ధర్మరాజు తమ్ములతోకలసి ఆలోచనకు దిగెను. ఇచటనొక విషయము గమనార్హము. దుర్యోధనుడు స్వార్థపరుడు కావచ్చును, కాని పాండవుల మనస్తత్వములను గుర్తింపలేనంతటి బేలకాడు. పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసమును, ఒకయేడు అజ్ఞాతవాసమునుచేసి యెన్నియిడుములు పడినను, అవకాశము లభించినచో మూడవ పర్యాయము భూనః జూదమునుకు సిద్ధపడుటకు వెనకంజవేయడని దుర్యోధనాదులు భావించిరి. ధర్మజ జ్యూదవ్యసనమెట్టిదియో గ్రహించుటకిది గీటురాయి కాగలదు.

తదుపరి తమ్ములతో 'ఈ ద్రోణుని అభిప్రాయమును, మాటలను' ఉపాయముతో, ఐకమత్యముతో మనము అసత్యమగునటుల చేయవలెనని పల్కెను. అపుడర్జునుడు ధర్మరాజుతో భయమేమియునులేదు. మేమందరము ప్రాణములతోనున్నంతవరకు నీకు ఈ ద్రోణుని వలనేకాదు. ఆ పరమేశ్వరుడు సపరివారముగ వచ్చినను బంధింపలేడని ధైర్యవచనములు పల్కెను. ఇట మూలమున అర్జునుడు ధర్మజునితో ద్రోణప్రతిజ్ఞ వమ్ము చేసెదనను పలుకు సందర్భమున, నక్షత్ర సహిత ఆకాశము విరిగిపడిన, భూమిబ్రద్ధలైపోయిన, వజ్రధారియై ఇంద్రుడేవచ్చిన, లేదా విష్ణువు దేవతాపరివేష్టితుడైవచ్చి దుర్యోధనునకు సహాయమొనర్చినను, నేను బ్రతికియుండగ నిన్ను బంధించలేరని పలికినటుల గలదు. అనువాదమున తిక్కన పై వివరము విడిచిపెట్టినాడు. అంతట ధర్మరాజు సంతుష్టాంతరంగుడై తమ సేనలను సమకూర్చుకొని క్రౌంచవ్యూహముగనమర్చి అందగ్రభాగమున శత్రుసైన్యముల మనమునందు భయము కలుగునటుల కాలచక్రాకృతితో అనుజులు, అభిమన్యు ప్రభృతి కుమారులు, సేనాసమేత సేనాపతి, పరివేష్టితుడై నిలిచియుండెను.

ద్రోణుడు ప్రథమదివస యుద్ధమున దుర్యధనునకిచ్చిన మాటకొరకై ఉత్సాహముతో సేనలను శకటవ్యూహముగ నమర్చి దుర్యోధనుని ముందునిడుకొని యుద్ధమున కేగెను. ఇంతలో అపరాహ్ణమాయెను. అంతట కర్ణుని కుమారుడగు వృషసేనుడు పాండవులపై బడెను. వానికి ప్రతిగ అభిమన్యుడు తలపడెను. అభిమన్యునకు సహాయమొనర్చుటకు ధర్మజాది పాండవముఖ్యులు చేరిరి. అటు కౌరవ సైన్యమునగూడ ద్రోణ, కృప, అశ్వత్థామాదిగాగల వీరులు తలపడిరి, ఆ సమయమునందే దేవాసుర సంగ్రామమని తోచినది. తదనంతరము ద్రోణాచార్యుడు సారథితో ధర్మజునివైపు రథము తోలమని చెప్పెను. ధర్మరాజునెదుర్కొనిన ద్రోణుడు తనపై ప్రయోగించిన శరములను తప్పించుకొని ధర్మజుని విల్లునుత్రుంచెను. అంత సుకుమారుడు ద్రోణుని నిలువరించి యుద్ధముచేసెను. ఇంతలో అనుజులందరు ధర్మరాజునకు సహాయముగ కూడిరి. వెంటనే ద్రోణుడు అందరిపై మూకుమ్మడిగ బాణములను సంధించుచు పన్నెండు శరములు ధర్మజుని పైవేసి, మరియు రథికులదరిని చిత్తుచేసి ధర్మజుని మేనిలో శరములునాటెను.

ఈ విధముగ అడ్డుపడిన వారినందరిని ద్రోణుడు తప్పించుచుండ, కేకయపతి, ద్రుపదుల జ్ఞాతులైన సింహసేన,

వ్యాఘ్రదత్తులు ఎదిర్చిరి. అంత గురుడు కంపించిన శరీరముతో తీవ్రశరముల వారి తలలను ద్రుంచివేసెను, వెనువెంటనే ధర్మజుని సమీపించిన ద్రోణునిచూచి కురుసైన్యమంతయు

కం. అదెపట్టువడియె ధర్మజుఁ, డదయుండగు ద్రోణుచేత నక్కట నేఁడుఁ
న్మదుఁడై సుయోధనుఁడు దం, డ్రి దలిర్పఁగనేఁగుఁగరిపురికిఁ గొనియెలమిన్-ద్రోణ-ప్రథమ-210

అదిగో ధర్మజుడు పట్టుబడినాడు దయలేని ద్రోణునిచేత, నేడు ఉన్మత్తుడైన దుర్యోధనుడు, తండ్రి సంతోషింపగ వీనిని కరిపురికి గొనిపోవునని పల్కిరి. ఇట్లు సైన్యమంతట హాహాకారములు చెలగుచుండ, అర్జునుడు దిక్కులుకంపింపగ వచ్చి గురుని ఎదుర్కొనెను. అంతట సంధ్యాసమయమయ్యెను. ఇది యథామూలము.

115. ద్రోణాచార్యుడు తన రెండవదివస యుద్ధమున కౌరవవీరులతోడనిట్లుపల్కెను.

ఆ. నరుఁడులేనిచోటననుఁగని వెన్నిచ్చి, పాఱకున్నఁబట్టువడియెఁగాఁగఁ
దలఁపు ధర్మపుత్రుధరణీశపాఱుట, గలిగెనేనినంతకంటెమేలు-ద్రోణ-ప్రథమ-217

అర్జునుడు లేకుండినచో ధర్మరాజు నాకు పట్టువడిపోవును. లేనియెడల వెన్నిచ్చి పారిపోవును. అదే జరిగినచో మేలగునని పల్కెను. ద్రోణునకు అర్జునుని శక్తియుక్తులు తెలియును. నరనారాయణులేకమై నిలిచినచో నిర్జించుట ఎవరి తరము కాదు. కావున అర్జునుని ధర్మరాజునుండి విడగొట్టినచో తను తప్పక ధర్మజుని పట్టియిచ్చెదనని నొక్కి చెప్పెను. అంత సుశర్మ దుర్యోధనునితో అర్జునునికి, తమకుగల పూర్వవైరమును జ్ఞప్తికి తెచ్చుచు, తిగర్తులు పదివేల మందిని వెంటనిడుకొని అర్జునుని కవ్వించి తమతో యుద్ధమునకు పిలుతుమని, తద్వార గురుని కార్యము చక్కబెట్ట వచ్చునని పల్కెను. వెనువెంటనే అస్త్రగురుడు తమ సేనలను గరుడవ్యూహముగనమర్చి యుద్ధమునకు సాగెను. అటు దక్షిణదిక్కున సుశర్మ, తిగర్తాదులతోడ గజారూఢుడై అర్జునుని యుద్ధమునకు పురిగొల్పెను. వెంటనే అర్జునుడు ధర్మజునితో యుద్ధమునకు పిల్చునపుడు పోవనిచో పురుషార్థమునకు లోపము కలుగునని, మరియు క్షాత్రధర్మమునకు అవమానమొనర్చుట, కావున తన్ను పంపుమని పలికిన అర్జునునితో ధర్మరాజు ఇట్లనియె.

తే. గురునిబలశౌర్యములునెరంగుదుము మనకు, నతనిపూనికి బొంకుసేయంగవలయు
దీనికెయ్యది కార్యంబుదాని నీవు, బుద్ధినుచితంబుగాఁదలపోయుమనుడు-ద్రోణ-ప్రథమ-225

ద్రోణుని బలశౌర్యపరాక్రమాదులు మనకు సుపరిచితములు. అదికాక వారు ప్రతిన పూనిన విషయమును, మనము అసత్యముగావించవలెను, దానికి తగుకార్యము పరోక్షముగ తేటతెల్లమగుచున్నది. అర్జునుని అండలేనిచో ద్రోణాచార్యుడు తన్ను బంధించుట తథ్యమను విషయము ధర్మజునికి తెలియనదికాదు. కారణము గురునిశక్తి ఎదుట తనశక్తి చాలదను విషయము ధర్మజునకు అనుభవమే. కావున అర్జునుని నిష్క్రమణకై పరిపరి విధముల మనస్సున బోధనొందుచు, కార్యము బుద్ధితోకూడిన దాన్ని చెప్పమనినాడు. అంత అర్జునుడు గురునినుండి మిమ్ము రక్షించుటకు లోకాపవాదమును భరించవలెను. కావున పాంచాల ప్రభువగు ఈ సత్యజిత్తు రక్షణగ నిల్చును. నాకు అనుజ్ఞనిమ్మనని, ధర్మజుడుఖిన్నుడై అటులనే చేసెను. ఇది యథామూలము.

అంత ధర్మరాజు కౌరవుల గరుడవ్యూహమునకు ప్రతిగ, మండలార్ధ వ్యూహమును పన్నుమని ధృష్టద్యుమ్నుని ఆదేశించి అతనితో నిట్లనెను.

కం. నేఁడీ బ్రాహ్మణుచేతం, బోఁడిమిసెడియేనుజిక్కిపోవకయుండన్

వేఁడిమిమెఱయుశరంబుల, వాఁడిమిసొంపెల్లఁజూపవలయుంజుమ్మి-ద్రోణ-ప్రథమ-232

నేడు నేను పౌరుషములచెడి ఈ బ్రాహ్మణునకు చిక్కిపోకుండగనుండవలెనన్న మహాస్త్రముల శక్తినంతటిని జూపవలసినదేయనిపల్కెను. ఇది యథామూలము.

ఇచట ధర్మజుడు ద్రోణుని నేడీ బ్రాహ్మణుచేతన్ అనిపలుకుట గమనార్హము. ధర్మజునకు ద్రోణుడాబాల్యముగ పరిచితుడు. పరిచితుడైన నాటినుండియు ద్రోణుడాచార్యునిగనే తెలియును. అట్టి ద్రోణుని అల్పుని సంభోదించినటుల ఈ బ్రాహ్మణుని యని పల్కుటలో ధర్మజునివంటి సచ్ఛీలుడు ద్రోణునిపట్ల అల్పత్వము నుహించెనని భావింపరాదు. ద్రోణుడు సమస్తక్షాత్రవిద్యలను నేర్పినట్టివాడు. అంతకుమించి వానిలో బ్రాహ్మీశక్తికూడనున్నది. అది ధర్మజుని భయపెట్టు విషయము. ఆ బ్రాహ్మీశక్తి తపోమార్గమున సాధింపగలట్టివి. అద్దానిని అర్జునుడు మాత్రమే పాండవులలో సాధించి నట్టివాడు. తత్కారణముననే పాశుపతాస్త్రాదులను సంపాదించినట్టివాడు. అట్టి అర్జున పరోక్షమున ద్రోణుని బ్రాహ్మీశక్తిని భరింపగల సమర్థుడు ధర్మజ పక్షమునలేదు. కనుకనే అర్జునుడు సన్నిధిని లేకుండుటచే నేడీ బ్రాహ్మణునిచేత ఓడింపబడక తప్పదని ధర్మజుడు పల్కినటుల గ్రహింపవలయును. ఆచార్యుడు వెనువెంటనే ధర్మజుని సైన్యమును తరుమనా రంభించెను. గురుని తీవ్ర శర కంపనములకు ఓర్వక ధర్మజుని సైన్యంబు కలతపడెను. అప్పుడు ధర్మజుడును తన సైన్యమునకు ధైర్యమునిచ్చుచు గురునిపై శరములు సంధించెను. ధర్మజునకు తోడుగనిల్చిన సత్యజిత్తు గురుని రథసారథిని చంపి అతనిని శరములతో నొప్పించెను. అంతట ద్రోణుడుగ్రుడై అర్ధచంద్రాకార శరమున సత్యజిత్తుని సంహరించెను. అది చూచి ధర్మజుడు.

కం. సాహంకారుండగు గురు, బాహుబలంనకునులికి పాఱఁదొలంగెన్
వాహములఁదోలుకొని యు, త్సాహంబుఁజలంబునెడల ధర్మజుఁడధిపా-ద్రోణ-ప్రథమ-292

ద్రోణుని ఉగ్రశక్తికి భయపడి ధైర్యవిహీనుడై, ఉత్సాహము నీరుకారిపోవగ, గుర్రములను తోలుకొని వెనుకకు పారిపోయెను. ఇది యథామూలము.

116. అంతట ద్రోణుడు ధర్మజుని తరుముకొని వచ్చుచుండగ, సూర్యదత్తుడడ్డపడెను. గురుడు వానితల నేలకూల్చెను. అట్టితరి దర్మజుని తరుముచున్న ద్రోణునిపైకి యుధామన్యుడు, ఉత్తమౌజుడు, వసుదానుడు, శిఖండియు చెరి ఐదు బాణములును ప్రయోగించిరి. సాత్యకి నూటిరువది బాణములను, క్షత్రధర్మడు పదిబాణములను గురునిపైవేసిరి. పరుగులెత్తుచున్న ధర్మజుడును తమవారలనందరిని కనుగొని ధైర్యముతెచ్చుకొని ద్రోణుని పన్నెండు బాణములతో నొప్పించెను. అంతట గురుడు పాండవబలగముపై తన అస్త్రములను గుప్పించుచు వసుధానుని నేలకూల్చి, యుధామన్యాదులను శరములతోనొప్పించుచున్న యనంతరము ధర్మజుడు మరల మిషచే రణరంగమునుండి నిష్క్ర మించుట గమనించినంతలో, ధృడసేనుండు గురునకడ్డపడెను. గురుడతనిని నేలకూల్చి ధర్మజుని తరుమసాగెను. ఇది యథామూలము.

117. ద్రోణాచార్యుడు మూడవనాటి యుద్ధమున కౌరవవులందుగల అతిరథ, మహారథులతోగలసి చక్రవ్యూహమును నామాంతరముగల పద్మవ్యూహమును సంఘటించెను. పాండవులందలిగల భీమసేనాధి ప్రముఖులు కలసిన సైన్యముతో ధర్మరాజు యుద్ధమునకు సమాయత్తమగుచు, జరిగిన యుద్ధమున ద్రోణుని పరాక్రమమునకు చింతించుచు, ఆ

వ్యూహమునుచూచి ఆశ్చర్యము, భయము, ఆవేశము ముప్పిరిగొనగ, అభిమన్యునిచూచి మనమున బీడుతప్ప అన్యులీవ్యూహమును ఛేదింపజాలరనుకొని ఆ కుమారునితో యిట్లు పలికెను. ఈ వ్యూహమును బేధించుటకు మేమెవ్వరము సమర్థులముకాము. అర్జునుడు, నీవు, అచ్యుతుడు, ప్రద్యుమ్నుడు తప్ప ఇతరులు చేయలేరు. కావున నీ ధైర్యముతో భేదించి మాకందరకు ఆనందము కల్గించుమని పల్కిన అతడును అట్లే యనిన, అభిమన్యుకుమారునితో మరల యిట్లనెను.

కం. తెఱపిగొనినీవుసొచ్చినఁ, బిఱుఁదనచొచ్చెదముఱిపులుపెల్లగిలఁగనం
దఱమునుమాకిదియెంతయు, నుఱునట్టి వరంబు దీనినొసఁగుము పుత్రా-ద్రోణ-ద్వితీయ-7

దారిచూచుకొని నీవు ప్రవేశించిన వెనుకగ మేమందరము శత్రువులను తుదముట్టించుటకు లోన ప్రవేశింతుము. కావున మాకట్టి గొప్ప వరమును ప్రసాదింపుమని ధర్మజుడు పల్కెను. ఇది యథామూలము. కాని అనువాదమునగల మాకిది యెంతయునురునట్టి వరంబు దీనినొసగుముపుత్రా అనునదిలేదు, తదనంతరము అభిమన్యుడు పద్మవ్యూహమునసొచ్చి వీరులనందరను కలతపరచుచు దుశ్శాసనుని పౌరద్రోలి, లక్ష్మణకుమారాదులను సంహరించి గురు,కర్ణ,కృప,శల్య, దుర్యోధనాదుల మూకుమ్మడికి తట్టుకొని దుశ్శాసనుని కుమారునితోడ ద్వంద్వ యుద్ధమున ఇరువురును నిహతులైనారు. అతడు వ్యూహమున ప్రవేశించిన తరుణమున ధర్మజాదులు ప్రవేశించుట కుద్యుక్తులగుచుండగ సైంధవుడు వారలను నిరోధించెను. ఈశ్వరుడిచ్చిన వరము, ఆతని తప:ఫల కారణమున పాండవులు ఎదిరించి ప్రవేశింపలేకుండిరి. అప్పట్టున సైంధవుడు, సాత్యకి, భీమ, ధృష్టద్యుమ్నాదిగాగల మహావీరులందరిపై బాణములు వైచుచు ధర్మజునికూడ డెబ్బది శరములతో గాయపర్చెను. అంతనాతడు కోపించి సైంధవుని విల్లును త్రుంచెను. వెంటనే అతడు మరియొక వింటితో మంటలను సృష్టించి వీరులను కదలనీయక యుంచెను. అభిమన్యుని మరణముతో సైన్యము, వీరులు చేష్టలుడిగి నిల్చినంత, ధర్మజుడు వీరలోకమునుద్దేశించి యిట్లనియె. అభిమన్యుని మరణమునకై వగవనేల, ఆచార్యాదిగాగల కౌరవసేనా సమూహమంతటిని కలవరపరచి వీరస్వర్గమునలంకరించినాడు. అట్టివానికై శోకింపనేలయని సేనాసమూహమునకుత్సాహము కల్గించుచు సాయంత్రమయ్యెనని నిజనివాసములకరిగెను.

ధర్మజుడు తననివాసమునకరిగి విషణ్ణవదనుడై తమ్ములతో యిట్లు పలికెను. గురు, శారద్వతాదిగాగల ప్రముఖులతో గూడిన సైన్యముతో పెనుగులాడిన సింహము అభిమన్యుడు. అతనిని యుద్ధమునకు పురిగొల్పిన పాపకర్ముడ నేను. ధనము, రాజ్యము, ఐశ్వర్యము, స్వర్గసుఖములు అన్నియును అభిమన్యుని ముందు దిగడుడుబే. అటువంటి వానిని నేడుకోల్పోయినారమని తన మనసునగల పుత్రశోకమును వెలిగ్రక్కెను. ఆ సమయమున వ్యాసుడు అచ్చటకు వచ్చుట, అతనిని చూచి ధర్మరాజు పుత్రమరణమునకై తనే బాధ్యునిగ నిందించుకొనుచు, ఎరుకపర్చిన ధర్మజునకు వేదవ్యాసుడు మున్ను నారదునిచే అకంపనుడను రాజు పుత్రశోకార్తుడైన వానికి చెప్పిన మృత్యుప్రకారము నెరిగించెదనని ఉపదేశించెను. తదుపరి యుద్ధమున చనిపోయిన వీరునకు స్వర్గములభించునని వేదవ్యాసుడు నుడవగ ధర్మజుడు తనమనస్సున ఉత్తమక్షాత్ర ధర్మమిదని సమాధాన పర్చుకొనుచు మున్నుచనిన భూపాలులెవ్విధముగ యజ్ఞయాగాది క్రతువులొనర్చి పుణ్యలోక ప్రాప్తిపొందిరో సవిస్తరముగ చెప్పమని వేదవ్యాసుని అడుగగ, అతడు

ధర్మజునకు సువర్ణష్ఠీవి, శోడశ మహారాజుల చరిత్రములుచెప్పెను. ఇది యథామూలము. అంత ధర్మరాజు అర్జునుని ఎవ్విధముగ ఓదార్చవలెనని ఊహించుచుండగ అర్జునుడేతెంచి కుమార మరణవార్తవిని దుఃఖితుడై వివేక శూన్య దృక్కులతో నిలచి ధర్మనందనునకిట్లనియె. సంసప్తకులతోడ యుద్ధమున తలపడుటకు నేనుపోవగ, ధైర్యము, శౌర్యము, అస్త్ర మహాత్మ్యముగల్గిన మీరందరు బాలునిపంపి వాని మరణమునకు కారణమగుట హేయము కాదే, అయినను మిమ్ములను నమ్మి చెడుట నా అవివేకతవలెనె, బలహీనులు, సంగరభీతులగు మీరు కుమారుని రక్షించుటకు చాలుదురా! అని వ్యంగ్యముగ ధర్మజాదులను నిరసించెను. అంత శ్రీకృష్ణుడు వీరులగు వారివ్వధముగ వగచుట తగదని ఓదార్చెను. కొంతతడవూరకుండి అర్జునుడు మరల ధర్మజుని అభిమన్యుని మరణ విధానమును చెప్పమని అడిగి, వారల నిరోధించిన సైంధవునిపై కోపము పెల్లుబికినంత రేపటి సూర్యాస్తమయములోన వానిని చంపుదునని ప్రతిజ్ఞ పూనెను. తదనంతరము అర్జునుడు శ్రీకృష్ణునితో తన ప్రతిజ్ఞ విషయములను తెలుపుచు, నీవున్నావను ధైర్యముతో నేనివ్వధముగ ప్రతిన పూనితినని, శ్రీకృష్ణుడే పరోక్షముగ కార్యము నిర్వర్తింపవలెనను ధ్వని విన్పింప జేసినాడు. అంత శ్రీకృష్ణుడు సుభద్రాదులను ఊరడింపజేసి నిజమందిరమున కరిగి, దారుకునితో తనమనమునగల మాటలనిట్లు పలికినాడు. అర్జునుడు నాలో సగభాగము. మేమిరువురము నరనారాయణాంశమున ఉదయించిన వారలము. నరుని ప్రతిజ్ఞ నెరవేరకయున్న అతడగ్ని ప్రవేశముచేసినచో, నా అవతారమునకు అర్థము చెడి కార్యము విఫలమగును. కావున నరునెట్టైనను నెగ్గింపవలెనని నిశ్చయించినాడు. అంత స్వప్నమున నరనారాయణులిరువురు కైలాసమునకేగి, అచ్చటగల పరమేశ్వరుని శతరుద్రీయముతో స్తుతించి దివ్యాస్త్రములు వడసిరి. ఇది యథామూలము.

118. అర్జునుడు నిజస్వప్నవృత్తాంతమునుఎరిగించుటకు సభాస్థలికరుదెంచెను. అచట ధర్మజుడు సోదర పరివేష్టితుడై కృష్ణునితోనిట్లుపల్కెను. భక్తజనవత్సలతన మాపక్షమున నిలిచి అర్జునునకు రథసారథిపై, మమ్ము గాచుటకు వచ్చిన నీకు మాపడినపాటులు తెలిపి మాట, మాటకి మమ్ములుగావుమని పల్కుట యేలనని ప్రస్తుతించెను. మరియు

వ.అర్జునుప్రతినచిత్తంబుననిలుపుము.దుఃఖామర్షమహార్ణవమగ్నులమైన మమ్ముందీరంబుసేరుపందేపవు నీవకాదె-14

అర్జునుని ప్రతిజ్ఞ మనమునందుకొని నెరవేరినట్లు చూడుము. దుఃఖమయ సముద్రమునగల మాకునీవే తెప్పవై యెద్దునకు చేర్పవలయును అని తనమనమునగల వేదనను శ్రీకృష్ణునకు నివేదించెను. అంతట అర్జునుడు ధర్మనందనునకు ప్రణమిల్ల, నాతడు అర్జునునకు ధైర్యవచనములనిట్లు పల్కెను.

కం. గెలుపుధ్రువము నీకునుమెయిఁ, దలతలమనుచాయదోఁచె దైత్యాంతకుఁడుం
దెలివుంది యున్నవాఁడని, పలికిన నావిభునితోడఁబార్థుఁడునెమ్మిన్-ద్రోణ-తృతీయ-17

నీకు గెలుపు తథ్యము, శ్రీకృష్ణుడు చాయవలె నిన్ననుసరించియుండును గాన అది సులభసాధ్యమని ప్రోత్సహించెను. అంతనర్జునుడు శ్రీకృష్ణునితో కలసి కైలాసమునకు వెడలిన స్వప్న వృత్తాంతమును విన్పించెను.

119. ద్రోణుని నాల్గవనాటి యుద్ధమున అర్జునుడు ద్రోణునిచే కల్పింబడిన శకట, గర్భ, సూచీవ్యూహములను చేధించుకొనుచు, గురునితో కొంతతడవు యుద్ధముసాగించి తన ప్రతిజ్ఞాపాలనమునకై సైంధవుడున్నవైపు చనియెను. అంత గురుడు ధర్మజునివైపు వెడలిన అప్పుడు ధర్మరాజు గురుని ఎదుర్కొనెను. ద్రోణుడు తొమ్మిది నిశిత శరములు ధర్మజునిపైపైచెను. అంత ధర్మజుడు రథమును, అశ్వములను, సారథిని, గురువును తత్తరపడునట్లుగ ఇరువది ఐదు శరములను ప్రయోగించెను. అంత గురుడు

చం. అలిగిగురుండు ధర్మజుశరాశనమేడ్తెఱఁ ద్రుంచి వెక్కుల

మ్ముల సతురంగసూతముగముంచె రథంబదియెల్లఁజూచినే

నలతఁడుపేర్చెనిమ్మనుజనాథుఁడు సచ్చునొయోడిపాఱునో

బలిమిఁ దొఱంగిపట్టువడిపాడఱిపోవునొయంచునున్నెడన్-ద్రోణ-తృతీయ-241

అలుక చెందిన గురుడు వెంటనె ధర్మజుని విల్లునుత్రుంచి రథాశ్వములు సూతునితోగూడ గాయపర్చెను. అదిఅంతయు కనుచున్న సేనాసముహమున ఈ మానవపతిసచ్చునో, ఓడి పారిపోవునొ, లేక పట్టువడి ద్రోఁచేగైకొనవడునో అని ఊహాగానములు చెలరేగెను. ఇవ్విధముగ ఒకనిపైనొకరు విశేషాస్త్ర ప్రయోగములు ఒనర్చుకొనుచుండిరి. అంత ధర్మజుడు శక్త్యాయుధమును గురునిపై వైచెను. అతడు దానినుండి రక్షించుకొని బ్రాహ్మాస్త్రముతోడనే ఆ అస్త్రమును మరల్చెను. మరల ఐదుబాణములు గురుని శరీరముననాటి,విల్లును త్రుంచివైచెను. అంత గురుడు గదను ప్రయోగించెను. ధర్మజుడును గదతో అద్దానినెదుర్కొనెను. అంత ద్రోణుడు కోపించి

తే. ధర్మతనయుంధ్యంబులధరణిఁగూల్చి, ధనువుఁగేతువుఁదునుమాడితనువునొంప

నాతఁడరథంబుడిగ్గి నిరాయుధుండు, నూర్ధ్వబాహుండునై యూరకుండెనధిప-ద్రోణ-తృ-245

ధర్మరాజు అశ్వములను నేలకూల్చి, చాపమును, పతాకమును త్రుంచివైచి తనువు నొప్పించెను, అంత ధర్మజుడు రథముదిగి, నిరాయుధుడై, హస్తములను పైకెత్తి శరణువేడునటుల నిలుచుండెను. అంతట ద్రోణుడు నిరాయుధుడైన ధర్మజునిపై శరములు ప్రయోగించుటకు చేతులాడక ప్రక్కలనున్న సైన్యముపైబడెను. అంత

కం. పోనీఁడు పొదువుఁగుంతీ, సూనునిగురుఁడనుచునుండఁజూపఱగముల

మ్మానవపతి యతిరయమునఁ, దానెక్కంబాఱి పిన్నతమ్ముని రథమున్-ద్రోణ-తృతీయ-247

చూచువారలు గురుడు ధర్మజుని పోనియ్యకుండ నిలువుచేయునని భావించుచుండ ధర్మజుడతి శీఘ్రమున సహదేవుని రథమెక్కి తొలగిపోయెను. తదుపరి అర్జునుడు గురుసేనతో యుద్ధము చేయనెడ అతనికితోడుగ సాత్యకిని, భీముని ధర్మజుడుకోరగ వారలను అట్లుచేసిరి. అంత కృతవర్మ పాండవులనెదుర్కొనగ పాండవపక్ష వీరులు అతనిని శరములతో నొప్పించిరి. ధర్మనందనుడుకూడ బాణపంచకమున అతనిపైబడెను. ఇది యథామూలము.

120. తదనంతరమున సైంధవుని దునుమాడివచ్చిన శ్రీకృష్ణార్జునులు ధర్మజునకు నమస్కరించగ, అతడు వారల నాలింగనము చేసుకొని సంతుష్టాంతరంగుడై అర్జునునితో నిట్లనియె.

కం. చేనెత్తురుగాకుండం, గానాసైంధవునిఁజంపి క్రమ్మరమీరల్

రానోచితినాభాగ్యం, బేనపొగడునట్టిదయ్యె నీతనికరుణన్-ద్రోణ-పంచమ-18

చేతికి నెత్తురంటకుండగ ఆ సైంధవుని చంపి తిరిగి వచ్చితిరి. అది నా భాగ్యమే. పొగడవలసినవండీది ఈ కృష్ణుని కరుణను అని పల్కెను. పై పద్యమమూలకము. తిక్కన కల్పితము. ఇట మూలమున ధర్మజుడు కృష్ణుని ముందుగ స్తుతించినటుల విపులముగ కలదు. మరియు అర్జునునితో పలికిన మాటలు ముక్తసరిగనున్నవి. ఇట ధర్మజుని లౌక్యపరమైన స్తుతి కన్పించుచున్నది. కృష్ణుడడ్డుకొని, కరుణ చూపించకున్నచో, అర్జునుని ప్రతిజ్ఞ నెరవేరదన్న విషయము దర్మజునకు తెలియనిదికాదు. ఒకవేళ ప్రతిజ్ఞ నెరవేరనిచో తనకు అర్జునుడు దక్కడు. అందులకు ముందుగనే శ్రీకృష్ణునితో నీవుండుట వలననే మాకీకార్యములు సాధ్యమగుచున్నవనియు, మరియు పరోక్షముగ శ్రీకృష్ణుడే వాటన్నిందికి కారణమని వాచ్యముగ చేనెత్తురు గాకుండగ అను విశేషణము పల్కినాడు. తనపై యెట్టినిందలు పడకుండగ, వాటిని శ్రీకృష్ణుని పరోక్షమునకంటగట్టుటయే ధర్మజ లౌక్యము.

121. తదనంతరము కౌరవపక్షమున దుర్యోధనుడు ద్రోణుని పక్షపాతబుద్ధికి వగచి నిష్ఠురోక్తులాడినాడు. అంత

ద్రోణుడు దుర్యోధనుని సమాధానపరచి తాను పాంచాలురను జంపక, కవచంబు విడువనని ప్రతిన బూనినాడు. అంత దుర్యోధనుడు సైంధవుని మరణమునకై విలపించుచు, ప్రాణములపై అపేక్షను విడచి పాండవులను దునుమాడ వలెనని నిశ్చయించి యుద్ధరంగమున కేగెను. ద్రోణ, కృప, కర్ణాదులెంత వారించినను వినక యుద్ధమునకు తలపడెను. పాండవసైన్యమున జొరబడి చతురంగబలమును కలియబరచుచు భీమసేన, నకుల, సహదేవ, ద్రుపద, విరాట, ద్రౌపదేయులను శరములతో నొప్పించుచు, ధర్మపుత్ర, సాత్యకిలను చెరి ఐదుబాణములతో తీవ్రముగ నొప్పించెను. అంత ధర్మనందనుడు క్రోధుడై, దుర్యోధనుని చాపముద్రుంచి మూర్ఛితుని గావించెను. అంత ద్రోణాదిగాగల కురువీరులచటికి వచ్చిరి. వెంటనే దుర్యోధనుడు తెప్పరిల్లి ధర్మనందనుని నిలువమని యుద్ధ సన్నద్ధుడైనాడు. అంత ఘోర సంగ్రామమయ్యెను. భీమసేనునితో తలపడుటకు వచ్చిన శూరసేన, మాళవ, త్రిగర్త, బాహ్లీకాధిపతులను ధర్మజుడు ససైన్యముగ ఎదిరించుటకు సిద్ధపడగ, దుర్యోధనునిపంపున గురుడు ధర్మజుని ఎదుర్కొనెను. గురుడు వరుసన వాయవ్య, యామ్య, వారుణ, ఆగ్నేయ, త్వాష్ట్ర, సావిత్రములను అస్త్రములను ధర్మజునిపై ప్రయోగింపగ, అతడును అదేవిధముగ అయ్యస్త్రములతో త్రిప్పికొట్టగ ఇంద్రాస్త్రముతో తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనవలెనని గురుడు ప్రయత్నించిన దానినికూడా ధర్మజుడెదిర్చి వమ్ముజేసెను. అంత గురుడు బ్రహ్మాస్త్రమును సంధించెను. ధర్మజుడును బ్రహ్మాస్త్రముతోనే ఎదుర్కొనెను. ఇట్టి సమయమును ధృష్టద్యుమ్నుడు ధర్మజునికండగవచ్చి గురుని ఎదిరించెను. అదనంతరము అశ్వత్థామ ధృష్టద్యుమ్ననితో ద్వంద్వయుద్ధము చేసెను. అశ్వత్థామ పాండవసైన్యమును ఎదుర్కొనుచుండ సైన్యము చెల్లాచెదురై భీతిల్లసాగెను. అట్టి తరుణమున ధర్మజుడు భీమసేనునితో కూడినవాడై అశ్వత్థామనెదుర్కొనెను. తదనంతర యుద్ధమున సాత్యకిచేత సోమదత్తుడు చంపబడినాడు. అదిచూచి పాండవులను కౌరవసైన్యము క్రమ్ముకొనెను. ధర్మజుడు సైన్యమును ఎదిరించుచుండ, గురుడు ధర్మజుడి విల్లుని త్రుంచివైచి అతనిని బాణములతో నొప్పించెను. అంతనాతడు కోపించి వేరొక విల్లుతో వాడియైనబాణములు గురునిపై ప్రయోగించెను. అంత గురుడు రక్తసిక్త దేహముతో మూర్ఛిల్లెను. కొంత తడవునకు తెలివొంది యుద్ధమునకు సిద్ధమయ్యెను. ఇది యథామూలము.

122. అంతలో శ్రీకృష్ణుడు ధర్మరాజునకు ద్రోణుని ప్రతిజ్ఞ నెరిగించి, అతనికొరకై జన్మించిన ధృష్టద్యుమ్నుడుండగ అతనితో యుద్ధము నీకేల? అని పలికి యుద్ధమునుండి ధర్మజుని మరలించెను. అంత పాండవ కౌరవుల ద్వంద్వ యుద్ధమున కృతవర్మ ధర్మజునెదుర్కొనెను. అట్టితరి

సీ. పాండవాగ్రజునిచాపముద్రుంచెఁ గృతవర్మ, యతఁడొండువిలుగొనియతనినొంచె
ధనువునుదునిమిహస్తంబుచ్చిపొశక్తి, యడరింపవేఱశరాశనంబు
గొని హయసూతులఁగోదండమునుబొడి, సేసిహార్దిక్యుండుసెలగియేసె
నరనాయకుడుఁ గృపాణముగొన్ననఱికెఁదో, మరముఁబూనిన రూపుమాపిమఱువుఁ

తే. బరియలుగఁజేసి తనువునఁబఱపెనార, సంబులిట్లమ్మహాబలుచటుల విక్ర
మంబు దుస్సహమగుడు నమ్మానవేంద్రుఁ, డనికిఁదొలఁగిన గురుబలమలరెనధిప-ద్రోణ-పం-147

ధర్మజుని చాపమును కృతవర్మ త్రుంచివైచెను. అంతనాతడు వేరొక విల్లును పరిగ్రహించి, కృతవర్మ ధనువును త్రుంచి అతని హస్తమును నొప్పించెను. వెంటనే కృతవర్మయు మరియొక విల్లును ధరించి గుర్రములతోసహా సూతుని పడవైచి విల్లును త్రుంచెను. అంత ధర్మజుడు కత్తి యుద్ధమునకు దిగుట, అతడదికూడ త్రుంచుట, తోమరము

పూనిన దానినికూడ ఖండించి శరీరమున అమ్ములు నాటెను. అంత కృతవర్మ మహాబలమునెదర్చజాలక, ధర్మజుడు యుద్ధమునుండి నిష్క్రమించెను. ఇది యథామూలము.

తదనంతరము కర్ణునిచే ప్రయోగింపబడిన శక్త్యాయుధముచే ఘటోత్కచుడు నిహతుడైనాడు. అదిచూచి ధర్మజుడు చింతాక్రాంతుడై కొంతతడవునకు తెప్పరిల్లి రోషాక్రాంతుడై కర్ణునిగూర్చి, మున్ను అభిమన్యుచేత ధనువు ద్రుంచి మాకు పుత్రశోకకారణమై మరల నేడదేవిధమున పుత్రశోకానలము రగల్చెనని మనమున దు:ఖించుచు కర్ణునిచంపక శాంతిని బొంద నేరునే నిన్న, నేడులను ఆ ద్రోహికి ధర్ణనకు తోడ్పడిన ద్రోహుని తెగవేయవలెను. ఆ పనికి ధృష్టద్యుమ్నుని పంపుదును. నేను ఆ సూతసుతని కడకు పోయెదనని పలుకుచు శంఖనాదము చేసి, రథము పూయుమని సూతునాదేశించి మరలుచున్న సమయమున వ్యాసుడు ప్రత్యక్షమయ్యెను. ధర్మజునకు వ్యాసుడు ఘటోత్కచ మరణమనివార్యమని, అట్లుగాకున్న ఆ శక్తితో అర్జునుని దునుమాడుట తథ్యము గావునట్లగుటయే శుభమనిపల్కి మరియు తప్పక మీకు విజయము లభించి, రాజ్యశ్రీని పొందగలరని ఫుర:ఫల సూచనచేసి అంతర్హితుడయ్యెను. ఇది యథామూలము. వ్యాసుని వచనములువిని ధర్మజుడు సావధానుడై ధృష్టద్యుమ్ననితో, గురునిముందు సైన్యముతో భీముడు యుద్ధమొనరించుచున్నాడు, కావున అచటికేగి గురునితో యుద్ధమునకు తలపడవలసినదనియు, మరియు ద్రోణాచార్యుని వధించుటకే నీవు జన్మించినావని, అతని జనన కర్తవ్యమును సూచించెను. అతడును అట్లేయేగెను.

అంత ఆచార్యుడు పాండవసేనను చెండాడుట చూచి ధర్మజుడు అనుజులతోడ తమలో ద్రోణుని పరాక్రమమునకై వగచుచు, ఇతనిని నిలువరించుట ఎవరికీ సాధ్యముగాదు, అర్జునునకిది సాధ్యమే అయినను గురువునందు ధర్మవర్తనుడై ఊరుకొనినాడని చింతించుచుండగా, కృష్ణుడు వారల రథసమీపమునకువచ్చి అర్జునునితోనిట్లనియె. దేవదానవులక్తైన గురుని గెల్చుట అసంభవము. అందులక్తై ఒక్క మందు చెప్పెద వినుడు. సుతుడు నిహతుడయ్యెనను మాట వినినగాని అతడు అస్త్రసన్యాసము చేయడు. అచేష్టితుడైన గురునప్పుడు పరిమార్చవచ్చును. ఇది తప్ప వేరే ఉపాయమేమియును లేదు. కావున అశ్వత్థామ చచ్చెనని మీలో ఒక్కరు చెప్పుట కార్యముగ తోచుచున్నది. అంతట భీమ,నకుల, సహదేవులు మేలనిరి. అర్జునుడు మాత్రమందులకంగీకరింపలేదు. ధర్మజుడు విషాదాంతరంగుడై కొంతతడవు విచారించెను. అంతలో భీమునిచే అశ్వత్థామ అను పేరుగల భద్రగజము యుద్ధమున చంపబడినది. అది మనమునందుకొని అశ్వత్థామ చచ్చెనని భీముడు ఎరుకపర్చెను. అంతగురుడు అశ్వత్థామ చచ్చెననివిని నిశ్చేష్టుడై బెదిరి, అప్పలుకులు పెడచెవినపెట్టి, తట్టుకొనలేక విజృంభించి ధృష్టద్యుమ్ననిపై కలియబడెను. అంతనతనికడ్డు పడిన పాంచాలాది రథికులను ఇరువది వేలమందిని వధించి, మత్స్యబలముపైనురికి అయిదువందల రథములను, పదివేల గజములను, పదివేల గుర్రములను మట్టుబెట్టెను. అట్టితరి కశ్యపాదిగాగల సప్తర్షులు ద్రోణుని ఎదుట ప్రత్యక్షమై "నీవు బ్రాహ్మణుడవు, వేదవేదాంగవిదుడవు, యుద్ధము చేయుట నీకు ధర్మమగునే, యింతవరకు చేసినది చాలును. ఇక కాలము పరిపూర్తి అయినది. కావున నీవు నిష్క్రమించుటమేలు, కాన మా మాటలవధరించి అస్త్రములు పారవైచి శాంతినందుము" అనిపలికి అంతర్హితులైరి. ద్రోణుడును వారి మాటలకు తెలివొంది, భీమసేనువచనములును తలచుకొనుచు, అగ్రభాగమున ధృష్టద్యుమ్ననిని కనుగొని వికలచిత్తుడై , శోకాయుతుడగుచు నిజపుత్ర మరణవార్త ధర్మజునివలన ధ్రువీకరించు కొనవలెనని అతనినడిగెను. ఇదియథామూలము.

123. అయ్యవసరమున శ్రీకృష్ణుడు ధర్మనందనునితో "ఈ దివస మధ్యాహ్నమువరకు ద్రోణుడు యుద్ధము చేసెనేని మన యోధులెవ్వరూ నిలుపజాలరు. ఇది పాగడ్తకాదు. ఎదురుగ కన్పించుచున్న సత్యము. కావున మమ్ములనందరిని గురుని బాధముల కెరవేయక, సముచితముగ కాచుకొనుము. కావున అతని కొడుకు చనిపోయెనని చెప్పుము. అందువలన అసత్య దోషమేమియు రాజాలదు. ప్రాణరక్షణ సమయమున అసత్యము పలుకనగును" **అనిపల్కెను. అంత యుధిష్ఠిరునితో భీమసేనుడు శ్రీకృష్ణుని యుపాయము మనమున నిడుకొని,** వాశవేంద్రుడగు ఇంద్రవర్మ భద్రగజము అశ్వత్థామ **అనుదానిని చంపితిని. అదియె గురునికి విన్నవించిన, అతడు అనాదరము చేసెనని, కావున గోవిందుడు ఉపదేశించినరీతిగ, కుంజరనెపమున అశ్వత్థామ చచ్చెనని గురునితో చెప్పమని, అందువలన గురుడు నీ మాటలునమ్మి యుద్ధవిరక్తుడగునని పల్కెను. అంత ధర్మజుడు వారిరువురి మాటలను మనమున తర్కించుకొనుచు యెటుల జరుగ వలసినది, అటుల జరుగునని నిశ్చయించుకొని ఆ కార్యమునకు సమ్మతించెను.** అసత్య భయము, యుద్ధ జయము **అను రెండింటి మధ్య సంఘర్షితుడగుచు ధర్మజుడు** ద్రోణునకు వినబడునట్లు ఎలుగెత్తి అక్షరములు తడబడుచుండ అశ్వత్థామహతుడయ్యెనని అతనికి వినబడకుండగ కుంజరమనెను. **అట్లుపలికిన వెంటనె** ధర్మజుని రథము నేలకు నాలుగు అంగుళముల పైనుండెడిది భూమినకూరుకుపోయెను. **ఇదివిని నేలకల్ల ఎత్తున వెలుగుచున్న గురుని సమర జయశ్రీలు భూమిన దిగబడిపోయి తాను పాండుజన్ములకు ద్రోహిగ ఊహించుకొనుచు, ఆ సప్తర్షులట్లు చెప్పిరని వగచుచు, తనని ధృష్టద్యుమ్నుడు నిరుత్తరుడై చూచుచున్నయెడ, ధృష్టద్యుమ్నుని రథ, సూత, కోదండ, కేతనములు త్రుంచివైచెను. అంత ధృష్టద్యుమ్నుడు గదతీసుకొన్న, దానిని పొడిచేసెను. ధృష్టద్యుమ్నుడుగూడ గురుని రథ, సూత, కోదండ, కేతనములు త్రుంచి, మేనున శరములు నాటెను. కృతవర్మాదులుకూడ కలసి గురుని నొప్పించెను. గురుడు విజృంభించిన తోడనె ధృష్టద్యుమ్న, భీమాదులు తప్పించుకొనిపోయిరి, వారిని పొమ్మనమని నిశ్చలచిత్తుడై యుండెను. ఈవిధముగ ద్రోణుడు నాలుగుదివసములు, ఒక్కరాత్రి, ఐదవదివసమున ఇరువది ఘడియలు యుద్ధముచేసి పాండవ బలమును దునుమాడెను. పిదప గురుడు శాంతినిబొందిన చిత్తముతో సేనవైపు జూచి ఓకర్ణ, ఓకృప, ఓసుయోధనా! అనిపిలుచుచు నా చేతనయినంత నే చేసితిని, యిక నిశ్చింతగ సుగతికి పోవలదలచితిని. కావున అస్త్రసన్యాసము చేయుచుంటిని. మీరిక తెలివిగలిగి ప్రవర్తించుడని అస్త్రములను పారివైచి యోగనిష్ఠాగరిష్ఠుడై రథముపై కూర్చుండెను. అంత ధృష్టద్యుమ్నుడు పాదచారియై రథమును సమీపించెను.** గురుని ఆత్మజ్యోతి సంజయ, శ్రీకృష్ణార్జున, ధర్మజ, కృపాచార్యాదులు చూచుచుండగ పరమస్థానమునకు జనియెను. **అంత ధృష్టద్యుమ్నుడు రథమునెక్కి ద్రోణశవ శిర: కేశములను పట్టెను. అంత వెనుకనుండిధర్మజుడు మాను,మానుమని పలుకులాకసమున సుడులు తిరుగుచుండగ ఖడ్గమున ద్రోణ మస్తకమును ఖండించెను. ఇది యథామూలము.**

ఇచట ధర్మజ ప్రవర్తనము 'అశ్వత్థామహత: కుంజర:'**అను నానుడిగ మారినది. అందుచే యిచట యౌచిత్యమును కొంతపరిశీలింప వలసియున్నది.**

లోకమున సాధారణ దృష్టికి కొన్ని పనులు పుణ్యకార్యములు, మరికొన్ని పాపపు చర్యలు. కాని ధర్మసూక్ష్మముచే చూచినచో, పాప, పుణ్య కార్యముల మధ్యగల సీమారేఖను గుర్తించుట కష్టము. సత్యనిష్ఠయనుకొని ప్రాణభీతుని ఉనికిని, చంపగోరెడి దుర్మార్గునకు తెలియచెప్పుట నిజమైన సత్యపాలనము కాదు. ఉత్తమ ప్రవర్తనముల లక్ష్యము లోకకల్యాణమే గదా!

భూభారమునడంచుటకు, దుష్టశిక్షణమొనర్చుటకు అవతరించిన శ్రీకృష్ణుని సంకల్పమే మహాభారత యుద్ధము. కౌరవ, పాండవ విరోధము శ్రీకృష్ణుని దృష్టిలో కేవల మిష మాత్రమే. దుష్టక్షయమై, భూభారము తొలంగుటకీయుద్ధము నిర్దిష్టమని మహర్షులకు తెలియును. కనుకనే "విశ్వామిత్ర జమదగ్ని భరద్వాజ గౌతమ కశ్యప వశిష్ఠాత్రి ప్రభృతి మునివర ప్రకరంబాతని పాలుదేతెంచి, భారద్వాజా ! నీవు బ్రూహ్మణుండవు, వేదవేదాంగవిదుండవు. నీవు సంగ్రామంబు నేయ ధర్మంబగునే యింతకు మున్న చేసితేనియు (జేసెతి గాని కాలంబు ప్రొర్లంబయ్యె గాననింక్షనుడుగుట మేలు మా మాటలు వట్టి యాయుధంబులు వెట్టి శాంతి బొందుమని) చెప్పి యంతర్ధానంబు నొసిన"

ఇచట ఒకవిషయము స్పష్టము. మహర్షులకు రాజధర్మములు, యుద్ధధర్మములు తెలియనివి కావు. అట్టితరి రణరంగమున కౌరవుల పక్షమున పోరుచున్న ద్రోణుని విరమింపమనుటలోని ఆంతర్యమేమి? యుద్ధము రోజులు వెంబడి జరుగునట్టిదియే కాని, సంవత్సరముల తరబడికాదు. అట్టితరి చెల్లనున్న ఆయువు విధి నిర్వహణమునందు చెల్లుట ధర్మముగదా! యుద్ధము విరమింపుమనినారే కాని యుద్ధమున చావమనలేదు. మధ్యలో దుర్యోధనునిమోసగించి ద్రోణుడు వెనుకకు పారిపోజాలడన్న విషయము నాటి సామాన్యులకుకూడా తెలిసినట్టిది. వీనినన్నింటిని క్రోడీకరించినచో ఒక విషయము స్పష్టము. ధర్మపక్షపాతులైన పాండవ విజయమునకు తోడ్పడవలయునని మహర్షులాదేశించినటుల తెలియగలదు. ద్రోణనకుగాని, ధర్మజునకుగాని నరకప్రాప్తిని గోరుట మహర్షుల లక్ష్యము కాదుగదా! కనుక నారాయణ లక్ష్యసాధనకు సహకరించు సర్వకార్యములు పుణ్యప్రదములేనన్న భావము మహర్షుల సందేశమున ధ్వనితము.

ఈ సందర్భమున ద్రోణుడు అశ్వత్థామ మరణవార్త ధర్మజునివలన ధృడపరచుకొనవలెనని నిశ్చయించుకొనగ, శ్రీకృష్ణుడు ధర్మజునకిచ్చిన సందేశము గమనార్హము.

తే. అడరి యీదివసమునపరాహ్ణమునను, ద్రోణుఁడనినేసినట్టినఁద్రుంగిపోక
యుండ నెర్తురెయిక్కడి యోధులెవ్వ, రైన వినునుతిగాదు సత్యమ్ముసుమ్ము-ద్రోణ-పంచ-309

కం. మమునీతని కొప్పింపక, సముచితముగఁగాచికొనుమసత్యవచనదో
షములేదు ప్రాణరక్షణ, సమయంబున నతనికొడుకుసచ్చెన యనుమీ-ద్రోణ-పంచమ-310

ప్రకృతము పైనుదహరించిన వానిలో రెండవ పద్యమును చూతము. "మముద్రోణున కప్పగింపకుమని" శ్రీకృష్ణుడు కోరినాడు. నిజముగ చూచినచో శ్రీకృష్ణుడపజయమునకు భయపడినాడా? లేదనియె చెప్పవలసివచ్చును. అర్జునునికుపదేశించిన భగవద్గీతా సందర్భమున సర్వులను తానెప్పుడో సంహరించినాడనిన భావమునందించినాడు శ్రీకృష్ణుడు. అట్టి శ్రీకృష్ణుడు యుద్ధ విజయమున్నకై ధర్మజుని అసత్యము చెప్పమనుటేల? దానికి సమాధానము కూడా యిచటనే చెప్పబడినది. ప్రాణరక్షణకై అసత్యమును పలుకవచ్చునని సమర్థించుట జరిగినది. దీనిని వ్యాస భగవానుడు నారాయణావతారుడైన శ్రీకృష్ణముఖమున వినిపించుట గమనార్హము, అనగ అశాశ్వతమైన ప్రాణరక్షణకై బొంక వచ్చునన్నచో, శాశ్వతమైన ధర్మస్థాపనకు సహకరింపగలిగినాడు. అనగ ధర్మమును బాధించువారిని శిక్షించు సమయమున, బొంకుట లోకకల్యాణ కారకమేగాని, పాపకార్యము కాదని శ్రీకృష్ణుడు వ్యాఖ్యానించినటుల భావింప వచ్చును. అంతియేకాదు. ద్రోణ, అశ్వత్థామల ఆయు: ప్రమాణములు త్రికాలవేత్తయయిన శ్రీకృష్ణునకు తెలియనివి కావు. తన సంకల్పముచే శ్రీకృష్ణుడు వారినెప్పుడో జీవన్మృతులను గావించినాడు. కేవలము శస్త్రభూతముచేతనో లేక అస్త్రభూతము చేతనో వారు నేలకొరుగునటుల భావింపజేయుట వానిలీలగ భగవద్గీతా బోధనవేళ శ్రీకృష్ణుడే చెప్పియున్నాడు. అందుచే అశ్వత్థామను హతునిగ లెక్కించి పల్కుట ధర్మజునకు దోషముగాదని, శ్రీకృష్ణుడు పలికినటుల భావింపవచ్చును. శ్రీకృష్ణ సూచనలోని అంతరార్థమును మేధావియైన ధర్మజుడుకూడా గ్రహించినటుల కాన్పించును.

కం. మదినెయ్యిరువురమాటలుఁ, బదిలంబుగఁబట్టికొనుటఁబట్టియునెట్లుం
దుదినదియట్టులకాఁగల, యదియైయుండుటనుదానికతఁదొడఁబడియెన్-ద్రోణ-పంచ-312

పై పద్యమున దుదినదియట్టుల కాగలయది అను మాటలు గమనార్హములు. చివరకు ద్రోణాశ్వత్థామలు గతింతురని ధర్మజుడు భావించినటుల పైమాటలు స్థూలార్థము.

కాని ఆ క్షణముననే పాండవసైన్యము ప్రాణభీతిలోనున్న తదధిపతియైన ధర్మజుడును, భవిష్యమున తామే నిలుతుమనియు, ద్రోణాదులు నశింతురనియు భావించెననుట ఉచితముగ కాన్పింపదు. అందుచే ఇందలి వ్యంగ్యార్థమును గమనింప వలసియున్నది. తన్ను ప్రోత్సహించి, బాసటగ నిలిచిన పరమాత్మయగు శ్రీకృష్ణుడు కౌరవనాశనము నూహించిన వాడగుటచే, ద్రోణాశ్వత్థామలను మృతతుల్యులుగ భావించి, తన్ను నిమిత్తమాత్రునిగ భావించుకొని, శ్రీకృష్ణసంకల్పమున తమ్ము విజయులుగా ఊహించుకొనెననుట సందర్భోచితమే గాక, పై వాక్యములలో వివరించిన మహోర్వుల భావనకు, శ్రీకృష్ణ భావనకు బలమునిచ్చునట్టిది కాగలదు.

==========

కర్ణపర్వము – ధర్మజపాత్ర

యుద్ధరంగమున ధర్మజుడు పొందిన అవమానములకు పరాకాష్ట ప్రాయమైనట్టిది కర్ణపర్వము. భీష్ముడు పది దినములు యుద్ధమొనర్చినను ధర్మజుని అవమానింపలేదు, అటులనే ద్రోణుడును ధర్మజునిపై వాత్సల్యమునే ప్రదర్శించినాడు. దుర్యోధనుని కోరికపై ధర్మజుని పట్టియిచ్చుటకు ప్రయత్నించినను అందు దుర్యోధనునిపట్ల స్వామిభక్తి యుండవచ్చును గాని ధర్మజునిపట్ల నిరశన భావములేదు. ఇక భీష్మ ద్రోణులనినచో ధర్మజునికికూడ గురుభావనే కనుక వారి వలన మరణము సంభవించవచ్చునేమో కాని అవమానమునకవకాశమే లేదు. కాని కర్ణునితోడియుద్ధము యిందుకు భిన్నమైనట్టిది. నిజము చెప్పవలెనన్న ధర్మజుని దృష్టిలో కౌరవసేనలో కర్ణుడొక్కడే పరాయివాడు. అంతియె కాదు సూతపుత్రుడును. అటుపై దుర్యోధనుని ఆశ్రయించి, యజమానిని మెప్పించుటయే లక్ష్యముగాగల బానిసవలే, ఆదినుండియు కర్ణుడు పాండవులను చులకనగా చూచినట్టివాడు. ఆ సందర్భముగ పగపట్టిన దుశ్శాసనాదులకన్న, పగగొన్న వానివలె, సాధ్వియగు ద్రౌపదినుద్దేశించి అవమానపూరిత వాక్యములను నుడివినాడు. కురుపాండవ విరోధమునకు ఆరంభమెక్కడైనను, వారిరువురును అన్నదమ్ముల పిల్లలగుటచే రోషము, వాత్సల్యము రెండునొకదాని వెనుకనొకటి కాన్పించుట కవకాశమున్నది. దుర్యోధన, దుశ్శాసన, శకునులు మువ్వురును విడిచినచో మిగిలిన కురువంశ పెద్దలెల్లరును పాండవులపట్ల ద్వేషము లేనివారనియు, వాత్సల్యము కలవారనియుకూడ చెప్పుటకు వలసినన్ని సందర్భములున్నవి. కాని ఇరుపక్షములకు ఏమియును కానివాడు కర్ణుడొక్కడే. కనుకనే ఇరుపక్షములలోను దుర్యోధన, దుశ్శాసన, శకునులు తప్ప మరెవ్వరును కర్ణునినిండుగా అభిమానించినటుల కన్పింపదు.

ఇక యుద్ధరంగమున కర్ణుని స్థితి శత్రువునకు కూడ ఏర్పడరాదన్న వ్యధతో కూడినట్టిది. కర్ణుడు కుంతీసుతుడని, వాని జన్మరహస్యమును చెప్పవలసిన సమయమున శ్రీకృష్ణుడు కర్ణునకు చెప్పియున్నాడు. ఆ విషయము ధర్మజునికికూడ చెప్పియుండినచో భారతయుద్ధము ఎటులుండెడిదో ఊహింపజాలము. కానిపరోక్షముగ కర్ణవధకు శ్రీకృష్ణుడే తగిన పునాది వేసియున్నాడు. దానిని బలిష్ఠమొనర్చినది కుంతి. ఆమె కోరికపై అర్జునుని తప్ప మిగిలిన సోదరవర్గమును చంపనని కర్ణుడామెకు మాటనిచ్చినాడు. ఇట్టితరి ధర్మజ, భీమ, నకుల, సహదేవులతోడి యుద్ధసమయమున కర్ణుని మనోవ్యధ ఊహకందనట్టిది. ద్వేషముతో ధర్మజుడు, ఏదియో ఒకమూల తెలియని వాత్సల్యముతో కర్ణుడు తలపడినప్పుడు కర్ణ పరాక్రమము నీరుగారిపోవుట సహజము. అయినను ధర్మజునోడించి పిరికిపందగా పారిపోవుచున్న ధర్మజుని వెంబడించి తల్లి మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని విడిచిపుచ్చిన కర్ణుడధికుడో ? ధర్మజుడధికుడో ? సహృదయులు నిర్ణయించ వలసియున్నది.

ఈ కల్పిత విరోధములతో, అన్యపక్షమునకు తెలియని గుప్తవాత్సల్యముతో మ్రగ్గిపోయిన ఇరువురి మనస్తత్వములకు దర్పణప్రాయమైనట్టిది కర్ణపర్వము. అర్జునునిచే, శ్రీకృష్ణునిచే, కుంతిచే, ఇంద్రునిచే, ధరచే, భార్గవునిచే ప్రత్యక్ష పరోక్షములుగ వధింపబడిన కర్ణుని చేతిలో చిత్తుగా ఓడిపోయి, గుడారములకు చేరి అర్జునుని గాండీవ సహితముగ నిందించి, పగతో రొప్పిన అశక్త భీరువుగ ఈ పర్వమున ధర్మజుడు గోచరించును. ఇందుకు కుంతి కారణమా? విధికారణమా? అనునది యెట్లున్నను ధర్మజుడు కూడా అజ్ఞానాంధకారముననే ముంచి వేయబడినాడు. కర్ణమరణానంతరము స్త్రీ పర్వమున కర్ణునిపుట్టువును గూర్చి తెలుసుకొన్న ధర్మజునిలో భ్రాతృవాత్సల్యము వెల్లువై ప్రవహించినను యుద్ధాంతమువరకు కర్ణునిపట్ల ద్వేషముతో, భయముతో మ్రగ్గిన అశక్తునివలె ధర్మజుడుండవలసి వచ్చినది. ఈ స్థితిని దృష్టినిడుకొనియె ఈ పర్వము పరిశీలింపబడినది. ద్రోణ మరణానంతరము, దుర్యోధనుడు కర్ణునకు సర్వసేనాధిపత్యముకట్టి పాండవులతో యుద్ధమునకు సన్నద్ధము చేసెను.

అంత కర్ణుని ప్రథమదివస యుద్ధమున రాధేయుడు దుస్సహంబైన మకరవ్యూహమును నిర్మించి, కౌరవ ముఖ్యులను తగుస్థానములందు నియోగించి యుద్ధమునకు సిద్ధపడినాడు. అంత పాండవముఖ్యుడైన ధర్మరాజు కౌరవ వ్యూహమును జూచి అర్జునునితో నిట్లుపలికెను.

124.చం.కనుఁగొనఁజుల్మనైనయదికౌరవసైన్యముగంటెసూతనం

దనుఁడొకయొడ్డుగానిలిపితానుముఖంబుననిల్చికయ్యమె

ల్లనుదనమీఁదఁబెట్టికొనిలావున బీరముఁజూపఁబూనియే

పుననఱిమెన్ భవద్విశిఖపుంజములందెగటార్పుమీతనిన్ –కర్ణ–ప్రథమ–**66**

కం. వనమునఁ బండ్రెండేఁడులు, మనముత్కటదుఃఖవార్ధిమగ్నులమైయి

ట్లునికికిఁ దగనితనిభవ, త్సునిశితబాణబ్ధిముందుపుదుర్ధమలీలన్–**67**– ఇది యథామూలము.

ధర్మజునకు ఆదినుండియు కౌరవ పక్షమునగల వీరులు బలప్రరాక్రమాదులు తెలియనివి కావు. భీష్మ ద్రోణాదులు తమకన్న శక్తివంతులే అయినను వారు పాండవ శ్రేయోభిలాషులుగాన వారివలన తమకు వచ్చు భయమేమియును లేదు. కావున వారిని వారి నిజవధోపాయముల వలననే అడ్డతొలగించుకొనినాడు. కాని కర్ణుని విషయమట్టిది కాదు. కావుననే పలుసందర్భములలో ధర్మజుడు కర్ణుని తలచుకొనినచో నిద్ర పట్టుటలేదని వాచ్యముగనే చెప్పినాడు. కారణము అతడు దుర్యోధనునకు తన ప్రాణములొడ్డైనను రాజ్యము సంపాదించి పెట్టెదననియు, మరియు అర్జునునితో సమానమైన విలుకాడు తనేననియు, యుద్ధమందు పాండవులనెట్టైనను మట్టుబెట్టెదనని దుర్యోధనునితో పలుసందర్భములలో వాచ్యముగ పలుకుట, దుర్యోధనుడుకూడా కర్ణుని బలపరాక్రమాదులను గట్టిగ నమ్ముటచే యుద్ధమునకు సిద్ధపడినాడు. మరియు అతని కవచకుండలములు, దివ్యాస్త్ర సంపద ధర్మజుని బాగుగ కలతపెట్టినటువంటివి. అతనిని నిర్జించు ఉపాయము పాలుపోవకుండుట ధర్మజుని భయాగ్నికి ఆజ్యము పోయుటవంటిది. కాని ప్రస్తుత కర్ణుని పరిస్థితి ధర్మజునికి కొంత ఊరట కల్గించినది. కారణము అతని శాప వృత్తాంతములు తెలియుటవలన, కవచకుండలాదుల దానమువలన, తద్వారా లభించిన శక్త్యాయుధము ప్రయోగింపబడుటవలన, శల్యుడు తనకిచ్చిన మాట నెరవేర్చుననెడి నమ్మకము వలనను ధర్మజుని చిత్తము కొంత ప్రశాంతతనందినది. అందుచేతనే ధర్మజుడు తమకిట్టి అవస్థలన్నిండిటికి ఈ కర్ణుడే పరోక్షముగ కారణభూతుడు, గావున అట్టివానిని తెగటార్పుమని అర్జునునికి నొక్కిచెప్పుటలో ధర్మజుని మనమునందుగల భయ, క్రోధ, అవేదనలు వ్యక్తీకరించబడినవి. మరియు

125 ఉ.వీఁడొకరుండెయింక బలవిక్రమసంపదగల్గి పోరిలో

వాఁడిమిసొంపుసూపఁగలవాఁడుసుయోధనుపాలఁబేర్చునీ

వేఁడిమిసూపిరూపుడఁపు వీనిఁబురందరపుత్రయంతతోఁ

బోఁడిమిమాలునాతఁడు ప్రభూతజయోన్నతినిల్చునీకడన్–కర్ణ–ప్రథమ–**68**

పై పద్యమున ధర్మజుని మనోనిబ్బరమును గమనింపవచ్చును. ఒక్క కర్ణుని చంపివేసినచో ప్రభూత జయోన్నతి నిల్చునీకడన్ అనగ విజయము తన్నేవరించునని ధర్మజునకు తెలియననియే భావము. అటులనే మిగిలిన కురువీరులందరు వారినేమి చేయలేరను భావమిటస్పష్టము. కురువీరులందరిలోన ఒక్క ఒక్కకర్ణునికి మాత్రమే ధర్మజుడు భీతిచెందినట్లు స్పష్టము. కావుననే అర్జునునకు పదిసార్లు కర్ణుని అంతమొందించుమని నిర్ద్వంద్వముగ పల్కినాడు. ఇది యథామూలము.

అంతనర్జునుడు అర్ధచంద్ర వ్యూహమును పన్నినాడు. అందు యుధిష్ఠిరుడు మధ్యస్తుండైయుండెను. అంత ఇరుపక్షములకు భీకర సంగరంబు జరిగెను. అందు ధర్మజుడు దుర్యోధనునితోడ యుద్ధమునకు సమకట్టినాడు.

126. ఉ.కౌరవరాజుధర్మజుఁడుఁగయ్యముసేయునెడంగడంకమైఁ
గౌరవరాజుధర్మజునికాయమునన్ నవసాయకంబులన్
సారధిమేననొక్కపటు సాయకమున్ నిగిడింపనాతఁడు
న్ఘోరతరాక్షుఁడై యతనినొంచెఁ ద్రయోదశసాయకాహతిన్-కర్ణ-ప్రథ-**181** - వ. నొంచి తోడన-**182**

తే. తునియలుగఁజేసెహరులఁజతుశ్శరముల, సూతుఁబంచమమునఘునకేతుయష్టి
షష్టమునఁజాపదండంబు సప్తమమున, నలిగియెత్తిన కరవాలమష్టమమున-**183** -ఇది యథామూలము.

యుద్ధ సందర్భములందు ధర్మజుడు అంతగా కనపడకపోయినను, కనిపించిన సందర్భములలోని ధర్మజుని యుద్ధపరాక్రమము కొట్టవచ్చినట్లు కాన్పించును. పై పద్యములందు సుయోధన, ధర్మరాజులు యుద్ధము వర్ణితము. ముందుగ సుయోధనుడు తొమ్మిది శరములతో ధర్మజునినొప్పించి, సారధితనువున ఒక వాడి అమ్మును సంధించినాడట. అంతధర్మరాజు క్రోధావేశుండై పదమూడు బాణములు దుర్యోధనునిపై సంధించి, మరియు నాలుగుశరముల రథాశ్వములను, ఐదవ బాణముతో సూతునిజంపి, ఆరవ బాణముతో కేతనమును దునిమి, ఏడవ బాణముతో విల్లునుత్రుంచి ఎత్తిన కరవాలమును ఎనిమిదవ బాణముతో ప్రక్కలుజేసెను. అంత దుర్యోధనుడు ఐదు శరములు ధర్మజుని వక్షముననాటి, రథముపైనుండి క్రిందకు దుమికెను. అంతలో అశ్వత్థామ, కర్ణ, కృపాదులు విచ్చేసి దుర్యోధనునకు, అనుజులందరు కలసి ధర్మజునకు బాసటగ నిలిచి యుద్ధము నిర్వహించిరి. కొంత తడవాగి మరల దుర్యోధనుండు మరియొక రథారూడుడై పాండవాగ్రజుని ఢీకొనెను. మరల వారిరువురి మధ్య ఘోరయుద్ధ మారంభమయ్యెను.

127. సీ.పాండవుచాపంబుఖండించె నీకొడు, కొండొక ధనువెత్తియుఱకయాతఁ
డక్కురునాథువిల్ గ్రక్కునఁదునుమాడె, నతఁడువేరొకవింట నతనినేయ
నయ్యుధిష్ఠురుఁడునానాస్త్రంబులేసిన, నాచ్ఛాదితంబయ్యె నంబరంబు
వారొండొరుల రక్తధారాప్లుతులఁజేసి, పుల్లకింశుకభంగిఁ బొలిచిరేచి

ఆ. ఘోరశక్తి వైచెఁగౌరవపతియది, నడుమఁదునిమి ధర్మనందనుండు
నొంచెనిశితవిశిఖపంచకమ్మున నమ్మ, హీశునురముదర్పమెసకమెసఁగ-కర్ణ-ప్రథమ-**192**

వ. ఇట్లుకొంతేయు ముఖ్యుచేతనొచ్చియు గాంధారీ నందనుండు. -**193**

చం. బరవసమొప్పఁ గ్రూరనవభల్లవిదారితుఁజేసె నమ్మహీ
శ్వరునతఁడల్గిబల్పిడుగుచాడ్పు శిలీముఖముచ్చిపోవన
క్కురుపతినేయఁ గయ్యమునకుందుదియప్పుడచేయువాఁడుగా
నరదముడిగ్గె నాతఁడుగదాకలనోద్భట బాహుదండుఁడై-కర్ణ-ప్రథమ-**194**

కం. డిగిరయమునఁ గదసిననా, జగతీపతియేచి యుగ్రశక్తినురము బె
ట్టుగ వైచిన నీతనయుడు, మగుడఁగ రథమెక్కె వింటమార్కొనువాఁడై -**195**

అట్లిరువురు బాహుదర్పముమెరయ యుద్ధముచేసి తుదకు ధర్మజుని దెబ్బలకు రక్తముగ్రక్కుకొని మూర్ఛితుడైనాడు దుర్యోధనుడు. కర్ణుని రెండవనాటి యుద్ధమున ధర్మజుడు బృహస్పతి అనుమతంబైన దుర్జయ వ్యూహమునుపన్నెను. అంత కర్ణుడు సుయోధనునితో ఈరోజు అర్జునునెదుర్కొందును. అందులకై శ్రీకృష్ణునితో సరితూగగల సారధియైన శల్యుని తనకు రథసారథ్యమును వహించమని కోరెను. అందులకు దుర్యోధనుడు ఒడంబడి శల్యుని ఒప్పించుటకు, తనకిచ్చినమాట నిలబెట్టవలసినదిగా ప్రార్ధించెను. అంత శల్యుడు తానా నీచకర్మకు యెట్టులోర్చు దునని పలువిధముల పలికి, యెట్టకేలకు అంగీకరించెను.

<u>ద్వితీయాశ్వాసము:</u>

కర్ణుని రెండవనాటి యుద్ధమున శల్యుడు కర్ణునకు రథసారథ్యము వహించెను. కాని ధర్మజునకు ఒసంగినమాట ప్రకారము కర్ణుని బలపరాక్రమాదులను కించపరచుచు, పాండవుల ధైర్యములను పొగడుచు కర్ణునికి నిరుత్సాహము గలిగించు చుండెను. అంత కర్ణుడు ధర్మజునితో యుద్ధము సేయుటకు వెడలిన, అర్జునుడు ధర్మజునకు సహాయకునిగ చేరెను. అంతనర్జునునితో ధర్మజుడిట్లు పలికెను. ఇది యధామూలము.

ఉ. సూతతనూజ మొహరముసూచితె యెంతయుగట్టియైసము
ద్ధోతితభంగిఁదోఁచెనది యుక్కునఁబైపడియబ్బలంబుని
ర్ధూతముసేయకుండఁగ నెదుర్కొనియెమ్మొయినిల్వరింతమ
న్నీతివిధింపు మాబలుపునేర్పునుదజ్జులుపిచ్చలింపఁగన్ -కర్ణ-ద్వితీయ-146

మరియు నీవు రాధేయుని గెలువుము. ఏను కృపునితోడ యుద్ధము చేసెదననెను. అతడును అట్లే అని వెడలెను. అనంతరము జరిగిన సామూహిక యుద్ధమున కర్ణునిపై సత్యక నందనుడు ఏడు బాణములు, శతానీకుడు ఏడు, ద్రౌపదీయులు డెబ్బదిమూడు, ధృష్టద్యుమ్నుండును, శింఖడియు పది, పది, భీమసేనుడు అరువది నాలుగు సహదేవుడు ఏడును, నకులుడు ముప్పదియును, యుయుధానుండు ఏడు, పాండవాగ్రజుండు నూరును బాణంబుల ఆ సూతపుత్రుని నొప్పించిరి. వారలనందరిని ఎదుర్కొని కర్ణుడు ధర్మజుని బాధింపవలెనని యెంచి వచ్చిన ధర్మజునకు సాత్యకి, శిఖండులు సహాయకులుగ నిల్చిరి.

అనంతరము కురువీరులు కొందరు కర్ణునితో గలసి ధర్మజాదులతో సంగ్రామంబొనరించిరి. అందు ధర్మజ కర్ణులకు ఘోరయుద్ధము జరిగినది. ధర్మజుడు కర్ణునిపై బాణములనేయగ, అతడు నవ్వుచు ధర్మజునివిల్లును త్రుంచివైచెను. మరియు తొంబది అమ్ముల ధర్మజుని నొప్పించెను. అంత ధర్మజుడు శక్తివైచిన కర్ణుడు ఏడుబాణములు సానిపి నెత్తురు చిందునట్లు చేసెను. దానికి కర్ణుడు ధర్మజుని రథసారథిని చంపి, కేతువుద్రుంచి శరముల అతని నొప్పించెను. అత్తరి సాత్యకి, శిఖండులు కర్ణునితో యుద్ధమునకు తలపడిరి. వారిని విరథులుగా జేసి శరీరముల అమ్ములనాటి రయమున ధర్మనందనుని కలిసెను.

128. అంత ధర్మరాజు హతసారథికంబగు రథంబు తోలుకొని పోవుటకునుద్యుక్తుడగుచుండగ అతనిని నిలువరించి హాసభాషితుడగుచు రాధేయుండు ధర్మజునితోనిట్లనియె.

సీ. క్షత్రియకులమునజన్మించి యిదిధర్మ, మిదియధర్మంబని యెల్లనెఱిఁగి
నట్టినీకిట్టిమహాహవమునఁ బ్రాణ, ములు డాఁచికొన శాత్రవులకుఁదొలఁగి
పోవుటదగునె నీబుద్ధిగానఁగనయ్యె, నృపనీతియెఱుఁగవునీవుబ్రాహ్మ
ణాచారవేదివి యాగాధ్యయనముల, వర్తింపుకయ్యంబువలవదుడుగు

తే. మింకననుబోఁటిఁదొడరిన నింతకంటె, నెడరువాటిల్లు వేగపొమ్మంటికడకు
హరియుఁబార్థుఁడునున్నెడకైన నరుగు, మేనుదెగనీదుప్రాణానకింతనిజము-కర్ణ-ద్వితీయ-194

వ. అని పలికి గొంతి వచనంబులు మనంబుననునికింజేసి వధియింప నొల్లనివాఁడై యప్పాండవాగ్రజు విడిచి యాపురుష సత్తముండు తదీయసేనాసముదయంబు నానాస్త్రనిహతంబునేసె లజ్జాకుల మానసుండగు నమ్మానవపతి యును దత్ప్రదేశంబున నిలువక తొలంగి పోయెంబోవుటయు-కర్ణ-ద్వితీయ-195-ఇది యథామూలము.

కర్ణుడు తొలుత కుంతికిచ్చిన మాటప్రకారము ధర్మజుని చంపకుండ విడువవలెనని తెలిసి, అతనిని అవమాన పర్చుటే లక్ష్యముగ ధర్మజునితో యుద్ధమునకు సిద్ధపడినాడు. ఇక ధర్మజపక్షమున జయాపజయములు రెంటిని సమానముగ గ్రహింపగల సమర్థుడు కాడు ధర్మజుడు. సుక్షత్రియుడయినవాడు రణమున ప్రాణములు పోయినను సహించునేమో కాని అవమానింపబడి రణమునుండి వైదొలుగుట క్షత్రియులకమర్యాద. అయినను సహించివచ్చుట ధర్మజుని దూరదృష్టిని చూపుచున్నది. "కయ్యమున్నక్నైన, వియ్యమున్నక్నైన సమవుజ్జీలవసరమని" లోకోక్తి. ఇట ధర్మజుడు కర్ణునకు సమవుజ్జీ కాడు. కావుననే వీరాధివీరుని చేతిలోనోడి, అవమానింపబడుట లెక్కలోకి రానట్టిదని ధర్మజుని భావనగ చెప్పవచ్చును. కాని కర్ణునియెడ అతనికి ప్రతీకార వాంఛ లేక పోలేదు. తగు సమయమునకై నిరీక్షితుడు.

129. మరియొకపరి యుద్ధమున ధర్మనందనుడు రాధేయునితో తలపడి అతని నెదిర్చి నిలువజాలక సారథితో రథమును యుద్ధమునుండి అవలకు తీసుకొని పొమ్మని చెప్పగ, అతడును అట్లేచేయునెడ కౌరవులు పోనీక ధర్మజుని వెంటాడిరి. అది చూచి కర్ణుడును ధర్మజుని వెంటాడి అతని శరీరమున అమ్ములునాటి శరత్రయమున సారథిని చంపి చతుశ్శరముల హయములను చంపెను. అట్టియెడ కవలలు ధర్మజునకు రక్షణగ వచ్చిరి. అంత కర్ణుడు వారి మువ్వురిని బాణపరంపరకు గురిచేసెను. అదిచూచి శల్యుడు ఏల ధర్మజునకడ్డంబడుచుంటివి. ఇతని చంపుటవలన ఫలమేమి, అనిపలికి అందుండి అతని దృష్టినిమరల్చి భీమార్జునులవైపు గొనిపోయెను. అంత ధర్మజుడు పీడిత శరీరుడగుచు తన శిబిరమునకేగెను. ఇది యథామూలము.

<u>తృతీయాశ్వాసము:</u>

130. కర్ణపరాక్రమమునకు తాళలేక ధర్మజుడు శరపీడితుడై యుద్ధభూమినుండి నిష్క్రమించెనని భీముడర్జునునితో పలుకగ, అతడు శ్రీకృష్ణసహితుడై ధర్మజమందిరమునకేగి అతని సేమంబరసిన, ధర్మజుడు వారలు కర్ణునివధించి వచ్చిరనుకొని ఆనందపరవశుడై వారలతో కర్ణుని పరాక్రమ ప్రశంసాదులను గావించి యిట్లనియె.

తే. అట్టిబల్లిదుననిఁదేగటార్చిమీర, లేమియునుగాకవచ్చితిరింతసంత
సంబుదొరకొనునే నామనంబుచింత, వంతయెల్లనుజెడ నరవర్యులార-కర్ణ-తృతీయ-30

చం. అతనికినాకునుంగలిగెనాహవమింతకుముందరందుఁబా
ర్థుతుఁడునుసత్యకాత్మజుఁడుశాంతనవాంతకరుండుద్రౌపదీ
సుతులునుజూడఁగానతఁడుసూతహయధ్వజపాతనంబుసే
సితనువుదీవ్రకాండములఁజెండఁగనేవెగడందితింగడున్-31 , అని తనుపడ్డపాట్లను యెరిగించి, మరియు

సీ. పదమూఁడువర్షముల్పగలునురేలును, గుర్తుదర్పంబెట్లుగడతునొక్కొ
యనుచింతఁజేసియాహారనిద్రలులేక, పరితాపమందితిఁబశువుఁజేయ
విప్రులుపట్టరావెఱసొచ్చియొదిఁగెడు, గవయంబుచాడ్పునఁగర్ణభీతి
నుల్లలనుడుకుచునుండుదుఁగర్ణుండు, విడువకమోమునవ్రేలునాకు

తే. సురనదీసుతుచేతను గురునిచేతఁ, బడనిపరిభవమున వాఁడువఱిచెనన్ను
నంతయుననీఁగఁగాంచి నీయట్టియనుజు, వలనఁదేజంబు వడసితినలఘుచరిత-33

అని తన మనమునగల కర్ణుని భయమును వాచ్యముగజెప్పి తన అనుజునివలన ఆ భయమునుండి తొలగి తేజంబు పొందెననుట గమనార్హము. ఇది యథామూలము. మరియు కర్ణుని వధోదంతము చెప్పుమనిన, అర్జునుడు కర్ణుడు చావలేదనియు, అతనిచే క్షతగాత్రుడైన ధర్మజునిచూడ వచ్చితిమని చెప్పగ, ధర్మజుడు బాధనొంది అర్జునునితో అలకనొంది యిట్లుపల్కెను.

కం. అనిలోఁదెరలుటదొలఁగుట, యనునివిసనుఁగాక నొచ్చియైనను గలనె
ల్లను వెడలఁజనునెయేన, ట్లునుగాకిటవచ్చుటం జులుకనైతిఁగడున్ -కర్ణ-తృతీయ-52

కం. వినుకర్ణునకేనోడితి, నన నేటికినీవునోడితనిలజమాద్రీ
తనయులు మున్నేయోడిరి, మనతోఁగూడంగఁ గంసమర్ధియునోడెన్-కర్ణ-తృతీయ-53

కం. కావున మనమిఁకననికిం, బోవంబనిలేదు విపినభూమికిఁజనియ
చ్చో వెఱపుదక్కి తపసుల, మైవిచ్చలవిడిఁ జరింతమందఱముఁదగన్-54

కం. కాదేని బిరుదులాడక, సాదులమై వినయమొప్పఁజని కురునాథుం
డేదిపనిచినను జేసిద, యాదృష్టినతండు సూచునట్లుండఁదగున్-55

పై పద్యములమూలకములు, తిక్కన కల్పితములు. ఈ ఘట్టమునకు పట్టునిచ్చునట్టివి.

అని కెంజాయరంజిల్లు కన్నులనన్నరు నాలోకించి -56

ఉ. నీ తెఱఁగిట్టిదేనిరణనిష్ఠకుఁబూనకకార్యవాదివై
ద్వైతవనంబునందసముదగ్రభుజాబలదుర్జయుండురా
ధా తనయుండువానిననిఁదాఁకనశక్యమునాకునన్ననే
నీతెరువేలవత్తు మహియేలనశక్తుఁడు గాంక్షసేయునే-కర్ణ-తృతీయ-57

తే. అనివధించెదఁగర్ణునేనని ప్రతిజ్ఞ, నేసియిటుదెచ్చిననిట్లునేసితింత
కెట్లునేర్చితి పొడువుగానెత్తి నేల, వైవనోర్చితిననుఁ బగవారినడుమ -58

ఉ. పంకజనాభుఁడున్వినఁగఁబల్కినయప్పులుకిమ్మొయిందుదిన్
బొంకగుటోర్చితిట్టినినుఁబుట్టినయప్పునుతించెఁబోరికిన్
శంకగొనందుగెల్చుఁగురుసంఘము నీతఁడుపుణ్యుఁడన్నయా
బొంకరిదివ్యవాణియుఁదపోధనులున్మమునిట్లలంతురే -కర్ణ-తృతీయ- 59

కం. వినుమప్పులుకులు పాటిగఁ, గొనిదుర్యోధనునితోడఁగొంటినిబగ ము
న్ననిజంబుగనెఱుఁగను వీఁ, డని రాధేయునకువెఱచుననియేనిన్నున్-60

అని మరియు దైవదత్తమైన అశ్వములు, రథము, గాండీవముండియు కూడ కర్ణుని చంపలేక యుద్ధమునకు భయపడి వచ్చితివనుట, దుర్యోధనుని ముందు ఎంత బేలతనముగ కన్పించును. మనకు సహాయపడుటకు వచ్చిన రథికరవరులందరు అప్రయోజనముగ ప్రాణములర్పించిరి. నేడభిమన్యుడో, ఘటోత్కచుడో యున్నచో ఈ పరిస్థితి ఎదురుపడునా! అని అర్జునుని పలువిధముల దూరి, కనీసము నీవు సారధివై నీ గాండీవము శ్రీకృష్ణునకిచ్చి రథిగ

అతనిని నిల్పినచో ఆ కర్ణుని చీల్చి, చెండాడి యుండెడివాడు. నీవు కుంతికి కొడుకుగ పుట్టి యుండకుండిన బాగుండునని హృదయశల్యమైన పల్కులు ధర్మజుని నోటివెంట వెలువడుట గమనార్హము. ఇదియథామూలము.

ధర్మజుడాడిన మాటలలో నిజమున్నది. అతడు అర్జున, భీమాదుల బలము చూచుకొనియెకదా! యుద్ధమునకు సిద్ధపడినాడు. అట్టితరి వారే యిట్లుశక్తులైయున్నచో తనేమి చేయగలడు. మరియొక విధముగ ఈ మాటలు శౌర్యోద్దీప నములుగ కన్పించును. భీమార్జునులు సభాస్థలిలో జనావళి చూచుచుండగ చేసిన ప్రతిజ్ఞలు నెరవేర్చనిచో, పాండవులకు చరిత్రలో కళంకమేర్పడును. ధర్మజుడు సుయోధనుపైగొన్న పగ నెరవేర్చవలెను. పాండవేయులనందరిని యుద్ధమున అవమానపర్చి, విడిచిన కర్ణుని తలద్రుంచవలెను. కాన అర్జునునకు పౌరుషము రగిలించి తద్వారా కార్య నిర్వహణము నకు దోహదపడవలెను. అదియే ధర్మజునిచేత యిట్టి మాటలాడించినది. ఈ మాటలు విన్న అర్జునుడు కృపాణముగైకొని అగ్రజుని శిరస్సు ఖండిచెందనని ముందుకురకగ, కృష్ణుడడ్డుపడి వారించెను. అందుల కర్జునుడు నాగాండీవమొరులకు యీయమని ఎవ్వడేని పలుకునో, వానితల, ద్రుంచవలెనని నా మనమున ప్రతిజ్ఞ చేసియుంటిని. అందులకై వీని వధింపవలెనని పల్కిన, అర్జునునకు శ్రీకృష్ణుడు శాంతింపజేసి పెద్దలను, గురువులను వధింపబూనుట పాపహేతువని పిన్నతనముచే చేసిన ప్రతిజ్ఞను ఉపసంహరింపుమని, అందువలన కలిగిన అసత్యదోషము పోవుటకు ధర్మజుని దూరుమని, అదియును చంపుటవండిదేనని ధర్మసూక్ష్మమును నుడివినాడు. ఇది యథామూలము.

131. అనంతరము అర్జునుడు ధర్మజునితోనిట్లనియె. యుద్ధరంగమున నిలువజాలక వచ్చిన నీవిట్లుపల్కుట కర్హుండవా! అని ప్రశ్నించెను. మరియు

కం. నన్నెఱిఁగియెఱిఁగియిట్లనఁ, జన్నెనీజిహ్వపెక్కుశకలములై పో
కున్నదియేలొకొ రణమున, నెన్నఁడునీవేమిసేసితింతయనుటకున్-కర్ణ-తృతీయ-87

సీ. నీవుజూదంబాడఁగా వైరబంధంబు, గౌరవజాతితోఁగలిగెమనకు
రాజ్యనాశంబునరణ్యవాసంబును, దాస్యదైన్యంబునత్యంత దు:ఖ
ములుఁదెచ్చికొంటిసిగ్గొలయదునీమనం, బుననించుకేనియుననికిఁజాల
కున్నవానికిఁదాల్మియొప్పగుఁగాకప్ర, ల్లదములుపలికిన లాఘవంబు

తే. నెందుమున్నేమిసేసినఁ జేసితింక, నైనదుర్బుద్ధి తనములుమాని తగిన
పౌరుషములేముసేయఁగనూరకుండు, మిదుమవడువారు సైఁతురేయింతవట్టు-89

అని యథేచ్ఛగా ధర్మజుని తిట్టెను. ఇట మూలమున అర్జునుడు ధర్మజుని దూరుసందర్భము విపులముగ వర్ణించబడినది. తెనుగున తిక్కన సంకీర్తీకరించి భావమును గ్రహించినటుల స్పష్టము. అనంతరము తత్ర్పాయ శ్చిత్తార్థము కరవాలము గైకొని తలద్రుంచు కొనుటకుద్యుక్తుడైనాడు. అంత శ్రీకృష్ణుడు యిది యేమిని ప్రశ్నించగ, అగ్రజుని ధర్మమూర్తిని దూరితిని గావున శిక్షనుభవించవలెనని పలుకగ, పెద్దలను ప్రశంసించుటయే పరిహారము, కావున అతనిని ప్రశంసాపూర్వక వచనములు పలికి ప్రీతినొందించుమని పలికెను. అంత అర్జునుడు ధర్మజునితో తానిదివరకాడిన మాటలను పెడచెవిన పెట్టమని, అన్యథా భావింపవలదని, నా తనువు, ప్రాణములు నీ సొమ్ముగ తలపుమని మరియు నేడు రాధను బుత్రరహితగా చేసెదను, కాదేని కుంతియైనను అగునని తన్ను దీవించి పంపుమని పలికెను. ఇది యథామూలము. అనిన ధర్మజుడిట్లనియె

132. చ. అనవిని యమ్మహీరమణుఁడాతనికిట్లనుమీకు నాకతం
బున బహుదు:ఖముల్‌గలిగె భూరికులంబునకప్రియంబొన

ర్చిన యవినీతుఁబాపపరువ్రేయఁదగుందలద్రెవ్వ నీమనం
బునఁ గృపపుట్టికాచినను బోయెదనిప్పుడయేనుగానకున్-కర్ణ-తృతీయ-97

కం. ననుఁదొఱఁగి నీవుసౌఖ్యం, బుననుండుము సమరభీతుభుజబలహీనున్
జనపతిఁగాఁజేయుటయొ, ప్పునెకట్టుముపట్టమనిలపుత్రునిఁబ్రీతిన్ -98

అని పలికి వానవాసోన్ముఖుడైన ధర్మజునికి, కమలనాభుడు ప్రణమిల్లి, అర్జునునికి, తనకిమధ్య జరిగిన సంగతంతయుచెప్పి శాంతింపజేసెను. తదుపరి ధర్మజుడు శ్రీకృష్ణార్జునులకిరువురికి ఆశీర్వాదమునొసంగి సమరమునకు పంపెను. ఇది యథామూలము.

133. కర్ణ వధానంతరము శ్రీకృష్ణార్జునులు ధర్మజునివద్దకు వచ్చి తద్వృత్తాంతము నెరిగించి, శ్రీకృష్ణుడు ధర్మజునితో

కం. భువనములన్నియునొక్కటఁ, గలిసియుఁ గర్ణుఁబరిమార్పఁగానోపునె భూ
ధవ భవదీయక్రోధా, గ్ని విహతుఁడైక్రాఁగెఁగాక నిక్కంబరయన్ - కర్ణ-తృతీయ-387

అని ధర్మజునితో అనుటలో శ్రీకృష్ణుని పరిహాస ధోరణి కించిత్తు తొణికిసలాడుచున్నది. పై పద్యమమూలకము. భావమును గ్రహించి తిక్కనగారి కల్పనము. అదియెరిగిన ధర్మజుడు.

చం. అనవినియమ్మురాంతకునకానృపుఁడిట్లను నీవుచక్కఁజూ
చిన సులభంబుశోభనముశ్రీధరనీదుగుకూర్మికేను భూ
జనమటె నాకుదుష్కరమెశత్రుజయంబుభవత్ప్రసాదజీ
వనులము మాకుసంపదలువచ్చునవశ్యమునింతనమ్ముదున్ -389, అని పలుకుట

లౌక్యము పరాకాష్ట చెందినట్లు కన్పించును. మొదట శ్రీకృష్ణుడన్న భవదీయ క్రోధాగ్ని విహతుడై క్రాగె అనుమాటలకు ధర్మజుడు నాకు దుష్కరమే శత్రుజయంబు భవత్ప్రసాద జీవనులము అనుట సమాధాన ప్రాయముగ భాసించును. పరోక్షముగ ఆ కర్ణవధను శ్రీకృష్ణునిపై నెట్టుటలో రమణీయత కాన్పించును. మరియు

134.ఆ.అఖిల రక్షకుండవగు నీకుభక్తుల, మైనమమ్ముఁగాచుటరుదెతలఁప
భయము నెవ్వగయునుబాసి నాకంటికి, నిదురవచ్చునేఁడు నీరజాక్ష -390

"నాకంటికి నిదురవచ్చునేడు" అని ధర్మజుడాడుటలో అతని చిరకాల వాంఛితమైన కర్ణపర్వము ముగిసినదని ఆనందములో తన మనసులోని మాటలు బయటపెట్టక తప్పినిది కాదనిపించును. ఇది యథామూలము.

==========

శల్యపర్వము – ధర్మజపాత్ర

శల్యపర్వము యుద్ధము చివరి దివసమేకాక, మానవ బలహీనతల పరాకాష్టకైన ప్రదర్శనముగ కూడ భాసించుచున్నది. శల్యుడు పాండవులకు సన్నిహిత బంధువు. స్వయముగ మేనమామ. అట్టివాడు కౌరవ పక్షమున చేరినాడు. చేరుటకై చెప్పబడిన కారణము బలిష్టముగకాన్పింపదు. తప్పత్రాగి, ఒడలిపై తెలివిలేని స్థితిలో దుర్యోధనునకు యుద్ధసహాయమొనర్చుటకు మాటనిచ్చినాడు. నిజమునకిది దుర్యోధనకృత మోసము. అట్టి మోసమునకు గురియైన వాడు, తనచెల్లెలి పుత్రులను సంహరించుటకంగీకరించునా! లేక కౌరవులకు భయపడికాని, పాండవ విజయమును శంకించిగాని శల్యుడిట్టి నిర్ణయమును గ్రహించెనా! అని కూడ అనుమానించుట కవకాశమున్నది. కారణము అర్జునాదులయెదుట శల్యుడొక మహాధన్విగ భారతమెచ్చటను వర్ణించియుండలేదు. ఏమైనను భయముచే గాని, త్రాగుడు వ్యసనముచేగాని, కావలసిన వారిని విడిచి, శత్రుపక్షమున చేరిననాడు, మరణమునందుటే కాక, తన మరణమునకొక ప్రయోజనమున్నదనెడి తృప్తికూడ లేక నశించును. అందుకు శల్యుడొక చక్కని ఉదాహరణ.

ఇక మరియొక కోణమునుండి ఈ కథను చూచినచో, శత్రుపక్షము వారిని తన పక్షమున చేర్చుకొన్నచో, కర్ణునివంటి మహారథులనుగూడ (కర్ణుడర్ధ రథుడైనను, విరోధియైన సారథి మహారథులనుకూడా వంచింపగలడు) తాను చేరిన పక్షమునకు విరోధియై పడగొట్టగలరను సత్యము తెలియగలదు. ధర్మజుడెవ్వడిని చంపకున్నను శల్యుని మాత్రము స్వయముగ సంహరించుటలో ఒక ధ్వని స్ఫురించును. ధర్మదేవత ఎట్టివానినైనను సమదృష్టితో చూడగలదేమోకాని చాపక్రింద నీరువలే, చేరిన పక్షమునకే ద్రోహమొనరించు కృతఘ్నులను మన్నింపజాలదు. శల్యుడు తనవారికి మేలుచేసినటుల భావించుకొన్నను, లోకమున మాత్రము శల్యసారథ్యమును లోకోక్తిని కృతఘ్నుల నుద్దేశించియే చెప్పుకొనుచున్నారు. ఇక ఒకపూట శల్యనాయకత్వముకాగ, రెండవపూట దుర్యోధన నాయకత్వము నడచినది.ఈ సన్నివేశము మానవ మనస్తత్వచిత్రణమునకేకాక దుర్మార్గుల అవసానదశా స్వరూపమునుకూడ కనులకు కట్టినట్లు ప్రదర్శించును. ఆత్మాభిమాని, కురుకుల సార్వభౌముడు, తన మాటకెదురులేక బ్రతికిన దుర్యోధనునంతటి వాడుకూడ స్వజనమెల్లరను విడచి, ప్రాణరక్షణకై ఒక మడుగునదాగి మృత్యువును తప్పించుకొనదలచుట గమనార్హము. అయినను మృత్యు దేవతాంశజుడైన ధర్మజుడు వానిని విడువక వెంబడించినాడు. ఇట్టి సందర్భములలో తరచు వినిపించు స్మశానవైరాగ్యము దుర్యోధన ముఖమున వినగలము. అటులనే కురువంశమునెల్ల నాశమొనర్చినను సంతృప్తి చెందక యుద్ధరంగమునుండి పారిపోయి, ప్రాణభీతితో ద్వైపాయన హ్రదమున తలదాచుకొనిన, వానిని వెలికీడ్పించి సంహరించువరకు, దుర్యోధనునిపట్ల ధర్మజునిలో గూడుకట్టుకొనిన పగచల్లారలేదు. నిజమునకు దుర్యోధనుడట్టి అవమానములనొనర్చియే యున్నాడు. సాధారణ క్షాత్రవీరునిగనె ధర్మజుడును ప్రవర్తించినాడు. ఈ విషయములన్నింటిని దృష్టినిడుకొని ఈ పర్వమునందలి ధర్మజపాత్రను పరిశీలింతును. కర్ణవధానంతరము దుర్యోధనుడు శల్యుని పదునెనిమిదవనాటి యుద్ధమునకు సేనాధిపతిగ నియమించెను. అంత శల్యుడు సర్వతోభద్రవ్యూహమునన్ని యుద్ధమునకు సిద్ధపడి భీమునితో గదాయుద్ధముచేసి మూర్ఛితుడై తెప్పరిల్లి, సారథితో ధర్మజుని దిశగ తేరుపోనిమ్మని పలికి యుద్ధమునకు సిద్ధపడినాడు.

చం. బరవసమొప్పమద్రపతి పాండవముఖ్యునిమీఁదఁగాండముల్
గురిసిననానృపాలుఁడునకుంఠితుఁడై పదునాల్గుతూపుల
న్నరపతిమేనఁగ్రుచ్చియెలనవ్వుననొప్పిననమ్మహీశుపే
రురముననాటెనారథికుఁడొక్కసముజ్వలబాణమేడ్తెఱన్ –శల్య–ప్రథమ–**186**

వ. నాటినంగనలియమ్మనుజేంద్రుండు చంద్రసేనుండనుతదీయ చక్రరక్షకుందునిమి నవనారాచంబులు సారధి మేననిగిడించె-187

శల్యుడు ధర్మజుని గలసి అతనిపై శరములు గుప్పించిన, ధర్మజుడు అకుంఠితుడై పదునాలుగు బాణములు మద్రపతి ఉరమునవాటి నవ్వున రాజిల్లుచుండగ, శల్యుడు ఒకవాడి అమ్మును ధర్మరాజు మేనినవాటెను. అంతనాతడు శల్యుని చక్రరక్షకులలోనొకడగు చంద్రసేనుని చంపి, సారధిపై తొమ్మిదిబాణములు నిగిడించెను. అనంతరము భీమార్జునులతోను, కవలలతోను, సాత్యకితోనుగలసి యుద్ధముచేసెను. ఆ మధ్యన ధర్మజుని చాపము త్రుంచివైచెను. అంతనాతండు

ఉ. వేఱొకచాపమెత్తి పృథివీవరధర్మతనూజుఁడింతతోఁ
దీఱఁగఁజేయుదుంబగయతిప్రకటంబుగనంచుసూతుమైఁ
దూఱఁదురంగమాంగములు దూఁటులువోవఁగ శల్యునెమ్మిలన్
గీఱసిడంబుగాఁడఁబరఁగించె సముజ్వలచెండకాండముల్-శల్య-ప్రథమ-197

ఇవ్విధమున విజృంభించిన ధర్మజునిపై శల్యుడు పదివాడి తూపులను వైచెను. అంత ధృష్టద్యుమ్నుడు, కవలలు, భీముడు కలియబడిరి. ధర్మజుడుకొంత తడవునకు తేరుకొని మద్రపతిపై ముద్గరమును ప్రయోగించెను. మిగిలిన వారందరు వారి వారి ఆయుధములను ప్రయోగించినంత వాటినన్నింటిని శల్యుడు తృంచివైచి శరపరంపర గుప్పించెను. అంత ధర్మజుడు యింతకుమున్ను చచ్చిన చక్రరక్షకులలో మరి యొకడగు ద్యుమత్సేనుని తలద్రుంచి వైచెను. ఇది యథామూలము.

అంత శల్యుడు కోపించి పాండవేయులందరిని శరపీడితులను జేసిన ధర్మనందనుడు విషాదమునొంది నిజాంతర్గతమున

కం. హరివచనంబులసత్యతఁ, బొరయఁగనేర్చునొకొ మద్రభూపతిబాహు
స్ఫురణము భీమాదిరథిక, వరులోర్వనియట్లుగాఁగవ్రాలెడిఁదోడ్తోన్-శల్య-ప్రథమ-205

అని తలపోసి తన చతురంగబలంబులకు చేయూపి శల్యునిపై గలిసిన, ఆ ధైర్యధౌరేయుండు ఆ వరూధినిని, పాంచాలపుత్ర ప్రభృతి యోధప్రకరంబును, పాండవాగ్రజుని 'బరమ సాంద్ర తీవ్ర శరాంధకారమున' గప్పి వైచెను. అనంతరము యుద్ధమున

వ- ధర్మజుమోహరంబు దెరలిమరలి పఱవందొడంగిన నన్నరవరుండదల్చి కరతలంబెత్తి నిలునిలుమని నివారింప నిలువదయ్యె నయ్యుధిష్ఠరుండు పౌరుషంబు పెంపునఁదెంపుసేసి మామాయని పేరెలుంగెత్తి యాశల్యునిదాఁకి దర్పంబు సూపినంజూచి మగుడనిగిడి సేన పోరికిం బురికొనియెనప్పుడు పాండవాగ్రజుండు దమ్ములను దొరలను దనపాలికిఁ బిలువంబంచి వారలతోనిట్లనియె. శల్య-ప్రథమ-233

చం. అమరనదీసుతాదులగునక్కడి వీరుల మీరలందఱుం
గ్రమమునఁబిల్కుమార్చి భుజగర్వముసూపితిరేనుశత్రు సై
న్యమథనకల్యు శల్యుఁదెగటార్చెదనాకిదికృత్యమీసము
ద్యమమనివార్యమై నెగడునట్టితెఱంగువినుండుచెప్పెదన్. -234

వ. నాతేరికి నకులుఁడును, సాత్యకియు వలపటను సహదేవుండును ధృష్టద్యుమ్నుండును డాపటను గావలియై రావలయు వెనుకంగదసి విప్పచ్చుండును ముందటి కెలన మొనసి వడముడియును నడుచునది యింత యేమిటి కనవలదు నన్నొండె నతండతనినొండె నేను సమయించుట యవశ్యంబు-235-ఇది యథామూలము.

ధర్మజుడిటుల పలుకుట అతని ధైర్యము తెలియపర్చుటకేకాక అర్జునుడాడిన మాటలకు చేతలుగ కన్పించును. ఇంతవరకు అతడు యుద్ధమున చంపిన వీరులెవరును లేరు, భవిష్యమున మరలనెవరును తన్ను అర్జునుడాడినటుల, దూరుకుండగనుండుటకొక ప్రయత్నమిదని తలపవచ్చును.

135. ధర్మజ శల్యుల యుద్ధమారంభమైనది. అంత ధర్మజుడుగ్రుడై రథములను, కరులను, ఘోటకములను, కాల్బలమును, కౌరవ వరూధినినంతటను కలవరపరచెను. చూచిన వారందరు వారిలో వారిట్లను కొనందొడగిరి.

కం. నరులుమృదువితఁడనంగాఁ, బరఁగుయుధిష్ఠురుఁడు శత్రుబలములకతిని
ష్ఠురుఁడయ్యెనపుడు సురుల, చ్చెరువందిరి చూచిద్రోణుశిక్షఁబొగుడుచున్-శల్య-ప్రథమ-246

కం. మునుముబయలైన నలిఁబే, ర్చినయమ్మనుజేంద్రుమీఁదశితవిశిఖములే
పుననిగిడించుచు శల్యుఁడు, దనరుభుజాబలముతోడఁ దరిమెంబెలుచన్-247

కం. అవ్వీరుని వాలంపఱు, క్రొవ్వునడఁచి తనదునంపకోలలడరఁగా
నవ్వసుధాధిపుఁడల్లని, నవ్వొలయఁగమారుకొనె ఘృణారహితుండై-248
ఇవ్విధమున యుద్ధము చేయుచుండగ జనులు వారిలోవారు

చం. వెరవునులావుఁజేవయును వీరలకారయనొక్కరూప దు
స్తర భుజశక్తిధర్మజుఁడు శల్యునిరూపడఁగించియివ్వసుం
ధరగొనునొక్కనేఁడితనిఁదా సమయించిసమస్తమేదినీ
శ్వరుఁడుగఁజేయనోపునొకొ శల్యుఁడుగౌరవరాజనందనున్ -శల్య-ప్రథమ-250

వ. అని సందేహడోలాయమాన మానసులైరప్పుడు-251

మద్రపతి ధర్మజుని విల్లుత్రుంచి అతనిపై నూరుబాణములేసినంత, అతడు వేరొక ధనువెత్తి శల్యుని ధనువు ద్రెగనేసి, మూడువందల తూపులను అతనిపై కురిపించెను. వెంటనే హయములను, సూతునిజంపి కేతువును దునిమినంత అశ్వత్థామవచ్చి అతని రథముపై శల్యుని తోడ్కొని పోయెను. తదనంతరము శల్యుడు వేరొక రథముపైవచ్చి పాండవాగ్రజునిపై బాణములు కురిపించుచు, సైన్యమునంతను చిందరవందర జేసెను. అంతట ధర్మజుడు ఘోరనారాచ మొకటి విడువగ, శల్యుడు మూర్ఛనొంది తేరుకొని, వాడితూపు నొకదానిని ధర్మజునిపై వైచిన అతడు దానినిద్రుంచి తొమ్మిదియమ్ములు శల్యునురముననాటెను. అంత ధర్మజునకు తోడుగ భీమసేనుడు, శల్యునకుతోడుగ కృపాచార్యుడు కలసి యుద్ధము చేసిరి. శల్యుడు ధర్మజుని విల్లుత్రుంచగ, కృపాచార్యుడు ధర్మజసారధిని కూలద్రోసెను. అంతలోన శల్యుడు అతని రథాశ్వములనాల్గింటిని చంపివైచెను. ధర్మజుడు విరథుడై అంతర్గతంబున

కం. గెలువుముశల్యునినీవని, పలికిముకుందుండుదన్నుఁబనిచినవాఁడ
ప్పలుకులకునసత్యత్వము, గలుగఁగనేర్చునొకొ దైవఘటనబలమునన్-263 , అని శంకించి
ఆ జగన్నాథుని మదిదలంచి, పరిపరివిధముల ప్రార్థనచేసి, ఆ శల్యునిపై బాణములు ప్రయోగించెను.

ఇచట ధర్మజుడు శ్రీకృష్ణుని ప్రార్థించుటలో ఔచిత్యము కన్పట్టుచున్నది. ధర్మజునకు శ్రీకృష్ణావతార లక్ష్యము తెలియును. కావుననే సర్వమున్నతడైన శ్రీకృష్ణుని మదిదలంచి కార్యాచరణమునకు పూనుకొనినాడు.

అనంతరము భీముడు శల్యుని విరథుని, విగతాస్త్రుని చేయుటచే శల్యుడు కోపించి కరవాలమునెత్తి రథముడిగి ధర్మజునితో కలియబడుటకు సిద్ధపడినాడు. అంత భీమసేనుడు కత్తినిద్రుంచివైచెను. అంత పరిజనములొసగిన గదా దండంబులు ధరియించి యుధిష్ఠిరుని మీదకురాగ, అప్పుడు సాత్యకి, ధృష్టద్యుమ్న, శిఖండి మాద్రేయాదులు ఒక్కపెట్టున శల్యునిపైబడి సాయకమ్ములు కురిపించిరి. ఇది యథామూలము. అంత ధర్మజుడు

136.కం. ఇతని సమయింపనయ్య, చ్యుతుఁడుననుంబనిచెనాకునొనరించిన పా

లితఁడనితలంచిమొగము, గ్రతనొందఁగశక్తిమీఁదఁగనుదోయెలయన్-273, వ. హృషీకేశునుద్దేశించి-274

ఉ. నీదెసనాదుచిత్తముననెక్కొనియుండెడిభక్తిభద్రసం

పాదినిగావుటచ్చెరువెభక్తజనాభిమతప్రదానవి

ద్యాదయితత్వమేర్పడజయంబొడఁగూర్పుముదేవసంశ్రితాం

హోదళనంబునీకుప్రతముల్లమునాపయినిల్పుమిత్తరిన్-శల్య-ప్రథమ-275

అని శ్రీకృష్ణుని ప్రార్థించి అచ్చపు భక్తితో ఫలలోచనుని మదిని ప్రియంబొదరజొన్ వలసిన మహోమహిమాన్వితమైన శక్త్యాయుధమును **శల్యునిపై ప్రయోగించెను. ఆ శక్తి శల్యుని ఉరమునదూరి వెన్నునుండి పైకివచ్చి భూమిలోకలసిపోయెను. అంతనాతండు ధర్మజువైపు శిరముంచి ధరణిలో కూలెను. అది చూచి శల్యుని సోదరుడు ధర్మజునిపై శరములు సంధించెను. అంత ధర్మజుడు అతని కేతువు, ధనువు అశ్వములనుద్రుంచి అతని శిరమును క్రూర నారాచమున ద్రుంచెను. ఇదియెల్ల జూచి శల్యుచుట్టంబు లొక్కపెట్టున ధర్మజునిపై బడిరి. అంత పాండవేయులందరును ధర్మజునకు సహాయకులుగ యుద్దముచేసిరి. ఈ సందర్భమున ధర్మజునిమాటలు పట్టిచూడ అతడు** కేవలము నిమిత్త మాత్రుడనియె **చెప్పుకొనినటుల స్పష్టము.** శ్రీకృష్ణుని ప్రార్థించి, అతనిని మన్నసులో నిలుపుకొని **శల్యునివధించుట,** పరోక్షముగ శ్రీకృష్ణుడే నిర్వహించెనని **భావించవచ్చును. ఇది యథామూలము.**

<u>ద్వితీయాశ్వాసము :</u>

137. దుర్యోధనుడు ద్వైపాయన హ్రదంబు సొచ్చియుండుట ఆటవికులవలన విన్న భీముడు ధర్మజునియెదుట, వారిచే స్వయముగ ఆ విషయమును చెప్పించినాడు. అంతట ధర్మరాజు శ్రీకృష్ణునితోడను, అనుజులతోడను మడుగు వద్దకునేగి దుర్యోధనునికిట్లనియె.

చం. ఇటుతగునేసుయోధనమహీవలయంబుననిట్టిదైన్యమె

చ్చటవినఁజూడఁగల్గెనెయసంఖ్యులురాజులునీకుఁగాఁగఁజ

చ్చుటయునుబంధుమిత్రులువిశుద్ధచరిత్రులుపోరనట్లుత్రుం

గుటయునుజూచితేమిటికిఁగ్రుంకితినీళ్లనుజావుదప్పునే -శల్య-ద్వితీయ-54

ఉ. శూరుఁడవంద్రునిన్మడువుసొచ్చుటశౌర్యముచొప్పెమానమే

యూరికిఁబోయెనాజినృపులోడుదురేఁనృపుడన్నమాత్రయే

కౌరవవంశజాతుఁడవుగష్టపుఁజచ్చుటదెచ్చుకొంటినీ

పేరునుబెంపుమాలియరిబృందమునవ్వఁగనిట్లుసేయుదే-55

తే. క్షత్రధర్మంబువిడిచినఁగలదెయిహముఁ, బరముఁబేరోలగంబునఁబలుకుపలుకు
లెల్లమఱచితెవినుమవిపొల్లులైనఁ, గష్టపాటుగాకుసుతేలగావవచ్చు -శల్య-ద్వితీయ-56

చం. కొడుకులుదమ్ములుంగలనఘోరపుఁజావులుసావఁజూచియె
ట్లొడఁబడెనీదుబుద్ధియొడలోముటకైనినురాజరాజయి
మ్మడువునకీడ్చితెచ్చెవిధమానముప్రాణముకంటెఁజాలనె
క్కుడగుటసెప్పఁగావినవొకోకడునీచతఁబొందితక్కటా-57

శా. అంభోగర్భముసొచ్చిపాండుసుతబాహగర్వదుర్వారసం
రంభంబోర్వకడాఁగియుండెనటరారాజిస్సిరోచచ్చుచో
గాంభీర్యంబునుధైర్యమున్విడిచిదోర్గర్వంబుబెండెయ్యెనే
శుంభన్మానముడూలెఁగాకనిజనస్తోమంబునిందింపదే-58

తే. కర్ణశకునిదుశ్శాసనుల్ఘనులుగాఁగఁ, దలఁచివారలఁగొనిమమ్ముగెలుచువాఁడ
వైమనంబునశంకింపకట్లుకీడు, చేసితాపూపుదప్పినగాసియైతి-59

వ. నీకొలందిగంటిమగపడితి వింకనెందుఁబోవచ్చునని మఱియు నిట్లనియె -60

మ. భయముంబాయఁగఁద్రోచి వీరగుణముంబాటించిసంగ్రామని
శ్చయబుద్ధిందలగొల్పిపౌరుషముమైఁజావొందెగెల్పొందెఁగా
కయధీరత్వమునాకునీదెయనివీఁకంబేర్చివేతాఁకుమెం
తయుఁబేరయ్యెడురమ్ములెమ్ముదిఁగినన్దైన్యమ్మువచ్చుంజుమీ -శల్య-ద్వితీయ-61

చం. అనిమమునోర్చినంబృధివియంతయునేలఁగవచ్చులేకచ
చ్చిన సురసద్మసౌఖ్యములు చేకుఱురెండు దెఱంగులందు నొ
ప్పని యదిలేదుడాఁగనగుఁబాటును బ్రాణము చేటుఁదెచ్చుకోల్
విను మము నీవెదుర్పఁదగు వేయువిధంబులఁ జాటి చెప్పెదన్ -62

వ. తెంపుచేసి మామీఁదనుఱుకుట నీకు ధాతనిర్మించిన పరమధర్మంబు పురుషుండవైతేని దీననుష్ఠింపుమనిన విని-63 , ఇది యథామూలము.

పై ధర్మజుడాడిన మాటలు సబబుగనే తోచుచున్నవి. సుక్షత్రియుడైనవానికి సమరమునజయించి పృథివి నేలుటయో, చచ్చిస్వర్గసుఖములననుభవించుటయో, ఏదియో ఒకటి అనుష్ఠింపదగినట్టిది. కాని దుర్యోధనుడు స్వజనులు, సైన్యము దెగుటచూచి వైరాగ్యమునంది, మడువున జలస్తంభముననుండుట ఉచితముకాదు. కావున అతనిని మరల సమరోత్సాహకునిగ జేయవలెనని ధర్మజుని ప్రయత్నము. అందుకే అతడు చివర ప్రయత్నముగ తెంపుచేసి మామీద నుఱుకుట నీకు ధాత నిర్మించిన పరమధర్మంబు అని కటువుగ అతనివిధిని ఎరింగించి, పురుషుండవైతేని అని గేలి చేసినాడు.

ఎట్టివానికైననూ లోకమున పురుషుడవైనచో అన్నచో పౌరుషము తన్నుకు వచ్చును. అట్టిది మానధనుడగు రారాజు ఎట్లోర్చును. ఆ విషయము ధర్మజునకు బాగుగ తెలియును. అందులకే అట్టి ప్రయోగము చేసినాడు.

ధర్మజునకు సమాధానముగ దుర్యోధనుడు, తాను యుద్ధమునకు జడసి, ప్రాణములనాశించి, మడుగునదాగి యుండలేదని, శరీరమునకు తగిలిన గాయములచే డస్సి విశ్రాంతి గైకొనుచున్నానని, కొండొక తడవునకు యుద్ధమునకు వచ్చెదనని పలికెను. మరియు

కం. ఏ నింకసమరమొల్ల మ,హీనాయక నీక యుర్వినిచ్చితి శాంతిం
గానకుఁ జనివల్కలపరి, ధానుఁడనై తపమొనర్చెదను మునులకడన్ -శల్య-ద్వితీయ-71

ఆ. ఓడివచ్చినాఁడ నుద్ధతినాకేల, యుడుకుమాని నీవయుర్వియేలు
గుర్రములునునేనుఁగులు లేనిబయలు నీ, తలనెకట్టికొనుము ధర్మతనయ-72

అని తన నిశ్చయమును దుర్యోధనుడు తెలిపెను. ఇది యథామూలము. అంత ధర్మజుడు ఇట్లనినాడు.

138.చం.అనవిని యన్నరేశ్వరుఁడుహాసముతో నతనింగురించి యి
ట్లనుఁ దనుజానుజన్మసుహృదాప్తసహాయులు సన్నఁగాదె శ
ల్యునిఁగొని మముగెల్చి సకలోర్వియునేలుటకుత్సహించి తీ
పనుపుటలేలమాను మిదిపాటిగఁబట్టుము లెమ్మపోకిరిన్-73

సీ. నీయాగి నేనుభూనాయకుఁడగుటొల్ల, రాజకోటికిఁబరిగ్రహముసనునె
నిను ననిందెగటార్చి నేలఁబాలించెద, ననునోర్చితేనిపెంపునసుఖింపు
మేమిటవాఁడవైయిచ్చితిపుడమి నీ, కనియెడు మాటయిట్లాడెడిపుడు
నీవుధరిత్రి యానేర్చినఁ గురుకులం, బునకు నిట్లాఅడిఁబోవనేల

తే. శాంతినొందుటకై ధర్మసంవిభాగ, కరణమొనరింపవచ్చిన కమలనాభు
వాక్యవృత్తిఁబాటింపక వాఁడిసూది, మోపినంతైన నుర్వియీనోపనంటి- 74- ఇది యథామూలము

పై మాటలలో ధర్మజుడు తన మనమందలి చిరకాలవాంఛను బయటపెట్టినాడు. అందుచే దుర్యోధనుని మాటలకు సమాధానమొసగుచు, పూర్వము సంధి యత్నములు జరిగిననాటి విషయమును ప్రస్తావనకు తెచ్చెను. యిచ్చితి పుడమి అను మాటకు సమాధానముగా కమలనాభుడొచ్చిన తరుణమున వాడిసూదిమోపినంతైన నుర్వినివ్వనని పలికి, ఈ నాశనమునకంతటికి కారణమై నేడిచ్చితినని పలుకుట అర్థము లేనట్టిదని పల్కినాడు.

మరియు లోకమునగల క్షాత్రమర్యాదను, కోరికను తనదైనశైలిలో వెలిబుచ్చినాడు. లోకమున శత్రువు ఓడిపోయి బ్రతికియున్నను బాధాకరమే. అదియును గాక క్షత్రియులకు పరిగ్రహము తగదు. కావున నినునినిందెగటార్చి నేలబాలించెదనని నిర్ద్వంద్వముగ చెప్పినాడు. ఇది ధర్మజుని దూరదృష్టికి నిదర్శనము. కారణము ఒకవేళ దుర్యోధనుని విడచిపుచ్చి, ధర్మజుడు పట్టాభిషేకమందినాడనుకొందుము. అటుల జరిగినచో ధృతరాష్ట్రుడు సహింపలేడు. లోకమున ఏ తండ్రీ తనకుమారుని హీనస్థితిని సహింపజాలడనుట నిర్వివాదాంశము. కావున ధర్మజుడడిగినటులే, ధృతరాష్ట్రుడును తన కుమారునికి పాలుపంచమనును. అప్పుడు ధర్మరాజు ధృతరాష్ట్రునిపై గల గౌరవముతోను, దుర్యోధనుని పరిస్థితికి జాలితలచియో లేక ముఖ్యముగా ప్రజలలో ధర్మమూర్తిగ ముద్రపడుటచే, అది తొలగిపోవునను భయముచేతనో యియ్యక తప్పనిపరిస్థితి వచ్చును. గావున దుర్యోధనుని అంతమొందించి, తన భవిష్య జీవనమును నిష్కంటక మొనర్చుకొనదలచినాడు.

139. కావుననే అతనిని పోరునకు సిద్ధపడునటుల, పరిపరి విధముల సంభాషణలొనర్చుచు, ఉసిగొల్పుచున్నటుల కాన్పించును. మరియు చివరగ తన నిశ్చయమునిటుల తేటతెల్ల మొనర్చినాడు ధర్మజుడు.

కం. అరులకు సిరియిచ్చెదనను, వెరవిడియుంగలఁడె దీనివిడువుమునాకున్
ధర యిచ్చితేనియును నినుఁ, బోరిగొన కేవిడువ నటిమిపోరుటయొప్పున్-శల్య-ద్వితీయ-76

శత్రువులకు సిరి యిచ్చెదనని పలికెడు ఉపాయమొనుడు గలడే? నాకు ధర యిచ్చినంతమాత్రమున **యుద్ధము** చేయక నిన్ను విడువను. కావున పోరునకు సిద్ధపడుమని ఖండితముగ నుడివినాడు.

140. మరియు ధర్మజుడిట్లనినాడు.

కం. నాచే నీ ప్రాణంబులు, నీచేనాజీవితంబునిజమున్నవి యి
న్నీచతయవకార్యము రా, జోచిత కర్మకృతనిశ్చయుఁడవగుము నృపా-77

వ. అని వెండియునిట్లను జతుగృహంబు దహించితి, పాములం గఱపించితి నీటంద్రోయించితి విషాన్నంబు వెట్టించితి వెన్నికపటోపాయంబులు నేసినను నీచేతఁ జెడక యునికి యెఱుంగవే యింకనట్ల యమ్మాయలం బ్రయోజనంబులేదు - 78

కం. లేలెమ్ముబిరుదవై ర, మ్మాలమునకు నీవునెఱుఁగుదవ్విధముకడున్
మేలొందు తెరవులేదిం, కేలయొదిఁగికష్టపడ నరేశ్వరచెపుమా -79

ఇట నాచేనీప్రాభములు, నీచేనాజీవితము నిజమున్నవి అని పలుకుట గమనార్హము. అనగ ఎవరో ఒకరు మాత్రమే ఉండవలెనని ధ్వనింపజేసినాడు. ధర్మజుడు నాచే నీ ప్రాణములైన పోవలెను, లేదా నా జీవితమైనను ముగియవలెననుటలో దుర్యోధనుని ప్రాణములు తీయుటపైనే ధర్మజుని భవిష్యజీవనము ఆధారపడియున్నది. దుర్యోధనుడు ప్రాభములతో బ్రతికియుండిన ధర్మజుడు సుఖశాంతులతో జీవింపలేడనుట నిర్వివాదాంశము. అందులకే రాజోచిత కర్మకృత నిశ్చయుడవగుము అని రాజధర్మమునడ్డము పెట్టుకొని దుర్యోధనునిలో పౌరుషము రగుల్చుచున్నాడని తెలియుచున్నది. దానికి కారణముకూడా తరువాతి పద్యములో ఏకరువు పెట్టినాడు. తదుపరి యుద్ధమున్నచో ధైర్యముగా లెమ్ము అని మరియు ఒందు తెరవు లేదు అని నిశ్చయముగ పల్కినాడు ధర్మజుడు.

పై ధర్మజమాటలకు సమాధానముగ దుర్యోధనుడు నీకుగృష్ణనకు వెరచిగాదు శస్త్రాస్త్ర స్యందనాది యుద్ధ పరికరములు లేక, మరియు మీరందరు, నేనొక్కడను ఎట్లు పోరుచెల్లును అని ధర్మజునితో పలుకగ, అతడు నేను మాత్రము యుద్ధనీతినితప్పి చరింతునా! అని పలికి శస్త్రాస్త్రముల నిచ్చెదనని పలికెను. అంత దుర్యోధనుడు గదాయుద్ధమునకుత్సహించి ఆ విషయమును ధర్మజునకెరుక పరచినాడు. ధర్మజుడందులకు సమ్మతించినాడు. దుర్యోధనుడు ఆ మడువునుండి గదామండితుడై వెలుపలకు వెలువడెను. అక్కడగల పాండవేయులందరిని కనుగొని ఒక్కొక్కని పోరునకు రమ్మనమని పలుకగ ధర్మజుడు దుర్యోధనునితో నిట్లనియె.

తే. ఏరికొనుమీవునొకని మాయేవురందు, వాఁడునీతోడఁదగఁబోరువాఁడు వానిఁ
జంపి మహియేలు వానిచేఁజచ్చి త్రిదివ, సౌఖ్యమొందుము చేసితిసమయమేను-శల్య-ద్వి-108

వ. అని పలికి యుజ్వల వివిధ వర్మంబులాతని ముందటంబెట్టించి -శల్య-ద్వితీయ-109

కం. వినుజీవముతో నిన్నుం, జననిచ్చుటయొండుదక్క సమరంబునఁ గో
రినయది నీకొసగెఁద నిం, తన చెడియెనెయకటయన్నదమ్ములకూర్మిల్ - 110

ఇట ధర్మజుని అవివేకత స్పష్టము. ఏరికొనుమీవు నొకరి మాయేవురందు, వాడు నీతోడదగ బోరువాడు వాని జంపి మఱియేలు అని పలుకుట మాయాద్యూత ఘట్టము స్ఫురణమునకు తెచ్చును. దుర్యోధనుడు అతని అవివేకత గ్రహింపలేక, సమాన కయ్యమునకుత్సహుడై, తన క్షత్రియత్వమును నిరూపించుకొన్నట్టివాడు గనుక, ధర్మజునకు క్షాత్రయోగము, భాత్వియోగము తప్పినది. కాని దుర్యోధనుడు ధర్మజునిమాటలు దృష్టినిడుకొని భీమునితప్ప, మిగిలిన వారిలో ఎవరితోనైనను యుద్ధమునకు సిద్ధపడినచో విపరీత పరిణామములేర్పడి యుండెడివి. కారణము దుర్యోధనుడు భీమసముడు. మరియు గదాయుద్ధ విశారదుడు. ప్రత్యేకించి బలరాముని ప్రియశిష్యుడు, వజ్రదేహుడు గావున అతనిని జయించుట ఇతరులకు అసాధ్యము. ఒకవేళ ధర్మజుడు అనుజుల బలపరాక్రమాదులందు విశ్వాసము చేత అట్లని తలచినను, అది అతివిశ్వాసమనిపించునేగాని ఆత్మవిశ్వాసము అనిపించుకొనదు. ఇది యథామూలము.

141. పైభావము శ్రీకృష్ణుని ముఖమున ధర్మజునకు వినిపింపజేసినాడు. అది

చం. ఇతఁడు గదారణంబునకు నీకొలఁదిన్‌నినుఁబిల్చినన్ మరు
త్పతిసుతుఁగోరినం జిఱుతతమ్ములలో నొకనిన్ వరించినన్
మతిసెడిరొక్కొ వీరలను మాటకుఁబాత్రముగాదె సాహసం
బుతఱియె మేదినీశ యిదిబుద్ధిదొఱంగి తనుగ్రహంబునన్-శల్య-ద్వితీయ-114

చం. ఒకరునిఁ జంపితేని సకలోర్వియుఁగైకొనుమంట నీవుమున్
శకునికి మాయాజూదమున సంపదలెల్లఁ ద్రయోదశాబ్ధ భో
గ్యకృతినమర్చి యొడ్డినటులైనది పందెపుఁగయ్యమయ్యె శ
త్రుకులమునెల్ల దు:ఖపడిత్రుంచుటదాఁదుదిఁ బందెమాడనే. -115

చం. నరవర యెక్కటెక్కటిపెనంగఁగ భీమునినైనఁ బన్పఁగా
దరయఁగ భీముకంటె గదయందలి కౌశలమెక్కుడీమహీ
శ్వరునకు భీమునేనబలసంపద మిక్కిలిదానఁబోవునే
వెరపునఁగోలుపోదె భుజవీర్యముపోరులనెందుఁజూడమే. -116

పైపలుకులందలి శ్రీకృష్ణుని వాక్యములు యథార్థము. కావుననే శ్రీకృష్ణుని నోటివెంట పలికించినాడు. పాండవ రక్షణమునకు కంకణబద్ధుడైన శ్రీకృష్ణుడు ఉపాయముతో, ధర్మజుని తెలివిహీనతను కప్పిపుచ్చి, దుర్యోధనునిపైకి భీమునుసిగొలిపినాడు. అంతియెకాక భీముడుపల్కిన సభాప్రతిజ్ఞ వచనములు నెరవేర్చుటకు దోహదపడినాడు. ఇది యథామూలము.

142. దుర్యోధనుని ఊరుభంగానంతరము, అగ్నిదత్తంబైన గాండీవి రథము కాలిపోవుటచూచి దిగ్భ్రాంతులైన పాండవులననునయించుచున్న శ్రీకృష్ణునితో ధర్మజుడిట్లనియె.

తే. ద్రోణకర్ణదివ్యాస్త్రముల్‌క్రూరభంగిఁ, గవియునప్పుడు మమునీవుగావకున్న
బ్రదుకుటెంతదవ్వధిక శుభంబులకు భ, వత్ప్రసాదంబుగనికాదె వాసుదేవ -శల్య-ద్వి-339

కం. మునిపతి కృష్ణద్వైపా, యనుఁడు ప్రబోధించెనన్ను నచ్యుతుఁడేది
క్కుననుండునెమ్మినాది, క్కునకు జయముగల్గుననియకుంఠితకరుణన్-341

అని పొగడుచునె, లౌక్యమున తనాధిక్యమును చాటుకొనుటలో, ధర్మజుని వాక్చాతుర్యము గనవచ్చుచున్నది. ఇది యథామూలము.

==========

లోకమున యుద్ధములేని చోటులేదనటు వేదాంతము కాదు. జీవిత సత్యము. అన్ని యుద్ధములను ఆరంభములో ధర్మబద్ధముగనే ప్రారంభమగును. కాని బలాబలములు తేలిన పిదప, అవమానములు మనసునకెక్కిన పిదప ఆరంభమైన యుద్ధమునుండి ధర్మము నిష్క్రమించును. ఇది సామాన్య మానవ జీవితమునకు సంబంధించినట్టిది. మహాభారతము కూడ తత్వవిచారణముతోపాటు, మానవబలహీనతలనుకూడ వివరించినదని పూర్వపుటలలో అనేక పర్యాయములు వివరించియుంటిని. ఇక ప్రకృతము చూడుడు. నిజమునకు అశ్వత్థామ పాండవ విరోధికాడు. అయినను పాండవపక్షీయుడైన ధృష్టద్యుమ్నుని దౌష్ట్యము అశ్వత్థామ హృదయమున నిలిచపోయినది. ఫలితముగ ప్రతీకారవాంఛ చెలరేగినది. కాని ప్రత్యక్షముగ అర్జునుని ఎదుర్కొనగల సామర్థ్యము అశ్వత్థామకులేదు. అందున మరణశయ్యపైనున్న దుర్యోధనుని మెప్పించుటకై అత్యల్పకాలములో విజయమును సాధించి తీరవలయును. అది సామాన్యమైన పనికాదు. అట్టితరి మహోన్నతుడైన, బ్రహ్మవేత్తయైన ద్రోణాచార్యునంతటి వాని కుమారుడగు అశ్వత్థామ మార్గాంతరములేక నిద్రపోవుచున్నవారిని హత్యచేయుటకు సిద్ధపడుట పరిస్థితుల ప్రభావముచే దిగజారెడి మనస్థితికి దర్పణము.

ఇక ధర్మజపక్షమున జూచినచో ఒక సత్యము ధ్వనిగ వెల్లడైనదేమోయనిపించును. యుద్ధమున ఒకనీతి యుండవచ్చును. అటుల ప్రవర్తించినచో అది ధర్మయుద్ధమనబడవచ్చును. కాని యుద్ధప్రబోధక బుద్ధిమాత్రము ధర్మమని చెప్పజాలము గదా! యుద్ధమనివార్యమైనప్పుడు దానిని నిర్వర్తించుటలో కాన్పించిన గుణలోపములనుబట్టి వీరులను స్తుతించుటో, నిందించుటో చేయుట లౌకిక రజోగుణ సంబంధమేకాని, యుద్ధవాంఛ యెన్నటికిని సాత్వికము కాజాలదుగదా! యుద్ధరూపమున అందరి పుత్రులను సంహరించిన పాండవులుకూడ, విజయము వాకిట నిలిచినదను కొన్న సమయమున ఆకారణముగ, అనూహ్యముగ పుత్రులను కోల్పోవుట సంభవించినది. ఇతరులకెట్టి ఆపత్తును తెచ్చిపెట్టునో,అట్టిదియే వానికిని దైవకృతముగ సంభవింపక తప్పదను సత్యమును చెప్పుటకై వ్యాసుడిటుల చిత్రించినాడా! యనిపించును. అయినను సాధారణదృష్టితో ఈ పర్వమున కాన్పించెడి ధర్మజ స్వరూపమును స్థూలముగ వివరించుటకు ప్రయత్నింతును. సౌప్తికపర్వ ప్రథమాశ్వాసమున ధర్మజపాత్ర ప్రవేశము కాన్పించదు. ఇందు అశ్వత్థామ దుర్యోధనునిచే కృతాభిషిక్తుడై, అపాండవమొనరించెదనని పలికి కృపాచార్య, కృతవర్మలను తోడ్కొని పాండవ స్కంధావారమునకు జనుచు మార్గమధ్యమున ఆ నిశి విశ్రమించు తరుణమున, శివుడు భూతాకృతితో ప్రత్యక్షమై అఖండ దివ్యమహిమాన్విత మైన ఖడ్గమును ప్రసాదించుట జరిగినది. అంత పాండవ శిబిరమున జొరబడి నిద్రాసక్తులైన ధృష్టద్యుమ్న, శిఖండి మొదలగు పాండవ పక్షీయులను, ప్రతివింధ్యాది ఉపపాండవులను అశ్వత్థామ అమానుషముగ వధించుట కాన్పించును.

ద్వితీయాశ్వాసమున కృతవర్మచే విడువబడిన ధృష్టద్యుమ్నుని సారథి, భీమార్జున, సాత్యకి, శ్రీకృష్ణుల పరివేష్టుతుడైన ధర్మజుని పాలికేతించి జరిగిన వృత్తాంతమును సవిస్తరముగ తెలియపర్చినాడు.

143.తే.శోకవేగసంతప్తుఁడై సొలసివ్రాల, సంభ్రమమ్మునఁబట్టిరి సాత్యకియును
గవలుభీమసేనుండునుగరతలముల, నుమ్మలికమునెమ్మనములఁగ్రమ్ముదేర–సౌప్తిక–ద్వితీ–11

ఇట ధర్మజుడొక్కడె సొలసి మూర్ఛిల్లునటుల కాన్పించుట గమనార్హము. మిగలిన వారందరికి ఆ క్షోభ మనమ్ములను కలచివైచుచున్నపటికి మూర్ఛ ఓకుండ ధర్మజుని పట్టుకొని సేదతీర్చినటుల గలదు. పుత్రశోకమంతటి బాధ కల్గించునట్టిదే. అంతియెకాక ఒక విషయము గమనార్హము. అభిమన్యుడు మరణించినాడు. అదియు దు:ఖతరమే. కాని భారతచరిత్రలో కని, విని ఎరుగని కురుపాండవ సమరమున భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యాది మహావీరులెల్లరతో ఒంటరిగపోరి వీరమరణమందినాడు. వాని పరాక్రమము సర్వరాజకోటిచే "శహబాష్" అనిపించినది. చరిత్రలో అభిమన్యుడు చిరస్థాయుడైనాడు. సుక్షత్రియుడగు ధర్మజునకది దు:ఖపూరితమును, గర్వకారణముకూడ. కాని

ఉపపాండవ వధ మాత్రము బలవన్మరణము. అట్టివారికి స్వర్గగతులు కూడనుండవని విశ్వాసము. భావి పాండవ సమ్రాట్టులకట్టిగతి సంభవించుట అనూహ్యమును,హృదయ విదారకమును. కనుకనే అభిమన్యువధకన్న, ఉపపాండవ వధ ధర్మజునిమిన్నగ కలచి యుండుననుట సహజము. అంతధర్మజుడిట్లు పలికెను.

సీ. ఎట్టివారలకైన నెఱుఁగంగనగునె కా, ర్యంబులగతులుపాయంబు బలుపు
వెలయంగనట్లు శత్రులబంధుమిత్రపు, త్రామాత్యయుతముగ నాహవమున
నందఱనేఁదెగటార్చినవాఁడనై వి, జయంబు సేకొనివిభవమెసఁగఁ
నిట యేఁగుదెంచితి నటబంధుమిత్రపు, త్రామాత్యయుతముగ నస్మదీయ

తే. బలమునెల్లనుముట్టిశత్రులు నితాంత, ఘోరముగఁదెగటార్చిరి కుత్సితంపు
విధమువాటిల్లె నస్థిరవిజయమునఁబ, రాజయమయాడునింక ధరాజనంబు-సౌప్తిక-ద్వితీ-13

ధర్మజుని మాటలలో ఎట్టివారలకైన నెరుగంగనగునె కార్యంబులగతులు అనుట వేదాంత ధోరణిగ కన్పట్టుచున్నది. ముందు జరుగు విషయము తెలిసికొనుట ఎవనికి సాధ్యము? కావుననే ఈ దురాగతము వాటిల్లెనని విధి ప్రేరితమునకు వగచుట కాన్పించును. మరల తామొనరించిన కృత్యమునకిది ప్రతిబింబమో! యనునటుల శత్రువుల ముట్టడియున్నదని మనస్సున వితర్కించుకొన్న ధోరణి ధర్మజునిలో కన్పించుచున్నది. అదియునుగాక ముఖ్యముగ అస్థిర విజయమున బరాజయమ అని జనులు ఘోషింతురనుబాధ, ధర్మజుని మదిలోమిక్కుటమై, పై రెంటికన్న విశేష స్థానమాక్రమించినటుల కన్పట్టును. మరియు

స్రగ్ధర. బాణజ్వాలానితాంతప్రసరణముల శుంభద్ద్విషత్సాంద్ర సైన్య
శ్రేణీకాంతారముల్ చూర్ణితములుగఁ బటుక్రీడమైఁదేజరిల్లెన్
ద్రోణాచార్యాగ్ని వేఁడిందొడరకమెఱసెన్ దోర్విలాసంబువైరుల్
ప్రాణంబుల్ నాఁచికోల్దప్పదు తుదివిధియబ్బాలురంద్రెళ్లవైచెన్ -సౌప్తిక-ద్వితీయ-14

మహాసగ్ధర.శరదంష్ట్రాభీషణంబై చటులరిపుమృగస్వైర విధ్వంసలీలా
స్ఫురణన్‌శోభిల్లు రాధాసుతుఁడనుపులివిస్ఫూర్జింతంబున్‌సహింపన్
వెరవున్‌దర్పంబుఁగల్గెన్ వికలరిపులచే వీటిఁబోయెం గుమారో
త్కర మింకేమందునాపత్పరికలన ప్రమాదంబునంగాకయున్నే-సౌప్తిక-ద్వితీయ-15

స్రగ్ధర. శాతాస్త్రస్ఫార వీచిసముదయరభసాశ్చర్య సంపాదిహేలా
స్ఫీతంబైక్రమ్ముదేరన్ బెదరకకలఁచెన్ భీష్మవారాశిఁదుచ్ఛా
రాతివ్యాపార దుర్వారతఁదెగియెఁ గుమారవ్రజంబక్కటా ని
ద్రాతంద్రావ్యాప్తినక్రూరతఁబొరసి భుజాప్రౌఢివమ్మయ్యెఁజుమ్మీ-సౌప్తిక-ద్వితీయ-16

ఆ. అధికబలముగెల్చియవనీపతులు గొంద, అతి విహీనరిపులయాక్రమమున
మదసిరకటజలధివెడలిసన్నపుఁగ్రయ్య, మునిఁగిరూపడంగుజనులమాడ్కి-17 -ఇది యథామూలము.

అని పరిపరి విధముల వారిశౌర్య ప్రతాపోద్ధతులను జ్ఞప్తికి తెచ్చుకొనుచు, వారలకు పట్టినగతికి చింతించుచు, విధివిలాసమని మనసును సమాధానపర్చుటకు ధర్మజుడెత్తించినటుల కాన్పించును. అనంతరము కర్తవ్యతా పరాయణుడై, ద్రౌపది మనస్సునకీ విషయము ఎంతబాధనొందించునోయని ఆలోచనాంతరంగుడై ఉపప్లావ్యంబునున్న ద్రౌపదిని, మిగిలిన వధూజనమునుతోడి తెమ్మని నకులుని పనిచెను. అనంతరము పాండవ శిబిరమ్మునకరగి

మూర్ఛితులైరి. కొంత తడవునకు సాత్యకి ఉపచారాదులవలన తెలివొందిరి. ధర్మజుడు మాత్రము పుత్రులదేహముల పైబడి అశ్రుధారావృతముగ విలపించుట చూచిన, కన్నతండ్రైన ధర్మజునకంత బాధ కల్గుట సహజమే! యనిపించును. అంత శ్రీకృష్ణార్జునులతనికి సముచిత భాషణంబులనోదార్చిరి. తక్కిన వారును తగు మాటలచే ఉపచరించ, కొంత తడవునకు తెలివొంది కార్యాయత్తుడగుచు.

తే. పుత్రులకుబాంధవులకునుమిత్రతతికి, నగ్నికార్యంబువొగులుచునాచరించి
యొక్కచోటనాసీనుఁడైయుండె ద్రుపద, తనయవచ్చుట వార్చినెమ్మనముదలర –సౌప్తిక–ద్వితీయ–23

ధర్మజుడుండెను. పై పద్యమమూలకము. తిక్కన కల్పించి, సందర్భమును పరిపుష్టిమొనర్చినాడు.

144. మహాభారతము కురుపాండవకథతో గూడినది. కాని వ్యాసుడు భారతమును కురుపాండవుల కొరకు వ్రాయలేదు. భారతీయపాఠకులను చక్కదిద్దుటకై వ్రాసినాడు. కనుకనేయిట్టి కావ్యములందలి ఘట్టములు అల్లకల్లోల ములను సృష్టించు మానవ మనస్థత్వమునకు ప్రతిబింబములుగనుండి, అట్టివిపత్తులనుండి భవిష్యమున మానవ జాతిని హెచ్చరించినట్టివిగనుండును. ప్రకృత సందర్భమునందలి కథ చూడుడు. ధర్మజుడు భీష్మాదులకన్న చిన్నయైనను, భారతయుద్ధమునాటికి వయోవృద్ధుడనియే చెప్పవచ్చును. తమపాలి రాజ్యభాగమునకైననేమి, క్షాత్రధర్మము పాటించు చున్నామన్న తృప్తిచేనేమి, కారణమేమైనను అఖండ జనక్షయమునకు కారకులలో ధర్మజుని పేరుకూడ చేర్చకతప్పదు. కాని యుద్ధానంతరము ఎదుటి పక్షమువారి మృతులనుగూర్చి విచారించుట ధర్మజునకే చెల్లినది.

ఒక్క నిముషము భారతీయ సమస్త చరిత్రమును తిరగవేసి చూచినచో, ఏ యుద్ధమునను శత్రు మరణములను గూర్చి ధర్మజునివలె రోదించినవారు కాన్పింపరు. అనగ భారతయుద్ధమును కేవలము కుటుంబ కలహముగమాత్రమె జూచినచో, ధర్మజుని దు:ఖము సమంజసమగును. అట్టితరి కుటుంబ కలహమున, శత్రుకోటితోడి యుద్ధమునకు సంబంధించిన క్షాత్రనీతినెల్ల, కుటుంబ కలహమునకు వర్తింపజేయవచ్చునా! అనునది ధర్మ సూక్ష్మముగనే మిగులునేమో! సారాంశమేమన ఎనుబది సంవత్సరములు పైబడిన ధర్మజుడు రాజ్యకాంక్షతో (వానికి రావలసిన భాగముకావచ్చును) తండ్రులను, గురువులను, పుత్రులనెల్లరను వధించి స్వపుత్ర, మిత్రనాశనమునకు కారకుడై పశ్చాత్తాపము నొందు చున్నాడట. వానికై భీష్ముడు బోధలు చేయుచున్నాడు. ఈ దృశ్యమును చూచినచో జనజాగృతికై ఈ ఉపదేశము బాగున్నదనవచ్చునుగాని, వ్యక్తిగ ధర్మజుని శీలమును చూచునప్పుడు, అంతవయస్సున నాతడు చేసిన కృత్యములు చూచినచో, అతడు చేసినదే నాటి ధర్మమని సరిపెట్టు కొనవలయునో! లేదా ఘటము పెట్టినను అతడు మారడని నిర్ణయించుకొనవలయునో!

145. ద్రౌపది నకులునివలన ఉపప్లావ్యంబుననే కుమారుల మరణవార్తవిని శోకాక్రాంతయై ఎట్లో రథమునందెక్కి పాండవులున్నకడకేతెంచి దిగుటతోడనే వసుధాస్థలిన పడినది. అదిచూచి భీముడామెను ధర్మజునియొద్దకు చేర్చగ,

వ. యమ్మహీపతియానంబాలోకించి యెలుంగురాలుపడదైవమానుషంబులు సుసంగతంబులై యుండుటయు నతనికి సామాజ్యంబు చొప్పడుటయునుగ్గడించి –సౌప్తిక–ద్వితీయ– 28

చం. కలిమికినొప్పుగాఁగ బలఁగంబయినీకడనాతనూభవుల్
మెలఁగఁగఁజూడఁగానన యమేయభుజాబలశాలి విక్రమో
జ్జ్వలుఁడు సుభద్రపట్టియును వమ్మయిపోయి ననూనభోగముల్
గలిగెనయేనియున్ మఱువఁగవశమే మనకాకుమారులన్ – 29

ఇది యథామూల భావమును గ్రహించి తిక్కన రచించినది. సంపద, భోగలాలసత్వములన్నై కుమారులను బలిచేసితివని వాచ్యముగనే ధర్మజుని నిలదీసినది. పుత్రమరణ దు:ఖితయై అట్లడుగుట మాతృమూర్తి స్థానమునన్న

ద్రౌపదికి సమంజసమే. ద్రౌపది ధర్మజుని నిందించుటలో రెండుకారణములు చెప్పవచ్చును. 1. ఆమె పుత్ర శోకమున నుండుట, 2. ధర్మజుడు యుద్ధప్రయత్నమేచేయనిచో ఉపపాండవ వధయుండదు. కాని ద్రౌపదియు యుద్ధప్రేరేపకు రాలేకదా! కనుక పుత్రశోకముననే యిటుల పలికినటుల భావించుటుచితము. కాని ధర్మజపక్షమున జూచిననిది అసమంజసముగ తోచును. నాటి అభిమన్యుమరణమునకు తాను కారకుడై యుండవచ్చునేమోకాని, ఇప్పటి యుప పాండవుల తదితర వర్గముల మరణములకతడికెట్టి సంబంధమునులేదు. ముందు జరుగబోవు విషయము తనకెట్లు తెలియును. వాసుదేవునకు తెలియుటచే పాండవులను దూరముగ ఓఘవతి నదీతీరమునకు తెచ్చినాడు. కావున అతనికి తెలియని విషయమునకు అతనిని, అతని ఆలోచనలను కర్తగ నిర్ణయించుట తగదనిపించును. ఇట మరియొక విషయముగూడ చర్చింపవలసియున్నది. యుద్ధముముగిసి దుర్యోధనాదులతోసహ యోధానయోధులందరు చంపబడిరి. శ్రీకృష్ణుని అవతారము ముగియనున్నది. అతని ఆజ్ఞకు బద్ధులై భూమికి దిగిన దేవదానవులు కొందరు నిజస్థానముల కేగినారు. మిగిలిన వారును యేగవలయునుగదా! లేనియెడల వారికొరకై శ్రీకృష్ణుడు మరియొకపరి అవతారమెత్తి యిలకు దిగి రావలయును, కావుననె శివుడు, అశ్వత్థామను ఆవహించి కార్యము నిర్వర్తించినాడు. ఇట అశ్వత్థామ కారకుడు మాత్రమే. శ్రీకృష్ణుడేకర్త. అట్టితరి ధర్మజుని లోభమోహాదులే కారణమనుట, అతనికిది ఆపాదించుట సబవుగ కాన్పింపదేమో యనిపించును.

146. అనంతరము ద్రౌపది ధర్మజునితో అశ్వత్థామనుపట్టి చంపకయున్న తాను ప్రాయోపవేశము చేసెదనని భీషణముగ పల్కిన, ధర్మజుడు ఆమోనూరడించి, అట్లుచేయుట పాపమని హితవు పల్కిన, ఆమె అశ్వత్థామ శిరో భాగమునగల మణిని తెచ్చియిచ్చిన శాంతి నొందెదనని పల్కి, భీముపరాక్రమమును పొగడి అతనినందులకు నియోగించినది. అది తెలిసి శ్రీకృష్ణుడు అశ్వత్థామవద్ద బ్రహ్మశిరోనామక దివ్యాస్త్రము గలదు, గావున భీముడాతని నిరోధింపజాలడని ధర్మజునితో పల్కి, అతనికి తోడుగ అందరము పోవలయునని రథములుపూయించి అర్జున, సహదేవ, ధర్మజ సమేతుడై భీమునకండగ జనియెను. తదనంతరము అశ్వత్థామ బ్రహ్మశిరోనామక అస్త్రంబును ఆమంత్రణచేసి అపాండవమొనరించమని ప్రయోగించెను. అంత శ్రీకృష్ణుడు అర్జునునిగూడ ఆ బ్రహ్మశిరోనామ కంబును ప్రయోగింపమని పలుకగ, ఆతడట్లే చేసెను. అంత వ్యాసమహాముని బ్రాహ్మణుడైనట్టి వానికి ఈకార్యము తగదని అశ్వత్థామకు హితవుసెప్పి, పాండవపత్నుల గర్భవిచ్ఛిత్తి కల్గించుటకు ఆ అస్త్రమును మరల్చుమని పల్కెను. అందులకాడు సమ్మతించి అట్లే చేయుదునని పలికిన, శ్రీకృష్ణుండాతనితో ఉత్తర గర్భంబుదగ్ధ తక్కినవన్నియు విచ్ఛిత్తి యగునని, తాను ఉత్తర గర్భంబున నున్న బాలుని రక్షించెదనని, పూర్వమొక తాపసిచే ఆమె దీవెనలందినదని, ఆ ఋషి పలుకులమోఘములు గావున అది నాశముకాదనితెల్పి మరియు యిట్టి ఘోర కృత్యమునకు ఫ్రేనుకొన్నందున మూడువేలయేండ్లు అన్నపానాదులకు దూరమై, దుర్గంధ రక్తభూయిష్టమైన తనువుతో, సహోదరహితుండవై చరించెందవని శాపంబిచ్చెను. అనంతరము వ్యాసుడు వాసుదేవుని శాపము తప్పదు, పొమ్మనినంత, అశ్వత్థామ నీవు మనుష్యులలో నుందువు. నీకడ నేను వర్తించెదనని వ్యాసునకు శాపమిచ్చి, తన శిరోమణిని పాండవులకిచ్చి తపోవనమున కరిగినాడు. అంత ధర్మజుడు శ్రీకృష్ణునితో అశ్వత్థామకు అట్టిశక్తి ఎట్లు కల్గినది? ధృష్టద్యుమ్నాదిగాగల వీరులందరిని అతడెట్లు చంపినాడో తెలుపమనగ, దానికి సమాధానముగ శ్రీకృష్ణుడు ధర్మజునకు శివమహాత్మ్యమును తెలిపి, అతని శక్తివలన యివన్నియు సంఘటించెనని పలికెను. ఇది యథామూలము.

==========

స్త్రీపర్వము – ధర్మజపాత్ర

స్త్రీ పర్వమున గత బాంధవులకైన స్త్రీ విలాపము ప్రధానము. ప్రథమాశ్వాసమున గాంధారిని ఓదార్చుటయు,

ద్వితీయాశ్వాసమున కర్ణునకై కుంతితోపాటు ధర్మజుడును విలపించుట ప్రధానముగ కాన్పించును. అనంతరము వలసిన బంధువులకెల్ల ధృతరాష్ట్ర, ధర్మజుల కర్తృత్వ పర్యవేక్షణములలో పైతృకవిధి నిర్వహింపబడినది. ఇచట ద్రోణాదులకు, తదితర వృద్ధ, బాంధవులకు, పెద్దవాడైన ధృతరాష్ట్రుడుకాక ధర్మజునిచే నిర్వర్తింపబడుట నాటి ధర్మశాస్త్ర ప్రకారమై యుండియుండును. ఈ వ్యాసమున ఇది ప్రకృతము కాకపోవుటచే దీనిని వితర్కింపను. వ్యాసారంభమున తొలి పలుకులో సూచించినటుల నాటికే ఏ ధర్మ శాస్త్రములు ప్రచారమున కలవో ఇదమిత్థముగ చెప్పజాలమని పున: సూచించుటకే పై విషయమును ప్రసక్తించితిని. ఇట్టి ధర్మసూక్ష్మములందనేకములు గలవు. కేవలము అందు ధర్మజప్రవేశ మొనరించిన తావులనే ప్రధానముగ పరిశీలించితిని.

స్త్రీ పర్వ ప్రథమాశ్వాసమున ధర్మజుడు, ధృతరాష్ట్రునియొద్దకు తమ్ములతోడ సమర తలంబునకు పోవుట కనిపించును. ధృతరాష్ట్రుని పరివేష్టించియున్న వనితాజనములు ధర్మజుని కనుకొని విలపించుచు, ధర్మజుని యుద్ధ క్రియకు పరిపరి విధముల భావించినతీరు యిటుల వర్ణింపబడినది.

సీ. ధర్మవేదిత్వమీధరణీశ్వరునకునె, క్కడియది కృపయెందుఁగలదుతలఁపఁ
దంద్రులమామలఁదాతలఁగొడుకులఁ, దోడఁబుట్టువులను ద్రుంచివైచెఁ
గ్రూరతమెఱయంగ గురుజనంబులఁగూల్చె, సఖులసంబంధులఁజంపెనదయుఁ
డనిపల్కుదురు కొందఱప్పార్థుఁ జేరి గాం, గేయునిద్రోణునిగెఁడయఁబొదువఁ

ఆ. బనుపనెట్లునేర్చితనిపల్కుదురు గొంద, ఱకట సింధురాజుననుజమగనిఁ
దునిమితేటిరాజ్యమనిపల్కుదురు గొంద, ఱతఁడుమోమువాంచి యరుగుచుండ-స్త్రీ-ప్ర-121

వ. మఱియుం గొందఱు-122

కం. ఇందఱఁజంపితిననియు, బ్బుందీఱద ద్రుపదతనయపట్టులనభిమ
న్యుందెగటార్చితిమఱఁదుల, నందఱమ్రింగితి విభూతియన నీకెద్దీ-123

అని అచ్చట గలవారు ధర్మజుని పరిపరి విధముల విమర్శించుట సహజముగనె కాన్పించును. ఇది యథా మూలము. కారణము వారికి జరిగిన విషయమున తప్పిదమెవ్వరిదో విచారించు వివేకము నశించుటయె! అందరికిని రాజధర్మము, ధర్మసూక్ష్ములు అర్థము కాకపోవుటయే! వారలందరకు ధర్మజుడు సమాధానమొసగు స్థితిలోలేడు. ఒకవేళవారిని సమాధానపరచుటకో, ఓదార్చుటకో ప్రయత్నించినను, అది ఎంతవరకు ఫలించునో చెప్పజాలము. అట్టితరి ఊరకుండుటయెనుత్తమము. ధర్మజుడీపద్ధతినే అవలంబించి మారుమాట పలుకక చనియెను.

అంత ధృతరాష్ట్రునికనుగొని, అతని పాదములకు ప్రణమిల్లిన ధర్మజుని కౌగిలించుకొని స్వాంతవచనముల నోదార్చెను. అనంతరము భీమార్జున, నకులసహదేవుల పేరు పేరుననెరిగించిన, ధృతరాష్ట్రుడు భీమునిపేరు విన్నంతనే క్రోధాయుతచిత్తుడై అతనిని కౌగిలించుకొనుటకుద్యుక్తుడయ్యెను. అంత ఆపద్బాంధవుడగు శ్రీకృష్ణుడు ధృతరాష్ట్ర మనంబు నెరిగినవాడై ఆతని యెదుట భీముని అయ: ప్రతిమనొకదానిని సృష్టించెను.

అది ఎరుగని ధృతరాష్ట్రుడు కోపంబుత్కటమై, ఆ ప్రతిమను కౌగిలించుకొని తన దశ సహస్ర సామజబలశక్తితో చూర్ణితము గావించి సంతుష్టాంతరంగుడగుచుండగ, కమలనాభుడాతనికి జరిగిన విషయమును వివరించి,

తే. తనయశోకాతురుండవై ధర్మమెడలి, యనిలసుతుఁదెగటార్చెదననితలంచి
తట్టిపనినీదుచేనేలయగు విధాతృ, లీలఁబరికింపనేరక బేలవైతి-స్త్రీ-ప్రథమ-137

వ. అదియునుంగాక - 138

కం. వినుమొకనినేల భవదను, జునిపుత్రులనెల్లఁజంపఁజొప్పడినను నీ
తనయులుమగుడఁగవత్తురె, యనయముపాపంబుసేసితాఱుడిఁబోవన్-139 అని మరియు

సీ. జగదీశవేదముల్‌సదివితి శాస్త్రముల్, వింటి వర్తిల్లితివృద్ధగోష్ఠి
నకిలపురాణపర్యాలోచనముసేసి, తెల్లధర్మంబులునెఱుఁగుదిట్లు
నీతప్పుదలఁపకనెవ్వగఁబొందెదు, కనలదవేనుశంతనుసుతుండు
గురుఁడునువిదురుండుఁ గూర్మొనికూర్మొని, చెవులఁబోయమెసవిశేష కార్య

తే. వచనములుసంజయుఁడు పెక్కువరుసలుభయ, బలవిధంబులు దెలియఁగఁబలుకఁడెట్లు
నీకునాబుద్ధులన్నియునెమ్మనమునఁ, జేర్పఁబోలవ యింకేమిసేయవచ్చు-142

అని ధృతరాష్ట్రుని మందలించి "నీయవినీతుయుం గొడుకుల దుశ్చరిత్రంబును దలంచి శోక రోషంబులు విడిచి శాంతుండవై యుండు"-147 అని శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి కర్తవ్యోపదేశము గావించెను. ఇది యథామూలము.

147. అనంతరము ధృతరాష్ట్రుడు భీమార్జున నకుల సహదేవులనుగని క్రమమున వారలను కౌగిలించుకొని దీవించెను. తదుపరి ధర్మజాదులను గాంధారియొద్దకునేగుమని పలికిన, వారు వాసుదేవ పురస్పరముగ గాంధారి యొద్దకు పోయిరి. ఆమె వారిని కనుగొన్నంతనె దీవింపనొల్లక, మనమున నిజతనూజుల మరణమునకు తాపము పొంది, ధర్మజునుద్దేశించి శపింపబూనిన, నయ్యవసరమున వ్యాసమహాముని ప్రత్యక్షమయి శపింపకుము, శమింపు మని మరియు నిట్లనియె.

సీ. పాండవేయాగ్రజుపైనల్కమానుము, రాజసంబేల యీరాజు ధర్మ
పరుఁడు నీవించుకపాటించి వినవమ్మ, చెప్పెదఁ గౌరవశ్రేష్ఠుఁడనికి
జనుచుండి తల్లిదీవెనయిమ్ము జయముగా, నాకనిపలికిన నాకుమారు
తోడ నీపేర్మికినీడుగాఁగొడుక యె, క్కడనుండు ధర్మమక్కడకు జయము

ఆ. సేరుననవె భూరిఘోరయుద్ధంబున, గెలుపుగొనిరి గానతలఁప ధర్మ
పరులకాఁగవలయుఁ బాండుతనూజుల, సూయలేనిబుద్ధిఁ జూడుమెట్లు-స్త్రీ-ప్రథమ-151

అని వ్యాసుడు గాంధారికి హితముపదేశించుచు, ధర్మజాదులను ధర్మాత్ములని ప్రశంసించినాడు. ఇచట మూలభావమును గ్రహించి తిక్కన, తెనుగున వ్యాసునిచేత పాండవులను ప్రశంసింపజేసినాడు.

148. అనంతరము భీముడామెకు తగుసమాధానమొసగిన తరువాత, గాంధారి

వ. ధర్మనందనుడెస మనసునిగుడం బుత్రపౌత్రవధసంపీడితస్వాంతయగునగ్గాంధారి క్రోధపరుషాక్షరంబుల నమ్మహారాజెచటనున్నవాఁడనిన, నాభూపతి భయంకపితగాత్రుండగుచుం జేతులుమొగచి సవినయంబుగా మెత్తని మాటలనిదె వచ్చితిదేవి యేనుబాండవాగ్రజుండననుచుం జేరంబోయి -172

కం. నీపుత్రులఁజంపించిన, పాపాత్మునిఁగ్రూరచిత్తుఁబరివాదార్హున్

శాపంబునఁబొలియింపుము, భూపాలకవల్లభాభిపూజితచరణా-173

కం. ధరణింగలరాజులకుం, బరివారమ్మునకుఁ జావుపాటిల్లుటకై
పరుషతగైకొన్న యుధి, ష్ఠిరు దారుణదండకలితుఁజేయందగదే-174

మ.కో. జీవమేటికిరాజ్యమేటికిఁ జెల్లుఁజుట్టలబిడ్డలం
జావఁజూచినయట్టిద్రోహికి సర్వభోగములేటికిన్
నావుడున్మఱుమాటలాడఁగ నాలుకాడకయుండియ
ద్దేవియూర్పునిగిడ్చెనుష్ణముదీర్ఘముం బరుషంబుగన్-స్త్రీ-ప్రథమ-175-ఇది యథామూలము.

అని ధర్మజుడు తన్నుతాను ఆదేవియెదుట నిందించుకొనుట గమనార్హము. ఇట ధర్మజునిలో లౌక్యము, తెలివి సమానస్థాయిలో ప్రదర్శింపబడినట్లు కాన్పించును. తిక్కనగారు నుడివినటుల మెత్తని మాటలు ముసుగులో, తెలివిగ ఆమెకు కోపము తగ్గించుటకు ప్రయత్నించుచు, తన్నుతాను తిట్టుకొనునెపమున లౌక్యమును ప్రదర్శించి కృతకృత్యుడైనాడు. లోకమున సామాన్యముగ తప్పుచేసినవాడు తనతప్పునొప్పుకొనుచు, పశ్చాత్తప్తుడైనచో అతనిని దండించిక, ఆతనిపై జాలికలిగి విడిచిపుచ్చుట కాన్పించును. అద్దానినే ధర్మజుడాచరణలో పెట్టి, గాంధారీదేవి కోప తాపములనుండి బయల్పడినాడు.

<u>ద్వితీయాశ్వాసము :</u>

149. ద్వితీయాశ్వాసంబున ధృతరాష్ట్రుడు ధర్మనందనునితో యుద్ధమున మరణించిన వారి లెక్క తెలిసినచో యెరింగింపుమనిపల్కెను. అంత ధర్మజుడు, వినుమెరుకపడ్డ వారుత్తమజనంబులు డెబ్బదియారు కోట్లు నిరువదివేలును మ్రుక్కడిమూక యిరువది నాలుగువేలు మున్నూట యిరువండ్రు దెగిరని -స్త్రీ-ద్వితీయ-167 సమాధానమొసగెను. ఇటమూలమున 1.దశాయుతానామయుతంసహస్రాణిచవింశతి:, కోటయ:షష్టిశ్చషట్చైవహ్యస్మిన్రాజన్ రణేహతా: అలక్షితానాంవీరాణాంసహస్రాణిచతుర్దశ, దశాచాద్యానిరాజేంద్రశతంషష్టిశ్చపన్చచ (స్త్రీ పర్వాంతర్గత- శ్రాద్ధపర్వము) మూలము 9, 10 శ్లోకములు(అరువది ఆరుకోట్ల పదిలక్షల ఇరువది వేలమంది రాజులు చనిపోయినారు. చూడబడని వీరులు ఇరువదినాలుగువేల నూటఆరువది అయిదుమంది అని గలదు) అంత ధృతరాష్ట్రుడు వీరలందరు ఏగతికి పోవుదురని ధర్మజుని ప్రశ్నించగ, అందులకాతడు

తే. ఎవ్వరాత్మదేహములుసమిద్ధమైన, యస్త్రవహ్నివేలిచిరి వారమరలోక
మునకుఁజని నిర్జరాంగనాజనవిలసితుఁ, డైనయమరేంద్రునకుఁ బూజ్యులగుదురధిప -168

కం. తఱచుగశస్త్రాస్త్రంబులు, నెఱఁకులుదూఱినఁ జలించినిజధైర్యంబుల్
మఱిచితెరలిచచ్చిరి కొం, దఱు గుహ్యకగతికిఁబోవఁదగుదురువారల్ -169

కం. సమరముననెత్తెఱంగున, సమసిననుం గీడుతెరువుచనరుత్తమలో
కమునకుపోదురు జనములు, ప్రముదితులైయండ్రుబుధులు పౌరవముఖ్యా-170 అనిన ధృతరాష్ట్రుడుమరల

కం. అనినవిని నాథవంతులు, ననాథులునునైనవీరికందఱకుఁ గృపా
ధనలోల చేయఁగావ, చ్చునకాదేయగ్నికార్యశోభనముఁదగన్ -171, అని పలికెను.

అంత ధర్మజుడు ధౌమ్యునిరావించి మంతనములు జరిపి, విదుర, సంజయులను కనుంగొని, మీరు భరత

కులులకుతప్ప అనాధవంతులైనవారికి విద్యుక్తంబగు అగ్నిసంస్కారముచేయుడని పనిచి, బహు బ్రాహ్మణ సంఘంబులతో జని దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శల్యాదులకు, అభిమన్యు, ఘటోత్కచ, విరాట, దృష్టకేతు ప్రముఖులకును తక్కిన పేరెరుకపడు నానాదేశాధీశులకును సముచితముగ అగ్నిసంస్కారములు, పితృమేధాది పారలౌకికక్రియలను నిర్వర్తించెను. అనంతరము ధర్మజుడు ధృతరాష్ట్రునిముందు నిడుకొని సర్వబంధు సహితముగ గంగా స్నానమాచరించి సర్వకౌరవులకు తిలోదకప్రదానములు గావించెను.

150. అంత కుంతి అశ్రుపూర్ణ నయనములతో ధర్మజుని వద్దకువచ్చి ఎల్లవారలు వినుచుండ, కర్ణుని పొగడుచు, భాస్కరవర ప్రసాదమున తనమొదటి గర్భమున జన్మించినాడని, ఆ జన్మవృత్తాంతమెరింగించి, నీకగ్రజుడు గావున అతనికిని తిలోదకతర్పణము గావించుమని పల్కినిది. కుంతి పలుకులువిని పాండవులు నివ్వెరపడియుండగ, అందు ధర్మజుడు తల్లితోనిట్లనియె.

సీ. అనిలజార్జునులమార్కొననేర్చెనెవ్వని, యుత్సాహమూఁది సుయోధనుండు
వైదేహపౌండ్రాది వసుధేశులెవ్వని, కడిమిసొంపుననరిగాఁపులైరి
మనసైన్యకోటియెవ్వని బాహువీర్యసం, పదకోడియంతంతనొదుఁగుచుండు
నద్భుతంబొనరించెనమరులకెవ్వని, యసమానవివిధదివ్యాస్త్ర మహిమ
తే. మమ్మునందఱనెవ్వని మహితశక్తి, యెక్కుడైసంగరంబునఁ జిక్కుపఱిచె
నట్టికర్ణునిఁ గొంగుననగ్నిదాఁచి, నట్టులెమ్మెయిదాఁచితోయమ్ము చెపుమ-స్త్రీ-ద్వి-178
కం. అర్జునుఁడొకరుడుదక్క ను, పార్జితశౌర్యముననమ్మహాబాహుని వి
స్ఫూర్జితరథమునకెదురై, గర్జిల్లఁగరథికుఁడెందుఁగలుగునె జననీ-179
తే. కర్ణుఁదొలుచూలుగానేలకంటి తల్లి, నీదుమంత్రంబు పరమవిషాదకారి
యయ్యె మాకెల్లనట్టిమహాబలైక, గణ్యుబ్రుంగుడు పఱుచుట కారణమున -180

అని ధర్మజుడు కర్ణుని శక్తిని పరిపరి విధముల స్తుతించుచు, అతని మరణమునకై మనసున వగచుచు ఆ బాధనిట్లు వ్యక్తపరచినాడు.

తరువోజ.భానుపుత్రునిచావు బంధులనెల్లఁబరమసంతాపంబు బాల్పడఁజేసె
మానితబలుఁడభిమన్యుండు పోరమడసినప్పుడునిట్టిమఱుకువ నాత్మ
నూనదు ద్రౌపదేయులనాశమునకు నుడుకదివ్విధముననుల్లంబు ద్రుపద
సూనులు ధృతరాష్ట్రసుతులును ద్రుంగుచొప్పున కిమ్మెయిఁ జోరదడల్‌జాల-స్త్రీ-ద్వి-181

ఇట ధర్మజుని మాటలలో అభిమాన్యాది ఆత్మపుత్రుల చావునాడతనికింతటి బాధ గలుగలేదని, కాని నేడు కర్ణుడు తన అగ్రజుడని తెలిసిన తరువాత, అతని చావు ధర్మజునకు అధికమయ్యెనని పలుకుటలో సోదరులయెడ అతనికిల ప్రేమానురాగములు వ్యక్తమగుచున్నవి. ఇది యథామూలము.

151. ఆ.అతఁడుమాకునన్నయనిమున్న యెఱుఁగంగఁ, గన్నఁ గురుకులంబుగలఁగఁబడక
మనుదుమట్టులైన మనుజలోకమునకుఁ, గలుగదడలు మాకుఁగలుగదడలు-182 , అని వగచుచు కర్ణునికి తర్పణాదులు గావించి, కర్ణభార్య, వధూజనములను రావించి ధర్మజుడు సంభావించెను. ఇది యథామూలము.

==========

శాంతి పర్వమున ధర్మజునిగూర్చి గ్రహింపవలసినదెంతయో కలదు. ఆ పర్వమునకిడిన పేరును గ్రహించుటయే కష్టమగును. ఇచట వాడబడిన శాంతి అనగా నెట్టిది? ఇది ధర్మజునకు లభించిన శాంతియా? శ్రీకృష్ణుని సంకల్పమున్నదైన శాంతియా! ధర్మజుడు శాంతించుటకై భీష్ముడుపదేశము లిచ్చెననుటకా! అనునది సూక్ష్మ విషయము. కర్ణవృత్తాంతమును కుంతి, నారదులవలన తెలుసుకొనిన ధర్మజుడు, కర్ణునికై విలపించి వాని జన్మవృత్తాంతమును మరుగుపరచినందులకు స్త్రీ లోకమునే శపించుటతో ప్రథమాశ్వాసమున ఈ పర్వమారంభమగును. కర్ణుడెవ్వడో బాల్యముననే ధర్మజునకు తెలిసియుండినచో మహాభారత యుద్ధమే జరిగి యుండదని తలంపుతో కర్ణుని తలపై భారతమను లోకోక్తి లోకమున ప్రసిద్ధినందినది. అనగా భూభార హరణమునకై నారాయణావతారుడైన శ్రీకృష్ణుడు వేసుకొనిన పథకమున కర్ణ జన్మ వృత్తాంత గోపనము ప్రధానమగుచున్నది. ఈ రహస్యము ప్రకటితమైననాడు భారతకథ ముగింపునకు వచ్చినటులలెక్క.

అనగ శ్రీకృష్ణ సంకల్పమింతటితో చివరిదశకు చేరినదని భావము. అది తెలిసిన పిదప ధర్మజుడు పొందెడి ఆ శాంతి మానవసహజమైన ఆర్ద్రతలకు సంబంధించినట్టిది. దానిని జయించిన కాని సాధకుడు వైరాగ్యమందలేడు. అందులకై సాధకలోక శాంతికై సదుపదేశము, యిటుల ప్రతి ఆశ్వాసమునందలి కథా సందర్భములను సూక్ష్మముగ చూచుచు, లక్ష్యములను వివరించునట్టిది కాగలదు. అయినను ప్రకృతమున మాత్రము ధర్మజ పాత్రకు పరిమితముగ పరిశీలించుటే లక్ష్యముగ నిడుకొని, యిందలి ఆరశ్వాసముల కథాభాగమును సంక్షిప్తముగ వివరింతును.

152. శాంతి పర్వప్రథమాశ్వాసమున ధర్మజుడు కురువీరులందరికి ఉదకకర్మలాచరించి, గంగా తీరమున ఒక పర్ణకుటీరము నిర్మించి కురువధూజనము, మిగిలిన బంధువర్గము, భార్యానుజులతోడనుండగ, వ్యాస, నారదాది మహామునులు వారలను చూచుటకేతెంచిరి. అంత ధర్మజుడు తన మనమునందలిగల భావములనెరుకబడునట్లుగ వినయమున ఆ మునులతోనిట్లనియె.

సీ. కృష్ణుండు మామీఁదఁ గృపసేయుటయు బ్రాహ్మ, ణాను గ్రహంబుననిలపుత్ర
పార్థుల పటుబాహుబలమున మేదిని, యంతయుఁ జేకుఱునట్టిదయ్యె
నైనను నతిఘోరమగు నఖిలజ్ఞాతి, వధమొనరించుట వలననధిక
గుణుని సౌభద్రునిఁ గులభూషణంబుఁ బాం, చాలితనూజ పంచకముఁ గోలు

తే. పోకఁ జేసియు గెల్పు గెల్పుగ మదీయ, బుద్ధి గైకొనదయ్యెడు సిద్ధముఖ్య
యదియుఁగాక వేఱొక్కండు మదిఁగలంచు, చున్నయది దానినేర్పడ విన్నవింతు-శాంతి-ప్రథమ-6

అని తన విజయమునకు కారణములైన వారినెల్లరను ప్రస్తుతి చేయుచు, తనపుత్రుల మరణములకన్నను అధికముగ కర్ణమరణమునకు విలపించుట కొంత ఆశ్చర్య జనకముగ తోచవచ్చును. ఇది యథామూలము, కాని ధర్మజుని ప్రవర్తన సరియైనదేనను అభిప్రాయము యిప్పట్టున కాన్పించును. కారణము కర్ణుని శౌర్యపరాక్రమములే ముఖ్యముగ దుర్యోధనుని యుద్ధమునకు పురిగొల్పినవి. కర్ణుని బలపరాక్రమాదులను తలచుకొనని రోజు ధర్మజునకు లేదు. కర్ణుడున్నంతవరకు తమకు విజయము చేకూరదను విషయము ధర్మజునకు తెలియనిది కాదు. అందులకే అర్జునునిచే పాశపతాస్త్ర సంపాదన గావించి, యెట్టైనను కర్ణుని నిర్జించుటే తన జీవితములో ఒక లక్ష్యమని పరోక్షముగ తేటతెల్లము జేసినాడు. కారణమతడు వైరి బలములోని వాడు. మరి ఏ సంబంధ బాంధవ్యములు లేవనుకొనుట. గాని తమ వంశజుడు, సహోదరుడు, అగ్రజుడని యెరిగిన ధర్మజునకు అట్టి బాధకల్గుట సమంజసమే. కారణమతినికి సోదరులయెడ ఆప్యాయానురాగములు అధికమనుట యెల్లనెడ స్పష్టము. లోకమున సామాన్యముగ మానవులు

తమకు సంబంధించిన వాటినొకవిధముగ, సంబంధము లేని వాటిని వేరొక విధముగ జూచుట పరిపాటి. మానవునిగ ధర్మజునికికూడ ఈ న్యాయము వర్తించును. అట్లే ఉత్తమ క్షత్రియుడు, లోకజ్ఞుడు అయిన ధర్మజుడు, అట్టి మహావీరుడు తన అన్న అగుటచే తమ బలములోనుండిన సకల రాజలోకమును కనుసైగలతో శాసింపగలవాడగునను క్షాత్రకాంక్ష కన్పట్టకపోదు. ముఖ్యముగ కర్ణుని ప్రోద్బలము కౌరవులకులేకున్నచో ధర్మజుని సంధి ప్రయత్నములు నెరవేరి, యుద్ధము లేకుండగనే ధర్మజునకు, రాజ్యమొచ్చుడిదను అభిప్రాయముకూడ ధర్మజుని చింతనలో చాయామాత్రముగ గోచరించుచున్నది.

153. ఇట్లు పరిపరి విధముల కర్ణుని మరణమునకై వగచుచు నారదునిచే కర్ణుని చరితంబు విని దానికంతటకును కారణభూతియైన తన తల్లినేవగించు కొనుచు

తే. అంగనాజనమ్ములకు రహస్య రక్ష, ణంబునందలిశక్తి మనంబులందుఁ
గలుగకుండెడు మెల్లలోకములనని శ, పించె నాధర్మదేవతా ప్రియసుతుండు-శాంతి-ప్రథమ-41

అని స్త్రీ జనములనెల్లరను శపించెను. ఇది యథామూలము.

154. కొంత తడవునకు ధర్మజుని మనస్సు జరిగిన సంఘటలన్నింటిని జ్ఞప్తికి తెచ్చుకొనుచు, ధర్మాధర్మములకు, న్యాయాన్యాయములకు, లౌకిక, పారలౌకికముల మధ్యనూగిసలాడుచుండగ, తన తమ్ముల అంతరంగముల అభిప్రాయ ములు తెలుసుకొనుట కర్తవ్యమని తలచి, తన దీర్ఘోపన్యాసమును అర్జునునితోనిట్లనియె.

కం. మనకేటి రాజ్య? మొండొక, జనపథమున కేగిఁబైక్ష చర్యావిధి జీ
వనము నడిపికొనియుండుద, మనఘా యట్లయిన సుఖులమవుదుము సుమ్మీ-శాంతి-ప్ర-43

సీ. జ్ఞాతులనందఱిఁజంపితి మదియాత్మ, వధమకాదే రాజవర్తనంబుఁ
గాల్పు మహింస నిక్కము దాల్మిమత్సర, వర్జనమిది వనవాసజనుల
కాగమవిహితంబులటెయింత యొప్పునే, వనమున వసియింపవలయు వింటె
యసుఖదంబైన రాజ్యామిషంబునకుఁ గు, క్కల భంగిఁ దమలోనఁ గాటులాడి

తే. కులమునెల్లను బొలియింపఁగుత్సితంపు, బ్రదుకువచ్చెనెయనువగ పాలువఁడగఁ
బ్రమద మొసఁగదు త్రైలోక్యరాజ్యమైనఁ, గాననేనొల్ల మహిమీరకైకొనుండు-శాంతి-ప్రథమ-45

మ. ధృతరాష్ట్రుండు దనూజు కీడు సమబుద్ధింజూడక నీచుఁడే
గతిఁ జన్నంజననిచ్చెఁగాని మగుడంగాఁ దివ్వఁడయ్యెన్ నిరా
కృతశీలుండగు నాసుయోధనుఁడు సంక్షీణంబు సేసెంగులం
బతనింజంపఁగఁ గోపమాతెమదిశోకాక్రాంత మయ్యెందుదిన్ -శాంతి-ప్రథమ-46

వ. ఆ దుర్జనుండు గర్జంబెఱుంగక దుర్మానంబు వాటించిన సైరించి తొలంగనైతి రాజ్యపరిగ్రహపరత్వంబు మచ్చి త్తంబునం గలిమింజేసి కిల్బిషంబత్యంతంబు నాచరింపవలసెఁబరిగ్రహ దోషంబు పరిగ్రహ త్యాగంబునంగాని పోదు పరిగ్రహ త్యాగశీలుండు జన్మమరణ దు:ఖంబులంబొరయండని శ్రుతులసెప్పెడు నొకనికి సకల ధర్మంబుల ననుష్ఠింప శక్యంబగునే యపరిగ్రహంబొక్కటన శుద్ధుండునయ్యెద మీరుభూమిపాలన పరిగ్రహ తత్పరత్వంబును వర్ణాశ్రమ రక్షణంబుసేయుండేను గాననంబునకుంజని మునిజన సకాశంబున సుఖి నై యుండెద -శాంతి-ప్రథమ-47

ఇట మూలమున సుదీర్ఘముగ వివరింపబడినది. తిక్కన సంకీర్తీకరించినాడు.

పైనొసగిన ధర్మజుని ఉపన్యాసము పాఠకులకు కొంత విభ్రాంతి కల్గింపకమానదు. ఇయ్యెడ ధర్మజుని లౌక్యము పరిణితినందినదనక తప్పదు. ధర్మజుడు జన నష్టమునకు, బంధు నష్టమునకు చివరకు అత్మానుజుని, పుత్రనష్టమునకు కూడ పాల్పడి రాజ్యయోగంబు పొందినాడు. కాని తను పాలింపవలసిన ప్రజల దృష్టిలో, తనకున్న ప్రస్తుత పరివారము లోను, తనస్థితియెట్టిదను ప్రశ్నము ధర్మజుని మదిలో అంకురించినది. ఉత్తమ క్షత్రియుడుగ తనకర్తవ్యమును సర్వదా నిర్వహించినటుల లౌకికముగ తృప్తినందినను, పారలౌకిక చింత మనసునందడుగిడి అతనిని కలచివైచినది. అట్టియెడ అతనికి ధర్మసూక్ష్ములు తెలియవనికాదు. కాని లోకులలో తన ధర్మాచరణమెంతవరకు సమంజసముగ తోచుచున్నదో తెలుసుకొనుట ధర్మజునికి పరీక్షగ తోచి, తమ అనుజుల స్థితిగతులెట్లున్నవో తెలుసుకొనుటకు పై ఉపన్యాసము గావించినాడు.

ఇచట ధర్మజుని మాటలను మరియొక విధముగ భావించుటకుకూడ వీలున్నది. మానవుడు పరిపూర్ణ స్థితినందు వరకు వానిలో మానవత్వము, దానవత్వమును రెండును కలిసియే యుండును. అందున క్షత్రియునకు విరోధినాశనము మేలిమి లక్షణముగనే భావింపబడుటయు సహజము. ఈ భావవైరుద్యము ధర్మజునిలో ప్రదర్శితము. ఉత్తమ క్షత్రియునిగ దురాశపరులు, ధర్మఘ్నులగుట మాత్రమేకాక, కులస్త్రీని నాడు సభలో అవమానించి సహజమైన లోక ధర్మమునుకూడా భంగింపజేసిన కౌరవులను నాశమొనర్చువరకు శాంతింపకుండుట, క్షత్రియునిగ ధర్మజుని సహజలక్షణము. అయినను ధర్మజుడు యమధర్మజాంశుడు. అనగ బంధుత్వ దృష్టితోకాక సమదృష్టితో భావించుటకూడ వానికి కొంత సహజము. ఫలితముగ కళింగ యుద్ధమున అశోకుడు పొందినట్టి పశ్చాత్తాపమును ధర్మజుడు పొందినాడు. ఒక విధముగ అశోకునివంటి పశ్చాత్తాపమని కూడ చెప్పగలమో? లేమో? కారణము వధ్యులెవ్వరును అశోకునకు బంధువులుకారు. కాని యిచట మృతులు ధర్మజుని బంధువులు. కోపమున పుత్రుని శాసించినను, పిదప తండ్రి పశ్చాత్తప్తుడగునటుల, ధర్మజుడు రాచధర్మమునకై కావలసిన వారినే వధించి, పిదప ఇత: పూర్వము వారితోడి తనకు గల మధుర బాంధవ్యమును నెమరువేసుకొని విచారించినాడు. భీష్మ, ద్రోణాదుల మరణములు అతనికట్టి వ్యధను కలిగించుట సహజము.

ఇచట మరియొక విషయము గూడ గమనార్హము. సింహాసన మధిష్టించువేళ ధర్మజుని వయసు భోగముల నుండి పరాఙ్ముఖమగు స్థితిలో నడుగిడుచున్నది. తనవంటి వృద్ధులనెందరినో ధర్మజుడు చూచియున్నాడు. అనుభవించ దగిన సమయమెల్ల అయాసముతోడనే గడచి పోయినది. ఇక మనసు వానప్రస్థమును కోరువేళ రాజ్యలబ్ధి చేకూరినది. అది అనాయాసమైనచో, ధర్మజుని భావమెట్లుండునో తెలియదు. కాని బంధుకోటిని, అభిమన్యాది పుత్రలతోసహా వధించి చేపట్టిన రాజ్యభోగము, నిజముగ నాతని మనసును కలచివైచి, భోగపరాఙ్ముఖునొనర్చెననుట సహజము. అయినను ఉత్తమ క్షత్రియునిగ, తనకొరకు కాకపోయినను, తన పుత్రులకు రాజ్యమునందించి పోవుట క్షత్రియునిగ అతని ధర్మము. ఆ పనినే ధర్మజుడొనరించినాడు. కనుకనే రాజ్యధికారమును పుత్రకోటికందించి తాను వానస్థుడ నగుదునని ధర్మజుడు కోరుకొనుట, వాని వయ: పరిపక్వమునకు నిదర్శనము. తదనంతరము అర్జునుడు తానేర్చిన భంగి ఉచితవచనంబులతో ధర్మజునకిట్లనియె.

సీ. ధర్మపథంబున ధరణిసేకుఱినఁ బా, లింపక సత్త్వంబుపెంపుమాలి
విడుచుట యొప్పునే వినుమిట్టులైన ము, న్నేల భూపాలురనెల్లఁ జంపి?

తడలి రాజ్యము దక్కియడవికిఁ జనిన బే, లందురుగాక మేలంద్రె జనులు?
కిల్బిష శంకగల్గిననశ్వమేధాది, పుణ్యకర్మంబులఁ బోదె?వంశ
అ. ధర్మమెడలఁ గృపణకర్మంబుఁ గోరిత, ర్ధంబు, సువ్వెసకల ధర్మకారి
యొడమిలేనివాఁడ నడపీనుఁగను నహు, షోక్తి వినమె?దాని నూఁదవలదె?-శాంతి-ప్రథమ-49

అని ధర్మజుని మనోభావములకు చక్కని సమాధాన పురస్సరమగు మాటలతో, ధర్మజుని వర్తనము ధర్మపరమే నని, జరిగిన దానికై వగచుట తగదని పల్కెను. ఇట మూలమున విపులముగ వర్ణితము. తిక్కన సంక్షిప్తికరించినాడు.

155. అంత ధర్మజుడింకను తన మనో వైక్లబ్యమును విడువక అర్జునునితోనిట్టులనియె.

సీ. సారహీనములగు సంసార సుఖములు, విడచి యేకాకినై యడవికేఁగి
తాపస వాక్యామృతములు వీనులఁగ్రోలి, చెలిమివేర్పాటను చిరమరలకుఁ
జోరక నిందాస్తుతుల్ సరిగాఁగొనుచుఁగత్తి, నొకఁడు వ్రేసినను వేఱొక్కరుండు
చందనంబలఁదినడెందమయ్యిరువుర, యెడ సమంబుగ మూఁగ జడుఁడనంగ
తే. మెలఁగి తగువేళఁబర్ణశాలలకు నరగి, యెత్తఁగా భిక్షయెవ్వారలెట్టులేమి
యిడినఁగై కొని నాలుగేనెడలమాత్రఁ, గన్నదానఁ దృప్తుండనై యున్నమేలు-శాంతి-ప్రథమ-58
కం. అటుగాక కర్మ గతిలం, పటుఁడనగుదునేని నల్పఫలభాగితమై
నటయిటదిరుగుచు మోక్షని, కటవృత్తికి బాహిరుండఁగానె కుమారా! - 59

వ. కావున నాకు దొరకొన్న విమలప్రజ్ఞామృతంబనుభవింపక తక్కుదునే?యిది శాశ్వతపద ప్రదంబనిన-ఇదిమూల భావననుగైకొని తిక్కన రచించినాడు-60

ఇయ్యెడ ధర్మజుని మాటలలో క్షాత్రధర్మము కన్న, వైదిక ధర్మమందాశక్తి మెండుగ కన్పట్టుట గమనార్హము. తన విధిని సవ్యముగా నిర్వర్తించిన రాజన్యులెల్లరును యిట్టిలీల తలపోయుట వేదవిదితమైన కర్మగా ఆచరణీయము. సుక్షత్రియుడగు ధర్మజుడందుకు భిన్నుడుగాడు. మానవులకు సహజమైన కష్టనష్టములు గలిగినగాని, వారికి లౌకిక మందాశక్తి సన్నగిల్లదనుట సత్యము. అట్టి కష్టములమునిగి, పశ్చాత్తాపమను అగ్నిన, మానసము దహించినగాని మనస్సు పునీతముగాదు. అట్లయినగాని మిథ్యాపాత్రమగు లోకపు పోకడలను విడిచిపెట్టి, మోక్షసోపానసాధనమువైపు మరలుట అసంభవము. ధర్మజుడట్టి స్థితిని పొందినవాడగుటచే, వానికి వానప్రస్థమునకు వెడలవలయునను కోరిక కన్పట్టును. అట్టియెడ భీముడగ్రజునితోనిట్టులనియె.

కం. శ్రుతివిహిత కర్మజాత, స్థితి యోగ్యుఁడవైన నీకుఁజేయఁగ వశమే
యతిలోక జ్ఞాన సమ, న్విత యతిజనకృత్య?మటు వివేకింపుమెదన్-శాంతి-ప్రథమ-61

అనియు మరియు యిట్టి యిచ్ఛగలదేని యుద్ధము నివారించి, అస్త్రములను త్యజించి, అరణ్య వాసులమై ముందే జనుటుచితముగ నుండదే? అని అగ్రజుని ప్రశ్నించుచు, రాజన్యులనందరిని ద్రుంచి, సకల లోకపాలన చేతికివచ్చు తరుణమునకై ఎదురేగి, నేడిటుల బేలగ పలుకుట శ్రుతి విహిత కర్మజాతుడై యోగ్యుడైన రాజునకు తగదని హితవచనముల పలుకుచు, అట్లు చేసిన యెడల అయినవారిలో తలవంపులు, ప్రజలలో ఏహ్యభావము కలుగునని, భవిష్యమును సంగ్రహించుచు తన అభిప్రాయమును నివేదించెను. అట్లే నకులుడును ధర్మజుని ప్రవర్తనకు సమర్థనీయముగ, తనవైన ధర్మములనుపన్యసించెను. ఇది యథామూలము.

అంత ధర్మసూక్ష్మమునెరిగిన ద్రౌపదియు ధర్మజునితోనిట్లు పలికెను.

సీ. శోకాగ్నిజనకిన సొగయు నీతమ్ముల, నుపపన్న వాక్యామృతోపయుక్తిఁ
దేర్పుము గానలంద్రిమ్మరునాఁడు వీ, రాయసములఁబడుటవధరించి
సమయకాలమునన్నఁజని సుయోధనుఁజంపి, భోగంబులను బహుత్యాగములను
యాగంబులను సద్విహారముల్ సలుపుద, మని యూరడింపవేయరిగణంబుఁ

తే. ద్రుంచి రాజ్యంబుసేకోంటి తొఱఁగిపోదు, గాక యనియిప్పుడుడికింప నీకుఁదగునె?
ధర్మమును సత్యమును నుచితంబునిన్నుఁ, గడవనెఱిఁగెడు వారలు గలరె యధిప-శాంతి-ప్రథ-89
మరియు రాజధర్మములనిట్లు పలికెను.

కం. పేదమనసగుట ధర్మపు, గాదు నరేంద్రునకు జగముగావంబ్రోవం
గాదె నృపులోక పాలాం, శోదితుఁగాఁజేసెఁబద్మయోనిచతురతన్- 91

సీ. నృపునందు విధిదండనీతి ప్రతిష్టించెఁ, గావుననపరాధ గతియెఱింగి
దండించు నృపతికి రెండు లోకంబులుఁ, జేకుఱుఁ దోషంబుసేయనుదుట
నచ్చొత్తి వెడలంగ నడుచు విప్రునినైన, భూవరుండిదిమెచ్చు దేవకోటి
సభకేకవస్త్ర రజస్వలయనకనన్, దలవట్టి యీడ్చిన తప్పుఁదనదు

తే. తొడలుసూపిన తప్పును దుష్టకష్ట, తరవచనములఁబఱిచిన తప్పుననుజు
నందు దుర్యోధనునియందుననుఁగునందుఁ, గాంచిదండించితిట్టిది కల్మషంబె? -94

కం. దండార్హు లైనవారల, దండింపకయున్నఁ జువ్వె ధాత్రీ విభునా
ఖండలసన్నిభునైనఁబ్ర, చండపుఁగిల్బిషముపొందు జగతీనాథా -96

అని పలికి మరియు తను పడ్డ అగచాట్లన్నింటికి కారణులైన దుష్కర్ములను నాశమొందించుట పాపము కాదని పరిపరి విధములనుచితోక్తులను పలికెను. కాని ధర్మజుని అంతరమునగల క్షోభ విడువలేదు. ఇట తిక్కన మూలమునగల భావమునుగ్రహించి స్వకపోల కల్పితములైన పద్యములను రచించినాడు. అంతనర్జునుడు జనకమహా రాజుకు, అతని భార్యకు జరిగిన సంవాదమును వినిపించి, సన్యసించుట ఉత్తమ క్షత్రియులగు వారికి సమంజసము గాదని పల్కెను. అంత దేవస్థాణుండను ఋషి ధర్మములను కొన్నింటిని ధర్మజునకు విన్పించేసెను. ఆ సమయమున వ్యాసుడు కొన్ని రాజధర్మములను, ధర్మసూక్ష్మతలను, తత్ ప్రాయశ్చిత్తములను ధర్మజునకు తెల్పెను.

అంతకును ధర్మజుని మనోవికారము సడలకపోవుటచే, శ్రీకృష్ణుడు షోడశ మహారాజుల చరిత్రలు తెల్పి, వారి రాజధర్మపాలన వలననే మోక్షమునందరిని సోదాహరణముగ నిరూపించెను. మరియు పర్వత, నారదుల వృత్తాంతము, సువర్ణష్ఠీవి బునర్జీవితుడైన విధంబులన్నియును ధర్మజుడు వ్యాసునివద్దనుండి విని సంతృప్తాంతరంగుడై, తన మనసున పొడమిన రాజకార్య నిర్వహణకు, ధర్మాచరణకు మధ్యనూగిసలాడిన వైనమునకు తెరదించి, రాజ్యపాలనా బద్ధుడగుటకునుద్యుక్తుడయి, సర్వబంధువులతోడ కరినగరమునకు పోయెను. ఇది యథామూలము.

156. అంతనొక శుభదినమున అనుజులతోడ, శ్రీకృష్ణ, ధృతరాష్ట్ర, విదుర, సంజయ, యుయుత్సాది బంధువర్గము తోను, దౌమ్యాది పురోహితవర్గ పరివేష్టితుడైన ధర్మజునకు పట్టాభిషేక మహోత్సవము చేయుటకు నిశ్చయించిరి. నవరత్న మణిగణమండితంబైన ఉచ్చమంటపమున, భద్రాసనాసీనుడై యున్న ధర్మజునకు, శ్రీకృష్ణుడు శంఖతీర్థముతో అభిషేకించి, పృథివీపతుడవుకమ్మని ఆశీర్వదించెను. ధృతరాష్ట్రుడు ఉత్తమ స్వర్ణకలశమున గంగా జలమును ధర్మజునిపై అభిషేకించి పట్టాభిషిక్తున్ని గావించెను. అంత ధర్మజుడు తనకు పెద్దలయెడ, గురుజనుల యెడగల వినయ విధేయతలను ఎరుక పరచుచు, ధృతరాష్ట్రుని ప్రత్యేక శ్రద్ధతో తొలివలెనే సంభావించవలసినదిగా అనుజులను, పరిజనములను కోరెను. ఇది యథామూలము.

ఇయ్యెడ ధర్మజుని వినయముతోపాటు, ధృతరాష్ట్రునియెడగల పితృభక్తి వ్యక్తమగుచున్నది. మరియు ధర్మజుని రాజకీయ చతురత్వముకూడ రేఖామాత్రముగ బయల్పడుచున్నది. ధృతరాష్ట్రుడు మహారాజు, కాని దుర్యోధనుని పాలనలో నామమాత్రముగనె మిగిలినాడు. అయినను ప్రజలలో ధృతరాష్ట్రుని యెడ రాజభక్తి లేక పోలేదు. బ్రతికియున్న యింతకాలము రాజుగ సింహాసనమున కూర్చుండిన పితృసమానుడగు ధృతరాష్ట్రుని, నేడు కించపరచి ధర్మజుడు వర్తించినచో, జనములో అతనికి లభించు గౌరవాదరములకు లోటు కలుగవచ్చును. అందులకై ధర్మజుడు సువిశాలముగ యోచించి, సింహాసనమధిష్టించిన వెంటనే ధృతరాష్ట్రునికే మన్నన యొసగుమని పల్కుట వలన, ప్రజలలో ధర్మజుని యెడ భక్తిగౌరవములు అధికమైనవి. మరియు ధృతరాష్ట్రునకు సింహాసన మొసగినను, వృద్ధుడు, పుత్రశోక పరాయణుడగుటచే రాజ్యవ్యవహారములందు తలదూర్చడను విషయము ధర్మజునకు తెలియనిది కాదు. కావున మాట పడుటకంటె మాటమిగుల్చుకొనుటయె ఉత్తమము. కనుకనె ధృతరాష్ట్రునికే అగ్రాసనమిచ్చినాడు.

157. తన రాజ్యపాలనా వ్యవహారములు చూచుకొనుటకై ధర్మజుడు, సమర్థులను వారి వారి స్థానములందు నియోగించుటకై యోచించి, భీమునికి యౌవరాజ్య పట్టముగట్టి, అర్జునునికి రాజ్యవిస్తరణ, వేతన నిర్వహణము, నకులునకు ఆదాయవ్యయ నిర్వహణను, సంజయునకు సర్వకార్య విచారణ, యుయుత్సునకు చట్టపరమైన తీర్పులు, శిక్షా నిర్వహణకు విదురుని నియమించి, సహదేవుని తన అంతరంగికునిగ, సర్వకాల సర్వావస్థలయందు తనవద్దనే యుండుమని ఆజ్ఞలు విధించి దుర్యోధనుని నివాసమందిరము భీమునకు, దుశ్శాసనుని మందిరము అర్జునునకు, దుర్ధర్షుని గృహము నకులునకు, దుర్ముఖుని ప్రాసాదము సహదేవునకు, సంజయ, విదుర, యుయుత్సులకు వారి వారి మందిరములనే యిచ్చి, ధృతరాష్ట్రుని మందిరమతనికే యొసగి, ధర్మజుడు ఆనందముగనుండెను. అంతనొక్కనాడు శ్రీకృష్ణునిగలసి, తన మనమునందలిగల ఆనందోత్సాహములనతని కెరుకపరచి, అందతయూనాతని దయాలబ్ధమేనని పొగడి, అతనివలన పొగడబడి సంతృప్తినొందెను. ఇది యథామూలము.

<u>ద్వితీయాశ్వాసనము :</u>

రాజ్యాధికారమును పొందిన ధర్మజుని ప్రవర్తనలో లోపములేవియు లేక తనరాజనీతి చతురత, ధర్మపరిరక్షణలను పరిగణన నిడుకొని, ధృతరాష్ట్ర గాంధారులకు రాజ్యము సమర్పించి వారితో వినయమున ఓ పనుప్పున నేనే పనియైనను చేయువాడనని విన్నవించి వారిని పుత్రశోకామయ బాధనుండి కొంత మరపు కల్గించి, వారి పుత్ర ప్రేమను తనపై వర్షింప జేసుకొనిన సమర్థుడు ధర్మజుడు. బాల్యమాదిగ ధర్మజుడు పెద్దలయెడ వినయ విధేయతలు కలవాడను ముద్ర ప్రజలయందు గాఢముగ నాటుకొన్నది. కావున నేడధికారము ప్రాప్తించెనని తద్భిన్నముగ ప్రవర్తించిన, లోకులలో తనపైగల ప్రేమాభిమానములు సన్నగిల్లును. అదియునుగాక పుత్రశోకముతో కుమిలెడి ధృతరాష్ట్రుడు , బ్రతికినన్ని వర్షములు మరి బ్రతకడు కదా! మిగిలిన ఆ అల్ప జీవితశేషమున అతనిని కించపరచి, తనదైనముద్రను చెరిపివేసుకొనునంతటి వెర్రిగాదు ధర్మజుడు. మరియు ఏకాకియైన ధృతరాష్ట్రుడు మాత్రము యింక ఎవనికోసము ప్రాకులాడును. ఇట్లు ధృతరాష్ట్ర ధర్మజులిరువురును తమలో తాము వితర్కించుకొని పరస్పరానురాగబద్ధులైరనుట సమంజసముగ కాన్పించును.

అంతనొకనాడు ధర్మజుడు ధ్యానాసక్తుండైన శ్రీకృష్ణునితో సంభాషించ వలెనని, కొండొకసేపు స్రోత్రముచేసి ధ్యానమునకు కారణమేమని శ్రీకృష్ణుని ప్రశ్నించెను. అంత శ్రీకృష్ణుడు భీష్ముడు తన్ను ధ్యానించుటచే అటు మనసు లగ్నము చేసితినని పలికి భీష్మజన్మ, కీర్తి, గుణాదులను పొగడి అతని అంత్యకాలమాసన్నమైనదని ఎరుక పరచి, అతనివద్దనుండి అఖిల ధర్మములను అడిగి తెలుసుకొనమని ధర్మజుని ఆదేశించెను. కాని ధర్మజునకు మనమునందు

భీష్మాదులనెల్ల చంపినట్టి తాను, ఆ భీష్మునకు ఎదురేగుటకు సంశయమొందెను. అందులకై శ్రీకృష్ణ సహితుడై భీష్మ దరికేగు సమయమున, శ్రీకృష్ణుడు ధర్మజునకు పరశురామ వృత్తాంతము నెరిగించెను. భీష్మునియొద్దకుచేరిన శ్రీకృష్ణ, ధర్మజాదులు తమ రాక నెరిగించెను. అంత భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించి, అతనిచే ఏ బాధలు లేకుండగ మూడువరములు పొందెను. అంత శ్రీకృష్ణుడు అఖిల ధర్మ రహస్యములను ధర్మజుని కెరిగింపుమని పల్కెను. ఇది యథామూలము.

158. అంత భీష్ముడు ధర్మజునిగూర్చి ఇటుల పలికెను.

సీ. ఎవ్వఁడుపుట్టిననెల్ల మునీంద్రులు, నత్యంత సంప్రమోదాత్ములైరి
పరమ ధార్మికులైన భరతులయందును, నెవ్వరునెవ్వనినెనయలేరు
సత్యంబుదాంతియు శౌచంబు శాంతియు, నలవడి ఎవ్వనియందు వెలయుఁ
బాత్రదానాద్వర బంధురక్షాది ధ, ర్మంబులెవ్వనికిఁ బ్రియంబులెపుడుఁ

తే. గామమునైన విపులార్థకారణము, నైన భయమునైనను నపధవర్త
నంబునకుఁ జొరఁడెవ్వాఁడు నన్నునేమి, యడుగఁదలఁచె నా ధర్మజుండడుగుఁగాక-శాంతి-ద్వి-151

భీష్ముడిటుల ధర్మజునిగూర్చి పలుకుట బహుదా ప్రశంసనీయం. ఇది బంధుప్రేమ, పుత్రప్రేమలతో పలికినది గాదు. అఖిల ధర్మతత్వవేదియైన భీష్మునివంటి మహనీయునినోట ధర్మజునిగూర్చి సకల ధర్మ నిర్వాహుఁడచుఁడన్న విషయము వెలువడుట ధర్మజపాత్రకు యెనలేని శోభనాపాదించి, భారత చరిత్రమున సువర్ణ రేఖామయ చిత్రముగ, భావిజనుల యెదుట ప్రత్యక్షమైనదనుట అక్షర సత్యము. **ఇదియథామూలము. ఇటమూలమున ధర్మజప్రసంశ ఎనిమిది శ్లోకములలో గలదు.**

159. అనంతరము ధర్మజుడు భీష్మునితో రాజధర్మములను, ధర్మసూక్ష్మతలను వివరింపుమని వేడగ ధర్మజుని అంతరంగమును పసిగట్టిన వానిగ, విప్రులలో దండనార్హులనుగూర్చి చెప్పుట సమంజసము, సముచితముగ కన్పించును. ధర్మజుడు యుద్ధమందు గురులైన ద్రోణాచార్యుని వధించుటవలన, అతని మనసునందు బ్రహ్మహత్యా దోషము పట్టిపీడించుచున్నది. రాజైనవాడు అట్లు చేయుట జన సమక్షమున నిందితునిగ నిలబెట్టునేమో! అను శంక అతని మనసునందు గలదు. ఈ భావములన్నియు గ్రహించి, అతని మనోవ్యాకులతను తొలగించుటకై భీష్ముడు విప్రులలో దండనార్హులను గూర్చి ఉపన్యసించెను.

కం. శాంతుఁడుగాకనినాయుధ, వంతుడైకవియు విప్రువసుధేశుఁడు వే
దాంతినయిన హింసించుట, యెంతయు ధర్మంబుశ్రుతులునిట్లని చెప్పున్ - **175**

కం. అవలేపంబునఁ గర్త, వ్య వివేకములేక వలసినట్టులయెవ్వం
డవినీతిసేయుధరణీ, ధవుఁడువిడువవలయుఁదనకతఁడుగురుఁడైనన్-**182** ఇది యథామూలము.

బ్రాహ్మణునకు వైదిక కర్మాదులైన అగ్నికార్యములు, వేదాధ్యయనము, శిష్యబోధ, తపస్యాదిగాగల కార్యములు యుక్తములు. ఇట్టివిగాక విపరీతమైన అతడు దండనార్హుడు, జాతిబాహ్యుడు. ఇట ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడు. కాని తన విద్యుక్త ధర్మములను విడనాడి రాజుయందు అభిమానముతో, రాజుగారిచ్చిన గౌరవ, మర్యాదలకు లోబడి క్షత్రియధర్మానుష్ఠాన ప్రియుడై యుద్ధము చేయుట తప్పిదము. బ్రాహ్మణునకు అధ్యయన, అధ్యాపకత్వములువరకే పరిమితమైన ధనుర్విద్యను ద్రోణుడు అతిక్రమించి యుద్ధమునకు స్వయముగ నాయకత్వము వహించుట ఆలోచింప దగినది. ఇచట ఒక విషయము ధ్వనిగా భాసించును. మహాభారతయుద్ధమున పాండవులచే హింసింపబడిన విప్రులగలరు. అందాద్యుడు ద్రోణాచార్యుడు. పిదప చెప్పదగినవాడు అశ్వత్థామ. ద్రోణులు చిరకాలము అస్త్రవిద్యను

కురువంశీయులకు నేర్పుట మాత్రము వృత్తిగ కలవాడు. బాలుడైన అశ్వత్థామకు పాలైన కొని యీయలేని స్థితిలోనున్న ద్రోణుడు, వేదాంగమైన ధనుర్విద్యను రాజపుత్రులకు నేర్పి జీవనోపాధినొందుట ధర్మమే. అంతియేకాదు రాజసభలో మహోన్నత పదవినలంకరించ గలిగినాడు. అఖండగౌరవమునందినాడు. ఇంతవరకు సమంజసము. ఇంతలో అన్నదమ్ములమధ్య కలహాములు వచ్చినవి. రాజవంశమే నాశనముకాగల దుర్వారపరిస్థితులేర్పడినవి. అట్టితరి ఉత్తమ బ్రాహ్మణుడు, వేదవేత్త, శాపానుగ్రహ సమర్థుడయిన ద్రోణుడు, కౌరవపక్షమున యుద్ధమొనర్చుటకు సిద్ధపడినాడు ఈ సందర్భము ధర్మవిచికిత్సకాస్కారమిచ్చునట్టిదిగ కాన్పించును. యుద్ధమునకు వచ్చిన పిదప వానిని బాణములతో నొప్పింపక, పూజించుటయనునది పాండవులకు అసంభవకార్యము. చివరకు అర్జునునిచేతిలో ఓడింపబడి, ధృష్ట ద్యుమ్నుని కారణముగ బలవన్మరణమునందినాడు.

ఈ సందర్భమున ధర్మజుని భాంక్షు, ధృష్టద్యుమ్నుని చర్య క్షాత్రవిధానములు కావచ్చును! కాకపోవచ్చును!అదివేరే విషయము. కాని బ్రాహ్మణవధమాత్రము జరిగినది. అదియును ఆచార్య పీఠమునందున్నవాని వధ. ఇదియే ధర్మజుని బాధ. దీనిని దృష్టినిడుకొనియె భీష్ముడు అని నాయుధవంతుడైన విప్రుని చంపవచ్చునని ధర్మజునకు చెప్పినటుల మనకు తోచుట సత్యదూరము కాదనిపించును. కానిచో సాధారణ సమాజమున లేక నిత్యజీవితమున సంభవించు చిన్నతగవులలో ఆయుధధారియైనంత మాత్రమున విప్రుని వధించవచ్చునని మహాభారతము చెప్పినటుల భావింపరాదని పించును. నన్నయ అమూలకమున అడచిన తిట్టినన్ మరి మహోపరుషంబులు పల్కి అల్కతో పాడిచిన ఉత్తమధ్విజుల్ ప్రాజ్యుల్ వారలకెగ్గు చేసినన్ చెడునిహమున్పరమున్ అని వ్రాసియున్నాడు. ఇచట ద్రోణుడుత్తమ ద్విజుడు. కాదన జాలము. ఒట్టి ద్విజమాత్రుడే కాడు, ఆచార్యవర్యుడు కూడ. కావున ఏ విధముగ జూచినను గురువైనవాడు, యిట్టి యుద్ధకార్యాదులకు పూనుకొనుట అకార్యము. అదియును గాక ఏ రాజగురువు రాజులతో పాటుగా యుద్ధమునకు వెడలుట చరిత్రయందెచ్చటను కానము. కావున అతడు శిక్షార్హుడని భీష్ముడు తెలుపగ, తేలికపడిన మనసుతో ధర్మజుడు నిజసదనమున కేగినాడు.

160. అంత మరునాడు ధర్మజునకు భీష్ముడు దండనీతి జన్మ ప్రకారం బెరింగించుచు, వైన్యుడను రాజు వృత్తాంతము సెప్పగ, ధర్మజుడు చాతుర్వర్ణ్యములవారి ఆశ్రమ ధర్మములు చెప్పమని భీష్ముని కోరెను. అంతనాతండిట్లు పలికెను.

కం. కోపంబులేమి సత్యా, లాపము నిజదారపరవిలాసము శుచితా
గోపనమద్రోహంబవ, నీపాలక సర్వ వర్ణనియత గుణంబుల్-శాంతి-ద్వితీయ-221

చం. యజనము దానకర్మమును నధ్యయనంబును దస్యుహింసయుం
బ్రజకనురాగమొందఁబరిపాలనసేఁతయు సంగరంబున
న్విజిత విభీతిమైనురవణించుటయున్ నృపధర్మముల్ గురు
వ్రజతిలకాయమానసమరంబు సుధర్మువు వీనిలోపలన్ -శాంతి-ద్వితీయ-224

ధర్మజుడు వర్ణాశ్రమ ధర్మములనడుగుటలో తన క్షత్రియ ధర్మమును తాను ఎంతవరకు అనుష్ఠించెనో, తాననుష్ఠించునది ఎంతవరకు సమంజసమొ తెలుసుకొనుటకు అడిగినట్లు స్పష్టము. రాజునకు యజ్ఞాదిక్రతు నిర్వహణ, వేదాధ్యయనము, ప్రజాభిమతముగ పరిపాలన, యుద్ధమున వెనుదిరగక ధైర్యముగ శత్రువులతో పోరాడుట అనునవి ధర్మములుని భీష్ముడు వరుసగ తెలిపి, ధర్మజాంతరంగమునగల అనుమాన నివారణకై గురువ్రజ తిలకాయమాన సమరంబు సుధర్ముఁవు వీనిలోపలన్ అని పలుకుట ధర్మజునకు కొండంత ధైర్యమును ఆపాదించినట్లయినది. మరియు అన్ని ఆశ్రమములందు గృహస్థాశ్రమము గొప్పదని పలుకుచు

తే. వర్ణములునాశ్రమంబులు వశుమతీశుఁ, డుక్త పథమున నడిపించి యుభయలోక
సిద్ధిగనుఁదప్పఁద్రొక్కని శిష్టజనులు, గల నరేంద్రునకింద్రుండుఁదలఁపసరియె?-శాంతి-ద్వి-237

ధర్మజ వ్యాకులస్థితికి ఓదార్చునిచ్చెను. ధర్మజుడు యుద్ధమందు గలిగిన అశాంతితో, అరణ్యవాపమునకేగుట ఉత్తమమని ఆలోచించుటనెరిగి, భీష్ముడు ఆశ్రమ ధర్మములను ఏకరువు పెట్టి, గృహస్థాశ్రమమును సక్రమముగ నిర్వర్తింపక వానప్రస్థమునకరుగుట వలన ఇహపరములు రెండును చెడునని, అట్లు చేయుట క్షత్రియ ధర్మోచితము గాదని పలికెను. గృహస్థాశ్రమముననుండియే బ్రాహ్మణులకు, కర్మాదులకు వలయు సంపత్తినొసంగుచు, సకలజనుల సకలాశ్రమ ధర్మవర్తనములకు హానికలుగకుండ రక్షించినచో, నరేంద్రునకు ఉభయలోకసిద్ధి కరతలామలకమని తేటపరచి

సీ. ఏనుంగుహజ్జలోనెల్లసత్త్వంబులు, హజ్జలునడఁగిన యట్లపోలె
రాజితక్షత్రధర్మమునకులోనయి, సర్వధర్మంబులుఁజను మఖములు
వేదంబులును శుభవృత్తంబులును దండ, నీతిమాసినఁ జెడు భూతలంబు
సంస్కారరహితమై చాలహీనతఁబొందు, నట్టైనఁ బ్రజకుఁజేటావహిల్లు
తే. రాజులరసిన నెమ్మదిబ్రదుకుఁగాన, రాజు సర్వోత్తముఁడు ధర్మరాజియందు
రాజధర్మంబుయెక్కుడు రాజనంగ, ధర్మదేవతయనవేఱె ధర్మతనయ - శాంతి-ద్వితీయ-239

మరియు లోకమున అన్ని ధర్మములు రాజధర్మమును బట్టియె వర్తించుచున్నవి. క్షత్రియ ధర్మము సక్రమముగ అనుష్ఠింపబడనినాడు, మిగిలిన ధర్మములన్నియు కుంటువడి, సమాజము సంస్కారహీనమై, ప్రజలశాంతితో హీనత పొందెదరు. కావున ధర్మదేవతా స్వరూపుడైన రాజు సర్వోత్తముడు. ధర్మములలోకెల్ల పరమ ధర్మపథము రాజధర్మము అని భీష్ముడు నొక్కివక్కాణించెను. ఇందులకుదాహరణముగ తొల్లి ఇంద్ర మాంధాతృల సంవాదమును ధర్మజునకు విన్పించెను. మాంధాతృడను రాజు విష్ణువును దర్శింపగోరి క్రతువొక్కటి ఆచరింప సాగెను. అంత ఇంద్రుడు ప్రత్యక్షమై కోరిక నెరింగింపుమని పలుకగ, అతడు తనకు బిక్షావృత్తిననుగ్రహించి, తద్వారా ముక్తిని ప్రసాదింపుమని వేడెను. అంత దేవేంద్రుడు రాజు సర్వధర్మములకు మూలము, అట్టివాడు తన క్షత్రియ ధర్మమనుష్ఠించుచు మిగిలిన ధర్మములను అప్రమత్తుడై రక్షించినయెడల, అంతకన్న మించిన మోక్షము లేదని రాజునకొక్కనికే అట్టి అవకాశమున్నదని, రాజధర్మ వైశిష్ట్యమును తెలిపి అంతర్హితుడయ్యెను. కావున ధర్మరాజా నీవును అట్లు సల్పి ప్రఖ్యాతి వడయుమని భీష్ముడుపదేశించెను. అంత ధర్మరాజు తన డోలాందోళిత మానసమును కుదుట పరచుకొనెను. ఇది యథామూలము. ముందు పుటలలో బ్రాహ్మణధర్మము వివరితము. ద్రోణుని దృష్టిని నిడుకొని అని నాయుధ ధారియైన విప్రుడు వధార్హుడు అని వివరించి యుంటిని. అటులనే ఇచట క్షాత్రధర్మము వివరింపబడినది. ఇందు రాజు లోకమున అధర్మము పెచ్చుపెరగనీయకుండ చూచుచు, గృహస్థాశ్రమమున యుండుటే మోక్షమార్గమని సూచింపబడినది. ఆ సూచనమున దండనీతి మానినచో మఖములు, వేదములు, సర్వభూతములు చెడునని పల్కుట గమనార్హము. ధర్మరక్షణార్థమై ధర్మజుడు ద్రోణ,బీష్మాదులను సంహరించుట యిందు సమర్థింపబడినది. పెద్దలను దండించినందుకు కలతనందుచున్న ధర్మజునికీమాటలు ఉపశమన కారణములు.

పై వివరణము నందలి సారాంశమేమన యిట్టి ధర్మ వాక్యములను సూక్ష్మముగ గ్రహింపవలయుననుటయే. నిజమునకు భారతయుద్ధము రాజ్యాధిపత్యమునకై ఇరువురు సోదరులమధ్య సంభవించిన కుటుంబ కలహము. ఆ కుటుంబ సభ్యుల వైయక్తిక కీర్తి ప్రతిష్టల కారణముగ, రాజలోకమెల్ల రెండుగ చీల్చబడి, లోకయుద్ధముగ పరిణమించినది.

ఇట్టి గృహకలహముల వలన ఉత్పన్న మైన దండన విధానము, సహజముగ రాజులకు చెప్పబడు దండన ధర్మములకు భిన్నముగ కాన్పింపక మానదు. రాజ్యమున వర్ణాశ్రమ ధర్మరక్షణ విషయమునగాని, ప్రజలలో దుష్టులవలన సంభవించు ఉపద్రవములనుపశమింప జేయుటకుగాని నిర్దేశింపబడిన రాజదండనము ఒక్క త్రాటికి కట్టవీలుపడనట్టిదిగకాన్పింపవు. కనుకనే కుటుంబ వ్యక్తులమధ్యనగల స్వార్థముల కారణముగ బయలుదేరిన కక్షలు, కార్పణ్యములకు రాజధర్మముల రంగుపులిమి, ప్రపంచ యుద్ధముగ పరిణమింపజేసిన ధర్మజ, దుర్యోధనుల సంగ్రామమందలి క్షాత్రధర్మము ప్రత్యేక దృష్టితో చూచినచో భీష్మ వాక్యములు ధర్మజుని తాత్కాలికోపశమనమునకై చెప్పినటుల కాన్పించునేగాని సార్వకాలిక ధర్మములుగ గ్రహింపనుద్దేశించినవి కాదేమో! అనిపించును. తదనంతరము భీష్ముడు ధర్మజునకు భావిపరిపాలనమున సంభావింపదగిన వ్యక్తులగు, పురోహిత, మంత్రి, దండనాయకుల లక్షణములను, వారితో ప్రవర్తించెడి తీరుతెన్నులు తెలుపుచు, అందులకుదాహరణములు వినిపించెను. ఇది యథామూలము.

తృతీయాశ్వాసము:

ధర్మజుని సందేహములు తీర్చుచున్న భీష్ముడు మరికొన్ని విషయములను, ఉపాఖ్యానములను చెప్పుటకుద్యుక్తుడై వరుసగ కాలనిరూపణాదులగు రణోపాయముల ప్రకారము, శకునాపశకునములు, రాజు పగతురయెడనుండవలయు విధము, కాలకవృక్షేయమహాముని క్షేమధర్మికి చెప్పిన హితవాక్యములు, గణజనులంబాలించు ప్రకారంబుచెప్పి, ధర్మసూక్ష్మతలను కొన్నింటినిట్లు పల్కెను.

సీ. వినుతల్లియును తండ్రియునుగురుండును సేవ, నీయులు సద్భక్తి నిత్యనిరతి
వారలఁగొలచుచు వారెద్దిచెప్పిన, నదియాచరించుట యధికధర్మ
మాగమత్రయమునునగ్నిత్రయంబులో, కత్రయంబును దేవతాత్రయంబు
నను వస్తువులు వారలందును జనని గౌ, రవమున నెక్కుడు రాజవర్య

తే. యీ జగంబున దివమునంబూజవడయు, మాతృభక్తుండు పితృభక్తి మానసుండు
నట్లయవ్యయానందసంప్రాపణంబు, గురుపదాబ్జసమారాధకుండుఁగాంచు -43, ఇది యథామూలము.

161. అంతధర్మజుడు తను గురువునెడనొనరించిన పాతకమునకు చింతిల్లి, సత్యానృతంబుల పురుషుడు ఎవ్విధముగ ధర్మపరుడగునని భీష్ముని ప్రశ్నించగ అతడిట్లు సమాధానమొసగెను.

సీ. సత్యంబుపలుకుట సర్వధర్మములకు, మిక్కిలియనృతంబు మేటిపాత
కము తద్విశేషంబుగలదుచెప్పెదనొరు, నర్థంబుఁ ప్రాణంబునపహరింపఁ
జూచు పాతకులతో సూనృతంబాడుట, పాపంబు బొంకులువలికియట్టి
వారి హింసించుట వరధర్మమిదియొక్కఁ, డేల భూతలములకు హితముసేయు

తే. బొంకులెల్లను ధర్మముల్ భూతబాధ, కంబులగు నిక్కములుపాతకములు వినుము
భూతముల దుష్టశిష్టత్వములు వివేక, సూక్ష్మతావేద్యములు వానిఁజూడవలయు - శాంతి-తృ-45

ఇది మూలభావననుగ్రహించి తిక్కన కల్పించినాడు. పైవివరణ విన్నంతనే ధర్మజునిడెందమానంద పరవశ మయ్యెను. కారణము అన్నతముపలికి గురుని మరణమునకు కారకుడయ్యెనను బాధ మనస్సునుండి వైదొలగుటయే.

162. తదనంతరము ధర్మజుడు ఎట్టివాడు పాపములేకుండ సుగతికి పోవునని భీష్ముని అడుగగ, యజ్ఞ యాగాది క్రతువులనొనర్చుచు, రాజు వర్ణాశ్రమ ధర్మరక్షణ గావించుచు, భగవంతుడైన విష్ణువునందు బుద్ధినిల్పి, ప్రజాపాలన గావించువాడు పాపనిర్ముక్తుడై, ఇహపరములను పొందునని పాపనిస్తరణ కథన మొనరించిన భీష్మునితో ధర్మజుడు,

లోకమున ఒక్కొకపరి సౌమ్యులసౌమ్యులుగను, అసౌమ్యులు సౌమ్యులుగను కన్పించుచు ధర్మ విచికిత్సకు ఆస్కారము కల్గించు తరుణమందు ఏవిధముగ ప్రవర్తించవలెనని భీష్ముని ప్రశ్నించెను. అందులకు భీష్ముడు సోదాహరణముగ వ్యాఘ్రు గోమాయు సంవాదమును వినిపించెను. ఇది యథామూలము.

పై రెండు కథనములు ఒక విధముగ ధర్మజుని విషయమున సందర్భోచితములనిపించును. యుద్ధమున గావించిన పాపము, యజ్ఞములవలన క్షాళితమగునని మొదటి సందేశము. కౌరవ వీరులలో అగ్రగణ్యులు అనర్హ మంత్రాంగముచే చెడి, ఫలితముగ కురువంశము నధక్కరించిరని వ్యంగ్యముగ తెల్పుట రెండవ కథనమునందలిధ్వని. భారతయుద్ధమును నడిపించిన శ్రీకృష్ణునిపై భారమిడి అనంతరము వానినే జగన్నియంతగదలచి, వానిని నమ్మి మనశ్శాంతిని పొందమని భీష్ముడు ధర్మజునకుపదేశించినాడు.

<u>2, 3, 4 కథలు :</u> **2.** రాజు అప్రమత్తుడైయుండవలెనని తెల్పుచు అలసత్వమున మరణించిన ఒంటె కథ. **3.** శత్రువు నెదుర్కొను బలము చాలనప్పుడు ప్రవాహ వేగమున వంగియున్న చెట్టువలె వినమ్రత తగునని సముద్ర సరిత్సంవాదము. **4.** అధమ గుణుని ఉత్తమ పదవియందుంచిన చెడునని తెల్పుటకు కుక్కుర నీచత్వము తెల్పు కథయు వివరితములు. ఇది యథామూలము. బహుశ: కర్ణ, దుశ్శాసన, శకునుల ఉపదేశములచే పాడయిన దుర్యోధన వృత్తాంతమును,భీష్ముడు భావించియుండవచ్చును. అటులనే బలాబల నిర్ణయముకూడ వివేకముతోచేయక, పాండవులను రెచ్చగొట్టి యుద్ధమును కల్పించి, పర్యవసానముగ కురువంశ నాశనమునే కోరుకున్న దుర్యోధనస్థితియే సముద్ర సరిత్సంవాద కథా ఫలితము కానోపును.

163. కౌపత్యోపాఖ్యానము చెప్పుటకు మున్నుగ భీష్ముడు దండనీతి ప్రభావము, దండోత్పత్తి ప్రకారము, ధర్మార్థ కామముల తెరగు, సుమిత్రరాజు వృత్తాంతములు ధర్మజునకు చెప్పియున్నాడు. ఈ కథలలో రెండు విషయములు ప్రధాన ధ్వనులు. దండార్హుడైన దుర్యోధనుని ధృతరాష్ట్రుడు దండింపలేదు. (భీష్మాదులు దండింపుమని గతమున తెల్పి యున్నారు). ఇందుకు ప్రధాన కారణము వంశనాశకుడైన పుత్రునిపై ధృతరాష్ట్రునకుగల హద్దు మీరిన ప్రేమ, ఆశ అనునట్టివియే. అట్టి దుర్యోధనవధకై విచారింప పనిలేదని ధర్మజునకు సూచనము. తరువాతి కథనము కాపత్య వృత్తాంతము. రాజ్యాధికారము వాని గుణగణములు కారణముగ వానిని వరించినది. అటులనే ధృతరాష్ట్రుడు ధర్మజుని రాజవారసునిగ గ్రహింపవలెనని భీష్మాదులభావము. తద్వ్యతిరిక్తుడగుటచే ధృతరాష్ట్రుడు నాశనమైనాడు. ఇది యథామూలము. **6**వ కథ ప్రసిద్ధము. దీర్ఘదర్శి, ప్రాప్త కాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు అను మత్స్యముల కథ. కురు పాండవ యుద్ధమును భీష్మాదులు ముందుగనే యూహించి, వారించిరి. ధృతరాష్ట్రుడంగీకరింప లేదు. ప్రాప్తకాలమున శ్రీకృష్ణాదులుహెచ్చరించిరి. అప్పుడును ధృతరాష్ట్రుడు అంధుడేయైనాడు. చివరకు ధృతరాష్ట్రునిగతి దీర్ఘసూత్ర మత్స్యము గతియైనదని భీష్ముడు వ్యంగ్యముగచెప్పినట్టైనది. ఇది యథామూలము. ఇట్టివియె **7, 8, 9, 10** కథలును. బలహీనుడైన రాజు ఆపదసమయముల, బలవంతుడైన విరోధితోనైన స్నేహమొనర్చి, ఆపన్నివారణానంతరము దూరముగనుండ దగునని తెల్పు ఫలిత రోమసుల కథ చెప్పబడినది. ఈ కథను కురుపాండవ చరిత్రమునకు అన్వయించుట కష్టమైనను, ఇట్టి పరిస్థితులు పలుమారులు కాన్పించినవనవచ్చును. శ్రీకృష్ణునకు కంసాదులతోడనేగాక వారి బంధుగులనేకులతో విరోధమనివార్యమైనది. జనక్షోభము కలుగకుండ ఉపేక్షించి అదనున సంహరించినారు. ఇచట యధాతథముగనతుకక పోయినను, పాండవపక్షీయుడైన శల్యుని దుర్యోధనుడు తన ప్రక్కకు త్రిప్పుకొనుటవంటి వానినికూడ ఉదాహరణముగ గ్రహించవచ్చునేమో! పాండువులు, కౌరవులను ధర్మమార్గమున ఆశ్రయింప ప్రయత్నించి, అయిదూళ్లకయిన తృప్తిపడిరి. కాని విధి అనుల్లంఘనీయమైనది.

164. తరువాతి కథలో **(8)** పుత్రశోకమై గోరువంక రాజపుత్రుని నేత్రములను బొడిచి పిదప రాజు స్నేహమపేక్షించినను, పూర్వవైరములు స్నేహమునకు పనికిరావని నిర్ణయించుట వివరితము. పాండవులకిది పదేపదే అనుభవమైన విషయము. కౌరవులెన్ని పర్యాయములు తిరస్కరించినను సదా వారితోడ సహజీవనమును ధర్మజుడు వాంఛించినాడు. కానియది చివరివరకు వికటించుచునే వచ్చినది. తరువాత కథనము **(9)** విశ్వామిత్ర, ఛండాల సంవాదము. ఆపద్ధర్మములను తెల్పు కథనమిది. పాండవులు ఏకచక్రపురమున కావించిన భిక్షాటనమిట్టిదిగ చెప్పవచ్చునేమో! అనంతర కథ **(10)** శరణాగత రక్షణము. కపోతము బోయని నతిథిగ పూజించుట. సుప్రసిద్ధమైన కథ. బలహీనతలు మానవునకు సహజములు. ఆపదలును అట్టివియే కనుక ఆశ్రయించినవాని రక్షించుట సమాజమున సహజధర్మము. ఖాండవదహనవేళ అర్జునుడు శరణాగత రక్షకుడై ఇంద్రుని మన్ననందినాడు.

165. గృధ్రజంబుకోపాఖ్యానము **(11)** లోకుల మనస్తత్వమును చెప్పునట్టిది. వారి వారి అవసరముల కనుగుణముగ భృత్యులు ప్రభువులకు సూచనలిత్తురు. వానిని రాజు మెలుకువతో గ్రహింపవలసియున్నది. దుష్ట చతుష్టయమున కర్ణ, శకునులు చిత్రమనస్కులు. శకునికి దుర్యోధనునియందే మక్కువలేదని కొన్ని గ్రంథములు తెల్పును. కర్ణుడు అర్జునునితోడి సమరమును సదా కాంక్షించువాడు. అట్టివారు వారి అభిరుచులనుబట్టియే ఉపదేశింతురు గాని, కురువంశ శ్రేయమును చూడగజాలరని, దానిని దుర్యోధనుడు గుర్తింపజాలకపోయెనని భీష్మ హృదయము కావచ్చును. **(12)** శాల్మలీవృక్ష వాయుసంవాదము స్పష్టముగ దుర్యోధనుని అవివేకమును సూచించును. కర్ణాదులవంటి దాపును బలుపుగా భావించి పాండవులతో, శ్రీకృష్ణునితో విరోధమునకు దిగినాడు. కథయందు బూరుగు వృక్షము తన శాఖలను తానే భంగించుకొనగ, శాఖలువంటి నూర్గురు సోదరులను దుర్యోధనుడు శత్రువులవలన కూల్చుకొనినాడు. ఇది ధర్మజ దోషముకాదని భీష్ముడు వ్యంగ్యముగ వివరించినాడు. అనంతరము ధర్మజుని ప్రశ్నములపై దమంబు ప్రభావంబు, తపంబు విధము, సత్యస్వరూపము. అరిషడ్వర్గాదుల ఉనికి ఆదిగాగల విషయములన్నింటిని భీష్ముడుపదేశించెను. అంత నకులుని ప్రశ్నముపై భీష్ముడు ఖడ్గప్రభావంబు వివరించెను. తదనంతరము భీష్ముని సెలవుగొని నిజపురికేగుచు, మార్గమధ్యమున ధర్మజుడు అనుజులతోడ, విదురాదులతోను ధర్మార్థకామములతెరగు విచారించుచు జనియెను. ఇందలి కథలన్నియు యథామూలములు.

మరునాడు మరల భీష్మునితో ధర్మరాజు రాజగువాడు ఎటువంటి జనులను చేర్చు కొనవచ్చును. ఎటువంటి వారిని చేరనీయగూడదని ప్రశ్నించెను? అంత భీష్ముడు ధర్మజా! ఓర్పుగలవారిని, ధర్మమార్గములు తెలిసిన వారిని, సత్యమును పలుకు వారిని, మదలోభములు లేనివారిని, వచనచతురులను మంచి స్వభావముగల వారును భృత్యులుగ ఉండిన రాజునకు సర్వశుభములు కలుగునని పలికి, మరియు వీటికి వ్యతిరేకులైనవారు రాజుయొద్దనుండినచో తప్పక కీడు సంభవించును. చెడుగుణములు కలవాడు, చేసినమేలు మరచినవాడు మిక్కిలి దుర్మార్గుడు. కావున అట్టి కృతఘ్నుని చేర్చరాదు. అందులకు దర్పణముగ నాళీజంఘుని వృత్తాంతము ధర్మజునకు విన్పించెను. ఇచట దుర్యోధనుని ఆశ్రితులకు పై మేల్మిగుణములు లేమియే, కురువంశమునకు చేటుగ పరిణమించినదని భీష్మ భావము కానోపును. ఇది యథామూలము.

చతుర్ధాశ్వాసము:

166. చతుర్ధాశ్వాస ప్రారంభమున ధర్మజుడు భీష్మునవలోకించి, అన్ని ధర్మములలో ఉత్తమ ధర్మమెయ్యది! అద్దానిని ఎరింగించుమని ప్రార్థించెను. అంతభీష్ముడు అన్ని ధర్మములకంటె ఆత్మకు మోక్షము కలుగచేయు ధర్మము శ్రేష్ఠమని పెద్దలు చెప్పుదురని పలికి, అందులకుదాహరణముగ సేనజిత్తుని కథ వినిపింప నారంభించెను. సేనజిత్తుడను

రాజు పుత్రశోకార్తుడై విలపించుచుండగ అతని ఆప్తుడైన బ్రాహ్మణుడొకరుడు అతనితో ఇట్లనియె. ఓరాజా! పుత్రశోకమునకై విలపించుట తగదు. ఈ సంసారికమైన ప్రపంచమున జనన మరణములు సహజములు. వాటికై దు:ఖించుట వెర్రితనము. భార్యా, పుత్రులు కర్మల వలన కల్గుదురు. కర్మ క్షీణించినంతనే పోవుదురు. అందులకై వారిపై ఆశ నిడుకొనుట తగదు. ఆశయే దు:ఖమునకు కారణము. కావున ఆశను విడిచి వర్తించుటయే ఉత్తమము. అందులకు నిదర్శనముగ "పింగళ" యను వేశ్య వృత్తాంతమునుదాహరించెను. పింగళయను వేశ్యయొకతి ప్రియునిరాకకై ఎదురు చూచుచు, అతడు రాకపోవుటచే ఆశను విడిచి సుఖముగ నిద్రించినది. కావున ఆశను వదులుమని పలుకగ అతడును అట్లేచేసి సుఖించెను. కావున ధర్మజా! నీవును ఈ కథయందలి తాత్పర్యమునరసి శాంతిని బొందుమని భీష్ముడు పల్కెను. (పద్యములు 8-19) ఇట ధర్మజునకు అనుసంధానమైన విషయమొకటి గలదు. ధర్మజుడును పుత్రాదులగు అభిమన్యు, ఉప పాండవుల శోకార్తుడే. కావున భీష్ముడు ధర్మజాంతరంగమునరసి తదనుగుణమైన కథను ప్రస్తావించి ధర్మజునకు శాంతి ప్రసాదింపదలచినాడను విషయము ధ్వనిగ భాసించుచున్నది. ధర్మజుడు ధర్ముని పుత్రుడేయైనను వాని క్షాత్రమింకను బ్రాహ్మీస్థితినందలేదని భావము.

167. తదనంతరము ధర్మజుడు భూతములు నశించు కాలమాసన్న మగుచున్నది. గనుక జనులు చేయు కార్య మేదియో చెప్పమనగ భీష్ముడు పితా పుత్రసంవాదమను ఇతి హాసమును విన్పింపదొడగెను. మేధావియను బ్రాహ్మణ కుమారుడు తనతండ్రితో మోక్షముపొందు విధానమడుగగ, తండ్రి సంసారముచేసి పుత్రాదులను పొంది తదనంతరము యజ్ఞయాగాది క్రతువులొనర్చినచో మోక్షము పొందగలమని సూచించెను. అంత మేధావి తండ్రితో ఇట్లనెను. ఆయుర్ధాయమును తెలుసుకొన జాలము. క్షణము ఏమరిన ఏమగునో. అట్టితరి సంసారమును చేసి పుత్రులను బడసి తదుపరి హింసా ప్రవృత్తి కలిగిన యజ్ఞాదులనొనర్చుటకు అడవికిపోవుట, యివన్నియు చేయుటకు సమయము పట్టును. అంతవరకు జీవనముండుననుట దుస్సహము. కావున అన్నియును విడిచి మన దేహమందేగల ఆత్మకొరకు అన్వేషణచేసి మోక్షమును పొందుమని భీష్ముడుపదేశించెను (పద్యములు 21-32)

168. అనంతరమున ధర్మజుడు లోకమున ధనవంతులు, దరిద్రులు అనేకులున్నారు. వారియందు సుఖులెవరో? దు:ఖవంతులెవరో? చెప్పుమని అడుగగ భీష్ముడిట్లు పలికెను. లోకమున ధనవంతునకు ధనమువలన దు:ఖమేతప్ప సుఖములేదు. దానిని సంరక్షించుచునుండుట, చోరాదులవలన భయము, ఇతరుల కొసగుటవలన బాధలు మొదలగు వాటిచే చిత్తమువ్యాకులమై, సుఖమునకాస్కారమీయదు. దరిద్రునకు ఈ బాధలు లేక ఎచ్చటనైనను సుఖముగనుండును.

కం. ధనవత్వము దు:ఖకరం, బనికనితత్కాంక్షవిడుచునతనికథన తా
జనితాత్మాధనత్వం, బనుపమసౌఖ్యంబుసేయునక్షీణముగన్-శాంతి-చతుర్థ-38

అని ధర్మజ ప్రశ్నకు సమాధానముగ 'శవ్యాకుడను' బ్రాహ్మణుని పలుకులు ఉదహరించెను. మరల ధర్మజుడు ధనమందు ఆశగల పురుషుడు దేనివలన సుఖమును పొందునో తెలుపమనెను. ఈ అభిప్రాయమునకు సమాధానముగ "మంకి" యను బ్రాహ్మణుని వృత్తాంతమును వినిపించెను. మంకియను పేరుగల బ్రాహ్మణుడొకడు ధనేచ్ఛగలవాడై రెండు కోడెలనుకొని లంకెవేసి తోలుకొని వచ్చుచుండగ మార్గమధ్యమున అవి పరిగెత్తుచో పడుకొనియున్న ఒక ఒంటెపైకి పోవగ, అది లేచి నిలబడుటవలన రెండు కోడెలు, రెండు ప్రక్కల వ్రేలాడబడి త్రాళ్లు ఉరిపోసినట్లయి మరణించెను. అంత బ్రాహ్మణుడు విరాగియై యిట్లు విచారించెను. దైవయోగము బలీయమైనది మానవ ప్రయత్నమెంత

చేసినను అది ఫలించదు. ధనమును కోరుటచేత సుఖము కలుగదు. కోరిన సొమ్ము లభించినయెడల అనేక చింతలు కలుగును. లభించిన సొమ్ము నశించిన యెడల మరణముతో సమానముగనుండును. కావున కామము లేకుండుటయె సుఖమునకు నిలయమని చింతించి, వైరాగ్యముచేత సకల కామములను విడచి దైవసముడయ్యెను. ఇచ్చట క్షాత్రమును నిందించకపోయినను హద్దుమీరిన ధనకాంక్ష, రాజ్యకాంక్షయు నాశసూచకమేయని ధర్మజుడీపాటికే గ్రహించియున్నాడు.

169. అనంతరము ధర్మజుడు మనుష్యుడెట్లు వర్తించిన యెడల దు:ఖమును విడుచునో, దేని వలన మోక్షమును పొందునో చెప్పుమని ప్రార్థించగ, భీష్ముడు అజగరచరిత్రమను ఉపాఖ్యానమునుచెప్పెను. అజగరుడను బ్రాహ్మణుని వద్దకు ప్రహ్లోదుడరిగి,చిత్తము శాంతిపొందు విధమేమని ప్రశ్నించెను. అంత అజగరుడు సంకల్పమునువిడిచి ప్రారబ్ధ కర్మమువలన వచ్చు సుఖ, దు:ఖాదులయందు మనసు నిల్పక, సృష్టినగల వస్తువులన్నింటియందు సమబుద్ధిగలిగి, చలనము, చావు, పుట్టుక అనునవి కలవు, లేవు అని తలంచక సర్పమువలె భూమియందు పడియున్నాను. ఇట్టి నీతియె అజగరవ్రతమందురు. 'ఓర్పు, సర్వభూతముల యందు సమత్వము కలిగి యుండుట, జ్ఞానానంద రూపమగు పరబ్రహ్మను సేవించుచు ఆనందమును పొందుటే అజగర వ్రతము' అనబడును. అట్టి వ్రతాచరణమున శాంతుడనై యుంటినని సమాధాన మొసగెను. అడవికి పోయినను, రాజ్యమేలినను ధర్మజునకు కావలసిన చిత్తశాంతి సంపాదన మార్గమిచట సూచితము (పద్యములు **55-64**)

అంత ధర్మజుడు బంధు, మంత్రి, వృత్తి, కర్మ, ప్రజ్ఞలలో ఏది మనుష్యునకు ప్రతిష్ట కలుగ చేయుచున్నదో తెలుపమనగ, భీష్ముడు ప్రజ్ఞవలనే లాభము, స్వర్గము, మోక్షము కలుగునని చెప్పెను. ప్రజ్ఞవలన సాధింపరాని కార్యములేదు. బలిచక్రవర్తి, ప్రహ్లోదుడు, మంకి మొదలగు వారందరు ప్రజ్ఞవలననే సమాధి సంపన్నులై ప్రకాశించిరి. కాశ్యపుడను బ్రాహ్మణుడు యుద్ధమునందు ఓడి ప్రాణత్యాగమునకు సిద్ధపడుచుండగ, ఇంద్రుడు నక్క రూపమునవచ్చి ప్రజ్ఞావిశేషాది వాక్యములనుపదేశించి విచారముమాన్పెను. కనుక అన్ని విధములుచేతను బుద్ధి, ప్రజ్ఞ విశేషాధికారిగ నొప్పునని పల్కెను. తదనంతరము ధర్మజుడు దానము, తపస్సు, గురుశుశ్రూష, యజ్ఞములును పురుషునకు యెట్లు వృద్ధి కాగలవో తెలుపుమని భీష్ముని వేడెను. అంత భీష్ముడు పూర్వజన్మ కృత పాప, పుణ్యములు ఏవైనను ఒకదానిపై అదే వరుసగ వచ్చుచుండును. పాపమునకు ఫలము పాపరూపమున, పుణ్యమునకు ఫలము పుణ్యకార్యరూపమున లభించును. ఎవరు చేసిన పాప పుణ్యములు వారిని నీడవలె వెంబడించుచు నడచును. కర్మ పరిపక్వమైననాడు ప్రయత్నింపకనే ఆ కర్మఫలము సుఖదుఃఖాదుల రూపమున కలుగుచున్నదని పలికెను. ఎవని వలన భూతములు పుట్టెనో! అట్టి సృష్టి పద్ధతిని చెప్పుమని ధర్మజుడడుగగ, భీష్ముడు పృధివ్యాధి భూతములయొక్క ఉత్పత్తిని తెలియజేసెను. అనంతరము భీష్మునితో ధర్మజుడు ఆచారవిధి, అనుసరింపవలసిన మార్గములను వినవలయునను కోరికనెరింగించెను. ఆతడు ఆచారవిధిని తెలియజేసెను.

170. అనంతరము ధర్మజుని ప్రశ్నలపై భీష్ముడు ఆధ్యాత్మవిద్య, జపవిధి, జపఫలము అందులకగు సమాధానమైన యమ, కాల, మృత్యు, బ్రాహ్మణ, ఇక్ష్వాకుల సంవాదములు వినిపించెను. కౌశిక, ఇక్ష్వాకులు, యమ, కాల, మృత్యు సంవాద కథాభాగము ఉత్తమ ఉపదేశములతో కూడినట్టిది. బ్రాహ్మణుడు తన జపఫలితమును రాజునకు ధారవోయుదు ననినాడు. రాజు తన యాగ ఫలమును బ్రాహ్మణునకిత్తు ననినాడు. ఇరువురును దానమొనర్చుటకేగాని ప్రతిగ్రహణమున కంగీకరింపలేదు. ఈ కథ ధర్మజునకు చెప్పబడినది. వర్ణాశ్రమమున ఏ వర్ణమువారి ధర్మమైనను, విధి నిర్వహణమున నిష్కామత్వమునొందుట దుర్లభము. ధర్మజుడు క్షాత్రధర్మము పేరిట సర్వజన నాశన కారకుడైనాడు. తగవు ఎవని

వలన ఉత్పన్నమైనను, క్షాత్ర ధర్మ కారణముచే ధర్మజుడు యుద్ధమునకు సిద్ధపడినాడు. ఇట్టి యుద్ధమున నిజముగ ధర్మజుడు తామరాకుపై నీటిబొట్టువలె నిలిచి క్షాత్ర ధర్మ రక్షణార్థము, ఫలితముగ ధర్మరక్షణార్థము యుద్ధ క్రియను నడిపించినాడా? అట్లగుచో భీష్ముని ఎదుట శిఖండిని నిలుపుటకు, అశ్వత్థామ చచ్చెనని బొంకుటకు, కర్ణుని వధింప నందుకు, అర్జునుని దూషించినందుకు ధర్మజుడుత్సహించునా! ధర్మము బ్రాహ్మణ ధర్మమైనను, క్షాత్ర ధర్మమయినను ఏ వారి ధర్మమయినను కామరహితమైనప్పుడే వారు ధర్మమునకై తగవులాడరనవలసి వచ్చును. కానినాడు ధర్మమిషచే చేయు ఆ క్రియయందు దోషముకూడయుండి యుండునని పై కథ వివరించుచున్నది. పుణ్యలోకముల నిచ్చుటకు కారకములుగాగల పుణ్యమునే పరస్పరము దారవోయదలచినను, నిస్పృహులై ఆ ఇరువురును ప్రతిగ్రహణమునకు నిరాకరించుట వారి జీవన్ముక్తస్థితికి నిదర్శనము. అట్టి స్థితిని ధర్మజుడింకను పొందలేదు. చచ్చినను శత్రువులపై పగ, పాండవులలో సంపూర్ణముగ తొలగిపోలేదు. తమవారిపట్ల మమకారము తొలగ కుండుటయు సహజమే. ఈ స్థితిని అధిగమింప జాలనినాడు. ధృతరాష్ట్ర పాలనముకన్న ధర్మజ పాలనముమిన్నయనుట పొసగదని బీష్ముడు, ధర్మజుని వ్యంగ్యముగ హెచ్చరించినట్లయినది. అనంతరము బృహస్పతి మనవునకుపదేశించిన మాయాప్రకారము, శ్రీకృష్ణ ప్రభావము, విష్ణుమంత్ర ప్రభావము, అధ్యాత్మవిద్యా ప్రకారము, కాలచక్ర ప్రకారము, స్వప్నాద్యవస్థల తెరగు, పంచశిఖుండను విప్రుడు జనకునికొనరించిన తత్వోపదేశము, ఇంద్ర, ప్రహ్లాద సంవాదము, ఇంద్ర, బలిచక్రవర్తి సంవాదము, ఇంద్ర, నముచి సంవాద ప్రకారములను ధర్మజుని ప్రశ్నములపై భీష్ముడు విశదముగ ఎరుక పరచినాడు. ఇందుగల ఉపాఖ్యానములన్నియు యథామూలము.

పంచమాశ్వాసము

పంచమాశ్వాసారంభమున ధర్మజుడు భీష్మునితో మనుష్యుడు ఏ గుణములచే సంపన్నుడగునో, దేనిచేత సంపన్న హీనుడగునో తెలుపవలసినదని కోరగా భీష్ముడు, ఇంద్ర, లక్ష్మి సంవాదమును వివరించుచు, గురువునందు భక్తి గలవారును, దేవ పితృ పూజలను చేయువారును, సత్యమును పలికెడి వారును, దానములిచ్చు వారును, పరుల ధనమును అపహరించని వారును, బ్రాహ్మణభక్తి కలవారు, బలహీనుడు, ముసలి, స్త్రీ జన, దరిద్రులయందు కరుణ గలిగినవారును, అతిథిపూజనము వ్రతముగా కలవారు సంపన్నులగుదురు. మరియు బుద్ధి, ధైర్యము, నీతి, శ్రద్ధ, మనోనిగ్రహము, ఓర్పు, శాంతము అను ఏడుగుణములు కలవారు అధికులని వేదములందు చెప్పబడిరి. అట్టివారి వద్దనే లక్ష్మియు స్థిరముగా నుండును. కావున యిట్టి గుణముల కాలవాలమై సంపన్నుడవై సుఖింపుమని పలికెను. అనంతరము ధర్మజుడు జనులకు ఏ విధమగు ఆచారముచేత, ఎటువంటి స్వభావమువలన, ఏ జ్ఞానముచేత మోక్షము లభించునో, ఆ పద్ధతిని చెప్పమని అడుగగ భీష్ముడు దేవల, జైగీష సంవాదమును వివరించెను. మరల ధర్మజుడు ఏ పురుషుడు సకలజన ప్రియుడై సకలభూతములకు సమ్మతుడైయుండునో అట్టి పురుషునిగూర్చి చెప్పమని అడిగిన భీష్ముడు, తొల్లింట నారదునకై ఉగ్రసేనునకు, శ్రీకృష్ణునకు జరిగిన సంవాదప్రకార మెరింగించెను. మరియు ధర్మజుడ డిగిన కాలముయొక్క అవయవ బేధమును, యుగములకుగల కాలప్రమాణములును, భూతముల పద్ధతి వివరించుమని కోరగ భీష్ముడు, ఈ విషయమై పూర్వము శుక, వ్యాసులకు జరిగిన కాలముయొక్క అవయవ నిరూపణ చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము, దానగుణము, సర్వ వర్ణ సామాన్య ముగ నిరూపించుట. బ్రహ్మప్రాప్తి సాధన ప్రకారము, బ్రహ్మవిద్యాప్రాప్తి కారణము, అంతర్యాగ ప్రకారము, ఇంద్రియ నిగ్రహంబుత్తమ ధర్మమని చెప్పిన విషయములన్నింటిని ధర్మజునకు వినిపించెను. ఇది యథామూలము.

అనంతరము ధర్మరాజు యుద్ధమందు బలముగలవారు, బలహీనులు, శత్రులు, మిత్రులు, మంచి, చెడు తారతమ్యములు లేక రాజులనేకులు మరణించిరి. కావున మృత్యుదేవతా స్వరూపమెరింగించమని కోరగ భీష్ముడు, దానిని విపులముగ ధర్మజునకుపదేశించెను. మరల దర్మరాజు శ్రేష్టమైన ఆచార ధర్మమును ఉపదేశించమని వేడగ భీష్ముడు, మున్ను జాబాలియను ఋషికి, తులాధారుడను వైశ్యునకు జరిగిన సంవాదమును, బ్రాహ్మణగీతలు వినిపించి ధర్మజునకు సందేహ నివృత్తి గావించెను.

171. అంత మరల ధర్మజుడు మనుష్యుడు కార్యమును ఆలస్యముగచేసిన మేలుకలుగునో, శీఘ్రముగ చేయుటవలన మేలుకలుగునో సెలవిమ్మని వేడిన భీష్ముడు, చిరకారియను మునికుమారుని చరిత్రమునిట్లు వినిపించెను. మేధాతిథి కుమారుడు చిరకారి. అతడు ఏ పనినైనను చిరకాలమాలోచించి చేయుటచే సార్థక నామదేయుడు. ఒక సమయమున అతని తండ్రియగు మేధాతిథి ఏదియోనొక కారణముచే తల్లిని చంపివేయుమని ఆజ్ఞనొసగి వెడలిపోయెను. అంతనా మునికుమారుడు తండ్రియాజ్ఞను పాటింపక పోయినచో పాపము కలిగి, నరకము ప్రాప్తించునని బహువిధముల ఆలోచించెను. మరికొంత తడవునకు జన్మనిచ్చిన తల్లి, తండ్రికన్న ఉత్తమమైనది. ఆమెనెట్లు చంపుట అని పరిపరి విధముల ఆలోచించుచు కాలయాపన చేయసాగెను. ఇంతలో తండ్రి శాంతుడై మరలవచ్చి కుమారునిచే బార్య చావక బ్రతికియుండుటగని, అనందించి కుమారుని దీర్ఘాలోచన కార్యాచరణమునకు సంతసిల్లి సుఖముగనుండిరి. గనుక ధర్మరాజా! ఏకార్యములైనను యోచించి చేయుము. అట్లు చేసిన కార్యములు ఫలవంతములై ప్రకాశము కలుగునని పలికెను. ఇది యథామూలము.

ఈ సందర్భముననొక విషయము స్ఫురించుట సహజము. చిరకారి స్వభావమందలి మేలిమి గుణములు కొన్ని సందర్భములందు ధర్మజునిలో లోపించినటుల కాన్పించును. ధర్మజుడు జూదమునకై ముమ్మారు ఆహ్వానముల నందుకొనినాడు. పలువిషయములకై భీష్మాదులను సంప్రదించెడి ధర్మజుడు, జూద నిర్ణయవేళ ఎవ్వరిని సంప్రదించి నటుల గాన్పింపదు. తనను ఆహ్వానించినవాడు పరాయివాడుకాడు. నిన్నటి వరకు ఒకే యింట నివసించిన తన సోదరుడు. ఇక తాను సంప్రదింపవలసిన భీష్మాదులు తన పితామహులు. అట్టితరి భీష్మాదుల ఉపదేశముగ్రహించి పిదప జూదమునకు సిద్ధపడిన బాగుండెడిది. కాని దర్మజుడట్లు చేయకపోవుటలోని ఔచిత్యమెట్టిదియో తెలియరాకున్నది. బహుశః ఇదిలోపమే అని ప్రకృత విషయము వలన వ్యాసుడు ధ్వనిగా తెల్పుచున్నాడా! యనిపించును. బహుశః ఎవ్వరిని సంప్రదింపక జూదమునకు కడంగి అనిదంపూర్వకముగ భార్యను పణముగ నొడ్డిన ధర్మజునిచూచి భీష్మాదులు కొంత అసంతృప్తినందిన ఛాయలు గోచరించును. సభలో తన బానిసత్వ నిర్ధారణకై ద్రౌపది సభను ప్రశ్నించినపుడు, భీష్మాదులు మౌనమును పాటించుటలో, ధర్మజ నిర్ణయముపట్ల ఛీత్కారము సూచితమైనదని భావింతును.

అనంతరము ధర్మజునకు కలిగిన సందేహములను భీష్మునడుగగ అతడు వాటికి సమాధానముగ వరుసగ కపిలగో సంవాదప్రకారము, కపిలుడు, న్యూమరశ్మికి వేదంబులు ముఖ్య ప్రమాణములనిసెప్పుట, కుండధారుడను దేవానుచరుని వృత్తాంతము తెలిపి ధర్మసూక్ష్మత నెరిగించెదనని, నారద ప్రవర్తింబైన దాననిట్లు చెప్పెను. ఉంఛవృత్తిచే జీవించు బ్రాహ్మణుడొకరుడు తన భార్యతోకలసి అడవిలో యజ్ఞము చేయుటకారంభించెను. కాని అతడు అహింసావ్రత పరాయణుడగుటచే జంతుహింసనొల్లక కందమూలాది ఫలములు ఆజ్యమందుకలిపి హోమము చేయసాగెను. కాని అగ్నిహోత్రుడు ఆ హవిర్భాగములను పరిపక్వతనొనర్పకనుండుటచే, ఇంద్రాది దేవతలకు హవిర్భాగములందక

పోయెను. అంతనొక జింక బ్రాహ్మణ సమీపమునకువచ్చి తనను చంపి యజ్ఞము ఫలవంతము చేసికొమ్మని బ్రాహ్మణుని కోరెను. కాని బ్రాహ్మణుడందులకు అంగీకరింపక జింకను వెడలిపొమ్మనెను. అంతనా జింక బ్రాహ్మణునకు దివ్యదృష్టినొసగి ఆకాశమునగల దేవగణములను చూపించెనంత, అతడును దివ్యత్వసిద్ధికై ఆ జింకను హింసించిన వాడగుటచే, అతని తపంబులకు ఉత్పాతములు తోచెను. అంత ధర్మదేవత సారూపముగ విచ్చేసి ధర్మసూక్ష్మతను ఈవిధముగ పలికెను. 'అర్హంబగు హింసావిశేషము అహింసావ్రత హానింజేయదు' అని తెలియజేసి మరియు అనర్హంబగు జంతువధ చేయుటచే యిట్టి ఉత్పాతము కలిగెనని పలికి యాగము, తపస్సు సిద్ధించునట్లు వరమిచ్చి వెడలినని నారదుడు చెప్పెనని, భీష్ముడు ధర్మజునకెరింగించెను.

172. కావున ధర్మరాజా! రాజునకు యుద్ధమనునది ఒక యజ్ఞమువంటిది. యజ్ఞమునకు పశుహింస పరమ ధర్మము. అటులనే రాజుచేసెడి యుద్ధమందును జీవహింస అనివార్యము. కావున అట్టియెడ, అది అహింసావ్రత భంగముకాదు. అందులకై ఉత్తమ క్షత్రియుడు వగచుచు రాజ్యమును విడనాడి, అరణ్యములకేగి, సన్యాసులవలె మోక్షమునకై పరితపించరాదు. రాజ్యమునందేయుండి కర్మలయెడల ఉదారబుద్ధిగలిగి వర్తించి, ఇహపర సుఖములను పొందవలెనని భీష్ముడుపదేశించినటుల ధ్వనిగా మనకు భాసిల్లును. అయినను ధర్మరక్షణమునకు పరిమితిగ మాత్రమే యుద్ధమొనర్చవలెనన్న విషయము, ఇతఃపూర్వము చెప్పబడిన యమకాల మృత్యు ఇక్ష్వాకు సంవాదమునందుట యీ సందర్భమున మరువరాదు.

ధర్మజుడు శాంతి పంచకమునపొందిన నిర్వేదము అజ్ఞాన జనితమని పై కథన వివరణమగుచున్నది. కొన్ని ధర్మ సూక్ష్మములపట్ల ధర్మజుడు రాజర్షిగ భాసించును. కొన్ని చోటుల స్వార్థము, బేలతనము రెండును సమాంతరముగ నడుచు సామాన్యునిగ కాన్పించును. రాజ్యలాభము వేళ శత్రువులుగ, యుద్ధమున చంపబడిన పిదప బంధువులుగా దుర్యోధనాదులను భావించు ధర్మజ ప్రవృత్తిలో యిట్టి ద్వైధీభావము కాన్పించును.

తదనంతరము ధర్మరాజు పాపము చేయుటకు హేతువేమి? ధర్మమార్గమునకు మూలమేది? మోక్షమెట్లు కలుగును? అని భీష్ముని ప్రశ్నించగ, అతడు లోభమోహములకు మనస్సు ఆధీనమగుట వలన ధర్మమార్గము చెడిపోవును. ధర్మమార్గము చెడుటవలన పాపముచేయు తలంపుగలుగును. ప్రజ్ఞవలన కలిగిన పాపములను తెలుసుకొని, మనసునందుగల సుఖదుఃఖాది జంటలనన్నింటిని విడిచి బాధలేని ఉపాయముచేత మోక్షమును పొంద వలయునని సమాధానమొసగెను.

అనంతరము భీష్ముడు ధర్మజుని ప్రశ్నములకు సమాధానముగ, వరుసగ జనకరాజ, మాండవ్యమునుల సంవాదము, పితాపుత్ర సంవాదము, హరితుండు విద్వజ్జనులకుపదేశించిన తత్వప్రకారము, వృత్రగీత, ఇంద్ర, వృత్రాసురుల యుద్ధప్రకారము, దక్షమఖధ్వంసంబునందు శివునివలన జ్వరంబుద్భవించిన ప్రకారము, శాస్త్ర తత్వంబెరుగనివాడు సేయవలసిన విధి, అరిష్టనేమియను ముని సగరునకుపదేశించిన ధర్మప్రకారము, శుక్రనామంబు భార్గవునకు కల్గినవిధము, జనకునకు పరాశరముని యుపదేశించిన ధర్మ ప్రకారము, హంసగీతి, యోగతంత్ర ప్రకారం, సాంఖ్యరూపనిరూపణము, ఆత్మ పరమపదంబు ప్రాప్తించెడి ప్రకారముగాగల అధ్యాత్మవిద్యా విషయకములైన ఇతిహాసములను వినిపించినాడు. ఇవన్నియు మూలమున గలట్టివియే. పైన చెప్పినవన్నియు ధర్మగ్రంథములు చెప్పుమాటలు. ఈ మాటలు ధర్మజుని శీలనిరూపణ ప్రధానముగగల యీ సిద్ధాంత వ్యాసమున ఎంతవరకు

గ్రహింపవచ్చును అనునది ప్రశ్న కాకపోదు. కాని యిచట వ్యాసుడు యింత దూరము ధర్మజునకిన్ని ధర్మములు వినిపించుటలోని సూక్ష్మము, అనంతరకాలమున ధర్మజుడు యీ ధర్మములన్నింటినీ ఆచరణలో పెట్టి రాజ్యపాలనము కావించెనని చెప్పుటయే. ధర్మజుని 'రాజ్యపాలనము-విధానము' అను ప్రత్యేకమైన అధ్యాయము భారతమున లేదు. పట్టాభిషిక్తుడైన వెంటనే శతాధికముగ ప్రశ్నములు వేసి, భీష్మునివలన సమస్త ధర్మములు వినినటుల, తెలిసికొనినటుల గలదు. ఈ ప్రశ్నించుటలోని ఔత్సుక్యకారణము తనపాలనమున ఆచరణములో పెట్టవలెననియెగదా! కనుక ఈధర్మము లన్నియు ధర్మజుడాచరించినటుల భావించి, వాని శీలనిరూపణమునకివి కూడా ప్రసక్తార్హములేయని స్థూలముగనిచట వివరించుట జరుగుచున్నది

<u>షష్ఠాశ్వాసము:</u>

శాంతిపర్వమున అధిక భాగము తాత్వికచింతనకు చెందినట్టిది. ఇచట భారతకథా పాత్రలయిన భీష్మ ధర్మజులు వక్తయు, శ్రోతయునగుటతప్ప యితర కథా విషయములేదు. అందుచే యిట్టి భీష్మకృత సార్వకాలిక తత్వోపదేశమున, ధర్మజశీల నిర్ణయమునకు వస్తువు కాన్పింపదు. అట్టితరి కథా గమనమునకడ్డము, వస్వైక భంజికమైన తత్వోపదేశమేల? యని కొందరు భావింపవచ్చును. అట్లనుటకు మాత్రము వీలుపడదు. ఈ తత్వచింతనము కథాగతమే! భీష్మ పర్వమున పదునైనిమిదధ్యాయముల భగవద్గీతయే కథాగతముగ విమర్శకులు భావించునప్పుడు, ప్రకృత సందర్భమునందలి పౌరాణిక కథలను విరుద్ధముగ భావింపనవసరము లేదు. ఎటుల కథాగతమగునన్న ప్రశ్నమును దృష్టినిడుకొని, సమర్ధనమునకై, విజ్ఞులు భావించుచున్న ఒక యూహను క్రింద వివరింతును.

మహాభారతయుద్ధము మనకు తెలిసిన భారతీయ రాజవర్గములమధ్య జరిగిన యుద్ధములలో అగ్రగణ్యము. తత్పూర్వాపరముల చరిత్రలేమిచే యుద్ధ ప్రసక్తములు మనకు శ్రుతములు కాకపోయినను వ్యాసుడును, వాని శిష్యులను అట్టి యుద్ధ విశేషములనెన్నింటిని వినియున్నారో చెప్పజాలము. ఒకపెద్ద యుద్ధము సంభవించిన పిదప అనేక రాజవంశములునాశమై నామమాత్రావశిష్టములగుట పిదప ధర్మరక్షణకు, సంస్కృతీపోషణకు శేషించిన రాజలోకము తాపత్రయపడుట వ్యాసునివంటి లోకజ్ఞునకు క్రొత్త కాకపోవచ్చును. ఇటుల వైభవముగా వెలిగిన రాజ్యము, రాజ వంశము, శత్రు దండయాత్రలచే శిధిలమైన పిదప శేషించిన దేశభక్తులు, రాజులును విరక్తితో దేశరక్షణ భారమును, ధర్మరక్షణ భారమును ఉపేక్షించినచో భారతజాతియే ప్రపంచ జాతులయెదుట తలవంచు కొనవలసి వచ్చునను దృష్టితో, జాతికి హెచ్చరికగ భీష్మ ముఖమున ధర్మప్రోత్సాహక రూపమున రాజలోకములకు, దేశభక్తులకు వ్యాసుడే ఉపదేశమునందించినాడని భావింపవలసియున్నది.

ధర్మజుడు పట్టాభిషేక కాలమునకు తొంబది సంవత్సరములు సమీపించుచున్న వృద్ధుడని భారత వ్యాఖ్యాతలలో పలువురి అభిప్రాయము. అట్టి వృద్ధాప్యమున పుత్రులనెల్లరను పోగొట్టుకొని, తనకు సమీప వయస్కులగు సోదరులతో కూడి రాజ్యమునేలుటకుగాని, రాజభోగములనందుటకు గాని, ధర్మజుడుత్సాహము ప్రదర్శింపకుండుట సహజము. ఇది కేవలము ధర్మజుని వ్యక్తిగత విషయమైనచో వైరాగ్యమే వానికి శ్రేయోదాకము. కాని ఇది భారత జాతికే గడ్డుకాలము. కొన్ని వందల రాజవంశములు నామరూపములు లేక నశించినవి. సామాన్య జనులు బ్రతికియున్నను దేశరక్షణదృష్టితో, ధర్మరక్షణదృష్టితో, సంస్కృతీ పోషణ దృష్టితో జూచినచో భారతజాతి మొత్తము విపత్కర పరిస్థితిలో పడినదని చెప్పవచ్చును. ఇట్టి స్థితి వైదిక సంస్కృతీ విరుద్ధులైన వారికి సదవకాశముగ పరిణమింపవచ్చును.

కనుక బాధ్యతగల ప్రభువు తన వైయక్తికమైన స్వార్థమును, సంతోషమును, కుటుంబ పరిస్థితిని మరచి జాతి శ్రేయమును పరిరక్షించుటకై శతధా ప్రయత్నింప వలసియున్నది. కనుకనే యింత సుదీర్ఘమైన తత్వోపదేశమును భీష్ముడు ధర్మజునకు కావింపవలసివచ్చినది. ఒకవిధముగ యుద్ధారంభవేళ అర్జునునికప్పిన వ్యామోహమే, యుద్ధాంత మున ధర్మజునికప్పినటుల కాన్పించును. ఆరంభమున అర్జునుడు తన కుటుంబ కలహముగ భావించి పొరపడినాడు. అంతమున ధర్మజుడు తన కుటుంబ నాశమును తలచి అడవులకేగ దలచినాడు. ఇరుసందర్భములందును యుద్ధ ప్రభావము జాతిశ్రేయముపైనుండునని తమ ఉపదేశములవలన శ్రీకృష్ణ, భీష్ములిరువురును జాతిని హెచ్చరించియున్నా రని విమర్శకుల అభిప్రాయము. అందుచే శాంతిపంచకమునందలి తత్వోపన్యాసములు ధర్మజపాత్ర చిత్రణమునకు మిక్కిలిగానుపకరింపక పోయినను విషయము మాత్రము కథాగతమే యగును. పైన వివరించిన జాతిశ్రేయమను విషయమును దృష్టినిడుకొని ధర్మజ హృదయమును తెలియుటకు ఉపకరించు కొన్ని సందర్భములను మాత్రము తొలి అయిదు అశ్వాసములలో వివరించితిని.

శాంతిపర్వ షష్టాశ్వాసమున అధ్యాత్మిక విషయ వివరణమున్నది. భీష్ముడు ధర్మజునకు తాత్వికపరమైన విషయములను బోధించుటలో ఔచిత్యము గన్పట్టుచున్నది. ధర్మజుడు లౌకిక విషయములను విడిచిపెట్టవలసిన సమయమాసన్నమగుచున్నదను విషయము భీష్మునకు తెలియును. నారాయణ సంకల్పము నెరవేరినది. అందులకుప కరణములైన వారు నిజస్థానములకేగ వలయును. భీష్ముడు సమయమునకై వేచుకొనినవాడు. కావున ఆత్మతత్వము నెరిగించి, ధర్మజుని మానవ సహజమైన పరితాపమును విడిచి పుచ్చమని ధ్వనిగ ఉపదేశించుటయే యీ తత్వవివరణ లక్ష్యము. ఇందనేక తత్వపరమైన విషయములుల్లేఖితము. ఇట వివరింపబడిన విషయమున ధర్మజుడు శ్రోతమాత్రమే. అతని శీలసంబంధమైన విషయము లేనందున షష్టాశ్వాసమును విడిచిపుచ్చితిని.

=========

అనుశాసనికపర్వము – ధర్మజపాత్ర

అనుశాసనిక పర్వమునుగూడ సూక్ష్మముగ గ్రహింపవలసి యున్నది. భీష్మడనేక ఉత్తమ ధర్మసూక్ష్ములు ధర్మజునకు ఉపదేశించుట యిందలి ప్రధాన విషయము. దీనినే మరియొక విధముగ చెప్పిన సమంజసమనిపించును. ఏ ఏ ధర్మసూక్ష్ములను భారతజాతి మరిచిపోయి, స్వార్థపూరణమే లక్ష్యముగ సంచరించుటచే, ధర్మము నశించి పర్యవసానముగా మహాభారత యుద్ధమువరకు పరిణమించినదో, ఆ ధర్మసూక్ష్ములను గ్రహింపుమని భవిష్యపాలకు డైన ధర్మజుని హెచ్చరించుచు భీష్ముడు కావించిన ఉపదేశమే అనుశాసనికమని చెప్పుట సమంజసముగ తోచును. ఈ దృష్టితో ఈ పర్వమున కొన్ని ప్రధాన విషయములను మాత్రమే వివరింతును.

అనుశాసనికపర్వ ప్రథమాశ్వాసమున పదునైదు ఉపశీర్షికలుగ, కొన్ని లోక సత్యములు వివరించబడినవి. నిజమునకు ఈ సత్యము సర్వజీవకోటిపట్లను సత్యములే. కేవలము ధర్మము నెపమున భీష్ముడు బోధించినటుల వ్యాసుడు లోకమునకు బోధించినాడు. ఈ ఉపకథలయందలి పాత్రముల లోపములెల్ల ధర్మజునకంటగట్టుటుచితము గాక పోయినను, అందోళిత మనస్కుడైన ధర్మజస్థితిని ఉపశమింప జేయుటకు ఇవి అవసరమైనవి. ఈ దృష్టితో ధర్మజుని జీవితమును పరిశీలించుటకు తగినంతమేర వివరింతును.

ఒకటవ ఉపశీర్షికలో గౌతమి లుబ్ధక సర్ప మృత్యు కాల సంవాదము ధర్మజునకుకూడ వర్తించును. తన వలన దుర్యోధనాదులు నాశనమైనటుల ధర్మజుడు చింతించినాడు. ఫలితముగ విరక్తినందినాడు. భ్రాంతిచే పొందిన విరక్తికూడ అసక్తతయగునే కాని స్థితప్రజ్ఞత్వము కాజాలదు. సూక్ష్ముగ జూచినచో ధర్మజుడు దుర్యోధనాదులను చంపినందుకు మాత్రమే విచారించుట లేదు. వానివలన తన బంధువులుకూడ మరణించిరన్న చింతకూడ లేకపోలేదు. వాని విరక్తికి రెండవ కారణమే ప్రబలము కావచ్చునుకూడ. కనుకనే లోకమున ధర్మక్షతి ఏర్పడినప్పుడు భూభారమడంచు భారమును పరమేశ్వరుడే చేపట్టునన్న కావ్యారంభము నాటికథనమును, వ్యంగ్యముగ భీష్ముడు మరియొక పరి వివరించినాడు. అనగ స్థూలదృష్టికి యుద్ధమునకు దుర్యోధనుడెంతవరకు కారకుడో, ధర్మజుడుకూడ అటులనే కారకుడగుచున్నాడు. సూక్ష్మదృష్టిచే ధర్మజ, దుర్యోధనులిరువురు శివేచ్ఛకు ఉపకరణములు మాత్రమే.

173. ఈ సందర్భమున చెప్పిన కథ మాత్రము విశ్లేషించవలసియున్నది. సర్పమొకటి బ్రాహ్మణ బాలుని కరచినది. బాలుడు మరణించినాడు. సర్పమెంతవరకు కారకమనునది ప్రశ్నము. కాటువేయు స్వభావము సర్పములో సహజముగనున్నది. బహుశః కాలచోదితులను దండించుటకు ప్రకృతి అట్టి వారి సహాయమునపేక్షించు కాబోలు! దుర్యోధనాదులు కాలచోదితులు. వారిని ధర్మజ సర్పము కాటువేసినది. వాని మరణమునకు ధర్మజుడు కారణము కాకపోయిన కాటువేయుటకు కారణభూతమైన రజోగుణము వానిలోనుండుటచేతనే, నారాయణుడు భూభార సంహరణమునకు వానినొక ఉపకరణముగనెన్నుకొనినాడని వ్యాసుడు ధ్వనింపజేసినాడేమో అనిపించును.

174. తరువాతి ఉపాఖ్యానమున (రెండు ఉపశీర్షికల కథ) అగ్నిహోత్రుడు, సుదర్శనయను కన్యను వివాహమాడుట, వారి వంశీకుడొకరుడు అతిథి పూజనముచే భార్యా సమేతుడై సశరీరముగ, స్వర్గ ప్రాప్తినందునటుల వరమునందుట ఇందలి కథా విషయము. ధర్మజుడుకూడ వైరాగ్యముచే చివరకు స్వర్గప్రవేశమొనర్పగలిగినాడు. ద్రౌపది మున్నగు వారు అతనితో ప్రవేశింపలేక పోయినను, ధర్మజుడు హృదయ మాలిన్యములను క్షాళనమొనర్చుకొని రాజ్యపాలన మొనర్చినాడని చెప్పుటకు ఈ కథ సహకరించును.

తరువాత ఉపకథనము మూడు ఉపశీర్షికలలో విశ్వామిత్ర కథనము ప్రధానముగ వివరింపబడినది. ఇందు మూడు విషయములు గమనార్హములు. బ్రాహ్మణికి శూద్రునివలన జన్మించి బ్రాహ్మణుడుగ పరిచయమైనట్టి విప్రకుమారుని కథనము చెప్పబడినది. వాడు మరుజన్మమున రజోగుణ ప్రాపకమైన జన్మమునెత్తునని, పూర్వస్మృతి ప్రభావముగల గార్ధభివలన చెప్పబడినది. ఇది ఒక విషయము. రెండవది తపముచే ఒక జన్మముననో, ఒకటికిమించిన జన్మలందునో విప్రుడగుననునది రెండవవిషయము. ఒకేజన్మమున సాంద్రతపోనిష్టచే బ్రాహ్మణేతరులు, బ్రాహ్మణుడు గావచ్చుననునది మూడవ విషయము. ఈ మూడు విషయములను అవగాహనమొనర్చుకొనుటకు కష్టముకాదు. గుణమే ప్రధానమనునది అంగీకరించుచో, సత్యము కొంచెము క్లిష్టముగ వివరించినట్లైనది. ఒక ప్రక్క బీజప్రాధాన్యము, మరొక ప్రక్క వాసనారాహిత్యమునకై వ్యక్తి కావించు సాధన, అను రెండు విషయములకిచట ప్రాధాన్యమీయబడినది. వ్యంగ్యముగనైన ఈ రెండింటిలో వాసనారాహిత్యమునకైన సాధననిష్ఠకే అధిక ప్రాధాన్యమొసగబడినటుల గ్రహింప గలము. ఇట్టి ధర్మసూక్ష్మపరమైన విషయము లోకసంగ్రహణమునకు చెప్పబడినను, ధర్మజునిపట్ల వర్తించునా! లేక దీనినుండి ధర్మజుడేమైన గ్రహించునా! యనునది మనకు ప్రకృతము.

175. ధర్మజుడు పాండురాజు పుత్రుడైనను దైవాంశ సంభూతుడు. అయినను జననీజనకుల ప్రభావము వానిపై నుండదని చెప్పజాలము. అంత్య దశయందు కొంతకాలము తపోనిష్టయందుండినను, మృగరూపముల విహరించు మునిదంపతులను సంహరించిన నాటి పాశవికత ఏ కొంతయో ధర్మజునియందు లేకపోలేదు. దాని ఫలితమే క్షత్రియోచితమైనను, తమ సుఖమునకడ్డువచ్చువారిని సంహరింపజాలిన క్రూరనిర్ణయములను గ్రహింపగలుగుట. స్వహృదయ విశ్లేషణముచే ధర్మజుడు తనబుద్ధిని తాను గ్రహింపగలడు. దానిని భీష్ముడును గ్రహించగలడు. కనుకనే భవిష్యమున సుస్థిర ధర్మ స్థాపనమునకు కార్యముకాక కొంత సాత్వికత కావలయునని సూచించుటకై, ఈ బ్రాహ్మణత్వ నిరూపణ కథనమును చెప్పియుండుననియనిపించును.

176. తరువాతి కథనమున దైవ, పురుషకారంబుల ప్రభావసమత్వము వివరితము. ఇందొక ముఖ్య విషయమున్నది. మంచి కర్మలకు ఫలము మంచిదిగను, చెడుకర్మలకు ఫలితము చెడుగనుండుననుట సారాంశము. అనగ యింత దనుక ధర్మజుడుపొందిన సమస్త దుఃఖములకును వెనుక, వాని కర్మల వెనుకనున్న పాశవికత్వము కారణమనెడి ధ్వనిస్పష్టము. ఇకనైన అట్టి మనస్తత్వమును దాటనిచో, హృదయశాంతికైన ప్రయత్నములన్నియు నిష్ఫలము కాకతప్పదని భీష్ముడు హెచ్చరించినటులననిపించును.

177. తదనంతరము ఉత్తమ స్వభావులకాశ్రయమిచ్చుట, వారిని విడువకుండుట శ్రేయోదాయకమని చెప్పు కథనమొక ఉపశీర్షికగ వివరితము. ఇందవగాహనకందని విషయము లేదు. ధర్మజ విషయమై సూక్ష్మముగనొక్క విషయము స్ఫురించును. స్థూలదృష్టికి ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, ఇత్యాదులెల్లరును ధృతరాష్ట్రుని ఆశ్రయించినట్టి వారు. నిజమాలోచించినచో కౌరవ, పాండవులు కలసిమెలసి ఒకేకుటుంబముగ ఉన్నంతకాలము పై వారలెల్లరు కురువంశము నాశ్రయించిన వారుగ చెప్పబడుదురు. కాని సోదర కలహరూపమున కుటుంబమిరువర్గములైనది. ఒక్కొక్కవర్గము కొందరుత్తములను కోల్పోయినది. అట్టితరి తమ్మాశ్రయించిన మహనీయుల బల,తపోశక్తులే మొత్తము కురువంశమును నాశనమొనర్చుట తటస్థించినది. దీనికి కారణము ఆశ్రయమిచ్చిన కురువంశము ఆయా మహానుభావులను తటస్థులుగనుండనీయక, ఆపాదిత విరోధములలోనికీడ్చి తమకే హాని తెచ్చుకొన్నట్లయినది.

భవిష్యమునైన కురువంశపాలకులు, ఇట్టి దోషమును పునరావృతము కానీయకూడదని పై కథారూపమున భీష్ముడు ధర్మజుని హెచ్చరించినటుల తోచును. అనంతరము ధర్మజుడు విభులకు పాటింపవలసిన వానినెరిం గించుమని భీష్ముని ప్రార్థించగ నాతడు, తపస్వాధ్యాయులైన బ్రాహ్మణులనర్చించి వారలకు కీడునొనర్పక, వారుచేయు కర్మలకు తగు సహాయసహకారములందించు చుండిన పాపములెల్ల నశించునని పల్కెను. మరియు పరమమైన ధర్మంబు చెప్పెదను వినుమని మద్రపతి సాత్యవతేయుని పూర్వమడిగిన విధముగ విష్ణునెరుగుటధిశ్రేష్ఠమని పరమ శ్రేష్ఠమైన ధర్మమును ధర్మజునకు వినిపించెను. అంత ధర్మజుడు గరుత్మంతుడు మహానుభావుడని వినియుంటిని. ఆ వృత్తాంతము నెరింగింపుమని భీష్ముని ప్రార్థింపగ ధర్మజునకు గరుత్మంతుని చరిత్రంబు సవిస్తరముగ తెల్పెను.

అనంతరము పాండవాగ్రజుడు విప్రునకెద్దియేనియు నిచ్చువాడుగనొడంబడి యాని వాడేమి గతింబోవగల వాడని యడుగుటయు, భీష్ముడందులకుదాహరణముగనొక దృష్టాంతమునిట్లు తెలిపెను. ఒక నక్కయు, కోతియు మైత్రితో మసలుతుండెను. తొలి జన్మమున అవి మానవులై యుండినవి. అంతనొక్కనాడు కోతి నక్కతో ఏమి పాపము చేసితివని బ్రహ్మ ఈ హేయమైన పీనుగులను తిను జన్మ కల్పించినాడో! అని పలుకగ నక్క విషాదమంది పూర్వమొక బ్రాహ్మణునకు ఒడంబడిన ధనమీయకుండుటచేతనే నీచతర జాతియందు జన్మింపవలసి వచ్చెనని పల్కినది. కావున విప్రుల కీయవలసివచ్చునెడ దానిని నిర్వర్తింపవలెనని తెల్పెను. అనంతరము ధర్మజుడు హీనవర్ణునకు మంత్రోపదేశముచేయుట ధర్మవిరుద్ధమని విందుము. అద్దానిని తెల్పుమని భీష్ముని కోరగ, ఆతడందులకుదాహరణ ముగ ఒక ముని ప్రవరుడు శూద్రునకు మంత్రోపదేశముచేసి మరుజన్మమున శూద్రుడు రాజుగను, ముని గతిచెడి పురోహితునిగ జన్మించిన కథనము నెరింగించెను.

పైననైదు ధర్మసూక్ష్ములు వివరింపబడినవి. అందుమొదటిది బ్రాహ్మణుని ఆదరించి లోక కల్యాణ కారకములైన వాని అనుష్ఠానములకు సహకరింపవలెననుట. ధర్మజుడు యిట్టి విషయముల వ్యతిరిక్తుడు గాడు. ధృతరాష్ట్రునకును బ్రాహ్మణభక్తి లేకపోలేదు కాని చిరకాలము కురు సభామంత్రాంగమున గౌరవస్థానీయులుగనించిన ద్రోణాదులతోపాటు నారదాదుల ఉపదేశములనుగూడ, ధృతరాష్ట్రుడు పుత్రప్రేమచే పెడచెవిన బెట్టినాడు. ఫలితము మహాభారతరణము.

178. తరువాత కథనము విష్ణుతత్వము తెలుసుకొన వలయుననుట. బహుశః కృష్ణతత్వమును గ్రహించుటలో ధర్మజుడింకను కృతకృత్యుడు కాలేదని భీష్ముడు భావించినాడేమోయనిపించును. కానినాడు, అనగా భగవద్భక్తిసారము ఒంటబట్టినప్పుడు ధర్మజునకింకను నిర్వేదముండుటకు అవకాశము లేదుకదా!

179. గరుత్మంతుని కథకును, ధర్మజుని కథకును చిత్రమైన కొంతపోలిక గలదు. గరుత్మంతునకు, సర్పములకును కూడ తండ్రియొక్కడే. (కశ్యప ప్రజాపతి)అనగ సర్పములు గరుత్మంతుని సోదరులు. పెదతల్లియందలి అసూయా గుణము గరుత్మంతుని బాధించినది. ధర్మజునిపట్ల పెదతండ్రిలోని పుత్రవాత్సల్యము ముప్పుతెచ్చినది. గరుత్మంతుడు ఇంద్ర స్నేహముచేత ప్రయోజనమును సాధించినాడు. ధర్మజుడు శ్రీకృష్ణ సహాయమున లబ్ధినందినాడు. బహుశః యిట్టి పోలికలను తెల్పుచు, నారాయణ సహాయమును ఉపేక్షింపకని ధర్మజుని హెచ్చరించుటకే కాబోలు భీష్ము ముఖమున వ్యాసుడు సంక్షిప్తముగనైన సౌపర్ణోపాఖ్యానమును పునరుక్తమొనర్చుట జరిగినది. ఆదిపర్వమున సుదీర్ఘముగ సౌపర్ణోపాఖ్యానమున్న విషయము ఎల్లరుకును విదితమే!

180. బ్రాహ్మణునకు వాగ్దత్తమొనర్చి నెరవేర్చకుండుటనునది యథాతథముగ ధర్మజునిపట్ల వర్తింపక పోయినను బ్రాహ్మణాగ్రహమునకు గురియగుట మాత్రము ధర్మజునిపట్ల గలదు. ద్రోణహత్యకు కారకుడై, అశ్వత్థామ ఆగ్రహమునకు గురియై ఉపపాండవులను కోల్పోయినాడు. శ్రీకృష్ణుని దయలేనిచో పాండవవంశమే మిగిలి యుండెడిది గాదు. కనుక తపోధనుల అసంతృప్తికి లేక ఆగ్రహమునకు గురికావలసి వచ్చినదని, అటుల గురికారాదని ధర్మజుడు గ్రహింపవలెనని భీష్ముని మాటలు వ్యంగ్యముగ సూచించినవేమో యనిపించును. భవిష్యమున తన రాజ్యపాలనమున ఉపకరించెడి నీతులుగ భీష్మ వాక్యములున్నను, అందనేక విషయములు ధర్మజుని గత చరిత్రమును స్పృశించునట్టివిగ నుండుటచే యిట్టి వ్యాఖ్యానమునకవకాశము గల్గుచున్నది.

చిట్ట చివరిది హీనునకు మంత్రోపదేశమొనర్చ వలదనుట. ఇచ్చట హీనశబ్ధమును నిర్వచించుట కష్టము. మహాభారత తత్వము, ఆధ్యాత్మిక తత్వము తెలిసిన వ్యాఖ్యాతల దృష్టితో జూచినచో బొనుడనగసంస్కారబొనుడనియే భావము. పూర్వము మహర్షులవద్దకు ఒకే వర్ణమునకు చెందిన పదుగురు శిష్యులు పోయినను గురువు వారిని పరీక్షించి, అందు యోగ్యునకుమాత్రమే ఉపదేశమొనర్చుచుండినటుల అనేక కథనములు పురాణములందు చూడ గలము. వివేకరహితుడైన కర్ణుడు, పరశురామాదివంటి వారలనుండి ధనుర్విద్యా కౌశలమును సంపాదించినాడు. కాని ఆపదలో ఆదుకొనినాడన్న కారణమున, దుర్యోధనునకు హితముగోరిన స్నేహితునిగకాక అభీష్టమును నెరవేర్చగల బాధ్యతగలిగిన బానిసగ ప్రవర్తించి, తనవిద్యా కౌశలమును ఉపకరణముగ చూపించి దుర్యోధనుని యుద్ధసన్నద్ధునిగ నొనర్చుటకు మాత్రము సహకరించినాడు. మానసిక పరిపక్వతలేని వాడు విద్యా రహస్యములను గ్రహించుట ప్రమాదకరమని భీష్ముడు ధర్మజునకు సూచించి, అట్టివారినుండి జాగ్రత వహింపుమని హెచ్చరించినటుల తోచును. భీష్ముడు ధర్మజునకు చెప్పినటులున్న ఉపాఖ్యానములలో యివి కొన్ని ధర్మజుని గతమును, స్వభావమునుకూడ తెలిసిన భీష్ముని మాటలలో ధర్మజశీల విషయమై ధ్వనించినవనిపించిన యూహలను మాత్రము పైన వివరించితిని. ఇందు ఉపాఖ్యానములు యథామూలము. కాని యిటమూలమున శివసహస్ర నామ స్తోత్రము, పఠన, ఫలితములు విపులముగ వర్ణితములు. తిక్కన విడిచినాడు.

<u>ద్వితియాశ్వాసము :</u>

ద్వితీయాశ్వాసమున ధర్మజుడు కన్యాదానంబునకు వరుడెట్టివాడై యుండవలెనని భీష్మునడుగగ ఆతడు అష్టావక్రుండను మునికుమారుని చరిత్రమునిట్లుతెలిపెను. అష్టావక్రుడను మునికుమారుడు వదాన్యుడను తాపసోత్తముని కుమార్తె సుప్రభయను కన్యను వివాహమాడదలచి ఆ తాపసునినడుగగ, ఆతడిచ్చుటకు సమ్మతించి అందులకై కౌబేరపురము దాటి ఉత్తరదిశకేగి గిరిజాశంకరుల తపోభూములను కడచి, కడిమివృక్ష వనమునందుగల స్త్రీరత్నమును దర్శించి రమ్మనమని పనిచెను. అంత అష్టావక్రుండు ధనదుపురమున ఒక్క వత్సరముండి, ఆటనుండి ఉమాశంకరుల తపోభూములను సందర్శించి కడిమి వనప్రదేశమునకరిగి ఆటగల దివ్యహర్మ్యమునందుగల ముదితను చూచి ఆమెయొనర్చిన శ్రుతివిహితార్చనలు గ్రహించెను. అంతనామె అష్టావక్రుని పరీక్షింపనెంచి, అతనిని ఏకశయ్యాగతుని కమ్మని పలుకగ, అందులకాతడది తనకు సమ్మతముకాదనిపల్కి ధర్మవాక్యముల కొన్నింటినుపన్యసించెను. అంతనామె మరునాడు తన్ను పరిణయమాడుమని పల్కిన ఆతడు వనిత తనంత తానుగ అర్పించుకొన్న గ్రహింపవలదని పల్కి, తన ఇంద్రియ నిగ్రహతను తేటతెల్లము జేసెను. అంతనామె తన్ను ఉత్తర దిశగ పరిచయమొనర్చుకొని, వదాన్యుడు పరీక్ష నిమిత్తమే అష్టావక్రునినచటకు పంపించెనని తెల్పిన, ఆతండు మరలిపోయి వదాన్యునకీ వృత్తాంతముచెప్పి సుప్రభను కల్యాణమొంది సుఖముగనుండెను. ఇది యథామూలము.

181. అనంతరము ధర్మజుడు మునులవలన శూద్రజాతి భామలయందు ప్రభవించినవారికి బ్రహ్మర్షిత్వంబుగల్గుట యెట్లని భీష్ముని అడుగగ, అతడందులకు బ్రాహ్మణులు నాలుగు జాతుల కన్యలను వివాహమాడవచ్చును. రాజు తనజాతి, మిగిలిన రెండు జాతుల కన్యలను, వైశ్యులు తనజాతి, శూద్రజాతి కన్యలను, శూద్రుడు తనజాతి కన్యనే వివాహములాడవలెను. గతి తప్పి ప్రతిలోమసరణి సల్పిన వర్ణ సంకరంబేర్పడును. అట్లు జరిగిన తల్లి ఏకులమైన సంతతి అదేకులమునకు చెందుదురు. ఇది సర్వజన సామాన్యము. విశేషించి మునులు, ఉత్తమ తపోజ్ఞాన విద్యా ప్రభావంబులంజేసి తదీయ బీజసంజాతులు క్షేత్రమెద్దియైనను బ్రాహ్మణులగుదురు. కావున మునివరులు, నృపవరుల క్షేత్రము వలన గలిగిన జన్మంబులెల్ల బీజ ప్రాధాన్యంబులై వర్ధిల్లును. మరియు వశిష్ఠుడు, ఋష్యశృంగుడు, అగస్త్యుడు, సత్యవతేయుడు, మందపాలనందనులు, ద్రోణ, కృపాదులు ప్రభవించిన భంగులు **విందుమని పలికి మనువాక్యముల నిట్లు తెల్పెను.**

కం. మునిజనుల నదులసిద్ధుల, జననంబులు బుద్ధివృత్తిఁ జర్చింపఁగనె
వ్వనికిన్ వశంబుగావవి, తనతనయైనట్లయై యుదాత్తతఁబొందున్-ఆను-ద్వితీయ-29

ఈ సందర్భము మహాభారతమున పలువురి విషయమున పరిశీలనార్హమగును. మహర్షుల బీజకారణమున జన్మించిన వారు క్షేత్రసంబంధము లేక బ్రాహ్మణులుగనే భావింపబడుదురని పైన తెలుపబడినది. కాని వ్యాసభగవానుని వలన అంబిక, అంబాలిక, విదుర జననిపొందిన సంతానము, క్షేత్ర గోత్రమునన్నే చూడబడుట గమనార్హము. ఇక ధర్మజాదుల పుట్టువులు మరియొక కోవకు చెందినవిగ చెప్ప వలయునేమో? జన్మకాలమున పాండవులకు తండ్రిగ పాండురాజు గలడు. వాని నియోగమున కుంతీ, మాద్రులు దైవముల ప్రసాదమునందిరి. కనుకనది వీరతుల్యము కావచ్చునేమో? ధర్మసూక్ష్మము గహనమైనదని భావించుటయే మనము చేయగలిగినట్టిది. ధర్మజాదులలో బ్రహ్మ్య మెంత? క్షత్రియులే యగుదురా? యనునది పై వాక్యములవలన నిర్ధారించుట కష్టమేమో? ధర్మజునితో భీష్ముడిట్టి ధర్మసూక్ష్ములు వివరించువేళ, ధర్మజాదులకు తాము క్షత్రియులము కామేమో! యను శంక కలుగలేదు. అందువలననే యిట్టి సందర్భములు మహాభారతమున అనంతరకాలమున ప్రక్షిప్తములు కానోపునేమో? యను సందేహము ఆధునిక విమర్శకులలో కొందరను బాధించినది. భవిష్యపరిశోధకులిట్టి విషయములను తేల్చవలసియున్నది.

అంత ధర్మజుడెట్టి బ్రాహ్మణుడు దానపాత్రతకర్హుడని భీష్ముని ప్రశ్నింపగ, అతడు సద్విజుడై నిజవర్తనమున చరించుచున్నవాడు దానార్హత్వంబుగలిగి యుండునని తెలిపిన, ధర్మజుడు జనములిచ్చు భూరిదానములు దురితంబు పొందనేరదెట్లు అని అడుగగ, భీష్ముడు శ్రద్ధతో చేసిన దానములు దురిత హరంబులగునుగాని కీడొనర్పవని పలికెను. అంత ధర్మజుడు దైవ, పితృకార్యముల రెంటిలోన దేనియందు విప్రుని మిగుల పరీక్షింపవలెనని అడుగగ భీష్ముడు దైవకార్యము దైవహేతువు వలన జరుగును. కావున పితృకార్యములందు పరీక్షింపవలెనని పలికిన, ధర్మజుడు అపూర్వసంబంధి, పండితుడు, యాజి, తపోనిత్యులందు సత్పాత్రములెవ్వరు అని అడిగిన భీష్ముడు ధర్మభాషణము కల్గినవారే సత్పాత్రగల్గినవారని సమాధానమొసగెను. తదుపరి యీవిషయమై మున్నుజరిగిన ధరణి, కాశ్యప, వైశ్వానర, మార్కండేయుల వచనములనిట్లు పలికెను.

182. కం. ఘనతరమగు హ్రీగౌరవ, మున మునిఁగినఁ బాపమఖిలమును రూపుసెడుం
బెనుపున యగ్గలికఁబొగడు, గనిన పయోరాశిఁబడ్డ గడ్డయుఁబోలెన్-ఆను-ద్వి-40

తే. సత్కులంబునఁబుట్టుట సకల వేద, ములుఁబురాణంబులును శాస్త్రములను జదువు
టయును సద్గతిఁజేయఁబ్రౌఢములుగావు, శీలసామగ్రిలేని దుశ్చేష్టితునకు-41

ఆ. పలుసదువులుసదివి పండితమానియై, తనదువిద్యనొరులఘనయశంబుఁ
దూలపుచ్చునట్టి దుష్టాత్మకుని బ్రహ్మ, హత్యవొందు సందియంబులేదు -ఆను-ద్వి-42

తే. వాజమేధముల్ వేయొక్కవలనఁబెట్టి, యలఘు సత్యంబుదక్కటి వలనియందు
నిల్పితులఁదూఁపఁగా సత్యనిష్ఠలోని, యర్థమునకెత్తు వచ్చెనయ్యధ్వరములు-43

వ. అనియిట్లు వర్తిల్లు నాలుగు వాక్యంబులుం జెప్పి-44

తే. బ్రహ్మచర్యంబుకంటెను బరము మద్య, మాంసములు రెండునుడుగుట మనుజనాథ
లోకయాత్రవాటించు చలోలుపతయు, శమముఁగల్గి వర్తించుట శౌచవిధము-45, అని తెలిపెను.

ఇది మూలమున గల భావమును గ్రహించి తిక్కనచే వ్రాయబడినది.

అంత ధర్మజుడు ధర్మంబు, అర్థంబు, కామంబును ఆచరించు కాలము లెరిగింపవే అని అడుగగ భీష్ముడు

తే. రేపకడయును బగలును మాపువరస, నర్థధర్మకామంబులు నాచరింప
వలయు వానియందాసక్తివలదు సక్తుఁ, డయ్యెనేనియు మేలు ధర్మాభిరతిని -ఆను-ద్వి-47

వ. అని మరియును-48

కం. విను గురుపూజన విప్రా, ర్చనములధిక పుణ్యములు ధరావల్లభ వి
ప్రునినిందించుటయును న,గ్నినివేదమువిడుచుటయునుగిల్బిషతమముల్-49,తెల్పెను.ఇది యథామూలం.

పై భీష్మోపదేశములందు మూడు విషయములు ప్రధానములు. అవి భరత వంశీయులకు తటస్థ పడినట్టివి. ప్రథమము కన్యాదానమునందుటకైన వాని అర్హత. భీష్ముడు బలవంతముగదెచ్చిన అంబ,అంబిక, అంబాలికల విషయము చూడదగును. వరులిరువురును రోగగ్రస్తులే. ఫలితముగ నియోగవిధిని భరతవంశము నిల్పుకొనవలసివచ్చినది. ద్వితీయ విషయము. ఏ వర్ణమువాడైన వానికన్న తక్కువ వర్ణమునకుచెందిన స్త్రీని వివాహమాడిన కలుగు సంతతినిగూర్చి నట్టిది. కేవలము క్షేత్రమెద్దియైన మహర్షులవలన ఫలిగిన సంతానము బ్రాహ్మణులనియు, తద్భిన్నులవలన ఫలిగిన సంతతి వ్యాత్యక్షలీనులని చెప్పబడినది. భీష్మ జననమాదిగ పలువురు భారతవీరుల జన్మములిట్టివియే. ఈ ధర్మసూక్ష్మము పట్టువడక భారతపాత్రల కులనిర్ణయము నేటి విమర్శకులకే కాదు, నాటి సమకాలికులకును తలనొప్పి కలిగించినట్టిది. బాలక్రీడలనాటినుండియు కౌరవ, పాండవులు , ఈ విషయమున పరస్పర నిందలు కావించుకొన్నటుల తెలియుచున్నది.

ఇక తృతీయమున సత్యనిష్ఠత ప్రధానముగ చెప్పబడినది. ఇది ప్రత్యక్షముగ ధర్మజునికే వర్తించును. ధర్మజుడు రాజసూయాదులనొనర్చినాడు. మునిసేవలొనర్చినాడు. ఇంకనునెన్నియో ధర్మములకు కట్టుబడి శ్రమించినాడు. యుద్ధ రంగమున విజయసాధనమున అనుమానాస్పదమైనప్పుడు, యింత సంస్కారమును మరుగుపడి, ద్రోణవధోపాయము తోచక అసత్యమును పలికింపజొచ్చినది. సూటిగ భీష్ముడీ విషయమును ధ్వనింప జేసినాడనిపించును. ఈ సందర్భమున భీష్ముడు తెల్పిన గురుపూజనము, విప్రార్చనములు అతి ప్రధానములనెడి విషయము గమనార్హము. ద్రోణునిపట్ల ధర్మజునిదైన ప్రవర్తనము, భీష్మోపదేశములు పునః పరిశీలనమునకవకాశమును గల్పించుచున్నది. ఇచట ఒక విషయము గమనార్హము. భూభారమడంచుటకై భారతయుద్ధ సమాప్తమువరకు యెల్లరి బుద్ధులను శ్రీకృష్ణుడే ప్రచోదింప జేసినను, అనంతరకాలమున పురుషకారమే కర్మసిద్ధాంతమునకు ఆధారమను విషయము ధర్మజుడు మరువరాదని భీష్మ భావనగ గ్రహింపవచ్చును.

అనంతరము ధర్మజుడు దానంబులకెవ్వరు పాత్రంబులు తెలుపమని భీష్ముని అడుగగ, అతడు సద్ధర్ములు, అక్రోధనులు, సత్యరతులు, దాంతులు, ధీరత్వయుతులు, నిజకర్మ నిరతులు, విజితేంద్రియులు, సర్వభూతహితులు, అలుబ్ధులు, శుచులు దానపాత్రములు. విశేషించి వేదము సాంగముగ జదివి షట్కర్మ నిష్ఠుల వర్తించు తత్వవిదులైన బ్రాహ్మణులకిచ్చినట్టిది సహస్రగుణమని **శ్రుతుల వినబడును. మరియు యోగ్యుడైన విప్రుడు సంతృప్తినందిన దేవవితతి, మునిసమూహ, పితృసమాజములు తృప్తినందినటులని పలికెను. అంత ధర్మజుడు దేవ, పితృ, మనుష్య పూజలకాలము నెరిగింపుమని అడుగ, భీష్ముడు పూర్వాహ్ణంబు, అపరాహ్ణంబు దేవ, పితృ పూజలకు, మధ్యకాలము మనుష్య పూజనమునకు అనువగు కాలమని తెల్పెను. మరియు** కాలహీనంబును, అశుచి, పరిభుక్త శేషమును, అమంత్రకమును తంత్రహీనమును, కీట, కేశ ప్రదుష్టంబు రాక్షసులు గొందురు. మానవీయ ద్రవ్యమే సుర, పిత్య క్రియలయందు ఉపయుక్తము. మరియు దురాత్మకులు, మత్తుని, జడుని, ఉన్మత్తుని, పతితుని, క్లీబుని, కుష్ఠిని, అపస్మారిని, రాజ్యతంత్రము నడుపువాని, నర్తకుని, గాయకుని, మద్య విక్రేతను, వేద విక్రయుని, ధనము వడ్డీకిచ్చి కుడుచువాడు, అనగ్నియు, ప్రాభివిక్రయమున బ్రతుకువాడు, సంధ్యోపాసన లేని వారు దైవ పిత్ర్యములకు **దగరని పల్కెను. అంతధర్మజుడు దైవ, పిత్ర్యంబులగు దానంబులకునుత్తమ పాత్రంబులెవ్వరెరింగింపరే అని భీష్ముని అడుగగ అతడు**

సీ. భోజనార్థలఁదుష్టిఁబొందించునతఁడును, దెరువాటువలనఁ దస్కరులచేతఁ
జేటొంది ధనమువాంఛించునతండు వ్ర, తంబునకుద్యాపనంబు సేయఁ
దలఁచియర్థించునతండును గురుఁదల్లి, దండ్రుల సంక్లిష్ట దారపుత్రు
లను బ్రోవఁబడునతండును మహావ్యాధిని, రాసంబుసేయంగ నాససేయు

తే. నతఁడు నిష్పాపుఁడైన ధరామరుండు, నెపుడు బిక్షయబ్రదుకగునేనినట్టి
యతఁడు దైవపిత్ర్యములకునతిశయంబు, గల్గు పాత్రంబులగుదురు కౌరవేంద్ర -అను-ద్వి-59

అని తెల్పెను. అంత ధర్మజుడు బ్రహ్మహత్యా సమంబులని కొన్ని కర్మలను కొందురుగ్గడింతురు. హింస లేకయు అట్లయ్యెడి, అవియెయ్యెవి అని ప్రశ్నించగ భీష్ముడు

సీ. దివ్యబోధాఢ్య వేదవ్యాసమునినాథు, నడిగితి నొక్కనాఁడధిక భక్తి
నిట్లని యాసంయమీంద్రుండు గృపనాకు, నెఱిఁగించె ననఘు నాయెఱిఁగినట్టి
విధము లెఱింగింతు వినుము విప్రునిఁగ్రుశు, నా మంత్రితునిఁ జేసియతఁడు గుడువ
వచ్చినఁబెట్టమి వరకులంబును సార, విద్యయుఁగల విప్రువృత్తి గొనుట

తే. నీరుద్రావంగ గోవులేతేర విఘ్న, మాచరించుట బధిరపగ్వంధధనము
లపహరించుట వేదశాస్త్రాదినింద, బ్రహ్మహత్య లెట్టట్టుల పౌరవేంద్ర -68

తే. అలుక బురినూరవనమునన్ని నిడుట, పాపశీలతమై బొంకి బ్రాహ్మణునకు
నధికతరమగు శోకంబు నావహించు, టంచితాచార బ్రహ్మహత్యా సమములు -69

తే. రూపగుణ శీలములననురూపుఁడైన, వరునికీక కన్నియఁదనవలసినట్ల
తగని వానికినిచ్చుట ధర్మదేవ, తా తనూభవ బ్రహ్మహత్యాసమంబు -అను-ద్వితీయ-70

అని విన్నవించెను. మూలమున వర్ణించిన విషయములను కొన్ని చోటుల విడచి, కొన్ని గ్రహించి యిట తిక్కన రచించినాడు.

పై విషయములలోనన్నియు కాకపోయినను కొన్నియైన దుర్యోధనాదులకు వర్తించును. విషము బెట్టుట, హత్యా ప్రయత్నమొనర్చుట, లాక్షాగృహముననుంచియగ్నినిడుటలు దుర్యోధన దోషములు. కర్తాకారయితాచైవ అను ధర్మసూక్ష్ముచే దుష్టచతుష్టయమెల్ల దోషులేయగుదురు. వారి వినాశమునకై వగచు ధర్మజునకు పై భీష్మ వాక్యములు ఓదార్పునిచ్చును. అనంతరము ధర్మజుడు పుణ్యతీర్థముల విశేషములు తెలుపుమని అడిగిన భీష్ముడు తొల్లి గౌతముండడుగ అంగిరసుండు తీర్థంబుల కొన్నింటిని తెలిపిన ప్రకారమును తెలిపెను. అంత వశిష్టాది మహామునులు గాంగేయుని జూచుటకు వచ్చిరి. అనంతరము ధర్మజుడు ఏ జనపధంబు, లేనగంబు, లేనదులు పుణ్యానుభావ సమధికత్వంబుగలయవి అని ప్రశ్నించగ, భీష్ముడు గంగా ప్రభావంబును సవిస్తరముగ తెలిపెను. తదనంతరము ధర్మజుడెవ్వరు సర్వజన పూజ్యులెరిగింపవే యని భీష్మ నడుగుటయు అతడు తొల్లి వాసుదేవ నారద సంవాదమున, నారదుడు తెలపిన విషయములనిట్లు చెప్పెను.

సీ. వరుణు సమీరణుఁదరణిఁబర్జన్యుని, సప్తార్చినీశానుషణ్ముఖుని మ
హాలక్ష్మివిష్ణుని నజుబృహస్పతిఁజంద్రు, జలముల భూమినెజ్జనములెపుడు
నతి భక్తిసేవింతురట్టి వారలకునే, మ్రొక్కుదు వేదపరులుఁదపోధ
నులు దేవతాపూజనులు భూమి ధనధాన్య, గోదానశీలురు నాదరంబు

ఆ. గల్గి యతిథిపూజగావించు వారలుఁ, బితృసమర్చకులును భిక్షితాన్న
పూతశాంతభావములు గలవారు స, త్య వ్రతులును బూజ్యులనఘు నాకు -అను-ద్వి-133

కం. వినుత త్రివర్గనిరతులు, ననహంకారమమకారులగు జనులు సువ
ర్తన యుతులు నలోలురు బో, ధనులు నమస్కార్యులద్రిధర వినునాకున్-134

అంత ధర్మజుడు జనపతులకనేక కర్తవ్యంబులు గలవు. అందు ప్రధానమైనదేదియని భీష్ముని ప్రశ్నించగ అతడు విప్రార్చన ప్రధానమైనదని సమాధానమొసగెను. మరియు భూసుర విషయమై వాసుదేవ భూదేవి సంవాదమును వినిపించెను. ఇది మూలభావమును గ్రహించి తిక్కన రచించినాడు.

అనంతరము ధర్మజుడు అఘుకోటికి మూలము వనితా జనములని విందుము. దానిని నెరిగింపుమని పల్కిన భీష్ముడు ఈ విషయమై తొల్లి నారద, పంచచూడయను అప్సరకు జరిగిన సంవాదమును వినిపించెను. అంత ధర్మజుడు సుందరీజనంబులగాంచు తెరగు ఎరిగింపుమని వేడగ భీష్ముడు తొల్లి జనములెల్ల నిర్దోషచిత్తులై యుండుట గాంచి, దివిజులు బ్రహ్మకడకు పోయి నిజచిత్త ప్రకారమెరిగించిన కమలాసనుడు అతివలకు మాయాత్వము కల్పించి, కామంబు అధికంబుగా జేసి, పురుషులు వారి చిక్కులంబడి రోషాది దుర్గుణ దూషితులగుటం జేసెను. అందువలన "వనితలు మాయావినులై యనిరూఢిత చిత్త వృత్తిన" మెలగుచుండిరని పలికి మరియు దేవశర్మయను మునివరుభార్య రుచియను దాని చరిత్రము తెల్పెను. అనంతరము గాంధర్వాది వివాహముల తెరగు, ఔరసాదిపుత్ర బేదములను, చ్యవన నహుష సంవాదమనునితిహాసమును, చ్యవన, కుశిక సంవాదమును, చ్యవనుడు తనయోగ బలమున కుశికునికి నాకలోకము జూపుట యనునది, దాన విశేషములను, భూదాన మహిమ వర్ణనము, నక్షత్రదాన మహిమాతిశయము, తిలదాన విషయము, గోదాన విషయమున నృగచరిత్రము, నృగుడు పాపవిముక్తుడై పుణ్యలోకమునకు పోవుట. గోప్రభావ విషయంబగు ఔద్దాలకీ పుత్ర సంవాదము, బ్రహ్మచెప్పిన గోదాన విషయములు ధర్మజునకు భీష్ముడు తెలియపరిచెను. ఇందలి సంవాదములన్నియు మూలమున గలవు. తిక్కన భావములను గ్రహించి రచించినాడు.

తృతీయాశ్వాసము :

తృతీయాశ్వాసమున ధర్మజుడు భీష్మునుద్దేశించి, అనుష్ఠింపవలసినవెయ్యవి అని ప్రశ్నించగ భీష్ముడు నియమంబును, వేదపఠంబు, దమము, అధ్యాపనంబు, అప్రతిగ్రహమును, ఆత్మీయ కర్మనిష్ఠయు, సకలేంద్రియ జయము, సత్యనిరతియు, శ్రుతదానపరతయు, బ్రహ్మచర్యము, మాతా, పిత్ర, గురు శుశ్రూషణమును, అనుకంపయు, గోవ్రత సంపదయును **అనుష్ఠింపవలసినటువంటివని సమాధానమొసగెను. అంత ధర్మజుడు గోప్రదాన విధి తెల్పుమని అడుగగ బృహస్పతి మాంధాతకు తెల్పిన గోదానవిధినిట్లు ఎరుకపర్చెను. పుణ్యదివసమందు భూసురానుజ్ఞతోనుప వశించి గోవులున్న మందకరిగి అహోరాత్రమా గోష్ఠమునందుండి మరునాడు**

అ. తల్లిగోవు వృషముదండ్రి గర్భప్రదే, శంబుదివము ధరణి సంప్రతిష్ఠ
యనిపఠించి యోగ్యుడగువిప్రునర్చించి, పలుకవలయు నీగి కలిమిదెలియ-అను-తృతీయ-10

వ. తదనంతరంబ-11

కం. సౌరములగు గోవులు మ, ద్ఘోరసకల కల్మషములఁద్రుంచును సౌమ్య
త్వారూఢంబులు శాశ్వత, సారోదారపదమిచ్చి సౌఖ్యముఁజేర్చున్ -12

అని పలికి గోవునిచ్చితిననినుదకధార ప్రీతిన ఆ విప్రుని కరంబున పోయవలయునని విధి విధానమంతయు తెలియపర్చెను. ఇవ్విధముగ గోవునిచ్చినాతడు చంద్రలోకవసన సౌఖ్యమొందును. మరియు గోవులలో కపిలగోవు వరిష్ఠము. దానమునకది మిక్కిలిశ్రేష్ఠమని భీష్ముడు తెలుపగ, ధర్మజుడు గోవులకు కపిలత్వముగల్గిన తెరగు ఎరిగింపుమని భీష్ముని వేడగ, అతడు పూర్వము అమృతము సేవించిన కామధేనువు సంతతి హిమవత్పర్వత ప్రాంతమున తిరుగుచుండెను. అంతనొక వత్సము పాలు కుడువబోగా ఆ నురుగ అటనే తపస్సు చేసుకొనుచున్న శివుని శిరమునబడుట జరిగినది. అందులకు శివుడు కోపించి మూడవకంటిని తెరిచి ఆ గోవులనెల్ల కపిలత్వము నొందించెను. అంత బ్రహ్మయేతెంచి ఈశ్వరునితో గోవులకెంగిలి లేదని, వాటిపాలు, నురగ అమృతమేనని సమాధాన పరచి అతనికినొక్క వృషమును కప్పముగ నిచ్చెను. ఆనాటినుండి ఈశ్వరుడు వృషకేతనుడు, వృషభవాహనుడై వినుతి కెక్కెనని, తన వలన కపిలత్వము పొందిన గోవులు తదితరములకన్న శ్రేష్ఠముగనుండునటుల వరమిచ్చెను. కావున గోవులలో కపిలగోవు అధికశ్రేష్ఠమని ధర్మజునకు తెలిపెను. అనంతరము భీష్ముడు ధర్మజుని ప్రశ్నములపై గోవుల ప్రభావము, గోదానఫలిత విషయమైగలట్టి సౌదానుని వృత్తాంతము, వ్యాసుడు శుకునకు తెల్పిన గోదానవిషయము, సుమిత్రుడను మునిచే పోషింపబడిన గోవులప్రభావము, గోవులు రంతిదేవుని యజ్ఞపశువులై గోలోకమునకు పోయిన తెరగు, వ్యాసుడు శుకునకు చెప్పిన కపిల గోమహానుభావము, గోశ్రీ సంవాదమను విషయముల నెరింగించెను. పై వాటిలో గోవులతి పవిత్రమైనవని, వాటిని ఆరాధించి పూజించి, దానమొనర్చి బ్రహ్మలోకమున పైనగల గోలోకమున శాశ్వత వాసముండెదరని ముఖ్యముగ తెలుపబడినది. అంత ధర్మజుడు భీష్మునితో సర్వయజ్ఞంబులయందును దాతవ్యంబత్యంతంబు సువర్ణంబని విందుము, వేదంబులు సువర్ణ దక్షిణలనై యని చెప్పుచున్నవి. భూ,గో, కాంచన విషయంబులైన దానములనుత్తమములని వేదవ్యాసుని వచనములు నీవె చెప్పితివి. కావున సువర్ణదాన విశేషమును చెప్పవలయునని వేడగ భీష్ముడు తొల్లి శంతన మహారాజు చెప్పినవిధమున తాను సువర్ణదానమొసగితినని, అట్లొనర్చుటవలన వంశావళి పావనమగునని తెల్పి మరియు పరశురాముడు

ఇరువదియొక్క మారులు రాజులనెల్ల వధియించి ప్రాయశ్చిత్తము చేసుకొనదలచి వశిష్టాది ఋషిగణముల నడుగగ సువర్ణదానమాచరించినచో ఆ పాపము నశించునని, సువర్ణదాన మహిమను వారలు తెలుపగ, పరశురాముడు సువర్ణదాన పరంపరలొనరించి శ్రీరాజీతుడయ్యెను. కావున అది అవశ్యము నీచే ఆచరింపదగట్టిదని ధర్మరాజుతో పలికెను. ఇది యథామూలము.

పైవివరణమున రెండువిషయములు ప్రధానములు. బ్రాహ్మణ్యము అధ్యయన,అధ్యాపనములను విడువరెందు, బ్రాహ్మణశ్రేష్ఠులు స్వధర్మమును వీడి యుద్ధమున ప్రవేశించియుండనిచో, భారతయుద్ధమే యుండియుండదు. గతమునకు కారణమేమైనను, భవిష్యమున బ్రాహ్మణులకు యుద్ధప్రవేశము నీయవలదని ధర్మజునకు భీష్ముడు సూచించినటుల భావింపవచ్చును. ఇక రెండవది గోమహత్మ్యము. ఉత్తర,దక్షిణ గోగ్రహణమున కౌరవులు పతనమైరని భీష్మునిభావనమేమో? అనంతరము ధర్మరాజు భీష్మునితో పితృయజ్ఞ ప్రకారమునెరింగించుమని వేడగ అతడు

కం. పితృపూజ సమగ్రము దైవ, తపూజనమునకు మనుజవల్లభ పితృదే
వతలఁగొనియాడుదురు దే, వతలాదిగఁగల్గు నెల్లవారునుభక్తిన్ -ఆను-తృతీయ-157

వ. విశేషించి మనుష్యలకుఁబితృసమారాధనంబు సర్వశుభసాధనంబు -158

కం. అమవసనమవసఁబితృయ, జ్ఞముఁదగఁబిండ ప్రధాన సహితముగా భ
క్తి మెయిం జేయునతఁడు ని, త్యముఁజేసినవాఁడయగు సమంచిత చరిత -159, అని తెల్పెను.

183. ఇచటనొక విషయము గమనార్హము. కడచిన పుటలలో పలుతావులు పితృసమారాధన విషయము ప్రసక్తము. ఇచట తిథి నక్షత్రాది యుతివలని ఫలితములు వివరితములు. నిజమునకీ భాగము ప్రధాన భారత కథకు పెద్దగ నతుకక, వస్త్యైక్య భంజకముగ స్థూలదృష్టికి కాన్పించును. కాని ధర్మజునకొక విషయము తెలియును. పితృదేవతలే సంతతిగనుద్భవింతురు. దుర్మరణము పాలైనవారు, అకాలమృత్యువు పాలైనవారు, జీవితమున రాగము విడువనివారు, గతించిన పిదప ఆ జీవులు క్షోభించుననియు, వారవలన భవిష్యమున దుష్టసంతతి యుద్భవిల్లుననియు ధర్మజునకు తెలియును. గతించిన వారికైన ధర్మజుని నిర్వేద కారణములలో అనుబంధము, ఆర్ద్రతల పిదప నిదియును చెప్పదగినదే. కనుకనే ధర్మజుడు గతించిన వారెల్లరకు ఉత్తమగతులు కల్పింప సమకట్టినాడు. దానికితగు తిథి విశేషాదులను భీష్ముడిట్లు తెలిపెను.

సీ. పాద్యమిఁబితృయజ్ఞ పరుడైనఁ జారు కాం, తాపతి విదియఁ గాంతలకుఁ దండ్రి
దదియను జవితిని దావాజి ధనకుండు, పశుభాగి పంచమి బహుసుతుండు
షష్టి భానాత్ముండు సప్తమిఁగృషిభాగి, యష్టమి వాణిజ్యపుష్టఁడు వసు
గజ ధర్మ విష్ణుచిత్తజతిథులందేక, శఫ జంతువులను గోచయముఁగుప్య

తే. ములును దగ బ్రహ్మవర్చస్వి పుత్రకులును, ధనముగలవాఁడు వినుచతుర్దశిరణైక
భాగి పున్నమనమవస భవ్య సర్వ, కామ్యఫలభాగియగుఁజువ్వె కౌరవేంద్ర -161

కం. అపరంబగు పక్షంబును, నవరాహ్ణముమేలు పితృసమర్చనమున కా
ద్యపుఁదిథి దశమిచతుర్ధశి, నృపవర యప్పక్షముననునింద్యతఁబొరయున్ -ఆను-తృతీయ-162

అనిన విని ధర్మరాజు ఏ ద్రవ్యములచేత పితృసమర్చనమొసంగిన అధిక ఫలముగల్గునని అడుగగ, భీష్ముడు తిల, పాయస, ఘృతములు పితృ కలనములకునుత్తమములని తెలిపి మరియు నక్షత్ర విశేషములనిట్టుల తెలిపెను.

1. కృత్తిక-రోగములేకుండుట,**2.** రోహిణి-సంతానలాభం, **3.** మృగశిర - తేజోవృద్ధి, **4.**ఆర్ద్ర - క్రూరకర్మ, **5.** పునర్వసు-కృషిలో ధనప్రాప్తి, **6.**పుష్యమి- సుపుష్టి, **7.**ఆశ్లేష - వీరపుత్ర ప్రాప్తి, **8.**మఖ - కులవృద్ధి, **9.**పూర్వఫల్గుణి -సౌభాగ్యవృద్ధి, **10.**ఉత్తరఫల్గుణి-సంతానవృద్ధి,**11.**హస్త-కర్మసఫలత, అభీష్టసిద్ధి, **12.**చిత్త-రూపవంతుడైనపుత్రప్రాప్తి **13.** స్వాతి-వాణిజ్యవృద్ధి, **14.**విశాఖ-సత్తనయప్రాప్తి, **15.**అనూరాధ-రాజ్యాధికార ప్రాప్తి, **16.**జ్యేష్ట-ప్రభుత్వపెంపు, **17.**మూల-ఆరోగ్యవృద్ధి, **18.**పూర్వాషాఢ-ఉత్తమాతి శయము(యశస్సు),**19.**ఉత్తరాషాఢ-శోకసూన్యత, **20.**అభిజిత్తు-వీర్యాభివృద్ధి,**21.**శ్రవణం-మరణానంతరసద్గతి,**22.**ధనిష్ట-రాజ్యసంప్రాప్తి,**23.**శతభిషం- వైద్య సిద్ధి, **24.**పూర్వభాద్ర-అజాదిగాగల జంతుప్రాప్తి, **25.**ఉత్తరాభాద్ర-గో సహస్ర వృద్ధి, **26.**రేవతి-గుప్తధనవృద్ధి (కనక-రజిత దక్క-ధనవృద్ధి), **27.**అశ్విని-అశ్వసంపద, **28.**భరణి-ఆయుర్వృద్ధి.

పై చెప్పిన నక్షత్రములందు శ్రాద్ధకర్త యధావిధిన పితృదేవతా కలనములొనరించిన ఆయా ఫలితములు పొందునని భీష్ముడు ధర్మజునకెరుక పర్చెను. మరియు పితృవిధాన విషయమున పాత్రములైన వారిని, అనర్హులను వివరించి అందులకనుసంధానమైన అత్రిమహాముని, దత్తాత్రేయనందనుడగు నిమికెరింగించిన శ్రాద్ధ క్రియావిశేషముల నెరింగించెను. అనంతరము భీష్ముడు ధర్మజుని ప్రశ్నములపై సప్తర్షి, వృషాదర్భి సంవాదమును, ఛత్రోపానహౌద్దాన విషయమున సూర్య, జమదగ్ని సంవాదమును శూద్రునకవశ్యానుష్ఠేయంబైన ధర్మములు, సర్వ వర్ణ సామన్య ధర్మ నిరూపణము, తటాక, తరునిర్మాణ విశేషములు తెలిపి, మరియు గృహస్థాశ్రమ ధర్మములు విషయమై తొల్లి భూ, విష్ణుల సంవాద సారమునిట్లు తెలిపెను. మిగిలిన ఆశ్రమముల కన్న గృహస్థాశ్రమమత్యంత ఉత్తమమైనదని, అందు గృహస్థుచే బ్రహ్మయజ్ఞాది పంచయజ్ఞములనుష్ఠింపబడి ఉభయలోకముల సిద్ధిని పొందునని వివరించినాడు.

చతుర్థాశ్వాసము:

అనుశాసనికపర్వ చతుర్థాశ్వాసమున ధర్మజుడు "సుమనో ధూపదీప నైవేద్యములు, ఉత్తమంబులగు భూజసాధనములుగొని దేవతలను భూజింతురు. తద్విశేషంబు తెలుపు" **మని భీష్ముని వేడగ అతడు మేలైన పుష్పములు గొని సురపూజలొనర్చిన మానవులకు మంచిమనసు గలుగునని, పూలవిశేషములను దెలిపి, ధూపము దేవతలకు నిచ్చిన ఆయువు పదయుదురని, వీనియందు దీపదానమధికమని తద్ద్వార అమరపూజిత సుఖత్వము పొందునని, మరియు దేవతలకు ముందు నివేదించి తదుపరి తినుట ఉత్తమమని, అందు తిలపిష్టము, దధి, దుగ్ధంబులు పవిత్రమైనవని, అట్లు చేయుటవలన బలవంతుడు, బుద్ధిమంతుడు, లోకానుగ్రహపాత్రము, శాత్రవ నిగ్రహశక్తుండు, తత్వనిష్ఠుడగునని తెలిపెను. మరియు కొన్ని ధూప, దీప దాన విశేషములు వినిపింపమని ధర్మజుడు కోరగ, నహుష ధూప, దీప, దాన విశేషములనిట్లు తెలిపెను. నహుషుడు తన, ధూప, దీప, దాన విశేషములచేత దైవత పూజ్యుడై కొంతకాలమునకు గర్వమతిశయిల్లి మునీశ్వరుల శాపముకలిగి అజగరత్వము పొందినను, మరలపూర్వకృత పుష్ప, ధూప, దీపదానములచే బ్రహ్మసభయందు స్థానము గలిగినవాడయ్యెను. అందునా దీపదాన వివేషమధికము. దైవసాన్నిధ్యమున ఎన్ని నిముషములు దీపము ప్రజ్వలింపజేయునో, అట్టివాడు అన్ని సంవత్సరములు ఊర్ధ్వ లోకములందుత్తమగతి వడయునని ధర్మజునకు తెల్పెను. ఇది యథామూలము. ఇట్టి ధర్మసూక్ష్ములు ఒకచో గుది గ్రుచ్చినచోనది ధర్మశాస్త్ర గ్రంధముగ భాసించునను భయమున, పురాణ ధోరణిని నడచిన కార్యములలో

యిట్టి యాశ్వాసములు అరుదుగా కన్పించును. కాని మహాభారతము ఔపదేశిక వాక్య సముచ్చయము. సూక్ష్మముగ చూచిన కవికి ఈ లక్ష్యములే ప్రధానములు. భగవద్గీతనిన్ను, శ్రీకృష్ణుని హృదయమనినను వ్యాసుని దృష్టిలో నొక్కటియే. అటులనే తన సుదీర్ఘ కావ్యమున శతాధిక పాత్రల ముఖమున వ్యాసుడు బోధించిన ఉపదేశములే పునః యిట చెప్పబడుచున్నటుల గ్రహింపవలయును.

184. అనంతరము ధర్మజుడు విప్ర ధనమపహరించినవాడు ఏమి గతిపోవునని భీష్ముని ప్రశ్నించగ, అతడు లోకముననేకములైన పాపములు గలవు. అన్నింటికి మించిన పాపము విప్రధనాపహరణమని పేర్కొని, తద్ద్వారా కులనాశము, మరుజన్మమున ఛండాలత్వ సంగమము కలుగునని ఉదాహరణముగ క్షత్రబంధువను రాజునకు, ఛండాలునకు జరిగిన సంవాదమును వినిపించెను. అంత ధర్మజుడు నాకలోకము ఏక ప్రకారముగనుండునో, బహుప్రకారములుగానుండునో తద్విశేషములు వినిపింపమని కోరగ, భీష్ముడు పుణ్యములనేకములు గలవు. తత్తద్విధముగ నాకలోకముండునని తెలిపి, అందులకనుసంధానమైన గౌతమ, శతకృతు సంవాదమును వినిపించెను. విప్రధనాపహరణము మహాపాపమని తెలియుటచేతనే, తాము గావించుకొనిన సమయపాలనా విధానమునుల్లంఘించి, బ్రాహ్మణ ధనమైన గోవును బ్రాహ్మణునకిప్పించి అర్జునుడు తీర్థయాత్రలకేగెను. ఇందుకు ధర్మజుడు ఒడంబడుటకన్న, అర్జున కృత్యమునకు హర్షించుటయనునది, ధర్మజుని హృదయమే ఈ నియమ సంపుటియనిపించును. అంతధర్మజుడు తపమధికమైన ధర్మమని మీరుచెప్పగ వింటిని, దానికన్న అధికమైనదేది. అద్దానిని తెలుపమని అడుగగ, భీష్ముడు భగీరథునకు బ్రహ్మతోనైన సంవాదమునిట్లు వివరించెను. బ్రహ్మలోకమునకు వెళ్లిన భగీరథుని నీవి లోకమునకెట్లు వచ్చితివని అడుగగ అతడు నేచేసిన యజ్ఞ, యాగాది క్రతువులవలనగాని, గోదానాది పుణ్య విశేషములచే గాని రాలేదు. బ్రహ్మణులొకనెడచేయు యజ్ఞమునకు వాటిల్లిన విఘాతమునకు అకలి దప్పులను మరచి, నియతాశనత్వమున రక్షణ కల్పించి వారి దీవెనలతో యిట కొచ్చినాడనని సమాధానమొసగెను. కావున నియతాశనత్వము కన్న వేరే తపముగాని, ధర్మముగాని లేదని తెలిపెను. అనంతరము ధర్మజుడు పురుషుడు శతాయువని శ్రుతి. కాని బాలురు కొందరు మృతిని బొందుచున్నారు. కావున ఏమి చేసిన చిరాయువు గలుగునని భీష్మునిప్రశ్నించగ అతడు ఆచార మాయువును పెంచును. శ్రీయును, కీర్తిని కలుగజేయును. కావున ఆచారపరుడవై వర్తింపుమని ఆచార విశేషములు కొన్నింటినుగ్గడించెను.

కం. వినుక్రోధంబునుహింసయు, ననృతంబునులేమి సంధ్య లైనందదుపా
సనము సురపూజనము రే, పొనరించుట చిరతరాయువొనరించు నృపా **-అను-చతుర్ధ-91** , అని తెలిపి చేయకూడనికార్యములనుకూడ తెలిపి, సద్వర్తనమున మెలుగుమని ధర్మజునకు హితము చెప్పెను. ఇది యథామూలము.

185. అంత ధర్మజుడు అన్నదమ్ములెవ్విధముగ తమలోతాము మెలగ వలయునని భీష్ముని అడుగగ, అతడు అన్నదమ్ములందరు ఐకమత్యముతో మెలగవలెనని, అగ్రజుని ఆజ్ఞను పాటించుచుండవలెనని తెలిపి, అట్లుకానియెడల జరుగు పరిణామముల నిట్లుపలికెను.

కం. అనుజుఁడొకఁడు వెంగలియై, ననుదప్పెడుఁగాని పెద్దనకుఁగార్య జ్ఞా
ననిరూఢిలేక తక్కిన, ననుజన్ములు సిక్కువడుదురవనీనాథా **-133**

చం. జనవరయన్నదమ్ములు ప్రసన్నమతింగలకల్మిపంచి కు
ద్చిన వినుతించు లోకమును శ్రీయుఁబొరింబొరిఁబెంపునొందు లో
భనిరతిఁబెద్దకాసపడి పాడిదొఱంగినఁబ్రాణ గొడ్డపుం
బనులగునవ్విధంబు మనపడ్డదిగాదె జగంబెఱుంగఁగన్**-134**

కం. మానవనాయకయగ్రజుఁ, డైననుననుజన్ముఁడేనినన్యాయంబుం
బూని సహోదరులకుఁ, గీ, డైన నతఁడు దండ్యుఁడండురవనీ పతికిన్-136

అని సహోదరప్రకారంబును సెలవిచ్చెను. ఈ విషయమునకే మొత్తము భారతకథయే ఉదాహరణమగును. ధృతరాష్ట్రుడు సోదర మరణానంతరము, స్వార్థమును పెంచుకొని సోదరపుత్రులనుపేక్షించుటే కదా! భారతకథనము. సోదరుల ఐకమత్యమునకు శ్రీరామాదుల తరువాత పాండవులే ఫురాణ సోదరులు.

అనంతరము ధర్మజుడు ఉపవాస విధి యోగ్యతను, తత్ఫలవిశేషము నెరిగించుమని భీష్ముని వేడగ అతడు ఉపవాస విధికన్న తపములేదని యిట్టి ఉపవాస వ్రత మహత్యమువలననే సురలాది మునులు మహితానుభావులైరని, ఈ వ్రతమును సహస్రవర్షములాచరించి గాధినందనుడైన విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వమునొందెనని మరియు యిట్టి వ్రతదీక్ష సల్పువారికి, శరీరము, మనసు పావనమై, ఇహపరముల రెండింటియందు సౌఖ్యముకల్గునని తొల్లి తనకు అంగీరసుడు చెప్పిన విధమును ధర్మజునకు వినిపించెను. అంత ధర్మజుడు యజ్ఞములు ఎల్లవారలు అనుష్ఠింప దగినట్టివి కావు. కావున దానికి సరియగు పుణ్యకార్యమేది. దానిని తెలుపమని ప్రార్థించగ భీష్ముడు ఉపవాసవిధి యందుగల తేలికైన విధానమునిట్లు తెలిపెను. పగలు, రేయి రెంటియందు అన్నపానాదులు సంతృప్తిగ గ్రహించి నడుమ కాలమున వాటియందు ఆసక్తిని కనపర్చక, పరిత్యజించుటచే హోమ కార్యమునకీడైనట్టిది. అట్టి నియమ వ్రతమునకు ఊర్ధ్వగతులు సులభ సాధ్యములని అంగీరసుడుపదేశించిన తెరగు వినిపించెను. అనంతరము ధర్మజుడు అధ్యాత్మవిద్యా ప్రకారం బెరింగింపుమని భీష్ముని, వేడగ, అతడు హర, సనత్కుమార సంవాదమును, సనత్కుమారుడు శివునకు దేహాంతర్గత దైవతప్రకారంబులెరింగించుట, సనత్కుమారుడు రుద్రునకు సాంఖ్యయోగంబు తెరంగెరింగించిన విధము తెలిపెను. ఈ విషయములు యథామూలములు. అనంతరము ధర్మజుడు మనుజుడు మృతినందియు దేని సహాయమున ఉత్తమ ప్రాప్తినందునని భీష్ముని ప్రశ్నించగ అందులకాతడు దేవగురువైన బృహస్పతి యిటకు రానున్నాడు. అతనినడిగి తెల్సుకొమ్మని ధర్మజునితో పలికిన, దేవగురువు ధర్మజునకు, ధర్మహీనులకుగలుగు దుర్గతులను వివరించి అంతర్హితుడయ్యెను. తదనంతరము భీష్ముడు అహింసాస్వరూప నిరూపణము, మాంసభక్షణయందలి రుచిమానుట దుష్కరంబను విషయము, యుద్ధమున మరణించినవారికి గలుగు ఉత్తమగతుల వివరములు, వేదవ్యాసుడు కీటకమున కుత్తమగతిని ప్రసాదించిన వైనము, విద్యా, తపో, దానములలో దానము ఉత్తమమైనదని వివరించుచు వ్యాస,మైత్రేయ సంవాదమును, సర్వశ్రేష్ఠమైన అనుష్ఠేయంబేదను విషయమున శ్రీమన్నారాయణ మంత్రజపమని తెలియజేయు నారద, పుండరీక సంవాదమును, శ్రీకృష్ణుని చిత్రచరిత్రము, ఉమామహేశ్వర సంవాదమను పరమేతిహాసమును, శివుడు పార్వతికిచెప్పిన తన శ్మసానవాసితకు కారణము ధర్మజునకు సవిస్తరముగ తెల్పెను.

తృతీయ, చతుర్థాశ్వాసముల పలు సందర్భముల దేవపూజకంటె పితృపూజ ప్రధానమని తెల్పుట చూడగలము. పలువురు కురుపాండవ వీరులు మరణానంతరము ధర్మజుడు వారలకెల్ల కర్మకాండలు నిర్వర్తించినాడు. అందుండు భీమాదులు యిట్టివానిని చిన్నచూపు చూచినటుల, ధర్మజుడువారిని వారించినటుల కాన్పించును. ధర్మజుని ప్రవృత్తిని భీష్ముడుకూడ ఆమోదించి ప్రోత్సహించినటుల గ్రహింపవలయును.

పంచమాశ్వాసము:

పంచమాశ్వాసమున నారదుడు శ్రీకృష్ణునకు చెప్పిన ఉమామహేశ్వరీతిహాసము భీష్ముడు ధర్మజునకిట్లు తెలిపెను. శివుడు పార్వతికి వర్ణాశ్రమాచారములను తెలుపుచు బ్రహ్మముండుగ బ్రాహ్మణులను, తదుపరి క్షత్రియ, వైశ్య, శూద్రులను సృజియించెనని, అందు బ్రాహ్మణులు పూజనీయులని, వారిని పరాభవించుట వారి సొమ్ములపహరించుట నింద్యములని తెలిపి మరియు

సీ. అధ్యయనంబునుయజనంబుదానంబు, నధ్యాపనంబునుయాజనముఁబ్ర
తిగ్రహంబును బ్రశాంతియుఁదపస్సత్య శౌ, చంబులు విప్రధర్మంబు లాప
దలఁదక్కనతనికి వలవదు వాణిజ్య, మగ్నికార్యంబు శూద్రాన్నవర్జ
నము నిజదారసంగమ నియమంబును, నిరుప్రొద్దుగుడువును హింసలేమి

ఆ. యును నివాసశుద్ధియును నతిథి ప్రియ, త్వంబు బ్రాహ్మణులకువలయుఁదపము
పేర్మిసాధనముగ ధర్మమూలముగ వా, రల సృజించెఁగాదె నలినభవుడు -అను-పంచమ-8

అని విప్రకులాచారములు తెలిపెను. ఈ విప్రకులాచార విషయమున చర్వితచర్వణమేయైనను ద్రోణాదుల యుద్ధరంగ ప్రవేశము వంటిది భవిష్యమున వీలుపడనీయరాదని భీష్ముడు ధర్మజునకు సూచించినటుల మనము గ్రహింపవచ్చును.

186. అనంతరము క్షత్రియ ధర్మములనిట్లు తెలిపెను.

ఆ. క్షత్రియులకు విప్రసంరక్ష ముఖ్య ధ, ర్మంబుధరణి వారిరక్షణమునఁ
గాని బ్రదుకనమ్మహానుభావుల పాల, నంబుసేయ శోభనంబునొందు -9

కం. రమణీ యధ్యయనము యజ, నముదానము సాధుపోషణము దుర్జనులన్
దమియించుటయు సముత్సా, హము కల్మియుధృతియు నృపులకగు ధర్మంబుల్-10

తే. శస్త్రజీవికయును నరిషష్టభాగ, మాహరించుటయును భృత్యనరయుటయును
బ్రజవివాదంబు వినుచోటఁబక్షపాతి, గామియును రాజులకుఁగృత్యకర్మకోటి-11

ఈ సందర్భమునగూడ గుర్తింపవలసినట్టిది. ఏక చక్రపురము ఏరాజు పాలనమున గలదన్నది ప్రకృతముగాదు. ఆ గ్రామవాసులు తమ యిక్కటులను తమ ఏలిక దృష్టికి తెచ్చినవారో, కారో తెలియదు. కాని బ్రాహ్మణ పుత్రుని బకాసురునకు ఆహారముగానంపు నవసరమగుటనుత్పన్నమగుట జూడ, ఆ గ్రామమున ప్రజలను రాక్షసబారినవదిలి, రాజు తన ధర్మమునుపేక్షించునటుల కాన్పించును (ఈతడు బలహీనుడైన రాజుగ తెలియుచున్నది). ఇవి వాస్తవములు. భీష్ముడు వీనిని ధర్మసూత్రముగ తెల్పినాడు.

వణిజులకు ఆహార ధాన్యసేకరణ, పశుపాలన, అధ్యయనము, యజనము, దానములర్హములు, పై మూడు జాతులకు శుశ్రూషలొనర్చుచు, అక్రూరులై వర్ధిల్లుట శూద్ర వర్ణీయులకు కృత్యములని తెల్పెను. అనంతరమాశ్రమ ధర్మములను తెలుపుచు బ్రహ్మచర్యమున గురునాశ్రయించుట అధ్యయన కృతి, అగ్నికార్యము, గుర్వార్థము భిక్షాచర్యము అచరణీయములని, గృహస్థాశ్రమము మిగిలిన ఆశ్రమములకన్న గొప్పదైనదని తెలుపుచు శౌచము, నిజదార సంతుష్టి యును,పంచయజ్ఞంబులను సలుపుచు,నిగమాభిరతియు,దాన,హోమ, దయాతిథి మానసములు సలుపుచునుండవలెను. వనవాస, వన్యభోజన, బ్రహ్మచర్య, జటాజిన ప్రధారణములు వానప్రస్థమునకర్హములు. సంఘవర్జనజేసి, ప్రశాంతియై, శౌచియై సద్వ్రతనిష్ఠ, భైక్ష్యభోజనము, యిలనిద్ర, కృపసంతత తత్వచింతనము యతి ధర్మములని ఆశ్రమ ధర్మములను శివుడు పార్వతికి చెప్పెనని, నారదుడు శ్రీకృష్ణునికి చెప్పినటుల, ధర్మజునకు భీష్ముడు చెప్పెను. అనంతరము తప స్వరూపమును వివరించుచు తపమనగ వానప్రస్థులాచరించెడి ధర్మమని, ఇంద్రియకర్మ నిగ్రహముతో ఉభయ కాలములందు యోగసేవ చేయుచు, ఫలకాంక్షచే తపము కడచి, కాలమైన తదుపరి నూర్ధ్వలోకములను పొందెదరని వివరించెను.

అనంతరము వ్రత విశేషములనడిగిన, అందుపవాస వ్రతము శ్రేష్ఠమైనదని చెప్పి వైఖానసులు, వాలఖిల్యులన పేర బరగు పరమ మునులవలననే జగములు సుస్థిరములై వెలుగొందుచున్నవని, తపమునకుమించిన ధర్మము లేదని పలికెను. మరియు గృహస్థాశ్రమమున ముఖ్యవిధియేదను ప్రశ్నకు బదులుగ జననీ, జనకారాధన ముఖ్యమైనదని పరమేశ్వరుడు పార్వతితో చెప్పెను. తదనంతరము శివుడు పార్వతికి రాజత్వమహిమాతిశయంబు తెల్పుచు, అధిక తపమున రాజత్వము సిద్ధించును. అందువలన ఆతడు నిగ్రహానుగ్రహములకు, జనములచే మ్రొక్కులు బడయుటకు సమర్థుడగును. ఇంద్రియ జయమును బడసి పాత్రవ్యయంబు చేయుచు, నిజరక్షాయత్నములెల్ల సల్పుచు, ధర్మా చరణతకల్గి అక్రోధకాముడై, సత్యభాషణతో, పురపరివారములను జూచుచు, శూరుడై రణమున చరించుచు, యజ్ఞ, దానవిధి పరాయణుండై మెలగుట ఉత్తమము. వీటికి విరుద్ధులైన నృపతులు నరకమునకు పోవుదురని తెల్పెను.మరియు ధర్మరహస్యమునుగూర్చి అహింస అనునదియే ధర్మరహస్యమని శ్రుతులలో చెప్పబడినది. కనుక యజ్ఞ యాగాది క్రతువులందు ఒనర్చునట్టి హింస, అహింసగనే శ్రుతులొప్పుచున్నవని, అట్లే రాజుచేత వేటాడబడి చచ్చిన మృగములు సుగతికిచనును. గావునది హింసగ ప్రవర్తిల్లదని అహింసా విషయక ధర్మముల కొన్నింటిని తెలియపరచెను. మరియు జనజీవనముల విషయమై మనుష్యలోకము కర్మభూమి, అందుగల వారందరు వారలకు నిర్దేశింపబడిన కర్మలన్నిటిని నిర్వర్తించుచు, వంచన, జాడ్యమును లేక ప్రభువు యిష్టమెరిగి పనులు చేయుచు ధనమువడసి, పరధన, పరదారల వ్యామోహము విడనాడి, దేవ, పితృ సమారాధనమున, కరుణయు, అతిథి సపర్యత కలిగియుండుట ఎల్లవారికిని కృత్యములని,మరియు తమ తమ కర్మలు తెరవుతప్పక ఆచరించెడివారు ఇహపరసౌఖ్యములు పొందుదురని పల్కెను.

ఇందు రాజ ధర్మములనేకములు వివరింపబడినవి. సర్వమును భారత ప్రభువులకు వర్తించునట్టివియే. మచ్చునకు రెండు చూడుడు. పాత్రవ్యయమనుమాటను సూక్ష్మముగ గ్రహింపవలయును. శత్రుభయముచే రాజు అవకాశము లభించునపుడెల్ల వీరులను తన పక్షమునకు త్రిప్పుకొని చెలిమి సాగించుట సహజముగ కాన్పించినను, లభించిన వీరులలో బలిమితప్ప గుణమేమి లేనిచో అద్దాని విషయమై ప్రభువు జాగరూకుడు కావలయును. కానినాడు విపరీతమునననుభవింపక తప్పదు. దుర్యోధనుడు కర్ణుని అర్జునునకు ప్రతిద్వంద్విగ కనుగొని వానికాశ్రయమిచ్చినాడు. కాని అనంతరమున వృద్ధోపదేశమును వినక కర్ణునిమాటకే ప్రాముఖ్యతనిచ్చి చివరకు నాశనమైనాడు. ఒక విధముగ ఇది పాత్రవ్యయమునకు విరుద్ధముగ ప్రవర్తించుటచే వచ్చిన కీడు. వేశ్యాది జనములకు, వినోదములకుగాక సత్పాత్రము లకై ప్రజాధనము వ్యయపరచ వచ్చుననికూడ భావము. ఇట్టిదియే సత్యభాషణము. ఆశ హద్దులు మీరి దురాశయై ఫలితముగ ధర్మచ్యుతినొందించును. ద్రోణుని విషయమున ధర్మజునంతటివాడు బొంక సాహసించుట దృష్టి నిడుకొనియే సత్యభాషణమును పునః భీష్ముడు తెలిపినటుల గ్రహింపవచ్చును. తమతమ కర్మలతెరవు తప్పక నాచరించుటయను నుపదేశము ద్రోణ, కృప, అశ్వత్థామలనుగూర్చి భీష్ముడు పల్కెననిపించును. యుద్ధరంగముననున్నప్పుడు సుక్షత్రియుడుగ భీష్ముడును ఆవేశమునందవచ్చును. కాని వంశమున పెద్దగ, నాశనమైన తనవారిని చూచి, అందుకు బ్రాహ్మణులే ప్రధానకారకులగుట స్ఫురింపగనే, యిట్టిది పునఃచర్వితము గారాదని భావించుట ధర్మమూర్తియైన భీష్మునకు సహజమని పించును. అనంతరము పార్వతి మనుజులందు కలిమి లేములు గలిసి వర్ధిల్లుచున్నవి. వాటి విశేషములు చెప్పమనగ, పరమేశ్వరుడు వారివారి పూర్వజన్మముల చేసిన కర్మలఫలమే దానికి కారణమని ఆయాకర్మల ఫలితములను, విశేషములను విపులముగ వివరించినాడు.

అంతపార్వతి ఆయుర్వృద్ధి, క్షయముల కారణములు చెప్పమనిని పరమేశ్వరుడు

తే. క్షమయుసత్యంబుఁగృపయు శౌచమును గురుల, వలనిభక్తియునాయువు పొలుపునిచ్చు
నలుకబొంకుక్రూరత శుచితాపగమము,గురువిరోధమాయువుఁగడుఁగుందఁజేయు-అను-పం-130

తే. తపమునను బ్రహ్మచర్యవ్రతమున హితమి, తాశనమున రసాయనాభ్యాసమునను
బెరుఁగు నాయువాక్రియలపై నరుఁడు ప్రీతి, గలుగుటయుఁబూర్వభవకృత కర్మఫలము-131

కం. తనలావునకధికమయిన, పనిసేయుట యుక్తమునునపధ్యమునగు భో
జనములు హరించునాయువు, వనితయవియుఁబూర్వకర్మ వశతనకలుగున్-132

అని పలికి మరియు సుకృతులు చిరాయువులై అమరలోక నివాసులగుదురు. ఇతరులు నరకగతులై, ఆయువల్పమై మరల మనుజ లోకమున పుట్టుదురని తెలిపెను. అనంతరము పార్వతి పురుష, స్త్రీ విధములు రెంటి యందు జీవుడు వర్తించు విధము తెల్పుమనిన ఈశుడు జీవునకు తాత్వికములైన పురుష స్త్రీత్వములు లేవని, తత్వమున కహంకృతి, కర్మిత్వమొలసియట్లు కార్పించునని, కర్మములకు ఆత్ముడు కర్తగాడని, అతని సత్త్వము, రజస్సు, దమములు, మనుష్యునకు కలుగు వాత, పిత్త, కఫములు పొందినట్టివిగ నుండును మరియు

తే. సత్యశౌచదయాదులు సాత్త్వికములు, రమణి లోభసంగాదులు రాజసంబు
లనృత హింసాపరత్వ భయాలసత్వ, ధైర్యహీని నిద్రాదులుదామసములు -అను-పంచ-140

ఇవి నానాముఖములుగ పురుష వికారమునొందించునని విపులముగతెలిపెను. అంతపార్వతి స్వప్నాద్యవస్థల తెరగు తెలుపుమనిన పరమేశ్వరుడు, స్వప్నమనుననది స్తుప్తజన మనశ్చేష్టితమని, అవి మనోగతములుగాన భావి శుభాశుభ ఫలసూచికములని తెల్పెను. పాపములనిన యెట్టివను పార్వతి ప్రశ్నకు సమాధానముగ ఈశుడు

సీ. మానిని త్రివిధముల్ మానసవాచిక, కాయికంబులఁబాతకంబులందుఁ
బరధనాపేక్షణ పాపానుమోద ధ, ర్మ ద్వేషముఖములు మానసంబు
లనృత దారుణభాషణాదులు వాచిక, ములు వధంబునుబంధమును నభక్ష్య
భక్షణంబుననన్య భామారతము మద్య, పానంబు మొదలైన పాపకృతులు

తే. గాయికంబులు వినుమధికంబపేయ, పానమది దుష్కృతంబులలోననెల్లఁ
బానముననిందతొవచ్చుఁబ్రాణగొడ్డ,ములునుజేటులు నరకాబ్ధిమునుఁగుటలును -174 , పలికెను.

అనంతరము పార్వతి సుకృతములనునవి యెట్టివనినడుగగ చంద్రమౌళి ఔపరిమికము, నిరుపకరణము, సోపకరణమను మూడు విధములు గలవు. ఔపరిమిక మనునది ఆత్మకు సంబంధించిన ఇంద్రియ నిగ్రహమనునట్టిది. దానినే యమ మని చెప్పుదురు. నిరుపకరణమనిన శౌచము, సత్యము, శాంతి, దాంతి, వ్రత నిరూఢి సముపవాసము, బ్రహ్మచర్యము దాని నియమములు అని తెలిపి వివరములను విశ్లేషించి మరియు సోపకరణమనునది గృహమేధులు ఆచరించునట్టిది. ధన, ధాన్య, దానమును, వైదిక, పైత్యకాది పుణ్యకార్యములును, న్యాయార్జితమైన విత్తముతో సల్పుచు, యథాశక్తిన విప్రులను సంతోషపరచునట్టిదని తెలిపెను.

అనంతరము పార్వతి శివునితో దాతవ్యంబులెయ్యవి తెలుపుమని అడిగిన పరమేశ్వరుడు, దానములలోకెల్ల సర్వశ్రేష్ఠములైనవి అన్నము, నీరు. కావున యివి యిచ్చుట వలన దాత అమర లోకమున చిరసౌఖ్యము బొందునని చెప్పెను. మరియు సువర్ణమత్యంత పావనము. గాన తద్దానము సర్వకామప్రదము. గోవు సద్విప్రునకు ఒసంగిన, ఆ గోరోమములన్ని వత్సరములు స్వర్గలోకమున యుండును. అందునా కపిలగోవునొసంగిన దాతయొక్క ఇరువదియొక్క

తరములవారు ఊర్ధ్వ లోకములనుందురు. భూమిదానమువలన దాత భూమియున్నంత కాలము అమరసుఖముల నందునని, అట్టిదానమిచ్చుటవలన అన్నివస్తువులు యిచ్చినట్లే యగును. కన్యాదానమొసంగుటవలన పితృపతి,సురులు సంతోసించి అంచితగతి, అతితేజస్సు, శ్రీయు, యశస్సు దాతకొసంగును. విద్యాదానము చేయుటవలన సత్పాత్రము గలిగి అవ్యయానందమొందెదరు. విద్యను గ్రహించుటకు పేదలను నియోగించుట, ద్రవ్యసహాయ మొనర్చుటయు విద్యాదానమే అగును. తిలరాశి దానము అగ్నిష్టోమ ఫలమును, వస్త్ర దానము చిరాయువును, ఛత్రదానము అఖిలపీడల తొలగింపును, దాస దాసీజన దానము కర్మమోక్షము, దీపదానము నిఖిల వ్యసన విరాగతము, తెరవు లెస్సచేయుట సంతానమును, ఔషదములనిచ్చుట ఎల్ల రోగనివారణమును, తెరువరికి ఆశ్రయమిచ్చుట, తను సుఖములను బడయుదురని విపులముగ వివరించెను.

అనంతరము పార్వతి యజ్ఞముల తెరవెరింగించమని అడుగగ ఉమాపతి

సీ. వినుమింతి వైదికంబునులౌకికంబును, ననరెండుదెఱఁగులు యజ్ఞవిధులు
వర్ణ యోగ్యార్జనవర్ధనాంచిత ధన, ధాన్యముల్‌గొని దేవతలకుఁదృప్తి
యగునట్లుగా ఋత్విగర్చనమొప్పఁగాఁ, గావించునది వైదికంబు దేవ
తలకు మహోత్సవంబులు సేయుటయు గీత, వాద్య నృత్తములనవద్యములుగ

తే. సంఘటించుటయును సద్గంధమాల్య ధూ, పప్రదీప భోజ్యభక్ష్యములు, స
మాదరంబుతో నివేదించుటయు లౌకి, కంబు రెండునమరగణహితములు -అను-పంచ-198

తే. ధర్మములుదానములును సద్వ్రతచయంబు, సదృశములుగావు వినుము యజ్ఞమునకరయ
యజ్ఞకర్త లోకోత్తరుండతనికిచ్చు, టతనిచేఁగొనుటధిక పుణ్యములు చెలువ-199

అని యజ్ఞ విధులను తెలియపరచెను. అనంతరము పితృవిధులను తెలియపరచుచు శివుడు పార్వతితో, గంగాప్రదేశము, గయ, కురుక్షేత్రాది పుణ్యస్థలములలో, మాఘ, భాద్రపద మాసములందు బహుళపక్షమపరాహ్ణము, అమావాస్య, నవమ్యాది తిథులందు పైతృకముసల్పిన పితృదేవతలు తుష్టినిపొందుదురని తెలిపి, తదుక్తమైన పదార్థములను, యుక్తాయుక్త పాత్రములనుకూడా వివరించెను. అంత పార్వతి శివునితో ధర్మ విశేషంబులెరిగించమని అర్ధించగ, ఈశానుడు ధర్మములు నానావిధములుగనుండునని, అందు ముఖ్యముగ జాతిధర్మములు, దేశిజధర్మములు, కులధర్మములు, గణధర్మములు, ఆపద్ధర్మములని ఐదువిధముల శ్రుతి, స్మృతులచే చెప్పబడినవని తెలిపెను. అనంతరము శివుడు పార్వతితో పుణ్యలోక భోగములు విశేషములు, సుగతి, దుర్గతి గుణ వివరణములు, సాంఖ్య ప్రకారంబు, ఆత్మసాయుజ్యప్రాప్తి సాధనములు తెలుపగ, పార్వతి, శివునకు పతివ్రతా ధర్మములు, పతివ్రతకనర్హమైన ధర్మములు తెలిపెనని భీష్ముడు ధర్మజునకు తెలుపగ,అతడు సోదరసమేతుడై హర్షాతిశయమునొందెను. ఈ శివపార్వతి సంవాదము మూలమున గలట్టిది. కొన్ని చోటుల భావమును గ్రహించి యథామూలముగ తిక్కన రచించినాడు.

అనంతరము ధర్మజుడు పరప్రాప్తి ఏవిధముగ సమకూరునని భీష్ముని ప్రశ్నించగ, అతడు నారాయణధ్యాన, పూజ, స్తుతి, తత్కథాశ్రవణమున పొందవచ్చును. మరియు విద్వజ్జనార్చనవలన కల్మషములు బాపునని ఉదాహరణముగ కథనమొకటిట్లు తెల్పెను. వేశ్యయొకతె విద్వాంసునొకరిని ప్రుచ్చని తెరువరులు బాధించుచుండగ, ఇతడు మావాడు, యీతనినేల బంధించుచున్నారని వారలకు నచ్చచెప్పి అతనిని విడిపించెను. ఆ సుకృతమున మరుజన్మమున ఆవేశ్య బ్రాహ్మణియై జన్మించెను. గావున విద్వజ్జనులనర్చింపుమని ధర్మజునికి హితము చెప్పెను.

అంత యుధిష్ఠురుడు దారిద్ర్య, వ్యాధి, శోకంబులకు శాంతి సంపాదింపగలట్టి జపంబెయ్యది సెలవియ్యమని భీష్మునడుగగ, అతడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను, వినాయక, దిక్పాలక చంద్రాదిత్యులను, గంగాది మహానదులను, వసురుద్రాది దేవతలను, పితృదేవతలను, వాలఖిల్యాది సిద్ధులను, వ్యాస, వాల్మీక, నారదాగస్త్యాది మహామునులను, ధర్మ, తపస్సత్యములను, అహోరాత్రములను, కాశీ, కురుక్షేత్రాది పుణ్యక్షేత్రములను స్మరించి, నమస్కరించి, ఆయురారోగ్య, ఐశ్వర్యాదు లొసగవలెనని కోరుకొని ఓం నమోభగవతే వాసుదేవాయ నమః గాగల విష్ణునామములు పఠించుట మహాజపమని తెలిపెను. ఇట్లు చేయుటవలన పాపములు, భయములు, ఆపదలు దక్కి శుభములు పడయుదురని ధర్మజునకుతెల్పెను. అనంతరము భీష్ముడు ధర్మజుని ప్రశ్నములపై, విష్ణుమంత్ర ధ్యానము, విష్ణునామ ప్రభావమును వినిపించెను. (విష్ణుసహస్రనామస్తోత్రము మూలమున గలదు) అనువాదమున తిక్కన విడచినాడు. ఇది యథామూలము.

అంత ధర్మజుడు పూజా నమస్కారములకు ఎవ్వరు భాజనంబు వివరింపుమని అడుగగ భీష్ముడు

సీ. పూజానమస్కారములకుఁబాత్రములు బ్రా, హ్మణులు వారలకుఁగీడాచరించి
వాసవుండును జెడు వారిసంతతమున, నఖిలశుభంబులునావహిల్లు
ధర్మసేతువులోకధారకంబఖిల శా, స్త్ర ప్రవర్తకము విప్రవ్రజంబు
దపమునువాక్కును ధనము విప్రులకొక్క, కుడుపుమాత్రన పాపకోటిఁబాతు

తే. రమ్మహాత్ములు సొప్పరులఖిలమార్గ, ములకు వినుదేవతలుదేవతలకు బాలుఁ
డజ్ఞుఁడనలేదు పూజకునర్హులనిన, నధిపవృద్ధులఁబ్రాజ్ఞులనడుగనేల-అను-పంచమ-**336** అని పలికెను.

మరియు ధర్మజుని ప్రశ్నములపై బ్రాహ్మణ విశిష్టత్వమునకుదాహరణముగ పవన, కార్తవీర్యార్జున సంవాదమును భీష్ముడిట్లు తెల్పెను. కార్యవీర్యార్జునుడు బహుపరాక్రమమున ఉజ్వలముననుండి మత్సములెవ్వరులేరని గర్వమున వర్ధిల్లుచుండగ, భూతమొకటి ఆకసమునందుండి ధరామరులు నీకన్న అధికులని పల్కిన, సహస్రబాహు డందులకు వారలు రాజులు నాశ్రయించి బ్రతికెదరు. పుడమి రేనికంటె వారెట్లధికులనినంత, వాయుదేవుడు గగనమునుండి అచటకు చనుదెంచి తన్నెరింగించుకొని, అతనితో భూదేవుల శక్తివలననేగదా రాజులు ప్రజారక్షణ మొనరించుచున్నారు. వారికన్న అధికులు గలరా! అని పలికి మరియు అహల్యకైవచ్చిన ఇంద్రుడు గౌతమునిచే శపింపబడినాడు. అగస్త్యుడు అంబోధిని త్రాగినాడు. అగ్ని భృగుమహామునిచే శపింపబడినాడని తెలిపిన, మారు మాటలాడకయున్న కార్తవీర్యార్జునునితో మరల ఉచథ్యుడను మునిపత్నిని వరుణుడు కామించి నిజగృహమునకు గొనిపోవగ అతడు అంబుధినంతటిని త్రావి వరణపురమింత ధూళిసిక్తమొనరించుటగని వరుణుడు భయపడి ఉచథ్యునకు ప్రణమిల్లి పత్నినప్పగించినాడు మరియు అమరులసురులకు ఓడివచ్చి అగస్త్యుని శరణుజొచ్చిన అతడు విజయము నొసగినాడు. మరినొకపరి సురాసుర యుద్ధమున రాహునస్త్రసమితిచేత చంద్రాదిత్యులిరువురు సొలసిన, వెలుగు కరవై అమరులు అత్రిమహాముని శరణుజొచ్చిన, ఆతండు చంద్రాదిత్య తనువులక్షతములగ జేసి అసురుల నిర్జించెను. కావున వీరలకన్న రాజులు మిన్నందువా! అని ప్రశ్నించి కార్తవీర్యార్జునునకు బ్రహ్మణత్వమహిమలుద్భో దించెను. అంతనాతండును తెలివంది భూసుర పాదపంకజములనర్చింతునని తదాచరణమున కృతార్థుడయ్యె.

అనంతరము ధర్మజుడింకను బ్రాహ్మణప్రభావంబు వినవలయునను కోరిక వెలిబుచ్చగ భీష్ముడు తాను శక్తిహీనుడనైతినని, కావున శ్రీకృష్ణనడుగమనిచెప్పి, శ్రీకృష్ణ ప్రభావమునుపన్యసించెను. అంతధర్మజుడు శ్రీకృష్ణ నడుగగ, అతడు తొల్లి ఈ విషయమై ప్రద్యుమ్నుండడిగిన తాను చెప్పిన విధమునిట్లు తెలిపెను.

సీ. వర్గత్రయమునపవర్గంబుసాధింప, సమరపితృప్రీతులాచరింప
నైహిక సుఖములుపార్జింపవలసిన, వారికి విప్రులచేరుగడలు
దివిజులకైన నాయువుశ్రీయుఁగీర్తియుఁ, దనరుటతత్ప్రసాదమునఁజూవె
యలిగి భస్మముసేయవలచి పెంపొసఁగంగ, నవనీసురులు శక్తులట్టలగుట

తే. వారిఁగోపింపఁజేయక వారలకుఁ బ్రి,, యంబుసేయుచు వారు ప్రహర్షమొందఁ
దనకుఁగలభంగినిచ్చునతండు రెండు, భువనములయందుఁ బెంపును బొగడుఁబడయు-370

మరియు యిందులకుదాహరణముగ దూర్వాసునిచే తాను పరీక్షింపబడి అనుగ్రహింపబడిన తెరగు వినిపించెను. అంత ధర్మజుడు దూర్వాసుడు శంభు సంభవుడని విందుము. కావున శర్వుని మహిమ తెలుపమని వేడగ, శ్రీకృష్ణుడు త్రిపురాసురులు త్రిభువనములను బాధించుచుండగ దేవతలాదిగాగల మునులు ఈశ్వరుని ప్రార్థించగ ఈశానుండొక్క అస్త్రముసంధించి అసురులనునిర్జించెను. అనంతర మాశరము నరకమునబడి బాలునిరూపై యుండుటచూచి అతనికి దూర్వాసుడని నామమిచ్చినటుల దూర్వాసుని వృత్తాంతమునుతెలిపి, శివనామ నిర్వచనమును యెరిగించెను. ఇది యథామూలము. అశ్వత్థామను చంపక విడిచిన ఘట్టము ధర్మరాజాదుల బ్రాహ్మణ భక్తికి నిదర్శనము. అనంతరము ధర్మజుడు శాంతనవునితో ధర్మసూక్ష్మ ప్రకారమెరింగించుమని కోరగ, అతడు ధర్మములనేక విధములని కాలపరిపాకమునవి తెలియబడగలవని పలికెను.

187. ఈ సందర్భమున భీష్ముడు ధర్మజుని సంబోధించిన తీరు గమనార్హము.

కం. శ్రుతముఁబరిత్యాగముఁగల, మతిమంతులనడుగు లోభమదమోహసమా
వృతబుద్ధులుగాని సమం, చితచరితులవలనఁదెలియు శీలనిరూఢా -అను-పంచమ-412

కం. కామార్థంబులు మోహో, ద్ధామత కృత్యంబులనియెదంగని ధర్మ
స్తోమమునఁదగులు జనముల, చే మేలుగ నెఱిఁగికొనుము సిద్ధవివేకా -అను-పంచమ-413

చలింపని ఉత్తమప్రవర్తనము, వివిధ సందర్భముల మనోక్షోభకారణమున అపార్థమొనర్చుకొని, ధర్మభ్రష్టుడు గాకుండుటకు తగిన నిలకడల వివేకముగలవాడని భీష్ముడు ధర్మజుని ప్రసంశించుట గమనార్హము. ఇది తిక్కన కల్పితము. అనంతరము సాధు, అసాధులననెట్టివారు? యెరింగించమని వేడగ భీష్ముడు

సీ. తమయంతనెఱుఁగరు ధర్మంబుసదుపదే, శముననుగానరసాధుజనులు
ధర్మ బోధంబివ్విధములు రెంటను, గలిగెడువారు సాధులుదదీయ
చరితంబు విను విడువరు మలమూత్రంబు, లర్హంబుగానిచోనధిప యతిథి
భోజనశిష్టాన్నభోజులుదెరువిచ్చి, తగినవారలకుఁ బ్రదక్షిణముగ

తే. నరుగుదురు నడుపుదురు సత్కార్జవములు, శరణుసొచ్చినఁ గాతురు సురతగుప్తి
పరులు నిజదారతృప్తులు గురువినీతు, లమలహృదయులు సంతోషమారఁగలరు-అను-పం-426

వ. అని వెండియు-427

తే. సాధులింద్రియ విభ్రాంతిసంహరింతు, రఘుముదెలిసి ప్రాయశ్చిత్తమాచరింతు
రప్రకాశంబుగా ధర్మమాచరింతు, రఖిల భూతదయాళుత్వమారఁగలరు-428

అని తెలిపెను. అనంతరము ధర్మజుడు అప్రయత్నములకు అర్ధము సిద్ధించును, ప్రయత్నితులకు సిద్ధింపదు, ఉండియు భోగములకుపయోగ్యములందవు. కొందరకు శిక్షలేకయే విద్యలలవడును. శిక్షితులయ్యు నిర్విద్యులగుటయు మొదలగు వాటికి కారణమేమమని భీష్ముని ప్రశ్నించగ, పూర్వజన్మ కృతపుణ్య పాపంబులచే అట్టివి సంభవించునని విపులముగ భీష్ముడు వివరించినాడు. ఇది యథామూలము.

188. అనంతరము ధృతరాష్ట్రునిపట్ల ధర్మజుని పితృభక్తి నిజమైనదని, భీష్ముడు ధర్మజుని ఉత్తమత్వమును ధృతరాష్ట్రునితో వివరించుట గమనార్హము.

తే. ఏనెఱుంగుదునితఁడు నీయెడఁ బ్రియంబు, భక్తియునుగల్గి యక్రూరభావుఁడగుట
నీవు వత్సలత్వమున నీనృపతిఁబంచి, పనులుగొనుము కౌరవకులభారధుర్య-అను-పం-458

అంత వ్యాసుడు భీష్మునితో నీవొనరించిన ధర్మోపదేశములవలన ధర్మజునకుగల శంకలన్నియుతీరి నీదయకు పాత్రుడయి ప్రాజ్ఞుడయ్యెను. కావున యిక వారల కనుజ్ఞనిచ్చి నిజపురమునకంపుమని పలుకగ భీష్ముడు ధర్మజాదులకు కరిపురమునకు పోవుటకనుజ్ఞనిచ్చెను. తదనంతరము మాఘశుద్ధ ఏకాదశి దినమున ధర్మజుడు శ్రీకృష్ణాదులను, ధృతరాష్ట్రాది బంధువర్గమును, పుర పురోహితముఖ్యులను వెంటనిడుకొని భీష్ముని పాలకింబోవ, ఆతడు ఆనందాతిశయములతో వారలను కనుగొని, శ్రీకృష్ణుననుజ్ఞవడసి నాకలోకగతుడయ్యెను. అంత ధర్మజుడు భీష్మునకగ్ని సంస్కారము గావించి పితృమేధమొనరించినాడు. ఇది యథామూలము.

189. భీష్ముని మరణానంతరము దుఃఖితయై కాన్పించిన గంగాదేవి పల్కులు గమనింపదగినవి. మహాపరాక్రమశాలి, దిగంతముల వ్యాపించిన కీర్తివంతుడగు భీష్ముని ప్రశంసించి, శిఖండి కారణమునాతడు మరణించుటచే శోకించి వ్యంగ్యముగ, ధర్మజుని అధర్మయుద్ధ విధానమును నిరసించినట్టయినది.

తే. అంతవాఁడు శిఖండిచేనట్టులగుట, గనియు బెక్కులు పఱియలుగాక యునికి
కతనఁజేసి వజ్రమయంబుగాఁగనోపు, నని తలంచెదనాడెందమన్నలార -అను-పంచమ-477

అందులకై గంగాదేవిని శ్రీకృష్ణుడూరడించినను, ధర్మజుడు భీష్మునకెదుట శిఖండిని నిలుపుట ధర్మయుద్ధమా? అధర్మయుద్ధమా? అను విషయము వివరింపకపోవుట గమనార్హము. ఇది మూల భావమును గ్రహించి తిక్కన రచించినాడు.

==========



అశ్వమేధపర్వమున చారిత్రక నేపథ్యమెరుంగని విమర్శలో, ఈ పర్వగత భారతీయ సంస్కృతీ ధర్మసూక్ష్ములను గ్రహించుట కూడ కష్టసాధ్యమే. సింహాసనమునకేయనుడు, లేదా ధర్మస్థాపనకేయనుడు మహాభారత సంగ్రామము జరిగినది. ధర్మజుడు కురురాజ్య రాజసింహాసనమధిష్ఠించినాడు. ఇంతవరకు జరిగినదొకయెత్తు, భారతయుద్ధమున ఫాల్గొనిన శత్రుమూకలు సంహరింపబడిన మాట వాస్తవమే. అట్లని దేశమున పాండవవ్యతిరేకత భావింపరాదు. దుర్యోధనునకు సహకరింపవచ్చిన రాజులు మరణించినను వారి వారసులు, వారి వారి రాజ్యములలోనుండి తమ పితృ హంతకులైన పాండవులపట్ల ఆరని వైరముతోడనే యున్నారని భావించుట సమంజసము. అట్టిరాజ వర్గముల బలము, తత్కాలమున ఎంత మాత్రముగనున్నదో, తెలుసుకొనుటకూడ ధర్మజ కర్తవ్యములలోనొకటి. అందులకవకాశ మిచ్చునట్టిదీ అశ్వమేధము. అటుపై లక్ష్యములను దృష్టినిడుకొనియే రాజకీయ దురంధరుడైన శ్రీకృష్ణుడు అశ్వమేధ నిర్వహణమునకై ధర్మజుని ప్రోత్సహించినటుల భావించుట అసమంజసముకాదని భావింతును. కనుకనే ఈ పర్వము ధర్మజ చరిత్రమున ప్రధానఘట్టమే అగుచున్నది. ఇట్టి సూక్ష్ములు దృష్టినందిడుకొని ధర్మజ శీల వివరణమునకవసర మైనంత మేర వివరింతును. అశ్వమేధ పర్వ ప్రథమాశ్వాసమున ధర్మజుడు, భీష్మునకుదక కర్మలాచరించి ధృతరాష్ట్ర పురస్పరముగ భాగీరథి యుత్తరించి తత్తీర దేశమున

ఉ. ఉమ్మలికంబున బొగులనుల్లముతోఁబొరిలోచనంబులం
గ్రమ్మఁగనశ్రువారి ధృతిగౌరవమేధ మహోగ్రబాణ పా
తమ్మున మ్రొగ్గ నేనుఁగువిధమ్మున నేలకువ్రాలఁబట్టి వె
గమ్మ వృకోదరుండు మురఘుస్మరుపంపుననమ్మహీశ్వరున్ –అశ్వ–ప్రథమ–3

అట్లు ధర్మజునిపట్టి పైచీరపరచి భూమిపై నిడగ అర్జునాదులు వగచుచుండ, శ్రీకృష్ణుడు ఉచిత వచనముల ధర్మజునకు ప్రబోధించెను. ఇది యథామూలము.

190. అంత ధృతరాష్ట్రుడు ధర్మజునితో

సీ. క్షత్ర ధర్మంబునఁగైకొంటి మేదిని, యుమ్మలికింపక లెమ్మువత్స
యనుజవర్గము నీవుననుభవింపుము శోక, కాలంబుగాదిది యేలవగవ
ననిపల్కి విదురహితాలాపములు దన, వినకుండుటయు సుయోధనుని కీడు
నద్దుష్టబుద్ధిఁదాననుసరింపఁగ ధర్మ, మెడలినకతమున నింతపుట్టె

ఆ. ననియుఁదెలియనాడి తనకు గాంధారికి, వగలుమిగులఁబొగుల వలయుటయును
నుగ్గడించి మమ్మునొంటివగ్గులఁగనుం, గొనుము వంతదీర్పుమనియె నధిప–అశ్వ–ప్రథమ–6

అని పలికెను. పై పద్యము మూలశ్లోకములకు యథానువాదములైనను, మూలమున ధృతరాష్ట్రుడు పల్కినట్టి విదురుని మాటలు అనువాదమున తిక్కన విడిచిపెట్టినాడు. ఇట ధృతరాష్ట్రుడు ధర్మజునుచితోక్తులతో ఊరడించుచు జరిగిన పరిస్థితిని, తన ప్రస్తుత స్థితిని తెలియపర్చినాడు. అనంతరము శ్రీకృష్ణుడు ధర్మజునితో బంధువులు శోకించినచో మృతులైన వారికి పరితాపమావహిల్లునని, వారలందరూ ఊర్ధ్వలోకములనందరిని, వారలకై శోకించుట తగదని పలికి మరియు శాంతనవుని వాక్యములు స్మరించుకొని శాంతిని పొందుమని వ్యాస నారదాది మునుల వాక్యములనిట్లు పల్కెను.

చం. అతులిత దక్షిణాన్విత మహాధ్వరకర్తవుగమ్ము దేవతా
పితృనివహంబులంగరముప్రీతియుభక్తియునుల్లసిల్లన
ర్చితములుసేయుముర్విఁబ్రజఁజేకొని రక్షఘటింపు బంధు సు
స్థితులొనరింపుమెప్పునతిథిప్రజపూజలొనర్పు భూవరా -10 , అని పలికెను. ఇది యథామూలము.

191. ధర్మనందనుడు సత్యవతేయునీక్షించి పితామహా, కర్ణులనుచంపిన క్రూరకర్మకు శాంతియెట్లగునని ప్రశ్నించెను. అంత వ్యాసుడు అధిక దక్షిణాన్వితముగ అశ్వమేధాధ్వరమనుష్ఠించి చిత్తతాపమును, అఘమును పోగొట్టుకొనమని పలికిన సాత్యవతేయునితో

చం. అనవిని యమ్మునీశ్వరునకానృపుఁడిట్లను నశ్వమేధ యా
గనిరతి భూమిపాలుగతకల్మషఁజేయఁగఁజాలు నాఁగ ము
న్నును వెడవింటి సజ్జనమనోజ్ఞ వచోమహనీయ నీవు సె
ప్పిన పలుకూఁది యాక్రతువు ప్రీతినొనర్చెద నెల్లభంగులన్ -అశ్వ-ప్రథమ-13

అని ధర్మజుడు పలికి దానికివలయు ద్రవ్యము ప్రస్తుతము తమవద్ద లేమింజేసి వలయు కార్యమేమని వ్యాసుని ప్రశ్నించగ, అతడు మరుత్తుడను రాజు ద్రవ్యము సంపాదించిన తెరగు ధర్మజునకిట్లెరుక పరచినాడు. మనువంశమున బుట్టిన కరందముడను రాజు అధికనిష్ఠచే తపమాచరించి ప్రజాపాలన మొనర్చి, అంగీరసుని ఉపద్రష్టగ బడసి అశ్వమేధము నిర్వహించి ఉత్తమగతులు బడసినాడు. అతని మనుమడు మరుత్తుడనువాడు అశ్వమేధము చేయదలచి అంగీరసుని (బృహస్పతిని) ఉపద్రష్టగనుండుమని కోరగ అతడు నిరాకరించిన, వ్యాకుల మనస్కుడై జనుచున్న సమయమున నారదుడెదురుపడి అతని మనోగత కారణమరసి, అతనితో అంగీరసుని మరియొక పుత్రుడగు సంవర్తకుని జాడదెలిపి, ఉపద్రష్టగ బడయుమని తెలుపగ, అతడట్లెజేసి సంవర్తకునితో యాగమునకు వలయు ద్రవ్యమెట్లు సమకూరునని అడుగగనాతడు హిమపద్గిరి చేరువన ముంజవంతమను పర్వతము గలదు. అట మరుద్గణ సమేతులై, శివపార్వతులు వసించియుందురు. వారి కటాక్షమునజేసి ధనము బడయుదమని తెలిపి, భారవాహకులను సమాయత్తమొనర్చుకొని హిమవంతంబునకు చని, హరుని పూజార్చనలచే ప్రసన్నము చేసుకొని, అట నిక్షిప్తములైన పసిడి వలసినంత తెచ్చుకొని మహానందభరితముగ అశ్వమేధారంభముజేసి దేవతలను, విప్రులను తృప్తులను జేసి ఉత్తమగతులనందినాడని మరుత్త చరిత్రంబును దెలిపి, అట్లే మనమును హిమవంతమ్మునకు చని ఆ దేవదేవుని ప్రసాదపాత్రులమై, యాగముఫలవంతము గావించుకొందమని పల్కెను. ఇది యథామూలము.

అనంతరము ధర్మజునకు శ్రీకృష్ణుడు అంతఃశత్రుల విషయమై మనస్తాపోపశమనములగు వాక్యములను తెలుపగ వ్యాస, నారద, దేవతాదిగాగల ఋషులను ధర్మజునకుచిత రీతిని హితముపదేశించిన ధర్మజుడు శోకమోహ విగతుడై, వ్యాసునితో ఆ ద్రవ్యము తెచ్చు కాలమున మీసహాయమొసంగవలెనని పలికి వారలను అత్యాదరమున వీడ్కొల్పి, గంగా సన్నిధిన కొంతకాలముండి పితామహాదిగాగల నిజ బంధు, గురు, సోదర, రణమృతులకు యధావిధిన శ్రాద్ధకర్మలు, నానావిధ దాన విధులను నిర్వర్తించి కృతకృత్యుడై ధృతరాష్ట్ర పురస్పరముగ, శ్రీకృష్ణ, సోదర సహితుడై కరిపురమునకు మరలివచ్చి, సర్వంసహా పాలనాదురంధురుడయ్యెను. ఇది యథామూలము.

ఇట మూలమున ధర్మజరాజ్యపాలనము విపులముగ వర్ణితము. తిక్కన విడిచిపుచ్చినాడు.

192. అంత శ్రీకృష్ణార్జునులింద్రప్రస్థముననుండిరక్కాలమున శ్రీకృష్ణుడర్జునునితో,

సీ. సమరంబు ధర్మవిజయపరికీర్త్యంబు, గాఁజేసి భూమినిష్కంటకముగఁ
బాలించుచున్నాఁడు ప్రజప్రీతినొందంగ, విద్వజ్జనంబులు వివిధసుఖము
లనుభవించుచుఁదన్ను వినుతింపనెగడెడు, శాంతియు సమతయు సకలజనముఁ
గొనియాడు సిద్ధులు మునులు సేవింతురు, ధర్మనందనుఁడిట్లుదాత్తుఁడగునె

తే. యతనికున్నతిగావించిరనిలజుండుఁ, గవలునెంతయు నీచేతిగాండివంబు
లీలగల్గి మహాధర్మశాలిసత్య, నిత్యుఁడమ్మహీపతి గృతకృత్యుఁడయ్యె **-అశ్వమేధ-ప్రథమ-144** అని

పలుకుట గమనార్హము. ఇట మూలమునగల భావమంతటిని సంకీర్తీకరించినాడు తిక్కన. శ్రీకృష్ణుడంతటివాడు ధర్మజపరిపాలనా వైభవములనుగ్గడించుచు, అందతను కృతకృత్యుడైనాడని **తెలుపుట ధర్మజపాత్రమునకెనలేని శోభనాపాదించినట్లయినది.**

193. మరియు తాను ద్వారకకు పోవలెనని, అందులకు ధర్మజానుజ్ఞవడయు వలెనని పలుకుచు,

తే. అవ్విభుఁడువోయివత్తుగాకనక పోను, మేనుఁబ్రాణంబుఁదనయులు మిత్రగణము
బంధులునునర్ధచయము నప్పార్థివేంద్రు , నొమ్ము తదనువర్తనము వ్రతమ్ము నాకు **-148 ,**

శ్రీకృష్ణుడు ధర్మజునిపట్ల తనకుగల అనురక్తిని తేటతెల్లము జేసినాడు. ఇది మూలమున లేనట్టిది. తిక్కన భావమును గ్రహించి కల్పించినాడు. అనంతరము శ్రీకృష్ణుడు అర్జునుని తత్వజ్ఞానస్థిరమునకై ప్రథమాశ్వాసాంతమున, ద్వితీయాశ్వాసము నందంతటను వివిధములైన తత్వజ్ఞాన విషయములనేకములు తెలిపెను. ఇందలి విషయములు మూలమున గలవు. తృతీయాశ్వాసారంభమున శ్రీకృష్ణుడు తాను ద్వారకకరుగ వలయునని అర్జునునితో పలికి అందులకు ధర్మజానుజ్ఞవడయ వలెనని కరిపురంబున కరుదెంచి ధర్మజునికి తెలుపగ, అతడు ముదమొంది, ద్వారకలోగల యెల్లవారి క్షేమమును పేరుపేరునా అరయమని చెప్పి, అశ్వమేధ సమయమునకుబంధువర్గ సహితులై రావలసినదని శ్రీకృష్ణునకు విన్నవించి వీడ్కొల్పెను. ఇటమూలమున శ్రీకృష్ణునితో ధర్మజుడు అందరి యోగక్షేమము లడిగినట్లు గలదు. కాని యోగాహ్వానము గావించినటుల లేదు. తిక్కన కల్పించి సాంప్రదాయమును నిలవెట్టినాడు.

అనంతరము కొంతకాలమునకు వేదవ్యాసుడు వచ్చినతోడనే అతనితో యాగవిషయ ధన ప్రస్తావనజేసి, సోదరసహితుడై హిమవద్గిరికేగి, అట వ్యాసుని పనుపున పసిడినిధికి అర్చనచేసి ధనమువడసి, నిజపురికి చేర్చు సాధనములపై సమాయత్తమొనర్చి, కరిపురికి తిరిగివచ్చెను. అంత శ్రీకృష్ణుడు యాగసమయమాసన్నమైనదని తెలుసుకొని బంధువర్గ సమేతుడై కరిపురమునకు విచ్చేసిన సమయమున ఉత్తర ప్రసవించుట, బాలుడు మృతుడై యుండుట తెలిసి, శ్రీకృష్ణుడు గురుపుత్రుని అస్త్రమాయను నిరుపయోగము గావించి, పరీక్షిత్తుని పునర్జీవితునిగా జేసి అందరికానందము కల్గించినాడు. అనంతరము వేదవ్యాసుడు, శ్రీకృష్ణ సమేతులైయున్న పాండవుల కడకేతెంచి అశ్వమేధయాగ క్రియాకలాపము ఆరంభించుమని తెలుపగ ధర్మజుడు

చం. ఆనవుడుఁబ్రీతినొందియతఁడచ్యుతుఁగన్గొని భవ్యమైనయి
ప్పనిదగనిట్లుసేయుమనిపన్పుము తల్లియుఁదండ్రియున్ గురుం

డును సచివుండునిష్టసఖుఁడుంగరుణాకర నీవమాకు నీ

యనుపమముఖ్యవృత్తి జగమంతటికిన్‌గతి వేయునేటికిన్ -అశ్వమేధ-తృతీయ-210

అని శ్రీకృష్ణుని స్తుతించినటుల కాన్పించును. ఇది తిక్కన కల్పితము. అంత శ్రీకృష్ణుడు ధర్మజునకు సమాధానముగ

ఉ. వ్యాసులుపంచినట్లనియమాద్యతఁజేయుదమశ్వమేధముం

జేసి కృతార్థతంబొరసి చిత్తమునెవ్వగయెల్లఁబాచికొ

మ్మాసుకృతంబు ధర్మనిచయప్రవరంబనియేనచెప్పి కా

దే సుగుణాభిరామ నినుదీనికిఁజొన్పితిమున్ ధృధంబుగన్ -212

ఇది తిక్కన కల్పితము. మూలభావమును గ్రహించి రచింపబడినది.

చం. అనుమతియింకవేఱపడయందలఁపేటికిఁగౌరవేంద్ర న

న్బనుపుము వాజిమేధకరణంబున కేపనిసేయువాఁడనీ

యనుజులునల్వురేనొకఁడనధ్వరకార్యంబులెల్ల నీదు నె

మ్మునమునకెక్కఁజేయుదుము మాన్యచరిత్ర తొడంగుమర్ధితోన్ -213 ఇది యథామూలము.

అంత ధర్మజుడు సమ్మోదమందిన చిత్తముతో శ్రీకృష్ణుని అభినందించి, వ్యాసునితో యజ్ఞమునారంభించ వలసిన దినమును సెలవిమ్మని వేడగ, అతడు చైత్రమాస పౌర్ణమినాడు యజ్ఞదీక్ష గైకొని అశ్వమును భూప్రదక్షిణమునకై విడువ వలయుననియు మరియు పైల, యాజ్ఞవల్క మహామునులతోకూడి తాను యాగాధ్వర్యము వహింతునని పలికి తదవసరమగు అశ్వమునకై అశ్వపరీక్షకులను రావించి నియోగించమని, యాగసంబంధ ఉపకరణములను కనకమయాన్వితముగ చేయించమని తెల్పెను. అంత ధర్మజుడు అశ్వపరీక్షకులచే ఉత్తమాశ్వమును, కర్మాధికారులచే సువర్ణమయ యాగోపకరణములనుతెప్పించి వ్యాసునకు సమర్పించి, అశ్వరక్షకునిగ సోదరులలోనెవని నియోగింతునని వ్యాసుని అడుగగ, ఆతడు దివ్యాస్త్రశస్త్రవిదుడగు పార్థుడు అశ్వవ్యాపన క్రియకు సమర్థుడని పలికి మరియు భీమసేన, నకులులను రాష్ట్ర రక్షణకు నియమించి, కుటుంబ కార్యములు నడుపుటకు సహదేవుని నియోగించమని తెలుపగ ధర్మజుడట్లెయొనర్చి గాంధారీ, ధృతరాష్ట్రులయనుమతి బడసి, కుంతిచే సమనుజ్ఞాతుండై అశ్వమేధ మఖంబునకున్ముఖుండయ్యెను. చతుర్థాశ్వాసమున అర్జునుడు ధర్మజ పనుపున త్రిగర్తాది నానాదేశరాజులను యుద్ధమందోడించి, అశ్వభ్రమణమునకు నిరాటంకమొనర్చినాడు. ఇది యథామూలము.

అంత మాఘశుక్ల పౌర్ణమసి దివసమున అర్జునుడు అశ్వవిజయముతో కరినగరమునకు తిరిగి వచ్చు చున్నాడను వార్త చారులవలన విని ధర్మజుండు అమితానందమొంది, భీమని రావించి అధ్వరమునకు వలయు చతుశ్శాల, మంటప, విడిదిగృహాదుల నిర్మాణముచేపట్టమని, నానాదేశరాజులకు యెల్లవిప్రకులంబులకు ఆహ్వానము లంపుమని నియోగించెను. అనంతరము అర్జునునిరాక దూతవలన విని శ్రీకృష్ణ, ధృతరాష్ట్ర ,సర్వబంధు పురస్పరముగ విజయునకెదురేగి స్వాగత సత్కారములనుసలిపి పురప్రవేశమొనరించినారు. అంత అర్హదినము సంప్రాప్తంబగుటం జేసి వ్యాసుడు ధర్మజునితో అశ్వమేధావభృథంబు పరమపావనంబు సమస్త దురిత పరిహరణ నిపుణంబు, నీకు భారతరణకృతజ్ఞతివధంబు పాతకంబను మెరమెర మనంబునం గలిగియుండునట్టివి యెల్లను దీన నిస్తుషంబులగు సమస్త శుభంబులు నావహిల్లు నని విన్నవించెనంత ధర్మజుడు యజ్ఞమును.

కం. ప్రయుతుండై హయమేధ, క్రియాకలాపంబునకుఁబ్రకీర్త్యముగాఁజొ
చ్చి యుదాత్తభంగి జనమే, జయభూవర నడపెగాధ సంప్రీతిమెయిన్-అశ్వ-చతుర్థ-172

కం. క్రమయుక్తముయుక్తముఁగా, నమరగురుప్రతిములైన యాజ్ఞికులు క్రియా
సముదయము నడఁపగా స్థలి, తములేకపహూతము సొరక తత్క్రతువొప్పెన్-173 , ఆచరించెను.

ఇట వ్యాసుని పలుకులు మూలమునలేవు. తిక్కన తెనుగు ధర్మజుని యజ్ఞలక్ష్యమును మరియొకపరి వ్యాసముఖమున ధ్వనింపజేసినాడు. అనంతరము విప్రవరులకనేక దాన,ధర్మములొసంగి యజ్ఞదక్షిణగ వేదవ్యాసునకు ధర్మజుడు తనరాజ్యమునంతటినియొసంగగ, అతడందులకు అంగీకరించక విప్రులకు కనకమయమగు ద్రవ్యము గొనుటయందే అశక్తిమెండు, గావున అట్లొనరింపుమని పలికిన ధర్మజుడిట్లు పలికెను.

ఆ. అశ్వమేధమునకునార్యులు దక్షిణ, ధరణియంద్రుగాన నరునిచేత
విజితయైనధరణి ప్రజనితప్రీతిమై, ఋత్విగర్చనముగ నిచ్చినాఁడ -190 అని మరియును,

చం. వనమునకేఁగియందు సుఖవానతనుండఁగలాఁడఁగాక యే
ననఘ విచార బ్రహ్మధనమక్కటకొందునెయన్నఁబ్రీతిమై
ననుజులు యాజ్ఞసేనియుననట్టిదయాపనియొండు సెప్పకుం
డనుటయు హర్షబాష్పపులకాంకురముల్ ధరియించిరందఱున్-అశ్వ-చతుర్ధ-192, అంతనప్పుడు

తే. దివ్యవాణిగీర్తించెఁగౌరవ్యవరుని, నఖిలజనములుఁబ్రస్తుతి ముఖరులైరి
తానుఁబొగడి వేదవ్యాసుఁడా నరేంద్ర , చంద్రునకునిట్టలను విప్రచయము వినఁగ-194

ధరణికి సమమగు ధనమునిప్పింపుమని వ్యాసుడు, విప్రవర్యులు, శ్రీకృష్ణుడును హితము పలికిన ధర్మజుడు కోటికోటులమాడలు కుప్పవోసి ధరణి ధరయని ఆ సంయమికి సమర్పించెను. అంత వ్యాసుడాధనమును ఋత్విగా వళికి పంచిపెట్టెను. ధర్మజుడు తను యజ్ఞమునకై చేయించిన సువర్ణమయ ఉపకరణములు విప్రులకొసగెను. వ్యాసుడు తనవంతునకువచ్చిన ధనమును కుంతికి సమర్పింపగ, ఆమె భూసురులకు భూరిదానమొసంగి సంతృప్తి నందినది. అనంతరము వ్యాసాది ఋత్విగ్వరేణ్యులు నిజవాసములకరిగిరి. అంత ధర్మజుడు యజ్ఞమునకు విచ్చేసిన సమస్త రాజలోకమునకు విభవమెసగ వారి వారి కోర్కెల కనుగుణముగ సువర్ణ, రత్న రాసులతో సత్కారములుజేసి వారిని నిజస్థానములకు వీడ్కొల్పెను. ఇది యథామూలము.

195. ఇట మహాభారతమున సక్తుప్రస్థుని వృత్తాంతము, ఒక నకులము (ముంగీస) అచటగల బ్రాహ్మణులతో ప్రస్తావించినటుల గలదు. హింసాత్మకములైన యజ్ఞయాగాదులకన్న, అహింసాయుతముగా చేయునట్టి యాగ, దాన, వ్రతాదులు గొప్పవని నిరూపించుటకైనట్టిదిగా భావింపవచ్చును. ధర్మజుని యజ్ఞావభృథమున చేసిన దాన, దక్షిణాదిమహోత్సవము జరుగుచుండగ, ఒక నకులము (ముంగీస) ఆ బ్రహ్మణోత్తముల మధ్యనుండివచ్చి, ఆ యాగశాల పరిసరప్రాంతమున ముమ్మారు పొర్లి, తన శరీరపు సగభాగము కనకమయముకాక, విస్తుపోయి నవ్వినది. అదిచూచి అచటనున్నవారెల్ల ఆ నకులపు చేష్టలకు ఆశ్చర్యమునొంది, కారణమడుగగా, ఇతఃపూర్వము సక్తుప్రస్థుడను బ్రాహ్మణుడు ఉంఛవృత్తిచే జీవించుచు, అతిథి పూజనమునకై తనవద్దగల పేలపిండిని దానము చేసినాడు. ఆ దానమిచ్చు సమయమున రాలిన పిండిలో ఒకప్రక్కగా దొర్లితిని. నా శరీరమునందా పార్శ్వము సువర్ణమయమైనది. నాటినుండి రెండవ ప్రక్క కనకమయమగుటకు ఎన్నియో ప్రదేశములు, యజ్ఞ యాగాదులు, తపోభూములు కడ ప్రయత్నించితిని. గాని ఆ యోగము సంభవముకాలేదు. ధర్మరాజంతటివాడు చేయు యజ్ఞమని, యిచటనది సంభవమేమో! నని వచ్చితిని. కాని అది జరుగలేదని వారితో వాపోయినది.

మరియు ఆ దాన ప్రశస్తినిట్లు తెలియజేసినది.

కం. భక్తియువినయము శ్రద్ధా, యుక్తియునుం దాల్మితోడియొప్పునుగరుణా
సక్తియునతిథులయెడనను, రక్తియు నీయందసుస్థిరత్వముఁబొందెన్ **-239**

కం. నీదానంబున విస్మితు, లై దైవతయక్షసిద్ధులభివర్ణన ము
త్యాదరమునఁజేసెదరిదె, రోదసిసమ్మర్ధముగనరుగుదెంచి తగన్ **-అశ్వ-చతుర్ధ-240**

కం. అని చూపి పల్కునవసర, మునఁబర్జన్యుండుగురిసెఁ బుష్పాసారం
బనవద్య హృద్యనాదం, బున మ్రోసెను దేవదుందుభులు గగనమునన్ **-241**

పై సక్తుప్రస్థని ప్రస్తుతి ప్రశంసను బట్టి ఒక విషయము వ్యంగ్యముగ చెప్పినటులైనది. భక్తి, వినయము, శ్రద్ధ, ఓర్పు, అతిథులపట్ల దయమున్నగు గుణములు ధర్మజునియందుకూడ గలవు. కాని యింకను మిన్నగా నుండుట శ్రేయమని భావము. సక్తుప్రస్థని సంపాదన కష్టార్జితము. అది వానికై మిగిల్చుకొనునిచో వానికి ప్రాణములు నిలుపుకొనుటయే కష్టము. అయినను తన సర్వస్వమును(కుంచెడు పేలపిండి)అతిథిపూజకై వెచ్చించినాడు. ఇచట వస్తువు విలువకన్న కర్మమునందలినిష్ఠ, అందులకైన ఆర్ద్రత ప్రధానము. బ్రాహ్మణుడైన సక్తుప్రస్థుడు అఖండ సత్వగుణ సంపన్నుడు. కేవల మోక్షగామి. కనుక వానికి వస్తుభ్రాంతిలేదు. ధర్మజుడు ఉత్తమ క్షత్రియుడేకాని సక్తుప్రస్తునివంటి బ్రాహ్మ్యమునెడుట యింకను సాధకునిగ మాత్రమే ఎన్నబడునని వ్యాసుని భావముగ తోచును. ఈ క్రింది పద్యము గమనార్హము.

చం. వినుము ప్రభూతదానములు విశ్రుతయజ్ఞములున్ సధర్మతా
వినుతికినెక్కఁజాలవువివేకనిధీపరిశుద్ధి శోభితా
ర్జనమునఁదెచ్చికొన్నది వరంబగుఁబాత్రమునర్హకాలముం
గని లఘువస్తువేనినొసఁగంగనుటుజ్జ్వల ధర్మమారయన్ **-246**

'పరిశుద్ధ శోభితార్జనమున తెచ్చుకొన్నది పరంబగు పాత్రము అర్హమగు కాలమును గని లఘువస్తువేని యొసంగుటుజ్జ్వల ధర్మమగును.' ఇచట ధర్మ సంపాదనమున సంశుద్ధత నిండుగ లేదని గాని, లేక సక్తుప్రస్థనితో తుల్యమగు పావిత్ర్యయమునందలేరనిగాని వ్యాసుడుద్దేశించినా!యనిపించును. అటులనే ధర్మజునినుండి దానములు స్వీకరించిన ఎల్లరును పాత్రులనుట సాహసముకదా!. కారణము సక్తుప్రస్థని దానము గ్రహించినవాడు క్షుధార్తుడు (సక్తుప్రస్థని దృష్టిలో). కాని నిజమునకాతడు ధర్మదేవత. ఇచట ధర్మజుడు దానమునిచ్చుచున్నాడు. కనుక అవసరావసరముల పనిలేక ఎవరైనను రావచ్చును, గ్రహించవచ్చును. సారాంశమునిటుల భావింపవచ్చును. కథ చక్రవర్తిదైనను వ్యాసుని దృష్టిలో ప్రయోజనము సామాన్యునకందవలయును. ఇవి సర్వ భారతీయులకైన ఉపదేశములు. కనుక సామాన్యుడు దానమొనర్చితినని భ్రాంతిపడక, అర్జనమునందలి పవిత్రతను, గ్రహీతయొక్క పాత్రతను గమనింపవలెనని చెప్పుటగా గ్రహింపవలయును. ఈ ఉపాఖ్యానము యథామూలము.

==========

ఆశ్రమవాసపర్వము మానవకోటికిచ్చు మహోత్తమ సందేశములలోనొకటి. మానవుడు భూమిపై ప్రపంచ జ్ఞానమునందు వయసునుండి, వృద్ధాప్యమువరకు లభ్యమైనవానిలో వలసినన్ని భోగములు ధార్మికముగ అనుభవింప వలెనన్నదే మనపూర్వుల ఆశయము. ధర్మార్థ కామమోక్షములలో ధార్మిక పద్ధతిలో అర్థకామములు పొందవలెనన్న ఆశయము కలదు. కాని విశ్వస్వరూపము, ఆత్మతత్వము తెలిసిన విజ్ఞులు భోగములనుభవింతురు. కాని వానివలన జన్మరాహిత్యమునకు భంగమును కలుగజేసుకొనరు. సమాజమున ఉన్నంతకాలము సంఘదోషమనివార్యము. దానివలన వాసనారాహిత్యము మాట ఎటులున్నను, మరికొన్ని నూతనవాసనలు సేకరించుకొనును. ఫలితముగ అరిషడ్వర్గముల ప్రభావమునకు లోనుకాక తప్పదు. అందువలన ఆఖరిదశలో చిత్తశాంతిని పోగొట్టుకొనుట, జన్మరాహిత్యమును భంగించుకొనుటకూడ ఏర్పడును. అంతియెకాక అనూచానమైన విశ్వాసముచేచూచినచో పై చెప్పినట్టివాడు మృతుడైనచో, ఆ ప్రేతాత్మ అసంతృప్తితో మిక్కిలివ్యధకు గురియగునని తెలియుచున్నది. ఇవియెల్ల నొకయెత్తు. కుటుంబమున కొడుకులు, మనుమలు, మునిమనుమలు పెద్దవారగుచున్న కొలది మారుతున్న సమాజము, వారికిష్టమైన విధముగ జీవించెడి అవకాశమును కల్పించుట వయోవృద్ధుల కర్తవ్యము. ఇట్టి దృక్పథము తోడనే మరణమాసన్నమగుచున్నదన్న సత్యమును గుర్తించిన పిదపనైన, వృద్ధులు లౌకిక విషయములనుండి యథాశక్తి సంఘత్వమును ఉపసంహరించు కొనవలసియున్నది. ఈ సత్యమునే ఆశ్రమవానపర్వ రూపమున వ్యాసుడు మనకు బోధించుచున్నాడు.

శ్రీకృష్ణుడు నూట ఇరువదియైదు సంవత్సరములు సంచరించెను. ధర్మస్థాపనమొనర్చి నిజధామమునకు మరలినాడు. ఇంచుమించు ధర్మజుడుకూడా అదేవయసున స్వర్గారోహణమొనర్చినాడు. దానికి ఇరువది వత్సరముల పూర్వము ధృతరాష్ట్రుడు పదునైదు సంవత్సరములు రాజైన ధర్మజుని సేవలనంది ఆశ్రమవాసమునకేగదలచినాడు. అనగ అప్పటికి ధృతరాష్ట్రుని వయసు నూటపాతిక సంవత్సరములు పైబడి యుండునని తెలియగలదు. సంతతినెల్ల పోగొట్టుకొనినను, ఆత్మహత్యకుపాల్పడక, నిర్వికారమున తన విధి నిర్వహించుటయను వివేకవంతమైన విధానమును ధృతరాష్ట్రుడవలంబించినాడు. అటులనే ఆసన్నమరణుడగుట గ్రహించినవాడై సమస్త సంఘదోషములను వర్జించి చిత్త శాంతినందదలచినాడు. లోకమున ఏ ఇరువురి జీవితములను ఒకేవిధముగ నడవకపోయినను, అంత్యదశకు కించిత్తు పూర్వమునందైన, ప్రతి ఒక్కరును పరమునకువలసిన వాసనారాహిత్య కారకమైన సంఘత్వవర్జనమున సమానులే అగుచున్నారు.

పై వివరించినది ప్రధాన సందేశము. ఇక ప్రకృతమైన ధర్మజ శీలమునకు సంబంధించికూడ ఈ పర్వము కీలకమైనట్టిదిగనే కాన్పించును. ఒక ధర్మమునకై పోరాడుట ఏదియో ఒక రూపమున ప్రతియొక్కని జీవితమున సంభావ్యమగునట్టి విషయమే. అయినను లక్ష్యసిద్ధి జరిగిన తరువాత ఉత్తమ ధార్మికుడైనవాడు, సామాజికులతో నైమిత్తికముగ సంభవించిన విరోధములను విడిచిపుచ్చును. అట్లకానినాడు ఆ లక్ష్యసాధకుడు ధార్మిక లక్ష్యశుద్ధి లేనివాడుగనేకాక, పైశాచిక ప్రవృత్తి కలవాడుగును. ఇచట ధర్మజుడు ధార్మికుడు. క్షాత్ర ధర్మముతో రాజ్యమును పొందుటవాని లక్ష్యము. అంతియెకాని పూర్వ రాజసంబంధీకులతోడి వైరముమాత్రము వాని లక్ష్యముగాదు.అందున ఆ వైరము పితృపితామహులతో సంబంధించినట్టిది. కనుక అట్టి నైమిత్తికవిరోధము హృదయమున నిల్పుకొనక ఉత్తమ సంస్కారిగ, వివేకిగ ఈ పర్వమున ధర్మజుడు గోచరించును. ఈ దృష్టితో ధర్మజ ప్రవర్తనమున సన్నిహితమైన, గుర్తింపదగిన సందర్భములను మాత్రము క్రింద వివరింతును.

196. ఆశ్రమవాస ప్రథమాశ్వాసమునందు ధృతరాష్ట్రునియెడ ధర్మజుని ప్రవర్తనము, మున్నుగల ప్రవర్తనకంటె కించిత్తు విశేషము కలిగియుండుట గమనార్హము. ఇందు ధృతరాష్ట్రుని వర్తనముకూడా విశేషముగా గోచరించును. కాని ధృతరాష్ట్రునకిట్టి ప్రవర్తనము తప్పనిసరియనిపింపక మానదు. కారణము పుత్రులనుపోగొట్టుకొని, గతైశ్వర్యుడైన రాజునకిది సహజము. అంతియెకాదు తానుతొల్లి వారిపట్ల ఆచరించిన విధానమునకు ఫలితముగూడ అటులనే యుండునని భావించు తరుణమున, అందుకు విరుద్ధముగ పాండవేయులు తన్ను అహర్నిశలు విడువక తన ఆజ్ఞానుసారులై వర్తించుట ఆశ్చర్యపరచినది.

కం. ఆతల్లికిఁదండ్రికి సం, ప్రీతియలరఁగుడువఁగట్టఁబెట్టనుదాత్త
స్నేతంబులైన వస్తు, వ్రాతంబులనిచ్చు ధర్మరాజనుదినమున్ -ఆశ్రమ-ప్రథమ-6

తే. గుళ్లఁజెఱువులుఁగట్టించుఁగోరియూళ్లు, లగ్రహారములఁగావించు నాంబికేయుఁ
డధిప ధర్మతనూజుఁడత్యంత హర్ష, చిత్తవృత్తియైయనుమతిసేయుచుండ -7
ఇది మూలభావమును గ్రహించి తిక్కన రచించినాడు.

ఇట్లు ధర్మరాజు అనుదినము ధృతరాష్ట్రునియెడల శ్రద్ధ కనపరచుచు, అతనిచే పుణ్యకార్యములు చేయించు తెరగు చూచిన, యుద్ధమునకు ముందు ధర్మజునిలో కన్పట్టు వైషమ్యపుఛాయలు అంతరించినటుల కాన్పించును. ఇట ధర్మజునిలో లౌక్యము మచ్చుకైన కాన్పింపక, పారలౌకికముపైన శ్రద్ధ ఆ స్థలము నాశ్రయించినటుల కాన్పించును. ఈ సందర్భముననే, యింకొక భావమునుగూడ ఊహించుట అసహజముకాక పోవచ్చును. కురు సామ్రాజ్యమును ధృతరాష్ట్రుడు సుదీర్ఘకాలము పాలించినాడు. హస్తినాపురవాసులకు యుద్ధ సమయముపరకు ధృతరాష్ట్రుడు మాత్రమే సుపరిచితుడు. అనంతరకాలమున ద్యూతము, ద్రౌపదినవమానించుట ఇత్యాదులు సంభవించినను, పునఃపాండవులు పదమూడేండ్లు హస్తినాపురమున కాన్పింపని కారణమున, జనములు పాండవులకైన అవమానములను మరచిపోయుందురు. అట్టితరి శతాయుష్కుడైన వృద్ధరాజును, రాణులను చూచిన తోడనే అందునా పుత్రశోకార్తులైన వారిని దర్శించినతోడనే వారిలో పూర్వకృతజ్ఞత వెల్లివిరియుట సహజము. అట్టి ధృతరాష్ట్రుని, ధర్మజుడాదరించినచో జనులకు సంతృప్తి కల్గుటయేకాక ధర్మజునిపై గౌరవము పెరుగును. భారతకథ చదువుచున్నప్పుడెల్ల పాండవులకు దుర్యోధనుడొనరించిన కష్టములు పాఠక హృదయమున నిల్చుటచే, పాఠకునకు దుర్యోధనునిపైనున్నంత కోపము, దుర్యోధనుని రాజ్యమందలి ప్రజలకుండదనిపించును. కారణము వారికి పాండవులతో పరిచయము లేకుండుటయే. అందుచే ధృతరాష్ట్రుని గౌరవించుటచే ప్రజలకు ధర్మజునిపై గౌరవము ఏపాటిపెరుగునో చెప్పజాలముకాని, ఆ వృద్ధభూపతినవమానించుచో మాత్రము ప్రజలు తిరుగుబాటు చేయుదురన్నను ఆశ్చర్యపడవలసినది లేదనిపించును.

మరియొక విచిత్రమున్నది. దుర్యోధనుడు దుష్టుడు. కాని ఆ దుష్టత్వము పాండవులపట్లమాత్రమే. బ్రాహ్మణులకిచ్చిన అగ్రహారాదులనుగాని, ఇతరులకు గావించిన సదుపాయములనుగాని, దుర్యోధనుడు పాడుచేసినటులగాని, వెనుకకు తీసుకొన్నట్లుగాని కాన్పింపడు. అనగా ధృతరాష్ట్రపాలన ప్రజానురంజకము కాదనుటకు చెప్పదగిన సందర్భములు భారత కథనమున కాన్పింపవు. కనుక మహాలౌకికుడైన ధర్మజుడు ధృతరాష్ట్రుని ఆపదలకు, దుర్యోధనుని మృతికి విచారించుచున్న ప్రజలలో కోపాగ్నిని రగుల్కొలుప దలపలేదు. అందుకుతోడు వృద్ధరాజ సేవారూపమున ప్రజాభిమానమునుకూడ తేలికగ చూరగొనినాడనక తప్పదు.

కం. సూనులులేమింగలిగేడు, దీనత్వముదోఁపకుండఁదేజసౌఖ్యా
నూనులుగఁజేయు ధర్మజుఁ, డానరపతినతనిదేవినతులిత భక్తిన్-ఆశ్రమ-ప్రథమ-9

సీ. వంశవృద్ధులుపుత్రవర్గవియుక్తులై, యున్నవారేమిటనుమ్మలింతు
రోయనుపుయిలొట నాయుధిష్ఠిరుఁడు ద, మ్ములకునుదగునమాత్యులకునిష్ట
భృత్యులకునుమీరుప్రీతియుభక్తియు, నాంబికేయునిదెసనతిశయిల్ల
నారాజుపంచినయట్లచేసిచరింపుఁ, డతనినారాధించుటస్మదీయ

ఆ. చిత్తమునకుఁబ్రియముసేయుటయతనికి, మనసుగానియట్టిపనియొనర్చు
టగ్గలంపుదుఃఖమావహించుటయని, యనునదినంబుఁజెప్పు మనుజనాధ-ఆశ్రమ-ప్ర-10

ఇది మూలభావమును గ్రహించి రచించినట్టిది.

ఇట ధర్మజుని ప్రవర్తనమున ధృతరాష్ట్రునిపై ప్రేమకన్న జాలి, దయ అధికముగ గోచరించును. అందులకే "సూనులు లేమింగలిగెడు దీనత్వందోపకుండ" వారలిరువురికి భక్తితో అర్చించుచున్నటుల కాన్పించును. మరియు తమ్ములకును, అమాత్యాది వర్గములకును వారిని భక్తితో సేవించుమని చెప్పుటలో వారియెడ ప్రీతిపాత్రతకన్న వారికి దుఃఖభాజనమగునని తలంచుట గమనార్హము. ఒకవేళ ధర్మజుని ప్రవర్తనమున వారియెడల శ్రద్ధ తగ్గినను, వారికి ఉచిత వర్తనము జరుగకున్నను ధర్మజునికి ఐశ్వర్యముకలిగి రాజ్యాభిషిక్తుడగుటచే పూర్వము కలిగిన ఆదరము, పెద్దలయెడ వినయ, విదేయతలు లోపించినవని ధృతరాష్ట్రుడు, తదితరులు గ్రహించవచ్చును. కావున ధర్మజుడు మెలకువగ అట్టిమాటలకవకాశమీయక ముందుగ తానాచరించుచు, ఇతరులకు ఆచరణీయములని హెచ్చరించినటుల ధ్వనించుచున్నది.

197. అంతియెకాదు ఈ సందర్భమున మరియొక విషయముకూడ కవి వ్యంగ్యముగ ధ్వనింప జేసినాడు. వంశవృద్ధులు పుత్రవియుక్తులై యున్న వారేమిటనుమ్మలింతురో అనుమాటలు గమనార్హము. ఇంతకు పూర్వము ఒకపరి ఈ ఉమ్మలిక్ష్వోభము) యే గాంధారిచే శ్రీకృష్ణుని శపింపజేసినది. అది ధర్మజుని హృదయమున గాఢముగ నాటియున్నది. మహాపతివ్రతయగు గాంధారి విశాల దృక్పథగనే భారతమున వర్ణింపబడినది. ఆమె యధాశక్తి దుర్యోధనునకుపదేశము గావించినది. తనకన్న చిన్నదైనను కుంతిని మాన్యగనె ఆదరించినది. ఆస్తి పంపకమైన ధర్మసూక్ష్ముములెటులున్నను, పాండవులు తమపుత్రులను, బాంధవులను, ముఖ్యముగ దుశ్శాసన, ద్రోణులను అమానుషముగ వధించిన తీరు ఆమె హృదయమున నిల్చియేయున్నది. అనగా జ్వాలలు పెల్లుబుకుట లేదనియె కాని పుత్రశోకాగ్ని ఆమె నరనరములనిండి ప్రజ్వలించుటకు సిద్ధముగనున్నది. ఆమెకుగాని వృద్ధరాజునకుగాని, అగ్రహము కల్గించుటనినచో బడబానలమును నెత్తిపై వేసుకొనుటయేయని ధర్మజునకు తెలియని విషయముగాదు. ఆ భయముచేతనే ధర్మజుడు వానిని మరింత అడకువతో సేవించి కొంతవరకైన వారి కోపమునుపశమింప జేయుటకు ప్రయత్నించినాడనిపించును. కానినాడు విరోధులెల్లను చచ్చినపిదప పుత్రశోకార్తుడైన శతవృద్ధుని, సోదరులవమానింతురేమోయన్న భయము అతనికేలకలుగును. సోదరులంతటి అల్పులా? నిజమునకు వారట్టి అల్పులుకాదు. కాని ఏపాటి ఉపేక్షాభావము చేతనైనను గాంధారి రూపక ప్రళయాగ్ని పెల్లుబికి తమ్ము శాపగ్రస్తులను చేయునన్న భయము ధర్మజునిలోనుండుటయె, సోదరులనంతగ హెచ్చరింపవలసి వచ్చినదని భావించుట యుచిత మనిపించును.

సీ. అతులభోగంబునునంచితత్యాగంబుc, దొల్లింటియట్టులచెల్లcజేయు
ధృతరాష్ట్రునకు ధర్మసుతుcడు గాంధారికిc, బూర్వప్రకారసంపూజ్యదాన
నిరతిcజెల్లించునక్కురువృద్ధుcడిమ్మెయిc, బాండుపుత్రులుదన్నుcబరమభక్తి
శిష్యవర్తనమునసేవింపcదానును, గురునట్లువాత్సల్యపరతనెపుడు

తే. వారలకుశ్రీయునాయువువైరిజయము, మానసముననాశాసించు మానవేంద్ర
యతనితొంటివర్తనముcదత్సుతుని కీడు, నాత్మcదలcపcడెన్నcడుధర్మాత్మజుండు-ఆశ్రమ-ప్ర-14

ఇది మూలభావనను గ్రహించి రచించినట్టిది.

ఇట ధృతరాష్ట్ర, ధర్మజుల ప్రవర్తనము బింబప్రతిబింబ మానముగ గోచరించును. ధృతరాష్ట్రుడు వృద్ధుడు, పుత్రహీనుడు మరియు పాండవుల సన్నిధిలో బ్రతుకు గడుపుచున్నవాడు. కావున తమ ప్రేమ వాత్సల్యాది గుణములు వారిపై ప్రదర్శించినను, ప్రదర్శింపకపోయినను పాండవులు పరిగణింపరు. కాని మిగిలిన బంధువర్గములోను, రాజకుటుంబములోను ధృతరాష్ట్రుడు దుష్టుడు, ధర్మరాజాదులచే పితృభక్తిని పొందుచున్నప్పటికి, వారిపై పుత్రప్రేమను ప్రసరించలేకపోయినాడన్న అపవాదుకలుగునను భయమును లేకపోలేదు. అదియునుగాక తనకెవ్వీధముగనైనను యిక పుత్రప్రేమ ప్రదర్శించుట కవకాశము లేదు. కావున యివన్నియు యోచించి, ధృతరాష్ట్రుడు మనమునందు వారికి శ్రీయు, నాయువు, వైరిజయమునాశాసించుచున్నాడు. అనంతరము రాచరికము అన్యరాజన్యులచేతిలో పడరాదనికూడ అతడు భావించి యుండవచ్చును. ఇక ధర్మజుడు వివేకము, దూరదృష్టి కలిగినవాడు. ఇప్పటి తనప్రవర్తనము రేపటి గౌరవాదరములకు మూలమనెడి విషయమును తెలిసినవాడు. కావుననె యతనితొంటి వర్తనము దత్సుతునికీడునాత్మcదలపడెన్నcడై యున్నవాడు. జరిగిన దానికి వగచుచు, దానికి ప్రతిక్రియ జేయుట సామాన్యుని కార్యము. కాని వివేకవంతుడైన ధర్మజునివంటి వానికది కర్తవ్యము కాదు. కావున జరిగిన దానిని మరచి, జరుగుచున్న కాలమున అపకారికి సహితము ఉపకారబుద్ధితోనర్చించుచు, చేసిన పాపపాటుకు చేసిన వారలే పశ్చాత్తాపపడునట్లు చేయుట ధర్మజునివంటి లోకజ్ఞునకు మాత్రమే సాధ్యము. ఇవ్విధముగ ధర్మజుడు ప్రవర్తించుచుండ, ధృతరాష్ట్రుడు సంతోషముగ సుతులకు, బంధువర్గములకు పారలౌకికక్రియలు జరిపించుచు, పదునైదేండ్లు గడిపి, ఒకనాడు బంధుమిత్రపరివేష్టితముగ ధర్మజుని రావించి తన మనోరథమునిట్లు తెలిపెను.

సీ. నాకంతబునcజేసియాకౌరవులకు నా, శంబువాటిల్లుటదెల్లంబుమీకు
జడుcగ్రూరునతిలోభిజ్ఞాతిజనద్రోహ, కరు రాజుcజేసితి గురుధరిత్రి
కచ్యుతుచెప్పినయమలవాక్యంబులు, విననేరనైతి నాతనయువలని
ఘనతరస్నేహంబుననుమొగమోటను, దగియెడుమాటలcదతీమియొత్తి

తే. యాడకుండితి భీష్ముండునస్త్రగురుcడు, విదురుcడునుసంజయుండును వేవిధముల
నాకుcజెప్పిరి గాంధారినన్నుదూతి, చెప్పెనమ్మాటలేcబెడచెవులనిడితి -ఆశ్రమ-ప్రథమ-21 ,

ఇట మూలమున ధృతరాష్ట్రుని మాటలు సుదీర్ఘముగ వర్ణితము. తిక్కన సంకీర్తికరించినాడు. పై ధృతరాష్ట్రుని పలుకులు ధర్మజుడాశించిన విధముగనే యున్నటుల కాన్పించును.

యుద్ధమంతటకును, కౌరవకుల నాశంబునకు తనేకారణమని, ధృతరాష్ట్రుడు పశ్చాత్తాపపడుచు, సర్వజన సమక్షమున పలుకుటయే ధర్మజునకు వలయు ప్రయోజనము. తనకు తానుగ ధృతరాష్ట్రుడు ఒప్పుకొనుటవలన ధర్మజునిపై నిందలేవియులేక అతనిని అవిగీతచరిత్రునివలె ప్రజలయెదుట నిలబెట్టినది. అందువలన యిటు బంధు వర్గములోను, అటు జనుల హృదయములలోను ధర్మజునిస్థానము సమున్నతినందినదనక తప్పదు.

198. అనంతరము ధృతరాష్ట్రుడిటుల పలికినాడు.

సీ. నీవరయంగ సుఖావాప్తిఁగొఱంత లే, కుండితిఁజనవునునుజ్జ్వలంపుఁ
దేజంబుఁగలిగివర్తించితి దానంబు, లంచితములుగఁబెక్కాచరింపఁ
గంటిశ్రాద్ధంబులు గాంధారిసుతులకుఁ, బలుమాఱుఁజేసితిఁ బరమధర్మ
శీల పాంచాలికిఁజెట్టసేసి రగణ్య, పుణ్యండవగు నీదుభూరిలక్ష్మి

తే. నపహరించిరద్దుర్యోధనాదులట్టి, కష్టచతురితులఁబాడిమైఁ గయ్యమునన
నిహతులుఁగఁజేసితక్కురునికరమూర్ధ్వ, భువనగతిఁగాంచి సుఖమందె భూపవర్య-ఆశ్ర-ప్రథమ-25

ఇది మూలమున గలట్టిది. ఇట అగణ్యపుణ్యండవగు నీదుభూరిలక్ష్మినపహరించి అని ధృతరాష్ట్రుడు పలుకుట గమనార్హము. లోకమున పరులసొమ్మునపహరించుట పాపముగ శాస్త్రములు చెప్పుచున్నవి. అందున పుణ్యాత్ముల సొమ్మునపహరించినచో అది మహాపాపము. అది ధృతరాష్ట్రునకు తెలియనదికాదు. కాని విధిప్రేరితమున, పుత్ర ప్రేమాధిక్యతవలన అధర్మ, అన్యాయములపై మొగ్గుచూపి నాశనమునకు కారణమైనాడు. అయినను నేడు ధర్మజుని ధర్మపక్షపాతము, పారలౌకిక కార్యకలాపములు, ప్రజలలో అతనికిగల కీర్తిప్రతిష్టలు ధృతరాష్ట్రునిచే అగణ్యపుణ్యుడను విశేషణము పలికించినటుల తోచకమానదు.

అనంతరము ధృతరాష్ట్రుడు రాజధర్మములందు ముఖ్యమైన ధర్మము, రాజవంశజునకు సమరమరణము లేదా విమల తపమునకు వెడలియందు సిద్ధిపొందుట యేదియొనొకటి ముఖ్యమైనదని తెలిపి, తనకు అరణ్య వాసమవశ్యమని, అందులకై రాజగువాని అనుమతి బడయువలన గాన, అనుజ్ఞనిమ్మని ధర్మజుని కోరెను.

199. అంత ధర్మజుడు మిక్కిలి విచారముతో తనమనోవ్యధనిట్లు వ్యక్తపరచెను.

కం. ధరణీరాజ్యము నాకును, నరవరసౌఖ్యంబుఁజేయునానీవిమ్మై
దురపిల్లిదుష్కరంబగు, నరణ్యవాసమునకేఁగినట్టిదయైనన్-ఆశ్రమ-ప్రథమ-30

తే. గూఢబుద్ధివైనమ్మించి కురువరేణ్య, యేనెఱుంగకయుండంగనిట్లు శోక
వనధిఁదేలుచునుండితివ్వనటగంటి, నింకరాజ్యంబునాకెట్టులించుఁజెపుమ -31 , అని మరియు

ఉ. తల్లియుఁదండ్రియున్‌గురుఁడుదైవమునాకరయంగనీవభూ
వల్లభనీవుకానననివాసముగోరిచనంగనెట్టులే
నుల్లమువట్టిహస్తిపురినుండఁగనేర్తు యుయుత్సుఁబెంపుశో
భిల్లఁగరాజుఁజేయునినుఁబ్రీతియెలర్పఁగఁగొల్చివచ్చెదన్-32

అని పలుకుట ధర్మజుచిత్తమును పట్టిచ్చునట్టిది. మీరు అరణ్యవాసమునకేగుచున్నచో, నేనిట ఐశ్వర్యము ననుభవించుచు కాలము గడుపవలెను. కారణము నాకు సర్వస్వము మీరు అని పల్కుటలో ఔచిత్యము కన్పట్టు చున్నది. ధర్మజుడు ధృతరాష్ట్రుని మనమునందుగల కోరికను గ్రహించినటుల, ఆతనికి ప్రీతిని కల్గించునను అభిప్రాయముతో యుయుత్సుబెంపు శోభిల్లగరాజు జేయుదునని పల్కుటలో ధర్మజునకు రాజ్యకాంక్షయందలి వ్యామోహము లేదనుటకు తార్కాణముగను, ధ్వనిగ వాని లౌక్యమునకు నికషోపలముగనుకూడ భాసించుచున్నది.

200. అనంతరము ధృతరాష్ట్రుడు ధర్మజుని ఊరడిల్లజేసి అతనికి అనుజ్ఞనిమ్మన, అతడీయనొల్లక ధర్మవిచికిత్సకు లోనైయున్న తరుణమున, సాత్యవతేయుడు చనుదెంచి అనుజ్ఞయిచ్చుట కర్తవ్యమని ఉపదేశించిన, ధర్మజుండును సమ్మతించెను. అంత ధర్మజుని ధృతరాష్ట్రుడు ఏకాంత ప్రదేశమునకు దోడ్కొని పోయి, ఏకాంతముగ అతనితో సప్తాంగసముచ్చయమైన రాజ్యమునందు, పూజ్యమైన ధర్మమునడుపుటకు వలయు వాక్యములను చెప్పెద నాకర్ణింపుమని రాజనీతి విశేషములను కొన్నింటిని ఉపన్యసించెను. అవన్నియు విని ధర్మజుడు ధృతరాష్ట్రునిపొగడుట, ధర్మజునకు పెద్దలయెడగల గౌరవాదరములు మరియొకపరి వ్యక్తమగుచున్నవి.

సీ. అనవిని ధర్మజుండంబికాపుత్రుతో, నాపగాసుతుఁడులేఁడజ్జనాథుఁ
డాత్మపురంబునకరిగె వాత్సల్యత, నీవుదక్కఁగ నాకుహితముసెప్ప
నొడయుఁడెవ్వఁడు భవదుపదిష్టపథమున, నిష్ఠమైనడిచెద నెమ్మనమున
నీవుప్రీతినిబొందు నృపముఖ్యనావుడు, నాతఁడు సంతసమంది యతని

ఆ. నధిపవిశ్రమింపుమధికశ్రమంబు నా, తనువునందుఁజెందెననితగంగఁ
బోవఁజెప్పి బాంధవావళికభిముఖుఁ, డయి నిజాలయములకరుగఁబనిచి-ఆశ్రమ-ప్రథమ-80

ఈ పొగడ్తతో ధృతరాష్ట్రుని మానసిక స్థితియందు ధర్మజునిపై వాత్సల్యమధికమై స్థిరరూపము దాల్చినదనక తప్పదు. అనంతరము గాంధారి అరణ్యవాసమునకెపుడు పోయెదమని అడుగగ, పశ్చాత్తప్తహృదయడగుచు ధృతరాష్ట్రుడు పల్కిన పలుకులు అక్షరసత్యములుగ కన్పట్టుట విశేషము.

ఆ. ఇంకఁదడయనేల యింతివేవెడలుద, మట్లుగల్లజూదమాడి పాప
భాగులైన నీదుపట్టలసుగతికి, ననుచువాఁడఁదపమునతిశయమున-83. ఇది యథామూలము.

201. అని గాంధారితో పలుకుటయే గాక, తపంబునకు వెడలుటకై పురజనుల ఆజ్ఞనుగైకొను సమయమున వారలతో పలికిన పలుకులు అతని వైఖరిని విశదముగ తెలియపరచగలట్టివి.

సీ. ప్రజముదమొందంగఁబాలించెఁబుడమి శం, తనుఁడనంతరమ శాంతనవుచేత
రక్షితుఁడగుచు మీరలుప్రీతిఁబొందల వి, చిత్రవీర్యుండునిద్ధాత్రియేలెఁ
బదపడి పాండునృపాలుండు మీరు హ, ర్షింపంగ భూమిరక్షించెఁబిదప
ధర్మనందనునిచందము మీయెఱింగిన, యది సత్యధర్మాత్ముఁడైన యితని

తే. ననుసరింపక యన్యాయమాచరించి, దుర్నయంబున నిలయేలి త్రుంచెఁగులము
నుర్వీఁగల భూపతులనుదుర్యోధనుండు, వానిదుశ్చేష్టలకు మూలమేనకాదె -87-ఇది యథామూలము.

ఇట ధర్మజుని సత్యధర్మాత్ముఁడని పేర్కొనుట ధర్మజుని నడవడికకు ధృతరాష్ట్రుడిచ్చిన ప్రమాణపత్రముగ కన్పించుచు, ధర్మజపాత్రకు మకుటాయమానముగ భాసిల్లినది. మరియు అన్యాయమాచరించి దుర్నయంబున నిలయేలి త్రుంచెగులము, నుర్వీగలభూపతులను దుర్యోధనుండు వానిదుశ్చేష్టలకు మూలమేనకాదె అని విశదముగ పల్కుటలో ధృతరాష్ట్రుని సంస్కారముతోపాటు, అతని ఆత్మ విమర్శనము గావించుకొన్న తీరు, మరియు ప్రజలయెడుట ధర్మజపక్షమున తప్పలేదియులేవని, సాక్షిభూతునిగ నిలిచినటుల కాన్పించును. అనంతరము ధర్మజాదులను ఉచిత భాషణముల సంభావించుచు ప్రజల అనుమతి వేడగ, జనుల పక్షమున శంబువను విప్రుడు ధృతరాష్ట్రుని మనసును, అతను పడుచున్న పశ్చాత్తాపమును గ్రహించినవాడై, ఆతనినోదార్చుచు ప్రజలమాటగనిట్లు పల్కెను.

వ. భీష్మ ద్రోణ కృప ద్రౌణి కర్ణ కృతవర్మ శల్యులొక్క దిక్కును, భీమార్జున నకుల సహదేవ ద్రుపద విరాట సాత్యకులొక్కదెసయునై విధిప్రేరణంబునం బోరిరి వారివలన నఖిల క్షత్రియసంక్షయంభావహిల్లె నదియొక్క దుర్యోధన చేతనయయ్యెనె యట్లుంగాక రణంబు రాజులకుత్తమధర్మంబకాదె యందుల మరణంబును సుగతికరణకల్యంబు నీసుతుండు సహాయులుందానునుం బుణ్యలోక సౌఖ్యంబునంబొందియున్నవాఁడు ధర్మాచరణశాలివగు నీకును సుగతిప్రాప్తి సులభంబయగు -101. ఇది మూలభావనను గ్రహించి రచించినట్టిది.

ఈ మాటలువిన్న ధృతరాష్ట్రునకు మనసునందుగల చింతతొలగి, తన పశ్చాత్తాపమునకు ఫలము లభించిన దను తృప్తి కలిగినదనుటలో ఎట్టి సందియము లేదు. కారణము జనములో తనకు, పుత్రులకు కలిగిన అప్రతిష్ఠ, అపకీర్తి నిలిచిపోవునను బాధ మనసును కలచివైచుచు, పరిపరివిధముల క్రుంగుచున్న వానికి ఈ మాటలు అమృతోపమానము.

202. అంతనాతడు మరల ధృతరాష్ట్రుడు, జనులు వినుచుండగ ధర్మజుని ప్రశంసించుట ధర్మజ పాత్రము నకు ఎనలేని కీర్తిని, తులలేని ప్రతిష్ఠను ఆపాదించినదనుటలో అతిశయోక్తికానము. అతని పలుకులలో ధర్మజుడు

సీ. ధర్మపుత్రుఁడు దీర్ఘదర్శిమహోదాత్త, సచివుండు బంధురక్షణపరుండు
రిపునెడనైనను గృపపెద్దభావసం, శుద్ధియుఁబ్రతిభయుసుప్రతంబు
నితనికివెన్నతోనిడినవి యొరులను, దనయట్లకాఁజూచుఁదమ్ములెల్ల
సన్నుతికెక్కిన సకలగుణముల ని, మ్మహితాత్ముచందానమమ్ముఁబ్రోచు

తే. మాత్రయే దేవవిషయసమంచితాగ్ర, హారసజ్జనమాన్యంబులైనగ్రామ
ములుదగంగరక్షింతురువెలయఁదారు, నిత్తురూళ్లలు దేవమహీసురులకు -ఆశ్రమ-ప్ర-103

అని మరియు పాండవేయులందరిని ఉన్నది, ఉన్నట్లుగ ప్రశంసించుట గలదు. పై గుణములు సహజముగ కలిగిన పాండవులకిది పొగడ్తగ భాసించదు. కాని ప్రజలలో ధర్మజాదులకుగల అపార ప్రేమాభిమానములకు, కీర్తిప్రతిష్ఠకు దర్పణసద్యశము. ఇది యథామూలము.

అనంతరము ధృతరాష్ట్రుడు విదురుని రావించి సంగరమున మరణించిన పుత్ర, మిత్ర, బంధువర్గముల వారలకొకపర్యాయము శ్రాద్ధవిధులనాచరించి తపోవనమున కరిగెదనని, ఈవార్త ధర్మజునకు తెలుపమని పనిచెను. అంత కార్తీక పౌర్ణమి మొదలు పదునైదు దినములు ధృతరాష్ట్రుడు యిచ్ఛానుసారముగ శ్రాద్ధవిధులాచరించి, పాడ్యమినాడు వల్కలాజినములు ధరించి గాంధారి సహితుడై అరణ్యవాసమునకు సంసిద్ధుడయ్యెను.

అట్లు పురద్వారంబు కడచిన, విదురుడు, సంజయుడును తాముకూడ ధృతరాష్ట్రునితోడ అరణ్యమునకు పోవుటకు, అతని అనుమతి పొందిరి. కృపాచార్యుడు, యుయుత్సుడును అట్లే జనులకుత్సహించగ, వారలను వారించి, ధర్మనందనున కప్పగించెను.

203. అట్లు పోవుచున్న గాంధారీ, ధృతరాష్ట్రులను, సంజయ, విదురులనుగాంచి ధర్మజుడు దుఃఖితుడై అశ్రపూరిత నయనముల కుంతిని కనుగొని ఇట్టులనియె.

కం. మాయయ్యకాననమునకుఁ, బోయెదు నేనితనితోడఁబోయెద శుశ్రూ
షాయత్తుఁడనైయుండెద, నీయువిదలఁగొనుచు మగిడియేఁగుముతల్లీ - ఆశ్రమ-ప్రథమ-146

అని ధర్మజుడు పలుకుట అతనిలోని కరుణత్వమును తెలుపుచున్నది. ఎట్టివానికైనను యిట్టి సందర్భమున ఆర్ద్రతనిండిన మనసుచే యిట్టి అనుభూతిని కల్పింపకమానదు. అట్టి యెడ ధర్మజుడందులకతీతుడు కాడని కాన్పించును. ఇది యథామూలము.

అంత కుంతీదేవి కొడుకును జూచి మీకారాజు యెటుల అనుమతినిచ్చును. వారలిరువురు నాకత్తమామలు. వారికి శూశ్రూషలుజేసి, నేనునుతరించెదనని, తానరణ్యవాసమునకేగుటకు నిశ్చయముతో పలికినది. అదివిని ధర్మజుడు హతాశడగుట సర్వసామాన్యము. పెంచిన వారలరణ్యమునకుబోవుదమనినపుడు ధర్మజునకి కలిగిన బాధ పరిమితము. కాని యిప్పటి కుంతి మాటలు హృదయమున నాటిన శరములై , కన్నతల్లిని విడువ వలయునను బాధ అపరిమితమైనది. వెంటనె తల్లి వదనమవలోకించి ధర్మజుడిట్టులనెను.

సీ. ఇదియేమిసేయంగనెత్తికొంటిమ్మాట,యాడకుమేనునిన్నడవికేఁగఁ
బనుతునే మముఁదొల్లిపనిచి పనుల్‌గొను, భంగిన సామ్రాజ్యభారనిర్వ
హణము తెఱంగునునప్పటికప్పటి, కిట్లని యానతియిచ్చినడపఁ
బంపకయున్ననొప్పమిరాదె మాకుము, న్నీవునుగృష్ణుండునేవిధమున

తే.గీ. నడపితిరి కార్యమెఱుఁగవేయడలువెల్లి, మమ్ముఁబాంచాలినిటుముంచి యమ్మయడవి
నెట్టులుండెదవనఁగ నయ్యింతి భాష్ప, పూర్ణనయనయై యూరకపోవుచుండె - 158

మరియు భీమసేనుండాడిన పలుకులు

ఉ. అయ్యమలాత్మతోడఁబవనాత్మజుఁడిట్లను ధర్మపుత్ర నీ
వెయ్యదియుక్తహేతువుగ నిమ్మొయిఁబాసెదునీదుపన్పునం
గయ్యముసేసి భూపతినికాయములంబరిమార్చెఁదల్లి నీ
కియ్యనలక్ష్మినూఁది చరియింపక యిప్పుడు వాయఁబాడియే -ఆశ్రమ-ప్రథమ- 159

పై ధర్మజ, భీమసేను మాటలలో తల్లిపై ప్రేమతోపాటు, ఆమె వారికి యుక్తాయుక్త కార్యనిర్వాహణము తెలుపు అమాత్యవర్యులకన్న మిన్నగ భాసించును. మరియు భీమసేనుని పలుకులలో 'నీదుపన్పునంగయ్యమునన్సె భూపతినికాయములం బరిమార్చె' అనుట గమనార్హము. కుంతి వీరపత్నియేకాదు, వీరమాతకూడ. వీరమాతయైన క్షత్రియ స్త్రీ తన కుమారులు శౌర్యముదక్కి , సంధి చేసుకొను యత్నమునకు పాకులాడుట చూచి, ఊరకుండుట హేయము. కనుక శ్రీకృష్ణ రాయబారఘట్టమున తన మాతృసందేశమును వినిపింపజేసి, కొమరులనుత్తేజపరచి, యుద్ధమునకు ఉసిగొల్పినమాట నిజము. కాని దానిభావము తాను భోగలాలసయై జీవించుటకు మాత్రముకాదు. కావున ధర్మజుడాడినటుల యుక్తాయుక్త వివేకమును తెల్పునట్టిదియు, భీముడన్నటుల ఆమే పనుపున యుద్ధము జేసి భూపతులనందరిని చంపిరనుట సమంజసముగ తోచును. ఈ విషయము కుంతి మాటలలో స్పష్టము.

సీ. దుర్ఫ్రాతమునఁదారుదూలపోవుటయును, నాసభనపకీర్తియగుతెఱంగు
వాటిల్లుటయుఁబెక్కుభంగులనడవుల, నిడుములఁబడుటయు నేసహింపఁ
జాలకకార్యంబుచర్చించిసంధిమై, నొవ్వనివారెల్లనవ్వఁదలలు
వంచి కౌరవులలోవర్తింపనేలని, హరితోడనాడితినవ్విధమున

ఆ.వె. మాననీయుధర్మసూనునాగాయుత, బలునిభీము శత్రుభంజనైక
శీలుఁబార్థశౌర్యలోలురఁగవలదై, న్యంబునొందఁజూచుటర్హమగునె -ఆ-ప్ర-166

అని తనయొనరించిన మాతృసందేశమునకు, భీమదాడిన మాటలకు సమాధానమొసగినది. ఇది యథామూలము.

అంత ధర్మజాదులు కుంతిని పరిపరి విధముల ప్రతిమలాడి, అరణ్యవృత్తిని మాన్పించుటకు యత్నించి విఫలులై, అమె దృఢనిశ్చయమునకు తలయొగ్గి గాంధారి, ధృతరాష్ట్ర, కుంతీదేవి, విదురాదులకు ప్రదక్షిణంబుసేసి అశ్రుప్లావితమగు వదనములతో వీడ్కోలు సలిపిరి.

<u>ద్వితీయాశ్వాసము;</u>

ద్వితీయాశ్వాసమున సహదేవుడు ధర్మజునకు ప్రణమిల్లి అరణ్యమున ధృతరాష్ట్రాదులను సందర్శింప బోవుదమని విన్నవించిన ధర్మజుడును అందులకు సమ్మతించి బంధు, గీత వాద్య సహితంబుగ, భారత యుద్ధ వితంతువులను, అనుజ, పరిజన పరివేష్టితుడై కురుక్షేత్రమునగల శతయూపమహర్షి సమీపముననున్న ధృతరాష్ట్రాశ్రమమునకు పోయెను. అంత ధృతరాష్ట్రాదులు గంగానదీ తీరమునకుపోయి యుండుటచే రథములుడిగ్గి పాదచారులై వారికెదురేగి కుంతికి ప్రణమిల్లి, తదనంతరమున గాంధారి, ధృతరాష్ట్రాదులకు వందనమొనర్చి ఆశ్రమమునకు వచ్చి, సుఖోపవిష్టులైయున్నంత ధృతరాష్ట్రునివద్దనున్న మునులు, వచ్చిన జనముల వివరములడుగగ విన్నవించు సందర్భమున...

204.సీ.జాంబూనదచ్ఛాయచందంబు వర్ణంబు, గలిగిన పలుచనిగనపమేను
నుచితదీర్ఘత్వ సమున్నతఘ్రాణంబు, నిడుదలైన విశాలనేత్రములును
గంఠీరవంబు రేఖయునొప్పఁజూడ్కికి, నెంతయుప్రేఁగైన యితఁడు ధర్మ
తనయుఁ .....-ఆశ్రమ-ద్వితీయ-**40** , అని వర్ణించినాడు. ఇది యథామూలము.

భారతమున యెల్లడల ధర్మజుని గుణగణాదుల ప్రశంస కానవచ్చును. కాని పాఠకులకిట సంజయుడు ధర్మజ రూపలావణ్యతను సాక్షాత్కరింపజేసినాడు.

తదనంతరము ధృతరాష్ట్రుడు ధర్మజునితో యెల్లవారల క్షేమమరయుచు రాజతంత్ర నిర్వహణగూర్చి ప్రశ్నించిన ధర్మజుడు 'నీ వినతోపదేశమున భవదనుయుక్తములెల్ల నడచునవిఘ్న భంగిన్' అని వినయముగ సమాధానమొసగుచు, మరల వారి యోగక్షేమములనడిగి, ఆదరాభిమానములు కనబర్చినాడు. అనంతరము ధర్మజుడు విదురునికై ఎదురు చూచుచుండ, విదురుడు ధర్మజునిగని వెనుకకు పరుగెత్తుచుండ, ధర్మజుడాతని అనుసరించి పోవగ, అరణ్యమధ్యమున ఒక పాదప సమీపమున విదురుడు నిలచి యోగబలమున, ధర్మతనయునిలో ఆత్మైక్యము గావించుకొనినాడు.

అటుల ఒక నెల రోజులుండి, అనంతరము ధృతరాష్ట్రునితో ధర్మజుడు తన సహజ ధోరణిలో అరణ్యవాసము గ్రహించెదనని పలుకగ, ఆతనిని వారించి కరిపురమునకంపివేసిరి. అట్లు మూడు సంవత్సరములు గడచిన పిదప, నారదుడు ధర్మజుని కొలువునకువచ్చి ధృతరాష్ట్రాదులు దావానలమున చిక్కుకొని దేహత్యాగమొనరించినారని, సంజయుడు హిమాలయ ప్రాంతములకు వెడలినాడని తెలిపెను. అంత ధర్మజుడు కొంతతడవు చింతాక్రాంతుడై, వారలకు తిలోదకతర్పణాది క్రియలను, పితృమేధాదికర్మలను పండ్రెండు దినములు ఆచరించి, నారదాది మునుల ఆశీర్వాదములుగైకొని తృప్తినందెను. ఇది యథామూలము.

==========

మౌసలపర్వము – ధర్మజపాత్ర

స్థూలదృష్టికి మహాభారత కథతోడి మౌసలపర్వమునకైన అనుబంధము స్వల్పమనిపించును. కాని సూక్ష్మముగ చూచినచో మహాప్రస్థానమునకు పూర్వము ఉండవలసినచోట మహదర్థబోధనకై మౌసల పర్వము నిలచినటుల కాన్పించును. మహాభారత కథానాయకుడు శ్రీకృష్ణుడా! ధర్మజుడా! యను చర్చ మనకప్రస్తుతము. అయినను భారత కథా నిర్వాహకుడు మాత్రము శ్రీకృష్ణుడు. అట్టి శ్రీకృష్ణుని అవతారము చాలింపబడుచున్నదనినచో, వ్యాసనిర్మిత భారత లక్ష్యము సమాప్తమని భావము. అనగ ధర్మజ మహాప్రస్థానమునకు మున్ను, నేలకు దిగిన నారాయణుని వైకుంఠ ప్రవేశము, అనేక విషయములను ధ్వనిగ సూచించును.

అది కలియుగ ప్రవేశమునకొక మైలురాయి. అనగ నారాయణ నిష్క్రమణముతో, ధర్మముకూడ ద్విపాద స్థాయినుండి ఏకపదియైనది. ఇక పాలించువాడు ధర్మజుడే కావచ్చును, మరి యెవరేని కావచ్చును. అది ద్వాపర తుల్యము కాజాలదు.

అనగ ఒక చిత్రమైన అవగాహన మనకేర్పడుట కవకాశము గలదు. నారాయణుని లీలలు అనంతములు. ఒక నిర్దిష్ట కాలమును నాలుగు ఖండములుగ జేసి, అందొక ఖండమున ధర్మజునకు నిండుగ బలమునిచ్చి, మరియొక ఖండమున మూడు భాగములేయుంచి, అనంతర ఖండమున బలిమినే కలుగజేసి, చివరకు పాతిక బలముతో ధర్మము నడచునటుల ప్రకృతి సహజముగనే యేర్పాటుకావించి యుంచుటకూడ, దైవమయినటకన్న మరియొక తర్కము సమాధానమీయజాలదు. ద్విపాద స్థితిలో ధర్మరక్షణకై నారాయణుడు నేలకుదిగి ధర్మమును చక్కబెట్టి తాను వెనుదిరుగుచు, ధర్మమునేకపదిగనొనర్చి పోవుటలోని ఆంతర్యము దైవమునకు మాత్రమే తెలియును. అనగ మరియొక భారత కథకు పునాదివేయుటతో, ప్రకృత మహాభారత కథ ముగిసినదా! యనిపించును. లేక ధర్మాధర్మ ఘర్షణము ప్రకృతి సహజమనుట మహర్షుల లక్ష్యమేమో తెలియదు. ఏమైనను నారాయణ నిష్క్రమణము, ద్వాపరయుగ పరిసమాప్తి, కలియుగ ప్రవేశము అనునవి గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్ అను నన్నయగారి వాక్యము నారాయణ వాక్యముగనొనర్చినట్లైనది.

ఈ స్థితిలో పాండవుల మహాప్రస్థానము, స్వర్గారోహణములారంభమైనవి. అయినను వారి గుణగణములను వారుచరించిన యుగమైన ద్వాపర ధర్మమును దృష్టినిడుకొనుయే, విమర్శింపవలెనని వ్యాసుని లక్ష్యమేమో! నేటికిని పండితులటుల కావించుచున్నారు. కించిత్తు స్వార్థముల కారణముగా ద్రౌపది సహితముగ భీమార్జున, నకుల సహదేవులు స్వర్గప్రవేశార్హత కోల్పోయినారు. అంతపాటి హృదయ మాలిన్యముకూడ లేనివానిగ ధర్మజుడు చూపబడినాడు. అట్టితరి ధర్మజుని అంత్యకాలమునందే ప్రకృతియంత సహజముగనె దోషభూయిష్టమైనటుల కాన్పించెను. ఏ ఒక్క మేలిమి గుణమునకై జీవితకాలమెల్ల ద్వాపరయుగ వాసులు సంయమనమును వహించిరో, అట్టి గుణముల విలువను సహజముగనే ధిక్కరించి, తిరస్కరించుకాలము వచ్చుచున్నది సుమా!అని హెచ్చరించుటకు ఈ మౌసల పర్వఖండమును భారతకథాంతమున ప్రదర్శించినటుల కాన్పించును. సారాంశమేమన ధర్మజపాత్ర చిత్రణముతో మౌసలపర్వము ఎంతవరకు సంబంధితమనునది ప్రశ్నము కాదు.

సమస్త భారత పాత్రలను విశిష్టమైన ద్వాపర ధర్మమునకు చెందినట్టివి. రాబోవు కాలమున భూమిపై ఏ జీవియు అట్టి ధర్మముననుభవింపజాలదు. మహాభారతము బోధించిన సంస్కృతీ విలువలు ద్వాపరయుగ సంధినాడే కలుషితము కాజొచ్చినవి. అట్టితరి ఆ సంస్కృతీ పరిరక్షణమునకు తిలోదకములీయక తప్పదని వ్యాసుడు సూచించి నటుల భావింపరాదు. సాక్షాత్తు నారాయణ శిక్షణమున సంస్కృతులైన వారిపైన, కాలప్రభావమంతగ పనిచేసినచో, ఇక సామాన్యుడు ధర్మముపట్ల ఏ మాత్రము అశ్రద్ధ చూపినను మానవకోటి దారుణ ఫలితములనుభవింపవలసి వచ్చునని, వ్యాసుడు హెచ్చరించినటుల భావింపవలసియున్నది.

కాలమును మార్చు శక్తి వ్యాసునకులేదు. కాని దానికెదురీది ధర్మపరిరక్షణమును కావించుటకు కావలసిన హృదయ సంస్కారమునుమాత్రము తన మహాభారతముననందించినాడు. దానిని సర్వపాత్రల ముఖమున దర్శింప గలము. అందునిండైన ప్రతిరూపము ధర్మజుడు. ఒక వ్యక్తి ఘనత చరమదశయందో, మరణానంతరముననో ప్రజలు గుర్తించుట సహజము. అటులనే నారాయణ నిష్క్రమణానంతరమైన కాలమార్పు, మహోన్నతుల స్థితివలన కలుగు ప్రయోజనములను సూచించును. అట్టి తులనాత్మక పరిశీలనమునకే మౌసలపర్వము నిదర్శనమైయున్నది.

చివరగ ఒకమాట జ్ఞప్తియందుంచుకొనవలయును. మనమెల్లరము కలియుగముననున్నట్టివారము. కథ వర్ణించుటచే దౌష్ట్యము మనకు వింత గొలుపవచ్చును. కాని అది కలియుగ మహాత్మ్యమునకు నిదర్శనము. అనగ మనయెల్లర స్వభావమునకును అదియొక ఉదాహరణము మాత్రమే. పదునెనిమిది పర్వముల మహాభారత చరిత్రమును చెప్పి నేటి మనకలియుగ స్వభావమును తెలిపి జాగ్రత్త పడవలసిన అవుసరమును చూపించుచు, మౌసలకథ ముగిసినది. కనుకనే ఈ పర్వమును ధర్మజపాత్ర చిత్రణమునకైన నా వ్యాసమున విడువక యుంచితిని. మౌసలపర్వ ఏకాశ్వాశమున ధర్మజునిపాత్ర కన్పట్టదు. గాని యాదవవంశనాశనము, శ్రీకృష్ణ నిర్యాణమగల్గి ధర్మజ పాత్రమున కనుసంధానమైనది, గావున పరిశీలించెదను. మౌసలపర్వ ప్రారంభమున ధర్మజుని పాలనమున ఉత్పాతములు పుట్టెననినిట్లు వర్ణితము.

సీ. భారత సంగ్రామ పారీణుఁడైజయ, రమయుల్లసిల్లసామ్రాజ్యమునకుఁ
బాండవముఖ్యునిఁబట్టంబుగట్టిన, యదియాదిగాఁగ ముప్పదియునైదు
సంవత్సరంబులుసననంతరవత్స, రంబునఁబ్రజకుభయంబొనర్చు
నుత్పాతములుపుట్టె నుర్వీశవిను, మహావాయువుశర్కరావర్షియగుచు

ఆ.వె. వీచునర్కునుదయవేళలబింబంబు, బలసితోఁచుఘనకబంధసమితి
నీరదములులేకనిర్ఘాతపాతముల్, గలుగునుల్కలెల్లకడలడుల్లు -3 , ఇది యథామూలము.

ఇవ్విధమున ఉత్పాత పీడితులై ప్రజలు భయవ్యాకులతనుండగ, ధర్మజుడును అందుకు కారణమరయలేక యుండెను. అంత కాలానంతరము, ధర్మజుడు సర్వయాదవ క్షయంబయ్యెనని విని, భీమార్జున నకులసహదేవులను రావించి, వారలకును ఆవార్త వినిపించి శోకాయతచిత్తులైరి. అనంతరము వార్త తెచ్చిన మునీశ్వరునితో యాదవులకు తమలోని తమకు పోరెటుల కలిగెను, ఆ వృత్తాంతము సెలవిమ్మని ప్రార్ధించెను. అంత నా ముని, ముని శాపంబున సాంబుని కడుపున ముసలంబు పుట్టుట, ద్వారకానగరంబున ఉత్పాతములనేకములు కలుగుట, యాదవులందరు

శ్రీకృష్ణ సహితులై సముద్రతీరమునకుపోవుట, సాత్యకి, కృతవర్మలకు రోషజనకంబుగగల్గిన సంవాదము, మద్యపాన మత్తుడైన సాత్యకి, కృతవర్మ తలనరికిన వృత్తాంతమంతయు సవిస్తరముగ చెప్పగ, పాండవులందరును దు:ఖించిరి.

అనంతరమున యాదవ క్షయంబు చూచిన శ్రీకృష్ణుడు, దారుకుని పిలిచి పాండవులకీ విషయము నెరిగించి, అర్జునుని తోడ్కొని రమ్మని పనిచెను. అంత శ్రీకృష్ణుడు బలరాముని సన్నిధికి వెడలగ, అతడు సమయమాసన్నమైనదని యెరిగి, దేహమును విడిచి అనంతునిలో గలసిపోయెను.

సీ. అట్లగ్రజుఁడు చన్ననచ్చటువాసియం, తంతఁగ్రుమ్మరుచు మురారి సకల
లోకపాలనకు భూలోకంబునందుఁదాఁ, బుట్టంగవలసినయట్టిమేటి
పనులెల్లఁదీఱుట మనమునఁదలపోసి, తను విముక్తికి నిమిత్తంబుదలఁచి
మునులవాక్యముతెఱంగునుదొల్లిదుర్వాసు, నవయవసమితిఁబాయసముపూయ

తే.గీ. నప్పుడఱకాలఁబూయమినత్తపస్వి, యచటనవిలంఘ్యమై యపాయంబుగలుగు
ననిన మాటయుఁజర్చించి మనసునింద్రి , యములునడఁగించి గాఢసమాధినొంది -80,
ఇటుల శ్రీకృష్ణుడు అవతారమును చాలించినాడు. ఇది యథామూలము.

==========

మహాప్రస్థానికపర్వము – ధర్మజపాత్ర

మహాభారతమునందలి మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు ఉపనిషత్సారముల వంటివి. కథలు వేరైనను సారాంశముచే ఈ పర్వములు ప్రతియొక్కని జీవితమునకును వర్తించును. ప్రకృతమున మహాప్రస్థానికపర్వ విశేషములను చూడుడు.

ద్రౌపది సహితులైన పాండవులైదుగురు సుదీర్ఘమైన జీవితమునుగడిపినట్టివారు. ఆయా సందర్భములలో లౌకికము, పారలౌకికములైన ఉభయదృష్టులను ప్రదర్శింపబడినవి. ఒకచో లౌకిక ప్రయోజనమాశించి ఇతరుల దోషములను విపులముగ వివరించుచు, శత్రునింద కావింపవచ్చును. కాని అంత్యకాలమున ఉన్నతగతులకైన ఆత్మపరిశీలనమున, అన్యుని దోషములు మనకర్హతలు కాజాలవు. మన నడువడికయే సంచిత వాసనాక్షయ మొనర్చుటకు, పునర్జన్మకై దుష్టవాసనలు సేకరింపకుండుటకు కారణభూతమగుచున్నది. ఈ సత్యమును గ్రహించుటలో మిక్కిలి ప్రధానమైనట్టిది, శ్రీకృష్ణుడంతటివాడే కౌరవులనుపేక్షించినాడని, గాంధారివలన శాపము నందినాడు. అందుకు సాంబుని దుష్టప్రవర్తనముకూడ తోడై, శ్రీకృష్ణుడు బలవన్మరణమునందినాడు. లీలామాత్రముగ నేలకుదిగిన నారాయణుడగుటచే లోకచైతన్యార్థము, ఆ కష్టముననుభవించి, లోకమును మేల్కొల్పినాడు. ఇక సాధారణ దేవతాంశజులైన పాండవులు, తమ ప్రవర్తనమును పరిశీలించుకొనక తప్పదుకదా!.

ద్రౌపది భూపతన కారణము, ఆమె పూర్వజన్మ కథకు తగినటులున్నది. కామతృప్తినందక, నాళాయిని రూపమున శివునకై తపమొనర్చి పంచభర్తృకయైనను, అర్జునునిపట్ల మిక్కిలి మక్కువ ప్రదర్శించి, పూర్వవాసనల ప్రభావమును ఋజువు చేసినది. ఇటులనే భీమార్జున, నకుల సహాదేవులలో ఒక్కొక్కరిలో రజోగుణమొక్కొక్క విధముగ ప్రభావితమైనటుల వర్ణింపబడినది.

ఇక ధర్మజుడు స్వర్గమువరకు శునకమును వెంటదీసుకొని పోవుటగూడ ఉపనిషద్భావమునకు కథారూపము మాత్రమె యగును. స్థితప్రజ్ఞతకు బ్రాహ్మణుడు, శునకముకూడ యొక్కటేనన్న వాక్యమునందలి అర్ధగంభీరతను యిచట గమనింప వలసియున్నది. శునక చర్మావృతమైన జీవుని ద్వేషింపపనిలేదు. తన్నాశ్రయము కోరివచ్చినపుడు, తాను తిరస్కరింపకుండుటయే తన ధర్మము. ఆపై ఆ జీవి దుష్టవాసనా సహితయైనచో, భీమార్జున, నకులసహాదేవుల వలననే పతనమొందును. అటులకానినాడు శునకమున దోషములేదని వెల్లడియైనది. ఇక తనదోషముచే ఆ శునకమునకు స్వర్గప్రవేశ నిరాకరణ జరుగరాదు. కనుకనే ధర్మజుడిచట మెలకువ ప్రదర్శించి, ఉపనిషద్భావములకు మూర్తిమంతుడైనాడు. ఈ దృష్టితో ఈ పర్వమును పరిశీలించితిని.

మహాప్రస్థానికపర్వ ఏకాశ్వాసమున ధర్మజుడు శ్రీకృష్ణావతార సమాప్తియు, యాదవజన సంక్షోభమును అర్జునునివలన విని అతనితో

సీ. అర్జునుండమ్మొయినచ్యుతరామాది, యాదవజనుల వృత్తాంతములను
దనదుతెఱంగు సత్యవతీతనూభవు, హితభాషణంబులు నేర్పడంగఁ
జెప్పినవిని యుధిష్ఠిరుఁడుప్రస్థానంబు, నకు మదియొలయనన్నురునితోడ
నఖిలభూతంబులననఘు పాకంబుఁబొ, దించుఁగాలుండు మదీయ బుద్ధి

తే.గీ. కర్మసంత్యాగకలనంబుకార్యమిప్పు, డనువినిశ్చయమొందె నీమనమునరయ
నిదియమేలుగఁగనుచున్కి విదితమయ్యె, నాకుననవుడు నయ్యింద్రనందనుండు -4

వ. అన్నరేంద్రున కిట్లనియె -5

కం. కాలమునేమనవచ్చును, గాలముఁగాలంబపోలుఁగాకొంటికి నీ
లీలలుగలవేలెస్సగ, నాలోకించితిది హితమునభిమతమునగున్ -మహా-ప్ర-6 - ఇది యథామూలము.

ధర్మజునకు రాజ్యమున జరిగిన ఉత్పాతములకు కారణము బోధపడినది. శ్రీకృష్ణాదుల అవతార పరిసమాప్తి జరుగుటచేత కాలమాసన్నమైనదని ధర్మజుని బుద్ధికి తెలిసినది. ఆ దేవదేవుని సంకల్పముచే దివినుండి భువికి చనుదెంచి, అతని ఆజ్ఞమేరకు వారివారి కర్తవ్యములను నిర్వర్తించిన ధర్మజాదులు ఇహలోక సౌఖ్యాదులను విడనాడి, పరలోక ప్రస్థానమునకు పయనమగుటకు ఆ ధర్మనందనుని మదిలో ఆలోచనగలుగుట సామాన్యము. కాలుడు నా బుద్ధికి తోఁచుచున్నాడని ధర్మజుడు పలుకుటలో కాలుడు ప్రత్యక్షమై పలుకునటుల కాన్పించును. కారణము ధర్మజుడు సాక్షాత్తు యమధర్ముని అంశయెకనుక, మనకు కాలము పరిపక్వమైనది, మనగతులకు పోవలయునను ఆతృత కన్పట్టుచున్నది. కాలపరిపక్వతయెనర్చుట యముని కర్తవ్యము గావున తనకర్తవ్యమును నిశ్చయించినాడు.

అనంతరము ధర్మజుడు భీమాదులను రావించి, సంగతినెరింగించిన వారలుకూడ అందులకు సమ్మతించిరి. యుయుత్సుని రావించి ఆతనికి విశేషములెల్ల నెరింగించి, ఆతనిని రాజ్యరక్షణమునకై నియోగించి, అభిమన్యుపుత్రుడగు పరీక్షిత్తును రాజుగ జేసి, మరియు వజ్రుడను యాదవవీరుని ఇంద్రప్రస్థమున మిగిలిన యాదవులందరికు రాజుగాజేసి, ఉత్తరతో వారల క్షేమంబరయమని పల్కి మరియొకమారు మరణించిన కురువీరులకు, యాదవవీరులకు శ్రాద్ధాంగ తర్పణాదులనొనరించి, ప్రజలనందరిని రాబనిచి, పార్థపౌత్రుని తనకుమారుగ, తనకిచ్చిన గౌరవాదరములతో చరింపుడని పల్కి, ధర్మజుడు భార్యానుజులతోడ వల్కలాజినంబులు ధరించి మహాప్రస్థానమునకు తరలెను. ఇది యథామూలము.

ఇచటనొక విషయము గమనార్హము. యుద్ధారంభవేళ యుయుత్సుడు ధర్మజుని పక్షముజేరి ధర్మజునా శ్రయించినాడు. ఆశ్రితపక్షపాతుడైన వానిగ ధర్మజుడు ప్రస్థానమునకేగువేళకూడ యుయుత్సుని తగిన పదవియందు నియోగించి, పరీక్షితునకు రక్షణగనిల్పి వెడలుట ప్రశంశార్హము. అటులనే భారతయుద్ధమున నామమాత్రముగ పాండవులనునిల్పి, సంకల్పమాత్రమున శత్రునాశనమును తానేగావించిన శ్రీకృష్ణుని యాదవవంశము విధిచోదతమై సర్వనాశమైనది. అంతియెకాక శ్రీకృష్ణ నిర్యాణానంతరము అల్పకాలములోననే సముద్రమున కలసిపోయినది. అట్టి యాదవవంశమునకు భవిష్యములేని స్థితిరాకుండటకై ధర్మజుడు వజ్ర నామకుడైన యాదవునకు ఇంద్రప్రస్థమునొసంగి పట్టముగట్టుట ధర్మజుని కృతజ్ఞతాగుణమునుచాటి వాని ఔన్నత్యమును పెంచినది.

మౌసలపర్వమున ఈ విషయము ప్రసక్తమైనది. వసుదేవాదులను రక్షించు సూచనలిచ్చుచు శ్రీకృష్ణుడే అర్జునునకు వర్తమానమంపినటుల తెలియగలదు. దాని సారాంశముగ అర్జునుడు వసుదేవునితోనిటుల పలికినాడు.

సీ. అనివిని ఫల్గుణుండావృష్ణిపతి హృద, యముదేహనిరపేక్షమగుటెఱిఁగి
డెందంబు నెవ్వగఁబొందనిమ్మేదినీ, రమణుతోఁగృష్ణవిరహితమైన
యిద్దేశమునవసియింపగ నాకుఁజి, త్తముగొల్చునే ధర్మతనయ భీము
లును నేనుమాద్రినందనులును బాంచాలి, యునునేకచిత్తులమనఘు వినుము

తే.గీ. ధర్మతనయుఁడిక్కార్యంబుదలఁచిమున్న, నిశ్చయించి బాలకులను నెలఁతపిండుఁ
దగుధనమునునింద్రప్రస్థనగరమునకుఁ, జేర్పవలయుట మాకెల్లఁజెప్పినాఁడు -మౌసల-124

కం. వినుఁడింద్రప్రస్థపురం, బునకునధీశుఁడుగ వజ్రుఁబోఁడిమితో నే
నునిచెద మీరెల్లనతఁడు, మనుపంగాఁదొంటియట్లమనుఁడచ్చోటన్ -మౌసల-131

అట్టియెడ వారలారుగిరివెనుక శునకమొక్కటి పయనమగుట కాన్పించును. అట్లు వారలరణ్యములు కడచి, కడచి మేరుసమీప భూములకు జనినంత, ద్రౌపది గతప్రాణయై భూమిన పడినంత సమీరనందనుడట్లగుటకు కారణమేమని ధర్మజుని ప్రశ్నించగ, అతడందులకు సమాధానముగా, ఈమె ఇంద్రనందనుఁడయెడ పక్షపాతిగావున అట్లయ్యెనని పలికెను. పంచభర్తృకయైన పాంచాలి, అట్లొకరివైపు వలపధికముగా చూపుట ధర్మహానియని ధర్మజుని ఉద్దేశ్యముగ కన్పించును. అనంతరము ఆ శవమునట్లే విడచి ముందునకు చనగా, దారిలో సహదేవుడు గతప్రాణుడై పడుటకు విచారించి అందులకు కారణమేమని ధర్మజుని ప్రశ్నించగ అతనిలో తనకంటె ప్రాజ్ఞుడు లోకమందులేడను గర్వమందులకు కారణమని సమాధాన మొసగెను. అనంతరము నకులార్జునులు, భీమధర్మజులు, శునకము పయనమగుచు కొండొక సేపునకు నకులుని ప్రాణములు పోయి క్రిందపడగ, అద్దానికి కారణమేమని భీముడు ప్రశ్నించగ ధర్మజుడు రూపాతిశయమున తన్నుమించువాడు లోకమునలేడని 'అహంకృతి' గల్గినవాడగుటచే అట్టిదశ వచ్చినదని పల్కెను. అనంతరము కొండొక తడవునకు అర్జునుడు విగత జీవుడైపడగ అందులకు కారణమరయగ ధర్మజుడు కైరవులనెల్ల ఒక్కనాడు దెగటార్తునని పలికియు, అట్లొనరింపక యుండెను. పలుకొకటి, చేతమరియొకటి అగుట చాలాదోషము. అదయునుగాక యెల్లకోదండధరులను గర్వించుచుండుటచే యిట్లు జరిగినదని పలికి నిరామయుడై, స్థిరచిత్తముతో శునకమును విడువక వెంటరాగ భీమునితోగలసి ధర్మజుడు ముందునకు చనుచుండ, భీముడు నేలవ్రాలెను. అట్లగుటకు కారణము ఆతని మితిలేని తిండితో భుజబలమున ఎవ్వరిని లక్ష్యపెట్టక, కఠినపు పలుకుల అతిసంభాషణము వలన అట్లయ్యెనని తలచుచు అద్దానకై వగవక, ముందునకు పోవుచుండెను. అటుల ఆ శునకము, ధర్మజ పార్శ్వానువర్తియై జనుచుండెను. ఇదియథామూలము.

205. అంతలో దేదీప్యమాన విరాజితంబగు రథమునందు ఇంద్రుడు ధర్మజునకభిముఖముగ వచ్చి ఆతనిని గొనిపోవుటకై సాదరముగ ఆహ్వానించగ, అందులకు ధర్మరాజిచ్చిన సమాధానము ఆతని సోదర ప్రేమకు సోదాహరణము.

శా. తోడంబుట్టువులందఱుంబడిన యాదు:ఖంబుచిత్తంబుసం
పీడంబెట్టెడు సౌకుమార్యవతిడప్పింగూలెఁ బాంచాలివా
ర్తోడైవచ్చిరి వారులేకయిట మీతోరాను వారెల్ల నా
తోడంగూడఁగవచ్చునట్లుగఁగృపాధుర్యాత్మ కావింపవే -మహాప్ర-50, ఇదియథామూలము.

అంత ఇంద్రుడు నీ అనుజులు ద్రౌపదీ సహితులై నాకలోకమునకు చనినారు. వారినక్కడ చూచెదవురమ్ము ధర్మమయాత్మకా! అని ధర్మజునితో పలికెను. ఇట ధర్మమయాత్మకా యని ఇంద్రుడు సంభోదించుటగమనార్హము. అతనియెడ ఎట్టి కల్మషము లేనందుననే సశరీరముగ నాకలోకమునకావ్హానించుట జరిగినది. లేనియెడల అతడును విగత జీవుడై పోవలెనుగదా! కావున ధర్మజునకు ధర్మమయాత్మకుడన్నది విశేషణముగగాక సహజ గుణముగనే భాసించినది.

206. అనంతరము ధర్మజుడు ఆ శునకమును జూపి పురము విడిచినదాదిగ వెంటవచ్చుచుండెను, గాన దీనిని విడిచిపుచ్చినెట్లు రాదగునని, ఇంద్రునితో పల్కి మరల భక్తియుక్తుడైన వానిని విడుచుట బ్రహ్మహత్యాదోషమునకు సరియైనది గావున విడువరాదనిన, ఇంద్రుడు అనుజులను, భార్యను నిర్లిప్తతగ విడిచిన నీవిట్లు పల్కుట ధర్మమేనాయని ప్రశ్నించెను. అంత ధర్మజుడు

సీ. అనవిని ధర్మజుండఖిలలోకములకుఁ, బతివిధర్మమునకుఁబ్రభువవిట్టి
నీకంటెనెఱుఁగుదునే సదసత్ప్రకా, రములట్లుఁగాక వాదము మహాత్ము
లయినవారలతోడనగునె చేయంగనై, ననువిన్నవింపఁదగినతెఱంగు
విన్నవించుట దోషవిధముగాదనియెడు, బుద్ధిఁజేసెద నేనుబూనివిన్న

తే.గీ. పంబు భీమముఖ్యులును ద్రౌపదియుఁ జచ్చి, రేను వారలవిడువక యేడ్చుచున్న
వత్తురేతోడవచ్చి చావనిశునకము, విడువకుండుటతప్పుగానుడువఁదగునె **-మహాప్ర-57** అని మరియు

చం. అనఘుచరిత్రవిన్ము శరణాగతుఁజేకొనకున్కిశుద్ధమి
త్రునియెడఁజేయుద్రోహము వధూటివధించుట విప్రునర్ధముం
గొనుటయనంగఁగల్గునివిగూడిసమంబగు నాకుఁజూడఁ భ
క్తునపరాధునిన్ విడుచుదోషముతోనిది యోర్వవచ్చునే **-58**

అని తనకు తెలిసిన ధర్మసూత్రములను వినిపించినాడు. ఇట ధర్మజుడు భీష్ముని వద్ద విన్న శరణాగతరక్షణ విధిని ఆచరణలో పెట్టినాడు. ఇట మూలభావమునుపెంచి తిక్కన రచించినాడు. చివరగ తన మనమునందలి దృఢ నిశ్చయమును ఇంద్రునియెదుట సూటిగ వెలిబుచ్చినాడు.

ఉ. కావుననాకలోకపసుఖంబటులుండఁగనిమ్ము దేవనీ
భావమునిల్పునాదెసఁగృపాభరితంబుగ సారమేయ సం
భావనసేఁత దోసముగఁబట్టమి నాకువరంబు నీవుపో
మ్మీవనభూమినుండెద సమిద్ధతపంబులనిన్నకొల్చుచున్ **-59** అనుటలో

ధర్మజుడు ధర్మాచరణమునకిచ్చినవిలువ, ప్రాధాన్యతలు స్పష్టముగ తెలియుచున్నది. ఇది అమూలము.

207. అంత శునకరూపముననున్న యమధర్మజుడు సారూపముగ ప్రత్యక్షమై ధర్మజుని నిర్మలబుద్ధిని, దయను, ధర్మాచరణమును ప్రశంసించుట గమనార్హము.

సీ. అట్లతిదృఢనిశ్చయంబుగఁబలికిన, తనపుత్రుఁగనుఁగొని ధర్ముఁడధిక
సంప్రమోదముఁబొంది సారమేయాకృతిఁ, బాసి తానాత్మరూపంబుఁదాల్చి
పరమసంభ్రమకృతప్రణతియునానంద, భరితుండునగు నానృపాలుతోడ
నీపుణ్యవృత్తంబునిర్మలమేధయు, నఖిలభూతంబులయందుఁగలుగు

తే.గీ. దయయునాదుచిత్తముఁబ్రమదమునఁదేల్చె, వత్స భూలోకముననిట్టివారుఁగలరె
తొల్లియునుద్వైతవనమున దోషదూర, మయిన నీమనమున తెఱంగరసినాఁడ **-61**

208. అనంతరము నారదుడు పల్కిన పల్కులుకూడ ధర్మజుని ఔన్నత్యమును చాటుచున్నది.

ఉ. దానములందపంబులనుదద్దయుఁబేర్కలయట్టివారలన్
మానవనాథులన్వినమె మాసెఁదదీయ యశంబులెల్ల నీ
మానిత కీర్తికీర్తులు సమస్తజగంబులయందుఁబర్వుట
న్మేనులతోడ వారిటులు నేర్చిరెరానమరత్వ సిద్ధికిన్ -మహాప్ర-69

సశరీర స్వర్గప్రవేశమొనర్చిన ధర్మజుని దానములచే, తపములచే పేరొందిన పూర్వరాజులెల్లరకన్న మిన్నగ నారదుడు ప్రశంసించుట గమనార్హము. ఇది యథామూలము.

209. అనంతరము ధర్మజుడు పల్కిన క్రింది మాటలు, వానికీయబడిన ఔన్నత్యమునకనుగుణముగ నున్నవి.

చం. అనవినిధర్మరాజసుతుఁడాతనికిట్లను నాదుతమ్ములుం
గనుఁగొనునంతకున్ సుఖముగాఁగొననయ్యెదనిత్తెఱంగు నా
కునకటచూపరే పవనుకొడ్కునునింద్రసుతుండు మాద్రినం
దనులునునున్నచోటు సుఖదంబయినన్ సుఖహీనమేనియున్ -70

వ. వారలను మదీయ పక్షప్రాప్తులయిన భూపతులను జూచువేడ్క యెల్లలోకంబుల మీదను గలుగు వేడుకకంటె మిగిలి యున్నయది యనుటయు...-ఇది యథామూలము.

పై మాటలలో మదీయ పక్షప్రాప్తులయిన భూపతులను చూడవలెనన్నకోరిక కలదనుట కృతజ్ఞతాభావమునకు పరాకాష్ట . బహుశ: పౌరాణిక ప్రుఖ్యశీలురలో యిట్టి కోరిక కోరినవారిలో మరియొకరులరేమో! సాక్షాన్నారాయణుడైన శ్రీరామచంద్రుడు మాత్రమే గతాశులైన స్వపక్ష వీరులపై అమృతవర్షమును కురిపింపజేసి బ్రతికించుకొనినాడు.

==========

స్వర్గారోహణ పర్వము భారతకథా విమర్శనమునకు మార్గదర్శకమైనది. మరణానంతరము మనిషి పొందిన స్థితి, వాని జీవిత కాలమందలి మంచిచెడ్డలకు దర్పణమువంటిది. అటులనే జన్మచక్రము ఒకజన్మకు పరిమితమైనట్టిది కాదు. ఇరువురొకేరకముగ ప్రవర్తింపవచ్చును. లేదా స్థూలదృష్టికి ఒకని ప్రవర్తనము కొంత అధమముగ కూడ కాన్పించును. కాని వాని గతజన్మములును తెలియనివానికి, వాడునిండుగ బోధపడుననుట పూర్ణసత్యము కానేరదు. అట్టితరి కారణజన్ముల ప్రవర్తనమును గ్రహింపగలుగుట మిక్కిలి దుర్లభమని వేరుగ చెప్పబనిలేదు.

యుద్ధానంతరము ప్రద్యుమ్నుడు సనత్కుమారునిలో గలసినాడట. ధృతరాష్ట్రుడు కుబేరలోకమునకేగినాడు. పాండురాజు సతీసమేతుడై ఇంద్రునివాసమున అధిదైనాడు. అభిమన్యుడు చంద్రునిలో కలసినాడు. ద్రోణాచార్యుడు బృహస్పతిని కలసినాడు. ఇటులనే మిగిలిన పాత్రములుకూడ వారివారి మూల అంశలయందు గలసినవి. అనగ మహాభారతకథ నిజమునకు మహాభారత పాత్రలదికాదు. కథ నాటి భూలోకవాసులది. అనగ సామాన్య జనములది. వారిలో ధర్మము లోపించినది, దైవలీలగ, దైవీశక్తులే మానవ రూపముల నేలకుదిగి, సమస్త మానవ బలహీనతలను ప్రదర్శించుచు, వానివలన గలిగెడి లాభనష్టములను, వానిని ఎదుర్కొనవలసిన విధానములను తమ ప్రవర్తనమూలమున లోకులకు సూచించి, ఆ ధర్మజీవన విధానమునుగూర్చి లోకులకొక అవగాహనను కల్పించి ఫలితముగ భవిష్యత్తరముల వారు ధర్మచ్యుతులుగాకుండగ హెచ్చరించినట్టివైనవి.

మహాభారత విమర్శనవేళ పై విషయము జ్ఞప్తియందుంచుకొనవలసి యున్నది. అయినను ప్రజలకాదర్శమును చూపించుటకే నేలకు దిగినను, దేహినిబట్టిగాక దేహములనుబట్టియైనను ఆ దైవీశక్తులను మానవ సమాజమున మానవులగనే భాసించిన వారగుటచే, మానవ న్యాయముతోగూడ విమర్శ సాగకతప్పదు. అనగ దైవ, మానుష సంబంధములను రెండింటిని దృష్టినిడుకొని మహాభారత పాత్రలను గ్రహింపవలెనన్న సత్యమును స్వర్గారోహణ పర్వము తెలియజేయుచున్నది. ఈ దృష్టితోడనే ప్రకృత సిద్ధాంత వ్యాసమున ధర్మజపాత్ర చిత్రణమును పరిశీలించితిని.

210. ధర్మజుడు ఇంద్రునితో తన తమ్ములను, బంధువర్గమును చూపింపమని వేడగ అందులకతడు తగువానిని రావించి, వారుండిన చోటులను చూపుమని నియోగించెను. అంత ధర్మజుడు నారదాది మునులు వెంటరాగ, ఆ దైవభృత్యుని వెనుక పోవుటకుద్దేశించి మార్గమధ్యమున దుర్యోధనుడు అంగనాపరివేష్టిత సుఖాసీనుడై, దివ్యతేజముతో వెలుగొందుటజూచి ధర్మజుడు తన మనమునందు అసూయ పొడసూపుటచే నారదునితోనిట్లు పలుకుట గమనార్హము.

సీ. ఇతఁడతిలోభోపహతమానసుఁడు దీర్ఘ, దర్శిగాఁడితనికతమునఁజేసి
నిఖిలదేశంబులయఖిలనృపాలురుఁ, ద్రుంగిరి దంతితురంగసహిత
ముగననవద్యాంగి విగతకల్మష ధర్మ, చారిణిసాధ్విఁబాంచాలినార్య
జనములుగనుఁగొన సభలోన నవమాన, పెట్టినతులువ యేనిట్టివాని

ఆ.వె. తోడఁగలసిమెలఁగుదునె మహితాత్మకు, లార యెచటనున్నవారు భీమ
ఫల్గునులునుగవలుఁబాంచాలియును నన్ను, నచటికనుపవలయుననుచుమరలె **-5**

పై మాటలలో ధర్మజుడు సామాన్య మానవునిగప్రవర్తించినటుల కనిపించును. మానవసహజము, క్షత్రియోచితమైన అసూయ,ద్వేషములను ప్రదర్శించుటచే ధర్మజుడింకను మానవవాసనలను విడచిపుచ్చలేదనునది స్పష్టము. కావుననే నారదుడు ఆహవమందు మరణించినవారికి స్వర్గము లభించునని, నాకము పుణ్యస్థలము గావున అట మానవసహజమైన అసూయ, ద్వేష, మనోవికారాదులకు చోటుండదని ధర్మజునికి హితవు చెప్పి మేల్కొల్పెను.

ఇందు నారదుడు చెప్పిన మాటలలో ఇది స్వర్గలోకము, నీవు దైవాంశసంభూతుడవు. నీకార్యాచరణము పూర్తియైనది. గావున జరిగినవాటికై మానవధోరణిలో చింతించుట నీవంటివానికి తగదను హెచ్చరిక ధ్వనిగ భాసించుచున్నది. ఇది యథామూలము.

అంత ధర్మజుడు మరల దుర్యోధన దుశ్చేతములను నారదునకు తెలుపుచు అతని విషయమింకెందులకు, అతనినట్లుండనిమ్ము అని చాలించి తనవర్గము వారిని చూపమని వేడెను. అంత మునులందరిని కలియజూచి, కర్ణుని ప్రశంసించుచు, అతనిజూడ కడువేడుక మనమునందు గలదని, మరియు అనుజులను, బంధువర్గము వారిని చూడక నిమిషమైనను స్వర్గమందు నిలువజాలనని, వారు ఎచ్చటనున్నవారో అదియె తనకు స్వర్గమని, అదియే పుణ్యలోకముగ నేను భావింతునని విన్నవించెను. ఇది యథామూలము.

ఇట ధర్మజుని పలుకులలో భ్రాతృప్రేమ, బాంధవాభిమానము కొట్టొచ్చినట్లు కాన్పించును. ఇవి ధర్మజుని సహజగుణ భూషణములు. కాని స్వర్గమునకేగినను తన, పర సంబంధములచేతనే జీవకోటిని అభిమానించెడి రజోగుణ లక్షణము వీడక పోవుట గమనార్హము.

211. ధర్మజుని కోరిక మేరకు దేవదూత అతనిని వెంటనిడుకొని దుర్గంధ భూయిష్టము, రక్తామిషాస్థి మిళితమైన పథమువెంట నరకమునకు గొనిపోయెను. అంత ధర్మజుడటనుండి మరలుటకుద్యుక్తుడగుచుండగ, అనుజుల కంఠస్వరములార్తితో అతనిని నిలువమని ప్రార్థించగ, ధర్మజుడది గ్రహించి మనమున వగచుచు దైవమును,విధిని తలచుకొనిట్లు తలపోసెను.

సీ. ధర్మనందనుఁడు చిత్తమ్మునందుద్వేగ, మావహిల్లఁగ దైవమకటయిట్లు
సేసెనె కీడేమిసేసిరొకోవీర, లిన్నరకమునకు నేఁగుదేర
వలసినయట్టిది వాసవాద్యమరులు, నీచులువోవీరినేవిచార
మించుకయునులేక యిట్టికష్టపుటిడు, మలఁబెట్టిడిదె ధర్మమాతెఱంగు

తే.గీ. మాలితే నీవుసజ్జనమాన్యులలఘు, సత్యపరులుదయాఢ్యులు నిత్యదాన
రతులు బహుదక్షిణాంచితక్రతువితాన, పావితాత్ములనర్హంపుఁబాటువడిరి -24

చం. ఒకటనుమేలుసేయని సుయోధనుఁడమ్మెయి దేవపూజ్యుఁడై
సకలసుఖానుభూతియునజస్రము పెంపువహింపనొప్పి దృ
ష్టికిఁగడువ్రేఁకనైతనదుచెల్వలుఁజుట్టలుఁదాను సంతసం
బుకలిమినేచిమిన్నడచి పుణ్యపరావృతుఁడై వెలింగెడున్ -25

ఆ.వె. ఈఁగకాలియంతయేనియుఁబాపంబు, వీరివలనఁగనుటవినుటగలుగ
దొక్కనాఁడునట్టియుత్తములకు విధి, పాడిమాలియిట్టిపాటుదెచ్చె -26, అని కొండొకతడవు

విచారించి, ఇంద్రునిపై అలుకపూని, దేవదూతను ఇంద్రుని తోడ్కొని రమ్మని పనిచెను. ఇది యథామూలము.

ధర్మజుడిట్లు చింతించుటలో మానవ దౌర్బల్యము, వివేకమును మరుగుపరుచుట కాన్పించును. కారణము పాపాత్ములైన వారికి సుగతులు, పుణ్యాత్ములకు దుర్గతులు కలుగవని వేదశాస్త్రముల కథితము. పాపపు వాసనలేని వానికి నరకప్రవేశముండదు. పుణ్యవాసనలేమి స్వర్గప్రవేశమొనగూరదు. ఈ సత్యము ధర్మజునకు తెలియును. అందునా నరకాధిపతి తన తండ్రియైన యమధర్మజుడు. అట్టితరి తాను పొరబడలేదుగదా! యన్న ఆత్మపరిశీలనము ధర్మజుని వంటి వానిలో సహజముగ చూడగలము. కాని కర్తృసంబంధము ధర్మజునంతటి వానినిగూడ లోబరచుకొనునని సూచించుటే వ్యాసలక్ష్యము.

అనంతరము దేవదూత వార్తవిని, ఇంద్రుడు దేవగణ, మునిజన పరివేష్టితుడై ధర్మజునివద్దకు చనుదెంచెను. అంత యమధర్మరాజును పుత్రుని చూచుటకుత్సహించి, ధర్మరాజువద్దకు వచ్చెను. ఇంద్రుడు ధర్మజుని శాంత వచనములతో అనునయించుచు, ధర్మజునికి నరకమును చూపవలసివచ్చుటకు కారణము రాజగువాడు నరకమును చూచి తీరవలయునని, అది వేదశ్రుతమని చెప్పి మరియు అల్పప్రభ్ముడు తొల్లి స్వర్గసుఖములనుభవించి పిదప శాశ్వత నరకయాతనలనుభవించునని, భూరిప్రభ్ముడు మున్ను నరకయాతన పొంది అనంతరము శాశ్వత స్వర్గసౌఖ్యము లందునని విశదపరచినాడు. ఇట మూలమున ఇంద్రుడు , ధర్మజుడు ద్రోణవధనిమిత్తార్థమై , అశ్వత్థామ చచ్చెనని అసత్యము పలుకుటవలన కలిగిన పాపమునకు, నరకమున రెండు ఘడియల కాలముండవలసి వచ్చినదని ధర్మజునితో పలికినటులగలదు. తెనుగున తిక్కన విడచి పుచ్చినాడు. మరియు కర్ణాది సోదరవర్గమును, ద్రుపదాది సైన్య వర్గములును వారివారి నిజస్థానములందు సుఖముననున్నారని తెలిపెను.

212. ఇంద్రుడు ధర్మజునిట పూర్వచక్రవర్తులైన మాంధాత్మ, నల, హరిశ్చంద్ర, దిలీప, దుష్యంత, భరతాదులతో తుల్యునిగా ప్రశంసించుట, భరతవంశమున ధర్మజుని స్థానమును తెలుపుచున్నది.

సీ. మహితవర్తనులైన మాంధాతృనలహరి, శ్చంద్రదిలీపదుష్యంతభరతు
లొందిన కీర్తనీయొన్నతినొందుము, నినుఁగొనియాడంగ మునినిలింప
గంధర్వగరుడోరగప్రధానులుసిద్ధ, సాధ్యసత్తములును సకుతుకముగ
వచ్చినవారని వారినెల్లనుజూప, నతఁడు వినయ సంభృతాంగుఁడగుచు

తే.గీ. నాదరముగఁబ్రత్యుద్గతియాచరింప, వారలెంతయుఁబ్రీతిమైగారవంపుఁ
బలుకులెసఁగంగనధికసంభావనంబు, సేసిరాననములు వికసిల్లుచుండ -45

ఆని తెలిపి ధర్మజుని ఆకాశగంగా స్నానమాచరింపుమని పలికెను. ఇది యథామూలము.

213. అంత యమధర్మరాజు, ధర్మజునితోనిట్లు పలికెను.

సీ. అనియెనప్పుడుధర్ముఁడభిరామమూర్తిము, ఖప్రసాదంబునఁగరమువెలుఁగ
నారాజవర్యునిఁజేరంగనరిగి ని, స్సీమగౌరవపరీక్షింపఁగంటి
నిన్ను ముమ్మాఱరణిప్రసంగంబున, ద్వైతవనంబునఁదగిలికుక్క
తోవచ్చినపుడు దైవతగిరిపొంత, ననుజవర్గము విషయంబుగాఁగ

తే.గీ. నిప్పుడిచటను జలనమొకప్పుడైన, నీదుమదినించుకేనియులేదు దమము
శమముసత్యంబుమద్గతసారభక్తి, నీకునగ్గలములు మహనీయచరిత-48, ఇది యథామూలము.

పై యమధర్మజుని మాటలు ధర్మజునిలోగల భ్రాతృప్రేమనభినందించుటతోపాటు ధర్మజుని పాత్రకు, ఆతని గుణములకుకూడ నొసంగిన పరితోషికపు మూటలు, ప్రమాణపత్ర పుటలు.

అనంతరము ధర్మజుడు పురంధర, దండధరుల ఆదేశానుసారము అమరనదీ తోయములనోలలాడి, భవ్య మంగళ స్నానమాచరించి, మనుష్య దేహ వికారాదులను విడచి, అమరప్రదీప్తితో దివ్యదేహమువడసి, తన వారినందరిని దేవయోని విశేషులుగచూచి, సంతసించి ధర్మువునందైక్యమయ్యెను.

==========

మలిపలుకు

వ్యాసమహర్షికృత మాహాభారతమున ఏ విషయమును గ్రహించి వ్యాఖ్యానించుటయనినను సాధారణ విషయము కాదు. పదునెనిమిది పర్వముల మహాభారతమును ఒకపరి చదివినపుడు సర్వము తెలిసినటుల అనుభూతి కలుగును. నిజమునకు కథా విషయము మాత్రమే తెలిసినదనుట వాస్తవము. ఒక నిర్దిష్ట భాగమును అనేక పర్యాయములు పఠించిన పిదప తెలిసిన విషయముల మాట ఎటులున్నను తెలియని విషయములేవియో స్పష్ఠముగ కాన్పించుట ప్రారంభించును. పంచమవేదమై, ఉపనిషత్సారమై శబ్దశక్తిని కరతలామలకమొనర్చుకొనిన వ్యాసమహర్షి శబ్దజాలముకాని, మహర్షితుల్యులైన కవిత్రయమువారి శబ్దప్రయోగదక్షతకాని నిండుగ గ్రహింప గలుగుటనునది సామాన్య విషయముగాదు.

పరిశోధనాకాలము రెండు, మూడు సంవత్సరములు మాత్రమే. ఇత:పూర్వము విశ్వవిద్యాలయ విద్యార్థి దశయందు ఏర్పడిన మహాభారత పరిచయము పటములో ప్రపంచమును చూచుట వంటిది. పరిమిత పరిశోధనా కాలమున నాలుగు పర్యాయములైనను సంపూర్ణ భారతమును సూక్షముగ చదవగలుగుట అసంభవము. ఒకపరి నిలకడగ చదువుటకే బహువారములు పట్టునట్టిది. అయినను భారతమును పూర్తిగచూచి, ముఖ్యముగ ధర్మజపాత్ర సంపర్కమున్న సందర్భములందు అనేక పర్యాయములుచూచి ధర్మజగుణ విశేషములను వివరించితిని.

వయసుచే చిన్నవాడను. పరిశోధన ప్రారంభమునకు పూర్వము సుదీర్ఘ సాహిత్య పరిచయమున్నవాడనుగాను. నిజమునకు వేదవాఙ్మయముతోడను, ఉపనిషత్తులతోడను, బహుశాస్త్ర గ్రంధములతోడను పరిచయమున్నవారు మహాభారత సుక్ష్మార్థములు గ్రహించుటవలే, విద్యార్థులు గ్రహించుట కష్టమని అంగీకరించుట వాస్తవమే కాని చిన్నతనము కాదు. అయినను లభ్యమైన మహాభారత విమర్శనములు చూచుటచేతను, చిరకాల సాహిత్య పరిచయము గల పెద్దలను సంప్రదించుటచేతను ధర్మజపాత్రను సక్రమముగనే గ్రహించితినని భావించుచున్నాను.

రత్నాన్వేషణమునకై సముద్రమున మున్కలిడినవారిలో ఒకనికన్ననింకొకడు ఒండు, రెండు రత్నముల నధికముగ తెచ్చుకొనవచ్చును. అంతియెకాని యిక సముద్రమున రత్నములు లేవు. సర్వమును నేనే సేకరించి తెచ్చితినని ఏ ఒక్కడైన నుడివినచో వానికి తృప్తి కలుగునేమో తెలియదుకాని, అనుభవజ్ఞులయెదుట హాస్యాస్పదుడగుట మాత్రము వాస్తవము.

నాదృష్టి పథమునుండి తప్పిన విషయములేమైననుండవచ్చును. అటులనే ధర్మసూక్ష్మనిర్ణయ విషయమున, గ్రంథపఠన రూపమున, నేపొందిన అనుభవము సంపూర్ణముగ చాలునని మాత్రము చెప్పజాలను. అయినను లభించిన అవకాశము లేమియు జారవిడువక యధాశక్తి సూక్ష్మముగ పరిశీలించి ధర్మజ గుణవిశేషములను వివరించియుంటిని. ఈ వివరణము భవిష్య పరిశోధకులకు ఏపాటి ఉపకరించగలిగినను రచయిత ధన్యుడు.

==========

గంథ సూచిక;	*Address*
1. వ్యాస భారతం–	VI Volumes, Geeta Press, Gorakhapur (U.P)
2. ఆది సభా పర్వములు–	ఆనందాశ్రమగ్రంథరత్నమాల, A. Kannam Chetty & Sons, Madras
3. అరణ్య పర్వము–	ఆనందాశ్రమగ్రంథరత్నమాల, V. Venkata Krishnamma Chetty, Madras
4. విరాట, ఉద్యోగ పర్వములు–	V. Ramswamy Shastri & Sons, Madras
5. భీష్మ, ద్రోణ పర్వములు–	V. Venkata Krishnamma Chetty, Madras
6. కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు–	V. Ramswamy Shastri & Sons, Madras
7. శాంతి పర్వకము–	Telugu Vishwavidyalayam, Kal Bhavan, Saifabad, Hyderabad.
8. విరాట–ఉద్యోగ పర్వములు– (మూలం–తాత్పర్యముతో)	Prof.S.Raghunatha Sharma, Srikrishnadeveraya University, Anantapur.
9. మహాభారత సారోద్ధారము–	శ్రీ ములికిపల్లనరసింహాధానిగారు, Maruti Publications, Vijayawada.

==========



కృతజ్ఞతాంజలి

నా ఈ పరిశోధనకు అనుమతినిచ్చి, నాకు విద్యావారిధి(పి.హెచ్.డి) పట్టమును(1998)ప్రదానము చేసిన బ్రహ్మపుర విశ్వవిద్యాలయాధికారులకు,

నను పరిశోధనకు ప్రోత్సహించి, పుత్రతుల్యునిగా అభిమానించి, ఆదరించి మార్గ దర్శకత్వమును నెరపి, కృతకృత్యుని చేసిన అంతర్వాణి వరేణ్యులు, పరిశోధనా పరమేష్ఠులైన మద్గురువర్యులు బ్రహ్మశ్రీ. డా. పండితారాధ్యుల వీరేశలింగం మహాశయులకు

నా ఈ పరిశోధనలో వ్రాతప్రతిని బహు సుందరముగ వ్రాసియిచ్చి, అడుగడుగునా తోడ్పడిన అగ్రజులు శ్రీ శెల్లూరు చంద్రశేఖర శాస్త్రి గారికి

విశ్వవిద్యాలయమందు సమర్పణకై, అడుగుటతోడనే ఆదరముతో నాలుగు కాపీలు ప్రత్యేక శ్రద్ధతో జిరాక్స్ తీసియిచ్చిన చౌదరి జిరాక్స్ (Choudhury X-rox) అధినేత శ్రీ సదానంద చౌదరి గారికి పేరుపేరునా కృతజ్ఞతాంజలులు.

ప్రకృతమున నా ఈ కృతికి దయార్ద్రపూర్వక ఆశీర్వచనాభినందనలు నాపై కురిపించిన గురుమూర్తుల పరంపరకు, నిరంతర నిస్సీమ మహిమోన్నతమగు నమోవాక్కములు. నేనంపిన ప్రతిని, ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, అక్షర, వాక్య, భావగత తప్పొప్పులను సరిదిద్ది, ఆత్మీయ ఆశీస్సులను ప్రసాదించిన ప్రాచార్య శ్రీశలాక రఘునాథ శర్మగారికి హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు. మరియు వారిని పరిచయమొనర్చి నా కృతిని పరిదర్శించి, పరోక్ష ఆశీర్వాదములొసంగిన మహామహోపాధ్యాయ, దర్శనాలంకార బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణ మహోదయులకు అశేష కృతజ్ఞతా పూర్వక విశేష నమస్సుమాంజలి.

నా ఈ కృతి నిర్మాణ కృషిలో నాకెరుపరిచిన నిలబడి, నిరంతరము నను ప్రోత్సహించి, అండదండల నిచ్చి, ఈనాటి వైభవమునకు పాత్రులగు నా అర్ధాంగి శ్రీమతి లలితాంబ మరియు నా ఆశయములకు, ఆశకు రూపమైన మా కుమార్తె చి. ల. సౌ. లక్ష్మీ గౌతమిలకు నా మన: పూర్వక ప్రేమార్ద్ర అభినందన సహస్రములు.

నా ఈ కృతిని సలక్షణముగ డి.టి.పి. చేసి యిచ్చిన శ్రీజోషఫ్ బంగారు రాజు గారికి (విజయనగరం) నా స్నేహపూర్వక కృతజ్ఞతలు.

నా ఈ కావ్య కన్యకను అతిలోకరమణీయకముగా అలంకరించి, పుస్తక రూపమున తీర్చిదిద్దిన కళా స్రష్ట, ద్రష్టలైన శ్రీ సురేష్ (DRP Printers)గారికి ప్రత్యేక హార్దిక నమస్సుమాంజలి.

నా అభివృద్ధిని అహరహం ఆకాంక్షించెడి నాకుటుంబ సభ్యులకు, సుహృత్ బంధుజన పరివార గణమునకు, ఎందరో ! ఇంకెందరో ! విశ్వవ్యాప్త సహృదయ శీలురగు మహానుభావులు. అందరికి మదీయ హృన్నీరాజనములు.

రచయిత

గురు చిత్ర పరిచయం

తొలి తెలుగు గురువులై హైస్కులులో తెలుగు, ఇంటి వద్ద సంస్కృత సాహిత్య, కావ్య, నాటకాలంకారములు బోధించిన సహృదయ సాహిత్య విద్యాప్రవీణులు

ఆంధ్ర విశ్వవిద్యాలయమున తెలుగు శాఖాధిపతులై, స్నాతకోత్తర తరగతులలో వ్యాకరణము, సాహిత్య విమర్శ, ఇంటివద్ద ప్రౌఢవ్యాకరణము మరియు విజ్ఞాన వైదిక, వేదాంత విషయ సముచ్చయమును అధ్యాపనమొనరించిన అచార్య సార్వభౌములు.

రాయగడ కళాశాలలో +2కళ (Arts) రెండు సంవత్సరములు, +3కళ (Arts)మూడేండ్లు మాతృభాష తెలుగు(MIL) మరియు విశేష భాష తెలుగు(Optional) బోధించి, అంధ్రభాషా పిపాస రగిల్చి, గురుజనములందు ముఖ్యముగ ఆ సోదరద్వయముపై భక్తి విశ్వాసములు కలిగించి, శిక్షణాభ్యాసమున గురికుదిర్చి, వారలనే ఆదర్శముగా గ్రహించి, భావిజీవన విధానమునకు లక్ష్యమూర్తులుగ(Role Model)నిర్దేశించుకొనునటుల, భవిష్యమున వారివలెనే ఆంధ్రభాషోపన్యాసకునిగా ఉద్యోగించునటుల నాజీవిత లక్ష్యమును స్థిరీకరించి, సిద్ధింపజేసుకొనుటకు ఆశీ:పరంపరలందించిన లంకగురుద్వయం.

ఊహతెలియని వయసులో, ఊరొదిలి పరిభ్రమిస్తున్న నను చేరదీసి, ఆదరించి అన్నంపెట్టి, నా జీవిత పునాదులను పటిష్ఠమొనర్చి, తదనంతర కాలమున, నా విద్యా సౌధ శిఖరాయమానమగు స్నాతకోత్తర విద్యాసముపార్జన(M.A) సమయమున పుత్రవాత్సల్యమున ఆవాసమిచ్చి, అన్నంపెట్టి అవ్యాజానురాగ పరంపర కురిపించిన ఆదర్శ దంపతులు.

చిన్నతనమునుండి తల్లిదండ్రుల సమక్షమున మరియు పరోక్షమున, కుటుంబ పెద్దలుగ, కుటుంబమంతకును ప్రేమానురాగములను పంచుతు పేరుపెట్టిడి (నామకరణ) మహోత్సవమునుండి పెండిండ్ల వరకు అంతయు తామై, అన్నియు తామై మా సమగ్ర జీవన సౌభాగ్య పరికల్పన జేసిన ఆది దంపతులు.

పండిత, పామరులను భేదమించుకలేక, పరిశోధనా సౌగంధికా ప్రసూనములనెన్నింటినో తమ విద్యావాటికలో కుసుమింపజేసి, సర్వులను సమబుద్ధిన జూడగల్గిన అన్వర్థనామధేయుండిల శ్రీ పండితారాధ్య వీరేశలింగ బుధులు.

శ్రీయు పదవియు యశమును శ్రేయమిచ్చి,
ఆశలన్నియుదీర్చిన అమరపతివి
పావనమ్మైన మీపాద పద్మయుగము,
కొలుతునెప్పుడుమదిలోన కొలువుదీర.

కీ.శే.శ్రీ కొల్లూరు కాశీపతి శాస్త్రి
శ్రీమతి లక్ష్మీసోదెమ్మ

ఆచార్య శ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి
శ్రీమతి ప్రభావతి

బ్రహ్మశ్రీ లంక సూర్య సుబ్రహ్మణ్యం
శ్రీమతి బాలాత్రిపుర సుందరి

బ్రహ్మశ్రీ లంక సత్యనారాయణ శర్మ
శ్రీమతి విజయ లక్ష్మి

కీ.శే. బ్రహ్మశ్రీ మంథా సుబ్రహ్మణ్యం
శ్రీమతి సుబ్బలక్ష్మి

కీ.శే. బ్రహ్మశ్రీ సరిపల్లి కామేశ్వరరావు
శ్రీమతి పద్మావతి

ఆచార్య.శ్రీ.పండితారాధ్యుల వీరేశలింగం

ఆచార్య.శ్రీ,తూలుగు ఢిల్లేశ్వరరావు
శ్రీమతి సుశీల

రచయిత : డా. కొల్లూరు నారాయణరావు, జననం: బ్రహ్మపురం (ఒడిశా) 08-06-1968

తల్లిదండ్రులు : కీ.శే. వేదవిద్యాలంకార కొల్లూరు వేంకటాద్రి అవధాన్లు-శ్రీమతి సుబ్బలక్ష్మి

అత్తమామలు : శ్రీమతి గంటి పర్వత వర్ధని-శ్రీగంటి అనంతరావు

కుటుంబం : కులపాలిక-శ్రీమతి లలితాంబ,

కుమార్తెలు : లక్ష్మీగౌతమి(పి.హెచ్.డి స్కాలర్,గురుకుల్ విశ్వవిద్యాలయం, హరిద్వార్)
శ్రీమతి పవ్వ సత్యవైష్ణవి-కీ.శే.శ్రీ.పవ్వ వెంకట రాఘవ అదిత్య(అల్లుడు)

కుమారుడు : కీ.శే.కొల్లూరు వేంకటాద్రి అవధాని

విద్యాభ్యాసం : రాయగడలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల, గోపబంధు మునిసిపల్ హైస్కూల్, రాయగడ కళాశాల(డిగ్రీ)ఆంధ్ర విశ్వవిద్యాలయం, (ఎమ్.ఏ) విశాఖపట్నం

విద్యార్హతలు : తెలుగులో ఎమ్.ఏ, పి.హెచ్.డి, సంస్కృతంలో-సీనియర్ పోస్ట్‌గ్రాడ్యేషన్ డిప్లోమా
వేదవిద్య-16 సంవత్సరములు(తండ్రిగారి వద్దనే)కృష్ణయజుర్వేద మూలం,
ఉభయ స్వారములు,అమరం,శబ్దమంజరి
సంస్కృతం-6సంవత్సరములు
(పెదతండ్రి కీ.శే.సాహిత్యవిద్యాప్రవీణశ్రీకొల్లూరు.కాశీపతిశాస్త్రిగారి వద్ద)
కావ్య, నాటక, అలంకారములు.

వృత్తి, ఉద్యోగం: కళింకోట ప్రభుత్వ కళాశాలలో ఆంధ్ర భాషోపన్యాసకునిగా(22, శరత్తులు)

రచనలు :శ్రీమదాంధ్ర మహాభారతము-భర్తృరాజపాత్రలు
(పి.హెచ్.డి పట్టమునకై బ్రహ్మపుర విశ్వవిద్యాలయమునకు సమర్పించిన సిద్ధాంత వ్యాసం)(1998)
'శ్రీ నడ్డూరు చరిత్ర'(శ్రీమత్పరమహంస పరివ్రాజక శ్రీ స్వామి రామదాస్ నిగమానంద సరస్వతి మరియు తదీయ గురుపరంపర శ్రీ స్వామి విబుధానంద, శ్రీ స్వామి చేతనానంద సరస్వతుల జీవిత చరితలు- సంక్షిప్తం)(ఒడియా-ఆంగ్ల భాషలసంబిభావసువాదం-తెలుగులో)
ముద్రితం-ఏప్రిల్-2008.

ప్రవృత్తి అభిరుచి :గీర్వాణాంధ్ర వాణీ పరివర్య అధ్యయన-అధ్యాపకత్వములు, వైదిక, స్మార్త కార్యనిర్వహణ, తీర్థయాత్రా సందర్శనం.